మా బీ డి క్

ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతం

గంగాధర పబ్లికేషన్స్,
విజయవాడ-2.

Blank Page

మా బీ డి క్

గ్రంథకర్త : హెర్మన్ మెల్‌విల్లి.

అనువాదకుడు : ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.

అనిల్ బత్తుల
హైదరాబాదు

గంగాధర పబ్లికేషన్స్
విజయవాడ. 2

గంగాధర ప్రచురణ :
ప్రథమ ముద్రణ :
జూన్ 67
వెల -18-00.

ముద్రణ :
గ్రామస్వరాజ్య ప్రెస్
విజయవాడ-2.

In Telugu
Published By
Gangadhara publications
VIJAYAWADA-(A. P.)

MOBY DICK

By

HERMAN MELVILLE

అనువాదకుని ఉపోద్ఘాతము

అమెరికాలో, పందొమ్మిదవ శతాబ్దపు పూర్వార్ధంలో, తిమింగిలాలవేట ఒక పెద్ద పరిశ్రమగా ఉండేది. ఆ వ్యాపారం చేపట్టిన వ్యక్తులు ఈ భూమండలములో ఉన్న మహాసముద్రము లన్నింటిపైన, కలయతిరిగి, తిమింగిలాలను వేటాడి, వాటినుండి లభించే నూనెను అమ్ముకొంటూ ఉండేవారు. ఆ రోజులలో, ఆనాటి ఓడలలో సముద్రాలమీద మాసముల తరబడి, సంవత్సరాల తరబడి తిరుగుతూ ఉండటం, చాలా ప్రమాదకరమైన పని. అట్టి ప్రమాదాలను ఎదుర్కొని, తమ లక్ష్యాన్ని సాధించగల ఉత్సాహవంతులు అనేకులు ఉండేవారు.

ఈ నవలలోని విషయం అట్టి వేటకు సంబంధించిన వృత్తాంతము. అయినా ఇది కేవలము తిమింగిలపు వేటలోని కష్టనిష్ఠురాలను చిత్రించే కథ మాత్రం కాదు. ఈ కథకు ప్రధానపాత్ర అయిన అహాబ్, ఒకానొక సన్నివేశంలో, 'మాబీడిక్' అనబడే తిమింగిలపు వ్రేటు వల్ల తన కాలుని పోగొట్టుకొంటాడు. ప్రస్తుత కథ అహాబ్ యొక్క ప్రతీకార దీక్షకి చెందినది. చతుస్సముద్రాలు గాలించి, మాబీడిక్‌ని, మరల చూచి, ఎలాగైనా దానిని వధించి, తన పగ తీర్చుకొంటానని అహాబ్ పట్టుబడతాడు, తన అనుచరులు ఎంత

బోధించినా వినిపించుకోక, ఎన్ని దుశ్శకునాలు అగుపించినా లెక్క చేయక నెగ్గించుకోడానికి పంతము పూనుకొంటాడు. అది విధిప్రేరణ. చిట్టచివరకు ఆ తిమింగిలాన్ని కనుగొంటాడు, తన శక్తినంతా ఉపయోగించి దానిని ఎదుర్కొంటాడు. కాని ఆ ఘాతానికి బలి అవుతాడు.

ఈ విషాద గాథలో ఈ నవల ఒక "ట్రాజెడీ" అయింది— విషాదాంత నాయకునకు ఉండే లక్షణములలో ముఖ్యమైనది ఏమనగా, తనను కబళింపనున్న విధికి తనకి తెలియకుండగనే తన చేతులవల్ల సాయపడుట! తుది నిశ్వాసము విడుచుచున్నను పరాజయమును ఒప్పుకోకపోవుట. ఈ లక్షణము ఈ కథానాయకుడగు అహాబ్ ఎడ సంపూర్ణంగా సమన్వయించవచ్చు.

ఈ గ్రంథకర్త పేరు హెర్మన్ మెల్విల్లి. ఇతనికి జీవితంలో తిమింగిలపు వేట యొక్క అనుభవం చాలా ఉంది. ఈ గ్రంథంలో వర్ణింపబడ్డ సముద్ర సంచార భయానకత్వమంతా అతను ప్రత్యక్షంగా అనుభవించినదే అనటానికి సందేహింప నక్కరలేదు.

ఈ కథలో, తిమింగిలపు వేటకి సంబంధించిన అనేక సూక్ష్మవిషయములను గ్రంథకర్త కథకుని నోట చెప్పించాడు. మూలవిధేయంగా వాటి నన్నిటిని ఈ అనువాదంలో వుంచ వలసి వచ్చింది. ఆవి ఎంత అప్రధానములైనా, ఎంత విసుగు కలిగించినా, తిమింగిలాల వేటలు, ఆ వేటలలోని సాధక

బాధకములు మనకు అపరిచితములు గనుక, అనువాదంలో పరిహరింపరానివి.

ఈ అనువాదమును వ్యావహారిక భాషలో రచించాను. నేటి సారస్వతాచారముబట్టి ఇట్టి గ్రంథములకు శుద్ధగ్రాంథిక భాష అంతగా ఉపయుక్తము కాదు అని తోచింది. మూలంలో కూడ, సంభాషణ రూపంలో ఉన్న గ్రంథభాగమంతా వ్యావహారికంలోనే వున్నది. ఎంత వ్యావహారికంగా వ్రాసినా, పెక్కు శబ్దములను మాటలాడు నప్పుడు ఉచ్చరించునట్లు వ్రాయుట పొసగలేదు. అట్టి పనికి పూనుకొంటే శబ్దముల వర్ణక్రమము కూడా భ్రంశము చేయవలసి వస్తుందేమో అనే శంక పొడమింది. వ్యావహారిక భాష అట్టి కీడుకు పాల్పడుట నాకు అభిమతము కాదు. అందుచేత యథోచితమైన అనువాదం చేశాను. దీని మంచి చెడ్డలు నిర్ణయించే భారం లోకం మీద ఉన్నది.

తిరుపతి
18-9-64

ఇట్లు.
పింగళి లక్ష్మీకాంతం.

వి ష య సూ చి క

1. అస్పష్ట దర్శనం
2. బాక్కప
3. స్పౌటర్ సత్రం
4. పక్కదుప్పటి
5. ప్రాతరాశము
6. వేట
7. చర్చి
8. ధర్మవేదిక
9. ధర్మోపన్యాసము
10. ఆప్తమిత్రుడు
11. ఫ్రీక్కమీరాద
12. జీవితగాథ
13. తోపుడుబండి
14. వస్ టు కెట్ పట్టణం
15. హోటలు భోజనం
16. ఓడ
17. ఉపవాస దినం
18. నిశాని
19. శోకస్కుడు
20. [illegible]

21. నావాధిరోహణం
22. క్రిస్మస్ సంబరం
23. అహాబ్
24. అహాబ్‌తో స్టబ్
25. పైపు
26. స్వప్నం
27. ఓడముందు తట్టు
28. సూర్యాస్తమయం
29. అపరసంధ్య
30. మొదటిరాత్రి పహరా
31. నడిరేయి
32. తిమింగిల తెల్లదనం
33. ఊహలు
34. చాప అల్లువాడు
35. మొదటి వేట
36. సివంగి
37. అహాబ్ పడవ, ఫెడెల్లా
38. సీటిజల్లు
39. ఆల్‌బట్రాస్ ఓడ
40. ఒక లాంఛనము
41. స్టబ్ చే తిమింగిలపు వధ
42. వ్రేటు
43. ఈకెల గూడు

44. స్టబ్ భోజనం
45. తిమింగిలపు వంటకం
46. సొరచేపల వధ
47. కేసు
48. నూనె తొట్టెలు
49. యంగ్ ఫ్రీ ఓడ
50. తిమింగలపు మందలు
5 . బడులు - పంతుళ్ళు
52. తోలు గాను
53. ప్రై వర్ణన
54. కాలు చేయి
55. అహాబ్ కాలు
56. వడ్రంగి (355 పేజీ)
57. వడ్రంగితో అహాబ్
58. అహాబ్ తో స్టార్ బక్
59. శవపేటికలో క్వీకెగ్
60. పసిఫిక్ మహాసముద్రం
61. కమ్మరి
62. కొలిమి
63. పచ్చికబయలు
64. బ్యాచులర్ ఓడ
65. తిమింగల మరణం
66. నిరీక్షణం

67. క్వాడ్రెంటు
68. కొవ్వు వత్తులు
69. ఓడతట్టు మొదటిరాత్రి పహారా
70. నడిరేయి – ఓడ ముందుభాగం
71. నడిరేయి – ఉరుములు – మెరుపులు
72. తుపాకి
73. అయస్కాంత సూది
74. లాగ్
75. లైఫ్ బాయి
76. ఓడగట్టు
77. రేచల్ ఓడ
78. కెప్టెన్ గది
79. టోపీ
80. డిలైట్ ఓడ
81. స్వర సమ్మేళనం
82. మొదటిరోజు వేట
83. రెండవరోజు వేట
84. మూడవరోజు వేట
85. మిగిలినమాట

1. అస్పష్టదర్శనము

నా పేరు ఇష్మేయిల్. కొన్ని సంవత్సరాల క్రితం — ఎన్ని సంవత్సరాలయితేనేమి!— చాలినంత డబ్బు చేతిలో లేకపోవడం వల్లా భూమిమీద నన్ను ఆకట్టేది ఏమీ లేనందు వల్లా, కొంచెము పడవమీద తిరుగుతూ, జలమయప్రదేశ దర్శనం చేద్దామని బుద్ధిపుట్టింది. మనస్సులో ఏదైనా చికాకు పుట్టినప్పుడు దానిని చెదరగొట్టుకొని, హాయిగా ఊపిరి పుచ్చుకునేందుకు నేను అవలంబించే పద్ధతి పడవమీద తిరగటం. మనస్సును చీకటి ఆవరించి, మూతి ముడుచుకొని పోయి, అప్రయత్నంగా శవాలవెంట శ్మశానాలకు వెళ్ళే బుద్ధి పుట్టినప్పుడూ, దారిన కనబడిన ప్రతివాడితోనూ ఏదో పేచీ పెట్టుకోకుండా తప్పుకోవటానికి బలవత్తరమైన నైతిక శక్తిని ఉపయోగించవలసి వచ్చినప్పుడూ ఒకసారి సముద్రము మీదకి వెళ్ళవలసిన సమయం వచ్చిందని నాకు తెలిసేది. సముద్రయానం, తుపాకికి సారాబుడ్డికి ప్రత్యామ్నాయము.

కేటో ఎంత తాత్వికోత్సాహంతో ఖడ్గధారణ చేసే వాడో, నేను అంత ప్రశాంతంగా పడవ నెక్కేవాడను. ఇందు అక్కజమేమీ లేదు. కొంత నిదానించి చూస్తే, అందరికీ కొద్దిగానో గొప్పగానో నా వలెనే సముద్రమంటే అపేక్ష ఉంటుంది.

2

అదిగో లంకవలె మన్‌హాటో పట్టణం; పట్టణం చుట్టూ సరుకులను దింపుకోడానికి, ఎక్కించుకోవడానికి చిన్న చిన్న పడవరేవులు. సముద్రవ్యాపారం ఆ ఊర మొందుకొని యుంది. ఊరిలోని కుడి ఎడమల వీధులన్నీ సముద్ర ముఖముగానే వెళ్లుతవి. ఊరి చివర భాగమున ఒక కోట బురుజు. దానిని సాగర తరంగాలు తగులుతూ వుంటాయి. నీటిమీద నుండి వచ్చేగాలి దానిని చల్లబరుస్తూ వుంటుంది. అదుగో సముద్రంమీద దృష్టిసారించే ఆ జనసమూహమును చూడండి. ఒక ఆదివారం సాయంకాలం ఆ ఊరుని చుట్టి రండి. కార్‌లియర్స్ హుక్ నుండి సింటీస్ స్లిప్ వరకు వెళ్ళి, అక్కడినుండి వైట్‌హాల్ మీదుగా ఉత్తరం వైపుకి వెళ్ళండి; ఏమి కనబడుతోంది మీకు? సముద్రదర్శనంవల్ల పరవశులై, కదలక మెదలక ప్రతీహారులవలె నిలిచియున్న వేలకొలది మనుష్యులు కాదా? కోట గోడల నానుకొని కొందరున్నా, రేవుల దగ్గర కూర్చుండి కొందరున్నా, చైనా నుండి వచ్చిన ఓడల మీదికి ఎగబ్రాకి వాటి పార్శ్వముల నుండి వంగి చూచేవారు కొందరున్నా, ఆ ఓడల పైభాగాలకు ప్రాకి, మరికొంత వంగి చూచేవారు కొందరున్నా కనబడుట లేదా? వీరు ఆ గ్రామ వాస్తవ్యులు. వారమంతా కుర్చీకో, బెంచీకో అంటిపెట్టుకొని కాలం గడుపుతూ ఉండే జనం. మరి వీ రెవరు? వీరికిక్కడ ఏమిపని? వీరి పచ్చని పైరు చేలు ఏమైనాయి?

ఇంకా అటు చూడండి. వీరుగాక ఎందరెందరో సముద్రం వైపే వస్తున్నారు! అందులోకి దూకేందుకు సిద్ధపడినంత ఉత్సాహం చూపుతున్నారు! ఏమి ఆశ్చర్యం! భూప్రదేశము యొక్క అంతిమ మేరగాని వారికి వచ్చదు కాబోలు! ఒడ్డున ఉన్న గిడ్డంగుల నీడలో తచ్చాడటం చాలదు కాబోలు. వాళ్లు నీళ్ళలో పడిపోకుండా, ఎంతదూరం వెళ్ళగలిగితే అందాకా వెళ్ళవలసిందే కాబోలు! ఆ తుది భాగాన మైళ్ళపొడవున బారులు తీరి నిలబడ్డారు.

కొందరు సందులలో నుంచి, కొందరు వీధులలోంచి, కొందరు రాచబాటలలోంచి, నానా మూలలనుంచి వచ్చి, అందరూ ఇక్కడ ఏకమై నిలిచారు. ఏమిటి రహస్యం? దూరాన ఆ ఓడలో గుప్తమైయున్న దిక్సూచీ యంత్రాలు వీరిని ఆకర్షించి లాగుకొని రాలేదు గద!

మీరు ఎక్కడో ఏ కోనలోనో ఉన్నామనుకోండి. అక్కడనుండి ఏ దారివెంట వెళ్ళినా ఆ దారి సాధారణంగా మిమ్మల్ని తీసికొని వెళ్ళి ఏ సెలయేరు ఒడ్డునో చేరుస్తుంది. అది మనకు అర్థంకాని మాయ. ఎంతపరధ్యానంలో ఉన్నా, ఎంత స్థిమితచిత్తుడు కాకపోయినా, కాలు కదిపి అడుగు వేశాడా ఆ ప్రాంతాల ఎక్కడ నీళ్ళు ఉంటే అక్కడికి వెళ్లుతాడు. అమెరికాలో ఏ ఎడారిలోనైనా సరే మీరు దప్పిగొన్నప్పుడు, మీ బృందంలో ఒక వేదాంతి ఉన్నట్టయితే, ఈ ప్రయోగాన్ని చేసిచూడండి. అందరికీ తెలిసినదే ఇది: ధ్యానానికీ, జలానికీ అవినాభావ సంబంధం ఉంది.

పోనీ, ఒక చిత్రకారుని తీసుకోండి. శాకో లోయలో అత్యంత ప్రశాంతము, సుందరమునైన భూభాగాన్ని చిత్రిద్దామనుకుంటాడనుకోండి. అతను ఏమి చేస్తాడు ? అటు బోరియల్లో మహర్షులు కూర్చుని తపస్సు చేస్తున్నట్టు చెట్లు, ఇటు చిన్న పచ్చికబయలు, ఆ ప్రక్కనే నిద్రించే పశువులు ఈ ప్రక్క గుడిసె, అందుండి నెమ్మదిగా లేచుపొగ, దూరాన నీలివర్ణంలో కొండలు, వాటి దాకా దారి తీసే బాట - ఈ చిత్తరువు ఎంత బాగున్నా చెట్ల నిట్టూర్పుల వలె అక్కడి పశువులకాపరిపై ఆకులు పడుతున్నా ఆ పశుల కాపరి చూపు క్రిందనున్న సెలయేటి మీదికి ప్రసరిస్తూ ఉండకపోతే ఆ చిత్తరువు వ్యర్థమే! ఒక జూన్ నెలలో ఏదైనా పచ్చిక బయటకు వెళ్ళిచూడండి: మైళ్ళపొడవునా మొట్టతామరలు వికసించి ఉంటాయి. కాని, అక్కడ లోపం ఏమిటి ? నీరు ! అక్కడ ఒక్కచుక్క నీరు ఉండదు. నయాగరాయే జలపాతము గాక, సికతాపాతమేయైతే వేలకొలది మైళ్ళ ప్రయాణము చేసి చూడబోతామా? టెనెస్సికి చెందిన ఆ పేద కవికి తన చేతినిండా డబ్బు లభింపగానే తనకు అవసరమైన కోటు కొనుక్కుందామా లేక రాక్-ఎవే-బీచికి ప్రయాణపు ఖర్చుగా ఉపయోగించుకుందామా అని ఎందుకు తర్కించుకున్నాడు? దృఢకాయుడూ, సచ్ఛీలుడూ అయిన ప్రతియువకుడూ సముద్రానికి వెళ్ళాలని ఎందుకు తహతహపడ్తాడు? ఓడప్రయాణం మొట్టమొదటిసారి చేసేటప్పుడుమనకి నేల ఇంక అగోచరమని తెలియగానే ఎందుకు

వింతకలుగుతుంది! ఎందుకు నిగూఢానంద పరవశుల మవుతాము! ప్రాచీన పారసీకులు సముద్రాన్ని పవిత్రంగా భావించటం ఎందువలన? గ్రీకులు సముద్రానికి ఒక అధిదేవతను సృష్టించుకొని జవ్‌కి సాక్షాత్సోదరునిగా ఎందుకు కల్పించుకొన్నారు? దీనికంతకు అర్థం లేకపోలేదు. ఇంతకంటె నిగూఢతరార్థము నార్సిసస్ (Narcissus) గాథ. నార్సిసస్ తనను నానా విధముల వ్యథ పెడుతూవున్న నీటిలోని తన ప్రతిబింబాన్ని కైవసం చేసుకోలేక ఆ నీటిలోకే దూకి, మునిగిపోయాడు కదూ! అట్టి ప్రతిబింబాలను మనంకూడా అన్ని నదీజలాలలోను సముద్రజలాలలోను చూస్తాం. మనకు అగోచరము,అగ్రాహ్యము అయిన జీవితచ్ఛాయ యది. ఇదే అసలు రహస్యము.

సరే, నాకు బద్ధకంగా ఉన్నప్పుడూ, ఏదో బరువుగా ఉన్నప్పుడూ సముద్రానికి వెళ్తాను అన్నమాటకి అర్థం నేను ప్రయాణీకునిగా వెడతానని కాదు. ప్రయాణీకుడుగా వెళ్లాలంటే చేత నాలుగు డబ్బులుండాలి. అవి లేకపోతే, ఏమీ లాభంలేదు. అంతేకాదు, ఓడప్రయాణీకులు అంత అహ్లాదులుగా ఉండరు. జబ్బుపడతారు. ఒకరితో ఒకరు కలహిస్తారు. తాము సుఖపడరు. ఇతరులను సుఖపడనీయరు. అందువల్ల నే నెప్పుడూ ప్రయాణీకునిగా వెళ్ళను. సముద్రం నాకు అలవాటు అయినా నేనెప్పుడూ ఓడకప్తానుగా గాని, ఓడలో వంటవానిగాగాని వెళ్ళను. అట్టి పదవులు హోదాలు అవి కావలసినవారికి విడిచిపెట్టేస్తాను. నామట్టుకు నాకు

గౌరవ పదవులు, ఉద్యోగాలు, కష్టాలు నిష్ఠూరాలు అంటే
రోత. నన్ను నేను సరిచూచుకొని, కాపాడుకోవటం చాలు.
వేరే పడవలు ఓడలు మొదలైన తతంగాలన్నీ సరిచూచినంత
ఫలం అదే. పోతే, వంటవానివలె వెళ్ళటం సంగతి, వంట
వారుకూడా ఓడలో ఒక ఆఫీసరు క్రింద లెక్కే. ఆ పదవికి
కొంత హోదా ఉందనికూడా ఒప్పుకుంటాను. కమ్మగావండిన
కోడిమాంసాన్ని గురించి ఎంతో ఆస్థతో మాట్లాడగలనే కాని
నేనుకోడిమాంసం వండాలని ఎప్పుడూ ఊహించనైనా ఊహిం
చలేను. ఈజిప్టులోని పిరమిడ్లలో కానవచ్చే జలజంతు శవా
కారములు ఆ దేశపు ప్రాచీన రాజులకు జలజంతు మాంస
భక్షణము మీదగల ఆస్థకు చిహ్నములు. నేను సముద్రం
మీదకు వెడితే, నావికునిగానే వెడతాను. ఓడయొక్క
ముందుభాగాన కూర్చుంటాను లేకపోతే, ఓడ స్తంభాన్ని
ఎక్కుతాను! నావికునిగా వెళ్తే నాకు చాలా పని కలిగే
మాట నిజమే. ఒకచోటనుండి ఇంకొకచోటుకి పచ్చికలో
గొల్లభామలాగ గంతులు వేసేటట్టు చేస్తారు. మొదట ఇటు
వంటి చాకిరీ అసహ్యంగానే ఉంటుంది. గౌరవానికి భంగంగా
ఉంటుంది. అందులోనూ, సంపన్నుల కుటుంబములో పుట్టిన
వారికి మరీ రోతగా ఉంటుంది. అందులోను, ఏ పల్లెలోనో
అల్లరి పిల్లవాండ్రను అదుపులో పెడుతూ అధికారం చెలా
యించే బడిపంతులు పనిచేసేవానికి ఈ వృత్తి మరీ అస
హ్యంగా ఉంటుంది. 'బడిపంతులు' నావికుడుగా మారవలె
నంటే ఎంతో ఓర్పువుండాలి. కాని కొంతకాలానికి ఆ పని

అలవాటవుతుంది. ఓడ కెప్టెన్ నన్ను చీపురుతో ఓడవంతా తుడవమన్నా డనుకోండి. అంటేనేం! భగవంతుని దృష్టిలో అదిఏమాత్రం అగౌరవం! నేను వెంటనే కెప్టెన్ ఆజ్ఞను శిరసావహిస్తే నా కేవిధమైన చిన్నతనం! ఆ మాట కేవస్తే బానిసకాని వాడెవడు! అందువల్ల ఎంతమంది కెప్టెనులు నాకు పనులు చెప్పినా, ఎంతమంది నన్ను ఆడించినా, నాకు ఒకటే తృప్తి; అదేమిటంటే. ప్రతివాణ్ణీ ఇలాగే ఎవరో ఒకరు ఏదో విధంగా ఆజ్ఞాపిస్తూంటారని, ఇది మానవ సహజమనీ, దీన్నిగురించి విచారపడవలసింది యేమీ లేదనీ.

నేను నావికునిగానే వెళ్ళదలచటానికి ఇంకో కారణం కూడా ఉంది. నా శ్రమకి తగిన డబ్బు ముట్టుతుంది. ప్రయాణీకులకి డబ్బు ఇస్తారని నేనెక్కడా వినలేదు. పోగా, ప్రయాణీకులే డబ్బు ఇచ్చుకోవాలి. డబ్బు పుచ్చుకోవటానికి ఇచ్చుకోవటానికి బ్రహ్మాండమైన తేడావుంది. మానవజాతికి జన్మతఃసంక్రమించిన అసౌఖ్యము డబ్బుఇచ్చుకోవటం,పుచ్చుకోవటంసంగతో, దానికి సరియైన దేముంది?డబ్బు అన్నిఅనర్థాలకు మూలమని తెలిసినా, ధనికునకు స్వర్గంలో స్థానం దొరకదని మనం ఎంత నమ్మినా, డబ్బు పుచ్చుకునేటప్పుడు మానవుడు ఎంత ఉత్సాహంగా ఉంటాడు! అది అధోగతికి దారితీసినా, దానిని ఎంత ఉత్సాహంతో అన్వేషిస్తామో!

మదిమాట. ఓడమీద లభించే చక్కని వ్యాయామం, స్వచ్ఛమైన గాలికూడా నేను నావికునిగా వెళ్ళటానికి చోదకాలు. ఓడకి ముందుభాగంలో గాలి ఎక్కువ. వెనుక

భాగంలోకంటె, కెప్టెనుకంటె, నావికులకే ముందు గాలి తగులుతుంది. కాని, కెప్టెను తనకే ముందు గాలి తగులుతుందని అనుకుంటాడు. ప్రజానీకమే తమ నాయకులను నడిపిస్తూ వుంటుంది. కాని, ఆ మాట నాయకులకు తెలియదు. మామూలు వ్యాపార నౌకలమీద వెళ్ళే నాకు తిమింగిలపు వేటకి వెళ్లే ఓడమీద వెళ్ళాలని బుద్ధిపుట్టడమేమిటి? ఆ ప్రశ్నను ఒక కంట కనిపెట్టుతూ, నన్ను వెన్నంటి, నాకు తెలియని విధంగా ప్రేరేపించే విధిని అడగాలి. నేను ఈ తిమింగిలాల వేటకి వెళ్ళటం అన్నది ఎన్నడో విధిచే నిర్ణయించబడిన కార్యక్రమంలో అంశమై యుంటుంది. ఎటువచ్చీ, ఇది రెండు బ్రహ్మాండమైన కార్యక్రమముల మధ్య ఇరికించబడిన స్వల్పాంశమై యుంటుంది. ఆ కార్యక్రమ ప్రణాళిక యిది.

"అమెరికా దేశపు అధ్యక్ష పదవికి బ్రహ్మాండమైన పోటీ"

"ఇష్మెయిల్ యొక్క తిమింగిలాల వేటకు ప్రయాణం"

"ఆఫ్గనిస్థాన్‌లో భీకరమైన పోరాటం"

కొంతమందికి ఉదాత్తనాయక పాత్రలు, కొందరికి విలాసశృంగార పాత్రలు మరికొందరికి హాస్యపాత్రలు ఇచ్చిన ఆ యవివేక సూత్రధారుడు - విధి. నాకు ఈ రోతపాత్రను ఎందుకు నిర్దేశించాడో తెలియదు. కాని ఇప్పుడు ఆనాటి పరిస్థితులన్నీ పునరాలోచిస్తుంటే ఆ పాత్ర నా వంతుకు రావటానికి గల నిగూఢ కారణాలు మాయా ప్రలోభవంచనలు కొంత కొంత కానవస్తున్నాయి. ఇవిగాక ఆ పాత్ర నేనే

బుద్ధిపూర్వకంగా వివేకంతో కోరి వరించుకున్నట్లు కల్పింప బడిన భ్రమకూడా కానవస్తోంది. ఈ కారణాలలో అతి ప్రధానమైనది, ఒక మహాతిమింగిల భావనయే! అమంగళ సూచకమూ, అతి నిగూఢమూ అయిన తిమింగిల స్వరూపము నా కుతూహలమును ఇనుమడింపచేయుట. ఎక్కడో వున్న సముద్రాలలో లంకవలె పొర్లుతూండే ఆ శరీరము, తిమింగి లమువల్ల కలిగే అశేషమైన ప్రమాదాలు, ఆ సముద్రాల యొక్క మనోచిత్రాలు నా కోరికను మరీ గాఢంచేశాయి. ఇతరులకి ఇవి పెద్ద ఆకర్షణలు కాకపోవచ్చు, కాని నాకు అందరాని వాటిమీద ఆశ ఎక్కువ. పోరాని భూములకు పోవాలని, చొరరాని సముద్రములు చొరవలెనని, ఆటవిక మయములైన తీరములు మెట్టవలెనని నాకు ఎంతో కోరిక. మంచిని ఉపేక్షింపకపోయినా భయంకరమైన దానిని త్వరలో గ్రహించగలను. నాకు అవకాశంవుంటే, అట్టిదానితో బాగా కలసి మెలసి ఉండగలను. ఏమైనా, మన సహవాసులతో సఖ్యంగా వుండటం మంచిదేకదా!

ఈ కారణావల్ల తిమింగలాలవేట చాలా ఆకర్షకమే. ఒక నూతన్న విచిత్ర ప్రపంచమునకు ద్వారము తెరువబడినది. నా కోరికను నెరవేర్చుకోవాలన్న గర్వంతోపాటు, నా అంత రంగసముద్రములో తిమింగలాలు జంటలు జంటలుగా పొర్లుతూ వెళ్ళాయి; వాటిమధ్య గాలిలో ఆడే ఒక హిమ పర్వతమువంటి ఒక మహాతిమింగిల రూపు తలయెత్తి నా ఎదుట తాండవించింది!

2. బొక్కెన

సంచిలో ఒకటి, రెండు చొక్కాలను కుక్కి దానిని బుజాన వేసికొని కేప్‌హార్న్‌కి (Cape Horn) పసిఫిక్ మహాసముద్రానికి (Pacific Ocean) బయలుదేరాను. మన్‌హాటో పట్టణాన్ని విడిచి, డిశంబరు మాసంలో ఒక శనివారం రాత్రి న్యూబెడ్‌ఫోర్డు (New Bed Ford) చేరాను. అప్పుడే నన్‌టుకెట్ (Nantucket) కి వెళ్ళే పడవ దాటిపోయిందని తెలిసి ఎంతో నిరాశ చెందాను. మళ్లీ సోమవారం వరకూ ఆ ఊరు చేరేవిధం లేదు. తిమింగిలపు వేటకు వెళ్ళేవాళ్ళంతా న్యూబెడ్‌ఫోర్డ్ నుంచే ప్రయాణమవుతారు. కాని నాకు అట్టి ఉద్దేశము లేకపోయింది. నన్‌టుకెటు నుండి వెళ్లే పడవలో వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. ఆ చిన్న ద్వీపానికి సంబంధించిన ప్రతిదీ నాకెంతో ఆనందదాయకం. ఇటీవల, న్యూబెడ్‌ఫోర్డ్‌కి తిమింగిలపు వేటవిషయంలో ప్రాధాన్యం వచ్చినా, నన్‌టుకెట్టే ఆ వ్యాపారానికి మూలస్థానం. ఆ తీరానికే ఒక మృతతిమింగిలం మొట్టమొదట కొట్టుకొని వచ్చింది. నన్‌టుకెట్‌నుండియే కదా ఆ వేటకు అమెరికా ఆదిమనివాసులు ఎఱ్ఱఇండియనులు తమ చిన్న చిన్న పడవలలో బయలుదేరారు! తిమింగిలం మీద ఈటెలు విసరే అదను కనుక్కోటానికి ఉపయోగించే రాళ్ళని వేసుకొని వెళ్ళిన మొదటి ఓడ నన్‌టుకెట్‌నుండే కదా బయలుదేరింది!

న్యూబెడ్‌ఫోర్డులో రెండు రాత్రిలు, ఒక పగలు గడప వలసి రావటంవల్ల, నేను ఎక్కడ భోజనం చెయ్యాలో, ఎక్కడ పరుండాలో అన్న సమస్య లేర్పడ్డాయి. అది నిర్జీవము అంధకారమయము, అతిశీతలము అయిన రాత్రి. ఆ ఊరిలో నాకు తెలిసినవారు ఎవరూ లేరు. ఎంతో ఆశతో జేబుని తట్టి చూశాను. కొద్ది డబ్బే ఉన్నట్లు తెలిసింది. నిర్మానుష్యమైన ఆ వీధిలో నిలబడి, ఉత్తరదిక్కున ఉన్న నిరాశనూ, దక్షిణమున ఉన్న చీకటినీ పోల్చుకుంటూ "ఒరేయ్ అబ్బాయి! ఈ రాత్రి ఎక్కడ బస చేసినా ముందు దానికి అయ్యే ఖర్చు ఎంతో కనుక్కో – మరీ హెచ్చులకు పోకు" అని నాలో నేను అనుకున్నాను.

వీధులవెంట నెమ్మదిగా నడుస్తూ "దిక్రాస్ట్ హార్పూన్స్" అన్న బోర్డు చూచాను. కాని అది చాలా సెలవు చేయవలసిన స్థలంవలె కనబడింది. మరికొంత దూరములో "ది స్వోర్డ్‌ఫిష్ ఇన్" యొక్క కిటికీలనుండి వచ్చే అరుణకిరణాలు ఆ వీధిలో పడిన మంచునంతా కరగించివేసేటంత తీక్షణంగా ఉన్నాయా అనిపించింది. ఆ పరిసరాల పది అంగుళాల మందాన మంచు గడ్డకట్టి ఉండటంవలన నా పాదాలకు, మంచుముక్కలు మేకులవలె గుచ్చుకొన్నాయి. ఆ హోటలు ఎదుట ఒకక్షణం ఆగి, కంటికి మిరుమిట్లు గొలిపే దాని వెలుగును చూచి లోపలనుండే గాజుగిన్నెల చప్పుడు విని, ఇది కూడా చాలా సెలవు చేయవలసిన స్థలమే అని గ్రహించి, "ఇక్కడనుండి త్వరగా నడవరా అబ్బాయి" అనుకొన్నాను.

నాకు తెలియకుండా, సముద్రంవైపు వెళ్ళే వీధులవెంబడి నడవడం ప్రారంభించాను. ఆ వైపునే అతిచవుకగాను, సరదాగాను ఉండే సత్రాలు కళకళలాడుతూ ఉంటాయి.

నిర్మానుష్యమయిన వీధులు, ఇరుదెస రాశీభూతమైన చీకటి. ఆ చీకటిలో ఉన్నవా లేవా అనిపించే ఇండ్లనుండి కానవచ్చే కొవ్వొత్తి దీపాలు-ఇదీ ఆ దృశ్యం. అది శనివారం రాత్రి. ఆ గడియలో ఆ పేటంతా ఇంచుమించు ఖాళీ అయిపోయినట్లుంది. కాని ఇంతలోనే కాస్త దిగువగా, విశాలంగా ఉన్న ఇంటిలో ఒక దీపం వెలుగుతున్నట్లు కనబడింది. ఆ ఇంటి తలుపుకూడా, ఆహ్వానిస్తున్నట్లు తెరువబడి ఉంది. ఎవరు పడితే వారు స్వేచ్ఛగా వచ్చి ఉండిపోవచ్చు అన్నట్లుగా ఒక తటస్థభావము ప్రకటించే ఇల్లు అది. వసారాలో అడుగు పెడుతూనే సిగరెట్టు నుసిరాల్చే డబ్బాను తన్నాను. ఆ నుసి అంతా ఎగిరినప్పుడు గొమోరా నగరము దగ్ధమయినప్పుడు లేచిన బూడిదా అనిపించింది. మొదటి "ది క్రాస్డ్ హార్పూన్స్" తరువాత "ది సోర్డ్‌ఫిష్" ఇది "ది ట్రాప్" అయి ఉంటుంది. ఎలాగయితేనేమి లేచి ఒక తలుపు తీశాను. లోపల ఏదో కంఠం వినిపించింది. రెండో తలుపుని కూడా తీశాను.

"టోఫెల్‌లో సమావేశమైన "బ్లాక్ పార్లమెంటు" వలె కనిపించింది ఆ లోపలిభాగం. ఒక వంద నల్లని ముఖాలు వెనక్కి తిరిగాయి. వీళ్ళందరికి వెనుక ఒక తిన్నెమీద నిల్చొని మరణదేవు ఒక పుస్తకంనుండి ఏదో చదువు

తున్నాడు. అది నీగ్రోల చర్చి. ఆ మత ప్రచారకుడు చదివేది నరకంలోని యాతనలగురించి. అక్కడి ఏడుపులూ, రోదనలు, క్రోధాలు మొదలైనవాటి గురించి. వెనక్కి జారుకుంటూ, "ఒరేయ్ అబ్బాయి! విధవ కాలక్షేపం దొరికిందే నీకు" అనుకున్నాను. ఇంకా కొంత దూరం వెళ్ళాక రేవుకు దగ్గరగా చిన్న వెలుగు కనబడింది. గాలిలో సన్నని చప్పుడు వినబడింది. అటూ ఇటూ ఊగిసలాడుతూ తెల్లని అక్షరాలలో "ది స్పౌటర్ ఇన్- పీటర్ కాఫిన్" అని కనబడింది.

ఆ పేరేమిటనిపించింది. కాని కాఫిన్ (అంటే శవపేటిక) అన్న పేరు నన్‌టుకెట్‌లో చాలా సామాన్యమైనదే. ఈ పీటర్ అన్నవాడు అక్కడనుండి ఇక్కడికి వలసవచ్చాడేమో! దీపం చాలా సన్నగా ఉంది. ఆ యిల్లు నిశ్శబ్దంగా ఉంది. శిథిలమైన ఆ కొయ్యయింటిని ఎక్కడో పాడయిపోయిన ప్రాంతాన్నుంచి బండిమీద వేసికొని తీసికొని వచ్చారా అన్నట్టుంది ఊగిసలాడే ఆ తలుపుయొక్క మూలుగుకూడా ఏదో పేదరకాన్ని తెలియజేస్తోంది. ఇంతకంటె చవుకబారు బస దొరకదనుకున్నాను.

అది విచిత్రమైన ప్రదేశం. ముక్కోణాకారంగా ఒక పక్క పక్షవాతం వచ్చి పడిపోయినట్టు దీనంగా కనబడే ఆ యిల్లు వీథిచివర ఒక చీకటిమూలలో ఉంది. ఆ సందుచివర కొట్టే గాలిహోరు, పాల్ కొట్టుకుపోయే పడవమీద యూరోక్లైడాను తుపాను గాలిహోరుకంటె ఎక్కువగా ఉంది. గదిలో కాళ్లను వెచ్చబెట్టుకుంటూ కూర్చున్నవాళ్ళకి యూరోక్లై

దాన్ చాలా ఆహ్లాదకరంగా ఉండే గాదే. కనుక ఒక రచ
యిత యూరోక్లైడన్ గురించి ఇలా అన్నాడు. "మంచి
మంచు పడే వేళ, మనం గాజు అద్దాల కిటికీ వెనుకనుండి
ఈ తుఫానుగాలి, యూరోక్లైడాన్‌ను వైపు చూడటంలోను,
రెండువైపులా మంచు ఉండి కిటికీకి చట్రం కూడా లేక
మృత్యుద్వారప్రాయమైన ఆ కిటికీనుంచి చూడటంలోను
చాలా తేడా ఉంది. ఆ గాలిని గురించి కూడా మన అభి
ప్రాయాలలో తేడా ఉంటుంది" ఆ రచయిత ఎంత సబబుగా
వ్రాశాడా అనిపించింది. నిజమే, నా కళ్లే కిటికీలు, నా శరీ
రమే ఆ యిల్లు. ఇక్కడా, అక్కడా ఉన్న ఆ రంధ్రాలని ఏ
దూదితోనో కప్పి ఉంచవలసింది; కాని ఆ యిల్లు బాగుపరచే
సమయం దాటిపోయింది. విశ్వసృష్టి ముగిసింది. చివరి మెరు
గులు దిద్దేశారు. చుట్టూ పడిఉన్న ముక్కలని ఎన్నోలక్షల
సంవత్సరాల క్రితమే తొలిపేశారు. పాపం, లాజరస్ వీధిమీద
రాయిని తలగడగా ఉంచుకొని, చలికి వణికిపోతూ చెవులలో
గడ్డపీలికలూ, నోట జొన్నకంకీ కుక్కుకున్నా యూరోక్లైడాన్
నుండి తప్పించుకోలేకపోయాడు తన ఎట్టిని సిల్కుదుప్పటిని
పైన వేసుకొని. డైవ్స్ ఇలా అంటాడు. "ఇంతేనా యూరో
క్లైడాన్! ఎంత చక్కని, చల్లని రాత్రి! ఉత్తరాన ఆ ధృవ
నక్షత్రం ఎంత చక్కగా మెరుస్తున్నదో! ఎక్కడో ప్రాక్ది
క్కున వెచ్చని వేసవు లుంటాయట, ఉండని నాకు ఈ నులి
వెచ్చని వేసవే చాలు." కాని, లాజరస్ ఏమనుకుంటాడు!
ఉత్తరాన ఉన్న కాంతులవైపు చేతులుజాచి వెచ్చబెట్టుకో

గలడా ? ఇక్కడకంటె సుమత్రాలో ఉండటమే హాయికదా. అతనికి ? ఈ చలిబాధనుంచి తప్పించుకోవటానికి - భూమధ్య రేఖమీద పడుకోవటానికి గాని, ఆఖరికి అగ్నిగోళంలోకి వెళ్ళిపోవటానికి గాని వెనుకాడుతాడా ? కాని, లాజరస్ రోడ్డుమీద డైవ్స్ ఇంటి వాకిలిముందు పడి ఉండటం మొలక్కాలని మంచు ఆవరించడం కంటె ఆశ్చర్యమే. కాని, డైవ్స్ కూడా ఒక రాజులాగ దీనజనుల నిట్టూర్పుచే కరడు కట్టినవా అనిపించే అతిశీతలమైన భవంతిలోనే ఉంటాడు. అతనికి మద్యము నిషిద్ధమవటంవల్ల, అనాథల కన్నీళ్ళని మాత్రం త్రాగుతాడు.

ఈ ప్రలాపము ఇంక చాలు- మనం తిమింగిలపు వేటకి వెళ్తున్నాం. ఈ వాగుడికి చాలా అవకాశం ఉంది. ముందు ముందు కాలికి అంటుకున్న మంచుముక్కల్ని తుడిచి వేసి. ఈ "స్పేటర్" ఎటువంటి ప్రదేశమో చూద్దాం.

3. స్ప్రాటర్ సత్రం

త్రిభుజాకారంగా ఉన్న ఆ స్ప్రాటర్ సత్రిం యొక్క ముందుభాగం వెడల్పుగా ఉంది. చూరు అంత ఎత్తు లేదు. గోడలకి పాతకాలపు చెక్క ముక్కలు కొట్టబడి ఉన్నాయి. వీటివల్ల ఆ ముందుభాగమంతా ఏదో పాతబడిపోయిన పడవ లాగ కనబడుతుంది. ఒకవైపున బాగా పొగబారిన తైల చిత్రం ఉంది. ఎంతో జాగ్రత్తగా కన్నుపెట్టి పరీక్షిస్తేనే గాని ఆ మసకచీకటిలో, ఆ బొమ్మ ఏమిటో అర్థంకాదు. ఆ పటం అంత మాసిపోయినది. దాని నిండా ఎన్నో రంగులు, ఎన్నో నీడలు కమ్ముకొని యున్నవి. అత్యుత్సాహముకల చిత్రకారుడెవడో, ఇంద్రజాల కల్పితమైన అవ్యవస్థతను చిత్రించటానికి ప్రయత్నించాడా అని అనిపిస్తుంది. కాని ఎంతో ఆలోచనమీద నిశితమైన పరీక్షమీద, వెనుకనున్న చిన్న కిటికీని తెరచి చిత్తరువును చూడటంవలన చిత్రకారునికి అట్టి ఉద్దేశమే ఉందేమో ననిపిస్తుంది. అతని భావన భీభత్సమైనదే కావచ్చు.

చిత్రంలో అన్నిటికంటె మనలను కలవరపరచేది మధ్యలో ఉన్న ఆ నల్లని ముద్దలి ఈ ముద్ద మూడు నీలిరంగు గీతలమీద ఉంది. అర్థంలేని చిత్రమే కాస్త భీకరమైన మనిపించి బెదరగొట్టేస్తుంది. కాని మనకు తెలియనిది, మన ఊహకు అందనిది అయిన ఏదో మహోన్నతి ఆ పటంలో ఉన్నది. దానివల్ల మన మనస్సు దానికి హత్తుకొని పోయి ఆ చిత్రం

యొక్క అర్థమేమిటో తెలిసికోవాలని శపథపూర్వకంగా అని
స్తుంది. మన బుద్ధిని వంచించే ఒక రమ్యాస్ఫురణ కలుగు
తుంది. ఒక నడిరేయి ఉప్పెనరేగిన నల్లసముద్రమేమో అని
తోస్తుంది. పంచభూతముల భీకరసమర మేమో, ఎండిపోయిన
చిట్టడవేమో, ఉత్తరధ్రువప్రాంత శీతఋతువేమో, కరడు
కట్టుకొని పోయిన మంచుపటలమును త్రెంచుకొని ప్రవ
హిస్తూ వున్న కాలనదీ గమనమేమో అనిపిస్తుంది. ఈ ఊహ
లన్నీ ఆ చిత్రపు మధ్యభాగమునగల ఆ నల్లముద్ద ఏమిటో
తెలిసీదాక తొలగి ఉండవలసినదే. అదేదో తెలిసికుంటే,
మిగిలిన దంతా తేలికే. ఆగండి — నడుమనున్న ఆ నల్లముద్ద
ఒక పెద్ద చేపవలె లేదూ? అది తిమింగిలమే కాకూడదూ!

ఆ చిత్రకారుని ఉద్దేశమిదేమో, నేనుకూడా ఎందరో
పెద్దలతో చర్చించి ఆ ఉద్దేశానికే వచ్చాను. ఆ ఉద్దేశమిది:
ఆ చిత్రము పెనుతుపానులో చిక్కుకొని పోయిన ఓడ – పడి
పోయిన ఆ ఓడ యొక్క తెరచాపస్తంభాలు – ఆ ఓడమీదికి
దుముకుటకు ప్రయత్నిస్తూ ఆ మూడు స్తంభాలను అణచిపెట్టు
కొని యున్నది ఒక తిమింగిలం!

ద్వారానికి ఎదురుగుండా ఉన్న గోడమీద అనేక
గదలు, బల్లెములూ ఉన్నాయి. కొన్నిటికి దంతపు రంపాల
వలె మెరుస్తూ దగ్గరగా ఉన్న పళ్ళు – కొన్నిటి చివర మనిషి
జుట్టువలె ఉన్న చింపిరి ముడులు. మరి ఒకటి కొడవలి ఆకా
రంలో ఉంది : దానికి పొడవైన పిడి ఉంది, ఆ ఆయుధాన్ని

చూడగానే ఏ నరభక్షకుడు, ఏ రాక్షసుడు, ఇతర ప్రాణిసంహారార్ధము ఉపయోగించాడో అని భయం వేస్తుంది. ఈ ఆయుధాలతో పాటు, తిమింగిలాలని వేటాడడానికి ఉపయోగించే ఈటెలు తుప్పు పట్టిపోయినవి వంగి పోయినవి, విరిగిపోయినవి కూడా ఉన్నాయి. ఈ ఆయుధాలన్నిటికీ చరిత్రలున్నాయి. ఇప్పుడు బండబారి పోయినా ఈ యీటెతోనే యాభై సంవత్సరాలక్రితం నాథన్ స్పైన్ ఒక పూటలో పదిహేను తిమింగిలాలను చంపాడు. మరి యీ రెండవ యీటె ఇప్పుడు వంకరలు తిరిగి పోయినా, దానినే జావా సముద్రాలలో పారిపోతూ ఉండిన తిమింగిలం మీదకి ఒకప్పుడు వేటగాడు విసిరాడు, సంవత్సరాల తరువాత ఆ తిమింగిలాన్నే కేప్ ఆఫ్ బ్లాంకో దగ్గర చంపేశారు. ఆ ఇనుప ఈటె ఆ తిమింగిలపు తోకలో గుచ్చుకొని, మనిషి శరీరంలో సూది దూరినట్టు, దాని శరీరంలో నలభై అంగుళాలు లోపలికి వెళ్ళి అక్కడ దిగబడి పోయింది!

మసక మసక చోటు నుండి ఎదురుగా ఉన్న ద్వారం గుండా ముందుకు వెడితే అందరూ కూర్చుండే హాలులోకి వెడతాము. ఈ హాలు ఇంకా మసక మసకగా ఉంటుంది. దూలాలు బాగా క్రిందికి వంగి ఉంటాయి. నేల చెక్కకూర్పు. అది ముడతలు పడిన మొగమువలె నిమ్నోన్నతంగా ఉంటుంది. అందు ప్రవేశిస్తే ఏపడవలోపలికో వెళ్ళినట్లు అనిపిస్తుంది. ముఖ్యంగా ఆ తుఫాను హోరులో, మూలనున్న ఈ ఇల్లు ఊగిసలాడుతూండగా - ఆ భావన మరీ ఎక్కువ

అవుతుంది. ఒకవైపున పొడుగుపాటి బల్ల, ఆ బల్ల మీద ప్రపంచంలో ఎక్కడెక్కడినుంచో కొనితేబడిన వింతలతో నింపిన గాజు పెట్టెలు. ఈ హాలులో ఒక చీకటి మూల పానశాల. ఈ చీకటి మూల తిమింగిల శిరమును బోలివుంటుంది. ఇదిసరే - అటువైపు తిమింగిలపు దవడలు ఉన్నాయి. ఆ దవడల నడుమ ఒక గుఱ్ఱపు బండి వెళ్ళదగినంత ఎడము ఉంది. ఆ లోపల చిందరవందరగా ఉన్న అలమరలు, వాటి చుట్టూ మద్యపానాలకి పనికి వచ్చే సీసాలు, ఆ మృత్యురంగమున అటూ, ఇటూ తచ్చాడుతూ, అక్కడికి వచ్చే నావికులకు మత్తును, మృత్యువును అమ్మే ఒక ముసలి. అతని పేరు జోనా.

అతను, విషము పోసే ఆ గ్లాసులు, పరమ అసహ్యముగా ఉంటాయి. పైకి వెడల్పు గొట్టాల వలెనే కనబడినా, అవి లోపల సన్నగా ఉంటాయి. ఈ చిన్న గ్లాసుల పైన అడ్డంగా పెక్కు గీతలుంటాయి. ఈ గీతదాకా అయితే ఇవ్వవలసిన వెల ఒక పెన్నీ. ఆపై గీత దాకా అయితే ఇంకొక పెన్నీ, ఇలాగే గ్లాసు అంతా నిండితే, ఒకషిల్లింగు.

గదిలో అడుగు పెడుతూనే బల్ల దగ్గర కూర్చున్న పెక్కుమంది నావికులను చూశాను. ఆ మసక వెలుగులో వాళ్లు రకరకాలయిన పానీయాలను పరీక్షిస్తున్నారు. ఆ ఇంటి యజమానిని కలుసుకొని 'నాకు ఉండటానికి ఒక గది కావాలని అడిగాను. "ఒక్క గదైనా, ఒక్క మంచమైనా

ఖాళీలేదు" అన్నాడు. అతను తన నుదిటిని వేళ్ళతో తట్టుకుంటూ "ఒక తిమింగిలాల వేటగానితో కలసి పడుకోవటానికి మీకు అభ్యంతరం లేదు కదూ! మీరు కూడా తిమింగిలాల వేటకే వెళ్ళుతున్నారు కనుక ఇలాంటివి అలవాటు చేసికోండి, ఎందుకైనా మంచిది' అన్నారు. ఇంకొకరితో కలసి పడుకోవటం నాకు ఇష్టంలేదనీ, అంతగా పడుకోవలసి వస్తే ఆ రెండవ మనిషి స్వభావాన్ని బట్టి వుంటుందని అన్నాను. "నిజంగానే వేరే స్థలం లేకపోయినా, ఆ వేటగాడు అంత చెడ్డవాడు కాకపోయినా, ఈ రాత్రివేళ, ఈ చలిలో, ఇంకొక చోటు వెతుక్కుంటూ, ఈ కొత్త ఊళ్ళో తిరగటం కంటే ఇక్కడే వేటగానితో కలిసి పడుకోవటమే మంచిదేమో ననుకుంటాను" అన్నాను.

"మీరు ఒప్పుకుంటారనే అనుకున్నాను. సరే, భోజనం మాటేమిటి! భోజనం రెండు క్షణాలలో తయారవుతుంది. కూర్చోండి" అన్నాడు.

ఒక కుర్చీ మీద కూర్చున్నాను. ఆ కుర్చీని చూస్తే ఒకప్పుడు ఎవడో ఒక పడవ రూపాన్ని చెక్కబోయి దీన్ని కొంతవరకే మలచి, విడిచిపెట్టి వేశాడేమో ననిపించింది.

కొంతసేపటికి, మాలో నలుగురయిదుగురను పక్కగదిలోకి భోజనానికి రమ్మని యజమాని పిలిచాడు. ఆగదిలో వెచ్చదనానికై ఏమీ ఏర్పాటు లేక పోవడంవల్ల, ఎంతో చల్లగా, ఐస్‌లాండ్ లాగ వుంది. అటువంటి వెచ్చదనపు

ఏర్పాట్లు చేయడానికి తన దగ్గర డబ్బు లేదన్నాడు యజమాని. ఆ గదిలో రెండు క్రొవ్వు వత్తులు తప్ప వేరే ఏమీ లేవు. మా చొక్కాలకు బొత్తాములన్నీ పెట్టుకున్నాము. కొంకర్లు పోయిన వేళ్ళతో వేడివేడి తేనీటి గ్లాసులను పెదవులకు చేర్చుకున్నాము.

భోజనం సుష్టుగా ఉంది. బంగాళదుంపలు, మాంసమే కాక ఒక రకం పిండివంట కూడా వడ్డించారు. మాలో ఆకు పచ్చ కోటు వేసుకొన్న ఒక యువకుడు ఈ పిండివంటల పని బాగా పట్టించాడు. అది చూచి ఆ యజమాని –

"నాయనా! నీకు పీడకలలు రాగలవు జాగ్రత్త" అని హెచ్చరించాడు. నేను యజమానిని రహస్యంగా అడిగాను, "మన తిమింగిలాల వేటకాడు, అతను కాదుగదా" అని. "కాదు. అతను నల్లగా వుంటాడు. పిండివంటలను ఎప్పుడూ తినడు. ఎంతసేపూ మాంసపు పులుసే కావాలి."

"ఓహో! అలాగా! సరే. ఏడీ అతను! ఇక్కడ ఉన్నాడా, లేడా!"

"ఇంకా కొద్దిసేపటిలో ఇక్కడ వుంటాడు."

ఆ నల్లవానిని గురించి ఎందుకో నాకు ఒక అనుమానం పొడమింది. ఒకవేళ, నేను అతనితో పాటు పడుకోవటం తప్పనిసరే అయితే, అతన్నే ముందు మంచం ఎక్కమని చెప్పుదామని నిశ్చయించుకొన్నాను. భోజనాలు అయిన పిమ్మట, అందరం, మద్యపానాలున్న గదిలోకి

వెళ్ళాము. అక్కడ ఏమిచేయాలో తెలియక, మిగిలిన సమయము అంతా ప్రేక్షకునిగానే గడుపుదామనుకున్నాను,

అంతలో బయట ఒక పెద్ద కలవరం వినబడింది. యజమాని కిటాలున లేచి "వీళ్ళంతా గ్రాంపస్‌ని పట్టేవాళ్ళయి వుంటారు. ఆ ఓడ రేవులోకి రావటం పొద్దున చూచాను. ఆ ఓడనిండా సరుకులు వేసుకొని, మూడేళ్ళు నీటిమీద ప్రయాణించి వచ్చారు. ఫిజి ద్వీపాలనుంచి తాజా వార్తలు తెచ్చి వుంటారు. రండోయ్ కుర్రవాళ్ళూ" అని అరుస్తూ బయటకి వెళ్ళాడు. బయట సముద్రపు బూట్ల తొక్కిడి వినవచ్చింది. తలుపు తోసుకొని ఒక అల్లరి మూక లోపలికి వచ్చి పడింది. వాళ్ళు మాసిపోయిన కోట్లను తొడుగుకొని, తలలపై పాచికలు వేసివున్న మఫ్లర్‌లు చుట్టుకొని యున్నారు. మంచుతుంపర రాలటం వల్ల వాళ్ళ గడ్డాలు బిగిసిపోయి యున్నవి. వాళ్ళను చూస్తే లాబ్రడార్ నుండి పైకి వుబికిన ఎలుగుబంట్లేమో ననిపించింది. వాళ్ళు అప్పుడే ఓడ దిగారు. వాళ్ళు మెట్టిన మొట్టమొదటి ఇల్లు ఇదే. వాళ్ళు వస్తూనే, మద్యపానాలున్న చోటుకి పరుగెత్తడంలో ఆశ్చర్యమేమీ లేదు. జోనా, వాళ్ళ గ్లాసులను నింపుతున్నాడు. ఒకడు తలలో పడిసెపు భారంతో బాధపడుతున్నానంటే వాడికి ఘాటైన మద్యాన్ని కలిపి ఇస్తూ 'ఎన్నాళ్ళనుంచి వున్నదైనా ఎటువంటిదైనా, ఎక్కడ సంపాదించినదైనా సరే, దీనితో ఆ పడిశెభారం మాయమౌతుందని" జోనా అన్నాడు,

త్వరలోనే మద్యము వాళ్ళ తలకి ఎక్కింది, వాళ్ళు ఎంతో గోల చేయటం మొదలు పెట్టారు. ఆ గుంపునుండి విడివడి వేరుగా కూర్చున్న ఒకణ్ణి గమనించాను. వాడు తన నిరానంద ముఖలక్షణము వలన ఇతరుల సరదాను చెడగొట్టకూడదని అనుకున్నాడేమో, అతను తక్కిన వాళ్లంత గొడవచెయ్యలేదు. ఎందుచేతనో, యితనిమీద నాకు ఒక ఆస్థ కలిగింది. సముద్రుడు, యితను నాకు నౌకాసావాసి కావాలని నిర్దేశించాడు కాబట్టి, అతనిని కొంత వర్ణిస్తాను.

అతను అజానుబాహుడు. విపులవక్షుడు. అంత మాంసలశరీరుడు సాధారణంగా కానరాడు. అతని ముఖము బాగా వాడిపోయింది. ఆ ఎండిన మొగముమీద తెల్లని అతని దంత కాంతి మరీ ప్రకాశమానంగా వుంది. అతను చూచే లోతైన చూపులను బట్టి అతని మనస్సులో సుఖస్మృతులు ఏవీ మెదుల్తున్నట్టు తోచలేదు. మాటనుబట్టి అతను దాక్షిణాత్యుడని తెలుస్తుంది. రూపమును బట్టి, వర్జినియాలో అలిగేనియన్‌కి చెందిన పార్వతీయుడేమో నని పిస్తుంది. తన తోడివారి అల్లరి మరీ ఎక్కువ కాగా, అతడు భరింపలేక కాబోలు; మెల్లగా తొలగి పోయాడు. ఓడలో అతను నా సహచరుడు అయ్యేవరకు వానిని మళ్ళీ నేను చూడలేదు.

కాని, కొన్ని క్షణాలలోనే మిగిలిన వాళ్లందరికీ, అతని లేమి గుర్తువచ్చింది. వారందరికీ అతను ఆ ప్రేమ కాబోలు, అందరూ ఒక్కసారిగా "బిల్కింటన్ ! బిల్కిం

టన్ ! బిల్కింటన్ ఎక్కడ!" అని కేకలు వేసికొంటూ బయటకు పరుగెత్తారు.

రాత్రి తొమ్మిది గంట లయింది. అంతవరకు జరిగిన అల్లరి సమసిపోయిన తరువాత ఆ గదిలో అనుకోని నిశ్శబ్దం వెలసింది; ఆ నావికులు రాకముందు నాకు తట్టిన ఒక వుపాయాన్ని తలచుకొని, నన్ను నేనే అభినందించుకొన్నాను.

ఇంకొకనితో కలసి పడుకోవటం ఎవ్వరికీ ఇష్టంకాదు. అంతదూరమేల? తమ్ముని పక్కనే పరుండలేము. ఎందువల్లనోగాని, మనుష్యుడు, నిద్రకు ఏకాంతాన్ని కోరుకుంటాడు. అందులోను, ఒక కొత్తవానితో, ఒక క్రొత్త హోటలులో, కొత్త ఊరిలో అపరిచితుడైన ఒక వేటకానితో కలిసి పరుండటానికి మనము మరీ అనిష్టము చూపుతాము. నావికుడయినంత మాత్రాన నేను ఇంకొకనితో కలిసి ఎందుకు పడుకోవాలో నాకు అర్థం కాలేదు. సముద్రం మీదకి వెళ్ళినంత మాత్రాన నావికులు ఒక పక్క మీద యిద్దరేసి పడుకోరు. అందరూ కలిసి ఒకే గదిలో పడుకుంటారు నిజమే. కాని, ఎవని పక్క వానికే. ఎవని దుప్పటి వానికే వుంటుంది. ఎవని శరీరము వానికే తోడు.

ఈ తిమింగిలపు వేటకాని గురించి ఆలోచించిన కొద్దీ, వానితో కలసి పడుకోవటం అన్న తలంపు దుస్సహమైనది.

వేటకాడపటం వల్లన అతని బట్టలు — ఉన్నివైనా, నూలువైనా — ఎలాగూ శుభ్రంగా ఉండవు. నా దేహము గగుర్పొడిచి ది. చాలా పొద్దుపోయింది. ఆ పాటికి అతను తిరిగి వచ్చి ప్రక్క చేరవలసింది. అర్ధరాత్రివేళ వచ్చి నా పక్కలో పడ్డాడనుకోండి; ఏ చెడ్డ కొంపనుంచి వస్తున్నాడో ఏమి చెప్పగలను!

యజమానిని కేకవేసి పిలిచాను. "ఆ వేటకానితో కలిసి పడుకోకూడదని అనుకున్నాను. నేను వేరే, ఈ బల్ల మీద పడుకుంటాను."

"మీ ఇష్టం. కాని, బల్లమీద పరచుకోవటానికి మీకు ఏ దుప్పటీని ఇవ్వలేను. ఈ బల్ల చాలా గరుకుగా వుంది" అంటూ, బల్లను చేత తడిమి చూపించాడు. "అయినా, ఆగండి. నాదగ్గర చిత్రికగుల్ల వుంది. దానితో ఈ బల్లను చిత్రిక పడుతాను" అంటూ వెళ్ళి చిత్రిక గుల్లను తెచ్చి, రుమాలుతో బల్లను తుడిచి, చిత్రికపట్టటం మొదలుపెట్టాడు. గబగబా అతను చిత్రిక పట్టుతూండగా ఆ చిత్రిక పొట్టు అటూ ఇటూ ఎగురుతోంది. ఇంతలో ఒక గట్టి బొడిపికి కొట్టుకొని, చిత్రికగుల్లలోని ఇనుప నాలుక ఎగిరిపడింది. పాపం, అతని చెయ్యి బెణికి వుండాలి! "ఇంక అంతటితో ఆప"మన్నాను. నాకు ఆమాత్రము నునుపు చాలునన్నాను. అసలు, అట్లా ఎంతసేపు చిత్రిక పట్టినా, ఆ బల్ల నునుపు ఎక్కుతుందని తోచలేదు. అతడు, సరేనని, అక్కడ రాలిన

పొట్టు అంతా ఏరి, ప్రక్కనే వున్న పొయ్యిలో పడేసి వెళ్ళి పోయాడు. నేను మళ్ళీ ఆలోచనలో పడ్డాను.

బల్లను కొలిచి చూడగా, అది నా పొడవు కంటె ఒక అడుగు తక్కువని అనిపించింది. ఒక కుర్చీని జోడించి సరిపెట్టుకోవచ్చు ననుకొన్నాను. పొడవు తక్కువే కాక, దాని వెడల్పు కూడా తక్కువే. చేరువనున్న ఒక బల్ల చూడగా అది దీనికంటె నాలుగైదు అంగుళాలు ఎత్తు, ఈ రెంటినీ జతపరచటం కుదరదు. సరేనని, మొదటి బల్లని గోడకి కొంత ఎడంగా వేశాను. ఆమధ్యలో నా వీపుని ఇముడ్చవచ్చునని అనుకున్నాను. కాని, కొద్దిసేపటిలోనే కిటికీలో నుంచి నామీదకి చల్లనిగాలి వచ్చింది. అదీగాక, ఎదట నున్న తలుపు గుండా ఇంకొక గాలి విసురు వచ్చింది. ఈ రెండు చల్లగాలి తెరలూ కలిసి నా చుట్టూ చిన్న చిన్న సుడిగాలులంటె తయారైనాయి. 'ఇది కాదు పద్ధతి' అనుకున్నాను.

'ఈ వేటగాడు త్వరగా వస్తే బాగుండును' అనుకుంటూ వుండగా ఇంకొక ఆలోచన తట్టింది. వాడికంటె ముందు వెళ్ళి, తలుపు గడియవేసికొని ఆ పక్కమీద పడుకొంటే, వాడువచ్చి ఎంత పిలిచినా లేవకుండా వుంటేనో! ఆలోచన ఫరవాలేదనుకొన్నాను. కాని, ఇంకాస్త ఆలోచించగా, అదీ లాభంలేదనిపించింది. తెల్లవారిన తరువాత, గదినుండి నేను బయటకు వచ్చేటప్పుడు. వాడు తలుపునగ్గర పొంచి వుండి, నా మీద మొకి తేనో

అటూ ఇటూ చూచాను. ఇంకొకనితో కలసి పడు కుంటే తప్ప ఆ రాత్రి గడపటం దుర్ఘటమనుకొన్నాను. అయినా, ఆ వేటకాని పట్ల అనవసరమైన అపోహాలు పడుతున్నానేమో ననిపించి, మరికొంతసేపు ఆగివుంటే అతను ఏలాగూ వస్తాడు ఆ తరువాత మేమిద్దరం చాలా ఆప్తులం కావచ్చునేమో, ఎవరు చెప్పగలరు!

ఆ హోటలుకి వచ్చిన ఇతర అతిథులంతా ఇద్దరేసి, ముగ్గురేసీ వాళ్ళ వాళ్ళ గదులలోకి వెళ్తున్నారు. కాని, ఈ వేటకాడి జాడమాత్రం లేదు.

రాత్రి పన్నెండు కావచ్చినది. ఆ హోటలు వాడిని పిలిచి "ఏమయ్యా, ఇతను ఎలాటి వాడు! ఎప్పుడూ ఇంత ఆలస్యంగానే వస్తూంటాడా!" అని అడిగాను. అతను గిలిగింతలు పెట్టినట్టుగా నవ్వాడు. ఆ నవ్వు నాకు అర్థంకాలేదు. "లేదండీ— మామూలుగా త్వరగానే వచ్చేవాడు. పెందలకడే పడుక్కొని, పెందలకడే లేచె మనిషి. నేటి రాత్రి అమ్మకానికి వెళ్లాడు! ఇంత రాత్రిదాకా ఎందుకు తిరిగి రాలేదో! ఆ తలకాయని అమ్మలేక పోయాడేమో!"

"తలకాయనా? మీరు చెప్పే కథ ఏమిటి? శనివారం రాత్రి – కాదు, కాదు ఆదివారం తెల్లవారు ఝామున – తన తలకాయని ఈ ఊరులో అమ్మకానికి చూస్తున్నాడంటారా!" అని కోపంగా అడిగాను.

"నేను అనేది అదే. 'ఇక్కడ సరుకు ఎక్కువగా వుంది, నువ్వు ఇమ్మలేవయ్యా' అని కూడా చెప్పాను అతనికి."

"ఏ సరుకు ఇక్కడ ఎక్కువగా వుంది?"

"తలకాయలు. లోకంలో తలకాయలు ఎక్కువగా లేవూ!"

"చూడండి. ఈ పిట్టిముట్టి కథలు నాకు చెప్పవద్దు. నాకేమీ పిచ్చి ఎత్తలేదు." అని నెమ్మదిగా అన్నాను.

"కాకపోవచ్చు. కాని ఆ వేటగాడు తన తలకాయను గురించి మీరట్లా మాట్లాడటం వింటే మీకు పిచ్చి కుదురుస్తాడు."

అతని వాగుడికి ఒళ్ళు మండి, "అలాగా! వాడి తలే పగులకొట్టగలను జాగ్రత్త" అన్నాను.

"అది ముందే పగిలి వుంది."

"పగిలివుందా! నిజంగా!"

"అందువల్లే దానిని అమ్మ లేక పోతున్నాడు అనుకుంటా" సాధ్యమైనంత శాంతంగా ఇలా అన్నాను." ఇదిగో చూడండి. మనం ఒకరినొకరం శీఘ్రంగా అర్థం చేసికోవాలి. ఆలస్యం చేయకూడదు. నేను మీ హోటలుకివచ్చి పడుక్కునేందుకు స్థలం కావాలన్నాను. 'విడిగా లేదు. కావాలంటె ఒక వేటగాడితో కాటు పడుకోవచ్చు' నన్నారు మీరు. నేనింకా అతనిని చూడనేలేదు. కాని మీరు మాత్రం అతని

గురించి ఏవో రహస్యాలు, అర్థంకాని కథలు చెప్తున్నారు. అతనితో పరుక్కుంటాను కాబట్టి ఎంతో సన్నిహితుడు కాబోయే ఈ వేటకాడంటే నాకేదో అనుమానం కలిగిస్తు న్నాయి ఈ కథలు. ఇక ఇప్పుడు నిజం చెప్పండి. ఈ వేటకా డెవడు? అతనితో పడుకోవటంవల్ల నాకేమీ ముప్పు లేదు కదా? అన్నిటికంటె ముందు మీరు అతను తలని అమ్మేశా డని ఇప్పుడు చెప్పిన కథ నిజం కాదనండి. ఆ కథే నిజమైతే ఆ వేటకాడెవడో వుత్తి పిచ్చివాడై వుండాలి. అట్టివానితో నేను పడుకోవటం కల్ల. అంతేకాదు, అతని సంగతి తెలిసి వుండి అతనితో పడుక్కోమని నాతో చెప్పిన మీ మీద పోలీసు కేసు పెట్టుతాను."

"అబ్బో! చాలా పెద్ద వుపన్యాసమే చెప్పారే! కొంచెం శాంతించండి. ఈ వేటకాడు దక్షిణ సముద్రం నుంచి వచ్చినవాడు. అక్కడనుండి న్యూజిలాండు దేశస్థులు కుళ్ళి పోకుండా నిలవచేసిన తలలని కొన్నిటిని తీసికొని వచ్చాడు. వాటిని ఇక్కడి వాళ్ళు గృహాలంకరణాలుగా వాడుతారు. అతను ఒకటి తప్ప మిగిలిన తలలన్నిటినీ అమ్మివేశాడు. రేపు ఆదివారం. అందరూ చర్చికి వెళ్ళేప్పుడు తలని అమ్ముతూ రోడ్లమీద తిరగటం ఏమి బాగుంటుందని ఇవాళే అమ్మటా నికి చూస్తున్నాడు. అసలు క్రిందటి ఆదివారం నాడు కూడా నాలుగు తలల్ని వుల్లిపాయలులాగ ఒక తాడుకి గుచ్చి అమ్మటానికి బయలు దేరాడు. నేనే ఆపాను."

దీనితో అసలు రహస్యం బయటపడింది. కాని శనివారం అర్ధరాత్రిదాకాను, ఆదివారం పొద్దున్న వరకూను, నరమాంస భక్షకులకి చెల్లే ఈ వ్యాపారంలో తిరుగుతున్న ఆ వేటకాని గురించి ఏమి అనుకోవాలి? "ఏమయ్యోయ్ ! ఈ వేటకాడు దేవాంతకుడు. ఇది నిజం" అన్నాను.

"ఏమోమరి ! అతను నాకు వేళకి డబ్బు యిస్తూనే వున్నాడు. కాని, లోపలికి రండి. పడుక్కునే పక్కని చూపిస్తాను. పెళ్ళయిన రాత్రి మా దంపతులం ఆ పక్కమీదే పడుకున్నాము. అది చాలా పెద్దమంచం. మా పిల్లలు సామ్‌ని, జానీని కూడా ఆ పక్కమీదే పడుకోపెట్టుకునే వాళ్లం. కాని ఒక రాత్రి ఏదో కలవచ్చింది కాబోలు. నేను అటూ ఇటూ దొర్లాను. దానితో సామ్ క్రిందపడ్డాడు. చెయ్యి విరిగినంత పనైంది. నాటినుండి ఈ మంచం పనికి రాదని నా భార్య నిషేధించింది. నాతో రండి - ఇక్కడే - చూపిస్తాను" అని కొవ్వొత్తిని వెలిగించి దారితీశాడు.

ఏమీ తోచక నిలబడ్డాను. యింతలో అతను, గడియారం వంక చూసి, "ఆదివారం వచ్చేసింది. ఈ రాత్రి మీరు అతనిని చూడలేరు. ఈ రాత్రి ఎక్కడో తలదాచుకొని వుంటాడు. రండి, రండి" అన్నాడు. ఒక్క నిమిషం తటపటాయించాను... మేడ మెట్లు ఎక్కడం ప్రారంభించాం. ఒక చిన్నగదిలోకి వెళ్ళాం. అందులో ఒక పెద్ద మంచం వుంది. దానిమీద వరసగా నలుగురైనా పడుకో-

వచ్చు. అంత పెద్దదిగా వుంది. క్రొవ్వొత్తిని మేజామీద పెట్టుతూ, "అదిగో మంచం. ఈ రాత్రి మీరు సుఖంగా పడుకోవచ్చు" అని గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు.

మీద నున్న దుప్పటిని ప్రక్కకు తొలగించి, మంచాన్ని పరీక్షించి చూచాను. అంత నాజూకైనది కాక పోయినా, పరీక్షకి తాళింది ఆ మంచం. గది నాలుగు వైపులా చూశాను. ఆ మంచమూ, మేజా తప్ప వేరే సామాను లేవీ అక్కడ లేవు — ఒక మూల మాత్రం ఒక చవుకబారు బీరువా కనబడింది. గోడకి ఒక బొమ్మ తగిలించబడి వుంది. అది తిమింగిలమును కొట్టుతూవున్న మనిషి రూపం. ఆ గదికి చెందని సామాన్లు కూడా కొన్ని కనబడ్డాయి. ఒక మూల చిందరవందరగా పడివున్న పరుపూ, యింకో ప్రక్క ఆ వేటకాడు పెట్టుకున్న బట్టలసంచీ, బీరువా మీద కొన్ని ఎముక ముక్కల మూట, మంచం ప్రక్కన పొడుగుపాటి ఈటె, కానవచ్చాయి.

కాని మేజామీద వున్నదేమిటి? దానిని దీపం దగ్గర పెట్టి చూచాను; తడిమి చూచాను; వాసనకూడా చూశాను. అది ఏమిటో తెలుసుకుందామని ఎన్నో ప్రయత్నాలు చేశాను. అది తలుపుల దగ్గర కాళ్ళు తుడుచుకునే పీచు లాగ వుంది. కాకపోతే, చివళ్ళలో చిన్నచిన్న పుల్లలులాగ ఏవో వున్నాయి. ఈ పీచువంటి దానికి మధ్యలో ఒక బెజ్జముంది. మరి వున్న వేటకాడెవడైనా అటువంటి పీచుతో

తలమార్చి, ఈ నగరంలో తిరుగుతాడా అనిపించింది. దానిని తగిలించుకు చూద్దామని యత్నించాను. కాని, దాని బరువు నన్ను క్రుంగదీసింది. అది చాలా ముతకగాను, బంకగాను వుంది. చెమ్మగా కూడా వుండటంవల్ల, దానిని వేసికొని ఆ వేటకాడు వర్షంలో తడిశాడేమో అనిపించింది. ఎలాగో దానిలోకి దూరి, ఎదుటి గోడకి వున్న అద్దం దగ్గరకు వెళ్లాను. అద్దంలోని నా ప్రతిబింబము అపూర్వమూ, అసహజమూగా వుంది. ఆ పీచుని త్వరగా తీసివేద్దామని గుంజుకోవటంలో, నా మెడకి చిన్న గాయంకూడా అయింది.

మంచము మీద కూర్చుని, తలలని అమ్మే ఆ వేటకాని గురించి ఆలోచించటం మొదలు పెట్టాను. ఇలా కొంచెము సేపు మంచముమీద కూర్చుండి, మరికొంచెము సేపు గది మధ్య నిలబడి ఆలోచించటం మొదలు పెట్టాను. ఆ తరువాత కోటుని తీసేసి చొక్కా మాత్రమే వుంచుకొని ఆలోచిస్తూనే వున్నాను. ఇంక అప్పుడు చలి వేయటం మొదలుపెట్టింది. అంత పొద్దుపోయిన తరువాత వేటకాడు రాడని హోటలు యజమాని చెప్పిన మాటలు జ్ఞప్తికివచ్చి ఆలస్యమెందుకని నా కాలిజోడునీ పంట్లామునూ తీసేసి దీపాన్ని ఆర్పి ఇంక దేవుడే దిక్కనుకుంటూ మంచం మీద పడ్డాను.

ఆ పరుపులో పల్లేరుకాయలనే పెట్టారో గాజుపెంకులనే పెట్టారోగాని ఎంతసేపటికీ నిద్రపట్టక ఏదో గుచ్చుకుంటూంటే అటూ ఇటూ దొర్లుతూ గడిపాను. ఎట్లాగో

కాస్త మగత వచ్చింది. మంది ద్ర పట్టే సమయాన వసారాలో అడుగుల చప్పుడు వినబడింది. గదిలోకి సన్నని వెలుగు వచ్చింది. ఆ వచ్చేవాడు తలలను అమ్మే రాక్షసుడేమో! ఇక దేవుడే నన్ను రక్షించాలి అనుకుంటూ కదలకుండా పడుకున్నాను. అతను పిలిస్తేనే గాని పలుకకూడదని నిశ్చయించుకున్నాను. ఒక చేతిలో క్రొవ్వు వత్తిని, వేరొక చేతిలో ఒక తలకాయని పెట్టుకొని వాడు గదిలోకి వచ్చి మంచం వైపు చూడకుండానే ఆ క్రొవ్వు వత్తిని ఒక మూల పెట్టాడు. గదిలో ఉన్న సంచిని తెరువ నారంభించాడు. అతని ముఖాన్ని చూద్దామని ఎంతో ఆశపడ్డాను. కాని అతను ఆవల వైపుకి తిరిగి ఉన్నాడు. కాస్సేపటికి నా వైపు తిరిగాడు. అబ్బ! ఎటువంటి దృశ్యమో! ఎటువంటి ముఖమో! మొగము నిండా ముదురు నీలపు రంగు. మధ్య మధ్య నల్లని చదరపు చుక్కలు. వీ డెవడో ఘోరమైన వాడే. ఎక్కడో పోట్లాడి ముఖమంతా దెబ్బలు తగిలించుకొని డాక్టరు దగ్గరకు వెళ్ళి తిరిగి వచ్చాడు కాబోలు! ఇంతలోనే దీపంవైపు తిరిగాడు. ఆ ముఖముమీద ఉన్న గళ్ళు అతికించబడిన పలాస్త్రీ ముక్కలు కావని కనిపెట్టాను. అవేవో మచ్చలు. అవి ఏమి మచ్చలో పోల్చుకో లేకపోయాను. ఇంతలోనే ఒక సంగతి జ్ఞప్తికి వచ్చింది. వెనుక ఎప్పుడో ఒక తెల్లవాడు - తిమింగిలాల వేటకాడు గూడా - నరభక్షకుల చేతిలో పడినప్పుడు అతని ఒంటినిండా పచ్చలు పొడిచారుట. ఈ వేటకానికి గూడా ఏ దూరదేశానిలో

వెళ్ళినప్పుడు అటువంటి కొస్తిరయే జరిగి ఉంటుంది. అయితే మాత్రమేమి? ఆకారమూ, రంగూ ఎట్టివి ఐనా సజ్జనుడే కావచ్చును కదా! ఆ పచ్చలున్న భాగాన్ని తీసివేసినా చుట్టూ ఉన్న ఆ రంగేమిటి? ఏ తూర్పు దేశాలలోనో తిరిగితే సూర్యరశ్మికి అలా అయిందేమో! కాని సూర్యరశ్మి వల్ల తెల్లవాని రంగు ఊదా, పసుపులుగా మారుతుందని నే నెక్కడా వినలేదు. దక్షిణ సముద్రానికి నే నెప్పుడూ వెళ్ళలేదు. ఒకవేళ అక్కడి సూర్యరశ్మి చర్మంలో అటువంటి మార్పులని తెలుస్తుందేమో! నాలో ఇటువంటి ఆలోచనలు మెదులుతూ ఉన్నంతసేపూ ఆ వేటకాడు నన్ను చూడనే లేదు. సంచిని తెరచి గొడ్డలివంటి ఒక ఇనుపగొట్టమును, ఒక చిన్న సంచిని తీశాడు. ఈ రెంటిని మేజామీద పెట్టి ఆ న్యూజిలాండ్ తలని ఆ సంచిలో కుక్కాడు. తరువాత టోపీని తీశాడు. ఆశ్చర్యం! అతనికి జుట్టే లేదు. అతని బట్ట తల శుద్ధకపాలం వలె ఉంది. అతనే ద్వారానికీ, నాకూ మధ్య నిలబడి ఉండకపోతే అవతలికి పారిపోయేవాడనే. అప్పటికీ కిటికీలోనుంచి జారుకుందామనుకున్నాను కాని, అది రెండవ అంతస్తు అయిపోయింది. నేను పిరికివాడను కాకపోయినా, ఈ రంగూ, ఈ వ్యాపారము, ఈ మనిషిని ఏమనుకోవాలో బోధపడలేదు. అజ్ఞానము, భయానికి హేతువు. అయోమయ స్తబ్ధత ఆవరించటంవల్ల అతడొక పెనుభూతమువలె భయపడడం మొదలు పెట్టాను. పలుకరించి, సంగతేమిటో కనుక్కుందామన్న ధైర్యము కూడా లేకపోయింది.

ఇంతసేపూ అతను బట్టలు విప్పుతూనే ఉన్నాడు. అతని చేతులు, ఛాతీ బయటపడ్డాయి. ఆ అవయవాలమీద కూడ చిన్న చిన్న గళ్లున్నాయి. ఏ యుద్ధంలోనో పోరాడి, దెబ్బలు తిని, ఆ గాయాలకి పట్టీలు వేసుకొని బయట పడినట్టు కనబడ్డాడు. అతని కాళ్ళమీద కూడా మచ్చలే! చిన్న చెట్టుని ఎగబ్రాకుతున్న చిరుకప్పలవలె ఉన్నాయి అవి! వీ డెవడో రాక్షసుడే. అనుమానం లేదు! ఏ ఓడ మీదో ఈ క్రిస్టియను దేశానికి వచ్చి పడ్డాడు. పైగా తలల వ్యాపారం కూడాను; ఆ తలలు తన అన్నదమ్ములవేమో! నా తలమీద కూడా అతనికి మోజు కలుగవచ్చును. భగవంతుడా! గొడ్డలివంటి ఆ గొట్టమును చూస్తేనే చెమురుగా ఉంది!

అంతలో వాడు ఇంకొక పనిని మొదలు పెట్టగా నా కంపము పోయి, కుతూహలము పుట్టింది. వాడు నిజంగా క్రైస్తవేతరుడనే గట్టి నమ్మకం కలిగింది నాకు. కోటు జేబులో నుంచి ఒక చిన్న బొమ్మని తీశాడు. మూడురోజుల వయస్సు గల కాంగో దేశపు శిశువులాగ ఉంది ఆ బొమ్మ రూపం. వెనుకటి తలవలె ఇది కూడా భద్రపరుపబడిన ఒక పసిపాప తలేమో ననుకున్నాను. అది నున్నగా మెరుగుపెట్టబడిన కొయ్యబొమ్మ అని గమనించాను. నిజంగా కూడా అదే! అతను గది వెచ్చబడటానికి ఏర్పాటుపబడిన పొయ్యి దగ్గరకు వెళ్ళి అక్కడున్న కొయ్యబద్దలమీద తన బొమ్మని పెట్టాడు. అక్కడి పొగమాకులూ, ఇటుకలూ, అన్నీ బొగ్గుమసితో

నల్లబడ్డాయి. ఆ నల్లని విగ్రహాన్ని పెట్టటానికి అది చాలా మంచిస్థలమని అనుకున్నాను. ఆ బొమ్మవంక ఆదేపనిగా చూస్తూ తరువాత ఏమవుతుందో అని కొద్దిగా ఆందోళన పడ్డాను. సంచిలో నుంచి కొంచెం చిత్రికపొట్టుని తీసికొని ఆ బొమ్మ ముందు పెట్టాడు. ఆ పొట్టుమీద ఒక బిస్కట్టుని ఉంచి, ఆ పొట్టుకే నిప్పు అంటించాడు. ఆ మంటలో నుండి బిస్కట్టు ముక్కని బయటకు తీశాడు, బూడిదని మంటని ఊదేసి, బిస్కట్టుని ఆ చిన్నబొమ్మకి నైవేద్యం చేశాడు. కాని ఆ బొమ్మకి ఇదేమీ రుచించలేదు కాబోలు, పెదవి కదపలేదు. ఈ తతంగం అంతా చేస్తూ ఆ వేటకాడు ఏవో మంత్రాలనే చదివాడో, ఏవో ప్రార్థనలే చేశాడో కాని వింత వింత ధ్వనులు వినవచ్చాయి. అతని ముఖాన్నికూడా అంతసేపూ అదో మాదిరిగా చిట్లించుకున్నాడు. అంతా అయిన తరువాత ఆ బొమ్మని తీసి నిర్లక్ష్యంగా సంచిలో పడవేశాడు.

ఈ వింత చేష్టలన్నీ చూస్తూంటే నా భయం ఎక్కువైంది. ఇంక కొంతసేపటిలో తక్కిన పనులు కూడా పూర్తి చేసికొని మంచముమీద పడే సూచనలు కనబడ్డాయి. అలా జరగకముందే నేను మౌనము మాని నోరు విప్పితే బాగుండు ననుకున్నాను.

ఏమి అనవలెనా అని నేను ఆలోచించుకునే క్షణమే ప్రాణాంతకమైంది. మేజా మీదనుండి గొట్టమును తీసి, దీపమును ఆర్పివేసి, ఆ గొట్టమును నోటపెట్టుకొని, పళ్లు బిగించి

పొగాకు ధూమమును వదులుతూ మంచముమీదకు వచ్చాడు. నేను అవశుడనై ఒక్క అరుపు అరిచాను. వాడు ఆశ్చర్య పడుతూ పక్కమీద నన్ను స్పృశింప మొదలుపెట్టాడు. ఏదో గొణుగుకుంటూ గోడవైపుకి దొర్లి, లేచి వెళ్ళి దీపమును వెలిగింప నీయమని వానిని బ్రతిమాలుకున్నాను. కాని వానికి నా మాట అర్థం కాలేదు.

"నువ్వెవడవో చెప్పు! లేకపోతే నీ ప్రాణం తీసేస్తా" అన్నాడు. చీకటిలో ఆ గొట్టమును నామీద ఝుళిపించాడు. "ఓ హోటలాయనా! చూడు! రక్షించు! దేవతల్లారా! నన్ను కాపాడండి" అని ఆక్రోశించాను.

"బదులు చెప్పవేం? చంపేస్తా, చెప్పు! నువ్వెవడవో చెప్పు!" అంటూ ఆ రాక్షసుడు గద్దిస్తూ చేతిలోని గొట్టమును ఝుళిపిస్తూనే ఉన్నాడు. నా అరుపులు విని, లాంతరుతో హోటలువాడు గదిలో అడుగుపెట్టాడు. 'బ్రతుకు జీవుడా' అని అతని దగ్గరకు పరుగెత్తాను.

"ఇంక భయపడకండి! ఈ క్వీకెగ్ వల్ల మీకే అపాయమూ రాదు" అని ఇకిలించాడు.

"నీ ఇకిలింపు కట్టిపెట్టు. వీడు నరమాంస భక్షకుడని ముందే నాకెందుకు చెప్పలేదు?" అని నేను అరిచాను.

"వీడు తలల్ని అమ్మేవాడని ముందే చెప్పానుగా. ఆ మాత్రం అర్థం చేసుకోగలరనుకున్నాను, ఇప్పుడైనా మించి

పోయింది లేదు, వెళ్ళి పడుకోండి" అని నాతో అని క్వీకెగ్‌తో "ఇదిగో చూడు, ఈయనకూడా నీతో పడుకుంటారు, అడ్డు చెప్పకు" అన్నాడు.

"సరే" అని పొగపీలుస్తూ గొణిగి, మంచముమీద కూర్చుండే, నన్ను రమ్మంటూ సంజ్ఞ చేశాడు. ఆ పిలుపులో నాగరికతయే కాకుండా, ఎంతో దయ, ఎంతో ఔదార్యము కానవచ్చినవి. ఒంటిమీద ఎన్ని పచ్చబొట్లు ఉన్నా, పరిశుభ్రంగానే ఉన్నట్టు కనబడ్డాడు. ఆ అలజడి ఎందుకు పొందానో నాకే అర్థం కాలేదు. వాడూ నావంటి మానవుడే. వానివల్ల నాకు భయము కలిగితే, నావల్ల వానికి భయము కలగాలికదా అనుకున్నాను. తప్పతాగిన క్రైస్తవునితో పండుకొనటకంటె ఒళ్ళు తెలిసివున్న నరమాంస భక్షకునితో కలిసి పడుకోవటమే నయంకదా!

హోటలు యజమానితో ఇలా అన్నాను. "పొగతాగటం మాని ఆ గొట్టమును అవతల పెట్టమని ఇతనితో చెప్పు. అప్పుడుగాని నేను ఇక్కడ పడుకోనలేను. నా పక్కలోనివాడు పొగతాగట మనేది నేను సహించలేను. అది చాలా అపాయం కూడాను. పైగా నేను జీవితాన్ని భీమా కూడా చేసుకోలేదు."

ఈ మాటల్ని హోటలువాడు క్వీకెగ్‌కి తెలుపగా అతను అందుకు ఒప్పుకొని గొట్టము అవతలపెట్టి దాక్షిణ్యంతో నన్ను మంచము మీదకి రమ్మని, నన్ను

ఏ విధంగాను తాకను అన్నట్టుగా ఆవలివైపుకి ఒత్తిగిలి పడుకున్నాడు.

హోటలు యజమానిని నమస్కారముతో పంపివేశాను. మంచముమీద చేరి, ఎన్నడూ ఎరుగని సుఖ నిద్రపోయాను.

4. పక్క దుప్పటి

తెల్లవారి లేచేప్పటికి, ఆ మంచముమీది దుప్పటి ఎన్నో రంగుల కల అతుకులబొంత. అతని చేతిమీది పచ్చబొట్లుకూడా ఎన్నో రంగులు కలవే. ఎండకి నల్లబడిన చెయ్యి ఆ దుప్పటిలో ఒక భాగం అయిపోయింది. ఆ చేతి భారము వల్ల అతడు నన్ను కౌగలించుకొన్నట్టు గ్రహించాను.

నాకు కలిగిన స్పర్శబోధ వింతగా ఉంది. అది ఎట్టిదో వివరిస్తాను. నా చిన్నతనంలో ఇటువంటిదే ఒకటి తటస్థించింది. అది నిజంగానే జరిగిందో, స్వప్నమో నాకు నిర్ధారణ కాలేదు. ఏదో కొంటెచేష్ట చెయ్యబోయాను కాబోలు. అంతకుముందే ఎవడో పొగగొట్టాల్ని ఎక్కడం చూచా ననుకుంటాను; నేనూ ఎక్కబోయాను. నాకు సవతితల్లి ఉండేది. ఆవిడ ఏదో ఒక కారణంవల్ల నన్ను చావగొట్టుతూ, తిండి పెట్టక నిద్రపొమ్మంటూ ఉండేది. ఆవిడ నన్ను చూసి, క్రిందకి లాగి, పడుకోమ్మని పంపించివేసింది. అది జూన్ 21 వ తారీకు. వేసవి అగుటచేత దీర్ఘమైన పగలుగల రోజు. అది పట్టపగలే అయినా, నాకు ఎంతో భయము వేసింది. కాని తప్పేది ఏమీ లేదు. మూడవ అంతస్థులో ఉన్న నా చిన్న గదిలోకి వెళ్ళాను. వీలైనంత తాపీగా నా బట్టలు విప్పుకొని పక్కమీద పడ్డాను. దిక్కుమాలిన వాడనై పడుకున్నాను.

నాకు విమోచన రావాలంటే ఇంకొక పదహారు గంటలు గడపాలి కదా అని లెక్కపెట్టుకున్నాను. అది తలచుకుంటేనే నా నడుము కుంగిపోయింది. కిటికీగుండా వెలుగులోనికి వస్తోంది. వీధిలో బళ్లు అటూ ఇటూ వెళ్లే చప్పుడు, ఇంట్లో ఏదో సరదాగా వినిపిస్తున్న కంఠధ్వనులు! వీటివల్ల నా బాధ మరీ ఎక్కువైంది. చివరికి లేచి, బట్టలు వేసికొని, నెమ్మదిగా క్రిందకి వెళ్ళి మా సవతితల్లి పాదాలమీద పడ్డాను. నేను చేసిన అల్లరికి చెప్పుతో కొట్టి శిక్షించమని బ్రతిమాలాను. మరి ఏ శిక్ష అయినా సరే అన్ని గంటలు పడివుండమనటం కంటె మంచిదన్నాను అందరి సవతితల్లుల వలెనే ఆమె జాలి చూపని నిజాయితీపరురాలు అవటంవలన నన్ను మళ్ళీ గదిలోకి పంపివేసింది. చాలాసేపు అలాగే మేలుకొని పడుకున్నాను. అంత బాధని నేనెప్పుడూ అనుభవించలేదనుకుంటా. చివరికి నాకు తెలియకుండానే కన్ను మూశాను. మగతగా కళ్లు విప్పేటప్పటికి గది అంతా చీకటి మయమయినట్టు కనబడింది. ఏదో భయం నన్ను ముంచేసింది. ఏమీ కనబడదు. ఏదీ వినబడదు. కాని యెవరిదో, నాకు తెలియని చెయ్యి నా చేతిలో ఉన్నట్టు అనిపించింది. నా చెయ్యి పరుపుమీద నుండి క్రిందికి జారి ఉంది. ఆ రెండో చెయ్యి నాకు తెలియని, నేను ఊహింపలేని ఏ భూతానిదో! ఆ భూతం నా ప్రక్కనే కూర్చున్నట్టు అనిపించింది. ఎన్నో యుగాలుగా బిగుసుకుపోయిన ప్రాణివలె అలాగే పడుక్కున్నాను. ఒక్క అంగుళం మేర జరిగితే ఆ భయం పోతుం

దేమో కనుకుంటూనే చెయ్యి కదపటానికి ధైర్యం చెయ్య లేక పోయాను. ఆ స్వప్నానుభవం ఎట్లా మాసిపోయిందో చెప్పలేను కాని మర్నాటి పొద్దున్న ఆ సంఘటనను అంతా జ్ఞప్తికి తెచ్చుకొని వణికిపోయాను. ఆ తరువాత ఎన్నో రోజులు, మాసాలు ఆ రహస్య మేమిటో తెలిసికుందామని ఎన్నో వ్యర్థప్రయత్నాలు చేశాను. ఈ క్షణం వరకు నాకు ఆ సంగతి అర్థంకానిదే !

ఈనాడు, తెల్లవారి నిద్ర లేవగానే క్వీకెగ్ చెయ్యి నా మీద ఉండటం గమనించగా, భయము తప్ప ఆ నాటి లక్షణములన్నీ ఉన్నాయి. చివరకి గడచిన రాత్రియొక్క సంఘటనలు - ఒకదాని వెంట ఒకటి జ్ఞాపకం వచ్చాయి. మిగిలినదల్లా ఒక్కటే ! అదే హాస్యాస్పదమైన నా అవస్థ. నెమ్మదిగా అతని చెయ్యిని తప్పిద్దామనుకున్నాను కాని, మమ్మల్ని ఇద్దరినీ మృత్యువు తప్ప వేరే ఏదీ ఎడబాటు కలిగింపలేదన్నట్టుగా అతను మరీ గట్టిగా వాటేసుకున్నాడు. అతనిని లేపుదామని ప్రయత్నించాను. 'క్వీకెగ్' అని పిలిచాను. ఒక్క గురక మాత్రమే అతని జవాబు! నేను ఇంకో వైపుకి దొర్లాను; నా మెడని ఏదో గీసుకున్నట్లు అయింది - చూద్దును కదా, అతని పొగగొట్టం అని స్పష్టమయింది. ఇరుకునే పడ్డాననుకున్నాను. పగటిపూట- క్రొత్త యిల్లు - నరభక్షకుని పొత్తు - గొడ్డలివంటి పొగగొట్టము వాని చేతిలో ఇమిడి ఉండటం - ఏమి వింత అనుకున్నాను ! “క్వీకెగ్, నీ పుణ్యముంటుంది లేవయ్యా” అన్నాను. సాటి

మగవాణ్ణి అలా కావలించుకొని పడుకోవటం ఏమీ బాగుండదని ఎన్నో సార్లు నచ్చచెప్పటం వల్లా, ఎన్నో సార్లు నేనే అటూ ఇటూ దొర్లడంవల్లా, చివరికి అతనిని లేపగలిగాను. లేచి, నీళ్ళలోనుండి బయటపడిన కుక్కవలె ఒళ్ళు విదలించుకొని నిలువున కూర్చున్నాడు. కళ్ళు నులుముకుంటూ నే నెవణ్ణో, అక్కడికి ఎలా వచ్చానో తెలియనట్టుగా కొంచెము సేపు తేరిపార చూసి అంతలో తెప్పరిల్లి, గుర్తువచ్చినట్టు చూపు పెట్టాడు. అంతసేపూ ఆ వింత మనిషిని పరీక్షిస్తూ ప్రశాంతంగా పడుకున్నాను. చిట్టచివరికి అతనికి తనతో పడుకున్న నే నెవడనో గుర్తువచ్చిందికాబోలు ఒక్క గంతులో మంచము దిగి ఏదో సంజ్ఞలతో, నా అనుమతి అయితే తాను ముందు బట్టలు తొడుక్కుంటానని సూచించాడు. ఆ తరువాత, నేనే గదినంతా వాడుకోవచ్చునని కూడా సూచించాడు. అతని ప్రవర్తన చాలా నాగరికంగా ఉన్నదని సంతోషించాను. మీరు ఏమనుకున్నా సరే గాని, అనాగరికులకే మనకంటె ఎంతో మర్యాద, నమ్రత తెలిసి ఉంటాయి. నేను అతని పట్ల ఎంతో కటువుగాను, అసభ్యముగాను ప్రవర్తించాను. కాని, అతను నా యెడ ఎంతో మర్యాదగా, నాగరికంగా ప్రవర్తించాడు. కనుక అతను నాకు అభివందనీయుడు, అభినందనీయుడు కూడా.

అతను దుస్తులను వేసికోవటం, టోపీ పెట్టుకోవటంతో ప్రారంభించాడు. పంట్లాము తొడుక్కోకుండానే బూట్లు కోసం వెతకటం ప్రారంభించాడు. మరు క్షణం చేతిలో

బూట్లు, తలమీద టోపీని ఉంచుకొని మంచం క్రిందకు దూరాడు. అక్కడనుంచి వినిపించిన మూలుగు వలన అతను బూట్లని తొడుగుకొనటానికి పడే బాధ కాబోలు ననుకున్నాను. అసలు, బూట్లని తొడుగుకునేప్పుడు అలా ఏకాంతంగా ఉండాలన్న నియమాన్ని నే నెక్కడా చూడలేదు, వినలేదు. ఇతడు అటు ఆటవికులకు, ఇటు నాగరికులకు మధ్య ప్రపంచం లోని వ్యక్తి. గొంగళీపురుగు, సీతాకోక చిలుకగా పరివర్తన చెందే నడిమి అవస్థలోనివాడు. తన విశిష్టతను విపరీత పద్ధతులలో ప్రదర్శించే పాటి నాగరకత కలవాడు. అతను ఇంకా చదువు పూర్తిచేసి పట్టాపుచ్చుకున్నవాడు కాదు. అర్ధ సంస్కారి. దాని వల్లనే బూట్లు తొడుగుకోవటంలో అంత తాపత్రయం పడ్డాడు. అలాగే, ఆటవికుడు కనుక మంచము క్రిందకు దూరటానికి సంకోచించలేదు. ఎట్టకేలకు బయటకు వచ్చాడు. అతని టోపీ అంతా నలిగిపోయి, ముందుకు జారి కళ్ళని కప్పివేసింది. ఈవలకు వచ్చి కుంటుకుంటూ నడవటం ప్రారంభించాడు. ఆ బూట్లు అతనికి అలవాటు కాలేదు కాబోలు! అవి అతనిని కరిచాయేమో కూడాను.

కిటికీలకు తెరలు లేవు. వీధి చాలా సన్నగా ఉండటం వలన ఎదురింటి మేడమీది వారికి మాగది స్పష్టంగా కనబడు తుంది. క్వీక్వెగ్‌కి టోపీ, బూట్లు తప్ప ఇంకేమీ లేకపోవటం వలన అతనిని సింగారం త్వరగా పూర్తికానివ్వమని, ముఖ్యంగా పట్లాముని సాధ్యమయినంత త్వరగా తొడుక్కో మని వేడుకొన్నాను. అతడు అట్టే కానిచ్చి ఒళ్లు కడుక్కో

వటం మొదలు పెట్టాడు. అంత పొద్దునవేళ ఎవరైనా ముఖమే కడుక్కుంటారు. కాని ఆశ్చర్యం! ఈ క్వీక్వెగ్ చేతులని, ఛాతీని మాత్రమే కడుక్కుని ఆపేశాడు. తన చిన్న కోటుని తొడుక్కుని బేసిన్‌లోని నీళ్ళల్లో ఒక సబ్బుబిళ్ళని ముంచి, ఆ నురగని ముఖమంతా పులుముకున్నాడు. గెడ్డం చేసుకునే కత్తిని ఎక్కడ పెట్టాడా అని నేను విస్తుపోయాను. పక్క మీద నుంచి ఈటెని తీశాడు. దానికి ఉన్న పొడుగాటి కొయ్యపిడిని లాగివేసి, ఉక్కు మొనతో గెడ్డమును గీయటం మొదలు పెట్టాడు. బాగానే ఉంది ఈ పద్ధతి అనుకున్నాను. ఆ ఈటె మొన ఎంత వాడిగలదో తెలిసిన తరువాత పోగా పోగా ఈ పద్ధతి గురించి అంత ఆశ్చర్యపోవటం మానుకున్నాను.

అతని మిగిలిన సింగారమంతా కొద్ది సేపట్లో అయిపోతుంది. తనపై కోటుని తొడుక్కొని, ఈటెని చేతిలో పట్టుకొని, సగర్వంగా గదిలోనుంచి బయటకు వెళ్ళిపోయాడు.

5. ప్రాతరాశము

వెంటనే నేను అతనిని వెంబడించాను. మద్యపానము సప్లై చేసే గదివైపు వెళ్తూ దారిలో హోటలువానిని సరదాగా పలుకరించాను. అతడు, రాత్రి నాతో సహవసించిన మిత్రుని గురించి కొంత గూఢము ఉంచాడనే ద్వేషము నాకు లేక పోయింది. ఏది ఎట్లైనా, మనసారా ఒకసారి నవ్వటం చాలా మంచిది! అది అందరికీ చేతకాదు. ఇతరులకి నవ్వు తెప్పించ గలగటం లజ్జాకరము కాకపోగా, ఇతరులను సంతోషపెట్ట గలిగినందుకు తానూ ఆనందపడదగ్గ విషయం. అంతేకాదు, ఎవ్వరిలోనైనా ఇతరులని నవ్వించదగ్గ సమర్థత ఉంటే, అతనిలో మనకి కానరాని ఘనత ఉన్నదన్నమాట.

మద్యపానపు గదిలో క్రమంగా జనులు పడుతున్నారు. గడచినరాత్రి నేను సరిగ్గా చూడనివాళ్ళు, ఒక్కొక్కళ్ళే అందులో ప్రవేశిస్తున్నారు. వాళ్ళం[illegible]రపు వేటలకి సంబంధించిన వాళ్ళు, ఓడల్లో పనిచే[illegible]అందరూను.

[illegible]

న్నారో ఇట్టే చూసి చెప్పవచ్చు. [illegible] మొగము ఎర్రగా ఎండతో మాగిన పండులాంటి రంగు కలది అనుకోండి, వాడు తూర్పు దిక్కునుండి వచ్చి మూడు రోజులే అయివుంటుం దన్నమాట... ఇంకొకనికి తూర్పువైపున సంపాదించిన

నలుపు కొద్దిగా మిగిలి ఉన్నా, మొత్తముమీద రంగు విరిగిం దనుకోండి. అతను రేవుకి చేరి చాలా వారాలైందనే అనుకో వచ్చు. కాని క్వీకెగ్ లాంటి ముఖము ఎవరికి ఉంటుంది? ఆ ముఖాన ఎన్నో వన్నెలు ఉంటాయి. భిన్న భిన్నాలైన వాతావరణాలు కల ఏండీస్ పర్వత పంక్తియొక్క పడమటి వంపులాగ!

"తిండికి రండగొయ్యాయ్" అంటూ హోటలువాడు తలుపు తీశాడు. మేమందరం భోజనశాలలో ప్రవేశించాం. ప్రపంచము నాలుగు మూలలా చూసినవాళ్ళు ఎటువంటి చోటనైనా ఎబ్బెరికం లేకుండా కలసి మెలసి ఉండగలుగు తారని అంటారు. కాని అందరూ అల్లా ఉండలేరు. న్యూ ఇంగ్లండుకి చెందిన లెడ్యార్డు, స్కాట్‌లాండ్‌కి చెందిన మంగో పార్కు అనేవాడు ఈ సిద్ధాంతానికి అపవాదము. ఐతే ఒకటి లెడ్యార్డులాగ సైబీరియాలో కుక్క బండిలో వెళ్ళటం కాని, మంగోపార్కులాగ ఆకలిబాధ ఉన్నా ఆఫ్రికా అడవులలో ఒంటరిగా నడవటంగాని నాగరికత అలవర్చుకునే లక్షణాలు కావు!

ఫలహారానికి కూర్చుని నలుగురూ చెప్పే తిమింగి లాల కథలని విందామనుకున్న నేను, వాళ్ళందరి మౌనాన్ని చూసి ఆశ్చర్యపోవటంవల్ల ఈ మాటలు అనవలసి వచ్చింది. అంతే కాదు, వాళ్ళంతా ఏకో సిగ్గుపడుతున్నట్లు కూడా అని పించింది. వీళ్ళంతా సముద్రయోధులు, బ్రహ్మాండమైన తిమింగలాలని సముద్రాలలో ఎదుర్కొని ఏమాత్రమూ వెను

కాదక వాటితో భీకరంగా పోట్లాడి చంపినవాళ్ళు! ఐనా, ఈ ఫలహారాల దగ్గర ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా, బెదురుతూ ఒకరి నొకరు వేట మొగములతో చూస్తూ కూర్చున్నారు. విచిత్రమైన దృశ్యమే! బిడియపడే ఎలుగు బంట్లు, పందలైన సముద్రయోధులు!

క్వీకెగ్ మాత్రం పంక్తి మొదట్లో, నిశ్చలంగా కూర్చున్నాడు. అతని పుట్టుపూర్వోత్తరాలని గురించి ఎక్కువగా ఏమీ చెప్పలేము. అతనిని ఎంతగా అభిమానించేవాడు కూడా, అతను చేత ఈటెని పట్టుకొనిరావటం మాత్రం సహించలేడు. ఆ ఈటెని తెస్తే తెచ్చాడు. దానితో దూరాన ఉన్న మాంసపు ముక్కలని, అందరి తలలమీదనుంచి, లాగటం కూడా మొదలుపెట్టాడు! కాని, ఇంత పనినీ చాలా ప్రశాంతంగా చేసేశేవాడు. ఏ పనినైనా ప్రశాంతంగా చెయ్యటమంటే నాగరికంగా చెయ్యడ మనన్న మాటేగదా! కాఫీని, రొట్టెలని పూర్తిగా విడిచిపెట్టేసి మాంసపు ముక్కలమీదే దృష్టిని ఎక్కువ నిలిపిన అతని భోజన రుచులను గురించి ఏమని చెప్పాలి! ఫలహారమయ్యాక అందరిలాగానే ఇవతలి గదికి వచ్చి, ఒక మూల కూర్చుని తన పైప్‌ని అంటించాడు. పొగని పీలుస్తూ తిన్నదానిని జీర్ణం చేసుకోవటం ప్రారంభించాడు. అతను అట్లా ఉండగా, బయటకు వెళ్ళాను.

6. వీధి

క్వీక్వెగ్ వంటి అనాగరికుడు ఆ నగరంలో ఉండటం చూసి నేను పడిన ఆశ్చర్యం, న్యూబెడ్ ఫోర్డ్ నగరపు వీధులలో; మొదటిసారిగా, పట్టపగలు నడవటంతో మాయమైపోయింది.

రేవు దగ్గరగా ఉన్న వీధులలో విదేశాలనుంచి వచ్చే అనామకులు, అనేక రకాలవాళ్ళు విశేషంగా కనబడటం మామూలే. బ్రాడ్ వే చెస్‌నట్ వీధుల్లో కూడా మధ్యధరా సముద్రప్రాంతపు నావికులు, బెదురుతూన్న ఆడవాళ్లని రాచుకుంటూ వెళ్తుంటారు. రీజెంట్ వీధి లాస్కార్లకు మలయా వాళ్ళకి తెలియనిది కాదు. అలాగే, బొంబాయిలో ఎపోలోగ్రీన్ యందు, అమెరికావాళ్ళు అక్కడి వాళ్ళని బెదరగొట్టడమూ కద్దు. కాని, వాటర్ స్ట్రీట్ కంటె వేపింగ్ కంటె న్యూబెడ్ ఫోర్డ్ మరీను. ఈ రెండు చోట్లా కేవలం నావికులనే చూస్తాం. కాని న్యూబెడ్ ఫోర్డులో, స్వేచ్ఛమైన నరమాంస భక్షకులు వీధి మలుపులలో మాట్లాడుకోవటం చూస్తాం. కొత్తగా ఆ ఊరికి వచ్చినవాడు దిగాలుపడి చూస్తాడు!

ఫీజియన్లు, టాంగుటాబోర్లు, ఎర్రోమాంగన్లు, పనంగయన్లు, బ్రిగియన్లు— ఈ భిన్నభిన్న జాతులువారే కాక, వీధుల వెంట అలక్ష్యంగా వెళ్తూవుండే తిమింగిలాల వేటకి పనికి

వచ్చే సామగ్రియేగాక, ఆ నగరవీథులలో ఇంకా విచిత్రమైనవి, నవ్వు గొల్పేవి చాలా దృశ్యాలు కనబడతాయి. ప్రతి వారము, వెర్మోంట్ కి న్యూ హేంప్ షైర్ కి చెందినవాళ్ళు అసంఖ్యాకంగా, తిమింగిలాలని వేటాడే లాభమూ, గౌరవమును పొందటానికి అక్కడికి వస్తూంటారు. వాళ్ళంతా యుక్తవయస్కులు, దృఢకాయులూను, ఒకప్పుడు అడవులలో మహావృక్షములను పడగొట్టిన ఆ వీరులు గొడ్డలినివిడచి ఈటెని చేబుచ్చుకొని తిమింగిలపు వేటకి తయారైనారు. వారిలో చాలామంది, వాళ్ళదేశపు పర్వతాలవలెనే ఆకుపచ్చగా ఉంటారు. ఒక్కొక్కసారి వాళ్ళని చూస్తే ఇప్పుడే పుట్టిన పసికందు లేమో అనిపిస్తుంది. అదిగో! వీధిమలుపు తిరిగే ఆ కుర్రవాడిని చూడండి! ఒక పెద్ద టోపీని పెట్టుకొని నిడుపాటి కోటుని తొడుక్కుని, నావికునిలాగ నడుం పట్కా పెట్టుకొని దానిలో ఒక చిన్న కత్తిని ఎట్లా దోపుకున్నాడో! నిడుపాటి కోటుని వేసుకొని ఇటువైపు ఇంకొకడు వస్తున్నాడు!

బస్తీలో పుట్టి పెరిగిన ఏ షోకిల్లాకూడా పల్లెటూరి షోకిల్లాతో సరితూగడు! పల్లెటూరి షోకులమారి అంటే పొలం దున్నుతూ చేతులు కందకుండా గుడ్డ తొడుగులు వేసుకునేవాడు అని అర్థం! ఇటువంటి పల్లెటూరి షోకులమారి ఘనంగా పేరు సంపాదించాలని అనుకుంటూ, తిమింగిలాల వేటగాళ్ళతో చేరాడనుకోండి. బస్తీకి చేరగానే వాడు చేసే తమాషాలన్నీ చూచి తీరాల్సిందే. సముద్రయానానికై కావలసిన బట్టలని కుట్టించుకునేప్పుడు చిన్నకోటుకి ఖరీదైన

గుండీలని, పంజ్లాముకి పట్టీలనీ పెట్టించుకుంటాడు. పిచ్చివాడా! నీవ్వూ, నీ పంజ్లాము, నీ పట్టీలు, నీ బూత్తాములు అన్నీ తుఫాను కొట్టినప్పుడు ఇట్టే పటాపంచలయిపోతారు, ఏమనుకున్నావో!

ఈ నగరంలో కేవలం నరమాంస భక్షకులు, పోకిల్లాలు, తిమింగిలపు వేటగాళ్ళుమాత్రమే ఉన్నారనుకోకండి. అట్లా కానేకాదు. న్యూబెడ్ ఫోర్డ్ విచిత్రమైన ప్రదేశం! తిమింగిలపు వేటగాళ్ళే లేకపోతే, ఆ ప్రాంతంకూడా లాబ్రడార్ తీరంవలె నిర్జనమై భయంకరంగా ఉండేదే! ఇప్పుడు కూడా కొన్ని భాగాలు భయంకరంగానే ఉంటాయి. న్యూ ఇంగ్లండు అంతటిలోను, న్యూ బెడ్ఫోర్డే ఎంతో హాయిని కొల్పే పట్టణము. అక్కడ చమురు దొరుకుతుంది, నిజమే, కాని, కెనాన్ వలె ఉండదు. అది ద్రాక్ష, జొన్న పండే తావుకూడాను. ఆ ఊరు సిరిసంపదలతో తూగుతూ ఉండదు నిజమే. అయినా, అమెరికా అంతటిలోను ఆ ఊరిలోవలె గంభీరమైన ఇళ్ళుగాని, పచ్చగా ఉండే తోటలుగాని, విహార వనాలుగాని ఎక్కడా కనబడవు. ఇవన్నీ ఎక్కడనుంచి వచ్చాయి! ఒకప్పుడు, బీడువారిపోయిన ఈ నేలమీద ఇవన్నీ ఎలా మొలిచాయి!

ఆ భవనాన్ని అలంకరించి ఉన్న ఆ ఈటెలని చూడండి, మీ ప్రశ్నలకి సమాధానం దొరుకుతుంది. ఈ గంభీరమైన ఇళ్ళూ, ఈ పూలతోటలు అన్నీ అట్లాంటిక్ పసిఫిక్ హిందూమహాసముద్రాలనుంచి వచ్చాయి! ఇవన్నీ

ఆ మహాసముద్రాల గర్భాలనుండి కొని తేబడినవే! అలెగ్జాండరు అటువంటి మహాకార్యాం చెయ్యగలడంటారా?

న్యూబెడ్‌ఫోర్డులో గృహస్థులు తమ కుమార్తెలకు ఆరణంగా తిమింగిలాలని ఇస్తారని, ఇతర సముద్ర జంతువులని మేనకోడళ్ళకి ఇస్తారనీ అంటారు. ఎంతో శోభస్కరమైన వివాహమును చూడాలంటే న్యూబెడ్‌ఫోర్డుకే వెళ్ళాలి. అక్కడ ప్రతి యింటిలోను మణుగులకొద్ది తిమింగిలాల నూనె ఉంటుందట. ప్రతిరాత్రి తిమింగిలపు కొవ్వుతో తయారు చెయ్యబడ్డ వత్తులని అదేపనిగా వెలిగిస్తూంటారుట.

వేసవిలో ఊరు ఎంతో ముద్దులమూట కడుతూ వుంటుంది. వీధులకి అటూ ఇటూ ఉండే చెట్లు పచ్చగా ఉంటాయ్. ఆగస్టులో, గుబురులుగా, పూచిన పూల దొంతరలు బాటసారికి చేతికి అందుతూ ఉంటాయి. 'కళ' ఎంత శక్తివంతమో న్యూబెడ్‌ఫోర్డులో చూడవచ్చు. ప్రకృతి సృష్టిలో రాళ్ల గుట్టలతో వెలసిన ఆ ప్రదేశాన్ని పూల పందిళ్లతో నింపివేసింది కళ! ఇక అక్కడి స్త్రీలు ఎర్ర గులాబీల వలె వికసించి యుంటారు. కాని గులాబీలు వేసవిలోనే వికసిస్తే ఆ పడుచుల చెంపలు ఎప్పుడూ కెంపు వర్ణంగానే, స్వర్గంలో సూర్యకాంతివలె ఉంటాయి. ఒక్క సేలంలో తప్ప అటువంటి ఛాయ ఇంకెక్కడా కనబడదు. సేలంలోని పడుచులు కస్తూరి గుబాళింపులని వెదజల్లుతారట. వాళ్ళని ప్రేమించే నావికులు ఎన్నో మైళ్ళ దూరాన ఉండికూడా మొలక్కా ద్వీపాలకి చేరుతున్నట్టు భావిస్తారు!

7. చర్చి

న్యూబెడ్‌ఫోర్డులో ఈ తిమింగిలపు వేటగాళ్లకి ఒక చర్చి ఉంది. ఇక కొద్ది రోజులలో ఏ పసిఫిక్ మహాసముద్రానికో, హిందూమహాసముద్రానికో బయలుదేరే వేటగాళ్ళు ఆ చర్చికి ఆదివారంనాడు తప్పక వెళ్తారు. నేనూ వెళ్లాను.

ఒకసారి అటు తిరిగివచ్చి, మళ్ళీ ఈ పనిమీద బయటకు వెళ్ళాను. అప్పటివరకు నిర్మలంగా ఉన్న ఆకాశమూ, చల్లగావున్న వాతావరణమూ మారిపోయాయి. విపరీతంగా మంచు పడటం ప్రారంభించింది. నా ముతకకోటుని తొడుక్కుని ఆ తుఫానులో బయటికి వెళ్ళాను. చర్చిలో అడుగు పెట్టగానే, నావికులు, వాళ్ళ భార్యలు వున్న ఒక చిన్న గుంపుని చూశాను. తుఫాను హోరుతప్ప వేరే శబ్దము ఏమీ లేదు. వారిలో కొందరు ఎవరి మనోవ్యథ వారిదే అన్నట్టుగా, ఇంకొకరితో సంబంధం లేకుండా ఒంటరిగా కూర్చుని ప్రార్థనలు చేసుకుంటున్నారు. కొందరు, గోడలకి పొదుగబడివున్న పాలరాతి పలకలవైపు చూస్తున్నారు. ఆ పలకలపై ఏవో మాటలు చెక్కబడి ఉన్నాయి. వాటిలో మూడు ఈవిధంగా వున్నాయి.

18౩6 నవంబరు 1 వ తేదీన

తన పదునెనిమిదవయేట పెటగోనియా,ఐల్ ఆఫ్ డెసా లేషన్ సమీాన ఓడమీాదనుండి పడిపోయిన

జాన్ టాల్బట్

పవిత్రస్మృతికి; అతని సోదరిచే వేయించబడిన చిహ్నము

"18౩6 డిసెంబరు 31 వ తేదీన

పసిఫిక్ మహాసముద్రములో, తిమింగిలముచే ఈడ్చివేయ బడ్డ "షిప్ ఎలీజా" యొక్క నావికులు రాబర్టులాంగ్ విల్లిస్ ఎవెరి, నాథన్ కోల్ మన్, సేత్ మేసి సామ్యుల్ క్లీగ్లే

పవిత్రస్మృతికి, ఆ ఓడలో మిగిలిన ఇతర నావికులచే ఈ స్మారక చిహ్నము వేయించబడినది

1833, ఆగస్టు 3 వ, తేదీన

జపాను తీరములో పడవమీాద నుండగానే తిమింగిల ముచే వధింపబడిన

కెప్టెన్ ఎజికీల్ హార్డీ

పవిత్రస్మృతి చిహ్నముగా, ఆమన వితంతువుచే వేయించబడిన ఫలకము"

నా కోటుమీదా, టోపీమీదా పడిన మంచుని దులిపి వేసికొని, తలుపుకి దగ్గరగా కూర్చున్నాను. నా సమీపానే క్వీకెగ్ కూర్చుని ఉండటం చూసి ఆశ్చర్యపోయాను. ఆ గంభీరమైన వాతావరణం వలన కాబోలు అతని ముఖంలో, ఆశ్చర్యం కొలిపే జిజ్ఞాస కనబడినది. ఆ గోడలమీద వ్రాయబడివున్న మాటలని చదువలేనివాడు అతనొక్కడే అవటం వలన, నా రాకని గమనించాడు. అక్కడ సమావేశమైన వారిలో, ఆ ఫలకాలమీద ఉన్న పేర్లుగల నావికుల బంధువులెవరైనా ఉన్నారో లేరో చెప్పలేను, కాని అక్కడి స్త్రీల మొగములలో తీరని బాధ ఏదో స్పష్టం అవుతూనే ఉన్నది. ఆ ఫలకాలు వాళ్లల్లో కొందరికైనా మానీ మానని పాత గాయములను కదిపి రక్తము స్రవించేటట్టుగా చేస్తున్నాయి.

నేలమీద తమ ఆప్తుల ప్రాణాలుపోతే, ఆ ప్రాంతాలకి వెళ్ళి 'ఈ మొక్కల క్రిందనే నా ప్రియతముడు శయనించాడు' అని అనుకునే మీకు, ఇక్కడ చేరి వున్నవాళ్ళ మనస్సులలో ఉండే వేదన తెలియదు. అస్థి శేషరహితమైన ఆ శూన్యమును కప్పివున్న ఆ ఫలకములు ఎంత హృదయ విదారకము! నీరసమైన ఆ శబ్దములలో ఎంత నైరాశ్య మున్నది! శ్మశానము, స్థావరము అంటూ లేక సమసిపోయిన ఆ జీవులకి పునరుత్థానమును లేకుండా చేసి, మత విశ్వాసము లన్నిటికీ గొడ్డలిపెట్టువంటి ఆ వాక్యములకు ఏమి అర్థంవుంది! ఆ ఫలకాలు ఇక్కడవున్నా, ఎలిఫెంటా గుహాలలో ఉన్నా నిర్విశేషమే!

జీవరాసుల జనాభా లెక్కలలో, మరణించిన మానవాళిని ఎవరు చేర్చారు? "ఇసుక రేణువులకంటె ఎక్కువ రహస్యాలు వారిలో దాగివున్నా, వాళ్ళు ఒక్క మాటకూడా పైకి "అనరు" అన్న సామెత లోకంలో ఎలా వ్యాపించింది?

ప్రపంచములో ఏ మారుమూలకో పయనమైన వాడిని ఎప్పుడూ ఆ విధముగా వర్ణింపమే! సిన్న ఈ లోకాన్ని విడిచినవాడి పేరుకి ఎందుకా మహత్తర శబ్దమును జతపరుస్తాము? అరవై శతాబ్దాలకు పూర్వము మరణించిన ఆడాము ఏ నిశ్చల సమాధిలో పడివున్నాడు? మనకు తెలియని ఆనందంలో ఉన్నారని తెలిసికూడా చనిపోయినవారి గురించి మనము ఊరట చెందము, ఎందుచేత? మరణించినవారి నోరు కప్పివేయాలని బ్రతికివున్న వారంతా ఎందుకు అంత తాపత్రయపడుతారు? స్మశానంలో చిన్న అలజడి కలిగిందన్న ఒక చిన్న పుకారు నగరాన్నంతా భయంతో ముంచేస్తుంది, ఎందుచేత? వీటన్నిటికీ అర్థాలు లేకపోలేదు!

కాని, నమ్మకమన్నది మృత్యువుమీదే ఆధారపడుతుంది. గతించిన వాటినుండే జీవము పోసుకుంటుంది.

నేను తిమింగిలపు వేటకు బయలుదేరుతూ ఆ దుర్దినమున, ఆ మసక వెలుగులో, ఆ తిమింగిలపు వేటగాండ్ర జీవితచరిత్ర సంకేతములైన ఆ ఫలకములను ఏ భావముతో చదివానో వివరింప నక్కరలేదు.

"ఇష్మెయిల్, నీ గతికూడా అంతే అవవచ్చు!" అని అనుకున్నాను. కాని, త్వరలోనే తేరుకున్నాను. చిన్న

పడవ నాకు అమరత్వమును ఇప్పించగలదు, ఇదికూడా మంచి అదనే!

తిమింగిలపు వేట మృత్యువుతో చెలగాట!! ఏ సందడీ లేకుండా చిటికలో మనిషిని అనంతత్వములోకి విసిరివేస్తుంది. అయితేనేమి? అసలు ఈ చావు బ్రతుకుల, గురించి మనకు సరియైన అభిప్రాయములు లేవు. శరీరమును వెన్నంటియుండే ఆత్మ, ఛాయ అంటారుగాని, ఆ ఛాయయే సత్యపదార్థము. ఆధ్యాత్మిక విషయాలను ఆలోచించేప్పుడు మనము కూపస్థమండూ కాలము. ఆత్మిక జీవితము వడపోయగా తేరిన మడ్డి ఈ శరీరము. ఈ శరీరమంటన్నా పోవుగాక! ఎవరైన తీసికొను గాక! అది నేను కాను.

నన్‌టుకెట్‌కి ముమ్మారు జే! జే! పడవని రానీ ఏమైనా కానీ, నా నిశ్చయానికి మాత్రం తిరుగులేదు!

8. ధర్మ వేదిక

నేను కూర్చున్న ఒకింతలో వయస్సులో మళ్ళిన ఒక వృద్ధకాయుడు ప్రవేశించాడు. ఆయన లోపలికి అడుగు పెట్టగానే తుఫానుగాలికి తలుపు కొట్టుకొన్నది. అక్కడ వున్న వారంతా, ఆయనవంక భక్తితో చూశారు ఆయనే మత గురువు అని ఊహించగలిగాను. ఆయన ఫాదర్ మేపల్. తిమింగిలాల వేటకాండ్రందరూ ఆయనను ఆ పేరుతోనే సబహుమానంగా పిలుస్తారు. ఆయన చిన్నప్పుడు నావికుడుగా తిమింగిలాల వేటగాడుగా జీవించాడు. కాని, చాలా సంవత్సరాలుగా, మతగురువుగా కాలం గడుపుతున్నాడు. ఇప్పుడు ఆయనకు ముసలితనం వచ్చినా, మంచి ఆరోగ్యవంతుడుగానే వున్నాడు. ఆయనకు అపరయౌవన దశ వస్తూవున్నదా అన్నట్టు పొడకట్టుతుంది. మొగములోని ఆ ముడతలలో శిశిరర్తు హిమము క్రిందనుండి తొంగిచూచు వసంతఋతు లతాంకురము వలె ఒక వింత కాంతి ప్రసరిస్తూవుంది ఆయన పూర్వచరిత్ర నెరిగిన వారెవరైనా ఆయనను చూడగానే ఎంతో వుత్సుకత్వము చూపుతారు. దీనికి కారణం, సముద్రాలపై ఆయన గడిపిన జీవితపు అనుభవాలు ఆయనలో మతగురు విశిష్ట లక్షణాలుగా సహజ పరిణామం పొందటం. చూడగానే, ఆయన చేతిలో గొడుగు లేదని గమనించాను. పోనీ, బండీలో వచ్చాడా అంటే అదీ లేదు.

ఆయన టోపీమీద పడిన మంచు ఇంకా దిగజారు తూనే ఉంది. వానలో తడవటం వల్ల బరువెక్కిన ఆయన కోటు శరీరమును క్రిందకు లాగుతూ వుంది. ఆయన తన టోపీని కోటును ఒకటొకటిగా తీసి అవలపెట్టి మంచి సూటువేసు కొని, ఉపన్యాసవేదిక చేరాడు.

ఆ వేదిక చాల ఎత్తైనది. దాని మీదకి మెట్లు కట్టాలంటే ఆ చర్చిలోని స్థలం చాలా భాగం ఊరక పోవలసి వస్తుందని, ఆయన సలహామీదనే, మెట్లకు బదులు ప్రక్కగా ఒక నిచ్చనపెట్టి ఉంచారు. సముద్రము మీద, పడవమీద నుంచి, ఓడ నెక్కటానికి ఉపయోగించే నిచ్చెన లాగ ఉంది ఆ నిచ్చెన. ఎవరో ఒక కెప్టెన్ భార్య నిచ్చెనకి కట్టటానికి ఎఱ్ఱని త్రాళ్ళని బహూకరించింది. చక్కని చెక్కతో తయారు చేయబడ్డ ఆ నిచ్చెనా, ఆ త్రాళ్ళూ, ఆ చర్చిలో బాగా అమిరాయి. ఆ నిచ్చెనవద్ద ఒక్క నిమిషం ఆగి, ఫాదర్ మేపల్, ఒకసారి కన్నెత్తి పైకి చూశాడు. నావికులకు ఉండే సహజ లాఘవంతో వయస్సు మరలిన వారికి ఉండే సహజ మానసిక నైపుణితో ఒక్కొక్క మెట్టే ఎక్కి వెళ్ళాడు.

ఈ నిచ్చెనకు రెండు వైపుల నిలువు భాగాలు గుడ్డ చుట్టిన త్రాటిమోకులు. మెట్లుమాత్రం చెక్కతో చేశారు. ఈ అడ్డచెక్కలను, ఆ నిలువు మోకులతో ముడివేసి బిగించారు. ఈ రకపు నిచ్చెన ఓడలకు ఎంత ఉపయోగపడినా ఇటువంటి వేదికలకు అనవసరమని నేను చూడగానే అనుకొ

నాను. పైకి ఎక్కగానే ఫాదర్ మేషల్, వెనుకకు తిరిగి నిచ్చెన మెట్లను ఒక్కొక్కటే లాగి చుట్టి, ఒకచోట పడవేసి సురక్షితమైన కోటలో చేరినట్లు వేదిక మీద నిలబడ్డాడు. ఆయన ఎందుకు ఇట్లా చేశాడా అని కొంతసేపు ఆలోచించాను. నాకు దాని రహస్యం బోధపడలేదు. ఫాదర్ మేషల్ నిజాయితీ పరుడని, సత్పాత్రుడని ఎంతో ప్రఖ్యాతి ఉంది. అటువంటి వాడు ఏవో చమత్కారాల వల్ల యశము సంపాదింప బూనుకుంటాడని అనుమానింపలేక దీని కేదో గంభీర మయిన కారణం ఉండి ఉండాలని అనుకొన్నాను. అంతే కాకుండ, ఏదో నిగూఢమయిన భావమునకు ఇది బహిస్సంకేత చిహ్నమై ఉండాలని అనుకొన్నాను. ఆయన ఆ విధంగా భౌతికంగా ఏకాంతుడవటం ఆధ్యాత్మికంగా కూడా నిస్సంగుడైనట్లు కనబడే ప్రయత్నమా ! అని సందేహించాను.

ఏమయితేనేమి, ధర్మదేవతకు ఆ వేదిక పెట్టని కోట. భగవద్భక్తునకు ఆ ధర్మవాక్యాలే అమృతాహారం. అచట అమృతపానీయం లభ్యమవుతుంది. ఆ ప్రచారకుడు పూర్వాశ్రమంలో గడపిన సముద్రప్రయాణాలను స్ఫురింపచేసే ఆ నిచ్చెన ఒకటే అక్కడి వింత కాదు. వేదికకు అటూ ఇటూ ఉన్న పాలరాతి ఫలకాల మధ్యనున్న గోడమీద, నల్లని గుట్టలు తెల్లని కెరటాలు కల తీరంలో ప్రచండంగా విజృంభించే ఒక తుపానులో చిక్కుకొన్న ఒక యోడ యొక్క చిత్రం ఉంది, ఆకాశంలో నల్లని మేఘాల మధ్య ఒక చిన్న దీపం. దానినుండి కాంతికిరణమును ప్రసారముచేసే ఒక

దేవతామూర్తి కూడా చిత్రింపబడి ఉన్నాయి. ఆ దేవత ఇలా అంటున్నట్లు అనిపించింది: ఓ పడవా! ముందుకు సాగుము — నిలదొక్కుకో. అటు చూడు, ఆ మేఘాలు దొర్లిపోతున్నాయి, సూర్యుడు బయటకి వస్తున్నాడు, ఎంతో ప్రశాంతత ఆసన్నమవుతోంది.

ఆ వేదికకు కూడా, ఆ నిచ్చెనకూ, చిత్రానికి వలెనే సముద్రజీవితంతో సంబంధం ఉంది. చెక్కతో చేయబడ్డ వేదిక యొక్క ముందరిభాగం ఓడ యొక్క ముందుభాగాన్ని పోలియున్నది. బైబిలు గ్రంథం పెట్టుకొనే చోటు ఓడ చుక్కానికి తగిలింపబడే కొయ్యవలె ఉన్నది. అంతకంటె అర్థవంతమైన దింకేమి ఉంటుంది? వేదిక భూమి అంతటికీ ముందు ఉంది. మిగిలినవన్నీ వెనుక ఉన్నాయి. ప్రపంచాన్ని వేదిక నడిపిస్తున్నది. అక్కడనుంచే భగవంతుని కోపం అనే తుఫాను గోచరిస్తుంది. ఆ తుఫాను యొక్క పోటును అక్కడే తట్టుకోవాలి. అనుకూలమయిన గాలి ప్రసరించాలని, ఆ చోటునుండే వాయుదేవునికి ప్రార్థనలు వెలువడుతవి. నిజమే, ఈ విశ్వమంతా సముద్రయానారంభము చేసే ఒక పడవ వంటిది. అది ప్రయాణారంభము, దాని ముగింపు కాదు. వేదిక ఈ పడవకు చుక్కాను. దీనికి ఇంతకంటె ఇంకొక వ్యాఖ్యానం లేదు. లోకమునకు ఈ మహోపన్యాస వేదికే అగ్రభాగం. తక్కినవన్నీ దానిని అనుసరించి నడుస్తున్నాయి. ధర్మోపలంఘన చేసిన వారిపై భగవంతునకు కలిగే ఆగ్ర

హాము ఆ వేదికనుండే ఉపదేశింప బడుతుంది. అదే తుఫాను. ఆపై ఆ వేదికనుండే, ఈశ్వర ప్రసాదనార్థము చేసే ప్రార్థనలు వెలువడుతవి. భగవంతుడు ప్రసన్నుడై, వెలుగును ప్రసాదిస్తాడు. తుఫాను అణగి, మందవాయువు వీస్తుంది.

9. ధర్మోపన్యాసము

ఫాదర్ మేపల్ లేచి నిలబడి, మందస్వరముతో, నిరాడంబర అధికారంతో దగ్గరగా కూర్చుండుడని చెదరి చెదరి ఎడము ఎడముగా కూర్చున్న వారి నందరిని ఆజ్ఞాపించాడు. "కుడివైపున ఉన్న వాళ్ళంతా ఎడమ వైపుకి రండి : ఎడమవైపున వున్నవాళ్ళంతా కుడి వైపుకి జరగండి: మధ్యవరుసలో కూర్చోండి" అన్నాడు.

బరువాటి సముద్రపు బూట్లు చప్పుడు అంతకంటె తక్కువగా ఆడవాళ్ల జోళ్ళ చప్పుడు - వినవచ్చాయి. కొద్ది క్షణాలలో అంతా నిశ్శబ్దం. అందరూ ప్రచారకుని వైపు దృష్టిని నిలిపి కూర్చున్నారు.

వేదిక ముందుకు వచ్చి ఆ ప్రచారకుడు మోకరించి తన చేతులను కట్టుకొని తలయెత్తి కళ్లుమూసికొని గాఢంగా ప్రార్థింప సాగాడు. అది చూస్తే సముద్రపు ఒట్టడుగున మోకరించి ప్రార్థిస్తున్నట్టు అనిపించింది. పొగమంచులో మాతమైపోతూ వున్న ఒక ఓడలోని ఘంటారావమును తలపించే గంభీర మంద్రస్వరంలో ఆయన ప్రార్థనా గీతాన్ని చదువ నారంభించి, పోను పోను తుది భాగంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే ఉచ్చైస్వరంతో ఆ గీతమును ముగించాడు. ఆ ప్రార్థనా గీతార్థమిది:

"ఎదుట భీతావహమైన తిమింగిలము. నా శిరముపై అంధతమస్సు. సూర్యతేజః కిరణాలంకృతములైన తరంగములు ఒకదాని వెంట ఒకటి పరంపరలుగా దొరలిపోతూ వుండగానే భయభ్రాంతుడనైన నేను అధః పాతాళమునకు త్రోసివేయబడితిని.

అది నరక ద్వారము. మృత్యుదేవతా ముఖ గహ్వరము. ఆ భయంకర లోకమునందు ప్రాణులు అనుభవించే యాతనా దుఃఖములను, ఆక్రోశములను, వారే చెప్పవలెను. గాని ఇతరులు వర్ణింపలేరు. నేను నైరాశ్యములో మునిగిపోతున్నాను.

ఆశాకిరణము పొడచూపని ఆ యాపత్సమయమున భగవంతుడు నావాడై నన్ను ఆదుకొంటాడని నమ్మకం లేకపోయినా, ఎలుగెత్తి మొర పెట్టుకొన్నాను.

దేదీప్యమానమగు ఒక జలచర వాహన మెక్కి, రమణీయ భయానకమైన మూర్తితో, ప్రసన్నవదనముతో నా పాలిటి దేవుడు నన్ను రక్షించుటకు వాయు వేగముతో వచ్చి సాక్షాత్కరించాడు.

విషాదారంభము ఆనందాంతము అయిన ఆ మహార్ణవమునకు నా యీ గీతము శాశ్వత వాఙ్మయ రూపము. భగవంతునకు స్వస్తి. ఆయన శక్తిమంతుడు, దయామయుడు"

గీతమును అందరూ కలిసి గొంతెత్తి పాడగలిగారు. ఆ ధ్వనిలో తుఫాను హోరు అణగిపోయింది. కొంతసేపటి

తరువాత పరిచారకుడు బైబిలు గ్రంథపుటలను తిప్పి, ఒక చోట ఒక పుటమీద చేతులుంచి ఇలా అన్నాడు.

"నావికులారా, జోనాకథ ఉన్న అధ్యాయములో ఆఖరి పాదాన్ని చూడండి; "జోనాని మింగివెయ్యటానికి ఒక పెద్ద చేపను భగవంతుడు పంపించాడు" అనివుంది. మిత్రులారా! ఈ ఉదంతానికి నాలుగే అధ్యాయాలు - నాలుగు పేటలు— ఇది మత గ్రంథాలు అనే మోకుతో నాలుగు దారాలు, ఒక చిన్న భాగం మాత్రమే కాని, జోనా యొక్క సముద్రపుటుదంతం లోతైన మన హృదయాంతరాళాలలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఈ మహాపురుషుడు మనకు ఎంతో గంభీరమైన గుణపాఠాన్ని నేర్పాడు! చేప కడుపున ఉన్న ఆ ప్రార్థనాగీతము ఎంత ఉత్తమమైనది! పెద్ద కెరటం వలె, ఎంత సజీవంగా ఉంటుంది! ఆ సముద్రపు అధోభాగాన ఉండే మొక్కలూ, మన్నూ మనచుట్టూ వున్నట్లు అనిపిస్తుంది. కాని జోనా చరిత్ర మనకు నేర్పే నీతి ఏమిటి? ఈ పాఠం రెండు రకాలు. మనవంటి పాపాత్ములందరకూ ఒక పాఠం, మతగురువైన నాకు ప్రత్యేకమైన పాఠం ఇంకొకటి. పాపులుగా మనందరికీ అది గుణపాఠమే. అది జోనా యొక్క పాపము, క్రూరత్వము, హఠాత్తుగా మేల్కొనిన భీతి, శీఘ్రగతిని కలిగిన శిక్ష, పశ్చాత్తాపము, ప్రార్థనలు, కట్టకడకు కలిగిన నివృత్తి, ఆనందము ఇవన్నీ కూడిన కథ అవటంవల్ల మనందరి వలెనే అమిత్తాయి యొక్క కుమారుని (జోనా) పాపముకూడా కావాలని భగవంతుని

యొక్క ఆనతిని శిరసావహింపకుండుటవలన కలిగినది. ఆ ఆనతి ఏమిటో అది ఏ విధంగా పంపబడినదో అటుండనీయండి; ఆ ఆనతి జోనాకు కష్టమైనదిగా కనబడింది. కాని ఒకటి జ్ఞాపకము ఉంచుకోండి. భగవంతుని ఆజ్ఞలన్నీ కష్టతరంగానే ఉంటాయి. భగవంతుడు మనలను బుజ్జగింపడు; ఆజ్ఞాపిస్తాడు. భగవంతుని అనుసరిస్తే మనలను మనం తిరస్కరించుకోవాలి. భగవదాజ్ఞానుసారవర్తనం, ఆత్మవాంఛా తిరస్కారం. అదేవున్న కష్టమంతా! భగవంతుని తిరస్కరించడం అనే పాపం తనమీద ఉన్నప్పటికీ జోనా భగవంతుని బారినుండి తప్పించుకోకపోదామని ప్రయత్నించటంలో ఆయనను ఇంకా ధిక్కరించిన వాడైనాడు. మానవనిర్మితమైన పడవలో పయనించి వెళ్ళితే తాను భగవత్పరిపాలన లేనట్టి, మానవ పరిపాలన మాత్రమే చెల్లునట్టి రాజ్యం చేరుకోగల ననుకున్నాడు. జొప్పా రేవులో కాసేపు అటూ ఇటూ తచ్చాడి చివరికి టర్షీష్‌కి వెళ్ళే పడవను వెతుకుతాడు. ఇందులో ఒక రహస్యముంది. టర్షీష్ ఇప్పటి కేడిజ్ అయివుంటుందని విజ్ఞుల అభిప్రాయం. పోతే, ఈ కేడిజ్ ఎక్కడుంది? కేడిజ్ స్పెయిన్‌లో వుంది. అట్లాంటిక్ మహాసముద్రమును గురించి తెలియని ఆ రోజులలో జొప్పానుండి నీటిమీద జోనా వెళ్ళగలిగిన చిట్ట చివరి ప్రదేశం. జొప్పా అంటే ఇప్పటి జుప్పా. మధ్యధరాసముద్రపు తూర్పుతీరాన, సిరియా తీరాన వుంది టర్షీష్. అంటే కేడిజ్, అక్కడికి వెళ్ళమంగా రెండువేల మైళ్ళకంటె ఎక్కువ దూరంలో జిబ్రాల్టర్

సాధికి కొద్దిగా అవతల వుంది. జోనా భగవంతుని తప్పించుకుందామని ప్రపంచాన్ని దాటిపోవడానికి ప్రయత్నించినట్టు స్పష్టమవటంలేదా! ఆ దరిద్రుడు! ఆ గర్హణీయుడు! త్వరగా సముద్రాలను దాటిపోవాలను చూచే దొంగవలె పడవల మధ్య తచ్చాడాడు. అతని టోపీ ముఖముమీద వాలి వుంది; అతని చూపు అపరాధభరితం. అతని చూపులలో ఎంత అలజడి, పాపశంక వున్నదంటే ఆ రోజులలో యిప్పటివలె పోలీసులేవుంటే అతను ఏదో నేరంచేసిన శంకతో ఏ ఓడమీదనైనా అడుగుపెట్టేలోగా పట్టుకునేవారన్న మాట. అతను పలాయితుడు! పెట్టె, బేడా ఏమీలేవు అతనికి. అతనిని సాగనంపడానికి రేవుదగ్గర స్నేహితులు ఎవరూ లేరు! ఎంతో కష్టముమీద, టర్షీష్‌కి వెళ్లే పడవ, తన ఆఖరి సరకులను ఎత్తుకోవడం చూశాడు. ఆ ఓడ యొక్క కప్తానుని చూడటానికి అతను ఓడమీద అడుగు పెట్టగానే అక్కడి నావికులంతా సరకులను ఎత్తుకోవటం ఆపి, యీ కొత్తవాని దొంగచూపులను గమనింప సాగారు. జోనా దీన్ని గమనించాడు. తనకేమీ గాబరాలేనట్టు కనపడటానికి వ్యర్థప్రయత్నం చేశాడు: అలాగే తెప్పించుకొని చిరునవ్వు నవ్వుదామని విఫలప్రయత్నం చేశాడు. మానవ సహజమైన సహస్ఫురణ వల్ల అతని వాలకం అక్కడి నావికులందరికీ తెలిసిపోతుంది వీడు సామాన్యుడూ, అమాయకుడూ కాడని. వాళ్లు ఒకళ్ళతో నొకళ్లు చెప్పుకొనసాగారు. "ఏ తెలివితక్కువ వానినో మోసగించాడు" అని ఒకడంటే,

"నీవు వ్యభిచారి" అని రెండవ వాడు అన్నాడు. "నీవు గొమట్టా లోని జైలునుంచి పారిపోయినవాడో, సొదోమ్ నుంచి పలాయనమైన హంతకుడో అయి వుంటాడ"ని ఇంకొకడు అన్నాడు. ఒకానొక హంతకుని పట్టి యిచ్చినందుకు అయిదు వందల బంగారు నాణెములను బహూకరిస్తామంటూ ఉన్న ప్రకటన ఆ ఓడ గోడమీద వ్రాయబడియుంది. ఒక నావికుడు అక్కడి ప్రకటనలో పేర్కొనబడిన హంతకుని వర్ణనను చదువుతూ జోనా వైపు తిరిగి చూడసాగాడు. అతని అనుచరులు జోనా చుట్టూ మూగారు అవసరమైతే అతన్ని బందీ చేయటానికి! జోనా వణికి పోయాడు. తన ధైర్యమంతా ముఖంలో కనపర్చబూని జోనా మరింత భీరువుగా అగుపించాడు. తాను అపరాధ శంకితుడనని ఒప్పుకోడు. కాన అదే బలమైన అనుమానమైనది. చివరికి ప్రకటనలో వర్ణింపబడిన వ్యక్తి యితడు కాదని నావికులు గ్రహించి అతన్ని విడిచారు. అతను కెప్టెన్ ఉండే గదిలోకి వెళ్లాడు. ఏవో కాగితాలను వ్రాసుకుంటూ, కెప్టెన్ "ఎవరక్కడ" అని అడిగాడు. ఈ సాధారణపు ప్రశ్న జోనాను కలవర పెట్టింది. అక్కడనుండి పారిపోదామనుకొన్నాడు. కాని త్వరగానే స్థిమితపడి, "ఈ ఓడలో టర్షీష్‌కి వెళ్లాలనుకొంటున్నాను. మీరు ఎప్పుడు ప్రయాణమవుతార"ని అడిగారు. అప్పటివరకూ తన పనిని చూచుకొంటూ ఉన్న కెప్టెన్ తల యెత్తి ఎదుట నిలబడియున్న జోనాను చూడలేదు. కాని అతని హీనస్వరం విని తల యెత్తి అతనిని పరీ

తీగా చూశాడు. ఆ చూపు జోనా హృదయంలో ముల్లి
వలె నాటింది. "పోటు వచ్చిన తరువాత బయలు దేరుతాం"
అని కప్తాను మెల్లగా అన్నాడు.

"రాగానే – వెంటనే బయలు దేరుతారా?"

"నిజమయిన ప్రయాణీకులకు ఆలస్యం కల్గించకుండా
బయలు దేరుతాం."

(జోనా, నీ కదో అపనింద !)

కెప్టెన్‌కు కలిగే అనుమానమును త్వరగా మాపటానికి
"నేను మీతో వస్తాను. ప్రయాణానికి అయ్యే సొమ్ము ఎంత ?
నేను ఇప్పుడే యిస్తాను" అని జోనా బరవాసాగా హెచ్చరిం
చాడు. "సోదరులారా! ఈ కథలో 'అతను పడవ బయలు
దేరేముందే కేవు యిచ్చాడు' అన్నమాటలు ముఖ్యమయి
నవి. అవి అర్థవంతములు.

సరే, ఆ ఓడ కెప్టెన్‌కు నేరగాండ్రను ఇట్టే కనిపెట్ట
గల శక్తి ఉంది. కాని డబ్బు యివ్వ లేని వాళ్ళను కని
పెట్టడంలో అతని శక్తి ఎక్కువ ప్రకటితమవుతుంది. అతను
లోభి. ఈ ప్రపంచంలో డబ్బు ఇచ్చుకో గలిగితే ఎటువంటి
పాపమయినా అప్రతిహతంగా చెల్లిపోతుంది. డబ్బులేక
పోతే ఎంత పుణ్యమున్నా ప్రతిదానికి ఆటంకాలే. జోనా
ఏమాత్రపు ధనికుడో కనిపెట్టాలని కప్తాను అనుకొని,
మామూలు కంటె మూడు రెట్లు ఎక్కువ సొమ్మని అడుగు
తాడు. దానికి జోనా ఒప్పుకుంటాడు. జోనా పరారి కెప్టెన్

కనిపెట్టాడు. కాని ఆ పలాయనంలో తనకు కొంత డబ్బు ముట్టుతుందనే లోభంలో అందుకు సహాయపడటానికి నిశ్చయించు కొంటాడు. చివరికి జోనా సొమ్ము తీసి చేతికి ఇస్తూ వుండగా కప్తానును ఏవో అనుమానాలు పీడింపసాగాయి వాటిలో నకిలీ నాణెములు ఏవైనా ఉన్నాయేమో అని ప్రతి దానిని పరీక్షించి చూచాడు. అన్నీ మంచివిగానే కనబడగానే జోనాను ఓడలో తీసికొని వెళ్ళడానికి ఒప్పుకుంటాడు.

"నా గది చూపండి. నేను పండుకోవాలి, చాలా అలిసి వున్నాను" అంటాడు జోనా.

"అవును. బాగా అలిసి ఉన్నట్లే కనబడుతున్నావు. అదిగో నీగది" అని కప్తాను దానిని చూపాడు.

జోనా గదిలోకి వెళ్ళి తలుపు తాళం వేయబోగా తాళపు చెవి లేదు. అతను తాళపుచెవి కోసం వెతకటం కనిపెట్టి కెప్టెన్, నేరగాండ్ర గదులకు లోపలనుంచి తాళం వేసే ఏర్పాటు ఉండదంటూ లోలోన నవ్వుకొంటూ ఏదో గొణగసాగాడు. దుమ్ముకొట్టిన ఒంటిమీాది బట్టలతోనే జోనా పక్కమీాద పడ్డాడు. గది ఎత్తుగా లేకపోవడం వల్ల అతని నుదురుకి చూరు ఇంచుమించు తగులుతూవుంది. గాలి ఆడ లేదు జోనాకు ఊపిరి పీల్చడం కష్టమయింది. నీటిమట్టానికి క్రింద ఉన్న ఆ చిన్నగదిలో వుండగా జోనాకి భవిష్యత్తులో తాను తిమింగిలపు ఉదరభాగంలో పడే యాతన యొక్క స్వరూపం తెలిసివచ్చింది. గదికి ఒకవైపున అటూ

ఇటూ ఊగులాడే లాంతరు వుంది. ఓడలో అఖరి సరకులు పడగా, ఓడ కొద్దిగా కదిలింది. దీపంకూడా కదిలింది. ఆ దీపం జోనాని భయపెట్టింది. పక్కమీద పరుండి భయంతో అటూ ఇటూ తిరిగే ఆ పరారి చూపులకు విశ్రాంతిలేదు. మనస్సుకు శాంతిలేదు. ఆ దీపం అతనిని మరీ భయపెట్టింది. ఆ గది క్రింది భాగం చూరు ఇరుప్రక్కలూ అన్నీ వింతగా వున్నాయి. "నాలోని ఆత్మకూడా నిర్వక్రంగా ఊర్ధ్వముఖంగా వెలుగుతూనే వుంది. కాని అందులోని అంతరాంతర భాగములు వంకరగా నిస్తేజముగా వున్నాయి" అని వాపోవ సాగాడు రాత్రి అంతా మద్యపానము సేవించి వచ్చి పక్కమీద పడుకొని బాగా నిద్రపట్టేవరకు అంతరాత్మ బాధ పెట్టగా, తన నేరానికి ఎట్టి శిక్షనైనా విధించమని భగవంతుని వేడుకొనే వానివలె జోనా కూడా ఎంతో వ్యధపడ్డాడు. చివరికి మనోబాధయే అతనిని నిద్రపుచ్చింది. సముద్రపు పోటు రాగా ఓడ టర్షీష్‌కు ప్రయాణమై రేవు విడిచింది.

మనకు తెలిసినంతవరకూ, దొంగ సరకులను రవాణా చేసే ఓడలలో ఈ ఓడ మొదటిది. అందులో నిషిద్ధమైన సరకు జోనా! కాని ఈ ఘోరమైన బరువును మోయజాలనంటూ సముద్రుడు ఎదురుతిరిగాడు. ఓడ నాశనమై పోయే టట్టుగా పెద్దపెట్టున తుఫాను రేగింది. ఓడ బరువు తగ్గించాలి అంటూ సరంగు నావికులను హెచ్చరించాడు. పెట్టెలు, మూటలు, జాడీలు అన్నీ బయట వేస్తున్నారు. గాలి హోరు ఎక్కువైంది. మనుష్యుల కేకలు మిన్నుముట్టాయి. వాళ్లు

అటూ ఇటూ పరుగెత్తుతూండటం వలన ఓడమీద అంతు లేని అలజడి, ఇంత రొద తన నెత్తిమీద జరుగుతూవున్నా జోనా మాత్రం తన వింత నిద్రలో మునిగి వున్నాడు. చీకటి మయమైన ఆకాశంగాని, రేగిపోతున్న సముద్రంగాని అతనికి కనబడదు. సరకులు దొర్లిపోతూవుండటం అతనికి తెలియదు. సముద్రాన్ని చీల్చుకుంటూ నోటిని తెరచికొని అతనికోసం వస్తూవున్న ఆ తిమింగిలం సంగతి అతనికి పట్టనే పట్టదు. సోదరులారా! జోనా ఓడయొక్క అడుగు భాగాన ఒదిగి పడుకొన్నాడు. కాని పడవ కెప్టెన్ అతని దగ్గరకు వచ్చి, "ఏమయ్యా ఈ నిద్ర! లే!" అంటూ అతని చెవిలో అరిచాడు. ఆ కేకకు అదరిపడి లేచి జోనా ఓడ కట్టుమీదకు వెళ్ళాడు. సముద్రము వైపుకి చూతామని అతను అనుకొంటుండగా పెద్ద కెరటం వచ్చి పడింది. దానివెనుక ఇంకొకటి. కెరటం వెనుక కెరటం వచ్చి ఓడమీద పడటంవల్ల ఆవలకు పోయే అవకాశం లేక నీళ్ళు అక్కడే నిలిచిపోయినాయి. నావికులు నీళ్ళల్లో మునిగిపోయినంత పనైనది. ఆకాశంలోని చీకటి మధ్యనుండి, భయంతో చందమామ తొంగి చూచినట్లు జోనాకూడా భయంతో ఓడయొక్క చివరిభాగం ఆకాశం అంత ఎత్తుకు లేవటం. మళ్ళీ సముద్రపు లోతుల్లోకి దిగిపోవటం చూచాడు.

అతడు భయంతో ఎంతో వ్యధపడినాడు. భగవంతుని నుండి తప్పించుకొని పోతున్నాడని అతని ప్రతిచేష్ట స్పష్టం చేసింది. అక్కడి నావికులు అతనిని అనుమానించారు.

అతనిని చూసిన కొలదీ వారి అనుమానం ఎక్కువైంది. ఈ పెనుతుఫాను ఎవరి పాపంవల్ల కలిగిందో తెలుసుకోందామని చీటీలు వేశారు. జోనా పేరవున్న చీటి వచ్చింది. ఇది తెలియగానే అతనిని చుట్టుముట్టి అతనిపై ప్రశ్నలవర్షం కురిపించారు. "నీ వృత్తి ఏమిటి?" 'ఎక్కడనుండి వస్తున్నావు?' 'నీ దేశమేది?' "నీ వెవరు?" ఇవీ ప్రశ్నలు. పాపం, జోనా, ఆ ప్రశ్నలకి సమాధాన మివ్వటమేకాక, వాళ్ళు అడగని ప్రశ్నకుకూడా సమాధాన మిచ్చాడు. ఆ సమాధానం అతని చేత భగవంతుడు బలవంతంగా పలికించాడు. "నేను హిబ్రూని" అని ఏడిచాడు. "ఈ భూమిని, సముద్రాన్ని సృష్టించిన భగవంతుడంటే నాకు భయం" అన్నాడు. "భయమా, జోనా! నిజమే! నీవు భగవంతుని గురించి భయపడవలసిన అవసరమేమి ఉంది?" జోనా, తన తప్పిదమును ఒప్పుకొన్నాడు. నావికులకు విభ్రాంతి కలిగింది. కాని అతని మీద వారికి జాలికూడా కలిగింది. జోనాకు తన దుష్కర్మలు బాగా తెలిసియున్నా అందువల్ల భగవంతుని కృపను అర్థించడు. కాని ఆ తుఫాను తన బలికోరే వచ్చిందని తెలిసి తనను సముద్రంలో విసరివెయ్యమని నావికులను వేడుకొంటాడు. ఇది విని నావికులు అతనిని విడిచి, ఓడని రక్షించటానికి ఇతర మార్గాలను వెతుకుతారు. కాని, అంతా వ్యర్థం. తుఫాను హోరు ఎక్కువైది. చివరకు, ఒక చేతితో భగవంతునకు మొక్కుతూ, రెండవదానితో జోనాను పట్టుకొన్నారు.

లంగరు ఎత్తి నీటిలో పడవేసినట్టు జోనాను నీటిలో పడవేయగనే, తూర్పు దిశనుండి ఒక ప్రశాంతత ఆవహించింది. జోనా కొట్టుకుపోతూ తనతోపాటు తుఫానును కూడా తీసికొనిపోగా, సముద్రము శాంతించింది. నిరాటంకముగా కొట్టుకొనిపోతూ జోనా తాను ఒక తిమింగిలపు నోటిలో పడ్డావన్న సంగతి జోనా గమనించలేదు. తిమింగిలము తెల్లని తన దంష్ట్రలను కదిలించి, జోనాను తనలో బందిచేసి బిగించింది. ఆ తిమింగిలపు గర్భగోళమునుండి భగవంతుని ప్రార్థించాడు. అతని ప్రార్థన ఏమిటో గమనించి అర్థం చేసుకోండి. తాను పాపిష్టైనా, జోనా, తనకు తాను విమోచన కల్పించమని భగవంతుని వేడుకోడు. తనకు విధించబడిన ఆ ఘోర శిక్ష న్యాయమేనని అనుకొంటాడు. తన విమోచన సంగతి సంగతి భగవంతునికి విడచి, ఎన్ని బాధలు పడినా తాను భగవంతుని దెసనే చూస్తానని ప్రార్థిస్తాడు. సోదరులారా! నిజమైన ప్రాయశ్చిత్తమంటే ఇది! క్షమార్పణ వేడుకోవడం కాదు, తనకు విధించిన శిక్షకు కృతజ్ఞత చూపటం! అతని ప్రవర్తన భగవంతుని మెప్పు నెట్లు పొందిందో, అతనికి తిమింగిలమునుండి, సముద్రమునుండి కలిగిన విమోచనవలన విశదమౌతుంది. సోదరులారా! జోనాను గురించి మీకు నేను చెప్పటం అతనివలె పాపాత్ములుకండి అని చెప్పటం కాదు. అతనిని చరిత్రను పశ్చాత్తాపానికి ప్రాయశ్చిత్తానికి ఆదర్శంగా స్వీకరించమని. మీరు ఎప్పుడూ పాపకార్యం తలపెట్టవద్దు. ఒకవేళ పాపమే చేస్తే, జోనావలె అందుకు ప్రాయ

శ్చిత్తం పొందటానికి ప్రయత్నించండి" మఠాధికారి జోనా చిక్కుకున్న తుఫాను సంగతి చెప్పుతూ వుండగా బయటి తుఫాను హోరు అతని మాటలకు నవశక్తిని ఇచ్చినట్టు అని పించింది. అతని వక్షము పెద్ద కెరటంలాగ పొంగింది ఒండొంటితో పెనుగులాడుతున్న పంచ మహాభూతాలవలె ఆతని చేతులు అటూ ఇటూ తిరిగాయి. అతని మాటలలోని ధాటి ఉరుములవలెను, అతని కళ్ళలోని వెలుగు మెరుపుల వలెను, అక్కడచేరిన ఆ అమాయకులకు ఒక వింతయైన భయమును కలిగించాయి.

చివరకు అతని చూపులలో శాంతం ఏర్పడింది. ఆ పుస్తకంలోని పుటలను మెల్లగా తిరగవేశాడు, నిశ్చలంగా నిలబడి; కళ్ళను మూసుకొని భగవత్ ధ్యానములో నిమగ్ను డయినాడు. కొంతసేపటికి అక్కడి వాళ్ళనుద్దేశించి, నెమ్మ దిగా ఎంతో నమ్రతతో ఇలా అన్నాడు :

"సోదరులాలా ! భగవంతుడు మీ మీద ఒక చెయ్యినే వేశాడు. కాని నా మీద రెండు చేతులను ఉంచాడు. నాకు చేతనయిన విధంగా జోనా కథ వలన మనం నేర్చుకోవలసిన పాఠాన్ని చెప్పాను. ఈ పాఠం మన వంటి పాపులందరూ తెలిసికోవలసింది. ఇప్పుడు నాకు ఈ వేదిక దిగివచ్చి మీ వలెనే కూర్చోవాలని వాంఛ. జోనా వల్ల నేర్చుకోదగిన రెండో పాఠాన్ని ఎవరయినా చెప్పగా వినాలని నా కోరిక. కాను దీక్షితుడయిన మఠాచార్య

డయ్యు, నిత్యసత్యవిషయములను గురించి ఉద్బోధింపవలసిన వాడయ్యును జోనా దుష్టుడయిన నినివేకు సద్బోధ చేయుమని భగవంతు డాజ్ఞాపించినప్పుడు ఆ దుష్టునకు ఆగ్రహము కలిగింపవలసి వస్తుందేమోనన్న భయముతో తన ధర్మమును త్యజించి భగవంతునకు దూరుడై ఓడ ఎక్కి తప్పించుకు పారిపోవ చూచెను కదా ! పాపం భగవంతుడు ఎల్ల ఎడలా కలడని ఎరుగడు ! తన గమ్యమయిన టర్షీష్ చేరనే లేదు. విన్నారుకదా మీరు! భగవంతుడు తిమింగిల రూపములో వచ్చి అతనిని దిగమ్రింగి సముద్రగర్భమునకు ఈడ్చుకొని పోయినాడు. మానవమాత్రుడెవ్వడూ ఏ ఉపాయముతోనూ ఉద్ధరించలేని ఆ నరక కుహరము నుండి అతను మొరపెట్టుకొన్నప్పుడు, భగవంతుడు ఆ మొరను ఆలించెను. అప్పుడు భగవంతుడు తిమింగిలమును ఆదేశింపగా అది గాలి వెలుగు లేని ఆ అగాధమునుండి బయటకు వచ్చి, సూర్యరశ్మిచేత, చల్లని గాలిచేత సుఖప్రదమయిన భూమి మీద పడేటట్టు జోనాను క్రక్కి వేసింది. జర్జరిత శరీరుడయియున్న జోనాకు భగవంతుడు యింకొక ఆదేశము చేసెను. ఆ ఆదేశమేమిటి సోదరులారా ! అసత్యమునకు అభిముఖముగా నిలచి సత్యమును ప్రబోధించుము అని. జోనా ఆ ఆజ్ఞకు విధేయుడై ప్రవర్తించెను. నేను పేర్కొన్న రెండవ పాఠ మిది. పజావృడయిన ఏ మతాచార్యుడును దీనిని ధిక్కరింపరాదు. ధిక్కరిస్తే వానికి నరకము తప్పదు. విషయవాంఛలచే ఆకర్షింపబడి మతధర్మమును తిరస్కరించిన వానికి శోకము

తప్పదు. భగవంతుని ఆగ్రహించినప్పుడు ధర్మేతరములైన ఉపాయములచే శమింపచూచే వానికి శోకము తప్పదు. హితము చెప్పలేక ప్రియము చెప్పేవానికి శోకము తప్పదు. మంచితనము కంటె మంచిపేరు కోరుకునే వానికి శోకము తప్పదు. దైవముపేరు మీదుగా పరాభవమును వరింపలేని వానికి శోకము తప్పదు. అసత్యము వలన మోక్షము లభింపనున్నను దానిని కాదని సత్యమును చెప్పలేనట్టి వానికి శోకము తప్పదు. సైంట్ పాల్ చెప్పినట్లు "ఇతరులకు బోధలు చేస్తూ తాను మాత్రము భ్రష్టుడుగా ఉండే వానికి శోకము తప్పదు!"

అతను వంగి, తనని తాను మరచిపోయి కాసేపు పడిపోయాడు. తరువాత వాళ్ళవైపు ముఖము ఎత్తి చూచాడు. అతని కళ్ళు ఆనందభరితముగా ఉన్నాయి. దివ్యావేశము పొందినవానివలె ఎలుగెత్తి ఇలా అన్నాడు, "సోదరులారా! ప్రతి బాధ వెనుకా, ఏదో ఒక ఆనందం ఉంటూనే వుంటుంది. ఆ బాధ ఎంత గాఢమైనదో ఆ ఆనందం కూడా అంత ఉన్నతంగానే వుంటుంది. ఈ నేలమీది ప్రభువులను అధికారులను లెక్కచేయక తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొన్న వానిదే అనంతమయిన ఆనందం. ఘాతుకము, దుష్టము అయిన ఈ ప్రపంచ నౌక మునిగిపోయినా, తన స్వశక్తిచే తరింపగల వానిదే నిజమైన ఆనందము. ఎంతటి ఉన్నతపదస్థుల పాపములనైనా వెలికి తీసి నాశన మొనర్చుటలో ఏవిధమయిన జంకు కనబర్చని వానిదే ఎంతో ఆనందము. భగ

భగవంతుని తప్ప వేరే ప్రభువును, ఆయన శాసనమును తప్ప వేరే చట్టమును గుర్తింపక, స్వర్గముకప్ప తనకు వేరే మాతృభూమి లేదని చాటే వానిదే నిజమైన ఆనందము. కలవరపాటుతో కెరటాల వలె తనమీద వచ్చిపడే మూకకు లొంగిపోక నిలబడే వానిదే ఆనందము. దేహపతన వేళ తుదినిశ్వాసముతో, "తండ్రీ! నీవు దండధర్మధారివిగా నే నెరుగుదును. ఇదిగో, నేను శరీరమును విడిచిపెట్టుచున్నాను, నేను, నాకు చేతనయినంత వరకు నా కొరకూ లోకము కొరకు కాక, నీకై బ్రతికితిని. అయినను, ఇది ఎంత మాత్రము! అనంతత్వము నీ చేతిలో నున్నది. భగవంతుని మించి బ్రతుకుటకు మానవు డెంతవాడు అనగలిగిన వానిదే ఆనందము."

ఆ మఠాధికారి అంతకన్నా యింకేమీ అనలేదు. అందరికీ ఆశీస్సులు చెప్పి, మోకరించి అతని ముఖాన్ని చేతులతో కప్పుకొని ఉండిపోయాడు. ఈ లోగా సభ్యులంతా లేచిపోయినారు. అతను ఒక్కడే మిగిలినాడు.

10. అష్టమిత్రుడు

చర్చినుండి స్పౌటర్ ఇన్‌కి తిరిగి వచ్చేటప్పటికి వంట రిగా కూర్చున్న క్వీకెగ్ కనబడ్డాడు. అతను చర్చిలోని మతాధికారి ప్రసంగము ముగించక ముందే లేచివచ్చాడు. గదిలో వెచ్చదనం కోసం ఏర్పాటు చేసి ఉన్న మంట కెదురుగా బెంచిమీద కూర్చుని చేతిలో తన నల్లటి బొమ్మను పట్టుకొని, చిన్న కత్తితో దాని ముక్కును చెక్కుతూ తనలో తానే ఏవో పాడుకొంటున్నాడు.

నేను లోపలకు వెళ్లటంతో అతని కార్యకలాపాలకు భంగం ఏర్పడింది. ఆ బొమ్మను ప్రక్కన పెట్టి, మేజా దగ్గరకు వెళ్ళి ఒక పెద్ద గ్రంథాన్ని తెచ్చుకొని, అందులోని పుటలని, ఒక్కటొక్కటే లెక్కపెట్ట సాగాడు. ప్రతీ యాభై పేజీలకూ తల ఎత్తి శూన్యదృక్కులతో నలుదిశలూ పరికించి ఆశ్చర్యసూచకమైన ఈలను వేస్తూ ఉన్నాడు. అల్లే, ఆ పుస్తకంలోని పుటలనన్నీ తడవకు యాభై చొప్పున లెక్కవేసి, మొత్తము పుటల సంఖ్యకు ఆశ్చర్యపోయాను. అతనిని మిక్కిలి ఆసక్తితో చూస్తూ వున్నాను. అతను ఎంత అనాగరీకుడైనా, అతని ముఖము ఎంత వికృతముగా ఉన్నా, ఆ ముఖంలో అనాదరణీయము కాని లక్షణమేదో ఉన్నది. ఆత్మను దాచటం అసంభవము కదా! అతని శరీరమంతా

వ్యాపించియున్న రాక్షస చిహ్నములకు ఆవల అమాయికమయిన హృదయ చిహ్నములు పొడగట్టినవి. విశాలములు, అరుణవర్ణములు, అగ్ని తేజములు అయిన అతని కళ్ళల్లో సహస్ర పిశాచములను ధిక్కరింపగల ధీర లక్షణములు గోచరించినవి. ఇవన్నీ కాక, వానిలో ఒక ఉదాత్తత ఉంది. దానిని అతని మోటుతనము మాపివేయజాలదు. ఎప్పుడూ అప్పు చేయనివానివలె, కనబడ్డాడు. అతను ముండిత శిరస్కుడగుట చేత కాబోలు అతన్ని నుదురు మామూలుకంటె ఎంతో విశాలముగా, తేజోవంతముగా కానవచ్చింది. ఈ కారణం చేతనో, మరెందుచేతనో తెలియదుకాని, శారీరకశాస్త్రము ప్రకారము అతని శిరస్సు గొప్పగా ఉన్నట్లు కనబడింది. శిలా ప్రతిమలలో కనబడే జార్జి వాషింగ్‌టన్ తలవలె ఉన్నది. మీరు నవ్వీన నవ్వుదురుగాక, వాషింగ్‌టన్ శిరస్సు వలెనే ఇతని శిరముకూడా లతాగుల్మములతో గుబురుకొని ఉన్న గుట్టలవలె వెంట్రుకలతో దట్టమై, ఎత్తుగా ఉన్న కనుబొమ్మలనుండి క్రమముగా వెనుకకు వాలి ఉన్నది. ఇంత ఏల! నరమాంస భక్షకుడుగా పరిణమించిన జార్జి వాషింగ్‌టనే ఈ క్వీక్వెగు !

బయటపడుతున్న వర్షంవైపు చూస్తున్నట్లు నటిస్తూ నేనాతనిని నిశితంగా పరీక్షించాను. కాని. నేను అక్కడున్నట్టు కూడా అతను లెక్క చేయక అద్భుతమైన తన పుస్తకంలోని పుటల్ని లెక్కపెట్టుకొంటూ కూర్చొన్నాడు. గతరాత్రి మేమిద్దరమూ కలసి పడుకొన్న సంగతినీ, తెల్లవారు

ఘామున ఆప్యాయంగా అతను నాపై వేసిన చేయి సంగతిని తలచుకొని, ఇప్పటి అతని నిర్లతత్వానికి ఆశ్చర్యపోయాను. ఏమయినా, ఈ ఆటవికులు వింతవాళ్ళు కదా! ఒకొక్కసారి వాళ్ళను గురించి ఏమనుకోవాలో కూడా తెలియదు! మొదట భయంకరంగా తోస్తారు. అంతలో ప్రశాంతమైన స్థిమిత చిత్తముతో సోక్రటీస్ వంటి జ్ఞానులుగా, సాధువులుగా కాన వస్తారు. క్వీకెగు ఆ హోటలులోని ఇతర నావికులతో ఎక్కువగా మాట్లాడకపోవటం గమనించాను. తన స్నేహితుల బృందాన్ని ఎక్కువ చేసుకోవాలనే కోరిక అతనికి లేనట్లే అనిపించింది. ముందు నాకిదంతా విచిత్రంగానే కనపడినా, ఆలోచించిన కొలదీ, ఇది గంభీరమయినదిగా తోచింది. తన స్వస్థలం నుండి ఇరవై వేలమైళ్ళ దూరంవచ్చి ఎవరో కొత్త ప్రజల మధ్య ప్రశాంతంగా, ఇంటివద్ద నున్నంత సుఖంగా కాలం గడుపుతున్నాడితను. ఆ నిశ్చలత్వము, ఆ తృప్తి, ఆ సమర్థత — ఇవన్నీ ఉత్తమ తాత్విక లక్షణములు. అటువంటి తత్వమంటూ ఉన్నట్లు అతను ఎప్పుడూ విని వుండడు. మనముకూడా నిజమైన తాత్వికులము కావలెనంటే తాత్విక జీవితము గడుపుతున్నట్లు, అందుకై ప్రయత్నిస్తున్నట్లు గుర్తెరిగి వుండరాదు. ఎవరైనా తాను వేదాంతిని అని చెప్పుకొంటే "కథలో చెప్పబడిన అజీర్ణ వృద్ధురాలివలె ఇతను కూడా జీర్ణశక్తిని పోగొట్టుకున్న నిర్భాగ్యుడు" అని అనుకొంటాను.

ఆ గదిలోని మంట, గదిని వెచ్చచేసి చల్లరింది. సాయం సంధ్యారాగము చుట్టూ అలముకొని, ఏకాంతంగా వున్న మామీద ప్రసరింపసాగింది. బయట [illegible] [illegible]తోంది. అప్పుడు నాకు ఏవో వింత భావాలు కలిగాయి. నేను కరగిపోతున్నట్లయింది. గాయపడ్డ నా హృదయము, క్రోధోన్మత్తమయిన నా చెయ్యి, ప్రపంచములో పోరాటాన్నుండి విరమించుకొన్నాయి. వాటికి విమోచనము కలిగించినవాడు వుపశమున కాంక్షుడైన ఆ ఆటవికుడే. అదిగో! అక్కడ కూర్చున్నాడు. అతని వుదాసీనభావమే అతని ప్రకృతిని చాటుతోంది. అతడు అనాగరికుడైనా చూడదగిన మూర్తి. అతనిలో నాగరికపు కపటాలుగాని తుచ్ఛపు మోసాలుగాని దాగిలేవు. కాని అతనంటే నాకు తెలియని ఆకర్షణ ఏదో కలిగింది. ఇతరులకు వెగటుకొల్పే లక్షణములే నన్ను ఆకర్షించాయి. "క్రైస్తవప్రేమ" అన్నది నిస్సారమైనదిగా తేలిపోయినది కనుక నేను ఈ అక్రైస్తవునితో స్నేహం చేయదలిచాను. నా బల్ల అతని దగ్గరకు లాక్కొని ఏవో సంజ్ఞలు చేస్తూ అతనితో మాట్లాడ ప్రయత్నించాను. ముందు ఏదో నిర్లక్ష్యంగా వున్నా గతరాత్రి అతను నాకు పండుకోవటంలో చూపిన ఔదార్యాన్ని సూచింపగా మరల ఈ రాత్రికూడా కలసి పండుకొందామా అని సౌంజ్ఞ చేశాడు. నేను సరే నన్నాను. కృతజ్ఞతతో అతని ముఖము విప్పారింది.

అతని పుస్తకాన్ని ఇద్దరం కలసి తిరుగవేశాం. అందులోని కొన్ని బొమ్మల గురించి, అచ్చుయొక్క సౌకర్యము

గురించి, కొద్దిగా చెప్పాను. అతను నా మాటలలో ఆసక్తి చూపాడు. ఆ ఊళ్ళో చూడవలసిన వాటిగురించి చేతనయినంతగా మాట్లాడుకొన్నాం. పొగపీల్చుదామని నేను సూచించగానే, సంచిలోనుంచి అతని పైప్‌ని తీసి నాకు ఇచ్చాడు. గొట్టము అప్పటినుంచి వెలిగించి అతనొక గుక్క, నేనొక గుక్క త్రాగటం మొదలుపెట్టాం. ఇతఃపూర్వము అతడు నా యెడ ఏమాత్రము ఉదాసీనుడై ఉన్నా ఈ పొగ పీల్చటంతో అది ఎగిరిపోయింది. మేము ఆప్తులమయాము. పొగపీల్చట మయిపోయాక అతడు తన ముఖాన్ని నా ముఖానికి ఆన్చి, నా నడుముచుట్టూ చేయివేసి, ఇక మనిద్దరం పెళ్ళి చేసుకున్నాం అన్నాడు. వాళ్ల దేశపు భాషలో ఈ మాటకి అర్థం మనిద్దరం ఆప్తమిత్రులము అనుట. నా కోసం అవసరమయితే ప్రాణాలయినా యిస్తానన్నాడు. ఎవడయినా ఇంత అచిరకాలములో ఇట్టి మైత్రిని ప్రకటన చేస్తున్నాడంటే, అది హాస్యాస్పదంగా వుంటుంది. కాని ఈతని విషయంలో అట్టి సందేహాలు పనికిరావు.

భోజనానంతరము కొంత ఇష్టాగోష్ఠి సలిపి మా గదిలోకి వెళ్ళాము. తాను అమ్మకానికి తెచ్చిన శిరస్సులలో ఒకదానిని నాకు బహూకరించాడు. పొగాకు సంచిలో అట్టడుగున వున్న సొమ్ములో ముప్ఫై వెండి డాలర్లను బయటకు తీసి బల్లమీద పరచి, రెండు భాగాలు చేసి "ఈ భాగము నీది" అని నా ముందుకు తోశాడు. నేను వలదం

టున్న కొద్దీ ఆ నాణెములను నా జేబులో పోశాడు. నేను ఊరకున్నాను.

సాయంకాలపు ప్రార్థనలను చేసికోవటానికి తనవద్ద నున్న ప్రతిమ తీసికొని ఎదుట పెట్టుకొని కూర్చున్నాడు. నన్ను కూడా కలిసి ప్రార్థించమని కొన్ని సంజ్ఞలు చేశాడు. ఆ పూజాస్వరూపము ఇదివరకు చూచాను కనుక నేను అతనితో కలవటమా లేదా అని ఆలోచించాను. క్రైస్తవ మతంలో, అందులోను, ప్రెస్ బిటేరియన్ సంప్రదాయంలో పుట్టి పెరిగిన నేను ఈ ఆటవికునితో కలసి ఒక చిన్న చెక్క ముక్కను దేవునిగా భావించి ఎట్లు ఆరాధించగలను! కాని ఆరాధన అంటే ఏమిటి? సకలలోకాలకు, క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు ప్రభువయిన భగవంతుడు ఈ చిన్న ప్రతిమ యెడ అసహ్యించుకుంటాడా? అసహ్యించుకోడు! అది అసంభవము. అయితే, ఆరాధనంటే ఏమిటి? ఈశ్వ రాజ్ఞ పాలించటం. ఈశ్వరాజ్ఞ అంటే ఏమిటి? తోడి ప్రాణులు నీకు ఏమి చేయవలెనని కోరుదువో వారికి నీవు అది చేయుట ఈశ్వరాజ్ఞ! నాతోడి ప్రాణి, అతనివల్ల నేను కోరునది ఏమిటి? క్రైస్తవ సంప్రదాయము ప్రకారము ఈశ్వరారాధన చేయుటం. అందుచేతనే అతని సంప్రదాయం ప్రకారం నేను అతనితో చేరి ఈశ్వరారాధన చేయాలి! అంటే, నేను విగ్రహారాధకుని అవుదునుగాక! నేను ఆ బొమ్మముందు దీపం వెలిగించి క్వీకెగ్ వలె బిస్కటు ముక్కని దానికి నైవేద్యం పెట్టి నమస్కరించి దానిని ముద్దు

పెట్టుకొన్నాను. పూజ ముగిసింది! మనస్సు శాంతించింది. ఒక్క క్షణం పిచ్చాపాటి మాట్లాడుకొని పడుకొన్నాము. ఎందుచేతనో చెప్పలేముగాని రహస్య సంభాషణలకు పక్కను మించిన స్థలము లేదు. భార్యాభర్తలు ఒకరి హృదయము లొకరికి విప్పిచూపుకొనే సమయమదే కదా! వృద్ధదంపతులుకూడ ఆ పక్కమీదనే కదా చిన్ననాటి ముచ్చటలను చెప్పుకుంటూ తెల్లవారే వరకూ గడుపుతారు! క్వీకెగ్, నేను ఆ విధంగా అనురాగమయులమై పండుకున్నాము.

11. ప్రక్క మీద

ఆలా కబుర్లు చెప్పుకొంటూ మధ్య మధ్య కునుకు తీస్తూ ఎంతో స్వేచ్ఛగా పండుకొన్నాం. క్వీకెగ్ మధ్య మధ్య తన కాలిని నామీద వేస్తూ తీస్తూ పండుకొన్నాడు. కొంతసేపటికి మా నిద్ర పూర్తయింది. ఇంకా బాగా తెల్లవారక మునుపే ప్రక్కనుండి లేవాలని అనిపించింది.

నిద్ర తేలిపోయిన తర్వాత ఊరక పండుకొనిఉండటం కష్టం కాబట్టి లేచి మంచాన్ని ఆనుకొని మోకాళ్ళ మీద ముఖం పెట్టుకొని కూర్చున్నాం. అలా కూర్చుండటం వల్ల వెచ్చగా, సుఖంగా ఉంది. బయట చలి. గదిలో కూడా చలిమంట లేనందువల్ల దుప్పటి తీస్తే చలి ఎక్కువగనే ఉంది. శారీరకమయిన వెచ్చదనాన్ని బాగా అనుభవించాలంటే శరీరంలో ఏదో కొంతభాగం ఆచ్ఛాదన లేకుండా వుండాలి. ప్రతియోగ గుణాలవల్లనే పదార్థాల విలువలు తెలుస్తాయి. ప్రపంచములో ఏదీ సర్వస్వతంత్రము కాదు. శరీరమంతా ఆచ్ఛాదించుకొని, వెచ్చగా హాయిగా సుఖమనుభవిస్తున్నానని భావించటం సుఖమనుభవించటమే కాదు. మావలె, ముఖానికో, శిరస్సుకో, కొంత చలిగాలి తగులుతూ మిగిలిన శరీరం ఆచ్ఛాదితమై ఉంటే శరీరమంతా సుఖంగా వున్నట్టు తోస్తుంది. కాబట్టి పడకగదిలో ఎప్పుడూ

నిప్పుమంట వుండకూడదు. అది ధనికుల విలాస లక్షణమే కాని, సుఖలక్షణం కాదు! బయటి చలికీ, నీకూ మధ్య ఒక దుప్పటి మాత్రమే వుంటే మంచు ముక్కలో నిప్పు గావలె సుఖించవచ్చు. పక్క మీద వుంటే నిద్రపోతున్నా, పోక పోయినా, ప్రక్క యొక్క సుఖాన్ని గురించి ఆలోచించు కోడానికి వీలుగా వుంటుందని కళ్ళు మూసుకోవడం నాకు అలవాటు. అసలు కళ్ళు మూసుకొంటేనే గాని ఎవనికీ తన రూపం తనకు తెలియదు. మన శారీరక సుఖాలకు వెలుగు అవసరమేకాని, ఆత్మప్రవార్థానికి చీకటియే సహజస్థావరము. కళ్ళు తెరచాను. నేను స్వయంగా కల్పించుకొన్న చీకటి వలని హాయి పోయింది. వికృతము, తేజోహీనము అయిన నిశాంధకారం సాక్షాత్కరించింది. అది నాకు దుస్సహమని పించింది. క్రైకెగ్ దీపం వెలిగిద్దామన్నాడు. తనకి పొగపీల్చు కోవాలని వుందన్నాడు. ఆ క్రిందటి రాత్రి అతను పక్క మీద పడుకొని పొగ పీల్చుస్తానంటే నాకు కలిగిన అస హ్యము యిప్పుడు లేకపోయింది. మైత్రి పెంపొందితే మన విద్వేషు కాసూయలు తమంత అంతరించి పోతాయి. పొగ త్రాగటం అతనికి సుఖాన్ని ఇస్తుంది కనుక అతని సుఖాన్నే కోరి నేను సరే నన్నాను. ఇంటికి అగ్నిప్రమాదంవల్ల వచ్చే నష్టానికి హోటలువాడు యింటిని భీమా చెయ్యటం మొదలయిన వ్యవహారాలు నా మనస్సుకి పట్టలేదు. నిజమైన స్నేహితునితో దుప్పటిని పైప్‌ని పంచుకొన్నందువలన కలిగే సంతృప్తే నాకు చాలు. బుజముల దాకా కప్పుకొని, పైప్‌ని

ఒకరి వద్దనుండి ఇంకొకరికిమార్చుకొంటూ పొగ పీల్చ సాగాము. దీపపు కాంతిలో మేము వదిలిన పొగ తళతళా మెరిసించి.

ఆ పొగవల్లనో మరేందువల్లనో కాని ఆ ఆటవికుని మనస్సు స్వస్థలంవైపు మళ్ళింది. అతని చరిత్ర విందామని నాకూ ఉత్సుకత హెచ్చింది. తన కథని చెప్పమని అతనిని వేడుకొన్నాను. అతను చెప్పిన మాటలన్నీ అప్పుడు అర్థం కాకపోయినా తరువాత అతనితో మైత్రి వృద్ధి అయినకొద్దీ అతని పరిభాష అర్థమవసాగింది. ఆ కథని పూర్తిగా అర్థం చేసికొన్నాక తెలిసిన విషయం ఇది.

12. జీవితగాథ

నైరృతి దిక్కుగా ఉన్న రొకొవొకొ ద్వీపము క్వీకెగ్ స్వస్థలము ఈ ప్రదేశము ప్రపంచ పటములో ఉండదు. ఆ పటాలమీద చూపబడవలసిన స్థలాలు చూపబడవు.

చిన్నతనంలో చెప్పులను తొడుక్కొని మేకలను కాస్తూ పొలాలవెంట పరుగెత్తే వయస్సులోనే క్వీకెగ్‌కి క్రైస్తవ రాజ్యాలను చూడవలెనని, ఒకరిద్దరిని తిమింగిలాల వేటగాళ్లని చూస్తే చాలదనీ, ఆశపుట్టింది. అతని పుట్టుక సామాన్యమయినదికాదు. తండ్రి ఒక దొర, పినతండ్రి ఒక మత గురువు, పినతల్లులు అజేయులైన వీరుల భార్యలట ! అతని నాళములలో ఆ వీరరక్తము ప్రవహించుచున్నది. కాని చిన్నతనములో సరియైన శిక్షణ లేనందువల్ల ఈ రాచజీవి కొంత భ్రష్టమైపోయిందని నా ఉద్దేశం. దానివల్లనే అతని ఈ నరమాంస భక్షణ రుచి అలవడి ఉంటుంది.

సాగ్ హార్బరునుండి వాళ్ళ రేవుకి ఒక ఓడ వచ్చింది. దానిని ఎక్కి క్రిస్టియను దేశాలకు రావాలని క్వీకెగ్ ఆశపడ్డాడు. అప్పటికే నావికులతో నిండివుండటవల్ల ఆ ఓడలో ఇతనిని ఎక్కించుకోవటానికి వీలుపడదన్నారు. రాజైన అతని తండ్రి పలుకుబడికూడా ఏమీ ఫలించలేదు. కాని క్వీకెగు తన సంకల్పం నెరవేరి తీరాలని ప్రతిన పూనాడు. ఈ ఓడ

వెళ్ళే దారిలో ఉన్న ఒక జలసంధికి తన చిన్న తెప్ప వేసికొని వెళ్లాడు. అక్కడ ఒకవైపు పగడాలదిబ్బ మరోకవైపు తోపులతో నిండియున్న చిన్న స్థలం. ఆ తోపులమాటున దాగివుండి, ఓడ అటువైపు రాగానే తన తెప్పమీదనుండి ఓడకి వ్రేళ్ళాడివున్న గొలుసు పట్టుకొని మెల్లగా ఓడ తట్టు మీదకు ఎగబ్రాకాడు. ఏమైనాసరే అక్కడనుండి దిగి రాకూడదని నిర్ణయించుకొన్నాడు.

అతనిని బయటకు పారవేస్తానని కెప్టెన్ బెదిరించాడు. అతని చేతులు నరికివేస్తానంటూ భయపెట్టాడు. కాని క్వీకెగు రాచబిడ్డాయె! ఒక్క అడుగు వెయ్యలేదు. క్రైస్తవ దేశాలను చూడాలన్న ఇతని గాఢవాంఛను అతని నిర్భయాన్ని గ్రహించి కెప్టెన్ విస్మితుడై ఎట్టకేలకు అతను ఓడమీద ప్రయాణం చేయుటానికి అంగీకరించాడు. ఈ రాచబిడ్డ, కెప్టెన్ యొక్క గదిని చూడనే లేదు. అతనిని నావికులతో పాటు ఓడ క్రింది భాగములో తోసి తిమింగిలపు వేటగానిగా మార్చారు. పరదేశాల ఓడరేవులలో పనిచెయ్యటానికి వెనుకాడని రాష్యారాజు, జార్ పీటర్ వలెనే, క్వీకెగుకూడ ఈ పనులని చెయ్యటానికి వెనుకాడలేదు. దానివలన తన దేశస్థులకు మేలు కల్గుతుందని అతని ఆశ. క్రైస్తవుల శుశ్రూష చేసి వారి విద్యలను మరియును పనులను నేర్చుకొని వాటిని తన ప్రజలకు నేర్పి వారిని ఎక్కువ సుఖజీవనులుగా చేయవచ్చునని అతనికి గాఢమైన వాంఛ కల్గింది. కాని ఆ తిమింగిలాల వాళ్ళ అలవాట్లని చూస్తే తన తండ్రి ఏలు

బడిలో వున్నవారివలెనే క్రిస్టియన్లుకూడ కూ్రరులుగా ఉంటా రని తెలిసికొన్నాడు. ఓడ సాగ్ హార్బర్ కు చేరింది. అక్కడ నావికులు ఏమి చేశారో చూశారు. నన్ టు కెట్ కి వెళ్లాడు. అక్కడ వాళ్ళు తమ భత్యాలను ఎలా ఖర్చుపెట్టుకొన్నారో చూశాడు. ఇక లాభంలేదని క్వీకెగ్ ఆశ వదలుకొన్నాడు. ప్రపంచములో ఏ భాగమైనా దుర్మార్గమైనదే అనిపించింది. నేను క్రైస్తవుడను కాకుండానే జీవితం గడపగలనని అను కొన్నాడు. మనస్సులో విగ్రహారాధకుడైనా, క్రైస్తవు లతో కలసి మెలసి బ్రతుకుతూ వారి వేషాన్నే వేస్తూ, వారి భాషనే మాట్లాడాలని ప్రయత్నిస్తాడు. అతను ఇల్లు విడచి చిరకాలమైనా అతని వింత అలవాట్లు మారకపోవడానికి కారణం ఇదే.

అతను తిరిగి స్వస్థలానికి వెళ్ళకూడదా అని ప్రశ్నించి తండ్రి ఎలాగూ వయస్సు మళ్ళిన వాడవటంవల్ల ఈ పాటికి చనిపోయి వుంటాడనీ, ఇతను వెళ్ళి పట్టాభిషేకం చేసుకో వచ్చునీ అన్నాను. వెళ్ళటానికి వీలులేదన్నాడు. క్రిస్టియనుల సహవాసము, వారి మలము తనను తన తండ్రి అధిష్టించిన సింహాసనమునకు తగని అపవిత్రునిగా చేసివేసినదని సమా ధానం చెప్పాడు. కాని కొంతకాలానికి పవిత్రతను సంపా దించుకొని వెళ్ళితే వెళ్ళగలడట. అప్పటికీ ప్రపంచం నాలుగు మూలలూ చూడాలని స్వేచ్ఛగా బ్రతుకుదామని కోరిక కలదట. అతనిని తిమింగిలాల వేటగాడుగా చేశారుగదా! అతని చేతులు, రాజఖడ్గానికి బదులు, ముళ్ళ తీగెను ధరించి

ఉన్నాయి. ప్రస్తుతం ఏమి చేయదల్చుకొన్నావని అడిగాను. “ఏముంది! సముద్రముమీద పడతాను ఎప్పటి లాగానే” అన్నాడు. నా ఉద్దేశంకూడా తిమింగిలాల వేటకు వెళ్ళదామనే నని, అటువంటి సాహసకృత్యానికి బయలుదేరాలంటే, నన్‌టుకెట్ వంటి రేవు ఇంకొకటి లేదని చెప్పాను. ఆ ద్వీపానికి నాతోపాటు రావాలని, నాతోపాటే ఓడ నెక్కాలని, నాతోపాటే ఉండాలని వెంటనే నిర్ణయించుకొన్నాడు. దీని కంతటికీ నేను సంతోషంతో ఒప్పుకొన్నాను. సముద్రమంటే పరిచయమున్నా తిమింగిలాల వేటలోని రహస్యాలు నా కెక్కువ తెలియకపోవడంవల్ల ఈ క్వీకెగ్ నాకు చాలా ఉపకరిస్తాడని అనుకొన్నాను. దీనికి తోడు అతనంటే నాకు అభిమానం ఎక్కువగా ఏర్పడింది. క్వీకెగ్ తన కథను ముగించాక, నన్ను కౌగలించుకొని తన నుదురు నా నుదుటికి ఆనించాడు. దీపాన్ని ఆర్పివేసి, మళ్ళీ పక్కమీద దొర్లి పండుకొన్నాము.

—:...:—

13. తోపుడు బండి

మరునాడు సోమవారం, ఉదయం మా దగ్గరనున్న తలకాయను ఒక మంగలివానికి అమ్మివేసి, హోటలులో మేము ఇవ్వవలసిన పైకమును, నా స్నేహితుని డబ్బుతోనే చెల్లించాను. పీటర్ కాఫిన్ చెప్పిన అభూతకల్పనలు విని క్వీకెగ్ గురించి నేను భయపడిపోయిన కారణంగా, నాకు క్వీకెగుకూ మధ్య పెంపొందిన స్నేహాన్ని చూచి ఆ హోటలు వాడు, అక్కడ బసచేసే ఇతరులు ఆశ్చర్యచకితులైనారు.

ఒక తోపుడుబండిని అద్దెకు తెచ్చుకొని దానిపై మా సామానులను వేసికొని రేవులోనున్న "ది మాస్" అన్నపేరు గల నన్‌టుకెట్ పడవకై వెళ్ళాము. మేము వెళుతూవుంటే మావంక అక్కడి ప్రజలు తేరిపార చూడసాగారు. నరమాంస భక్షకులు ఆ నగర వీధులలో సామాన్యంగా కనబడుతూనే ఉంటారు కాబట్టి, క్వీకెగ్‌ని చూడటంవలన వారికి ఆశ్చర్యం కలుగలేదు. నేనూ, క్వీకెగ్గూ అంత సన్నిహితంగా ఉండటం వారి ఆశ్చర్యానికి కారణం. కాని, మేము వాళ్ళను లెక్క చెయ్యక బండిని ఒకరి తరువాత ఒకరు తోసుకొంటూ వెళ్ళాము. మధ్య మధ్య క్వీకెగ్ తన ఈటెకు ఉండే తోలు తొడుగును సర్దుకొంటూ ఉండేవాడు. తిమింగిలాల వేటకై వెళ్ళే పడవలలో ఇటువంటి ఈటె లుంటవికదా. అతను దానిని ఇంటినుండి ఎందుకు మోసుకొని తెస్తున్నాడో తెలియక ఆ

సంగతి అడిగాను. నేను అడిగినది సబబే నని, కాని ఆ ఈటె అంటే తనకు ఎంతో ఇష్టమని, అది అనేక పోరాటాలలో పని చేసిందని, దానికి తిమింగిల హృదయ మర్మములు తెలుసునని చెప్పాడు. అందువల్ల దానిని విడువలేడట. పంటచేల కోతలకు వెళ్ళేవాళ్లు నిర్బంధం లేకపోయినా, తమ తమ కొడవళ్ళను తామే తీసికొని వెళ్ళినట్టు, క్వీకెగ్ తన ఈటెనే పట్టుకొని వెళ్తూవుంటాడు.

ఒకసారి నా దగ్గరనుండి తోపుడు బండిని తీసికొంటూ తాను మొట్టమొదటి సారిగా చదివిన తోపుడుబండ్ని గురించి ఈలా చెప్పాడు, ఆ వృత్తాంతం సాగ్‌హార్బరులో జరిగిందట. తన పెట్టెను హోటలుకి తీసికొని వెళ్ళటానికిగాను, అతనికి తోపుడుబండిని ఓడవాళ్లు ఇచ్చారట. దాని ఎట్లా వాడుకోవాలో తెలియకపోయినా తన అమాయకత్వం ఇతరులకు తెలియకూడదని, ఆ పెట్టెను బండిమీద వేసి కట్టి, బండిని భుజముమీద వేసికొని నడవటం ప్రారంభించాడట. "అదేమిటి క్వీకెగ్! నీకు అంతమాత్రం తెలియదా? నిన్ను చూసి అందరూ నవ్వలేదా" అని అడిగాను. ఈ మాట నేను అడగగానే అతను ఇంకొక కథ చెప్పాడు. వాళ్ల ద్వీపంలో పెళ్ళి విందులలో ఒక చక్కని చాప పరచి దాని మధ్య అలంకారానికి ఒక పెద్ద గిన్నెను ఉంచుతారట, దానిని లేత కొబ్బరి కాయల నీటితో నింపి ఉంచుతారట ఒకసారి ఒక ఓడ తమ ద్వీపం దగ్గర లంగరు వేసిందట. ఆనాడు తన చెల్లెలి వివాహం జరుగుతూ వుందట! ఆమె పనియోండ్ల కన్య. ఆ

ఓడ కప్తానును విందుకు ఆహ్వానించారట. అతిథులంతా సమా వేశమయిన తర్వాత ఈ కెప్టెన్ తనకై నిర్దేశింపబడిన గౌరవ స్థానం దగ్గరకు వెళ్ళాడు. ఆ స్థానం, రాజైన క్వీకెగ్ తండ్రికీ ఇంకొకప్రక్క మతగురువుకీ మధ్యనుంది. అక్కడే కొబ్బరి కాయ నీటిగిన్నె కూడా ఉంది. వారి ఆచారం ప్రకారం విందు ఆరంభింపక పూర్వం మతగురువు పవిత్రహస్తమును ఆ గిన్నెలో ముంచుతాడు. ఆ తరువాతనే ఆ పానీయం అక్కడున్న నలుగురికీ ఇవ్వడం జరుగుతుందిట. తనకు మత గురువు స్థానం ఉండటంవల్ల తాను ఆ ద్వీపపు రాజుకంటె ముఖ్యుడనని అనుకొని ఓడ కప్తాను ఆ గిన్నెలో తన చేతులు కడుక్కోవ ఆరంభించాడు. "ఇప్పుడే నుంటావ్ ! మా వాళ్ళంతా అతనిని చూచి నవ్వారు. అలాగే నన్ను చూచి మీవాళ్ళు నవ్వుతారు" అని బదులు చెప్పాడు.

చిట్టచివరకు, మా ప్రయాణానికై అయే చార్జి ఇచ్చు కొని సామానుని సర్దించుకొని పడవ తట్టుపై నిలబడ్డాం- తెర చాప నెత్తి పడవ అకుష్‌నెంట్ నదిమీాద మెల్లగా జారడం ప్రారంభించింది. ఒకవైపు న్యూబెడ్‌ఫోర్డు నగరపు డాబాలు, మంచుతో కప్పబడిన చెట్లు ఉన్నాయి, రేవులో పెద్ద పెద్ద దొంతరుగా ఉన్న పీపాలు, వేరొకవంక ప్రపంచాన్నంతా చుట్టుముట్టే తిమింగిలాల వేటకివెళ్లే పడవలు నిశ్శబ్దంగా భద్రంగా ఉన్నాయి. కొన్ని పడవలనుండి వడ్రంగులు, ఇత రులు పనిచెయ్యడం వల్ల కలిగే మోత వినవస్తోంది. ఒక దీర్ఘ ప్రయాణం ముగిసినంతనే రెండవది ప్రారంభమవుతుంది.

అట్లే రెండవ ప్రయాణం తరువాత మూడవది ప్రారంభ మవుతుంది. అదే వరుసలో ఒకదాని తరువాత ఒకటిగా మానవ ప్రయత్నాలు అంతులేకుండా సాగుతూ వుంటాయి.

మరికొంచెం పైకి వెళ్లగా స్వచ్ఛమైన గాలి వీచ సాగింది. "మాన్" పడవ తన ప్రక్కలకి అంటుకొన్న నురుగును విదిల్చివేసుకొంది. ఆ గాలిని పీల్చినప్పుడెంతో హాయి గొల్పింది. బానిసత్వపు చిహ్నాలను తనపై కనబర్చే భూమిని విడిచి తనపై అటువంటి ముద్రలను విడువనీయని సముద్రపు ఘనతను ప్రశంసించసాగాను.

క్వీకెగ్‌కు కూడా నా వలెనే సముద్రం సంతోష దాయకమైనది. అతని ముఖం విప్పారింది. అతని చిరునవ్వు నడుమ తీరయిన పండ్ల వరుస కనిపించింది. ప్రయాణం వడిగా ముందుకు సాగింది. పడవ సముద్రాన్ని ఎదుర్కొంటూ లేస్తూ మునుగుతూ, సుల్తాను ఎదుట మోకరించే బానిస లాగ కనబడింది. మేము పడవమీాద ఒక వైపున ఉన్నాము. మేము కూడా ప్రక్కలకు అటూ ఇటూ ఊగిసలాడాము. ఓడకున్న రెండు తెరచాపలు పెద్ద హోరు గాలిలో ఊగిస లాడే వెదుళ్లలాగ ఊగాయి. మేమిద్దర మూ విధంగా ఊగిస లాడిపోతూ మిగిలిన ప్రయాణీకులు మమ్మల్ని చూచి నవ్వు తున్నారన్న సంగతి గమనించలేదు. మేమిద్దరమూ అతి సఖ్యంగా ఉండటం ఒక వింత అయినట్లు వాళ్ళు నవ్వు కొన్నారు. ఇంతకూ శ్వేతజాతీయుడు వెల్లవేయబడిన నీగ్రో

కంటే ఏ విధంగా అధికుడో ! అయితే, ఆ ప్రయాణీకులలో మరీ పల్లెటూరి రకం వాళ్లు చాలమంది ఉన్నారు. తనని అనుకరిస్తూ వెక్కిరిస్తూన్న ఒకనిని క్వీకెగ్ పట్టుకొన్నాడు. ఆ గ్రామీణుని ఆయువు మూడిందనుకున్నాను. తన ఈటెను క్రింద పడవైచి వానిని ఎత్తి కుదవేశాడు. వాడు దభాలున క్రిందపడ్డాడు. క్వీకెగ్ మట్టుకు ప్రక్కకు తొలగి తన పైప్‌ను అంటించుకొని పొగ పీల్చడానికి నాకు అందించాడు. 'కెప్టెన్ ! కెప్టెన్ ! ఇక్కడ ఒక దయ్యముంది" అంటూ ఆ కుర్రవాడు పరుగెత్తాడు. ఆ అధికారి క్వీకెగ్ వైపుకు వస్తూ "ఏమిటయ్యా నీ ఉద్దేశం? కుర్రవాడిని చంపేసేవాడివి" అన్నాడు. క్వీకెగ్ నా వైపు తిరిగి "ఏమిటి వాడనేది" అని వచ్చీరాని భాషలో ప్రశ్నించాడు. వణికిపోతున్న కుర్రవానిని చూపించి "నీవు వానిని చంపినంత పనిచేశావు అంటున్నాడు" అని చెప్పాను. పచ్చపొడుపులున్న అతని ముఖవర్ణము ఆ సమయంలో దుస్సహమై పోయింది. "చంపడమా ! వాడు పట్టి అర్భకుడు. క్వీకెగ్ అలాటి వానిని చంపడు. తిమింగిలాలనే వేటాడుతాడు" అన్నాడు. కెప్టెన్, "ఇదిగో చూసుకో! నీ విద్యవేషాలు ఇక్కడ వేసినావంటే నిన్ను చంపేస్తాను. జాగ్రత్తగా మసలుకో" అని అరిచాడు.

కాని అదే సమయానికి కెప్టెన్ జాగ్రత్తగా మసలుకోవలసిన సమయం వచ్చింది. తెరచాప గాలికి నిలువలేక చిరిగి అటూ ఇటూ ఊగిసలాడుతూ ఓడ తట్టునంతా తుడిచివేయడం మొదలు పెట్టింది. క్వీకెగ్ చే దెబ్బలు తిన్న కుర్ర

వాడు ఓడమీద నుండి క్రిందపడ్డాడు. అక్కడున్న అందరూ కంగారు పడ్డారు. తెరచాపని ఆపడానికి ప్రయత్నించబూనడం కూడా అవివేకంలాగ కనిపించింది. కన్నుమూసి తెరిచేలోగా ఈ చివరనుండి ఆ చివరకు ఊగిపోతున్నది ఆ తెరచాప. ప్రతి క్షణం అదింకా చిరిగి పోతున్నదేమో ననిపించింది. ఎవరూ ఏమీ చేయలేదు. చేయలేకనూ పోయారు. అందరూ పడవ వెనుక భాగానికి పోయి, కోపగించి ఉన్న తిమింగిలం యొక్క క్రింది దవడలాగ కనిపిస్తున్న ఆ తెరచాపని చూస్తూ ఉండి పోయారు. అంతా అసమర్థులూ, నిస్సహాయులై యుండగా క్వీక్వెగ్ తన మోకాళ్ళ మీద పడి ఆ చాపక్రిందుగా దూరి వెళ్ళి అక్కడ నున్న ఒక తాటితో ఆ తెరచాప కట్టి వేశాడు. అందరూ ఆ ఓడకి తగిలించి ఉండే చిన్న పడవని విప్పడానికి వెళ్ళగా, క్వీక్వెగ్ తన చొక్కా తీసివేసి, సముద్రంలోకి దూకాడు. మూడు నిమిషాలపాటు అతను వడిగా ఈదడం చూశాను. ఎంతసేపు చూసినా అతనే కనబడ్డాడు కాని రక్షింపబడ వలసిన ఆ కుర్రవాడు కనబడలేదు. వాడు మునిగిపోయాడేమో! క్వీక్వెగ్ మరొకసారి నీటిమీద తేలి అటూ ఇటూ చూసి మళ్ళీ మునిగాడు. మరికొంత సేపటికి ఒక చేతితోనే ఈతకొడుతూ, రెండవ చేతితో చైతన్య రహితమయిన శరీరాన్ని ఈడ్చుకొంటూ వచ్చి వచ్చి పడవ ఎక్కాడు. ఆ కుర్రవాని ప్రాణాలు మళ్ళీ వచ్చాయి. అందరూ క్వీక్వెగ్‌ని మెచ్చుకొన్నారు. జయజయ ధ్వానాలు చేశారు. కెప్టెన్ అతనిని క్షమాపణ వేడుకొన్నాడు. అప్పటి

నుండి క్యోకెగ్ని. అతను ఆఖరిసారిగా సముద్రంలోకి దూకే వరకూ, అంటే పెట్టెలోనే ఉన్నాను. అతను ఈ విషయం ఏమైనా లెక్క చేశాడా! పెద్ద పెద్ద ధార్మిక సంస్థలనుండి పతకాలు, బహుమానాలు కావాలని అనుకొన్నాడా! ఏమీ లేదు. కేవలం తాగటానికి ఇన్ని మంచినీళ్ళు అడిగి పుచ్చుకొన్నాడు. ఆ నీటితోనే ఒంటిమీది ఉప్పును కడిగివేసికొని మామూలుగా బట్టలు తొడుక్కొని తన పైప్‌ను వెలిగించి, ఒకవైపుగా వెళ్ళి కూర్చున్నాడు. చుట్టూ ఉన్న వాళ్ళని చూస్తూ ఏమనుకొన్నాడో! "ఈ ప్రపంచం అందరికీ ఉమ్మడి సొత్తు, నా వంటి నరమాంస భక్షకులు ఈ క్రైస్తవులకు సహాయపడుతూ ఉండాలి" అని అనుకున్నాడేమో!

---

14. నన్‌టుకెట్ పట్టణము

అంతకు నుంచి మా ప్రయాణంలో చెప్పాకో దగ్గది ఏమీ జరుగలేదు. నన్‌టుకెట్‌కి క్షేమంగా చేరాము.

'నన్‌టుకెట్!' మీ ప్రపంచ పటాన్ని తీసిచూడండి! ఎటువంటి మూలానున్నదో! ఒంటరిగా ఎడ్డిసన్ లైట్‌హౌస్ కంటె ఒంటరిగా, ఎలా ఉందో దాని వైపు చూడండి. అది ఒక చిన్న గుట్ట, ఇసుక దిబ్బ, అంతా సముద్ర తీరమే. వెనుక ఏమీలేదు. అక్కడ ఇసుక విపరీతంగా ఉంది. నన్‌టుకెట్‌ను గురించి అక్కడి ప్రజలు కొన్ని విపరీతాలు చెప్పాతూ ఉంటారు. అక్కడ సహజంగా గడ్డియైనా మొలవదు. గడ్డి మొక్కలు తెచ్చి నాటి పెంచాలి. అక్కడ ఏ మొక్కా పుట్టి పెరగదు. కెనడానుండి ముళ్ళపొదలు దిగుమతి చేసుకోవాలి. నూనె పీపాల మూతలను బిగించే బిరడాలకు అవసరమయిన చిన్న చెక్కముక్కని ఎక్కడికయినా వెళ్లి తెచ్చుకోవాలి. రోము నగరంలో సిలువను మోసినట్లు చిన్న చిన్న కొయ్యముక్కలను వెంట తీసుకుపోవాలి! వేసవి కాలంలో నీడకయి ఇళ్ళ వాకిళ్ళముందు నేల ఉసిరిక మొక్కలని వేసికోవాలని, ఒక చిన్న గడ్డిమొక్క కనబడితే ఎడారిలో పచ్చికప్రదేశము కనబడటం వంటిదని, ఒకే రోజున మూడు గడ్డిమొక్కలు కనబడితే పెద్ద అడవిలో ఉన్నట్లనీ, వాళ్ళు తోడుకొనే కాలిజోళ్ళు లేప్‌లాండ్‌లో మంచుగో వెళ్ల

టానికి ఉన్నట్లు, దొంగ ఊబిలో వెళ్ళటానికి ఉపయోగించే వనీ, వాళ్ళు అన్నివైపులా మహాసముద్రించే చుట్టుముట్ట బడి యుండటం వల్ల వాళ్ల కుర్చీలకు, బల్లలకు సైతము వత్తగల్లలు అతుక్కొని ఉంటాయనీ - చెప్పుకుంటారు. కాని విపరీతాలన్నీ ఒక్క విషయాన్నే నిరూపిస్తాయి అది : నన్టుకెట్టూ, ఇలినాయిస్ ఒకటే కావని.

ఎర్రియిండియన్లు ఈ ద్వీపంలోకి ఏ విధంగా వలస వచ్చారో వినండి. ఆ కథ ఇలా ఉంటుంది. పూర్వ మొక ప్పుడు న్యూ—ఇంగ్లండు తీరంమీద ఒక రాబందు వాలి, ఒక చిన్న ఎర్రియిండియను పాపను తన కాళ్లతో తన్నుకొని పోయింది. తమ పాపని ఆ విధంగా సముద్రాల మీదుగా కంటికి కనబడకుండా ఎత్తుకొని పోవటం తల్లిదండ్రులు కన్నారా విచారిస్తూచూశారు. తాము అదిక్కునే వెళ్ళటానికి వారు నిశ్చయించుకొన్నారు. వాళ్లు తెప్పలమీద బయలుదేరి, ఎంతో ప్రమాదకరమైన ప్రయాణాన్ని చేసి ఈ ద్వీపాన్ని కను గొన్నారు. అక్కడ ఒక చిన్న దంతపు పేటిక వారి కంట బడ్డది. అది వాళ్ళ పాప అస్థిపంజరము.

నన్టుకెట్ వారు సముద్రతీరాన జన్మించడం చేత వాళ్ళకి సముద్రమే జీవనాధారం కావటంలో వింత ఏమున్నది! మొదటి రోజులలో ఇసుకలోని పీతలను పట్టుకుంటూండేవారు. కొంచెం ధైర్యం చేసి వలలతో వెళ్ళి తీరాన దొరికే చేపలను పట్టుకుంటూండేవారు. ఇంకా కొంతకాలానికి చిన్న చిన్న

పడవలలో వెళ్ళి తీరానికి దూరంగా ఉండే చేపలను పట్టడం అలవరచుకొన్నారు. చివరికి పెద్ద పెద్ద నౌకలను వేసుకొని సముద్రాలని చుట్టుముట్టడం ప్రారంభించారు. అన్ని వేళలా అన్ని సముద్రాలలో జంతుజాలమంతటిలో పెద్దవాటితో, క్రూరమైన వాటితో- పర్వతతుల్యమైన వాటితో ఎడతెగని పోరాటాన్ని సాగించారు. దాని నిర్భయమైన క్రూరమైన దెబ్బలకంటె దానికున్న నిగూఢమైన శక్తియే ఎక్కువ భయంకరం. అది సముద్రపు పెనుభూతము. తిమింగిలము!

సముద్రము మీద ఉన్న చిన్నగుట్టనుంచి బయటపడి ఈ నన్‌టుకెట్ వాసులు ప్రపంచపు సముద్రాలన్నిటినీ అలెగ్జాండరులాగ జయించడం మొదలుపెట్టారు. వాళ్లల్లో వాళ్లు అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రాలను పంచుకొన్నారు పోలెండుని మూడు దేశాలవాళ్ళు పంచుకొన్నట్లు. అమెరికా, మెక్సికోని, టెక్సాస్‌ని కలుపుకొని క్యూబాని కెనడా మీద వేసికొన్నా సరే, ఇంగ్లీషువాళ్ళతో ఇండియా అంతా నిండిపోయి వాళ్ళ పతాకమే అక్కడ ఎగిరినా సరే- కాని సముద్రములో మూడింట రెండు వంతులు నన్‌టుకెట్ వాసులదే. మహారాజులకు రాజ్యాలున్నట్టు దీనికి సముద్రాలున్నాయి. మిగిలిన వాళ్ళకి సముద్రాల మీద ప్రయాణాలు చేసే హక్కు మాత్రమే ఉంది. మామూలు ఓడలు పొడిగింపబడిన వంతెనల వంటివే! యుద్ధనౌకలు తేలిపోతున్న కోటల వంటివే. రహదారులమీద నుండే దోపిడిగాళ్ళవలె సముద్రాలపై తిరిగే ఓడదొంగలు భూమియొక్క తునకలవంటివే

అగు ఓడలని కొల్లగొడతారు. గాని వాళ్ళ జీవనోపాధికి సముద్రపు అట్టడుగు భాగానికి వెళ్ళరు. ఒక్క నన్‌టుకెట్ వాసి మాత్రమే సముద్రము మీద నివసించి, దానిని కొల్లగొట్టి తన సొంత పొలంలాగ అటూ ఇటూ దున్నుతాడు. అదే అతని గృహము, అక్కడే అతని జీవనము. ఎంతమందినయినా ముంచివేయ గలిగిన వరదలు అతనిని ఏమీ బెదరగొట్టవు. సంవత్సరాల తరబడి నేలముఖం చూడడు. ఒకసారి తిరిగి వచ్చాడంటే మానవుడికి చంద్రమండలం వలె, అతనికి భూమి వింతగా ఉన్నట్లు కనబడుతుంది. సూర్యాస్తమయ సమయానికి తన రెక్కలను ముడిచివేసుకొని కెరటాలచే జోకొట్టబడి నిదురించే సముద్రపు పక్షివలె ఈ నన్‌టుకెట్ వాడు, రాత్రివేళ భూమికి అగోచరుడై, తెరచాపలు ముడిచివేసి పండుకొంటూ ఉంటాడు. అతని తలగడ క్రిందనే తిమింగిలాల మందలు పరుగెత్తుతూ ఉంటాయి.

15. హొటలు భోజనము

పడవ లంగరు వేసేప్పటికి చాలా ప్రొద్దుపోయింది. భోజనం చేసి పడుకోవడం తప్ప ఆరోజున మేమిద్దరం ఇంకేమీ చేయలేకపోయాము. "స్పౌటర్ సత్రం" యజమాని తన బంధువైన "హోసియా హస్సీ" అనే అతనిని గురించి మాకు గొప్పగా చెప్పాడు. ఇతను. నన్ టుకెట్‌లో కెల్లా అత్యుత్తమమయిన హోటళ్లలో ఒకటైన "ట్రైపాట్స్"కి యజమాని మేము అక్కడ బసచెయ్యడం అత్యుత్తమమని సూచించాడు. గాని మేము ఆ హోటలు చేరడానికి అతను చెప్పిన దారి మాకెంతో చిక్కుగా తోచింది. అయినా ఆ చీకటిలో ఎలాగో ఒకలాగున తంటాలుపడి మేము గమ్యస్థానమును చేరాము. ఏదో పాత ఓడకి ఉండే స్తంభాలనుంచి వ్రేలాడే రెండు నల్లని కుండలు వాకిటముందు ఊగుతున్నాయి. ఎందు చేతనో కాని, ఆ దృశ్యము నాకు ఉరికంబాన్ని గుర్తు చేసింది. దీన్ని చూడగానే నాకేదో సందేహం కలిగింది. మనసులో ఏదో గుంజాటనం ప్రారంభించింది. మొదట కాఫిన్ అని పేరు గలవాడు హోటలు యజమాని, తరువాత చర్చిలో నావైపు చూస్తూండిన పాలరాతి ఫలకాలు; ఇప్పుడు ఈ ఉరికంబాలు వీటన్నిటికి ఏమిటి అంతరార్థము?

ఇంతలో ఒక ముసలమ్మ కనబడటంతో నేను ఈ ఆలోచనలనుండి బయట పడ్డాను. ఆమె వసారాలో మసక వెలుగునిచ్చే దీపం క్రింద నిల్చొండి ఎవరినో కేకలు వేస్తోంది

"త్వరగా కానీ- లేకపోతే ఏం చేస్తానో చూడు" అంది.

క్వీకెగ్‌తో నేను, "ఆవిడ హస్సీ భార్య అయి ఉంటుంది పద" అన్నాను.

నా ఊహ సరియైనదే అయినది. హస్సీ ఇంట లేనందు వల్ల వ్యవహారాలన్నీ అతని భార్యే చూసుకొంటోంది. బసా, భోజనమూ కావాలని మేము చెప్పగానే ఆమె అప్పటికి ఆ కేకలను ఆపి, మమ్మల్ని ఒక చిన్న గదిలోకి తీసికొని వెళ్ళింది. అప్పుడే ఎవరో భోజనంచేసి వెళ్ళిన చిహ్నాలు కానవస్తున్నవి. ఒక మేజావద్ద మమ్మల్ని కూర్చుండబెట్టి "నత్తలా, చేపలా" అని అడిగింది.

కాని వంటయింటి నుండి వచ్చిన ఆ వెచ్చని ఘుమ ఘుమ మా భయం మాపేసింది. భోజనం మా ముందుంచ బడిన తరువాత ఆ ఘుమ ఘుమ యొక్క రహస్యం తెలిసింది. పళ్ళెంలో చిన్న చిన్న నత్తలూ, వాటిమీద చిన్న బిస్కట్టు ముక్కలు, మాంసపు ముక్కలు వీటన్నిటిపైనా వెన్న, మిరియపు పొడి ఉన్నాయి. ప్రయాణంవలన బాగా ఆకలి వేసి యుండడంతో, ఆ భోజనం చాలా రుచిగా ఉండడం వలన, ఆ ఆహారాన్నంతా త్వరగా దిగమ్రింగి వేశాము. కొంచెము మెడ వెనుకకు వాల్చి ఏదో ఆలోచిస్తూ వుండగా ఆ హోటలు యజమానురాలు మా భోజనానికి ముందు చేసిన ప్రకటన జ్ఞాపకం వచ్చింది ఒక చిన్న

తమాషా చేద్దామనుకొన్నాను. వంట యింటి గుమ్మం దగ్గరకు వెళ్ళి "చేప" అని కేకవేసి వెళ్ళి నా కుర్చీలో కూర్చున్నాను. కొంతసేపటికి మళ్ళీ వంటయింటి నుండి కమ్మని వాసన వచ్చింది. కాని ఈ వాసన మునుపటిదాని కంటె వేరుగా ఉంది. మరికొంత సేపటికి మా ముందు చేపల వంటకం ప్రత్యక్షమయింది. మేము మళ్ళీ తింకి ఆరంభించాము. గిన్నెలో చెంచాను కదుపుతూ ఈ తిండికి మొనదు మీద ఏమి ప్రభావముందా అనుకొన్నాను. లేకపోతే "చేపతల వాళ్ళు" అనే సామెత ఎలా పుట్టింది?

"ఇదిగో, క్వీకెగ్! చూడు నీ గిన్నెలో ఆ చేప కదులుతూ ఉన్నట్టుంది, నీ యీటె ఏదీ?" అని అడిగాను.

ఈ ట్రైపాట్స్ అన్నది తమాషా అయిన ప్రదేశమే. అక్కడ కుండలలో ఎప్పుడూ ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. అక్కడ ముప్పొద్దులా ఇదే భోజనం. ఇంటి ముందరి స్థలమంతా నత్తగుల్లలతో పరుచబడి యుంది. హస్సీ భార్య 'కాడ్' చేపల వెన్నెముకలతో చేయబడిన కంఠహారాన్ని తాల్చియుంది. హస్సీ సొరచేపల చర్మంతో లెక్కల పుస్తకాలకి అట్ట వేయించుకొన్నాడు. అక్కడి పాలు కూడా చేపల వాసన కొట్టుతూ వుండటం ఎందువల్లనో మొదట తెలిసింది కాదు. కాని ఒకనాడు హస్సీ యొక్క ఆవు చేపముక్కల్ని తిని, చేపల్ని తొక్కుకుంటూ నిర్లక్ష్యంగా రావటం చూశాను. అప్పుడా పాలకు చేపల వాసన ఎందుకు వచ్చిందో అర్థమయింది.

భోజనమయిన తరువాత మా చేతికో దీపం ఇచ్చి మేము పండుకొనే గదికి ఆమె దారిచూపింది. క్వీకెగ్ నా కంటె ముందు మెట్లు నెక్క నారంభించాడు. ఆమె అడ్డగించి అతని చేతిలోని యీటెను తనకు అప్పజెప్పమని అడిగింది. పడుకునే గదులలోకి అటువంటి ఆయుధాలు తీసికొని వెళ్ల కూడదని చెప్పింది. ఏం ? తిమింగిలాలని వేటాడే ప్రతివాడు యీటెని దగ్గరే ఉంచుకుంటాడు గదా" అని ప్రశ్నించాను.

"అలా ఉంచుకోవడం ప్రమాదం. స్టిగ్స్ అనేవాడు నాలుగున్నర యేళ్ళ పాటు సముద్రాల మీద తిరిగి తిరిగి మూడే వీపాల నూనెతో తిరిగి వచ్చాడు. వాడు ప్రక్కన యీటె నుంచుకొని తెల్లవారే సరికి చచ్చిపడి యున్నాడు. అప్పటి నుంచీ ఆయుధాలతో ఎవళ్ళనీ గదుల్లోకి వెళ్ళనీ యడంలేదు కాబట్టి ఆ యీటెని నా చేతికి యిచ్చేసి వెళ్ళు. ప్రొద్దున మళ్ళీ తీసికొందువుగానిలే" అని క్వీకెగ్‌తో అంది "పరే కాని పొద్దున్న మీ కేమి కావాలి ? మత్తలా, చేపలా" అని అడిగింది. "రెండూనూ, వాటితో పాటు యింకేమయినా రకాలని కూడా వేసి యివ్వమ"ని చెప్పాను.

16. ఓడ

పక్కమీద పండుకొని మరునా డేమిచేయాలోనని ఆలోచించాము క్వీకెగ్ నాకొక వింతసంగతి చెప్పాడు. అతను పూజచేసే ఆ చిన్న బొమ్మపేరు 'యోజో' యట. తిమింగిలాల వేటకై మేము ఏ పడవనెక్కాలో నిర్ణయించు కోవటానికి మే మిద్దరము కలిసి వెళ్ళకూడదని, నే నొక్కడినే వెళ్లాలని, తాను అప్పుడే మా కోసం ఒక పడవని ఎంచి ఉంచానని, నేను వెళ్ళితే ఆ ఓడే కంటబడ తుందనీ యోజో నా మిత్రునితో అన్నాడట.

క్వీకెగ్ ఈ యోజో యొక్క సలహాలను, జోస్యాలను బాగా పాటిస్తాడు.

ఇప్పుడీ పడవ నెంచుకొనే విషయమై క్వీకెగ్ సూచించిన పథకము నాకు నచ్చలేదు. మేము వెళ్ళటానికి అన్ని విధాలా యోగ్యమైన పడవనేదో నైపుణ్యంతో క్వీకెగ్ ఎంచగలుగుతాడని నే నప్పటి వరకూ భావిస్తూ వచ్చాను. నె నెన్ని విధాలా బ్రతిమాలినా క్వీకెగ్ వినకపోవడం వలన నేనే ఆ వ్యవహారాన్ని ఏదో త్వరగా తెముల్చుకోవాలనే దృఢ నిశ్చయంతో బయలు దేరాను. ఆ మరునాడు క్వీకెగ్ ఏదో దీక్షతో ప్రార్థనలలో మునిగి వున్నాడు. అతన్ని అతని యోజోని, గదిలో విడిచి నేను రేవు వైపు నడిచాను,

చాలా చోట్ల తిరిగిన తరువాత, చాలామందిని కనుక్కొన్న తరువాత మూడు ఓడలు మూడేసి సంవత్సరాల ప్రయాణాలకై సిద్ధమగుతున్నట్లు విన్నాను. వాటి పేర్లు "డెవిల్ డామ్" "టిట్ బిట్" పెకోడ్". వీటిలో మొదటి రెండు పేర్లు ఎలా వచ్చినా, మూడవది మాత్రం మసాచుసెట్స్ ఇండియన్లలో ఒక జాతివారి పేరు. ఈ జాతివాళ్ళు యిప్పుడు లేరు. ముందు "డెవిల్ డామ్"ను, తరువాత "టిట్ బిట్"ను పరీక్షించాను. చివరకి "పెకోడ్"ను కూడా చూసి; మాకు అనువైన ఓడ అదే అని నిశ్చయించుకొన్నాను.

మీరు ఎన్నోరకాల ఓడలని చూసి ఉండవచ్చు. కాని పెకోడ్ అంత అరుదైన దానిని, పాతదానిని ఎక్కడా చూసిఉండరు. పూర్వకాలపు పద్ధతిని కట్టబడిన ఓడ అది. ప్రపంచం నాలుగు మూలలా, అన్ని వాతావరణాలలోను, తిరగడంవల్ల ఆ ఓడ బాగా రాటు తేలింది. దాని వెలుపలి భాగమంతా నల్లబడి పోయింది. ఈజిప్టులోను, సైబీరియాలోను కూడా పనిచేసిన ఫ్రెంచి దేశస్థునిలాగ! ఆ ఓడముందు భాగానికి గడ్డం వచ్చినట్టు ఉంది. ఆ ఓడ మొదటి స్తంభాలు పడిపోగా క్రొత్తవాటిని జపానులో కట్టించారు. అవి నిటారుగా ఉన్నాయి. ఆ ఓడ తట్టు ముడతలుపడి విరివిగా భక్తులు నడచి వెళ్ళిన చర్చిలోని రాళ్ళవలె ఉంది. ఈ పాత లక్షణాలన్నిటిమీద, క్రొత్తవి, వింతవి అయిన కొన్ని హంగులు చేర్చబడ్డాయి. గత అర్ధ శతాబ్దిలోని ఆ ఓడ తిరిగిన వ్యాపారానికి సంబంధించినవి ఈ హంగులు. కెప్టెన్

పెలెగ్ చాలాకాలం ఈ ఓడకి ముఖ్యనాయకుడు. అతను సావికా వృత్తినుండి విరమించుకొన్నాడు. కాని అతనుకూడా ఆ ఓడని కొనుక్కొన్న వాటాదారులలో ఒకడు. అతను, తన హయాములో ఎన్నో అలంకారాలు చేశాడు ఆ ఓడకి. మెడలో ఎన్నో దంతపు ఆభరణాలని పెట్టుకొన్న అనాగరికపు రాజువలె ఈఓడకికూడ ఎన్నో అలంకారాలు ఉన్నాయి.

ఆ ఓడని చూడగానే ఇది'తిమింగిల విజేత'అనిసూచించే విజయ చిహ్నాలతో నిండివుంది. తిమింగిలాలయెముకలుతిమింగిలాలదంష్ట్రిలు ఆ ఓడకు ఇరుప్రక్కల కొయ్యగసికలకు బదులుగాఉపయోగింపబడి యున్నాయి. క్రింది దవుడ యెముక భాగాన్ని చుక్కాను పిడిగా అమర్చారు. తుఫానులో ఆ పిడిని చేత పుచ్చుకొని ఓడను వశము చేసికొని నడిపే కర్ణధారుడు పొగరుపోతు గుర్రమును ఎక్కి దాని కళ్ళెమును వెనుకకు లాగి మద మణచి స్వాధీనము చేసికొన్న 'టాక్ టాక్' రౌతు వలె భాసిస్తాడు. అది మహోదారమైన ఓడ, కాని దానిమీద విషాద రేఖలు వున్నాయి. అన్ని వుదాత్త పదార్థము లు విషాదరేఖా శబలితములై ఉంటాయి.

ఓడ తట్టుయొక్క వెనుకభాగముమీద ఎవరైనా కనబడతాడేమోనని చూశాను. ఎవరైనా కనబడితే నేను ఆ ఓడనెక్క తలచిన ప్రయాణీకుడనని చెప్పుదామనుకొన్నాను. కాని ఎవ్వరూ కానరాలేదు. తెరచాప స్తంభము వెనుక త్రిభుజాకారముగా ఒక గుడారమున్నది. అది షుమారు పది అడుగుల ఎత్తు వుంటుంది. అది ఒక

మహాతిమింగిలము యొక్క దవుడల యెముకలతోను, తాలు భాగములతోను నిర్మింపబడ్డది. ఈ గుడారముయొక్క ద్వారం ఓడయొక్క ముఖభాగము వైపుగా వున్నది. అందువలన లోపలనున్న వానికిముందు వైపు అంతా బాగా కనబడుతుంది. ఆ గుడారములో, చూడగానే ఇతడు 'అధికారి' అనిపించే ఒకాయన కనబడ్డాడు. మిట్టమధ్యాహ్నమవటం వలన చేయదగ్గ పనియేమీలేక ఆయన విశ్రాంతి తీసికొంటున్నాడు. ఆయన కూర్చున్న బల్లయొక్క కాళ్ళుకూడా తిమింగిలపు దవడలకి చెందిన యెముకలతో చేశారు. నాకు ఆయనలో ప్రత్యేకత ఏమీ కానరాలేదు. ఆయన పెద్దవాడు, భారీమనిషి. శరీరం చామనచాయ. ఊదారంగు బట్టలు కట్టుకొన్నాడు. కళ్ళ చుట్టూ సన్నగా నున్న ముడతలు, ఎప్పుడూ గాలివైపే తిరిగి అనేక తుఫానులలో ప్రయాణంచేసి వుండటంవల్ల కలిగినవేమో! ముఖం చిట్లించుకొన్నప్పుడు ముడతలు ప్రస్ఫుటమవుతాయి కూడాను! "పెకోడ్" పడవకి కెప్టెన్ మీరేనా" అని ఆయునను సమీపించి అడిగాను.

"కెప్టెనే అనుకో. అతనితో నీకేమి పని?"

"నేను ఈ ఓడమీద వద్దామనుకొంటున్నాను"

"ఓహో! అట్లాగా! నువ్వు నకాటుకెట్ వాడివిలాగ లేవే! ఎప్పుడైనా వేటలకి వెళ్ళే ఓడని ఎక్కావా?"

"లేదు. ఎప్పుడూ ఎక్కలేదు"

"నీకు తిమింగిలాల వేట గురించి ఏమీ తెలియదనుకొంటా- అవునా?"

"నిజమే తెలియదు. కాని త్వరగానే నేర్చుకుంటాను. నేను సరకుల ఓడలమీద చాలా ప్రయాణాలు చేశాను"

"సరకుల ఓడల మాటకేం లేవయ్యా! ఆ కబుర్లు నా దగ్గర చెప్పకు. నా దగ్గర మళ్ళీ ఎప్పుడైనా ఆ ఓడల గురించి ఎత్తితే కాలు విరుగగొట్టేస్తాను. సరకుల ఓడలట! ఆ ఓడలమీద వెళ్ళానని చెప్పుకోవటం చాలా గొప్ప అనుకున్నావేమిటి!— సరేగాని తిమింగిలాల వేటకి వెళ్ళాలని నీకెందుకు బుద్ధిపుట్టింది? ఆ రహస్య మేమిటో చెప్పు! నువ్వు ఓడ దొంగవి కాదుగదా? లోగడ నువ్వు ఎక్కిన ఓడయొక్క కెప్టెన్ వద్ద ఏమీ దొంగిలించ లేదు కదా! సముద్రంమీద వెళ్ళాక ని ఆఫీసర్లని చంపివెయ్యాలని బుద్ధి గాని పుట్టదుకదా"

నేను అట్టి పాపముల నెరుగనని మనవి చేసుకొన్నాను. అతని ఛలోక్తు లన్నిటికీ వెనుక నామీద నిష్కారణ అనుమానమేదో వున్నదని అనిపించింది.

"అసలు ఈ తిమింగిలాల వేటకు బయలుదేరాలని నీ కెందుకు బుద్ధిపుట్టింది? ఆ మాట చెప్తే నిన్ను ఎక్కించుకోవటమో, ఎక్కించుకోకపోవటమో తరువాత చెప్తాను" అన్నాడు.

"ఆ వేట అంటే ఏమిటో తెలుసుకోవాలని వుంది. ప్రపంచం నాలుగు మూలలా చూడాలని వుంది."

"వేటని చూడాలని వుందా? నీ వసలు కెప్టెన్ అహాబ్ ని ఎప్పుడైనా చూశావా?"

"కెప్టెన్ అహాబ్ అంటే ఎవరండీ?"

"ఆయన ఈ ఓడకి కెప్టెన్"

"అయితే నేను పొరబడ్డా నన్నమాట. నేను కెప్టెన్ తో నే మాట్లాడుతున్నా ననుకుంటున్నాను."

"నువ్వు కెప్టెన్ పెలెగ్ తో మాట్లాడుతున్నావయ్యా! నేనూ, కెప్టెన్ బిల్డాడ్ ఈ ఓడ ప్రయాణం చేసేటప్పుడు కావలసిన సరకులనీ, మనుష్యులనీసమకూరుస్తూ వుంటాం. ఈఓడ యజమానులలో మేము ఒకరం. ఈఓడను నడిపించే వారిలో కూడా మేమొకరం. నీకు తిమింగిలాలవేట అంటే ఏమిటో తెలియాలంటే ఒక చిన్నవిషయం చెప్తాను. దానితో ఈవేట అంటే ఏమిటో, అందులో తలదూర్చక ముందే తెలిసిపోతుంది. నీవు కెప్టెన్ అహాబ్ ని నిదానించి చూస్తే అతనికి ఒకటే కాలు ఉన్నదని తెలుస్తుంది."

"మీా రనేదేమిటి ! అతని రెండో కాలు తిమింగిలం వల్ల పోయిందా."

"పోయిందా అని అడుగుతావేమిటి మల్లిగా! ఆ కాలుని రాక్షసుని వంటి తిమింగిలం కొరికి, నమిలి, మింగి వేసింది - తెలిసిందా!"

అతని వాలకం చూసి భయపడ్డాను. అతడు చెప్పిన విచార గాథవల్ల నా హృదయం కరిగింది. నెమ్మదిగా, "మీారు చెప్పినదాని బట్టి ఆ తిమింగిలం చాలా క్రూరమైన దనే తెలుస్తోంది" అన్నాను.

"చూడు అబ్బాయ్. నువ్వు చాలా మెత్తనివాడి లాగ ఉన్నావు. నువ్వు ఏమాత్రం ధైర్యంగా మాట్లాడటం

లేదు. అసలు నువ్వు ఎప్పుడైనా సముద్రంమీద ప్రయాణం చేశావా!"

"నేను సరకుల ఓడమీద ప్రయాణం చేశానని చెప్తూ కున్నాను కదండీ"

"సరే లేవయ్యా - సరకుల ఓడగురించి ఏమన్నానో గుర్తుందా! నన్ను ఊరికే రెచ్చగొట్టకు - జాగ్రత్త - దాని కేంలే - తిమింగిలాల వేట అంటే ఏమిటో నీకు సూచించాను - ఇంకా నీకు రావాలనే ఉందా!

"రావాలనే ఉందండీ"

"సరే బాగానే ఉంది. ఈ బెరిచి తిమింగిలం నోటిలోకి విసిరి దానిమీదికి ఉరకగలవా!"

"ఉరకగలను" తప్పనిసరిగా దూకవలసివస్తే నేను సిద్ధమే - నన్ను వదిలించుకోవాలని మాత్రం మీరు దూక మనరనుకుంటాను."

"బాగానే ఉంది— తిమింగిలాల వేట అంటే ఏమిటో తెలుసుకుందామనే కాక, ప్రపంచం నాలుగు మూలలూ చూడటానికి కూడా ఈ ప్రయాణాన్ని తలపెట్టానన్నావు కదా - ఇటురా - అటు చూసి నీకు ఏమి కనబడుతోందో చెప్పు."

ఈ వింత కోరిక గురించి ఏమనుకోవాలో తెలియ లేదు. అతను నవ్వులాటకే అంటున్నాడో; నిజంగానే అంటు న్నాడో తెలియలేదు. కాని. కెప్టెన్ పెలెగ్, ముఖం చిట్లించుకోనేప్పటికి పరుగెత్తాను. ముందుకు వెళ్ళి చూస్తే ఓడ

సముద్రపు పోటుతో బాటు ఊగుతూండటం కనబడింది. ఓడ సముద్రము ఖాళిగా ఉందని కూడా గమనించాను. ముందున్నది అనంతంగా అగుపించింది. కాని అంతా ఒకే మాదిరిగా వుండటం వల్ల ఆకర్షణీయంగా కనబడలేదు.

నేను తిరిగి వెళ్ళాక, పెలెగ్, "ఏమిటి కనబడింద"ని అడిగాడు.

"ఏమీ లేదు నీళ్లు తప్ప, దూరంగా వానమాత్రం పడుతూన్నట్టు కనబడింది."

"ప్రపంచాన్ని చూడటం గురించి ఏమంటావ్ ! కేప్‌హార్న్ చుట్టూ వెళ్ళి యింకా చూడాలని ఉందా ! నువ్వు ఉన్నచోటు నుంచి ప్రపంచాన్ని చూడలేవూ !

నేను కొంచెం భయపడ్డాను. కాని తిమింగలాల వేటకి వెళ్ళి తీరాలి. 'పెకోడ్' నాకు కనబడ్డ ఓడలన్నిటి లోకి మంచిది. ఈ మాటలన్నీ పెలెగ్‌తో అన్నాను. నా నిశ్చయాన్ని చూసి, ఓడ ఎక్కించుకోవటానికి ఒప్పుకొన్నాడు.

"అయితే సరే. కాగితాలమీద సంతకాలు పెట్టి మరీ వెళ్లు" అంటూ లేట్టుదిగి క్రిందనున్న గదివైపు దారి చూపాడు. ఆ గదిలో నా కళ్ళకి ఎంతో అపురూపముగాను ఆశ్చర్యముగాను ఉన్న ఒక వ్యక్తి కనబడ్డాడు. ఆయనే కెప్టెన్ బిల్‌డాడ్. కెప్టెన్ పెలెగ్‌తో బాటు ఈయనకు కూడా ఓడలో పెద్ద వాటా వుంది. మిగిలిన వాటాలన్నీ ఎవరెవరికో ఉన్నాయి; పింఛనుదార్లకు, వితంతువులకు, పిల్లలకు, ఈ

చిన్న నాటా నావులకు అంతగా ఉండే ఒక చెక్కముక్కో తలుపో, చెక్కో ఖరీదు చేసే వాటాలుంటాయి. మిగిలిన చోట్ల ప్రజలు తమ డబ్బుని బాగా వడ్డీ వచ్చే బాండ్లలో పెట్టినట్టే నన్‌టుకెటులోని ప్రజలు తిమింగిలాల వేటకి వెళ్ళే పడవలమీద పెట్టుబడి పెడతారు.

బిల్‌డాడ్ కూడా పెలెగ్ వలెనే క్వేకరు శాఖకి చెందినవాడు. అసలు నన్‌టుకెటులోని బహుసంఖ్యాకులు ఈ మతశాఖకు చెందినవారే. ఈ ద్వీపానికి మొదట వలసవచ్చిన వాళ్లు వీరే. ఈనాటికీ క్వేకర్లకుండే ఆ ప్రత్యేకతలు కొద్ది మార్పులున్నా చాలావరకు కాన వస్తాయి. క్వేకర్లలో కొందరు అత్యంత ధైర్యశాలులైన నావికులు, వేటగాండ్రును. వాళ్లలో చాలామందికి పురాణ పురుషుల పేర్లుంటాయి. చిన్నతనంలోనే వాళ్ళు నాటక పరిభాషసంబోధనలను అలవర్చుకొంటారు. పెద్దవాళ్ళయిన తరువాత ఎంతో కీర్తిప్రదమైన సాహసకృత్యాలు చేస్తారు. కాని చిన్ననాడు అలవర్చుకొన్న పూర్వకాలపు అభ్యాసాలు వాళ్లని విడువవు. ఈ లక్షణాలన్నీ సహజంగానే మహాశక్తి కలిగిన ధీమంతుడు, విశాలహృదయుడు, బహుదేశ సంచారము చేసినవాడు, ప్రపంచము యొక్క దశదిశలను పరికించినవాడు, స్వతంత్ర ఆలోచనలు కలవాడు, ప్రత్యగ్ర ప్రకృతి దేవతాచిద్విలాస దర్శనము చేసినవాడు, ఆవేశద్యోతకము గంభీరము అయిన భాషను నేర్చినవాడు అయినవానితో కూడి ఉంటే వానిని ఒక మహావిషాదాంత నాటకమునకు నాయకునిగా ప్రకృతి

సృష్టించివదని భావించవలెను. ఏ జాతిలోనయినా అట్టివాడు ఒక్కడు మాత్రమే ఉంటాడు. అట్టివాని ప్రకృతి యొక్క అంతరాంతరములలో ఒక అస్వస్థతా లక్షణము అంతర్భూతమై ఉంటుంది. విషాద నాటక నాయకులందరు అట్టి ప్రకృతి కలవారే. నా మాట నమ్మండి. మానవునిలోని ఘనత ఒక వ్యాధిలక్షణము నేను చెప్పబోవు మనిషి కేవలము అటువంటివాడు కాకపోయినా, ఇతడూ విచిత్ర వ్యక్తియే. ఈతనిలోని విచిత్రం వ్యక్తిగత పరిస్థితుల వల్ల క్వాకరు సంప్రదాయముల నుండి సంభవించినదే.

కెప్టెన్ పెలెగ్ వలెనే కెప్టెన్ బిల్‌డాడ్ కూడా శ్రీమంతుడూ, తిమింగిలాల వేటనుండి విశ్రమించిన వాడూను. కెప్టెన్ పెలెగ్, జీవితంలో ప్రధానమైన వాటి గురించి అంత పట్టించుకొనేవాడు కాడు. అసలు అటువంటి వాటిని అత్యల్పమైన వాటినిగా పరిగణించేవాడు కాని, కెప్టెన్ బిల్‌డాడు అందుకు భిన్నం. అతను చాలా నిష్ఠతో విద్యాబుద్ధులను నేర్చుకొన్నాడు. ఆ తరువాత ప్రపంచపు నాలుగు మూలలూ తిరుగుతూ అనేకమంది అందగత్తెలనుచూచాడు. కాని అతని మనసు మాత్రము చలించలేదు, ఇంతటి అచంచలత ఉన్నా కెప్టెన్ బిల్‌డాడులో అభిప్రాయ నిశ్చలత లోపించింది. భూమిమీదనుండి వచ్చే శత్రువులను ఎదుర్కొనటకు కత్తి పట్టుట అధర్మమనుకొంటాడు. కాని తానే అట్లాంటిక్ పసిఫిక్ మహాసముద్రాలపై విరివిగా దాడిసాగించాడు; మనిషి నెత్తురు కంట చూడనని నియమం కలవాడైనా,

తిమింగిలాల కొవ్వు టన్నులకొద్దీ చిందేటట్లు చేశాడు. జీవితపు అంతిమ దినాలలో ఈ విభిన్న లక్షణాలను ఏ విధంగా సమన్వయ పరచుకోగలడో చెప్పలేము. కాని అవేమీ తనకు పట్టినట్లు కనబడ్డాడు. మనిషికి మతంవేరు, లౌక్యధర్మం వేరు అన్న వివేకవంతమైన నిశ్చయానికి వచ్చాడేమో! ఈ లోకంలోనే అన్ని సత్ఫలితాలూ దొరుకుతాయి. చిన్న నౌకరుగా ప్రవేశించి, ఈటెకానిగా మారి, అక్కడనుండి సరంగుగా, కెప్టెన్‌గా, తుదకు ఓడకు యజమానిగా పరిణామం చెంది, తన అరవయ్యో పడిలో, వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తూ విశ్రాంతి పుచ్చుకొంటున్నాడు.

ఈ బిల్‌డాడ్ కఠినాత్ముడనీ, వయస్సులో ఉన్న రోజులలో పై పెత్తనాన్ని బాగా చెలాయించే వాడని పేరుంది. నన్‌టుకెట్‌లో అతని గురించి ఒక చిత్రమయిన కథని విన్నాను. ఒకసారి ఇతనికింద పనిచేసేవాళ్లు ఒక ప్రయాణం చేసి బాగా అలసి వచ్చారట. వాళ్ళను మోసుకొనికూడా వెళ్ళాల్సి వచ్చిందట. సామాన్యంగా, దైవభక్తులకు ఉండని కఠిన ప్రకృతి అతనిది. తన పనివాళ్ళనెప్పుడూ దూషించలేదట కాని వాళ్ళచేత అత్యధికము కష్టతరమూ అయిన పనులను చేయించేవాడట. అతని చూపుకే బెదరి, అవసరమున్నా లేకపోయినా ఏదో ఒక పని చేయవలసి వచ్చేదట. అతనిని చూస్తే సోమరితనము, మాంద్యము పారిపోయేవట. అతని ఆకారము మూర్తీభవించిన స్వప్రయోజన రాహిత్యము, అతని దీర్ఘకాయంలో వ్యర్థమగు కండ లేదు.

అతని చుబుకము చిన్నది. దానిమీద అనవసరమైన రోమములు మొలవలేదు. కెప్టెన్ పెలెగుతో కలిసి వెళ్ళి నేను చూసిన మానవాకారము అది.

కెప్టెన్ బిల్‌డాడ్ నిటారుగా కూర్చున్నాడు. అతని కోటు నలిగిపోతుందని దేనికీ ఆనుకోలేదు. అతని ప్రక్కనే అతని టోపీ ఉంది. కాళ్ళని ఒకదానిపై ఒకటి వేసుకొన్నాడు మెడవరకూ కోటు బొత్తాములను పెట్టుకొన్నాడు. ముక్కుమీద కళ్ళజోడు నుంచుకొని ఏదో పెద్ద పుస్తకాన్ని చేత బట్టుకొన్నాడు.

"బిల్‌డాడ్ !" అని కెప్టెన్ పెలెగు కేకవేశాడు. "మళ్ళీ పుచ్చుకొన్నావా ? నాకు తెలిసి ముప్పై సంవత్సరాలనుంచి చదువుతూనే ఉన్నావు పురాణాలని, ఎందాకా వచ్చావేమిటి ?" అని అడిగాడు. ఇటువంటి మతగ్రంథపఠన దూషణకు అలవాటుపడ్డవాడు గనుక అతను ఈ మాటల నేమీ పట్టించుకోక, కన్నెత్తిచూసి, నావైపుచూసి తిరిగి ప్రశ్నార్థకంగా పెలెగు వైపు ముఖం తిప్పాడు.

"ఇతను మనవాడట. ఓడ ప్రయాణం చేస్తానంటున్నాడు" అని పెలెగు అన్నాడు.

"అలాగా" అని నావైపు చూచాడు.

"అవున" న్నాను.

"ఇతనిగురించి, నీ వేమనుకుంటావ్" అని కెప్టెన్ బిల్‌డాడ్‌ని పెలెగు అడిగాడు.

"పనికి వస్తాడ"ని క్లుప్తంగా అనేసి, మళ్ళీ పుస్తకాన్ని పైకి చదవటం మొదలుపెట్టాడు.

అతని మిత్రుడైన పెలెగు ఎంత డాంబికుడో ఈ బిల్‌డాడ్ అంత విచిత్ర గంభీరుడుగా నాకు తోచాడు. నేనేమీ బదులు పలుకక అటూ ఇటూ చూడసాగాను. పెలెగు, తన కోటు జేబునుండి ఓడలో నౌకరీకి సంబంధించిన కాగితాలని తీసి, కలం సిరా ఎదుట పెట్టుకొని మేజావద్ద కూర్చున్నాడు. ఆ ప్రయాణానికి ఒప్పుకోవాలంటే ఏ యే షరతులని పెట్టాలని ఆలోచించుకోవటం మొదలుపెట్టాను. తిమింగిలాల వేటకి వెళ్ళే ఓడలమీద పనిచేసే వాళ్ళకు బత్తెమేమీ ఇవ్వరు. కాని కెప్టెన్‌తో సహా అందరికీ మొత్తం లాభంలో వాటాలు ఇస్తారు. ఈ వాటాలని "లే"లు అంటారు. ఈ వాటాలను ఓడలో ఒక్కొక్కళ్ళు చేసే పనిని బట్టి పంచుతారు. ఈ 'లే' లకు నేను కొత్తవాడినవటం వల్ల నా వాటా చాలా తక్కువే ఉంటుందని అనుకొన్నాను. కాని ఇదివరకు సముద్రయానంచేసి ఉండటంవలన కొంత అనుభవం, ఓడని నడపటంలో అయితేనేం, తాడుని వేయుడంలో అయితేనేం, ఉండటంవల్ల నాకు కనీసం 275 వ వాటా అంటే నికరమైన లాభంలో 275 వ వంతు- అది ఎంత మొత్తమైనా సరే- ఇస్తారని అనుకొన్నాను. 275 వ వాటా చాలా కొద్దిపాటిదే అంటారు. కాని ఏమీ లేనిదాని కంటె అది నయంకదా. మాకు అదృష్టం కలిసివస్తే ఆ వాటాతోనే నేను ఈ ప్రయాణానికి కొనుక్కొనే బట్టల ఖరీదు గిట్టు

తుంది. పైగా మూడు సంవత్సరాలు ఖర్చులేకుండా తిండి, వసతికూడా దొరుకుతాయి కదా! బాగా ధనం కూడబెట్టే పద్ధతి ఇది కాదని మీకు అనిపించవచ్చు— నిజానికి ఇది ఆ మార్గం కానేకాదు. భాగ్యవంతుణ్ణి కావాలన్న ఆశయం నాకు లేదు. ఉండటానికి వసతి, తినటానికి, తిండీ ఉంటే నేను తృప్తిపడతాను. మొత్తానికి 275 వ వాటా ఇబ్బైవచే అనీ, నేను దృఢకాయుడవటంవల్ల వాళ్లు నాకు 200 వ వాటా ఇచ్చినా ఇవ్వవచ్చునని ననుకొన్నాను.

లాభాలలో మంచిభాగం వస్తుందని నాకు అంతగట్టి నమ్మకం లేకపోయింది. రేవులో కెప్టెన్ పెలెగ్ అతని స్నేహితుడు బిల్‌డాడ్‌ల గురించి కొంత విన్నాను. ఎక్కడెక్కడో ఉన్న అసంఖ్యాకులయిన వాటాదారులు 'పెకోడ్' ఓడ యొక్క యాజమాన్యాన్నంతా వీళ్ళ యిద్దరికీ విడిచి పెట్టేశారు. తనమట్టుకు తాను, సుఖంగా గదిలో కూర్చుని బైబిలుని చదువుకొంటున్నా ఓడకి అయే ఖర్చుల గురించి. ఆ లోభి బిల్‌డాడ్ ఏమనుకుంటాడో చెప్పలేం: పెలెగ్ ఒక చిన్న కత్తితో కలాన్ని చెక్కి పరియుత్నిస్తున్నాడు. బిల్‌డాడ్ ఏమీ పట్టించుకోకుండా చదువుకొంటూ కూర్చున్నాడు. "ఈ భూమిమీద ధనమును కూడబెట్టుకొనచ్చుట—"

"బిల్‌డాడ్, ఈ కుర్రవానికి ఎన్నో వాటా ఇద్దామంటావ్?" అని అడ్డు వచ్చాడు కెప్టెన్ పెలెగ్.

"నీకు తెలియదేమిటి? ఏడువందల డబ్బై ఏడోది పరిపోతుంది... ఆ ధనము బూజూ, తుప్పూ పట్టి చెడిపోవును" అనుకుంటూ మళ్ళీ చదువుకొన్నాడు.

"వాటా అట! ఏడువందల డెబ్భై ఏడోదిట!" అనుకొన్నాను. 'నేను ఇలలో ఆస్తినేమీ సంపాదించకూడదని నీవు నిర్ణయించావు" అనుకొన్నాను. ఏడువందల డెబ్భై ఏడు అన్న అంకె చాలా పెద్దదే అయినా ఏడువందల డెబ్భై ఏడవ వాటా ఎంత తక్కువదో ఇట్టే గ్రహించవచ్చు. ఇలా నే ననుకొంటూండగా పెలెగ్ "నీ కళ్ళు పోతాయి బిల్డడ్ ఈ చిన్నవాడిని దోచుకొందా మనుకుంటున్నావేమిటి" అన్నాడు.

బిల్డడ్ తల ఎత్తకుండానే "ఏడువందల డెబ్భై ఏడవది" అని మళ్ళీ "నీ సొత్తు వున్నచోటనే నీ మనసు కూడా వుంటుంది" అని ఏదో గొణగటం మొదలు పెట్టాడు.

"ఇతనికి మూడువందల వాటాని ఇస్తాను—విన్నావా" అని గర్జించాడు పెలెగ్.

బిల్డడ్ పుస్తకాన్ని క్రిందపెట్టి పెలెగ్ వైపు తిరిగి గంభీరంగా ఇలా అన్నాడు.

"కెప్టెన్ పెలెగ్ నీవు చాలా ఉదారుడివి. కాని, ఈ ఓడ యొక్క వాటాదారుల పట్ల నీ బాధ్యత లేమిటో కూడా ఆలోచించాలి. ఈ చిన్నవాడి కష్టానికి మనం బాగా ముట్ట చెప్పితే ఆ వాటాదారుల మాటేమిటి? వాళ్ళలో చాలా

మంది వితంతువులు, అనాధలు అని మరచిపోకు. ఏడువందల డెబ్భై ఏడవ వాటాయే, పెలెగ్!"

పెలెగ్ లేచి కోపంగా ఆ గదిలో ఇటూ అటూ తిరుగుతూ బిల్‌డాడ్ వైపు చూసి "ఈ విషయాలలో నీవు చెప్పిన సలహా ప్రకారమే నేను నడచుకొని ఉంటే, ఈ పాటికి నా అంతరాత్మ పాపభారంతో కుంగిపోయేది. ఆ భారాన్ని మోయలేక ఎంత పెద్ద ఓడ అయినా మునిగిపోయేది."

"కెప్టెన్ పెలెగ్, నీ అంతరాత్మ ఎలాంటిదో నాకు తెలియదు కాని నువ్వు చాలా దురహంకారివి. కాబట్టి, నీ అంతరాత్మ నిన్ను నరకంలోకి ఈడ్చివేయ గలదు, జాగ్రత్త"

"నరకమా! నరకంట! నన్ను అవమానపరుస్తావా నువ్వు! ఎవడినయినా, నువ్వు నరకానికి వెళ్తావనడం ఎంత సాహసం! ఆ మాట మళ్ళీ అను– నేను– నేను– నాకు కోపం వస్తే సజీవమయిన మేకను అమాంతం మింగేయగలను." అంటూ బిల్‌డాడ్ మీదకి దూకబోయాడు. బిల్‌డాడ్ ఎంతో చాకచక్యంతో తప్పించుకొన్నాడు.

ఓడకు అధికారులయిన ఇరువురి మధ్య ఇటువంటి కలహం రేగటం చూచి, భయపడి ఆ ఓడమీద ప్రయాణం మానుకొందామా అని అనుకొన్నాను. పెలెగ్‌లో రేగిన ఆ కోపము నుంచి తప్పించుకు పోవాలని బిల్‌డాడ్‌కు కలిగిన ఆతురతను కనిపెట్టి అతనికి దారి ఇవ్వటానికి తలుపు ప్రక్కకు తొలిగాను. కాని, ఆశ్చర్య మేమిటంటే, అతను అటు వెళ్ళ

లేదు సరికదా; శాంతంగా తన స్థానంలో కూర్చున్నాడు. పెలెగ్ యొక్క ఆగ్రహావేశాలు అతనికి బాగా అలవాటే కాబోలు. వున్న ఆవేశాన్ని అంతా వెడలగక్కి వేశాక లోపల ఇంకేమీ సరకులేక పెలెగ్ కూడ గొర్రెపిల్ల వలె ఒదిగి కూర్చున్నాడు. కాని అతని నరాలు ఒణుకుతూనున్నట్టు కనబడ్డాయి. కొంతసేపు అయిన తరువాత, ఒక చిన్న ఈల వేసి పెలెగ్ బిల్‌డాడ్‌తో "వానజల్లు వెనుక పట్టినట్టుంది. బిల్‌డాడ్ నువ్వు ఈటెలను బాగా పదును పెట్టేవాడివి. ఈ కలాన్ని కొంచెం చెక్కు. నా కత్తి సానపెట్టితేగాని పని చేసేటట్టు లేదు" అని, నా వైపు తిరిగి, నీ పేరు ఇస్మాయిల్ అని చెప్పావు కదూ! మూడు వందలో వాటాకి ఒప్పుకో" అన్నాడు.

"కెప్టెన్ పెలెగ్ నాకు ఒక స్నేహితు డున్నాడు. అతనిని రేపు తీసికొని రానా?"

"తప్పకుండా తీసుకురా చూద్దాం"

తాను నిమగ్నుడై యున్న గ్రంథపఠనము నుండి మరలి తల ఎత్తి" అతనికి ఎన్నో వాటా కావాలిట!" అని బిల్‌డాడ్ మూలిగాడు.

"నీవు అవన్నీ పట్టించుకోకు బిల్‌డాడ్" అని, పెలెగ్ నా వైపు తిరిగి, "అతను ఎప్పుడయినా తిమింగిలాల వేట చేశాడా" అని అడిగాడు.

"అతను లెక్కలేనన్ని తిమింగిలాలను చంపాడు, కెప్టెన్ పెలెగ్" అని జవాబిచ్చాను.

"అయితే మరీ మంచిది; నీ వెంట తప్పకుండా తీసి కురా."

పత్రాలమీద సంతకాలు పెట్టి ఆ పూటకి చేసిన పని చాలుననుకొని బయులుదేరాను. క్వీక్వెగ్గూ, నేనూ వెళ్ళటానికి యోజో ఎంచిన ఓడకూడ "పీక్వోడ్" యే అయి వుంటుందనుకొన్నాను.

నేను నాలు గడుగులు వేయక మునుపే ఓడ కెప్టెన్‌ని చూడలేదని గుర్తువచ్చింది. అయినా, ఈ వేటకు వెళ్ళే ఓడల కెప్టెన్‌లు ఓడప్రయాణానికై అన్నివిధాల సిద్ధమయ్యే దాకా ఓడమీదకు రారు. ఒక్కొక్క ప్రయాణమూ చాలా కాలం సాగటం వల్ల రేవులో వాళ్ళు గడిపేది చాలా కొద్ది రోజులవటం వల్లా, సంసారంగాని, ఇతర వ్యాపకంగాని ఉన్న కెప్టెన్ రేవులో ఉండే ఓడను గురించి ఏమీ పట్టించుకోడు తిరిగి ప్రయాణమయ్యే వరకూ ఆ ఓడను యజమానులకు వదలివేస్తాడు. అయినా నా బ్రతుకును అతని వశం చేసే ముందు అతన్ని ఒకసారి చూడటం ఎందుకయినా మంచిదనిపించింది. కెప్టెన్ పెలెగ్‌ని పిలిచి కెప్టెన్ అహాబ్ ఎక్కడుంటాడని అడిగాను.

"కెప్టెన్ అహాబ్‌తో నీకేం పని. నిన్ను ఓడలోకి తీసుకు వెడుతున్నాం కదా" అన్నాడు.

"అయినా సరే, నేను అతనిని చూడాలని అనుకొంటున్నాను."

"ఇప్పుడు చూడలేవు అనుకుంటా. ఎందువల్లనో చెప్పలేనుగాని ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాడు. రోగమూ అంటే అదీ లేదు. అయితే ఒకటి అంత కులాసాగా లేడు. తరచు నాకే కనబడడు. ఇక నీకు కనబడతాడని ఎలా అనుకోను! కెప్టెన్ అహబ్ అదోమాదిరి మనిషి. అయితేనేం, మంచివాడులే. అతనితో నీకు బాగానే ఉంటుందిలే. భయపడకు. అతనికి దైవచింత లేకపోయినా, దైవము వంటి వాడు. ఎక్కువ మాట్లాడడు కాని అతను మాట్లాడేదేదో వినతగ్గది. అహబ్ సామాన్యుడు కాడు, ఇది గుర్తుంచుకో. కాలేజికి వెళ్ళి చదువుకొన్నాడు. మనిషి మాంసం తినేవాళ్ళతోనూ తిరిగాడు. సముద్రపు అలలకంటె గొప్ప వింతలనే చూశాడు. తిమింగిలాల కంటె భయంకరమైన విరోధుల మీదనే బల్లెం వేశాడు. అతని బల్లెము మన ద్వీపమంతటి లోకి ఖచ్చితమైనది. అతను బిల్డాడూ కాడు, పెలెగ్గూ కాడు. అతను అహబ్. వెనుక, అహబ్ అని ఒక రాజు ఉండేవాడు తెలుసా."

"అవును. చాలా దుష్టుడు కూడాను. ఆ దుర్మార్గుని చంపివేస్తే, వాని నెత్తురు కుక్కలు ముట్టాయి కదూ."

పెలెగ్ కళ్ళల్లోని తీవ్రతకు నేను ఆశ్చర్యపోయాను. అతను, "ఇలారా! పెకోడ్ మీద ఉన్నంతసేపు అటువంటి మాటలని ఎప్పుడూ అనకు. ఇక్కడే కాదు, ఎక్కడా కూడా అనకు. అసలు కెప్టెన్ అహబ్ కు ఎవ్వరూ అలాగని నామకరణం చేయలేదు. అతనికి పన్నెండు నెలలు నిండక ముందే

అతని తల్లి చనిపోయింది. ఆ అమాయకురాలి వింతకోరిక అది. ఆ ముసలావిడ ఆ పేరు చాలా ప్రఖ్యాతమౌతుందని అంటూండేది. ఆమెవంటి అమాయకులు అంతా అలాగే అంటారేమో. అందులో నిజమేమీ లేదు. నా మాట విను. అహబ్‌ని బాగా ఎరుగుదును. నేను అతనితో పాటు ప్రయాణాలు చేశానుగా. అతను చాలా మంచివాడు. బిల్‌డాడ్ లాగ భక్తుడు కాకపోయినా మొత్తానికి మంచివాడే. అతను అంత సరదా మనిషి కాదు. అతను తిరుగు ప్రయాణాలలో మతిచలించిన వాడులాగ ఉండేవాడు. అతని కాలిబాధవల్ల కాబోలు అలా ఉండేవాడు, క్రిందటిసారి ప్రయాణంలో తిమింగిలంవల్ల కాలు పోగొట్టుకొన్నాడు. అప్పటినుంచి చాలా వ్యసనపరుడుగా, ఎంతో క్రూరుడుగా ఉండటం మొదలు పెట్టాడు. కాని క్రమంగా అతనిలో మార్పువచ్చి అవిగూడా పోతాయేమో. మరొక మాట చెప్తాను విను. పకపక నవ్వుతూవుండే దుర్మార్గునితో కంటె, ఇటువంటి విచారపరునితో గూడి ప్రయాణం చేయటమే మంచిది. సరేపద కెప్టెన్ అహాబ్ చెడ్డపేరు కలవాడు గదాయని అతనిని చెడ్డగా తలచకు. అతనికి మంచి ఇల్లాలుగూడావుంది. ఈ ముసలివాని వల్ల ఆమెకు ఒక మగబిడ్డ కలిగాడు. అటువంటి అహాబ్ వల్ల కీడు కలుగుతుందని అనగలవా ? అతను దెబ్బతిన్నవాడు, చితికిపోయినవాడే కావచ్చు. కాని అహాబ్‌కి మానవత్వం వుంది!"

అక్కడనుండి వెళ్ళేటప్పుడు నా మనస్సు పెక్కు ఆలోచనలతో నిండిపోయింది. ప్రసంగవశాన కెప్టెన్ అహాబ్‌ను గురించి నాకు తెలిసిన దానివల్ల నా మనస్సులో ఏదో తెలియని బాధ కలిగింది. అతడు కాలు లేనివాడని విన్నందువల్లనో, మరి యెందువల్లనో చెప్పలేను. అతనంటే ఏదో విచారమూ, సానుభూతీ కలిగాయి. నేను వర్ణింపలేని భయంకూడా కలిగింది. ఆ భయంవల్ల అతనంటే నాకు ప్రతి కూలభావం కలుగకపోగా, అప్పటికి నాకు ఏమీ తెలియని అతనిలోని రహస్య మేమిటో తెలిసికోవాలని తొందరపాటు ఏర్పడింది. ఇంతలోనే నా ఆలోచనలు ఇంకొక వైపు మళ్ళాయి. అహాబ్ నా చిత్తాకారము నుండి జారిపోయినాడు.

—:o:—

17. ఉపవాస దినం

ఎంత హాస్యాస్పదములయినా సరే, ఇతరుల మతాచారాల మీద నా కెంతో గౌరవం. ఒక చీమలగుంపు చేరి కుక్కగొడుగును పూజిస్తున్నా, ఒక చచ్చిన జమీందారు శవమును అతని ప్రజలు ఆరాధిస్తున్నా నేను ఏవగించుకోను. తిరస్కరించను. ఆనాడు క్వీకెగ్ ఉపవాస దీక్షలో వుండి ప్రార్థన చేస్తూండటం చేత అది ముగిసేదాకా అతనిని పలుకరింపలేదు. అప్పటికి సాయంకాల మయింది.

నా వంటి ప్రెస్బిటేరియన్ క్రైస్తవులు ఇతరుల మతాచారములు, ఎంత విచిత్రంగా వున్నా వాటిని ఆక్షేపించరాదు. తాము వాళ్ళకంటె అధికులమనీ అనుకోగూడదు. వుదాహరణకు; ఈ క్వీకెగ్‌నే చూడండి. ఆ యోజోని గురించో, అతని ఉపవాసాలను గురించో అర్థంలేని ఆలోచనలలో వుంటాము. అయితే మాత్రమేమి? తానేమి చేస్తున్నాడో క్వీకెగ్‌కి తెలిసే వుంటుంది. దానివల్ల అతనికి సంతృప్తికూడా వుండి వుంటుంది. మన మెంత వాదించినా ప్రయోజనం లేదు. అతనిని అతని దారిని పోనివ్వమని నా సలహా. మనందరికీ కొంచెమో, గొప్పో పిచ్చి వుంద - మనలని భగవంతుడే రక్షించాలి!

అతని పూజాపురస్కారాలు పూర్తయి వుంటాయనుకొని సాయంకాలం వెళ్ళి గది తలుపు తట్టాను. కాని సమాధానం

లేదు. తలుపు తెరుద్దామనుకొన్నాను కాని లోపల గడియ వేసి వుంది. తాళపుచెవి పెట్టే కన్నం దగ్గర నోరుపెట్టి క్వీకెగ్‌ని, "పలకవేం! నేను ఇస్మాయిల్‌ని" అని పిలిచాను. కాని, వెనుకటి వలెనే అంతా నిశ్శబ్దం. నాకేదో కంగారు పుట్టింది. అంతసేపు అతనిని ఒంటరిగా విడిచాను, మూర్ఛ గాని రాలేదుకదా అనుకొన్నాను. మళ్ళీ ఆ రంధ్రంలో నుంచి చూశాను. కాని తలుపు ఒక మూలకి వుండటం వల్ల ఆ రంధ్రంలోనుంచి చూస్తే మంచపు అడుగుభాగము, గోడలో కొంతభాగమూ తప్ప ఇంకేమీ కనబడలేదు. ఆ గోడకి ఆనించి వున్న అతని ఈటె కనబడింది. ఈ ఈటెనే గతరాత్రి హోటలు యజమానురాలు అతని దగ్గరనుంచి తీసుకుంది. ఆశ్చర్యం వేసింది. అయితే ఒకటి. ఆ ఈటె లేకుండా అతను సాధారణంగా బయటకు వెళ్ళడు కాబట్టి అతను కూడా గదిలోనే వుండవచ్చని అనుకొన్నాను.

మళ్ళీ క్వీకెగ్‌ని పిలిచినా, ఏమీ బదులు లేదు. మూర్ఛ అయి వుంటుంది! తలుపుని బలవంతగా తెరవటానికి ప్రయత్నించాను. కాని లాభంలేక పోయింది. క్రిందకి వరుగెత్తి మొట్టమొదటగా ఎదురుపడ్డ పనికత్తెతో విషయం చెప్పాను. "అలాగా, ఏదో అయివుంటుందనే అనుకున్నాను. పొద్దున గదిని సర్దబోతే తలుపు వేసివుంది. చీమ కదిలిన అలికిడి కూడా లేదు. అప్పటినుంచి ఇప్పటివరకూ అలాగే వుంది. మీ రిద్దరూ లోపల సామాను భద్రంగా వుండాలని తలుపు వేసుకొని వెళ్ళిపోయారనుకొన్నాను. ఏమవ్వా!

అమ్మగారూ! హాత్య! మూర్ఛ" అని అరచుకొంటూ వంట యింటివైపు పరుగెత్తింది ఆ పనికత్తె. నేనూ వెంట వెళ్ళాను. ఒక చేతిలో కుండ, ఇంకొకచేత గరిటె పుచ్చుకొని హాన్సీ భార్య బయటకి వచ్చింది. అప్పుడే వాళ్ళ నౌకరుని చివాట్లు పెట్టి ముగించిందను కొంటాను.

"గొడ్డలి - గొడ్డలి కావాలి - ఎక్కడుంది - తలుపు తియ్యాలి- త్వరగా తీసుకురండి- వాడి కేదో మూర్ఛ వచ్చింది అని పిచ్చిగా అరుస్తూ మళ్ళీ వట్టి చేతులతోనే మెట్లు ఎక్కడం ప్రారంభించాను. హాన్సీ భార్య తన కుండా గరిటెతో సహా అడ్డంవచ్చింది. "ఏమిటయ్యా నువ్వనేది" అంటూ.

"మీకు పుణ్యం వుంటుంది, గొడ్డలి తెప్పించండి - నేను తలుపు తీస్తాను- ఎవరినయినా పంపించి డాక్టరుని పిలిపించండి" అన్నాను.

"ఇదిగో చూడు" అంటూ గరిటెను క్రిందపెట్టి, "నువ్వు తలుపుని బద్దలు కొడుతానంటావా! నీ కేమైనా పిచ్చెక్కిందేమిటి" అని నన్ను పట్టుకొని అటూ ఇటూ కుదిపివేసింది.

నాకు చేతనయినంత నిదానంగా త్వరగా సంగతంతా చెప్పాను. ఆ గరిటను ముఖం దగ్గర పెట్టుకొని, ఏదో ఆలోచించి, "దానిని అక్కడ పెట్టిన తరువాత మళ్ళీ చూడనే లేదు" అంటూ గబగబా మెట్లు క్రింద నున్న గది దగ్గరకి వెళ్ళి లోపలికి తొంగి చూసి, తిరిగి వచ్చి 'ఆ తాళె కవ

బతటంలేదు' అంది. "నీవుకూడా ఆత్మహత్య చేసుకొన్నాడు– ఆ దౌర్భాగ్యుడు స్టిగ్స్ లాగానే. యింకో పరువు నాశనమై పోయింది. నా హోటలు ఇంక పాడయి పోతుంది. వీడిక్కూడా చెల్లెళ్ళు ఎవరయినా ఉన్నారా!– ఇదిగో బెట్టీ" అని పనికత్తెని కేకవేసి "నువ్వు వెళ్ళి ఆ సాన్నర్ట్‌తో "ఇక్కడ ఆత్మహత్యలు చేసుకో కూడదు, గదిలో పొగ తాగకూడదు" అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసిపెట్టాలని చెప్పి తీసుకురా. ఏమిటి ఆ చప్పుడు! ఏ మయ్యోయ్! అదే వింటో ఆలకించు" అని గుక్క తిప్పుకోకుండా అనేసింది.

నేను తలుపు బద్దలు కొట్టడానికి ప్రయత్నిస్తూంటే ఆమె నన్ను ఆపి, "నా యింటిని చెడగొట్ట నిస్తాననుకొన్నావేమిటి! తాళాలు తీసేవాడు ఒక మైలుదూరంలో ఉన్నాడు. వాణ్ణి వెళ్ళి తీసుకురా" అని తన జేబులో చెయ్యి పెట్టి, "ఉండు – ఇక్కడో తాళపు చెవి ఉన్నట్టుంది. ఇది పట్టుకుంటుందేమో చూద్దా" మన్నది. దానితో తలుపు తీయ జూచింది కాని క్వీకెగ్ వేసిన రెండో గడియ అలాగే ఉండి పోయింది.

"తలుపుని ఊడగొట్టాలి" అనుకొంటూ కొంత వెనక్కి వెళ్లాను. బలంగా తలుపు మీద పడవచ్చుకదా అని. ఆమె నన్ను ఆపటానికి ప్రయత్నించింది కాని, నేను ఆమెను విదిలించుకొని; తలుపుమీద బలంగా పడ్డాను. బ్రహ్మాండమయిన చప్పుడుతో తలుపు తెరచుకొంది. దానికి ఉండే

గొళ్ళెం గోడకు కొట్టుకోగా. గోడ పెచ్చు చూరదాకా లేచి పోయింది.

నెత్తిమీద యోజోని పెట్టుకొని కదలకుండా మెదలకుండా క్వీకెగు కూర్చున్నాడు. అతను అటుగాని ఇటుగాని చూడక చైతన్యములేని బొమ్మవలె వున్నాడు. నేను అతనిని సమీపించి "క్వీకెగు! ఏమిటయ్యా ఇది" అని అడిగాను. హోటలు యజమానురాలు "అతనుగాని రోజంతా ఇలా కూర్చోడు కదా" అని ప్రశ్నించింది. మేమే మన్నా అతని నోటినుండి మాట పెగలలేదు అతను భోజనం లేకుండా పది గంటలసేపు ఆ స్థితిలో కూర్చున్నాడేమో! అంత దుర్భరమైన స్థితిని చూడలేక అతనిని తోసివేద్దా మనిపించింది.

నేను ఆమెవైపు తిరిగి "మొత్తానికి బ్రతికే వున్నాడు. మీరు వెళ్లండి. ఇతని సంగతేదో నేను కనుక్కుంటాను" అని అన్నాను. ఆమె బయటకు వెళ్ళగానే తలుపువేసి క్వీకెగును కుర్చీలో కూర్చోమని బ్రతిమాలాను. కాని వ్యర్థం. నే నెంత నేర్పు చెప్పినా బెదిరించినా క్వీకెగు ఏమాత్రమూ కదల్లేదు. ఒక్కమాట బదులు పలకలేదు. నా వైపు చూడలేదు ఆఖరికి నా వునికిని కూడా గుర్తించలేదు.

అతని జపములో ఇదొక భాగమేమో! వాళ్ల దేశంలో ఉపవాసముండి అలా కూర్చుంటారేమో. ఇదికూడా వాళ్ల మతాచారమే అయివుంటుంది. బ్రతుకు జీవుడా. ఇది నిత్యకృత్యము కాదుకదా, సంవత్సరానికి ఒకసారి వస్తుంది ఇటువంటిది. భోజనానికని క్రిందకు వెళ్లాను. చాలాసేపు

అక్కడ నావికుల తిమింగిలాల వేటకై తాము చేసిన ప్రయాణాల గురించి కథలుగా చెప్పుకొనుట విన్నాను. రాత్రి పదకొండయింది. క్వీకెగు అప్పటికి తన జపము ముగించి ఉంటాడనుకొని మేడమీదకి వెళ్ళాను. కాని అతను ఎప్పటి వలెనే కూర్చుని ఉన్నాడు. నాకు ఎంతో విసుగు కలిగింది. నెత్తిమీద బొమ్మను పెట్టుకొని ఆ విధంగా గంటల తరబడి కూర్చోవడం అర్థంలేని తెలివి తక్కువపని అనిపించింది.

"నీ పుణ్యమాయెను, లేవయ్యా, లేచి కొంచెం భోజనం చెయ్యి, లేకపోతే మాడిపోతావు" అన్నాను. ఒక్కమాట బదులు పలుకలేదు క్వీకెగు. నేను నిరాశచెంది మాట్లాడకుండా వెళ్ళి పడుకొందామని నిర్ణయించుకొన్నాను. కొంతసేపటి తరువాతనయినా, అతనుకూడ అలాగే చెయ్యకపోతాడా అని అనుకొన్నాను. ఆ రాత్రి ఎంతో చలివేసేటట్టుంది. అతని ఒంటిమీద మామూలు చొక్కా తప్ప వేరేమీ లేదు. అందువల్ల నేను పక్కమీదకు వెళ్ళేముందు నా ముతకకోటుని అతని మీద పడవేశాను. ఎంత ప్రయత్నించినా నాకు చాలాసేపటి వరకూ కునుకు పట్టలేదు. దీపము ఆర్పి వేశాను. అతను నా సమీపంలో, చీకటిలో కూర్చుని ఉన్నాడన్న తలంపే నన్ను కలవర పరచింది. ప్రక్కనే ఒకడు మేల్కొని జపముచేసి కొంటూండగా, పండుకోవటం ఎలా ఉంటుందో ఆలోచించండి.

ఏలాగో నిద్రపట్టేసింది. తెల్లవారేదాకా ఏమీ తెలియలేదు. అతనిని ఎవరో నేలకు బందీ చేసినట్లు మునుపటి

లాగానే కూర్చుని ఉన్నాడు. సూర్యరశ్మి ఒంటికి సోకగానే అతను లేచాడు. అతని ముఖంలో సంతోషం తాండవిస్తోంది. కాళ్లు మాత్రం బిగుసుకు పోయాయి. నా వైపు కుంటు కుంటూ వచ్చి, తన నుదుటిని నా నుదురుకు ఆనించి, జపము ముగిసిందని చెప్పాడు.

ఇతర మతసహావముున్న వాడు తాను ఏ మతము, ఏ ఆచారము అవలంబించినా నాకు ఏమీ అభ్యంతరం లేదు. కాని, ఆ మతావలంబనము అతని జీవితానికి దుర్భర బాధను కలిగించే దయినట్టయితే అట్టి మతము గురించి అతనికి కొద్ది పాటి సలహా ఇవ్వవలసి వస్తుంది. సరిగా, నేను ఇదే పని చేశాను.

"క్రేకెగు, పక్క-మీదకు వెళ్ళి పడుక్కుని, నేను చెప్పేది విన" మని, పురాతన మతముల పుట్టుక, వాటి వ్యాప్తి, ఆధునిక మతాల చరిత్రలు ఎత్తాను. ఆ చెప్పటంలో ఈ ఉపవాసాలు, దీక్షలు, పూజలు రోజుల తరబడి బిగుసుకు పోయే చలిలో నేలమీద మోకరించి కూర్చుండటాలు అన్నీ వట్టి బూటకాలని ఆరోగ్యానికి హానికరాలని, ఆత్మ పెంపుకి నిష్ప్రయోజమని,పారిశుధ్యానికి వ్యతిరేకమని చెప్పాను.అన్ని విషయాలలోను అంత వివేకంతో ప్రవర్తించే అతను ఈ ఉపవాస దీక్ష విషయంలో అంత తెలివితక్కు-వగా ఉండటం నా కెంతో బాధ కలిగించిందని కూడా చెప్పాను. అంతే కాకుండా ఉపవాసాలవల్ల శరీరం నీరసించి పోతుందని, అందువల్ల బుద్ధి కూడ నీరసించి పోతుందని ఉప

వాసాలలో చేసే ఆలోచనలన్నీ నిస్సారములనీ వాదించాను. ఈ కారణం వల్లనే అజీర్ణ వ్యాధితో బాధపడే మతాచార పరాయణు లందరినీ, తాము చనిపోయిన తరువాత ఏమయి పోతామో ననే భయము పీడిస్తూంటుందని చెప్పాను. ఒక్క మాటలో చెప్పాలంటే నరకలోక భావనకు మూలము అరగని ఆహారాలు తినటమని ఆ వ్యాధి వంశ పరంపరా పెరిగి ఉప వాసాలుగా పరిణమించు తుందని చెప్పాను.

నా వాదము అతనికి బాగా అర్థం కావాలన్న భావంతో "నీ కట్టి వ్యాధి ఎప్పుడైనా వున్నదా" అని అడిగాను. "ఒక్కసారి తప్ప ఎప్పుడూ ఆ వ్యాధితో బాధ పడలేద"ని చెప్పాడు. అది వాళ్ల యింట జరిగిన విందునాడు వచ్చిందట. ఆ విందులో ఆనాటి మధ్యాహ్నం రెండు గంటల వరకు వధింపబడిన ఏభై మంది శత్రుసైనికులను వడ్డిం చారట! అతను ఇంకా ఏమి చెప్పనున్నాడో తెలియటం వల్ల "ఇంక ఆపు క్వీకెగు అంతటితో ఆపు" అని కంపించి పోతూ అన్నాను. నేను ఎరిగివున్న ఒక నావికుడు ఆ ద్వీపా నికి వెళ్ళి అక్కడి ఒక ఆచారం గురించి చెప్పాడు. ఏదయినా పెద్ద యుద్ధంలో విజయం లభిస్తే ఆ వధింపబడిన వారందరినీ ఏ తోటలోకో తీసికొని వెళ్ళి అక్కడ వాళ్ళని పెద్ద పెద్ద కొయ్య తొట్టెలలో వుంచి కొబ్బరికాయలతో పళ్ళతో అలంకరించేవారట. క్రిస్మస్ కానుకలవలె అట్టి శవాలను స్నేహితులకు పంచిపెట్టేవారట!

నా మతోపన్యాసము క్వీకెగ్ మనస్సుకి పట్టినట్లు లేదు. ముఖ్యమయిన విషయాలలో అతని అభిప్రాయానికి వ్యతిరేకంగా ఎవరయినా మాట్లాడేటప్పుడు అతనికి వినిపించ దేమో ననిపించింది. నే నెంత చెప్పినా. అతనికి నా అభిప్రాయంలో మూడో వంతైనా అర్థమై యుండదనిపించింది. ఇవన్నీ కాక, తనకి నాకంటె మతాన్ని గురించి ఎక్కువ తెలుసునన్న నమ్మకం కూడా అతనికి ఉండవచ్చు. అంతేగాక, అతను నా వంక ఎంతో జాలిగా చూడసాగాడు: ఇటువంటి యువకుడు. వివేకి, దైవచింత లేకుండా పోతున్నాడే అనే విచారం పడి నట్టున్నాడు.

చివరికి మేము బట్టలు వేసుకొని భోజనం చేసి బయలు దేరటానికి తయారయినాము. క్వీకెగ్ ఆ క్రిందటి రోజు ఉపవాస ముండటంవల్ల కాబోలు అతను మామూలు కంటె ఎక్కువ తిన్నాడు. ఆ పూట హోటలామెకు అతనివల్ల ఏమీ లాభం గిట్టియుండదు.

తరువాత ఓడ నెక్కటానికి బయలు దేరాము.

18- నిశాని

క్వీకెగ్ చేతిలో ఈటెని పుచ్చుకొని బయలుదేరాడు. రేవుమీదుగా మేము పడవవైపు వెళ్తూంటే కెప్టెన్ పెలెగ్ మమ్మల్ని బిగ్గరగా పిలచి, "నీ స్నేహితుడు నరమాంస భక్షకుడని నేను అనుకోలేదు – ఇట్టి వాళ్ళు తమ పత్రాలు చూపించందే ఓడని ఎక్కడానికి వీలులేదు" అని అరిచాడు.

నా స్నేహితుని రేవులోనే ఉంచి నేను ఓడ మీదకు వెళ్ళి కెప్టెన్ పెలెగ్‌ని, "మీరిప్పు డనేదేమిటి" అని ప్రశ్నించాను.

"అతను తన పత్రాలను చూపించుకోవాలని అంటున్నాను.

పెలెగ్ వెనుక నిలబడి కెప్టెన్ బిల్‌డాడ్, "అతను మతం పుచ్చుకొన్నట్లు నిరూపించుకోవాలి" అని నాతో అని, క్వీకెగు వైపు చూసి "ఏమయ్యా! అటవికుడా – నీవు ఇప్పుడేదయినా చర్చికి వెళుతున్నావా? అని అడిగాడు. నేను సమాధానంగా, "అతను కాంగ్రిగేషనల్ చర్చిలో సభ్యుడు అన్నాను. నన్‌టుకెట్ ఓడల మీద ప్రయాణం చేసే అనాగరికు లందరూ, చిట్టచివరకి క్రిస్టియన్ మతాన్ని పుచ్చుకుంటారని ఏలాగూ తెలుసు నాకు.

"డీకన్ ద్యూటరోనమీకోల్‌మెన్, ఇంట్లో సమావేశమయే చర్చికి వెళ్తాడా" అంటూ బిల్‌డాడ్ తన కళ్ళజోడు

తీసి. గుడ్డతో తుడిచి మళ్ళీ పెట్టుకొని, బయటకు వచ్చి క్వీకెగ్ వైపు పరీక్షగా చూస్తూ నా వైపు తిరిగి "అతను ఆ చర్చిలో చేరి ఎంతో కాలమై యుండదు" అన్నాడు. ఇంతలో పెలెగ్ అందుకొని, "నిజమే, ఎంతో కాలం అయి ఉండదు. అతనికి సరియైన పరిశుద్ధి జరిగినట్లు కూడా లేదు. లేకపోతే ముఖంమీద ఆ రాక్షసపు రంగు కొంత ఒదిలేదే" అన్నాడు.

మళ్లీ బిల్డాడ్ అడిగాడు : "నిజం చెప్పు ఇతను ఆ చర్చికి వెళ్ళుతున్నాడా? నేను ప్రతి ఆదివారం అక్కడికి వెళ్తూంటాను. ఇతనిని ఎప్పుడూ చూసినట్లు లేదే.

"డీకన్ డ్యూటరోనమి ఎవరో, అతని సమావేశ మేమిటో నాకు తెలియదు. కాని క్వీకెగ్ పుట్టుకతోనే కాంగ్రిగేషన్ చర్చికి చెందినవాడు. అసలు అతనుకూడా ఒక మతాచార్యుడే. ఈ మానవ సమాజమంతా ఆది కాలంలో ఏ మతంలో పుట్టి, ఒక తల్లి పిల్లలవలె కలిసి మెలసి దైవప్రార్థనలు జరుపుకొంటూ వచ్చిందో, ఆ చర్చికి ఇతను వెళ్ళుతూ వుంటాడు. ఇటీవల మనము వేరువేరు చర్చి శాఖలు నిర్మించుకొని విడిపోయినా ఇతనిది ఆ తొలినాటి చర్చియే" అన్నాను.

కెప్టెన్ బిల్డాడ్ నా దగ్గరగా వచ్చి, "అబ్బాయి, నీవు మతప్రచారకుడవు కాదగినవాడవు. ఓడల గొడవ నీ కెందుకు? ఇంతకన్నా మంచి ఉపన్యాసము నే నెక్కడా విన లేదు - డీకన్ డ్యూటర్ నొమీ ఏమిటి, ఫాదర్ మేపిల్

కూడా నిన్ను మించలేదు. రండి, రండి పత్రాలమాటకేం. ఆ క్వీహాగ్‌ని ఓడ నెక్కమను. అరె! అతని చేతిలో ఎలాటి ఈటె వుందో! మంచి సరకు లాగానే వుంది. పైగా అతను దానిని చక్కగా పట్టుకొంటున్నాడు కూడాను. ఇదిగో నీ పేరేమిటో క్వీహాగ్ నీ వెప్పుడయినా తిమింగిలాల వేటకి వెళ్ళే ఓడ ముందువైపున వున్నావా? ఎప్పుడయినా తిమింగిలాన్ని కొట్టావా?"

ఒక్క మాటయినా బదులు చెప్పక క్వీకెగ్ ఒక్క గంతులో ఓడకి ఇరువైపులా వేలా-డి వున్న పడవలోకి దూకాడు. ఎడమకాలు నెత్తి ఈటెని విసరడానికి సిద్ధంగా పెట్టుకొని ఇలా అరిచాడు.

"కెప్టెన్ - అక్కడ నీళ్ళమీద తారు కొద్దిగా కనబడుతోంది. చూశావా? అదే తిమింగిలపు కన్ను అనుకో" అంటూ చేతిలోని ఈటెను బిల్‌డాడ్ తలమీదుగా, ఓడ తట్టు మీదుగా, విసరి ఆ తారుని మాయంచేశాడు.

మెల్లగా, ఈటెకికట్టివుండే తాడుని లాగుతూ," అదే తిమింగిలపు కన్ను అనుకొంటే ఈ పాటికి తిమింగిలం చచ్చిం దన్నమాటే! అన్నాడు క్వీకెగ్.

అతని పక్కనుంచే వెళ్ళిన ఈటెకి బెదరి, బిల్‌డాడ్ గదిలోకి వెళ్ళాడు. కెప్టెన్ పెలెగ్ అతనితో "ఇదిగో త్వరగా కానీ - పత్రాలు పట్టుకురా, ఈ క్వీహాగ్ మనతో బాటు వుండాల్సిందే" అని క్వీకెగ్ వైపు తిరిగి, "ఏమయ్యా నీకు తొంభైయో వాటా ఇస్తాము. నాన్టుకెట్ నుంచి బయలు

దేరే వేటగాడికెవ్వడికీ అంత మట్టకు - ఏమంటావ్రు" అన్నాడు.

మే మందరం గదిలోకి వెళ్ళాం. క్వీకెగ్ ఓడ ప్రయాణీకులలో చేర్చుకో బడ్డాడు. అన్ని లాంఛనాలు పూర్తి అయాక, కాగితాలమీద సంతకాలు పెట్టటానికి ముందు పెలెగ "ఈ క్వీహాగ్‌కి వ్రాత చేతకాదనుకుంటాను. ఇదిగో క్వీహాగ్ సంతకం పెట్టుతావా, ఏమైనా గుర్తుపెట్టుతావా" అని అడిగాడు.

ఇదివరకు ఇటువంటి తతంగాల అనుభవం వుండటం వల్ల ఈ ప్రశ్నలకి క్వీకెగ్ ఏ మాత్రమూ చిన్నబుచ్చుకో కుండా కలం తీసుకొని ఎక్కడ సంతకం పెట్టాలో అక్కడ తన చేతిమీద ఉన్న పచ్చబొట్టు ప్రతిరూపమయిన ఒక గుర్తును పెట్టాడు. కెప్టెన్ పెలెగ్, క్వీకెగ పేరు క్వీహాగ అనుకొం టూండటంవల్ల ఆ గుర్తు ప్రక్కన "ఇది క్వీహాగ్ సంతకం" అని వ్రాసుకొన్నాడు.

ఈ లోగా, కెప్టెన్ బ్రిల్డాడ్, క్వీకెగ్ వైపు అతి తీక్ష ణంగా చూడసాగాడు. చివరికి మెల్లగా లేచి అతని కోటు జేబులు తడిమికొని, కొన్ని కరపత్రాల కట్టను తీసి దానిలో నుండి "అంతిమ దినం ఆసన్నమగుట (లేక) వ్యర్థపుచ్చతగ్గ సమయంకాదు" అనే పేరుగల కరపత్రాన్ని క్వీకెగ్ చేతిలో పెట్టి అతని చేతులను తన చేతులతో పట్టుకొని తదేకదీక్షతో చూస్తూ, ఇదిగో అబ్బాయి, నా ధర్మాన్ని నేను నిర్వర్తించాలి. ఈ ఓడ యజమానులలో నే నొకడను దీనిమీద-

ప్రయాణం చేసేవాళ్ళ యోగక్షేమాల బాధ్యత నాకు
వుంది. నీ పైశాచిక విగ్రహారాధన అలవాటుని మానుకో —
నరకం నుంచి తప్పించుకో" అన్నాడు. బిల్‌దాదు వాక్యా
లలో కొంత బైబిలు భాష కొంత వాడుక కలిసి ఒక విచిత్ర
మయిన శైలి ఏర్పడ్డది.

పెలెగ్ అడ్డుపడి, "బిల్‌దాదు అప్పుడే నీవు ఈ వేట
గాని చెడగొట్టుతున్నావు భక్తిగల వేటగాళ్ళు ఎందుకూ
పనికిరారు. పోట్లాడే వీరత్వం లేకపోతే ఏ ఈటెగాడూ పనికి
రాడు. ఒకప్పుడు నన్‌టుకెట్‌లోకెల్లా ధైర్యశాలియైన
నాట్ స్వైన్ ఈ గుంపులో చేరి ఎందుకూ పనికిరాకుండా
పోయాడు. ఆత్మను గురించి బాధపడటం మొదలుపెట్టి,
తిమింగిలం ఎదుట కానవస్తే దానిని చంపి నరకమునకు పోవ
లసి వస్తుందేమోనని తప్పుకొని పోయేవాడు.

బిల్‌డాడ్ చేతులెత్తి, ఆకాశంవైపు దృష్టి నిలిపి
పెలెగ్‌ని ఉద్దేశించి "ఎన్నో విపత్తులను నీవూ ఎదుర్కొ
న్నావు. చావు అంటే భయమేమిటో నీకు తెలుసు. అలా
తెలిసివుండీ, నాస్తికుడిలాగ మాట్లాడుతావేం! నీ మనస్సును
కప్పిపుచ్చుతున్నావు. పెలెగ్, ఈ పెకోడ్ మీదే, నీవూ
కెప్టెన్ అహాబ్ చేసిన ప్రయాణంలో జపాను దగ్గర పెద్ద
తుఫాను వచ్చినప్పుడు ఈ ఓడ స్తంభాలు పడిపోయినాయి.
అప్పుడు నీవు చావును గురించి, పరలోకాన్ని గురించీ ఆలో
చించలేదూ!" అని అడిగాడు.

చేతులు జేబులలో పెట్టుకొని, గదివైపు నడుస్తూ పెలెగ్, "వినండయ్యా, వినండి, ఏ క్షణాన ఓడ మునిగి పోతుందో అని మేము భయపడుతూ వుండే సమయంలో, మేము పరలోకాన్ని గురించి ఆలోచించామట. అన్నివైపుల నుంచీ సముద్రపు కెరటాలు ఉరుముల మ్రోతతో వచ్చి పడవమీద పడుతూవుంటే మేము మరణాన్ని గురించి, పరమును గురించి ఆలోచనలు చేస్తామా! ఆ తుఫానులో ఎంత మందిని రక్షించగలం, ఎంత త్వరగా రేవు చేరుకోగలం అని కెప్టెన్ ఆహబ్, నేనూ ఆలోచిస్తాంలే. పరమును గురించి ఆలోచనట!"

బిల్‌డాడ్ మరేమీ మాట్లాడలేదు. కోటు గుండీలు పెట్టుకొని, ఓడ తట్టుమీద నడువసాగాడు. మేము వెనుకనే వెళ్ళాం. అతను తెరచాపని బాగుచేస్తున్న పనివాళ్ళను చూస్తూ నిలబడ్డాడు. మధ్య మధ్య వంగుతూ ఏ తాడు ముక్కనో, ఏ గుడ్డముక్కనో — వృధా పోతాయేమోనని ఏరుతూ వుండేవాడు.

—:0:—

19. జోస్యుడు

క్వీక్వెగ్, నేనూ పెకోడ్‌ను విడిచి మా ఆలోచనలలో మేము మునిగి వచ్చేస్తూ ఉండగా, "మీరా రెప్పుడైనా ఆ ఓడ మీద వెళ్ళారా!" అని మా ఎదురుగావచ్చి, తన చూపుడు వేలితో మా ఓడను చూపుతూ, మమ్మల్ని ఒక వ్యక్తి ప్రశ్నించాడు. అతని బట్టలు బాగా మాసి ఉన్నాయి. పంట్లాము ఒక అతుకులు బొంత, తలకొక ఎర్రని రుమాలు చుట్టు కొన్నాడు. ముఖమంతా స్ఫోటకంమచ్చలు, నీరుతీసిన తరువాతి చారికలుగట్టి ఎండిపోయిన నేలవలె ఉంది ఆ ముఖం.

అతను, "మీరా రెప్పుడైనా ఆఓడమీద వెళ్ళారా!" అని మళ్ళీ ప్రశ్నించాడు. అతనివైపు నిదానించి చూడాలి అన్న తలంపులో దానికై వ్యవధిని సంపాదించుకోవడానికి, "మీరు అడిగే ప్రశ్న ఆ ఓడను గురించేనా!" అని అన్నాను.

చేయి అంతా ముందుకు సాచి, చూపుడు వేలితో ఆ ఓడను చూపిస్తూ, "ఆఁ, అదే- ఆ ఓడ గురించే- పెకోడ్ అంటారు కాబోలు దానిని" అన్నాడు.

"ఆ ఓడమీద వెళ్ళి పనిచేయడానికి ఇప్పుడే కుదిరాము. కాగితాలమీద సంతకాలుకూడా పెట్టాము" అన్నాను.

"మీ ఆత్మలను గురించి ఏమైనా విన్నారా అక్కడ"

"దేనిని గురించి ?"

"మీకు అవి లేవేమో లెండి- అయినా ఫరవాలేదు. నే నెరిగిన చాలామంది కవి లేనేలేవు, అదృష్టవంతులు. ఈ ఆత్మ అనేది, బండికి అయిదో చక్రం వంటిది"

"మీ రనేదేమిటి ?"

"అందరికీ సరిపోయినంత అతనికుంది" అని అంటూ, "అతనికి" అన్న మాటను వణుకుతూ ఒత్తి అన్నాడు. నేను క్వీకెగు వైపు తిరిగి "పోదాం పద, ఇత నెక్కడినుంచో తప్పించుకొని పారిపోయి వచ్చినట్టున్నాడు. ఎవరిని గురించో దేనిని గురించో అర్థం లేకుండా మాట్లాడు తున్నాడు" అని అన్నాను.

"ఆగండి- మీరు ఆ ముసలి పిడుగును చూడలేదు. కదూ" అని అరిచాడు ఆ వ్యక్తి.

అతని పిచ్చివాలకం చూస్తూ నివ్వెరపోయి.

"ముసలిపిడుగెవరూ ?" అని అడిగాను.

"కెప్టెన్ అహాబ్"

"ఏమిటి ? మా ఓడ కెప్టెన్. అహాబ్‌ను గురించేనా ఆ మాటలు"

"ఆఁ! నావంటి పాతకాలపు నావికులలో అతని కదే పేరు. అతగానిని మీరింకా చూడలేదు కదూ"

"లేదింకా. అతని కేదో జబ్బుగా ఉందట కాని త్వరగానే కోలుకొంటాడట"

"అహహా! కోలుకొంటాడా త్వరగా! కెప్టెన్ అహబ్ సరిగ్గా ఉంటే, నా ఎడమ చెయ్యి కూడా సరియైనట్టే అందాకా కాదు" అంటూ నవ్వాను.

"అతనిగురించి మీకేమి తెలుసు"

"అతని గురించి మీకేమి చెప్పారు. అది వినిపించండి ముందు"

"ఏమీ ఎక్కువగా వినలేదు. అతను తిమింగిలాలని బాగా వేటాడుతాడనీ, తన కింద పనిచేసే వాళ్ళని బాగా చూస్తాడనీ మాత్రమే విన్నాను.

"నిజమే- ఈ రెండు ముక్కలూ నిజమే. కాని ఒకటి అతను ఆజ్ఞ ఇవ్వగానే వెంటనే పని మొదలు పెట్టాలి. తరముడం కేకలు వేయడం- ఇదే పని అహబ్ కి. అతనికి కేప్ హార్న్ దగ్గర ఏమి జరిగిందో వినలేదా? అతడు మూడు రాత్రిళ్ళూ, మూడు పగళ్లూ చావు బ్రతుకుల మధ్య వున్న సంగతి ఏమీ వినలేదా? ఎవరో జోస్యం చెప్పినట్టే అతనికి కాలు పోవటాన్ని గురించి ఏమీ వినలేదా? అవును లే. మీరు విని ఉండరు. అసలు ఆ సంగతి నన్ టుకెట్ లో ఎంద రెరు గుదురు లే! అతను కాలిని ఎట్లా పోగొట్టుకొన్నాడో అదైనా విన్నారా ? ఆ సంగతి అందరికీ తెలుసు, అతనికి ఒకే కాలు ఉందనీ రెండో కాలు తిమింగిలం తినేసిందనీ"

"ఏమయ్యోయ్- మీ మాటలేమీ నాకు బోధ పడటం లేదు. మీకు మతి చలించినట్టు వుంది. కాని ఒకటి కెప్టెన్ అహబ్ గురించే మీరు మాట్లాడుతూంటే, ఉదా

మాట వినండి. అతను కాలు ఏలా పోగొట్టుకొన్నాడో ఆ వివరం అంతా నాకు తెలుసు"

"అంతా తెలుసా! నిజంగా నేనా!"

"నిజంగానే"

బిచ్చగాని లాగ ఉన్న అతను పెకోడ్ వైపు చూపునీ చేతివేలునీ నిలిపి ఏదో బాధలో మునిగిపోయినట్టు నిలబడ్డాడు. వెళ్దామని బయలుదేరుతూ "అయితే ఆ ఓడలో మీరు వెళ్ళడానికి కావలసిన కాగితాలు తయారయినాయన్న మాట" వాటిమీద మీరు సంతకాలుకూడా పెట్టేశారన్నమాట. సరే జరగవలసిందేదో జరుగుతుంది. మీరు కాకపోతే యింకొకళ్లు. ఎవరయినా కొందరు నావికులు అతనితో పాటు వెళ్ళవలసిందేకదా! పాపం! వస్తాను మరి. మిమ్మల్ని ఆ భగవంతుడే రక్షించాలి. మీరు వెళ్ళకుండా కాస్సేపు ఆపాను- క్షమించండి,"

"మాతో ఏదయినా ముఖ్యమయిన సంగతి చెప్పాలని వుంటే అదేదో వెంటనే చెప్పివేయి - మమ్మల్ని వృధాగా భయపెట్టేము గలనని అనుకొంటే చాలా పొరబడుతున్నావు."

"నాకు వచ్చిన విధంగానే చెప్పారులే. యిలాగ మాటాడ గలిగిన వాళ్ళే కావాలి అతనికి. మీరు అక్కడికి తిరిగి వెళ్ళాక 'నేను రాకూడదనే నిర్ణయించుకొన్నట్లు అతనికి చెప్పేసేయి."

ఇలా మాట్లాడి మమ్మల్ని ఏమీ మోసబుచ్చలేవు - యేదో పెద్ద రహస్యాన్ని దాస్తున్నట్టు నటించటం చాలా తేలిక."

"వస్తా" నంటూ కదలబోయాడు.

క్వీకెగ్‌తో" ఈ పిచ్చివానిని విడిచిపోదాం పద" అని, ఆ వ్యక్తివైపు తిరిగి "కొంచెం ఆగు. నీ పేరేమిటి అని" అని అడిగాను.

"ఎలీజా"

ఎలీజా! మేము అక్కడనుంచి వెళ్ళిపోయాము. మే మిద్దరం ఆ చినిగిన గుడ్డల నావికుని మాకు తోచిన విధంగా మనస్సులలో వ్యాఖ్యానించుకొన్నాం. అతను వట్టి బూటకపు మనిషనీ మా మీద తన భారం పెట్టటానికి ప్రయత్నించిన వాడనీ అనుకొన్నాము. ఒక వంద గజాలు వెళ్ళాక ఎందుకనో వెనక్కి తిరిగి చూశాను. మా వెనుకనే ఎలీజా వస్తున్నాడు ! మా వెంట యెంతదూరం వస్తాడో చూద్దామని అతనిని గమనిస్తూ క్వీకెగ్‌కి చెప్పకుండానే నడిచాను. మేము ఒక సందుమలుపు తిరుగగానే ఎలీజా కూడా మలుపు తిరిగాడు. అతను మా వెంట వస్తున్నాడని దృఢపడిందే గాని ఎందుకు వస్తున్నాడో ఊహించలేక పోయాను. అతను మా వెంట రావటం అంతకుముందే అతను కొంత దాస్తు కొంత వెలిబుచ్చుతూ చేసిన నిగూఢమయిన సంభాషణ నాలో ఆశ్చర్యాలనీ, భయాలనీ రేకెత్తించాయి. ఆ మాటలన్నీ పెకోడ్‌కి కెప్టెన్ అహాబ్‌కీ, అతని కాలికీ, కెప్టెన్ పెలెగ్ ఆ క్రితంరోజు నాతో

చెప్పిన మాటలకీ, టిన్‌టిగ్ ముదుసలి చెప్పిన జోశ్యానికీ, మేము ఒప్పుకొన్న ప్రయాణానికీ సంబంధించినవి.

అసలు ఎలీజా మమ్మల్ని వెంటాడుతున్నాడో లేదో, వెంటాడితే ఎందుచేత వెంటాడుతున్నాడో తెలుసుకొందామని క్వీక్వెగ్‌తో కూడా వెనక్కి మళ్ళీ నడువ నారంభించాను. ఎలీజా మమ్మల్ని చూడనట్టు వెళ్ళిపోయాడు. అంతటితో నా మనస్సు కుదుటబడింది. వాడు వట్టి మాటకారిమాత్రమే నని ధృవపరచుకొన్నాను.

20. సన్నాహాలు

ఒకటి రెండు రోజులు గడిచాయి. 'పెకోడ్' పైన ఒకటే హడావుడి. పాతబడ్డ తెరచాపలు బాగుచేస్తున్నారు. కొత్త తెరచాపలు, తాళ్ళూ చేరుస్తున్నారు. ప్రయాణానికై సన్నాహాలన్నీ ముగియవచ్చాయని అనిపిస్తోంది. కెప్టెన్ పెలెగ్ రేవుమీదకి వెళ్ళేవాడే కాదు. తన గదిలో కూర్చొండి పనివాళ్ళమీద ఒక కన్ను వేసి ఉంచేవాడు. కెప్టెన్ బిల్‌డాడ్ కావలసిన సరకులన్నిటినీ కొనేవాడు. తాళ్ళను కట్టడంలో, ఇతర పనులలో ఉన్నవాళ్లు చాలా శ్రద్ధ వహించి పనిచేస్తూ ఉండేవారు. క్వీకెగ్ పత్రాలు తయారైన మర్నాడు, ఎవళ్ల సామానులని వాళ్ళు ఓడ మీదకి చేర్చుకోవాలని, ఓడ ఎప్పుడైనా బయలు దేరవచ్చునని హెచ్చరిక చేశారు. నేనూ, క్వీకెగ్గూ మా సామానులని జేరవేసుకొన్నాము. కాని, తుది రాత్రిదాకా పట్నంలోనే గడుపుదామని నిశ్చయించుకొన్నాము. ఇంతకూ, ఓడ చాలారోజుల తరువాతగాని బయలు దేరనేలేదు. అయితే ఒకటి, పెకోడ్ వంటి ఓడ ప్రయాణానికి బయలుదేరేటప్పుడు చాలా ఏర్పాట్లు చేసికోవలసి వస్తుంది; ఎన్ని వస్తువులని అమర్చుకోవాలో చెప్పలేం!

మామూలుగా సంసారానికి ఎన్ని వస్తువులు పరుపులు పళ్లాలూ, బట్టలూ అవీ, ఇవీ – కావాలో అందరికీ తెలుసు.

తిమింగిలాల వేటకై వెళ్ళే ఓడలమీద కూడా- మూడు సంవత్సరాలకు సరిపోయే సరకులు-దుకాణాలుగాని, వైద్యులు గాని, బ్యాంకులుగాని అందుబాటులో ఉండని సముద్ర యానానికి అమర్చుకోవాలి. అంతేకాదు, ఈ వేటకై వెళ్ళే ఓడలమీద ఉంచవలసిన వస్తువులు ప్రత్యేకమైనవి. అవి ఎక్కడపడితే అక్కడ సులభంగా దొరకవు. అందులోనూ ఈ రకం ఓడలు ఎన్నో ప్రమాదాలకి గురి అవుతూంటాయి. అందువల్ల కావలసినన్ని చిన్న పడవలు, ఈటెలు మొదలైనవి ఉండాలి. ఓడకు, కెప్టెన్‌కు తప్ప తక్కిన అన్ని పదార్థాలకు, నకలు పదార్థాలు ఉండాలి.

మేము ద్వీపం మీదకి చేరేప్పటికి, పెకోడ్‌కి కావలసిన ముఖ్యమైన సరకులు— రొట్టె, మాంసము, మంచినీళ్ళు, బొగ్గులు- అన్నీ చేరాయి. అయినా ఇంకా చాలా చిల్లర వస్తువులను అదేపనిగా తెస్తూనే ఉన్నారు.

ఈ విధంగా తెస్తూ, పోతూ ఉన్నవాళ్ళలో కెప్టెన్ బిల్‌డాడ్ యొక్క సోదరి ముఖ్యురాలు. ఆమె వృద్ధురాలు. పలచని శరీరం, అయినా ఎంతో పట్టుదలగల స్త్రీ. పెకోడ్ సముద్రం మీదికి వెళ్ళిన తర్వాత ఏవిధమైనలోటూ ఉండకూడదని ఆమె ఉద్దేశం. ఆమె ఒకక్షణం వంటశాలలోకి ఊరగాయల జాడీలు తెస్తుంది, మరుక్షణం, కెప్టెన్ వ్రాసుకోవటానికి రకరకాలవి తెస్తుంది, మరోసారి ఎవరి నడ్డికో వాతపునొప్పి యున్నదని, వానికోసం, ఉన్నిగుడ్డలమూట తెస్తుంది. ఆమె పేరు దాత్రి (Charity) అది సార్థక

నామము ఆమె నందరు "దాత్రి పిన్ని" అంటారు. ఆ ఓడలో వెళ్లేవాళ్ళకు అందరికీ సంతోషం, సదుపాయం సంతృప్తి కలిగించాలని ఆమె కోరిక. అదీగాక ఆమె సోదరుడు ఆ ఓడకు ఒక కెప్టెను అవడం, ఆమెకూడా ఆ ఓడలో ఏ రవ్వంతో పెట్టుబడి పెట్టి యుండటం, ఆమె అభిమానానికి ఇంకొక కారణం. ఆఖరిరోజున ఆమె ఒక చేతిలో ఒక పొడవు పాటి గరిటెను, ఇంకొక చేతిలో ఒక ఈటెను పట్టుకొని రావటం చూసి ఆశ్చర్యపడ్డాం. బిల్‌డాడ్, పెలెగ్ యిద్దరూ జాగ్రత్త పడుతూనే వున్నారు. బిల్‌డాడ్ కావలసిన వస్తువుల జాబితాని చేతిలో ఉంచుకొని ఒక్కొక్కటే వచ్చినప్పుడు జాబితాలో గుర్తుపెట్టుకొంటుండేవాడు. పెలెగ్ అప్పుడప్పుడు తన గదినుండి బయటకువచ్చి పనివాళ్ళని ఒకసారి గద్దించి, తిరిగి అలా అరుచుకుంటూనే తన గదిలోకి పోతూండేవాడు.

ఈ సన్నాహాలు జరుగుతూండే రోజుల్లో నేనూ క్వీక్వెగ్గూ తరచు ఓడమీదకి వెళ్లేవాళ్ళం. అలా వెళ్ళినప్పుడల్లా కెప్టెన్ అహాబ్ ఎలా ఉన్నాడని, ఎప్పుడు ఓడమీదకి వస్తాడనీ అడుగుతూండేవాడను. ఈ ప్రశ్నలకి ఆయన ఆరోగ్యం మెరుగవుతోందనీ, ఓడమీదకి ఏనాటికానాడు రానున్నాడనీ ఆయన వచ్చేలోగా బిల్‌డాడ్, పెలెగ్‌లు ప్రయాణానికి కావలసినవన్నీ అమర్చగలరనీ సమాధానాలు వస్తూవుండేవి. ఒకసారి ఓడ బయలుదేరిందంటే, దానిపై నియంతృత్వం చెలాయించగల వ్యక్తిని చూడనైనా చూడ

కుండా ఆ ప్రయాణానికి ఒప్పుకోవడం నాకు నచ్చనిమాట నిజమే. ఏ విషయముమీదనైనా అనుమానం కలిగేటప్పటికే, ఆ వ్యవహారంలో మనం బాగా చొరబడి ఉంటే, ఆ అనుమానాన్ని మాపేసుకోవడానికి మనమెంతో ప్రయత్నిస్తాం. నా సంగతీ అదే అయింది. నేను ఎవ్వరితోనూ ఏమీ అవలేదు. నాలో నేను ఏమీ అనుకోకూడదని మాత్రం ప్రయత్నించాను.

చిట్టచివరికి, మర్నాడు ఓడ బయలుదేరనున్నట్టు ప్రకటింపబడింది. ఆనాటి ఉదయం క్వీకెగ్, నేను పెందలకడనే బయలుదేరాము.

—:o:—

21. నావాధిరోహణం

మేము ఉదయం ఆరుగంటలకే రేవువద్దకు చేరాము. అప్పటికి ఇంకా బాగా తెల్లవారలేదు. పొగమంచు ఇంకా విడువలేదు.

"అదుగో ముందుదెస ఎవరో నావికులు వెళుతున్నట్టున్నారు. ఓడ తెల్లవారేసరికే బయలుదేరుతుందేమో—త్వరగా నడు" అని క్వీకెగ్‌ను హెచ్చరించాను.

"ఇదిగో—" అన్నది మా వెనుక ఒక కంఠం. ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి మా యిద్దరి బుజాలమీద రెండుచేతులు వేసి, మా నడుమచేరి, క్వీకెగ్‌నీ, నన్నూ చూడటం మొదలు పెట్టాడు. అతను ఎలీజా!

"ఓడ మీదకా?" అని అడిగాడు.

"ముందు చేతులుతీసేయ్" అన్నాను.

"ముందు ఇక్కడనుంచి అవలికి పో" అన్నాడు క్వీకెగ్

"అయితే మీరు ఓడమీదకి కాదా?"

"అక్కడికే. అయితేమాత్రం నీకెందుకు? ఎలీజా! నీవు అనవసర జోక్యం కల్గించుకొంటున్నావని నా ఉద్దేశం. నీకు తెలుసా"

"ఓహో! అలాగని నాకు తెలియదే" అని మెల్లగా అంటూ మావైపు అర్థంకాని చూపులని ప్రసరింపచేశాడు.

"ఎలీజా-నీవు గనుక ఇక్కడనుంచి దయచేస్తే మాకు ఎంతో ఉపకారం చేసినవాడవవుతావు. మేము పసిఫిక్, హిందూ మహాసముద్రాలమీదకి వెళ్ళవలసిన వాళ్ళం. మాకు ఆలస్యం కలిగించకు" అన్నాను.

అయితే, నీవు మాతో ఉంటావన్నమాట-ప్రొద్దున్నే ఫలహారం కాగానే తయారయావ్ !" అన్నాడు క్వీకెగ్.

క్వీకెగ్‌తో నేను "అతనికి బుద్ధిసరిగాలేదు, మనం పోదాం పద" అన్నాను. మేము కొంత ముందుకు వెళ్ళగానే "ఏమండోయ్" అంటూ ఎలీజా కేకవేశాడు.

"వాడి సంగతి కేంలే. మనం పోదాం" అన్నాను క్వీకెగ్‌తో. ఎలీజా మమ్మల్ని అందుకొని మళ్ళీ మా భుజాల మీద చేతులుపెట్టి "ఆ ఓడవైపు ఎవరైనా మనుష్యులు వెళ్ళటం చూశారా" అని అడిగాడు.

"ఎవరో నలుగురైదుగురు వెళ్ళటం చూశా కాని, మసకగా ఉండటంవల్ల వాళ్లెవరో సరిగా కనబడలేదు" అన్నాను.

"అవును, చాలా మసకగా ఉంది - సరే, వెళ్ళిరండి" వదిలాడు కదా అనుకొన్నాం. కాని, ఇంతలోపలే మళ్ళీ మా దగ్గరకు వచ్చి, "వాళ్ళెవరో పోల్చుకోండి ఇప్పుడు-వం ?" అన్నాడు.

"ఎవర్ని పోల్చుకోమంటావ్ ?" అన్నాను.

"సరే పదండి, పదండి" అంటూ తాను వెళ్తూ, "ఏమీ లేదు, మిమ్మల్ని ముందుగానే హెచ్చరిద్దాం అను

కున్నాను. అయినా దాని కేంలే-కుటుంబంలో నేఉంది- బాగా వంచు పడుతోందికదూ. వెళ్ళిరండి మళ్ళీ, మిమ్మల్ని ఎన్నాళ్ళకో చూడటం కోర్టులో చూడటం తటస్థిస్తే తప్ప" అసందర్భంగా, ఈ మాటలంటూ వెళ్ళిపోయాడు. నా ఆశ్చర్యానికి మేరలేదు.

ఎలాగైతేనేం 'పెకోడ్' మీద అడుగుపెట్టాం. అంతా నిశ్శబ్దం. ఎవ్వరూ కదలిన మెదలిన జాడ కూడ లేదు. కెప్టెన్ గది తలుపు వేసి యుంది. లోపలి గొళ్ళెములన్నీ వేసి ఉన్నాయి. ఓడ ముందు భాగానికి వెళ్ళాము. అక్కడేవో తలుపులీసి ఉన్నట్టు కనబడింది, క్రిందికి వెళ్లాం. అక్కడో ముసలివాడు, రెండు పెట్టెలమీద బోర్లపడుకొని మంచి నిద్రలో ఉన్నాడు. ఆ నిద్రపోతున్న వానివంక సందేహముతో చూస్తూ, "మనం చూశామే, ఆ నావికులు ఎక్కడికి వెళ్ళి ఉంటారంటావు క్వీకెగ్" అని అడిగాను! క్వీకెగ్ రేపు ఏ నావికులను చూడనే లేదట, నేను పొరబడ్డానేమోనని సరిపుచ్చుకొనే వాడనే కాని, ఎలీజా వాళ్ళను గురించిన ప్రశ్న వేశాడు గదా! అక్కడే కూర్చుందామని క్వీకెగ్‌కు సూచించాను. క్వీకెగ్, ఆ నిద్రపోతున్న వాని మీద మాట్లాడకుండా కూర్చున్నాడు.

"మనిషిమీద కూర్చుంటావేమిటి!" అన్నాను.

"ఫరవాలేదు, ఇది మంచి చోటే, మాదేశంలో ఇలాగే కూర్చుంటారు. అతని మొగానికి ఏమీ దెబ్బ తగలదు లే-"

"ఆతను ఊపిరి తీసికోటానికి ఎంత కష్టపడుతున్నాడో చూడు. నీవు జోలెడంత బరువాయె-లే- కాస్సేపట్లో ఆతనే నిన్ను పడతోసేస్తాడు. అతను ఎందుకు లేవటంలేదు చెపుమా" అన్నాను. క్వీకెగ్ లేచి, ఆ పడున్నవాని తలదగ్గర కూర్చుని, తన పొగగొట్టం ముట్టించాడు. నేను కాళ్ళదగ్గర కూర్చున్నాను. పైప్ని ఒకరివద్దనుండి మరొకరు మార్చుకుంటూ కూర్చున్నాం. వాళ్ళ దేశంలో కుర్చీలు, సోఫాలు లేని కారణంగా రాజులు, ప్రభువులు మొదలైన పెద్దవాళ్లు కొంత మంది పేదవాళ్ళని బాగా మేపుతారట. ఇంట్లో సుఖంగా కూర్చోవటానికి ఏడెనిమిది మందిని కొనుక్కొని వాళ్ళని నాలుగు మూలలా పడుకో పెడుతారట. బయటికి వెళ్ళేప్పుడు ఈ పద్ధతి మరీ వీలుగా ఉంటుందట. ఏ చెట్టు నీడనో కూర్చోదలచుకొంటే ఒక్కొక్క ప్రభువు తన బానిసని నేలమీద పడుకొక్కుంటాడట. అంతే. ఇలా చెప్పుతూ నా దగ్గరనుంచి పైప్ను తీసుకున్నప్పుడల్లా క్వీకెగ్ దానిని ఆ పడుకొన్న వాడిమీద ఝుళిపిస్తూండేవాడు.

"అదేమిటి అలా చేస్తున్నావ్" అని ప్రశ్నించాను.

"వీణ్ణి చంపెయ్యటం చాలా సులభం-చాలా సులభం" అన్నాడు.

ఏవో పాతకథలన్నీ చెప్పుతున్నాడు. క్వీకెగ్ తన పైప్ పెద్దగొడ్డలి లాగ ఉండటవల్ల చాలా విధాల ఉపయోగించేదట. గదిలో పొగ బాగా కమ్ముకొంది. ఆ ఘాటు వాసనకి, ఆ నిద్రపోతున్నవాడు కొద్దిగా కదిలాడు. గాలి

పీల్చుకోవడం కష్టమైపోయింది కాబోలు! ఒకసారి ముక్కు-తుడుచుకొన్నాడు కాసేపు అటూ ఇటూ దొర్లి చివరికి లేచి కళ్ళు నులుముకొన్నాడు. చివరికి, "ఎవరయ్యా మీరు, ఇక్కడ పొగత్రాగుతున్నారు" అని అడిగాడు.

"మేము ఈ ఓడలో ప్రయాణంచేసే వాళ్ళం—ఎప్పుడు బయలుదేరుతుందేమిటి?" అని అడిగాను.

"ఓహో అలాగా ఓడ ఇవ్వాళ బయలుదేరుతుంది. రాత్రి కెప్టెన్ వచ్చాడు ఓడమీదకి"

"ఏ కెప్టెన్? అహాబ్బా?"

"కాక, ఇంకెవరను కొన్నావు?"

అహాబ్‌ను గురించి ఇంకా కొన్ని ప్రశ్నలు అడుగుదామను కొంటూండగా, ఓడ తట్టుమీద అడుగుల చప్పుడు వినబడింది. ఆ చప్పుడు విని "ఓహో స్టార్‌బక్ లేచినట్లున్నాడు. పాపం, మంచివాడు నేనుకూడా వెళ్ళాలి; అంటూ తట్టుమీదకి వెళ్ళాడు. మేమూ అనుసరించాం.

ఇప్పటికి బాగా తెల్లవారింది. ఓడని నడిపే వాళ్ళంతా జట్లు జట్లుగా వస్తున్నారు. ఇంకా ఏవో వస్తువులని ఓడమీదకి కొందరు తెస్తూనే ఉన్నారు. కెప్టెన్ అహాబ్ మాత్రం తన గదిలో సుప్రతిష్ఠుడై యున్నాడు.

22. క్రిస్మస్ సంబరం

మధ్యాహ్న మయేటప్పటికి అన్ని పనులూ పూర్తి అయినాయి. బిల్డాడ్ సోదరి తన ఆఖరి కానుకలు తెచ్చి ఇవ్వవలసిన వాళ్ళకి ఇచ్చి తిరిగి చిన్న పడవలో రేవుకి వెళ్ళింది. పెకోడ్ లంగరు నెత్తారు. పెలెగు, బిల్డాడ్ లు కమ గదినుండి బయటకు వచ్చారు. సరంగుతో పెలెగ్, "స్టార్ బక్, అన్నీ అమిరినట్టేనా! కెప్టెన్ అహాబ్‌తో ఇప్పుడే మాట్లాడివచ్చాను. ఆయన సిద్ధంగానే ఉన్నాడట. రేవు నుంచి తేవలసింది ఏమి లేదు కదూ! అయితే అందరినీ ఇక్కడికి రమ్మను- విధవలని!" అన్నాడు.

"ఎంత అత్యవసరమయినా అలాటి మాటలు అన రాదు" అంటూ బిల్డాడ్, "స్టార్‌బక్, నువ్వు వెళ్ళి ఆపని చూడు.

"కెప్టెన్ పెలెగ్, కెప్టెన్ బిల్డాడ్‌లు యుద్ధనౌకాధి కారులవతె, ఓడతొట్టుమీద చాలా జబర్దస్తీగా ప్రవర్తించారు. కెప్టెన్ అహాబ్ జాడేలేదు. అతను గదిలో ఉన్నట్టుమాత్రమే వినికిడి. కాని అతని అవసరం లేకుండానే, ఓడను సముద్రం మీదకి తీసికొని వెళ్ళవచ్చుని అందరి అభిప్రాయముగా ను. అసలు ఆ పని పైలట్‌దే కాని, అహాబ్‌ది కాదు. పైగా, అతను పూర్తిగా కోలుకో లేదట. అందువల్ల గదిలోనే ఉండి పోయాడు. వాణిజ్యపు టోడలమీదకూడా ఇదే అలవాటు.

కెప్టెన్, లంగరెత్తిన సంకేతసీటీకోగాని తట్టుమీదకి రాడు. అంతదాకా తన స్నేహితులతో కబుర్లు చెప్పుకొంటూ గదిలో కూర్చుంటాడు.

ఈ విషయాలన్నీ ఆలోచిస్తూ కూర్చోవటానికి వ్యవధే లేదు. కెప్టెన్ పెలెగ్ చాలా హడావుడిగా వున్నాడు. బిల్‌డాడ్ కంటె ఎక్కువగా అతనే మాట్లాడటమూ, అధికారము చెలాయించడము చేస్తున్నాడు.

ఓక స్తంభం దగ్గర నావికులు ఉండటం చూచి, కేకలు పెడుతూ ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు.

ఓడ బయలుదేరేటప్పుడు సాధారణంగా పైలెట్ ఓడ ముందు భాగాన ఉంటాడు. ఆ స్థానంలో బిల్‌డాడ్ కూర్చున్నాడు. అతనుకూడా పైలట్‌గా తరిఫీదు పొందిన వాడేనామె. అక్కడే ఒక యంత్రాన్ని నడుపుతూ వున్న కుర్రవాళ్ళకు హుషారు కలిగించటానికి రాబోలు ఎడనెడ దీనఫణితో ఏదో ప్రార్థనా గీతం పాడుతున్నాడు. ఆ కుర్ర వాళ్లు మాత్రం ఏవేవో శృంగార పదాలు పాడుకొంటు న్నారు. అటువంటి పిచ్చిపదాలు ఓడ బయలుదేరేటప్పుడు పాడకూడదంటూ బిల్‌డాడు అంతకుముందే ఆదేశించాడు. అతని చెల్లెలుకూడా ఒక్కొక్క నావికుడికీ భక్తిగేయాల పుస్తకం ఒకటి ఇచ్చి వెళ్ళింది.

ఇది ఇట్లా ఉండగా, ఓడయొక్క వెనుకభాగాన నిలిచి కెప్టెన్ పెలెగ్ హడావడి చేస్తున్నాడు. లంగరు పూర్తిగా ఎత్తకముందే, ఓడను ముంచివేసేటట్టున్నాడని అనిపించింది

నాను. నాకు తెలియకుండానే, ఒక స్తంభాన్ని గట్టిగా పట్టుకొన్నాను. క్వీక్వెగుని కూడా పట్టుకోమన్నాను. పెలెగువంటి వాని చేతులలో పడ్డామే, ఎటువంటి ఉపద్రవాలు వచ్చి పడుతాయో అనుకొన్నాను అయినా, బిల్దాదు దైవభక్తుడై యుండటంవల్ల మాకు ఫరవాలేదని సంతృప్తిపరచుకొన్నాను. నేను ఇలాగ ఆలోచించుకొంటూండగా నన్ను ఎవరో వెనుక నుండి తన్నుతున్నట్టు తోచి వెనుకతిరిగి చూశాను. పెలెగు తన కాలిని వెనుకకు తీసికొంటున్నాడు. నేను తిన్న మొదటి తన్ను అదే.

“అలాగేనా సరకుల ఓడమీద పనిచేసేది - నడుం వంచి పనిచేయి!” అని నావైపు తిరిగి గద్దించి, “మీరందరూ కూడా కాస్త నడుంవంచి పని చేయండి. నిన్నే! క్వీహాగు! ఓయ్! టోపీవాడూ— నువ్వుకూడా—” అంటూ ఒక్కొక్కళ్ళనే కేకలు వేశాడు. ఇంకా ముందుకువెళ్ళి అక్కడొక యంత్రాన్ని నడుపుతున్న వాళ్లమీదకు జోరుగా కాళ్ళని విసురుతూ అటూ ఇటూ తిరిగాడు. అంతసేపూ, బిల్దాదు చలించలేదు. తన భక్తిగీతాలలో మునిగిపోయాడు. కెప్టెన్ పెలెగు, ఏదో త్రాగాడుఅనుకొన్నాను.

ఏలాగైతేనేం లంగరు పూర్తిగా ఎత్తారు. తెరచాపల్ని విప్పారు, ఓడ మెల్లగా సాగుతోంది. పొద్దుపోయేటప్పటికి చల్లని మహాసముద్రం మీద వున్నాం. సముద్రపు తుప్పర మా మీద పడి మమ్మల్ని మంచుతో కప్పివేసింది. మా ఒంటిమీద మంచువల్ల తళతళ లాడే కవచము తొడుగు

కొన్నట్టు ఉన్నాం. ఓడ అంచుల వున్న పళ్ళవరుసలు వెన్నె
లలో మెరుస్తున్నాయి. ఓడ ప్రక్కభాగాలనుండి వ్రేలాడే
మంచు గడ్డలు ఏనుగుల దంతాలవలె ఉన్నాయి.

మంచు ఓడనంతా కప్పివేస్తోంది. గాలి హోరు
మంటోంది. బిల్‌డాడు ఓడ ముందుభాగాన కూర్చుని పాడు
తున్నాడు. ఆ పాట అర్థమిది. "ఉప్పొంగే వెల్లువకు ఆవల
కమ్మ వాసనలీనే పచ్చచేలు ఉన్నాయి. అలాగే, అల్లకల్లో
లమై ఉన్న జార్డాన్ నదికి ఈవలనున్న యూదులకు సౌభాగ్య
వంతమైన కెనాన్ ఆవలివైపున కనబడేది."

ఈ పాట నాకు పరిచితమే అయినా, ఆనాటి వలె
అంత మధురంగా ఇంకెన్నడూ లేదు. ఆ వాక్యాలు ఆశా
పూరితములు, ఫలప్రాప్తి సూచకాలు!

అది అట్లాంటిక్ మహాసముద్రం మీద చలితో
మనుష్యులు బిగుసుకు పోయేట్టి రాత్రి. నా కోటూ, కాళ్ళూ
తడిసి ముద్దయిపోయి ఉన్నాయి. అయినా, ఎక్కడో సుఖప్రద
మైన నెలవుందనే అనిపించింది. ఎక్కడో వసంతా రామం
ఉంటుంది.

మేము బయలు దేరాక పైలట్లు అవసరం లేకపోయింది.
మా ఓడ ప్రక్కనే చిన్న పడవకూడా రాసాగింది. అప్పుడు
బిల్‌డాడ్ ఏమనుకొన్నాడో! తాను ఎంతో వెల ఇచ్చి
కొనిన ఓడ అత్యంత ప్రమాదకరమైన దూరప్రయాణమునకు
బయలుదేరినప్పుడు దానిని విడువలేక పోయాడు. పైగా ఆ
ఓడకి తనతోటివాడే కెప్టెన్‌గా వెళ్ళుతున్నాడు. అతను

మళ్ళీ ఆ భయంకరమైన తిమింగిలం బారిన పడగల ప్రమాదాన్ని ఎదుర్కొనటానికి బయలుదేరుతున్నాడు! పాపం, బిల్‌డాడ్ ఓడతట్టు మీద పచార్లు చేస్తూ క్రింది గదిలోకి పరుగెత్తి ఏదో ఒక మాట చెప్పి మళ్ళీ పైకి వచ్చాడు. అటు చూచి, ఇటు చూచి, అంతులేని సముద్రం వైపు చూచి, రేవువైపు చూచి అన్నివైపులా శూన్యదృక్కులతో కలయ చూచాడు. కెప్టెన్ పెలెగ్ చేతిని పట్టుకొని లాంతరుని అతని ముఖం దగ్గరగా పెట్టి అతనివంకసాభిప్రాయంగా చూచాడు "నేను ఈ ఓడవియోగము భరింప గలనుటే" అని ఆ చూపులోని అర్థం.

పెలెగ్ నిశ్చలంగా యోగి వలె నిలిచి ఉన్నాడు. ఎంత నిశ్చలంగా ఉన్నా దీపపు కాంతిలో అతని కన్నీటి బొట్టు మెరిసింది. అతనుకూడా వాళ్ళకీవీళ్ళకీ ఏదో ఆదేశించటానికి అటూ ఇటూ అప్పటి వరకూ పరుగెత్తుతూనే ఉన్నాడు. చివరికి తన మిత్రుని వైపు తిరిగి, "కెప్టెన్ బిల్‌డాడ్, పద మనం వెళ్లాలి. రేవుకి పోదాం పద, పడవసరంగూ, దగ్గరగా తీసుకురా పడవని! బిల్‌డాడ్ – నీవు చెప్ప వలసిందేమైనా ఉంటే చెప్పేశేయ్ – స్టార్‌బక్, స్టబ్, వస్తామత్తా! మూడు ఏళ్ళ తర్వాత మళ్ళీ కలుసుకొందాం – మీకోసం అన్నీ సిద్ధంగా ఉంచుతా" అన్నాడు.

కెప్టెన్ బిల్‌డాడ్, మిమ్మల్ని భగవంతుడు రక్షించు గాక! వాతావరణం బాగా ఉంటుందని, కెప్టెన్ అహాబ్ మీతో కలసి మెలసి ఉంటాడని ఆశిస్తున్నాను. అహాబ్ కి

మూంచి సూర్యరశ్మి కావాలి. అది ఉంటే అతను బాగానే ఉంటాడు. ఇదిగో ఈ బెంగాళ్యా ఓడని ఊరికే పాడుచేయకండి. కలప ధర బాగా పెరిగింది ఈ యేడు. వీలయినంత దాకా పర్వదినాల్లో వేటాడకండి. మరీ సులువుగా దొరికేట్టయితే మాత్రం విడిచి పెట్టకండి. అయాచితంగా దేవుడిచ్చిన దానిని తిరస్కరించడం పాపం. లంకలదగ్గర నిలిచేటప్పుడు దిగేటప్పుడు జాగ్రత్త - వ్యభిచారం లేకుండా చూడండి. వస్తా - స్టార్‌బక్! ఆ జున్ను ముక్కని చాలా రోజులు నిలువ ఉంచకు, చెడిపోతుంది. వెన్నని జాగ్రత్తగా వాడు, ఒక్కొక్క పౌన్సు ఇరవై సెంట్లు అంటూ ఇంకా ఏవో చెప్పబోతూంటే అతనిని ప్రక్కకి లాగి, పెలెగ్, "చాలులే, ఇక పద అన్నాడు. ఓడ ప్రక్కగా వాళ్ళకోసం వచ్చిన పడవలోకి దూకారు.

ఓడా, పడవా రెండు ముఖాలు పట్టాయి. వాటి రెంటి మధ్యా చల్లని గాలి వీచింది. జల పక్షి ఒకటి గీపెట్టి కూస్తూ ఓడ మీదుగా ఎగిరి వెళ్ళింది. మేం మందరం ముమ్మార్లు జయ జయ ధ్వానాలు చేశాం.

కళ్ళుమూసుకొని విధివిహితముగా అట్లాంటిక్ మహా సముద్రంలో చొరబడ్డాం.

23. అహబ్

నన్‌టుకెట్‌ని విడిచిన తరువాత చాలా రోజులు కెప్టెన్ ఆహాబ్‌ని గురించి ఏమీ తెలియలేదు. చిన్న ఉద్యోగస్తులే ఆజ్ఞలు జారీ చేస్తూ వాళ్ళే ఓడకి నియామకులులాగ కనబడేవారు. అయితే. అప్పుడప్పుడు కెప్టెన్ గదిలోకి వెళ్ళి బయటకు వచ్చి క్రొత్తక్రొత్త ఆజ్ఞలని జారీ చేస్తూండటం వల్ల, వాళ్ళు ఎవరికో ప్రతినిధుగా మాత్రమే అధికారాన్ని చెలాయిస్తున్నారని తెలిసేది. కెప్టెన్ గది పవిత్రము, గోప్యము అయిన ఏకాంత స్థలము, అందులో వాళ్ల యజమాని, నియంత ఉంటాడు.

నా జాగా నుంచి ఓడ తట్టు మీదకి వెళ్ళినప్పుడల్లా ఏదైనా క్రొత్త మొగము కనబడుతుందేమోనని వెతికే వాడిని. నేనెరుగని ఆ కెప్టెన్ అంటే నాకు మొదట్లో ఉండే కలత సముద్రము మీదికి వెళ్ళిన తరువాత పెద్ద ఆందోళనగా మారింది. ఎలీజా చేసిన ప్రలాపాలు అప్రయత్నంగా జ్ఞాపకం వస్తూండేవి. వాటి ప్రభావము వల్ల నా ఆందోళన మరింత బలీయము అయినది. మామూలు స్థితిలో ఆ ప్రలాపాలు ఏదో పిచ్చి వాగుడుగా జమకట్టి త్రోసి పుచ్చేవాడను. కాని ఈ స్థితిలో వాటి ప్రభావానికి తట్టుకోలేక పోయాను. అటువంటి ఆందోళనలని కలిగి ఉండటం నిర్హేతుకము అని కూడా అ: ఫించింది. ఆ ఓడమీద ఉన్న వేటగాళ్ళు, ఆ ఓడని

నడిపే వాళ్ళు, నాకు అంతకు ముందు తటస్థ పడ్డ వ్యాపారం నౌకలలోని వాళ్ళకంటె చాలా అనాగరికులు, మోటు వాళ్లూను. ఒకవేళ ఈ లక్షణాలు స్కాండినేవియా దేశస్థుల భయంకర వృత్తివల్ల కలిగినవేమోనని అనుకొన్నాను. ఇట్టి సంఘంలో ఉన్నా, ఆ ఓడకి చెందిన ముగ్గురు ముఖ్య ఉద్యోగులూ చాలా మంచివారు, ఉత్సాహపూరితులు, అవడంవల్ల నేను ఆందోళన చెందడం అనవసర మనిపించింది. అట్టి ఉద్యోగస్థులను తరచుగా చూడము. ముగ్గురూ అమెరికనులే. ఒకడు నాన్టుకెట్ కి, ఇంకొకడు వైన్ యార్డ్ కి, మూడవవాడు కేప్ కి చెందినవాళ్ళు. మా ఓడ బయలుదేరినది క్రిస్మస్ వార మవటంవలన విపరీతమైన చలిగా ఉన్నది. మేము దక్షిణ దిక్కుగా వెళ్లుచుండటంచేత మెల్లగా ఆ చలి బాధ తగ్గిపోసాగింది. ఆ మనసనాను అంత నిరుత్సాహంగా లేదు. చక్కని గాలి వీచుతోంది. ఓడ నీళ్ళపై పగతీర్చుకుంటున్నదా అన్నట్టు అతివడిగా చీల్చుకుంటూ దూసుకుపోతోంది. తట్టుమీదకి రమ్మని పిలుపురాగా నేను వెళ్లాను. నేను అంతా కలియచూడక ముందే రానున్న ఆపదయొక్క సూచనయేమో, మనస్సులో సంకోచము కలిగింది. భయభావనకంటె తద్వస్తుదర్శనము ఎక్కువ భయంకరము. తట్టుమీద ముందువైపున కెప్టెన్ అహాబ్ నిలబడ్డాడు.

అతనేదో జబ్బుగా ఉన్నట్టుగాని, జబ్బుపడి కోలుకొంటున్నట్టుగాని సూచనలేమీ లేవు. క్రిందినుంచి లేచిన మంటలు అవయవాలను పూర్తిగా కాల్చివేయక విడువగా

స్తంభమునుండి వేళ్ళాడే వానిలాగ ఉన్నాడు. ఉన్నతమూ, విశాలమూ అయిన అతని రూపము కంచు విగ్రహంవలె ఉన్నది. నుదుటిమీదనుండి బయలుదేరి మొగముమీదుగా ప్రక్కకు తిరిగి మెడవరకు వెళ్ళే తెల్లని సన్నని మచ్చ ఒకటి కనబడింది. వృక్షాన్ని రాచుకొంటూ నేలలోకి వెళ్ళిపోయే పిడుగు చెట్టుకి హాని కలిగించకపోయినా బెరడుని మాత్రం చీల్చివేసి తనగుర్తుని వెనుక విడిచిపెడుతుంది. అతనిముఖము మీది మచ్చ అట్టి పిడుగుని గుర్తుచేసింది. ఆ మచ్చ అతనికి పుట్టుకతోనే ఉందో, ఏదైనా పెద్దగాయము వలన కలిగిందో సరిగ్గా ఎవ్వరూ చెప్పలేరు. ఆ మచ్చను అందరూ తేరిపార చూచినా దాని గురించి ఆ ప్రయాణంలో ఎవ్వరూ ప్రస్తావించలేదు. కాని ఒకనాడు రహస్యంగా వయోవృద్ధుడైన ఎఱ్ఱ ఇండియన్ ఒకడు అహాబ్‌కి నలభైయ్యేళ్ళ యేసుదాటే దాకా అటువంటు మచ్చలేదనీ, ఆ మచ్చ మనుష్యులతో పోట్లాటవల్లకాక సముద్రముమీద దేనితోనో పోరాటములో కలిగినదనీ అన్నాడు. ఈ మాటలని ఇంకొకడు ఖండించాడు. అహాబ్‌కి తలనుండి కాలివరకు వెళ్ళే పుట్టుమచ్చ ఉండి ఉంటుందని అతడు చనిపోయిన తరువాత అంత్యక్రియలు చేసే వానికి ఇది స్పష్టంగా తెలుస్తుందనీ అన్నాడు.

అహాబ్ యొక్క భయంకర రూపమూ, ఆ తెల్లని మచ్చా నా మనస్సున బాగా నాటిపోయాయి. ఆ రూపము యొక్క భయంకరత్వానికి ముఖ్యకారణం అతని తెల్లని కాలు అని గ్రహించటానికి కొంతసేపు పట్టింది నాకు. తెల్ల

నయిన అతని కృత్రిమపుకాలుని తిమింగిలపు దవడతో తయారుచేశారని ఇదివరకే విన్నాను. ఎవరో అన్నాడు కూడాను, "అతను స్తంభాన్ని జపానుదగ్గర పోగొట్టుకొన్నాడు కాని దాని కోసం తిరిగి ఇంటికిరాక, ఇంకొకటి అక్కడే అమర్చుకొన్నాడు" అని.

అతను నిలబడిన భంగిమను చూసి, ఆశ్చర్యపోయాను. ఓడకి పైతట్టుమీద అక్కడక్కడ చిన్న చిన్న కన్నాలున్నాయి. ఒక కన్నములో అతని ఎముక కాలుని గన్ని పెట్టి, ఒక చేతిలో వేలాడుతూన్న తాడుని పుచ్చుకొని, సిటారుగా నిలబడ్డాడు. ఓడకి ఎదురుగానున్న దేనినో చూస్తున్నాడు. అతని చూపులో ధైర్యమూ, అజేయమైన పట్టుదలా ఉన్నాయి. అతను ఒక్కమాట పలుకలేదు. అతని క్రింది ఉద్యోగస్థులు కూడా ఏమీ పలుకలేదు కాని వాళ్ళ ముఖచిహ్నాలవల్ల అతని సమక్షంలో ఉండటం వాళ్ళకి కష్టంగా ఉన్నట్టు తెలుస్తూనే ఉంది ఆలోచనా మగ్నుడైన అహాబ్ ముఖములో వాళ్ళకి, దేనికో బలియైన వాని లక్షణాలు కానవచ్చాయి. అనిర్వచనీయ మహాప్రభావతా సంపన్న శోకదేవతావశంవదుడై ఉన్నట్టు కనబడ్డాడు. కాసేపు అలా గాలి పీల్చుకొని, మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయాడు. ఆ నాటినుండి తట్టుమీద నిలబడి యుంటూనో, దంతపు బల్లమీద కూర్చుని ఉంటూనో, అటూ ఇటూ పచార్లు చేస్తూనో అతను ఓడని నడిపే వాళ్ళకి ప్రతిరోజూ కనబడుతూనే ఉండేవాడు. వాతావరణం కొంచెం

కొంచెంగా పెరుగవుతున్నకొద్దీ అతను తరచు బయట కన బడేవాడు. మొదటిరోజులలోని చలివల్లనే అతను తనగదిలోనే వుండిపోయాడేమో నన్నట్లు. రోజులు గడచినకొద్దీ అతను ఎప్పుడూ బయటే వున్నట్టుండేది. అతను కూడ ఒక స్తంభము వలెనే నిలబడేవాడు కాని చెప్పినదీ, చేసినదీ ఏమీ లేదు.

'పెకోడ్' ఇంకా ప్రయాణపు ప్రారంభదశ లోనే వుంది. అసలైన యానం ఇంకా మొదలుకాలేదు. ప్రారంభ ప్రయత్నాలన్నీ అతనికింది ఉద్యోగస్థులు చూసుకోగలరు. కాబట్టి అతను తాను చేయదగ్గది ఏమీ లేకపోవడంవల్ల అతని ముఖమండలమును ఆవహించే విచార మేఘములు చెదరిపోదగిన కార్యనిమగ్నత ఏమీ లేకపోయి నది. మేఘములు ఉన్నత పర్వత శిఖరముల మీదనే కూడు తూంటాయి. రోజులు ఆహ్లాదకరంగా మారాయి. అతను కూడా వాటి ప్రభావము వల్లనే కాబోలు మెత్తబడ్డాడు.

ఏప్రిల్, మే మాసములు అనే కన్యలు నృత్యము చేస్తూ ఆవిర్భవించాయి. హిమంతంలో మోడుబారి నిర్జీ వముగా కానవచ్చిన 'ఓకు' వృక్షముకూడా ఆ కన్యలకు స్వాగతము చెప్పటానికి పల్లవ స్తబకములను వెలార్చింది. అహాబ్ కూడా ఈ ప్రకృతి విలాసానికి వశుడైనాడు. అప్పు డప్పుడు అతని చూపు లీలామాత్రంగా చిగిర్చేది. ఆపదవిలో నున్న ఇంకొకరి చూపు అయితే ఆ కాల ప్రభావమువల్ల హాసపుష్పాలను వికసించేది.

24. అహబ్‌తో స్టబ్

కొన్ని రోజులు గడిచినవి. మంచుగడ్డలు, మంచు గుట్టలు కరిగిపోయినవి. మా ఓడ వసంతప్రకాశమానమైన సముద్రములో క్రేళ్ళు వురుకుతూ నడిచింది. వుష్ణమండలము లోని సముద్రములమీద నిత్యవసంతము రాజ్యమేలు చున్నదా అన్నట్లు ఆగస్టుమాసపు లక్షణములే నిరంతరము నెగడుతూ వుంటాయి. ఆ సముద్రములమీద పగటిపూటలు నులివెచ్చగా, ప్రకాశమానంగా, కమ్మనివాసనలతో స్ఫటికపు గిన్నెలలో నింపి, పన్నీరు కలిపిన, పారశీకపు పానీయములవలె ఆనందదాయకములుగా వుంటాయి. రాత్రిపూటలు, నక్షత్ర శోభితమైన ఆకాశముతో రత్నాలంకృత చిత్రవస్త్రములు తాల్చి ప్రియాసమాగమ నిరీక్ష పరాయణులైన ప్రౌఢ యువతులవలె అరుణ కిరణోని. దర్శనమునకు ఆత్రులు చూస్తూం టాయి. నిద్రపోదలచిన వానికి ఆహ్లాదకరములైన ఆ పగటి పూటలు, జగన్మోహనములైన ఆ రాత్రి పూటలు సమము గానే ఉంటాయి. ఆ ఋతువుయొక్క ఈ మోహాస్త్ర ప్రభావము ఒక్క బాహ్యప్రకృతి మీదనే చెల్లుతూవుండదు. అంతరాత్మమీద కూడా దాని ప్రభావము కానవస్తుంది ప్రశాంతమైన సాయంకాలపు ఘడియలు రావటంతోనే ఆ ప్రభావము మరీ ఎక్కువౌతుంది. ఈ కాలప్రభావమునుండి

ఎంత స్థాణుస్వభావుడైనా, అహాబ్ మాత్రమెట్లు తప్పించుకోగలడు! అతని ప్రకృతి కూడా మారజొచ్చింది.

ఎక్కువకాలం జీవించినకొద్దీ మృత్యువుతో సంబంధం లేదా అనిపించేటట్టు వార్థకం జాగ్రదావస్థలో వుంటుంది. ఓడలలో వయస్సుమళ్ళిన కెప్టెన్‌లు రాత్రిపూట చీకటి ముసుగు వేసుకొన్న తట్టుమీదకి తరచు వస్తూంటారు. అహాబ్ కూడా అంతే. రాత్రివేళల అతను ఎంతసేపూ గదిలో కాక తట్టుమీదే వుండేవాడు. “నావంటి ముసలివాడు ఈ మెట్లన్నీ దిగి గదిలోకి వెళ్ళటం సమాధిలోకి వెళ్ళినట్టే వుంటుంది” అని తనలో తాను గొణుగుతూ వుండేవాడు.

రాత్రుళ్లు తట్టుమీద పహారా చేసేవాళ్లు క్రిందికి ఏదైనా త్రాడు విసరవలసివస్తే అక్కడ నిద్రపోయే తమ సోదరులు మేల్కొంటారేమోనని చప్పుడు కాకుండా జార్చే వాళ్లు. అంత నిశ్శబ్దంగా వున్న ఆ సమయంలో చుక్కాను దగ్గర వుండేవాడు కెప్టెన్ గదికి వెళ్ళి మెట్లు వైపు చూస్తూ వుండటం, ఆ మెట్లు మీదనుంచి కెప్టెన్ కుంటుకుంటూ పైకి రావటం పరిపాటి. అంత రాత్రివేళ అహాబ్, తట్టుమీద పచార్లు చేయకూడదనుకొనేవాడు. అతను పచార్లుచేస్తూంటే, అతని దంతపు కాలివల్ల కలిగే చప్పుడుకు క్రింద పండుకొన్న వాళ్ళ నిద్రకు భంగం కల్గడమే కాకుండా, పట పట పళ్ళు కొరికే సొరచాపలే వాళ్ళ కలలలో వస్తూంటాయి. కాని ఒకొక్కసారి ఈ చిన్నవిషయాలను పట్టించుకోక పచార్లు చేద్దామని అనిపించి అహాబ్ చప్పుడుచేస్తూ పెద్ద పెద్ద అంగలు

వేసేవాడు. ఓడలో ప్రధానోద్యోగులలో ఒకడైన, స్టబ్ పైకివచ్చి "కెప్టెన్ అహబ్ కే పచార్లు చెయ్యాలని ఉంటే ఎవ్వరూ కాదనలేరనీ, కాని అంతచప్పుడు కాకుండా మెత్తటి బట్ట కాలికి చుట్టుకో వచ్చునసీ" మెల్లగా నవ్వుతూ సూచించాడు. పాపం స్టబ్. అహబ్ ఎటువంటివాడో ఎరగడు. "నన్ను ఫిరంగి గుండుననుకొన్నావా! స్టబ్! నీ సాటివాళ్లు ఒదిగి ముడుచుకొని పండుకొనే ఆ క్రింది గదిలోకి పో— ఛీ! పో! కుక్కా—" అని అరిచాడు,

అహబ్ అన్న మాటలకి నివ్వెరపడి స్టబ్ "మీరు ఆలా మాట్లాడటం మర్యాదగాలేదు— నాతో ఎవ్వరూ అలా మాట్లాడరు—" అని ఆవేశంతో అన్నాడు.

గట్టిగా పళ్ళు బిగించి, "ఏమిటీ" అని, ఇంకా ఏమేమో అనవలసి వస్తుందో అని కాబోలు అక్కడనుంచి గబగబా వెళ్ళిపోయాడు. స్టబ్ మళ్ళీ అందుకొని, ధైర్యంగా, "నన్ను కుక్క—అని తిట్టితే నేను తిరిగి తిట్టకుండా ఊరకుండను"

"సరే, కుక్క కాకపోతే గాడిద- కంచర గాడిద- ఇక నడు- లేకపోతే నీవీ లోకంలో లేకుండా చేస్తాను" అంటూ భయంకరంగా, అహబ్ మీదకి వచ్చాడు. స్టబ్ బెదిరి వెనుకకు తగ్గాడు,

స్టబ్ మెట్లుదిగి క్రిందికి వెళ్ళుతూ, ఇలా గొణుక్కున్నాడు: "తిరిగి దెబ్బ తినకుండా, నాతో ఎవ్వరూ ఇలా మాట్లాడలేదు. తిరిగి వెళ్ళి వానిని ఒక దెబ్బ వెయ్యాలో ఏం చేయాలో తెలియుటం లేదు. ఏమిటీ! వాడి కాళ్ళమీద

పడి, ప్రార్థించాలా! అవును- నా మనసులో ఆలోచన అదే. నే నెప్పుడూ ప్రార్థనచేసి ఎరుగనే! అంతా పిచ్చిగా ఉంది. వాడూ పిచ్చివాడిలాగానే ఉన్నాడు- ఇలాటి వాడితో ఎప్పుడూ ప్రయాణం చెయ్యలేదు నేను. నావైపు ఎలా చూశాడో! అతని కళ్ళు ఎలా మెరిశాయో! పిచ్చి ఎక్క లేదు కదా అతనికి! అతని మనస్సులో ఏదోవుంది. తెలియటంలేదు. అతను రోజుకి మూడు గంటలకన్నా ఎక్కువ పండుకోవటం లేదు. తెల్లవారేప్పటికి అతని బట్టలూ, దుప్పట్లూ నలిగి క్రిందపడి ఉంటాయనీ, తలగడ ఎంతో వేడిగా ఏదో కాలే వస్తువు పెట్టి ఉంచినట్టు ఉంటుందని పనికుర్రవాడు చెప్పనే చెప్పాడు! రేవులో ఉండేవాళ్ళు "అంతరాత్మ" అంటూంటారు. అటువంటి దేదో దాపురించింది కాబోలు ఇతనికి. అదేమిటో నాకు సరిగా తెలియదు. భగవంతుని దయవల్ల నాకుమాత్రం ఆ అంతరాత్మ లేకుండా వుంటే చాలు. అతని సంగతంతా విచిత్రమే. రాత్రిపడగానే తట్టుమీదకి అలా ఎందుకు వెళ్లుతాడో! బాగా నిద్రపోక పోలేకపోతే మనిషై పుట్టి సార్థకం ఏమిటి! పిల్లల పనే నిద్రపోవటం. ఎంత చిత్రమో! కాని ఒకటి ఆలోచించినకొద్దీ అన్నీ చిత్రంగానే వుంటాయి. దేనినిగురించీ ఆలోచించకూడదనీ వీలైనప్పుడల్లా నిద్రపోవాలనీ నా సిద్ధాంతం. కాని అది ఎలా సాధ్యం! నన్ను కుక్క గాడిదా అన్నాడు- కావాలంటే కంచరగాడిదవి కూడా అన్నాడు! అన్నిమాటలు బదులు నన్ను ఒక్క తన్ను తన్ని పో అనవచ్చుగదా! ఐనా

నన్ను నిజంగానే తన్నాడేమిటి చెప్మా! ఏమో నేను తన్నడం గుర్తించలేదేమో. అతని నుదురు చూసినప్పుడు నాకే మతిపోయిందాయె! సున్నపు నీళ్ళల్లో కడిగిన మొముక లాగ మెరిసిందది. నేను కాళ్ళమీద నిలబడలేకపోతున్నాను. ఏం రోగం వచ్చిందో, ఆ ముసలితో పోట్లాడటంవల్ల నేను తల్లకిందులైపోయాను-భగవంతుడా! నేను కలలుగంటున్నానేమిటి! నాకేమో మైకం క్రమ్ముతూ ఉన్నట్టుంది. దీని నుండి తప్పించుకోవడ మెలాగ! ఎలాగ! దీని కొకటే మార్గం— పక్కమీదకి వెళ్ళడమే- తెల్లవారి దీని సంగతి చూద్దాం. ఈ నాటకమంతా ఎలా ఉంటుందో."

—:0:—

25 పైపు

స్టబ్ వెళ్ళిన తరువాత అహాబు కాసేపు బురుజును ఆనుకొని నిలబడ్డాడు. ఆ తరువాత మామూలు ప్రకారం నౌకరును పిలిచి తన గదిలో ఉండే దంతపు బల్లనీ, పైప్నీ, తెమ్మన్నాడు. ఓడకి ఎడమవైపున బల్ల వేయించుకొని, పైప్ ముట్టించి పొగ తాగుతూ కూర్చున్నాడు.

పూర్వకాలం, సాగరప్రియులైన డెన్మార్కు దేశ రాజులు సింహాసనాలను తిమింగిలపు దంతాలతో చేయించుకొనేవారట. దంతపు ముక్కాలిపీటమీద కూర్చున్న అహాబును చూడగా ఆ రాజుల రీతి జ్ఞాపకం రాకుండా ఎలా వుంటుంది? నౌకలకు సుల్తానూ, సముద్రానికి రాజూ, తిమింగిలాలకి ప్రభువూ వంటి వాడు అహాబు.

కొన్ని నిమిషాలు గడిచాయి. అతని నోటినుండి వచ్చే దట్టపుపొగ అతని మొగముమీదికే వెళ్ళుతూ వుంది. పైప్ని తీసివేసి, "ఈ పొగ తాగటం వలన ఏమీ ప్రయోజనం కనబడటం లేదు. ఎందుచేతనో! దీనిమీద నాకు మోజు పోతే కష్టం కలుగుతుంది! ఈ పొగ తాగటంవల్ల నాకు సంతృప్తి లేకపోగా దానికోసం ఏదో తెలియని శ్రమకూడా పడవలసి వస్తోంది. గాలివాటున కూర్చుని పొగ వదులుతూ ఉంటే, పొగని విడువటం ఎంత కష్టం! ఈ పైపు ఇంకెందుకు? తెల్లని, సన్నని ఈ పొగ, నెరసీ నెరయని జుట్టుగల వాళ్ళ

శాంతికై వుద్దేశింపబడినది గాని, నావలె పండబారిన తల గల వాళ్ళకోసం కాదు. ఇక పోగ తాగను" అంటూ నిప్పుతోనే ఆ పైప్‌ను సముద్రం మీదకి విసిరివేశాడు. నిప్పు చివ్వుమని ఆరిపోయింది. మునిగిపోతున్న పైప్‌వల్ల ఏర్పడిన గాలిబుడగ మా ఓడకు వచ్చి తగిలింది. ముఖానికి టోపీని లాగుకొని, అహాబు అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు.

26. స్వప్నం

మరునాడు 'స్టబ్' ఫ్లాస్కును పిలిచాడు. "భలే తమాషా అయిన కల కన్నానయ్యా- మన ముసలివాడి దంతపు కాలుంది చూశావూ దానితో నన్ను వాడు తన్నాడట, తిరిగి తన్నుదామని ప్రయత్నిస్తే, నీవు నమ్ము నమ్మకపో నా కాలినే పోగొట్టుకొన్నానట! ఇంకొక్క క్షణంలో అవాబ్ పెద్ద దిబ్బగా మారిపోయాడట. తెలివితక్కువ విధవను నేను దానిని తన్నుతూ నిలబడ్డానట! ఇంతకంటె విచిత్రమేమిటో తెలుసా? అంతసేపూ నేను 'అతనిచేత తన్ను తినడంలో అవమాన మేమున్నది' అని అనుకొంటూనే వున్నానట. 'అది నిజమైన కాలు కాదు, కృత్రిమపుదే కదా, తగాదా ఎందుకు' అనుకొన్నానట. సజీవమైన దానితో కలిగే దెబ్బకీ, జీవంలేని దానివల్ల కలిగే దెబ్బకీ తేడా వుంది. అందువల్లే చేతిదెబ్బని భరించటం, బెత్తపు దెబ్బని భరించటంకంటె ఏభై రెట్లు కష్టం. 'సజీవమైన అవయవం' అదేనయ్యా అవమానాన్నికూడా సజీవం చేసేది. సరే, ఆ దిబ్బని పిచ్చివాడిలాగ తన్నుతూ అనుకొన్నానట, "ఏ ముంది వాడి కాలు ఒక బెత్తమే కదా, తిమింగిలపు దంతంతో తయారైన బెత్తం! సరదాకి తగిలించాడు, అంతేగా! అతను నన్ను తన్ననేలేదు; బెత్తంతో వాయించాడు, అంతేనా? అందులోనూ, ఆ చివరి భాగం చూడు, అది చిన్న మొనేగా?

అదే, వెడల్పైన పాదం గలవాడు తన్నితే ఎలా వుంటుంది! చాలా పెద్ద అవమానం కదూ! ఇదేముంది! ఈ అవమానం చిన్న మొన పాటిదే" నని. ఇంతేకాదు, ఆ కలలో తమాషా ఇంకా వుంది విను, నేను అలా దిబ్బని తన్నుతూ వుండగా ఎవడో, కుక్కతోక వంటి జుట్టుగల ఒక గూనివాడు, నా భుజాలు పట్టుకొని, వెనక్కి తిప్పి, "నీవు చేసే పని యేమిటిది?" అని అడిగాడట. వాడు ఒక నాగపురుషుడు లాగ తోచాడు. నాకెంతో భయంవేసింది. కొంతసేపటికి తెప్పరిల్లి, "నేనేం చేస్తున్నానో నీకెందుకు గూనివాడా! నీకు కూడా ఒక తన్ను కావాలా" అని అడిగాడట. దానితో వాడేమి చేశాడో విన్నావా? నేనీమాట అనగానే వంగి, అతని కాలికి చుట్టు కొని వున్న నాచునంతా తీసివేశాడు. వాడి కాళ్ళనిండా సూదులే! మళ్ళీ ఆలోచించుకొని "నిన్ను తన్నను లేవయ్యా, పెద్దాయనా" అన్నానట.

"బుద్ధిమంతుడివి, స్టబు" అని చాలాసార్లు అన్నాడు. మళ్ళీ నా పని చేసుకొందామని ఆ దిబ్బను తన్నడానికి కాలు నెత్తానో లేదో "ఆగు, అంతతో" అంటూ అరిచాడు. నేను, "ఏమిటయ్యా! నేను చేస్తున్న పెద్ద తప్పు" అని అడిగినాను. "ఇటు చూడు, నీకు కలిగిన అవమానాన్ని గురించి చర్చచేద్దాం. రా. కెప్టెన్ అహాబు నిన్ను తన్నాడంటావు అంతేనా?" "అవును, సరిగ్గా ఇక్కడ తన్నాడు" "బాగానే వుంది. దంతం కాలుతో తన్నాడు కాదూ?" "అవును" "అయితే, నీ ఫిర్యాదేమిటి! నిన్ను అతను ఎంతో ప్రేమతో

తన్నాడు గదా! చెక్క కాలితో కాక, చాలా అందమైన దంతపు కాలితో ఒక గొప్పవాడు తన్నాడు. ఆ తన్ను తినడం గౌరవం కాదా! ఇది విను. పూర్వకాలం ఇంగ్లండ్ లో పెద్ద పెద్ద భూస్వాములంతా రాణిగారిచే ఒక చెంపపెట్టు తిని మహాపురుషు లయ్యేవారు. వారికి ఆ చెంపపెట్టు ఎంతో ఘనత తెచ్చేది ఏమనుకొన్నావో! నీ గొప్ప నీవే ఊహించుకో. అహాబు అంతటివాడు నిన్ను తన్నాడు. అతడు ఎన్ని తన్నులు నిన్ను తన్నితే అన్ని బహుమానాలుగా పరిగణించుకో! తిరిగి తన్నటానికి ప్రయత్నించకు! అది నీవల్ల కాదు. ఆ దిబ్బవంక చూడు" అంటూ హఠాత్తుగా గాలికి లేచి పోయాడు. నేను అటూ ఇటూ దొర్లి లేచి చూతునుగదా, నా పక్క మీదనే ఉన్నాను. ఇప్పుడు ఆ కలను గురించి నీవేమనుకొంటావు ఫ్లాస్క్!"

"పిచ్చి కలలాగ ఉంది. అంతే"

"కావచ్చు, కాని దానివల్ల నాకు జ్ఞానం కలిగింది— అక్కడున్న అహాబ్ ని చూశావా అతను ఓడ వెనుక వైపుకి ముఖం తిప్పుకొని చూస్తున్నాడు. ఒక రహస్యం చెప్తాను విను. అతనితో ఏమీ మాట్లాడకుండా ఉండటం ఉత్తమం. ఏమిటవి! అతని అరుపులు! విను—"

"కుఱ్ఱవాళ్ళలారా! జాగ్రత్తగా చూడండి— ఈ ప్రాంతాల్లో తిమింగిలాలుంటాయి! వాటిలో తెల్లని దేదైనా కనబడితే, దానికోసం మీ ప్రాణాలైనా అర్పించండి."

"ఫ్లాస్క్, ఆతను అనే మాటలలో కొంత బాధ స్తాం కనబడటం లేదూ! తెల్లని తిమింగిలంట! ఇందులో ఏదో రహస్యముంది. కాచుకో, అహాబ్ బుఱ్ఱలో ఏదో ఘోరమైన ఆలోచన ఉంది. ఉష్! నోరెత్తకు, ఇట్లాగే వస్తున్నాడు."

—:o:—

27. ఓడ ముందు తట్టు

తరువాత కొన్నాళ్ళకి, మామూలు ప్రకారం అహాబ్ తన గదినుండి మెల్లెక్కి, తట్టుమీదకు వెళ్లాడు. పల్లెటూళ్ళలో సంపన్నులు భోజనాలయాక తోటల్లో విహారానికి వెళ్ళినట్టు, పొద్దుటే ఫలహారమయిన తరువాత కెప్టెనులు ఓడమీద పచారులు చేసేవేళ అది.

ఆతని అడుగుల చప్పుడు వినవచ్చింది. ఆ ఓడమీద ఉన్న చెక్కలన్నిటికీ అతని అడుగులు పరిచితములే. వాటిమీద అతని కాలిగంట్లు కూడా పడ్డాయి. అతని నుదుటిని కూడాపరీక్షగా చూస్తే అక్కడకూడా విచిత్రమైన ముద్రలు కనబడుతాయి. అవి నిర్విరామముగా అతని మనస్సులో తిరుగుతూండే ఆలోచనల ముద్రలు. ఆనాటి ఉదయం ఆ మచ్చలు మరీ ప్రస్ఫుటంగా ఉన్నాయి. ఉద్రిక్తమైన అతని పాదన్యాసంకూడా అంత ప్రస్ఫుటంగానే ఉన్నది. అహాబ్ ఎంతో ఆలోచనామగ్నుడై, ఈ చివరి నుండి ఆ చివరకు వెళ్ళి, తిరిగి వచ్చినప్పుడు, అతనితో పాటే అతని ఆలోచన కూడా మలుపు తిరుగుతున్నట్టు, ఆ ఆలోచనకూడా అతని లాగానే అడుగులు వేస్తున్నట్లు అనిపించింది. అతని బాహ్యాగమనానికి ప్రతిబింబమైన అంతర్గమనమా అన్నంతగా, ఆ ఆలోచన ఆతనిని ఆవహించి వేసింది.

"చూశావా అతనిని ఫ్లాస్కు!" అని గుసగుసలాడాడు స్టబ్. అతనిలో వున్న ఆలోచనయేదో బయటకు రావటానికి ప్రయత్నిస్తోంది."

కొన్ని గంటలు గడిచాయి. అహాబ్ కొంతసేపు తలుపు బిగించుకొని తనగదిలోను, మరికొంతసేపు తట్టు మీదను పచార్లుచేస్తూ ఏకాగ్ర చిత్తంలో వున్నాడు. ప్రొద్దు క్రుంకజొచ్చింది. నడుస్తూ నడుస్తూ అతను తటాలున ఆగి, అక్కడవున్న ఒక రంధ్రంలో తన దంతపుకాలు చొన్పి, అందరినీ పైకి పంపమని స్టార్‌బక్‌ను ఆజ్ఞాపించాడు. ఏదైనా అసాధారణ పరిస్థితులలో తప్ప ఏ కెప్టెనూ అటువంటి ఆజ్ఞయివ్వడు గనుక, తన ఆశ్చర్యము వ్యక్తమయ్యేటట్లు స్టార్‌బక్, ""అయ్యా, ఏమంటారు? అని మనవి చేసికొన్నాడు. "అందరినీ పైకి పంపించు" అని, అహాబ్," "తెరచాప స్తంభాలమీద వున్న వాళ్లందరూ దిగిరండి" అని కేక వేశాడు.

ఓడలోపలివాళ్ళు, పైవాళ్ళు అంతా ఒకచోట తట్టుమీద గుమిగూడి అతని ముఖంవంక చూడసాగారు. తుఫాను వచ్చేముందు వుండే ఆకాశంవలె వున్నది అతని ముఖం. ఆ జనమంతా బెదురుతూవుంది. ఒకసారి ఓడమీదుగా సముద్రంవైపు, ఇంకొకసారి తన అనుచరులవైపు చూసి, అక్కడ ఎవ్వరూ లేనట్టు మళ్లీ పచార్లు మొదలుపెట్టాడు. తన్ను గురించి అక్కడివాళ్ళు ఏమేమి గుసగుసలాడుకొంటూవున్నా వినకుండా, లెక్క చేయకుండా, తలవంచు

కొని, టోపీని ముఖంమీదికి దించుకొని తన పచార్లు కొనసాగించాడు. స్టబ్ మాత్రం మెల్లగా, ఫ్లాస్క్‌తో అన్నాడు.

"పడవలో తమాషాని చూపించటానికి పిలిచాడ"ని.

అహాబ్ ఆగి, బిగ్గరగా "తిమింగిలం కనబడితే ఏం చేస్తారు?" అని అడిగాడు.

"దాన్ని పిలుస్తాం" అంటూ వెంటనే ఎన్నో కంఠాలు జవాబిచ్చాయి.

"శభాష్" అని సాభిప్రాయంగా అన్నాడు: వాళ్ళల్లో తన ప్రశ్న ఎంత వుత్సాహాన్ని జనింపచేసిందో అని లోలోపల సంతోషపడుతూ—

"తరువాత ఏం చేస్తారు" అని అడిగాడు.

"దానికోసం చిన్న పడవలలో దిగటమే"

ఇలాగే అతని ప్రశ్నలు వీరి సమాధానాలు. ప్రతి కేకకీ ఆ ముసలివాడి ముఖం సంతోషభరితం అవుతూనే వుంది. నావికులుకూడా ఒకరి ముఖమును ఒకరు అర్థం కాకుండా చూచుకొంటున్నారు. ఈ పిచ్చి ప్రశ్నలకే మనము ఇంత వుద్రిక్తులము ఏలాగైనామని, వాళ్ల మనస్సుల లోని భావం కాబోలు.

అహాబ్ తన ఒంటి కాలిమీద సగమటూ, సగమిటూ తిరుగుతూ, ఒక చేతిలో తెరచాపకొయ్య పట్టుకొని ఎంతో వుద్విగ్నులైయున్న ఆ జనమును ఉద్దేశించి ఇలా వున్నాడు: "తెల్ల తిమింగిలాన్ని గురించి నేను ఇప్పుడు ఇచ్చిన ఆజ్ఞని మీరంతా విన్నారు. నా చేతిలోవున్న ఈ బంగారాన్ని

చూశారా" అంటూ ధగధగ మెరిసే ఒక బంగారు సూర్య రశ్మివైపు ఎత్తి చూపుతూ "ఇది పదహారు డాలర్ల విలువ గలది. చూశారా! స్టార్ బక్! ఒక సుత్తిని తే అన్నాడు. అతను సుత్తి తేవటానికి వెళ్ళగా, అహాబ్ ఆనాణెము యొక్క కాంతిని ఎక్కువ చేయటానికా అన్నట్టు దానిని తన కోటు అంచున రాస్తూ, లోలోపల ఏదో కూనిరాగం తీస్తూ నిలబడ్డాడు. స్టార్ బక్ తెచ్చియిచ్చిన సుత్తిని ఒక చేతిలో ఎత్తి పట్టుకొని, రెండవ చేతిలో బంగారు నాణాన్ని ప్రదర్శిస్తూ, గొంతెత్తి, "మీలో ఎవరైతే వంకరమూతీ, ముడతలపడ్డ ముఖమూకల తెల్లతిమింగిలమును మూడు పోట్లు పొడిచి పైకితేస్తారో వాళ్ళకి ఈ బంగారాన్ని ఇస్తాను" అంటూ స్తంభానికి ఆ బంగారు నాణెమును మేకతో బిగించి కొట్టారు. అతని చేష్టను అందరూ ఆమోదిస్తూ కేకలు వేశారు.

సుత్తిని క్రింద పడవేస్తూ అహాబ్ "అది తెల్లని తిమింగిలమని గుర్తుంచుకోండి. కళ్ళల్లో వత్తులు పెట్టుకొని దానికోసం చూడండి. తెల్లగా నీళ్ళు కనబడితే పరీక్షగా చూడండి. ఒక్క నీటి బుడగ బయటకువస్తే దానిని ఎలాగైనా చేరండి" అన్నాడు.

అహబ్ చెప్పే మాటలని వింగిలిన వాళ్ళకంటె ఎక్కువ ఆసక్తితో, ఆశ్చర్యంతో ఆలకించారు టాష్ టెగో, డగ్లో, క్వీకెగ్ లు, ముడుతలు పడ్డముఖము, వంకర

మూతి అన్న వర్ణన వాళ్ళకి దేనినో జ్ఞాపకం చేసింది. కాబోలు!

టాష్‌టెగో "ఆ తెల్లని తిమింగిలం 'మాబీడిక్' అనబడేదే కాబోలు" అన్నాడు.

"మాబీడిక్కా! అయితే నీకా తెల్లని తిమింగిలం తెలుసా టాష్‌టెగో!" అని అడిగాడు అహాబ్.

"నీళ్ళల్లోకి వెళ్ళేముందు తోకని అదో మోస్తరుగా ఆడిస్తుంది అదేనా!" అన్నాడు.

డాగో అందుకొని. "దాని మూతి కూడా తమాషాగా మెదలాగ ఉంటుందా! అది చాలా త్వరగా కదిలి పోతుందా!" అని అడిగాడు.

"దానికి ఒకటి, రెండు, మూడు - ఎన్నో ఈటె పోటులు వుంటాయి కాదూ! ఆ ఈటెలన్నీ--" అని ఏదో చెప్పబోయి చెప్పలేక చేతిని గుండ్రంగా తిప్పడం మొదలు పెట్టాడు క్వీక్వెగ్.

అహాబ్: ఆ ఈటెలన్నీ బిరడాలుతీసే దానిలాగ వుంటాయి క్వీక్వెగ్! ఆ ఈటెలన్నీ ఆ శరీరంలో గుచ్చుకొని వుండిపోయాయి. దాని మూతి చాలా పెద్దది. తెల్లగా వుంటుంది కూడాను. గొర్రెల వున్నినంతా తీసి కుప్ప వేసినట్లు తెల్లగా వుంటుంది. టాష్‌టెగో, నువ్వన్నట్టు! అది నీళ్ల ల్లోకి వెళ్లేప్పుడు తమాషాగా తోక ఆడిస్తుంది. మీరు చూసింది మాబీడిక్‌నే, మాబీడిక్‌నే!" అని అరిచాడు.

స్టబ్, ఫ్లాస్క్ లతో పాటు తమపై అధికారిని ఆశ్చర్యంతో చూస్తున్నాడు అంతసేపూ. స్టార్‌బక్ చివరికి, "కెప్టెన్ అహాబ్! నేను కూడా మాబీడిక్ గురించి విన్నాను. మీ కాలు నమిలివేసింది మాబీడిక్ కాదుగదా!" అని అడిగాడు.

"కాదన్ని ఎవడు చెప్పాడు నీకు!" అన్ని, కొంత ఆగి మళ్ళీ, "మాబీడిక్కే నా కాలు తినేసింది. ఈ మొండికాలుకి అదే కారణం" అని బిగ్గరగా ఏడుస్తూ ఇంకా "ఆ పాపిష్టి తిమింగిలమే నేను జీవితాంతం బాధపడేటట్టు చేసింది" చేతులని అటూ ఇటూ తిప్పుతూ, ఆ తిమింగలాన్ని శతవిధాల శపిస్తూ, "దాని అంతు కనుక్కోవటానికి గుడ్‌హోప్ చుట్టూ హార్న్ చుట్టూ, నార్వే చుట్టూ ఆఖరికి నరకం చుట్టూ తిరుగుతాను. మిమ్మల్ని ఈ ఓడమీద తీసుకురావటానికి కారణమిది. ఆ తెల్లని తిమింగిలాన్ని ప్రపంచం నాలుగు మూలలా తరమటానికి, ఆఖరికి అది నెత్తురు కక్కుకొని, దొర్లిపడిపోయే వరకు తరమటానికి. ఏమంటారు? చేతులు కలుపుతారా? మీరంతా ధైర్యవంతుల్లాగా ఇప్పుడు కనబడు తున్నారు నాకు"

ఉద్రిక్తుడైన ఆ ముసలివానివైపు పరుగెత్తి వాళ్ళంతా "తెల్లతిమింగిలం కోసం చూస్తాం - మాబీడిక్‌ని హాడి చేస్తాం" అంటూ అరిచారు. కొంత ఏడుస్తూ, కొంత అరుస్తూ "మిమ్మల్ని దేవుడు మెచ్చుతాడు" అని "వాళ్ళి న ర పెట్టుకోరా" అని ఒక న కరుణ పడు డు. "స్టార్‌బక్,

అదేమిటి అలా ముఖం పెట్టావ్! ఆ తెల్లతిమింగిలాన్ని తరమాలని లేదూ? మాబీడిక్ ప్రాణాలని తీసెయ్యాలని లేదా!" అన్ని అడిగాడు.

"కెప్టెన్ అహాబ్! ఆ వంకరమూతి నేమిటి? నాపనిలో అది తటస్థపడితే మృత్యువు మూతినైనా ఛేదించటానికి సిద్ధంగానే ఉన్నాను. కాని నేను తిమింగిలాల వేటకై వచ్చాను గాని నా అధికారి పగతీర్చటానికి కాదు. ఎన్ని పీపాలనూనె దొరకుతుంది ఈ పగ తీరటంవల్ల! కెప్టెన్ అహాబ్! నన్‌టుకెట్ బజారులో ఏమి గిట్టుతుంది!" అని అడిగాడు.

"నన్‌టుకెట్ బజారా! ఓహ్! ఇలా దగ్గరికి రా, నీకు అసలు సంగతి చెప్తా! డబ్బే ప్రధానంటయ్యా! నా పగకి ఉన్న విలువంతా ఇక్కడ ఉంది"

"అలా గుండె బాదుకుంటాడేం? బిగ్గరగానే చప్పుడవుతోంది గాని డొల్లగా ఉన్నట్టుందే" అని గుసగుసలాడాడు స్టబ్.

స్టార్‌బక్, "మూగప్రాణి మీదనా నీ పగ! అది దాని ప్రకృతిబట్టి నిన్ను కొట్టింది. వట్టి పిచ్చిగాని అలాటి నోరులేని జంతువుమీద కోపమేమిటి? అది మహాపాతకం అహాబ్" అని అన్నాడు.

"నా మాటవిను. మనకు కనబడేవన్నీ ముఖాచ్ఛాదనాల వంటివి. ప్రతి చేష్ట వెనుక, మనకి తెలియనిది కనబడనిది ఒకటి ఉంది. అది వెనుకవుండి ఆ చేష్టకి రూపమిస్తుంది. ఒక మనిషి ఇంకొక మనిషిని కొట్టాడంటే ఈ ముసుగు

ద్వారానే కదా! బయట ప్రపంచాన్ని చూడాలంటే గోడ లోంచే కదా బందీ బయటకి రావాలి! నా మట్టుకు నాకు ఆ తెల్లని తిమింగిలం అటువంటి గోడ అన్నమాట. ఒక్కొక్కసారి దాని వెనుక శూన్యంతప్ప మరేమి చూడను. కాని అదే చాలు! అది నన్ను బాధ పెడ్తుంది. నన్ను ముంచివేస్తోంది. మనకి అగోచరమూ, మాత్సరపూరితమూ అయిన ఒక మహోశక్తి దానిలో కనబడుతుంది. ఆ అగోచరశక్తినే నేను ద్వేషించేది. తెల్లతిమింగిలం కేవలం నిమిత్తమాత్రమే కాని, అసలు కారణమే కాని, నా ద్వేషాన్ని దాన్నిపై చూపి తీరుతాను. మహాపాపాలను గురించి నాదగ్గర మాట్లాడకు. నన్ను అవమానించేవాడు, సూర్యుడైనా సరే, తిరిగి దెబ్బతీస్తాను. సూర్యుడు ఒకటి చేయగల్గితే నేనింకొకటి చేయగలను. అన్ని కార్యాలకి మూలం అసూయే కాబట్టి, ప్రతిక్రియలో న్యాయముంది. న్యాయమనే దానికికూడా నాపైని అధికారంలేదు. అసలు నాపైన ఎవరున్నారు? సత్యానికి పరిధులు లేవు. ఆ కళ్ళతో చూడకు. పెనుభూతపు కళ్ళవలె ఉన్నాయి. రెప్పలువాల్చు. నా ఆవేశంవల్ల నీకు బాగా కోపం వచ్చింది. కందిపోతున్నావు, పాలిపోతున్నావు కూడాను. కోపంలో అన్న మాటలు లెక్కలోకిరావు స్టార్‌బక్! కొందరు కోపంలో ఏదైనా అన్నప్పటికీ అది పెద్ద తప్పుకాదు. నీకు కోపం తెప్పిద్దామని నేనేమీ అనలేదు. దాని సంగతి విడిచిపెట్టి ఇదిగో అటుచూడు, దూరంగా సూర్యుడు నానా వర్ణాలతో ఎన్నెన్ని చిత్రాలు చిత్రించాడో! ఈ తిమింగిల విషయంలో

వీళ్ళంతా నా పక్షమున్నారు. స్టబ్‌ని చూడు ఎలా నవ్వుతున్నాడో! ఆ చిల్లివాణ్ణి చూడు, ఎలా ఇకిలిస్తున్నాడో. ఈ పెద్ద గాలివానలో నీ ఒంటికి గడ్డిపరక విలువ లేదు. స్టార్‌బక్! అసలు ఇంతకూ చేయవలసిన పని యేమిటో ఆలోచించు. ఆ తిమింగిలపు తోకలోకి ఈటెని విసరడమేగా! స్టార్‌బక్‌కి అది యేపాటి ఘనకార్యం? అందరూ ముందుకు దూకేటప్పుడు నీవుమాత్రం వెనుకకు అడుగు వెయ్యవు. కాని నీకేదో సంకోచా లున్నట్టున్నాయి. చెప్పు! చెప్పు! నీ మౌనమే, నీ ఆలోచనలని చెప్తోంది. (స్వగతంగా) నా మాటలు బాగా మనస్సుకి పట్టినట్టున్నాయి. ఇంక నన్ను వ్యతిరేకించడు."

"దేవుడే ఇక నాకు దిక్కు. మనలనందరిని దేవుడు రక్షించుగాక." అని స్టార్‌బక్ గొణిగాడు.

తన చేతిక్రింది ఉద్యోగి తన దారికి వచ్చాడన్న సంతోషంలో ఆహాబ్, అతని మాటలలోని అశ్లీలార్థమును గాని, ఇతర జనముయొక్క చిరునవ్వులనుగాని, రెప రెపలాడుతూ స్తంభాన్ని కొట్టుకొంటూన్న తెరచాపల చప్పుడు గాని, భావిసూచకముగా స్పందించుచున్న వాయు సంచలనం గాని, గమనించనే లేదు. ఇంతలోనే, స్టార్‌బక్ కళ్ళు జీవకళతో నిండిపోయినాయి. అందరి నవ్వూ అణిగిపోయింది. తెరచాపలు గాలిపోసుకొని విప్పారి ఓడను ఎప్పటివలె ముందుకు నడుపుతున్నాయి. ఈ హెచ్చరికలూ, ప్రబోధాలు ఎందుకు పుట్టుతవో! పుట్టినవి, అంతలో ఎందుకు పోతాయో! అసలు

హెచ్చరికలూ, భావిసూచనలు వేటికో ఛాయలు! భావి సూచనలంటే మాత్రం ఏమిటి! అవి బయటనుండి వచ్చేవి కావు. గడచిపోయిన వాటిని గురించి మనలో జరిగే పరామర్శ కేయని ఏ బహిశ్శక్తి యొక్క ప్రేరణా లేకుండానే మన ఆత్మావసరాలే మనకు కార్యాచోదకా లవుతాయి!

"పాత్రి! పాత్రి" అంటూ అరిచాడు అహాబ్. సారాతో నిండిన గిన్నెను తీసుకొని, ఈటెగాళ్ళ వైపుతిరిగి ఈటెలు వెలికితీసి అర్ధవలయాకారంగా నిలబడ మన్నాడు. అతనికి ఇరువైపులా తన క్రింది ఉద్యోగస్థులు, ఈటెగాళ్ల వెనుక మిగిలిన వాళ్ళందరూ నిలబడ్డారు. అహాబ్ నావికుల నందరినీ పరీక్షగా చూశాడు. అతని చూపుల తీక్షణతయే, వాళ్ళ చూపులలోను కానవచ్చింది. ఆ చూపులు క్రోధ రక్తారుణములైన తోడేలు చూపులవలె వున్నాయి.

"త్రాగి గిన్నని పక్కవాడికి అందియ్యండి" అని అంటూ, ఆ పాత్రని తనకి దగ్గరగావున్న నావికునికి ఇచ్చాడు. "ముందు ఓడ నడిపేవాళ్ళే తాగాలి. కానీయండి మెల్లగా పీల్చండి. బోలెడంత ఘాటుగా ఉంటుంది. బాగా పని చేస్తుంది... బాగానే ఉంది. అంతా ఖాళీ చేశారు. ఇలా వస్తుంది, అలా పోతుంది. ఆ గిన్నని ఇలా ఇయ్యండి. జీవితం కూడా ఇంతే. ఏళ్ళు గడచినకొద్దీ ఎంత నిండు పాత్రమైనా ఇట్టే ముగిసిపోతుంది. అరే! కుర్రవాడా! దీన్ని మళ్ళీ నింపుకొనిరా" అన్నాడు అహాబ్.

"రండి నా వీరులారా! మీరందరు మీ మీ ఆయుధాలతో నా చుట్టూ చేరండి. మా తాతలనాటి ఆచారం మళ్ళీ జ్ఞాపకం చెయ్యండి. ఏరా! కుర్రవాడా! అప్పుడే వచ్చావా! మళ్ళీ ఈ గిన్నెని నింపేశావా! దగ్గరకి రండోయ్ మీరు— ఈ ఈటెలని నన్ను ముట్టుకోనీయండి" అంటూ ముందుకువచ్చిన ముగ్గురు ఉద్యోగస్థుల ఈటెలు ఒండొంటిని తాకియున్న చోట ముట్టుకొన్నాడు. వాటిని కదిలిస్తూ, స్టార్‌బక్ నుండి స్టబ్ వైపు, స్టబ్ నుండి ఫ్లాస్క్ వైపు తదేక దీక్షగా చూశాడు. ఏదో తెలియని శక్తితో, వాళ్ళలో కూడా తనకు ఉన్నటువంటి, చైతన్యాన్నే, కలిగిద్దామనుకుంటున్నాడా అని అనిపించింది. అతని నిగూఢవర్తనను చూచి ఆ ముగ్గురూ హడలిపోయారు. స్టబ్, ఫ్లాస్క్‌లు చూపుని తప్పించుకొని పక్కకు చూశారు. నిజాయితీగల స్టార్‌బక్ చూపుమాత్రం వాలిపోయింది.

"అంతా వ్యర్థం!" అంటూ ఆహాబ్, ఇంకా "పోనీండి. మీ ముగ్గురికీ ఒక్కసారియైనా నాలో ఉండే చైతన్యం మిమ్మల్ని ఊపివేసిందా? ఆ చైతన్యాగ్ని మిమ్మల్ని చంపేసేదేమో! అసలు ఆ చైతన్యం మీకు అవసరం లేదేమో! ఈటెలు క్రింద పడవెయ్యండి. మీరు ముగ్గురూ అక్కడున్న ఆ ముగ్గిరి ఈటెగాళ్ళకీ సారా పందియ్యండి. ఏం? ఆ పని నచ్చలేదా? పోప్ అంతటివాడు తన కిరీటాన్ని కూజాగా ఉపయోగించి బిచ్చగాళ్ళ పాదాలని కడుగుతాడయ్యా! మీ వినయమే మీ చేత ఆ కార్యాన్ని చేయు

స్తుంది. నేనేమీ మిమ్మల్ని ఆజ్ఞాపించను. మీరే యథేచ్ఛగా చేస్తారు. ఈటెగాళ్లూ! మీ ఈటెలకుండే కర్రలు ఊడదీయండి" మారుపలుకక అతని యానతి శిరసావహించి ఈటెలకుండే, ఇనుప భాగాలనే చేతబుచ్చుకొని అతనిముందు నిలిచారు ఆ ముగ్గురూ. ఆ ఇనుప ములుకులకు చివర ఉండే గొట్టపు భాగాలలో అహాబ్ సారాని పోశాడు. మీరు ముగ్గురూ ఇటురండి. ఆ గిన్నెలని ఈటెగాళ్ళకి అందియ్యండి" ఈ సంబంధం ఇంక తెగిపోదు ఏమంటావ్ స్టార్‌బక్! దీన్ని ధృవపరచటానికి ఆ సూర్యుడు నిరీక్షిస్తున్నాడు. ఈటెగాళ్లూ, తాగండి! తాగండి! మా బీడిక్‌కి చావు తప్పదు! మా బీడిక్‌ని వేటాడి చంపలేకపోతే భగవంతుడు మనలను వేటాడుతాడు."

గిన్నెలను నింపారు. ఆ తెల్ల తిమింగిలాన్ని తిట్టుతూ ఒక్క గుక్కలో సారాని తాగేశారు. స్టార్‌బక్ తెల్లబోయి, ప్రక్కకు తిరిగి, వణికిపోయాడు! మళ్లీ ఇంకోసారి, సారాని ఆవేశపూరితులైన వాళ్ళంతా తాగారు. వాళ్ళనందరినీ పంపించి, అహాబ్ తన గదిలోకి వెళ్ళిపోయాడు!

28. సూర్యాస్తమయం.

[తన గదిలో వెనుకవైపున వున్న కిటికీల దగ్గర కూర్చుండి బయటకు చూస్తూ అహాబ్]

నాఓడ నడచిన చాలు తెల్లగా, మలినంగా వుంటుంది. వెలవెలబోయిన నీళ్లు, అంతకంటె పాలిన చెక్కిళ్లు-ఎక్కడికి వెళ్ళినా ఇంతే. ఈర్ష్యాళువులైన తరంగాలు నాదారిని ముంచివేయాలని ఎగిరిపడుతూంటాయి. కాని వాటికంటె ముందే నేను దాటిపోతాను.

దూరపు ఆ కెరటాలు ద్రాక్షారసంవలె కెంపు వర్ణం తాల్చి యుంటాయి. పసిడి వెన్నెలగల ఆకాశం, సముద్రపు లోతులను చూస్తోంది. సూర్యుడు మెల్లగా అస్తమిస్తున్నాడు: నా ప్రాణం లేచి వస్తోంది. నేను ధరించిన ఈ కిరీటం దుర్భరమైనదా! ఈ కిరీటం నవరత్నాలతో మెరుస్తున్నా, దాన్ని ధరిస్తున్న నేను దానిని మోస్తున్నాననే విషయాన్ని తప్ప, ఆ మెరుపులను ఎఱుగను. ఈ కిరీటాన్ని బంగారంతో కాక ఇనుముతో చేశారన్న సంగతి మాత్రం నాకు తెలుసు. అది ముక్కలయ్యిందని కూడా ఎఱుగుదును. గంట్లుపడ్డ దాని అంచు నాకు కోపాన్ని తెప్పిస్తుంది. ఆ ఇనుపముక్కతో నామెదడు ఢీ కొంటూన్నట్టుంది. నాది ఉక్కుతో చేయబడిన బుఱ్ఱ! మెదడుకి ఎంతటి ప్రాణాంతకమైన పోరాటంలోనైనా, ఇనుపకుళ్ళాయి అవసరం లేనిరకం! ఒకప్పుడు

సూర్యోదయమవుతూనే నాలో వుత్సాహం రేకెత్తేది. సూర్యాస్తమయం శాంతినిచ్చేది. ఇప్పుడలా కాదు. ఈ మనోహరమైన కాంతి, నన్ను ప్రకాశవంతుని చేయదు. నేను సౌందర్యాన్ని అనుభవించలేను. నా పాలిటికి అది అంతా శోకమే. నాకు మహత్తరమైన ఆలోకమున్నదిగాని, సాధారణపు అనుభవశక్తిలేదు. సూక్ష్మ సూక్ష్మక్రమమున ద్వేషపూరితుడనై పోయాను. స్వర్గానికి వెళ్లినా ఈ భ్రష్టత తప్పదు. గుడ్ నైట్-గుడ్ నైట్ (చేతులను ఆడిస్తూ కిటికీ నుండి ఇవతలకు వచ్చేస్తాడు.)

ఇదేమీ దుష్కరకార్యం కాదు. ఒక్కడైనా ప్రతికూలు డుంటాడనుకున్నాను. నేను గీసిన గిరినిదాటి ఎవ్వడూ పోలేదు. నా యెదుట వాళ్ళంతా మందుగుండు కుప్పలు. నేను వాళ్ళకి నిప్పుపుల్లను. వాటిని పేల్చాలంటే ఈ నిప్పుపుల్ల కాలి ఆరిపోవాలికదా! నాది శక్తికి అనుగుణమైన సంకల్పం. సంకల్పానికి అనుగుణమైన కార్యారంభము. ఆరంభానికి స్టార్ బక్ నన్ను పిచ్చివాడనుకొంటాడు. కాదు కాదు. నేను భూతావిష్టుడను. వున్మత్తుడను.

నేను వికలాంగుడను అవుతానని జోస్యం వుంది. దానికి తగినట్టుగానే కాలు కోల్పోయాను. నన్ను వికలాంగుని చేసిన దాని అవయవచ్ఛేదము చేస్తాను. ఇది నేను చెప్పే జోస్యం! నేనే దీర్ఘదర్శిని. నేనే నిర్వాహకుణ్ణి. సమస్త దేవతల్లారా! మీకంటె అధికుణ్ణినేను! మిమ్ము చూస్తే నాకు నవ్వు వస్తోంది. మిమ్ము ఎగతాళి చెయ్యాలనిపిస్తోంది.

మీకు తగిన సాటివానిని చూచుకోండి. నన్ను బాదకండి. నన్ను మీరు పడగొట్టి వేశారు-నేను మళ్ళీ లేచాను. కాని మీరు పారిపోయి ఎక్కడో దాగొన్నారు. రండి! మీ రహస్య స్థావరాలనుండి బయటకురండి! మిమ్ము అందుకోగలయంత పొడవైన తుపాకి నాకు లేదులెండి! రండి, అహాబ్ స్వాగతాన్ని అందుకోండి. నన్ను బెదరించగలరేమో చూడండి. నన్ను బెదరగొట్టలేరు. మీరు ప్రయత్నిస్తే మీ మార్గాన్ని తప్పుతారు. నేను ఇనుపపట్టాలతో వేసుకొన్నదారి దృఢమైనది. దానిమీద వెళ్ళటానికి నా ఆత్మ తయారుగా ఉంది. నిశ్శబ్దంగా ఉండే బాటల వెంటా, మహాపర్వతాల వెంటా, నదీప్రవాహాల వెంటా, నిర్దుష్టంగా వెళ్ళిపోతూ వుంటాను. నాత్రోవకి అడ్డు అంటూ లేదు. వెనుతిరుగుట అంటూ లేదు.

29. అపరసంధ్య

[పెద్ద స్తంభాన్ని ఆనుకొని స్టార్‌బక్]

నా జీవితానికి పెద్ద సంకటం వచ్చింది. దానిమీద ఒక పిచ్చివాని యధికారపు చెలాయింపు-ఎక్కువై పోయింది. వివేకం వెఱ్ఱితో డీకొనాలంటే ఎంత కష్టం! ఈ పిచ్చివాడు నన్ను బాగా కలచివేసి, నా వివేకాన్నంతా రూపుమాపేశాడు. అతను ఎంత దుర్భర పరిస్థితిలో అంతమగుతాడో కనబడుతూనే ఉంది. నేనుకూడా దానికి సాయపడాలి. నన్ను అతను బంధించివేశాడు. ఆ బంధాన్ని తెంపుకునే సాధనం నా దగ్గర లేదు. ముసలి వెధవ! ఎలా ఏడుస్తాడో! ఏలా నటిస్తాడో! నా దౌర్భాగ్యస్థితి కనబడుతూనే ఉంది. ధిక్కరిస్తూనే, అతని ఆజ్ఞకు విధేయుడను కావాలి. వానిని ద్వేషిస్తూనే జాలిపడుతూవుండాలి. అతని చూపులలో ఏదో వేదన కనబడుతుంది. ఆ వేదనే నాకు ఉంటే నేను దగ్ధమైపోయేవాడనే. అయినా ఆశ అంటూ ఉందిగా! కాలమూ, కర్మమూ కలసి రాకపోవచ్చు. ఇంతగా, ఇతనిచే ద్వేషింపబడుతూవున్న ఆ తిమింగిలం ఈదటానికి ప్రపంచపు సముద్రాలన్నీ ఉన్నాయి. అహాబ్, దైవంపట్ల తలపెట్టిన యీ అపచారం, ఆ దైవమే విఫలం చేయగలడు. నా హృదయ భారంతో కృంగిపోయాను. బరువు దింపుకొనే సాధనం నా దగ్గర లేదు.

[ఓడ ముందుభాగాన ఏదో సరదాగా కోలాహలం]

ఏ మాత్రమూ మానవత్వం లేని ఇటువంటి పాపులతో నా ప్రయాణం చెయ్యాలి! ఆ తెల్లతిమింగిలం వీళ్ళపాలిటికి రాక్షసి యైనట్టుంది. ముందుభాగాన ఎంత కోలాహలమో వెనుక వైపున అంత నిశ్శబ్దం. జీవిత సరళికూడా ఇంతే! చిందులు తొక్కుతూన్న సముద్రపు నురగని చీల్చుకొంటూ సరదాగా ముందుభాగం వెళ్తూ, వెనుకభాగంలో తన గదిలో కూర్చుని, ఆకృతి దాల్చిన దీర్ఘాలోచన వలె ఉన్న అహాబ్‌ని ఈడుస్తోంది. ఈ కేకలు నన్ను జలదరింప చేస్తున్నాయి. శాంతంగా ఉండండిరా కుర్రవాళ్ళూ! పహారా ఆరంభించండి! మనస్సు దస్సిపోయి నమ్రతతో మోకరిల్లితే ఈ సమయంలో జీవితం ఎంత భయానకమో గోచరిస్తోంది! నాలో ఉన్న సుకుమార మానవత్వం, క్రూరమైన దుశ్శక్తులతో పోరాడ వలసి వస్తోంది. ఓ శోభన దేవతలారా! నాకు కరాలంబ మివ్వండి! నన్ను విడనాడకండి!

30. మొదటిరాత్రి పహరా

[ఒంటరిగా కూర్చుని, తాళ్ళముడిని సవరిస్తూ స్టబ్]

హా! హా! హా! ఎంతోసేపటినుంచి సంగతులన్నీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఆ ఆలోచనకు చివరిభాగం ఈ హా! హా! హా! ఎందుకని? మనకు అర్థంకాని విచిత్ర సమస్యలకు అతిసులభమైన పరిష్కారం నవ్వటం— అది వివేకంకూడ! ఏది వ్రాసిపెట్టి ఉన్నదో అది జరుగకమానదు అని అనుకొంటే మరొక సంతృప్తి. స్టార్‌బక్‌తో వాడేమన్నాడో అంతా నేను వినలేదు. కాని, నాకు ఆనాడు ఎలా ఉందో, స్టార్‌బక్‌కి కూడా ఇప్పుడలాగే ఉన్నదన్నది నిర్వివాదం, ముసలివాడు, స్టార్‌బక్‌ని అణదివేశాడు! దీనికి తిరుగులేదు. వాడు అలా చేస్తాడని నేను ఎన్నడో రవ్వంతలో కనిపెట్టాను. అతని పెద్దబుర్ర చూడగానే నాకీ సంగతి తోచింది. ఒరేయ్ స్టబ్! తెలివిగల స్టబ్! ఏమంటావు ఇప్పుడు? ఇక్కడేదైనా ఒక కళేబరం కనబడింది అనుకో, దానిని గురించి మనకేమీ తెలియక పోయినాసరే, దానిని చూసి నవ్వటమేతప్ప ఇంకొకటి నావల్లకాదు. నాకంతా తమాషాగా ఉంటుంది. హా! హా! హా! ఇంటిదగ్గర నా బంగారు చిలుక ఏం చేస్తోందో! గుండెలు పగిలేటట్టు ఏడుస్తోందో! అప్పుడే రేవుకి వచ్చిన నావికులకి విందు ఇస్తోందో! తాను సరదాగా వున్నట్టే నేనూ సరదాగా వున్నాను— హా! హా! హా! 'గిన్న అంచున లేచే

బుడగలవంటి తేలిక హృదయాలతో ఈ రాత్రి మనసార తాగి ప్రేమలో మునిగిపోదాము. ఆ బుడగలు పెదవుల మీద విరిగిపోయినట్లు మనముకూడా కలిసినప్పుడు విరిగి పోదాం" అని పాడుకొంటూ:

"ఎవరా పిలిచేది! స్టార్ బక్కా!" "వస్తున్నా నయ్యా!" (తనలో) అతను నాపై అధికారా! అతనికికూడా భార్య వుందనుకొంటా! (ప్రకాశంగా) వస్తున్నానయ్యా! చేతిలో పని అయిపోవచ్చింది- వచ్చేస్తున్నా!

31. నడిరేయి

(పహారావాళ్ళు - కొందరు నిలబడి, కొందరు వాలి ఉండీ, కొందరు పడుకొనీ కలిసి పాడుతూ)

'స్పెయిను దేశపు కన్నెలారా!
పోయివస్తాము
స్పెయిను దేశపు యువతులారా
సెలవు నివ్వండి.

మొదటి నక్టుకెట్ నావికుడు:— అంత రసికులుగా తయారు కాకండి. శృగారం ఒంటికి మంచిదికాదు. ఆ జబ్బుకు కొంచెం మందు పుచ్చుకోండి. నన్ను చూచి నేర్చుకోండి.

(పాడతాడు: అతనివెంట మిగిలినవాళ్ళూ పాడతారు. ఆ పాట అర్థమిది)

"తట్టుమీద నిలచి, భూతద్దము దాల్చి, తట్టుమీద తండేలు నిలిచి, తిమింగిలాల నడకలను కని పెట్టుతున్నాడు. ఒక చక్కని తిమింగిలం మనకు లభిస్తుంది. ఉల్లాసంగా ఉండండి. ఈ ఈటెను విసిరేటప్పుడు భయపడకండి".

ఓడ వెనుక తట్టుమీదనుంచి చిన్న అధికారి గొంతు:— ఎనిమిది గంటలు కొట్టారు— సాగిపదండి.

రెండవ నన్‌టుకెట్ నావికుడు:— ఆపండి పాట. ఆపండి. ఎనిమిది గంటలు కొట్టారట. ఏడీ! గంటలు కొట్టే వాడు! ఎనిమిదో గంట కొట్టావా! పహారా వాళ్లని పిలుస్తానుండు. (మెల్లిగా క్రిందికి చూస్తూ) ఏమ య్హోయ్! క్రిందకూడా ఎనిమిది గంటలు కొట్టాడి! మోగించండి!

హాలెండ్ దేశపు నావికుడు:— మంచి తాగుడే ఇవాళరాత్రి. ముసలివాడు ఇప్పించిన సారా కొందరికి నిషానెక్కిస్తే కొందరిని నిద్రపుచ్చింది. మనమిక్కడ పాడుతున్నాం— ఇంకొకవంక ఆ క్రిందివాళ్ళు గురక పెడుతున్నారు. ఈ గొట్టంలోంచి వాళ్లని పిలిచి వాళ్ల ప్రియురాండ్రను గురించి కలలు కనవద్దని చెప్పి వాళ్ల సరసాలాపాలు కట్టిపెట్టి రమ్మను—అదీ వరస— అలా పిలువాలి—ఆమ్‌స్టర్‌డామ్! వెన్న తిన్నా నీ గొంతేమీ పోలేదు.

ఫ్రాంసు దేశపు నావికుడు:— లంగరు దింపేలోగా ఒకటి రెండు నాట్యాలు చేద్దాం! ఏమంటారు! రెండో జట్టు వాళ్ళు వస్తారు ఇంతలోపలే. పిప్—నీ కంజిరాను చక్క చేసుకో.

పిప్:— (నిద్రపోతూ, విసుగుకొంటూ) అదెక్కడుందో గుర్తులేదు.

ఫ్రాంసుదేశపు నావికుడు:— అయితే నీ పొట్టమీద కొట్టుకో. చెవులాడించు. మిమ్మల్నేనట్టా — రెండూ మూడూ

అడుగులు వేయండి సరదాగా! ఏమిటీ ! ఎవ్వరూ నాట్యమాడరూ! రండి, రండి-గెంతండి- కానీయండి.

ఐస్‌లాండ్ నావికుడు:_ నాకు ఈ నేల నచ్చలేదయ్యా. నాకు మంచునేల అలవాటు. నీ ఉత్సాహాన్ని చంపేస్తున్నాను. క్షమించు.

మాల్టా నావికుడు:_ నన్నుకూడా చంపుతున్నావు. ఆడపిల్ల లేరే! వాళ్ళు ఉండాలి. పిచ్చివాడు కాకపోతే ఎవడైనా తన ఎడమ చేతితో కుడి చేతిని కలిపి, కరచాలనం చేసినట్టు అనుకొంటాడు!

సిసిలీ నావికుడు :- అవును-ఆడపిల్ల, పచ్చిక బయలు ఉండాలి. ఆ పిల్ల గొల్లభామలాగ గెంతమంటే గెంతుతాను-

లాంగ్‌లాండ్ నావికుడు :- పొండి పొండి-సణుగుడురాయుళ్లు. మేం చాలామంది మిగిలి ఉన్నాం. దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకో మంటారు. ఇదిగో పాట. అడుగులు కలపండి.

అజోర్ నావికుడు:- (మెట్లు ఎక్కి-కంజిరాను తీసుకొనివస్తూ) ఇదిగో పిప్ -కానీ-రండబ్బా కట్టివాళ్లూ (కంజిరా స్వరాల కనుగుణంగా కొందరు నాట్యం చేస్తున్నారు) కొందరు క్రిందకి వెళ్ళిపోయిరా, మరికొందరు అక్క డేనూ పరున్నారు)

అజోర్ నావికుడు:- (నాట్యమాడుతూ) కానియ్యాతయ్యా పిప్ గట్టిగా దెబ్బవెయ్యి! దానికున్న చిరుతాళాలని పగలగొట్టెయ్యి!

పిప్ :- చిరుతాళాలా! ఒకటి పడిపోయింది చూడు-అంత గట్టిగా కొట్టాను.

చైనా నావికుడు :- అయితే, పళ్ళని పటపటలాడిస్తూ కొట్టు.

ఫ్రెంచి నావికుడు:- వెఱ్ఱి ఆనందం. ఆ వలయాన్ని ఎత్తి ఉంచు, పిప్. దాంట్లోంచి నేను దూరతాను.

టాష్‌టెగో :- (మెల్లగా పొగపీలుస్తూ) శ్వేతజాతివాడు, ఈ వెఱ్ఱినంతా సరదా అనుకొంటాడు.

మాన్‌క్స్ నావికుడు :- వాళ్ళు దేన్ని గురించి అలా నాట్యం చేస్తున్నారో ఆ కఱ్ఱవాళ్ళకి తెలుసో తెలియదో! సందుమలుపులలో తలలాడిస్తూ కలికే వారకాంతలు పాడే పాటలో "నీ చితిమీద నాట్యం చేస్తాను" అనే ఘోరమైన అర్థం ఉంటుందనుకొంటాను. పోనీలే. పండితులు అన్నట్టు ఈ ప్రపంచమే ఒక నాట్యశాల. ఎవరినాట్యం వాడు చేయనీ. ఆడండి తాగండి కఱ్ఱ వాళ్లూ! ఆడండి- ఒకప్పుడు నేనూ కుఱ్ఱవాడినే.

మూడవ నన్‌టుకెట్ నావికుడు:- ఆపండోయ్! ఉష్. తిమింగిలాన్ని లాగటంకంటె కష్టంగా ఉంది. కాస్త ఊపిరి పీల్చుకోనీయండి. (వాళ్లు నాట్యమాడటం ఆపి- గుమికూడుతారు. చీకటి పడుతుంది. గాలి రేగుతుంది)

లాస్కర్ నావికుడు:- బ్రిహ్మసాక్షిగా, కొద్దిసేపట్లో వాన వస్తుంది. ఆకాశానపుట్టి భూమిమీాద కవత రించిన గంగ గాలివాటున పారుతోంది. శివా! నీ ఫాలము నీలవర్ణము కాలుస్తోంది!

మాల్టా నావికుడు :- ఆ కెరటాలు చూడు. అవే చక్కని ఆడపిల్లలై తేనా! నేను వాటిలో మునిగిపోతాను. అందమైన ఆడపిల్లల్ని చూడటంకంటె భూమిమీాద గాని, స్వర్గంలోకాని ఇంకో ఆనందమేముంది?

సిసిలీ నావికుడు:- నాకు ఆసంగతి చెప్పకు! ఆ కాళ్ళూ ఆ కదలికలూ ఆ పెదవులూ, అంటీ అంటకుండా పోనివ్వాలి. లేకపోతే త్వరగా మొగం మొత్తుతుంది. నీవే మంటావు? (అంటూ పక్కవాడిని పొడుస్తాడు.)

టాహిటీ నావికుడు :- మా దేశపు భోగపు పిల్లలకు జై! టాహిటీకి జై! మా దేశపు చాపమీాదే పడుకొంటు న్నాను! నేసిన కొత్తలో నాచాప ఇంకా పచ్చగా ఉండేది. అప్పుడు కొనితెచ్చాను. ఇప్పుడో - మాసి పోయింది. ఈ మార్పు భరించలేను. స్వర్గానికి వెళ్ళి పోతే ఇక ఏమి చేయగలను!

పోర్చుగల్ నావికుడు :- పరీక్షగా సముద్రం ఏలా కొట్టు కొంటోందో! కాసుకోండి. తమ్ముళ్ళూ, గట్టల మీాదకి వెళ్ళి పడేట్టున్నాం గాలి ఎలా వీస్తోందో!

డెన్మార్క్ నావికుడు :- ఓడ వెటపెట మంటోంది. అది అలా అంటున్నకొద్దీ ఆ ఉద్యోగస్థుడు దానిని జాగ్రత్తగా నడుపుతున్నాడు. కోటలాగ చెదిరిపోకుండా ఉన్నాడు.

నాలుగవ నన్టుకెట్ నావికుడు :- ఇదివరకే అతనికి అహాబ్, ఆజ్ఞని జారీ చేశాడు. గాలివాన రాబోతూంటే ఓడ దానిగుండా దూసుకుపోయేటట్టు చేయమని!

ఇంగ్లీషు నావికుడు :- ఆ ముసలివాడు మహాదొడ్డవాడు. వాడి కోసం ఆ తిమింగిలాన్ని వేటాడ వలసింది మనము.

అందరూ— ఆఁ! ఆఁ!

మాన్క్స నావికుడు :- చుక్కాను పట్టేవాళ్ళు జాగ్రత్తగా ఉండండి - ఇటువంటప్పుడే ఎంత గుండెనిబ్బరం కల వాళ్ళయినా జారిపోయేది, ఓడ అడుగు భాగాలుకూడా దెబ్బతినేది ఇటువంటప్పుడే. అదిగో ఆకాశంవంక చూడండి - ఒక్కచోట తప్ప మిగిలిందంతా కారు చీకటి!

డాగో :- ఐతేనేం! నేనంటే ఎంతభయపడాలో, చీకటన్నా అంతే భయపడాలి. నన్ను నలుపుతోనే పోత పోశారు.

స్పెయిన్ నావికుడు :- (తనలో) దబాయిద్దామని చూస్తున్నాడు. (ముందుకు వస్తూ) మానవ సంఘంలో ఉన్న

అంధకారమే నీజాతి. ఇట్లా అన్నందుకు ఏమీ అను
కోవద్దు.

డాగో :- అనుకోనులే.

సెయింట్ జాగో నావికుడు :- ఆ స్పెయిన్ వాడికి పిచ్చో,
తాగ్రాడో ఏమో చెప్పలేం. ఇందాక తాగినది
ఇంత ఆలస్యంగా తలకెక్కిందేమో.

అయిదవ నన్‌టుకెట్ నావికుడు :- ఏమిటీ నేనిప్పుడు
చూసింది? మెరుపా ?

స్పెయిన్ నావికుడు:- కాదు, డాగో తన కళ్ళను చూపిస్తు
న్నాడు.

డాగో-(ఎగిరిగంతువేసి, నిన్ను మింగివేస్తా-పొట్టివాడా! తెల్ల
తోలూ, పిరికిపందా!

స్పెయిన్ నావికుడు- నిన్ను పొడిచివేస్తా.

అందరూ- కలహం! కలహం!

టాష్‌టెగో- (పొగవదులుతూ) ఓడమీద కలహం! అందరూ
అరిచేవాళ్ళే!

బెల్‌ఫాస్ట్ నావికుడు :- పోట్లాట! భలే. లోపలికి దూకుదాం.

ఇంగ్లీషు నావికుడు :- ఉజ్జీ ఉండాలి. ఆ స్పెయిన్ వాడి
చేతిలోంచి కత్తిని తీసెయ్యండి.
(దూరంగా తట్టుమీాదనుంచి ఓడమేస్త్రీ గొంతు)
సిద్ధంగా ఉండండి.

అందరూ:- గాలివాన! గాలివాన! పదండి! పదండి

(అందరూ చెల్లా చెదరై పోతాం)

పిప్ :- (ఒక ప్రక్కకి ఒదిగి ఉండి)

సరదాలట! భలే సరదాలే! ఓ! ఆ స్తంభం పడిపోయిందే! భగవంతుడా! క్రిందకివంగి తలదాచుకో, పిప్, అడవులలో చిక్కుకోవటం కంటె ఘోరంగా ఉందే! అసలు అడవుల్లోకి పళ్లుకోద్దామని ఎవరు వెళ్తారు ఇప్పుడు! అయినా! వాళ్లు తిట్టుకొంటూనే వెళ్తారు-నేనే వెళ్ళను. ఏమి గాలివాన అడవిలో ఉన్న. వాళ్ళకు ఇంకా కష్టం! తెల్లని గాలివాన! ష్‌ష! ఆ తెల్లతిమింగిలాన్ని గురించి వాళ్ళనుకొంటూంటే ఒక్కసారే వినాను. అయ్యబాబోయ్! నా ఒళ్ళంతా ఒణికి పోయింది! ఓరి భగవంతుడా! ఎక్కడున్నావో గాని ఈ నల్లజాతి కుఱ్ఱవాణ్ణి కాపాడు. నిర్భయుల బారినుండి నన్ను రక్షించు.

32. తిమింగిలపు తెల్లదనం

తెల్ల తిమింగిలం అహాబ్ పాలిటికి ఎటువంటి శత్రువైనదో చెప్పాను. ఒక్కసారి నాకు దానిని తలచుకొంటే ఎలా ఉండేదో చెప్పుతాను.

ఎటువంటివాడి మనస్సులోనైనా భయం కలిగించే కొన్ని ప్రత్యేక లక్షణాలు 'మాబీడిక్'కి ఉన్నాయి. అవికాక దానిని గురించిన కొన్ని ఊహాలు ఏవో అస్పష్టమైన భయాల్ని కలిగిస్తాయి. వాటిని విశదపరచటం కష్టం. అన్నిటి కన్నా నన్ను భయపెట్టింది ఆ తిమింగిలపు శ్వేతవర్ణం. దీనిని గురించి ఏదోవిధంగా చెప్పాలి. అది చెప్పకపోతే ఈ అధ్యాయాలన్నీ వృథా. ధవళచ్ఛాయ పాలరాయి, ముత్యమువంటి ప్రకృతిసిద్ధమైన వాటియొక్క అందాన్ని అధికంచేసి, వాటికి ప్రత్యేకమైన వర్చస్సుని ఆపాదిస్తుంది. కొన్ని దేశాలవాళ్లు ఈ వర్ణంలో రాచరికపు ఠీవిని గుర్తించారు. పురాతనకాలంలో పెగురాజు తనకి ఉన్న, బిరుదులన్నిటికీ ముందు "వెల్ల యేనుగుల ప్రభువు" అన్న బిరుదును వేసుకొన్నాడు. ఆధునిక యుగంలో సయాంరాజుల పతాకంమీద ఈ వెల్ల యేనుగు రూపాన్నే ఉంచుకొన్నారు. హానోవర్ వాళ్ళ పతాకాలమీద ఒక తెల్లగుర్రపు బొమ్మ మాత్రం ఉంటుంది. ఆస్ట్రియా దేశ ప్రభువులకు కూడ రాజ చిహ్నం ఈ తెల్లరంగే!

తెలుపురంగు సంతోషానికి చిహ్నం అంటారు.
రోమను దేశస్థులకు తెల్లరాళ్ళు ఆనందసూచకములు. మాన
వాళికి సంబంధించిన కొన్ని విషయాలలో తెలుపు
గౌరవప్రదము, అభిమానపాత్రము అయిన వాటికి
చిహ్నము. వృద్ధుల దయాళుత్వమునకు, పెళ్ళికుమార్తెల
అమాయకత్వమునకు తెల్లవర్ణము ఒక చిహ్నము. అమెరికా
లోని ఎర్రయిండియన్లలో, తెల్లని పట్కాను చేతికిచ్చుట
ప్రమాణంచేసి మాట యివ్వటానికి చిహ్నము. చాలా దేశా
లలో తెలుపురంగు న్యాయవిచక్షణకు గుర్తు. దైనందిన
జీవితంలో రాజులు రాణులు తిరిగే శకటాలకు కూడా శ్వేతా
శ్వాలనే కట్టుతారు! విఖ్యాతమైన మతాలన్నిటిలోను దివ్య
త్వానికి ధవళచ్ఛాయే చిహ్నము. పర్షియన్లు తాము కొలిచే
అగ్నిదేవుని జ్వాలాగ్రమున లేచే కాంతినే పరమపవిత్రంగా
భావిస్తారు. గ్రీసుదేశపు పురాణాలలో "జస్" అనే దేవతకు
ప్రతిరూపము డిండీరధవళమైన వృషభము. ఐరోకోలకు శీతా
కాలంలో జరిగే అత్యంత ప్రధానమైన పండుగ; శ్వేతసున
కపుబలి. అకళంకము, విశ్వాసనీయమునైన ఆ జంతువునే తమ
భక్తికి చిహ్నముగా భగవంతునకు అర్పిస్తారు. క్రిష్టియను
పాదరీలు అంగారకా లోపల ధరించే చిన్న జుబ్బాకు లాటిన్
భాషలో "తెలుపు" అని అర్థం వచ్చే శబ్దమునుండే ఉత్పన్న
మైనది. ఇతరత్రాకూడా, క్రైస్తవ మతాచారములలో
ఐతిహ్యాలలో తెలుపురంగు గలవి అత్యంత ప్రధానములు.
ఈ విధముగా తెలుపురంగు ఎంతో ఉన్నతము, మధురము,

పూజ్యము అయిన వాటికి చిహ్నమైనా ఆ వర్ణంలోనే ఏదో తెలియని అంతరార్థం గర్భితమై ఉంది. భయానక రసానికి రక్తవర్ణం చిహ్నం, దానికంటెగూడా శ్వేతవర్ణం భావన ఏదో మానసిక కంపం కలిగిస్తుంది.

శాంత వస్తు సంబంధము లేక, భయానక వస్తు సంబంధము కల్గియున్నప్పుడు, ఈ తెల్లరంగులోని అనిర్వచనీయ గుణం మరింత భయం కల్గిస్తుంది. ఉత్తరధ్రువ ప్రాంతంలోని తెల్లని ఎలుగుబంటినిగాని, మిగిలినచోట్ల ఉండే తెల్లని సొరచేపలనుగాని చూడండి. వాటి తెల్లదనమే వాటిని అత్యంత భయానకమైన వాటినిగా చేస్తుంది! పైగా, తెల్లదనమే వాటికి జుగుప్సాకరమైన సాధుత్వాన్ని గూడా అంటగట్టుతుంది. అదిగాక, కంటికి మిరుమిట్లు గొల్పే వన్నెగల క్రూరమగు పెద్దపులిని చూసినప్పటికంటె, తెల్లని తిమింగిలాన్నో, ఎలుగునో చూస్తే ఎక్కువ హడలు కలుగుతుంది.

హైందవ పురాణాలలోనే కాక, మన పాశ్చాత్య పురాణాలలోకూడా, ఒక శ్వేతాశ్వము, అతి ప్రాధాన్యం వహించింది. అది ఎంతో తెల్లగా ఉండటంవల్లనేకాక, పెద్ద పెద్ద కళ్ళు, విశాలమైన వక్షముకూడా కలిగిఉండటంవల్ల రాజఠీవి కల దానివలె ఉండేదట. అడవి గుర్రాల గుంపులన్నీ దాని ఆధిపత్యము క్రింద జీవిస్తాయట. ఆ గుంపుల ముందు ఈ గుర్రము నడుస్తూ ధ్రువతారవలె మార్గదర్శక మౌతుంది. మెరుస్తూ జాలువారే వెండికలతోనూ, అటూ ఇటూ ఊగిసలాడుతూ వంపులు తిరిగి ఉన్న

తోకతోనూ ఆ గుఱ్ఱము సువర్ణమయమై ప్రకాశిస్తూ ఉండేది. రాచరికపు హుందాతో, తన ప్రభావాన్ని నెరపుతూ ఉంటే ఆ గుఱ్ఱాన్ని చూచి అప్పటి ఆటవికులు ఏమనుకునేవారో, బహుశః వంటరిగా అటూ ఇటూ తిరుగుతూ ఉండే ఆదిమమానవుని జ్ఞాపకం చేసుకొనే వారేమో! అసంఖ్యాకులైన తన అనుచరుల నడుమ నడుస్తూనే, ఆ అనుచరులే ఉబుసుపోకకు సంచారం చేస్తూంటే, అజమాయిషీ చేయుటానికి పరుగిడుతూనో ఆ తెల్లని గుఱ్ఱము కందిపోయిన ముఖంతో కానవస్తూ, ఎఱ్ఱియుండియున్న గౌరవాభిమానాలకి ఎప్పుడూ పాత్రమయ్యేది. ఈ గుఱ్ఱానికి ఇంతటి ఔన్నత్యం లభించటానికి కారణ , మచ్చలేని ఆ తెల్లదనమే అన్నది నిర్వివాదం. ఆ ధవళచ్ఛాయ ఆ గుఱ్ఱానికి దివ్యత్వాన్ని ఆపాదించటమే కాక, ఆ గుఱ్ఱమంటే అవ్యక్తమైన భయాన్ని కూడా కలిగించింది.

కాని, శ్వేతవర్ణము ఏ విధమైన ఘనతనీ ఆపాదించని సందర్భాలూ ఉన్నాయి.

పాలిపోయిన మనిషిని చూస్తే ఆత్మీయులకు కూడా జుగుప్సకలిగించేది ఏమిటి?కొట్టవచ్చే అతని తెల్లదనమే. అతను కూడా ఇతరులవలెనే ఉంటాడు. అతనికి ఎట్టి అంగవైకల్యమూ లేకపోయినా, శరీరవ్యాప్తమైన శ్వేతవర్ణంవల్ల పరమకురూపి కంటె అసహ్యకరంగా ఉంటాడు, ఎందుచేత?

అసలు ప్రకృతే ఒక్కొక్కసారి తన వికటమైన రూపాలలో, ఈ తెల్లరంగుకి ఉండే భయానకమైన గుణాన్ని ప్రద

ర్శిస్తుంది. కొన్ని యెడల మానవుడుకూడ తనద్వేష ప్రదర్శనలో, తెలుపు రంగుని కూడా తనకి సహకారిగా చేసుకొన్నాడు. ఫాయిస్టార్ లో 'తెల్ల ముసుగు' వాళ్ళు, 'కోర్టు అమీనా'ను హత్యచేసిన ఘట్టం ఈ తెల్లవర్ణమువల్లనే రసవత్తరమైనది.

మామూలు విషయాలలో కూడ ఈ రంగుకిగల అసాధారణమైన నైజం కనబడుతూనే ఉంటుంది. మృతకళేబరాన్ని చూడగానే, అన్నిటికంటె ఎక్కువ భీతికొల్పేది పాలిపోయిన ఆ రూపమే. అదిచాలక మరికొంత వెల్లదనాన్ని ఎరువు తెచ్చుకొన్నట్టు శవంమీద కప్పటానికి అటువంటి తెల్లవస్త్రాన్నే తెస్తాం.

మన మూఢనమ్మకాలు కూడా ఈలాగే ఉంటాయి. దయ్యాలు తెల్లగా ఉంటాయని ఊహిస్తాము. అవి తెల్లని మంచునుండి లేచివస్తాయనికూడ అనుకొంటాము.

ఒక్కొక్కసారి ఈ తెల్లరంగు ఏదో మహోదారము, మహోత్కృష్టము అయిన వాటికి చిహ్నము అని అనుకున్నా, అసలు ఈ వర్ణం హృదయాంతరాళంలో ఏదో అతిమానుషమైన రూపాన్నే గుర్తుచేస్తుందన్నది నిస్సంశయము.

ఈ విషయాన్ని అంగీకరింపగలిగినా, ఈ లక్షణానికి కారణమేమిటో ఊహించగలమా అన్నది ప్రశ్న. ఈ విషయాన్ని పరీక్షింపబూనటం కష్టం. కొన్ని సందర్భాలలో ఈ తెల్లదనానికి మనమీదగల ప్రభావాన్ని తార్కాణ చేసుకొని ఈ పరీక్షకు పూనుకొందాం.

ఇటువంటి విషయాలలో ఎంతో సూక్ష్మబుద్ధీ, కల్పనాశక్తి లేకపోతే ఆలోచన సాగదు. లోకసాధారణమైన అనుభవాలు చెప్పబోతున్నాను. ఈ అనుభవాలవల్ల నాకు కలిగిన భావాలు లోకంలో చాలామందికి కలిగి ఉండవచ్చు. కాని వాటిని గురించి విశదగ్రహణం లేకపోవడంవల్ల ఇప్పుడు స్మరణకు తెచ్చుకోవటం కష్టం కావచ్చు.

విట్‌సన్‌టైడ్ * అన్నమాటని వినినంతనే ఆ దినము యొక్క ప్రాముఖ్యమేమిటో తెలియని వానికి కూడా, మనస్సులో మానంగానే, తెల్లని మంచుతో కప్పబడిన తలలని దించుకొని ఒకరివెంట ఒకరు ఎడతెగని బారులుగా వెళ్ళే యాత్రికులు, మెదులుతారు. ఎందుచేత? అమెరికా మధ్య రాష్ట్రాల నివాసి అగు విద్యావిహీనుడైన ప్రొటస్టెంటుకి తెల్లసన్యాసిని పేరుగాని, చెవిని బడినంతనే మనస్సులో ఏదో భయానకమైన రూపం మెదుల్తుంది, ఎందుచేత?

లండనులోని తెల్లకోట గురించి చెప్పగానే అమెరికను మనస్సులో ఎంతో గాఢమైన ముద్ర ఏర్పడుతుంది. ఆ కోటలో బంధింపబడ్డ వీరులు, రాజులే కాక దీనివల్ల ఇటువంటి భావమేర్పడుతుంది! ఆ పక్కనే ఉన్న బైవర్డ్ టవర్ బ్లడీ టవర్‌లు అంత గాఢమైన ముద్రని వేయవలే! అలాగే, న్యూ హేంప్‌షైర్‌లోని తెల్లపర్వతాలు పేరు చెప్పగానే మనస్సులో ఏదో పెనుభూతం ప్రవేశించినట్లు తోస్తుంది. కాని వర్జినియాలోని నీలగిరుల పేరు చెప్పితే కమ్మని కలవచ్చినట్టు

---

* ఈస్టర్ తరువాతి వారము దినములకు వచ్చునది.

అనిపిస్తుంది. ఎందుచేత! 'తెల్లసముద్రం' పేరు చెప్పగానే ఏదో పైశాచికరూపం ఊహకు తట్టుతుందే! "పచ్చసముద్రం" పేరు చెప్పగానే, జలపోత చేసిన వెల్లువలు, సుఖప్రదమైన మధ్యందినాలు, ఆ తరువాత జోలలు పుచ్చే సాయం సంధ్యలు ఏల జ్ఞాపకం వస్తాయి! మధ్యయూరప్ వాళ్ళ గంధర్వ కధలు చదివేప్పుడు హార్ట్స్ అడవుల పచ్చని తోవలలో చల్లగా జారిపోతూవుండే "ఆ పాలిపోయిన పొడవుపాటి మనిషి" ఆ అడవులలోని మిగిలినవాటి అన్నిటికంటె అధికంగా అంత భయంకరంగా ఉన్నట్టు అనిపిస్తాడు, ఏల?

లైమా పట్టణం బాధాగ్రస్తమైన పట్టణంలాగ కనబడటానికి కారణం? ఆ నగరపు గోపురశిఖరాలని తలక్రిందులు చేసిన భూకంపాలస్మృతులు కావు, అక్కడి సముద్రపు వుప్పెనలు కావు, ఒక్కనీటిచుక్కైనా వర్షింపక వట్టిపోయిన ఆకాశము కాదు, పేకముక్కలవలె ఒకదానిపై ఒకటి వాలివుండే ఇళ్ళ ప్రహరీలు కావు. లైమా తెల్లని ముసుగు కప్పుకొంది. ఆ తెలుపులో ఆ నగరపు బాధకంటె అధికమైన వుపద్రవము వుంది. ఈ తెల్లదనము, ఆ నగరపు శిధిలాలను, పాచిపట్టి పచ్చగా కనబడనీయక ఎల్లప్పుడూ నూతనంగానే కనబడేటట్టు చేసి, శిధిలమైన కోటబురుజులు తమవికారం బాగా చాటేటట్లు, పేలవంగా చేసింది.

ఇతర కారణాలవల్ల భయంకరంగా ఉండే వాటి నైజాన్ని, ఈ తెల్లదనం మరీ హెచ్చుగా చేస్తుందని మామూలుగా అనుకోరు. కొందరి ఊహలకు ఈ తెల్లదనం

లోని వికృతం అసలు అందనే అందదు. ఈ మాటలని ఉదహరిస్తాను.

మొదటిది- విదేశపు తీరాలను చేరుకొంటున్న నావికుడు అర్ధరాత్రి కెరటాల ఘోష వినగానే అప్రమత్తుడుగా ఉండుటకు తగిన మానసిక శక్తులను కూడదీసుకొనేట మట్టుకే కొంచెం భయపడతాడు. కాని, అర్ధరాత్రివేళ తన పడవ పాలవలె తెల్లగా ఉన్న నీళ్లలో వెడుతూ ఉన్నట్టు చూచాడనుకోండి, ఎటువంటి భీతి పొందుతాడో! భూమిమీదనుండి వస్తున్న తెల్లఎలుగుబంట్ల గుంపు అతని చుట్టూ మూగుతూ వున్నట్టు భావిస్తాడు. ఆ తెల్లని నీరు ముసుగువేసుకొన్న పెనుభూతంవలె కనిపిస్తుంది; అతని స్థైర్యం దిగజారి పోతుంది. అతనికి సముద్రపు నీలి తరంగాలు కనబడేవరకూ శాంతం కలుగదు. ఇంత జరిగినా నావికుడు, "రాళ్ల గుట్టల మీదపడవ కొట్టుకుంటామేమో అనే భయపడ్డాను గాని,నన్ను ఆవహించిన ఆ తెలుపువల్ల కాదు" అనే అంటాడు.

రెండవది: పెరు దేశస్థుడు, మంచుశిఖరాలు గల ఆండీస్ పర్వతాలని చూడటంవల్ల కలిగేది ఏమిటి? ఆ శిఖరాలమీద ఉండే నిర్మానుష్యంవల్ల భీతి ఒక్కటే. అలాగే, అడవులలో ఉండేవానికి ఒక చెట్టుగాని, ఒక రెమ్మగాని కానరాని తెల్లని మంచుఎడారిని చూస్తే ఎలా ఉంటుంది? ఇక నావికుని సంగతి చూద్దాం. ఒకొక్కసారి అంటార్కిటిక్ మహాసముద్రముమీద దట్టంగా మంచే గడ్డకట్టి ఉంటుంది. ఒకవంక చలితో వణికిపోతూ, ఎటువైపునా ఆశారేఖ కన

బడని సమయాన, ఆ మహాసముద్రం అంతులేని శ్మశాన వాటికలాగా ఉండనుకోడు!

తెల్లదనాన్ని గురించిన ఈ అధ్యాయాన్ని చదివి మీరు ఏమనుకొంటున్నారో, పేదమనస్సు పరాధీనమైపోయే తీరు ఇది, నీవు ఓడిపోయావు ఇస్మాయిల్, అనుకొంటున్నారేమో!

వెర్మాంట్‌లో పచ్చని పైరుల నడుమ పెరిగిన గుర్రాన్ని చూడండి. వెనుకగా ఎక్కడో ఒక అడవిమృగానికి సంబంధించిన గంధముకల బట్టని విదిల్చారనుకోండి, అడవి మృగాలంటే ఏమిటో తెలియకపోయినా, వాటి వాత ఏమిటో తెలియకపోయినా, ఆ గుర్రం పరుగెత్తడానికి సిద్ధపడుతుంది, ఎందువల్ల? ఆ గుర్రం ముందెన్నడూ అడవులలో ఉండిక పోవటంవల్ల దానికి అడవి మృగాల ప్రమాదం తెలిసే అవకాశంలేదు. ఆ వాసన ఎటువంటి పూర్వానుభవాలను స్మృతికి తేజాలదు. అటువంటి సమయాన భయమెందుకు?

ఇందులోనే ఉన్నది రహస్యమంతా. నోరులేని జాతువులలోకూడా ప్రపంచమందలి క్రౌర్యాన్ని గుర్తించే సహజజ్ఞానముంది. ఆ అడవిమృగాలకు కొన్ని వేలమైళ్ళ దూరంలో ఉన్నా, ఆ వాసన సోకినంతనే ఆ మృగాల తండాలు ప్రత్యక్షమైనట్టే అనిపిస్తుంది దానికి.

తెల్లని కెల్లువల ఘోష, మంచుశిఖరాల మీది రవరవలు, మంచు బయళ్ళయొక్క నిర్మానుష్యము— ఇవన్నీ నాకు భీతి కొల్పుతాయి. వేటివల్ల ఈ భయం కలుగుతుందో నాకు తెలియదు కాని ఇవి ఎక్కడో ఒకచోట ఉన్నాయనే

నా నమ్మకం. ఈ ప్రత్యక్ష జగత్తు ఎన్ని విధాలనో ప్రేమ పూర్వకమైనదైనా, ప్రపంచములోని అగోచరమైన భాగాలన్నీ భయానకములే.

ఒకవంక మహోదాత్తమైన వాటికీ, ఇంచుమించు భగవంతునికీ చిహ్నమైయుండియు, వేరొకవంక సహా భయంకరాలను మరింత భయంకరంచేసే ఈ శ్వేత వర్ణమును గురించిన్నీ అది మనస్సుకి అంత బలీయంగా ఎందుకు నాటుతుందో దానిని గురించిన్నీ ఇంతవరకు మనం గ్రహించనేలేదు!

ఆకాశమున లోతుగా చొచ్చుకొనిపోయే "పాల పుంత"ను చూచి నిల్చివున్నప్పుడు మనస్సులో నాశన సూచకమైన ఒక భావన పొడమి, ఎవరో కత్తితో వెన్నుపోటు పొడిచినట్టు అనిపిస్తుంది. విశ్వములో ఉన్న అగాధ నిర్దయ శూన్యత్వములయొక్క ఛాయలు అలముకొనుట, అనంతమూ, అస్పష్టమూ అయిన శ్వేతవర్ణ మహిమ వల్లనేనా! లేదా, వర్ణశూన్యత్వమే, శ్వేతవర్ణమనెడి భావన వల్లనా? అన్ని వర్ణములూ రాశీభూతమైన వర్ణమే తెలుపు గదా! వీటిలో ఏ కారణమైతేనేమి, అంతు కానరాని మంచు పటములను చూచినప్పుడు మనోగోచరము కాబట్టి ఒక శూన్య భావ మేర్పడటం సత్యం. దాని వర్ణరాహిత్యమే ఈశ్వరా రాహిత్యమునకు సూచకమా అని మన హృదయములను క్రుంగదీసివేస్తుంది. ఇంకో సంగతి; ప్రకృతిలో నానా వర్ణాలతో తాండవిస్తూ మనలను మురిపించే చిత్రవిచిత్ర స్వరూపాలన్నీ-సంధ్యారాగములు, సీతాకోక చిలుకల రెక్కలూ-

తళతళ లాడే కన్నెల కపోలాలు — నిజంగా వంచనలనీ, వాటికి ఆ మురిపెంపు రంగులు సహజం కావని, ఏ బహిశ్శక్తియో కల్పించిన ఆచ్ఛాదనాలనీ ప్రకృతిశాస్త్రజ్ఞులు ఒక సిద్ధాంతం చేస్తారు. అలాగే అయితే, దేవతగా మనము ఆరాధించే ప్రకృతి అమాయక విటులను ఆకర్షించి వశం చేసుకోవటానికి కృత్రిమపు సింగారాలు చేసుకొని మనసు ఉర్రూతలూగించే భోగవిలాసిని వంటిదని, జుగుప్సావహమైన ఆ కులటయొక్క— ఎముకల గూడును కప్పిపుచ్చే ఆ సింగారం, శుద్ధమాయ అని అనుకోవాలి. ఇలాగేదైతే, విశ్వవ్యాప్తమైన "తేజస్సు" ఈ నానా వర్ణములు పుట్టిస్తోందని, స్వభావంచేత ఆ తేజస్సు శ్వేతమని, దాని స్పర్శసోకిన భౌతిక పదార్థాలు నానా వర్ణ కలితములు అవుతవనీ, అనుకోవాలి. ఇదంతా పర్యాలోచించి చూస్తే, ఈ విశ్వమాతా పక్షవాతంతో చచ్చుపడి పోయిన ఒక కుష్ఠురోగియా అనే శంక పొడముతుంది. ఈ శ్వేతవర్ణ చర్య కంతకీ అల్బినో తిమింగిలం లక్ష్యభూతం. మీరిది గ్రహిస్తే ఈ తిమింగిలపు వేటను గురించి ఆశ్చర్య పడరు.

33. ఊహలు

అహాబ్‌కు 'మాబీడిక్' ను సజీవంగా పట్టుకోవాలన్న వాంఛ ఎప్పుడూ వుంటూనే వుంది. అతని సర్వస్వమూ ఆ ఒక్క లక్ష్యానికే వినియోగించాలని వున్నా, ఆ సముద్రయానము వల్ల ఇతర ప్రయోజనాలను కూడా పొందాలన్న ఊహ వుంటూనే వుండేది. ఆ తెల్లతిమింగిలముమీద అతనికి గల కక్ష ఇతర తిమింగిలాలమీద కూడా ప్రసరించేదేమో! ఒకదానివెంట ఒకటిగా తిమింగిలాలను వధిస్తూ వుంటే ఇది కాకపోతే వచ్చేదైనా అతని పరమ శత్రువు కాకూడదా అన్న ఆశ పెరుగుతూ వచ్చిందేమో! ఈ నా ఊహాలు ఎంత వరకు నిజమో చెప్పలేను. అయినా అతనిని వశం చేసుకొని కీలుబొమ్మగా ఆడిస్తూవున్న కారణమేదో ఒకటి యుండి యుండాలి.

తన లక్ష్యాన్ని సాధించటానికి అహాబ్‌కు ఏవో సాధనలు కావాలి కదా! అన్ని సాధనాలలోను మనిషి అనే సాధనం శీఘ్రంగా చెడిపోతుంది. స్టార్‌బక్ కంటె తాను ఎంత అధికుడనైనా, తన ప్రభావం ఆ వ్యక్తిపై సంపూర్ణంగా లేదని అతనికి తెలుసు. తనకు శారీరకమైన ఆధిక్యముంటే మాత్రం, విజ్ఞతలో అతనికంటె తాను ఏలా అధికుడవుతాడు! స్టార్‌బక్ యొక్క శరీరము, ఇచ్ఛ అహాబ్ వశంలో వున్నమాట నిజమే కాని స్టార్‌బక్‌కు అంతరంగ

ములో అహాబ్ యొక్క లక్ష్యంమీద అసహ్యముండుటయే కాక, వీలైతే దానిని దూరం చేద్దామన్న అభిలాషకూడా వుంది. ఈ సంగతి అహాబ్ కి తెలుసు. ఆ తెల్లతిమింగిలం తారసిల్లటానికి చాలాకాలం పట్టవచ్చు. వేరే పరిస్థితులేవీ అడ్డం రాకపోతే ఈలోగా స్టార్ బక్ ఆజ్ఞాధిక్కారము చేయ వచ్చు. అహాబ్ కు అంతరంగంలో సూక్ష్మరూపంలో మొలకెత్తిన తెల్లతిమింగిలపు కొరి) యిప్పుడు బాగా వ్యక్తరూపం తాల్చి అతని వివేకమును మ్రింగివేసింది. ఎట్టివానికైనా కార్యాచరణలేని వేక దీర్ఘాలోచన ధైర్యమును చెడగొట్టుతుంది.

అంతేకాదు;రాత్రిల వేటకై ఓడమీద నిలబడివున్న వాళ్ళ దృష్టి ఎక్కడనోవున్న 'మాబీడిక్' మీదకంటె సమీప వస్తువులమీద పడటమే సహజం. అహాబ్ మాబీడిక్ గురించి చెప్పినప్పుడు నాయకులంతా ఎంత వుత్సాహంతో తోడ్ప గలామని అరచినా, ఎప్పుడో ఏకో దొరుకుతుందన్న ఆలోచన ఒక్కటే వాళ్ళకు చాలదు. మధ్య మధ్య చిన్న వ్యాపకాలు లేకపోతే, శత్రువును మార్గాన వలసి వచ్చేటప్పటికి వాళ్ల శక్తి క్షీణించిపోతుంది మంచి ఉద్వేగ పూరితులై ఉన్న గడియలలో మానవులు నీచాలోచనలను వెనక్కి నెట్టివేస్తారు. కాని అట్టి గడియలు బుద్బుదప్రా యాలు, నిలవవు. అహాబ్ కి ఈ సంగతి తెలుసు. నాగరిక మానవుడు సహజంగా కొంచెపు బుద్ధిగలవాడు. అహాబ్ ఇలా అనుకొని ఉంటాడు: నా బృందంలోని వారికందరికీ ఆ

తెల్లతిమింగిలంను గురించిన తలంపులు ఆవేశాన్ని కలిగింప వచ్చుగాక, పరదాకొద్దిసే వాళ్ళు 'మాబీడిక్'ని వెన్నాడ టానికి సిద్ధపడతారు గాక! అయినా, వాళ్ళకి ఏ రోజుకు కావ వలసిన మేత ఆనాటికి ఉండాలికదా! వెనుక క్రిస్టియను మత యుద్ధాలలో పోరాడటానికి రెండువేలమైళ్ళ దూరానికి వెళ్ళిన యోధులు కేవలము తమ ధర్మరక్షణతోనే తృప్తిపడలేదు - దారిలో వాళ్ళు దుండగాలూ, దోపిడీలు చేస్తూనే పుణ్యసముపార్జనకోసం పోయినారు. వాళ్లే కనుక ఆ పరమలక్ష్యాన్నే ఏకాగ్రతతో అనువర్తిస్తూ, మరి వేటిని ఆశించకుండా ఉంటే ఆ లక్ష్యంమీద వాళ్ళకు రోత కలిగేదే. నా అనుచరు లందరకు ఒక పెద్ద ధనాశకలిగిస్తాను. ప్రస్తుతం వీళ్ళు ధనాన్ని లెక్కచేయక పోవచ్చు కాని కొన్నాళ్లకు అదే దక్కదేమో అనుకొనేటట్టు చేస్తే దాని మీద వాళ్ళకు ఆశపుట్టుతుంది- ధనంకోసమే అహాబ్‌ను పీడిస్తారు.

ఇవన్నీగాక, అహాబ్ ఇంత జాగ్రత్తపడటానికి వ్యక్తిగతంగా వేరొక కారణంకూడా లేకపోలేదు. 'పెకోడ్' ఓడ యొక్క ప్రయాణపు ప్రధమాశయాన్ని తొందరపడి బయట పెట్టివెయ్యడంవల్ల తాను దొంగ ననిపించుకొన్నట్లు భావించాడు. ఏమాత్రము జంకులేకుండ, నైతికంగాను, న్యాయ సమ్మతంగాను కూడ ఓడని నడిపేవాళ్ళు అతని మాట ధిక్కరించనూ వచ్చు: అతనిని పదవీచ్యుతుని చేయవచ్చు! అతను దొంగతనము చేశాడన్న అవమానలేశము లేకుండ పనిచేసి

వారికి కలుగకుండా చూచుకోవడం అహాబ్‌కి అవశ్యకమైనది. ఆ ప్రయోజనం నెరవేరటానికి ఒక్కటే విధానముంది. అది అతను అన్నివిధాలా ప్రాధాన్యం వహిస్తూ, తన నావికులలో ఏయే పరిణామాలు కల్గుతూ వుంటాయో అవి జాగ్రత్తగా కనిపెట్టుతూ వుండటం.

ఈ కారణాలన్నిటివల్లా, మాటలలో చెప్పటానికి వీలు కాని మరికొన్ని సూక్ష్మకారణాలవల్లా అహాబ్ ఆ ప్రయాణపు ప్రయోజనాలన్నిటిని జాగ్రత్తగా సాధిస్తూ, మామూలు ఆచారాలన్నీ పాటిస్తూ వుండేవాడు. అంతే కాదు తిమింగిలాల వేటగాళ్లు అనుసరించే మామూలు పద్ధతుల యందు తెచ్చికోలు ఆసక్తి కనబరుస్తూండేవాడు.

ఏమైతేనేం, అతను ఓడ ముందుభాగాన ఉన్న వాళ్ళను తరుచు పిలుస్తూ సముద్రంవైపు పరీక్షగా చూస్తూ వుండమని హెచ్చరిస్తూ వుండడం, ఏమాత్రం కదలికైనా చెప్పండంటూ వుండడం పరిపాటియైనది. ఈ అప్రమత్తతకు తగిన ఫలం అచిరకాలంలోనే లభించింది.

34. చాప అల్లువాడం.

మబ్బుపట్టి ఉక్కగా ఉన్న ఒకనాటి మధ్యాహ్నవేళ నావికులంతా బద్ధకంగా అటూ ఇటూ దొర్లుతున్నారు. సముద్రపునీరు కరగిన సీసంవలె కనబడుతోంది. క్వీక్వెగ్గూ, నేనూ పడవకు చుట్టే ఒక పట్టా నేస్తున్నాము. అంతా నిశ్శబ్దంగా ఉన్నది. కాని ఏదో ఆసన్నం కానున్నది అనే భావం అందరికీ తట్టింది. ఎవరికివారే మౌనంగా ఏదో నిర్ణయానికి వచ్చినట్టు ఉన్నారు.

పట్టానేతలో నేను క్వీక్వెగ్‌కి సాయం చేస్తున్నాను. అసలు పనియంతా అతడే చేస్తున్నాడు. పడుగుపోసిన దారాలలో నా చేతినే నాడెగా అటూ ఇటూ జరుపుతూ పేకనేస్తూ వుంటే, క్వీక్వెగ్ తన కఱ్ఱ కత్తిని పలకగా ఉపయోగించి పేకపోగులను కదిలించి ధట్టిస్తూ సముద్రజలంవంక మధ్య మధ్య దృష్టి సారిస్తున్నాడు. ఓడమీదను, సముద్రముమీదను ఏదో నిద్దుర మబ్బుక్రమించినట్లు నిశ్శబ్దంగా ఉంది. మధ్య మధ్య వినబడే పలకధట్టింపు చప్పుడువల్ల ఆ నిశ్శబ్దత కొంత సడలిపోతూవుంది. ఆ నేత కాలపురుషుని మగ్గమో అన్నట్లు, నేనే విధిపట నిర్మాణముకు వినియోగపడిన నాడెనైనట్లు, నా మనస్సుకు ఒక భావన కల్గింది. ఆ మగ్గంలో, పడుగు పోగులు స్థిరమైన సూత్రాలు. వాటికి మార్పులేదు. పేక పోగులు వాటిలో దూరి పెనవేసుకొని పోయేటప్పుడు అవి

స్పందిస్తూవుంటాయి. మానవజీవితంకూడా అంతే. విధివిలాసమనే పడుగుముందే చాచబడి యుంటుంది. మానవుడు తానే నాడెయై తన చేష్టలనే పేకపోగులతో జీవిత పటము నేసుకొంటాడు. ఈ క్వీకెగ్ అనే అనాగరికుడు యధేచ్ఛగా నిర్లక్ష్యంగా చేతితో ఆడించే ఆ కొయ్యకత్తి అనే పలక ఒకప్పుడు గట్టిగా, ఒప్పుడు తేలికగా, ఒకచోట వంకరగా, ఒకచోట ఏటవాలుగా ఆ పడుగుపేకలను ఘట్టిస్తూ పట్టాను తయారు చెయ్యడం ఉదాసీన స్వభావంగల అదృష్టదేవతా స్వభావం వలె వుంది. అదృష్టం ఆడించినట్లు ఆడుతూ ఎవని పటము వాడే నేసుకొంటాడు. ముందే నిర్ణీతమైయున్న ఆ విధివిలాసమువలెనే, పడుగుపోగులు స్థిరంగానే ఉంటవి. మారవు. స్వతంత్రబుద్ధితో మానవుడు దానిని మార్చలేడు. ఆ స్వతంత్రబుద్ధి నాడెవలె అటూ ఇటూ తిరుగుతూ పేకపోగులను పడుగులో కలుపుతూ పడుగు వస్త్రాన్ని నేస్తుంది. వస్త్రం నేసేది మానవ హస్తమే. అంటే విధి చాచి అట్టిపెట్టిన పడుగునే మానవుడునేసి పూర్తి చేస్తాడన్నమాట. ఇక అదృష్టమనేది పలకవలెనే బుద్ధిచే ప్రేరేపింపబడి, పోగులు వరసను దాటకుండా, వాటిని ఘట్టిస్తూ తుదకు వస్త్రముయొక్క చిక్కని నేతనో, జల్లినేతనో తయారు చేస్తుంది. మగ్గపుపలక దెబ్బల వంటివే జీవితం వివిధ ఘట్టములలో అదృష్టదేవత కొట్టే ఘట్టనలు. అవి కఠినములో, మృదువులో కావచ్చు.

ఓడ గాలివాటున వెళ్లుతూవుంది. టాష్టెగో తిమింగిలాలన్నీ ఎడమవైపుగా వెళ్లుతున్నట్టు చెప్పటంబట్టి అవి

కనబడునేమో అని భావిస్తున్నాము. మర్గం నేస్తూనే ఉన్నాము.

ఇలా మేము నేస్తూండగా ఏదో శబ్దం వినబడింది. ఆ శబ్దం వింతగా, దీర్ఘంగా భయంకరంగా ఉంది. ఆ శబ్దం ఎక్కడనుండి వచ్చినదో తెలియక, ఆకాశం వంక చూశాను. ఓక స్తంభం చివరన టామ్‌టెగో కనబడ్డాడు. అతను ముందుకు వంగి చేతులు అటూ ఇటూ ఆడిస్తూ, మధ్యమధ్య అరుస్తున్నాడు. ఆ అరుపుల స్వరం మహాద్భుతంగా ఉంది.

అతడు స్తభంచివర అలా నిలబడి దిఙ్మండలం వంక చూస్తూవుంటే ఏ ఋషీశ్వరుడో, ఏ పవిత్రుడో విధి గమనాన్ని చూస్తున్నాడేమోనని, అతని కేకలు విధి రాకను సూచిస్తున్నాయా అని అనిపించింది.

"అదిగో అక్కడ నీటిని కక్కుతోంది - అదిగో - అక్కడే"

"ఎక్కడా?"

"ఎడంవైపు – రెండు మైళ్లుంటుందేమో ఇక్కడికి– చాలా పెద్దగుంపు."

ఒక్క క్షణంలో పెద్ద కలవరపాటు పుట్టింది. తిమింగిలం నీటిని పైకి ఊదటం ఒక క్రమపద్ధతిని జరుగుతుంది. ఇతర జలచరాలకు ఆ జంతువుకూ ఉన్న భేదము అదొకటి. దీనిని బట్టే వేటగాళ్లు దీనిని గుర్తిస్తారు.

"అవిగో - పోయాయి" అని టామ్‌టెగో అరిచాడు. తిమింగిలాల గుంపు మాయమైనది.

“గంట ఎంతయైనదో చూచిరా!” అంటూ అహాబ్ కుర్రవానిని పంపాడు. వాడు వెళ్ళి గడియారం చూచివచ్చి గంట ఎంతో చెప్పాడు.

ఓడ గాలివాటున వెళ్ళుతూ వుంది. టాష్‌టెగో తిమింగిలాలన్నీ ఎడమవైపుగా వెళ్లుతున్నట్లు చెప్పటం బట్టి మాకు తారసిల్లక పోతాయా అని ఆశిస్తూ వెళ్లాం. సాధారణంగా తిమింగిలం నీటిని పైకి చిమ్ముతూవున్నా నీటిలో దాగి గిఱ్ఱున వెనుకకు తిరిగి ఇంకొకవైపు వెళ్ళిపోవటంకద్దు. కాని ఈసారి తిరిగిపోక ఒకే దిక్కుగా పోతున్నాయి. మా ఉనికి వాటికి తెలియనేలేదేమో. ఓడ స్తంభం దగ్గర కాపలా ఉండేవాడు మారినాడు. నావికులు కొందరు దిగారు. చిన్న పడవలని సముద్రం మీదికి దింపే ప్రయత్నంలో ఉన్నారు. ఆ చిన్నపడవల నావికులు నౌకాయుద్ధంలో శత్రునౌకమీద దూకుటకు సన్నద్ధులైన యోధులవలె సిద్ధంగా ఉన్నారు. దెప్పరమయిన ఆ క్షణాన ఒక పెద్దకత వినబడగానే అందరి చూపు తిమింగిలాల వైపునుండి అటు మరలింది. అక్కడ ఎవరో, ఎక్కడనుండి వచ్చారో మసక మసక ఆకారాలతో దయ్యాలవలె ఉన్న ఐదుమంది అహాబ్‌ను చుట్టుముట్టియున్నారు.

35. మొదటి వేట

ఈ నల్లని వాళ్లు చప్పుడు చేయకుండ ఓడకు బంధించబడియున్న ఒక పడవను కట్టు విప్పటానికి పూనుకున్నారు. ఆ పడవను సాధారణంగా వాడరు. దానికి "కెప్టెన్ పడవ" అనే పేరుకూడా ఉంది. ఆ పడవప్రక్కనున్నవాడు పొడవుగా మరీ నల్లగా ఉన్నాడు. వాని పన్ను ఒకటి ముందుకు పొడుచుకొని వచ్చింది. పెదవులు ఇనుపకడ్డీల వలె ఉన్నాయి. తెల్లని తలపాగా చుట్టుకొన్నాడు. మరి తక్కిన నల్వురు వానికంటె పొట్టివాళ్లు, వీళ్ళందరూ మనీల్లా జాతికి చెందిన యుక్తిపరులు. పిశాచ దేవతారాధకుల వలె సముద్రాల మీద తిరుగుతూ వుంటారు.

ఆ క్రొత్తవ్యక్తులను మేమంతా భయసంభ్రమాలతో చూస్తూండగానే అహాబ్, తలపాగా ధరించినవానితో "అంతా సిద్ధమైనట్టేనా ఫెడెల్లా" అని అడిగాడు.

"సిద్ధమే" అని వాడు సమాధాన మిచ్చాడు.

"అయితే దించివెయ్యి. విన్నావా! దించివెయ్యి !" అని అహాబ్ ఉరిమినట్లు అరిచాడు.

మరుక్షణం మూడు పడవలని నీళ్ళలోకి దించారు. నావికులు ఒక్క గంతులో వాటిలోకి దూకారు. ఒక పడవలో అహాబ్‌ని వేసుకొని ఆ క్రొత్తవాళ్ళు ఓడ ముందుకు వచ్చారు. అహాబ్ పడవలో నిలబడి స్టార్‌బక్‌ని, స్టబ్‌ని,

ఫ్లాస్క్‌నీ కూడా పడవలలో దూరంగా వెళ్ళమని హెచ్చరించాడు. కాని ఫెడెల్లాని, అతని అనుచరులని చూస్తూ మిగిలినవాళ్ళెవ్వరూ అహాబ్ ఆజ్ఞని పాలించలేదు.

"కెప్టెన్ అహాబ్—" యింకా ఏమిటో అనబోయాడు స్టార్‌బక్.

"దూరంగా వెళ్ళండయ్యా - అటు ఎడమవైపు - మీకే చెప్పుతున్నాను" అన్నాడు అహాబ్.

పడవలని జోరుగా నడపమని స్టబ్ తన అనుచరులను హెచ్చరించాడు, వాళ్లతో అతను మాట్లాడే విధమే వేరు. ఒకోసారి చాలా కటువుగా తిడ్తాడు, కాని అప్పుడు కూడా కొంత నవ్వు, కొంత కోపం మిళితంచేసి మాట్లాడటంలోనే ఉంది అతని ప్రత్యేకత, ఈ మాటలు విని కోపంవల్లనైతే నేమి, హాస్యంవల్లనైతేనేమి, నావికులంతా అతిత్వరగా పడవని నడుపుతారు, తాను మాత్రం ఏమీ కష్టపడేవాడు కాడు. ఎందువల్లనో బద్ధకంగా ఉన్న తమ అధికారిని చూడ గానే నావికులంతా ఇంకొంత వేగంగా పడవను నడపదొడగే వారు. దీనికి కారణం లేకపోలేదు. సరదాగా ఉంటున్నా స్టబ్ ఏంచేస్తాడో అన్నభయం నావికులకి ఉంది. అందువల్లే అతను ఎలా ఉన్నా వాళ్ళు తమ పని తాము చేస్తూవుంటారు.

అహాబ్ ఆజ్ఞానుసారం స్టార్‌బక్ తన పడవను స్టబ్ పడవవైపు మళ్ళించాడు. ఆ రెండూ దగ్గరకి చేరగానే స్టబ్ తన స్నేహితుని పిలిచి "స్టార్‌బక్! ఒక్కమాట అన్నాడు.

స్టార్‌బక్ ఏమీ జవాబియ్యలేదు. తన నావికులను పడవ త్వరగా నడపమని హెచ్చరించాడు. స్టబ్ అడిగాడు: "ఆ కొత్తగా వచ్చినవాళ్లను గురించి నీ వేమి అనుకొంటు న్నావు?" "వాళ్లని దొంగచాటుగా ఓడమీదకి తెచ్చారు కాబోలు. (గట్టిగా వెయ్యండి తెడ్డు కుర్రవాళ్ళూ") అని మెల్లగా తన నావికులతో అంటూ, మళ్ళీ, "స్టబ్! యిది విచారకరమయిన సంగతి. అయినా పోనీ, అన్నీ మన మంచి కోసమే అనుకొంటే సరి! మీ వాళ్ళని వేగంగా పడవని నడపమను. (దూకండోయ్ — దూకండి) అవిగో అక్కడ ఉన్నాయి. తిమింగిలాలు. వాటి కోసమేగా మనం వచ్చాం! (లాగండి, కుర్రాళ్ళూ — లాగండి) ఇది మన కర్తవ్యం, ఇందులో లాభంకూడా ఉంది — కానివ్వండి"

పడవలు రెండూ దూరంగా విడిపోగానే స్టబ్ తనలో తాను "నేను అనుకొన్నట్టే అయింది, వాళ్ళు నా కంట పడ గానే అనుకొన్నాను. అందుకే కాబోలు అహాబ్ అంతసేపు కనబడకుండా ఉండిపోయాడు- వాళ్ళని ఎక్కడో దాచాడు. అన్నిటికీ అడుగున ఆ తెల్ల తిమింగిలం ఉంటుందేమో! ఏమి ప్రయోజనం! యివ్వాళ తెల్ల తిమింగిలం దొరకదు. పోనీయండి! పోనీయండి!" అన్నాడు.

పడవలు నీటిలో వదిలే సమయంలో హఠాత్తుగా బయటకు వచ్చిన ఆ కొత్తవాళ్లని చూడగానే కొందరికి ఆశ్చర్యం కలిగింది. కాని అంతకుముం దెవడో చెప్పిన జోస్యం వల్ల ఇటువంటి ఆశ్చర్యకరమయిన విషయాలు

తటస్థపడటం సహజమే అనుకొని సమాధానం పడటంకూడా జరిగింది. దీనివల్ల కొంత విభ్రమం తగ్గింది. స్టబ్ ఈ కొత్త వాళ్ళను గురించిన చెప్పిన సంజాయిషీవల్ల కూడా వాళ్ల ఊహాగానాలు తగ్గాయి. ఏమైనా, అహాబ్ యొక్క అసలు ఉద్దేశమేమిటో ఎవరికీ తెలియనే లేదు. నా మట్టుకు నాకు నన్‌టుకెట్‌లో తెల్లవారుతూండగా మసక చీకటిలో "పెకోడ్" తట్టుమీద నడచివెళుతున్న రూపాలు, ఎలీజా అన్న మాటలూ గుర్తు వచ్చాయి.

ఈ లోగా, అహాబ్ వున్న పడవ చాలాముందుకు పోయింది. అతని పడవను నడుపుతూ వున్న ఆ క్రొత్తవాళ్ళు అత్యంత దృఢకాయులు. ఫెడెల్లా తెడ్డు చేతబూని తన కోటు తీసివేశాడు. అతని విశాలవక్షం, కన్నుచెవి రేటట్లు సముద్ర తరంగం వలె ప్రస్ఫుటంగా కనబడింది. పడవలో ఇంకొక వంక అహాబ్ ఒకచేతిని పైకి ఎత్తి నిలబడ్డాడు. ఆ తెల్ల తిమింగిలం అతని కాలు కాటు వేయకపూర్వం, చుక్కాను వద్ద ఎట్లా నిలబడి వుండేవాడో యిప్పుడుకూడా అదేవిధంగా జాగ్రత్తగా నిపుణంగా నిలబడి యున్నాడు. వున్నట్టుండి అతని చెయ్యి కొంత కదిలి, ఆగిపోయింది. అదే సమయాన పడవ తెడ్డులన్నీ పైకి వచ్చి ఆగాయి. పడవను నడిపేవాళ్ళే కాక పడవకూడా సముద్రము మీద నిశ్చేష్టమైనట్టు కనబడ్డది.

జాడ కానరాని విధంగా తిమింగిలాలన్నీ సముద్రంలో దాగిపోయి యి. కాని వాటి జాడ అహాబ్ ఏదో గుర్తించి పట్టున్నాడు.

"ప్రతివాడూ తెడ్డు పక్కగా జాగ్రత్తగా చూసు కోండి : క్వీకెగ్ నువ్వు నిలబడు" అంటూ స్టార్ బక్ హెచ్చ రించాడు.

అతను చటుక్కున లేచి నిలబడి, ఆఖరిసారిగా తిమింగి లాల గుంపు కనపడిన దిశవంక పరీక్షగా చూడ నారంభిం చాడు. స్టార్ బక్ ఓడకు వెనుకభాగాన అదే విధంగా నిలబడి పడవ అటూ ఇటూ ఒరుగుతున్నా తాను నిలదొక్కు కుంటూ; సముద్రం వైపు జాగ్రత్తగా చూస్తున్నాడు స్టార్ బక్.

అతవి దూరంలో ఫ్లాస్క్ కూడా పడవలో నిల బడ్డాడు. అతను ఎక్కువ వెడల్పులేని ఒక చిన్నకొయ్య మీద అతికష్టంతో నిలబడటం చూస్తే మునిగిపోయిన ఓడ యొక్క స్తంభం మీద నిలబడినట్టు అనిపించింది. అతను పొట్టివాడు, కాని ఆశ ఎక్కువ. అతను నిలబడ్డ ఆ చిన్న కొయ్య ఎందుకూ ఉపకరించలేదు.

"నాకేమీ కనబడటం లేదు" అన్నాడు

ఈ మాటలు విని డాగో అతనిని తన బుజాల మీద నిలబెట్టుకోవటానికి సిద్ధపడ్డాడు. "ఏ ఓడ స్తంభానికీ తీసి పోదు లెండి నా బుజం! ఎక్కుతారా!" అని అడిగాడు.

"భేష్ - ఎక్కుతా. నువ్వు యింకో ఏభై అడుగులు పొడవుంటే బాగుణ్ణు" అన్నాడు.

ఆ నీగ్రోవాడు తన చేతులను చాచి, ఫ్లాస్కుని భుజాలమీదికి ఎగరవేసు కొన్నాడు. అలా మీదికి ఎక్కి ఫ్లాస్కు జాగ్రత్తగా నిలబడ్డాడు.

పడవ అటూ ఇటూ ఎంత ఒరిగిపోతున్నా ఈ వేటగాళ్ళు నిటారుగా నిలబడటం చూస్తే ఆశ్చర్యంగానే వుంటుంది. ఒకోసారి వాళ్ళు పడవ చివరి అంచుల్లో నిలబడటం ఇంకా ఆశ్చర్యంగా ఉంటుంది. ఫ్లాస్కు; డాగోమీద నిలబడిన దృశ్యం మరీ వింతగా తోచింది. పడవ అటూ ఇటూ ఊగుతూంటే తదనుగుణంగా డాగో కూడా ఊగేవాడు! అతని వీపుమీద దూదిపంటి జుట్టుగల ఫ్లాస్కు, ఒక మంచు తునక వలె కనబడ్డాడు. అందల మెక్కినవాడి కంటె దానిని మోసేవాడు గంభీరంగా కనబడ్డాడు. ఆ పైకి యెక్కి ఫ్లాస్కు ఎంతగా చిందులు త్రొక్కినా, డాగోకి ఏమాత్రం చలనం కలుగలేదు. మహోదారమయిన యీ భూమిమీద కోపమూ, దర్పమూ ఎన్నెన్నో చిందులు తొక్కుతూ వుంటాయి. కాని అందువల్ల విశ్వంభర తన ధర్మాన్ని విడనాడదు.

యింకొక వైపు స్టబ్ ఏమీ తొందర పడటంలేదు. తిమింగిలాలు మళ్ళీ అంతలో లేచేజాడ కానరాలేదు. నీళ్ళలోనే కొంతసేపు ఉండిపోతాయేమో! అవి మళ్ళీ పైకివచ్చే వరకూ పొగ పీల్చుకోవచ్చుకదా అనుకొన్నాడు స్టబ్. అతను తన పైపు తీసి పొగాకు బాగా కూరి, నిప్పు అంటించాడో లేదో పడవకు వెనుక వైపున ఉన్న టాష్టెగో

హఠాత్తుగా ముందుకు వంగి "అవిగో, అక్కడున్నాయి పదండి, పదండి" అని గ్రుక్క తిప్పుకోకుండా కేకవేశాడు.

భూమిమీదే ఉండేవానికి అక్కడ తిమింగిలాలు కాదుగదా ఒక్క చేప అయినా కదులుతూవున్న జాడ కన్పడదు. ఏవో కొంతమేర నీటి కదలిక కొద్దిగా ఆవిరిమాత్రం కనబడతాయి. అంతలో గాలి అంతా కంపించి కాలిన పెనం మీద నీళ్ళు చల్లినట్లు 'చుంయ్' 'చుంయ్' అనే చప్పుడు బయలుదేరింది. అవి తిమింగిలాల నిశ్వాసాలు. అవే వాటి ఉనికిని తెలిపే ప్రథమ సూచికలు.

సరే, నాలుగు పడవలూ కలవరపడే ఆ నీటి వైపుకి పరుగెత్తుతున్నాయి. కాని పడవలకంటె ఆ నీటిజాలే ముందు పరుగెత్తుతోంది.

స్టార్‌బక్ "లాగండి అబ్బాయిలూ" అని నెమ్మదిగాను, ప్రస్ఫుటంగాను అన్నాడు. అతని రెండు నేత్రాలూ పడవ దక్షిణవైపు కేంద్రీకరింపబడి దిక్సూచిలోని రెండు సూదులవలె వున్నాయి. ఒకసారి ఆదేశపరుషంగా, ఒకసారి మృదువుగా వినబడుతున్నాయి. అంతకంటె అతను గాని, అతని అనుచరులుగాని మాటలాడలేదు.

కాని, ఫ్లాస్క్ సంగతే వేరు. అతను విడవకుండా కేకలు పెడుతూ "లాగండి, నా బంగారు తండ్రులూ; నన్ను వాటి దగ్గరకు చేర్పండి - అదే నే నడిగేది — నా తోటను, భార్యాపిల్లలతో సహా వ్రాసి ఇచ్చేస్తాను - పదండి_పదండి నాకు పిచ్చెక్కుతోంది_అవిగో— ఆ తెల్లని నీళ్ళ దగ్గరకు

పదండి" అని అరచుకొంటూ తలమీద టోపీతీసి క్రిందపడవేసి దానిని కాలితో తొక్కి, చేత తీసుకొని సముద్రంలోకి విసిరివేశాడు. చివరికి తాను పడవ వెనుక భాగంలో కూలబడ్డాడు.

దీనంతా చూస్తూవున్న స్టబ్ మెల్లగా "ఆ ఫ్లాస్కును చూడండి. వానికి వెర్రి యెక్కింది. నిజంగా వెర్రే. రాత్రి పిండివంట ఉంటుంది. లాగండి అబ్బాయిలూ నెమ్మదిగా క్రమం తప్పకుండా లాగండి. మీ బలంకొద్దీ లాగండి —" అన్నాడు.

తన గుంపుతో అహబ్ అన్న మాటలు నాగరికులు ఉచ్చరించరానివి, వినరానివి, అవి చచ్చు సొరచేపలు మాత్రమే వినదగినవి.

పడవలన్నీ వేగంగా వెడుతూవున్నాయి. అంతసేపూ ఫాస్క్ "ఆ తిమింగిలాన్ని గురించి చాలా విశదంగా వర్ణిస్తూనే వున్నాడు. ఆ తిమింగిలం తన పడవ వెనుకనే ఉన్నదంటూండేవాడు. ఈ వర్ణనలు విని ఒకరిద్దరు నావికులు నిజమే అనుకొని భయంతో వెనుకకు తిరిగి చూసుకొంటూండేవారు. వళ్ళు అలా వెనుదిరిగి చూడటం అచారవిరుద్ధమే. అటువంటి సమయాలలో నావికులు చేతులతో చెవులతో మాత్రమే పనిచేయాలి.

ఆ దృశ్యము మహావిభ్రమజనకము! అనంతశక్తిమంతమయిన సముద్రం ఉర్రూతలూగుతూ, చేసే గంభీర ఘోషలు; పడవలను ఛిన్నాభిన్నం చేస్తాయేమో అనే

భయము కొల్పే అలల పరవళ్ళు; అలలమీద ఊగే పడవలు; ఒక అలను దాటి అవతలి దాని శిఖరానికి చేరాలనే హెచ్చరికలు, ఈటెగాళ్ళూ, మేస్త్రీలు, నావికులూ వేసే కేకలు — పక్కగానే తెల్లని "పెకోడ్" తెరచాపలని విప్పుకొని ఈ పడవల చెంతకి రావటం—ఇవన్నీ ఒడలు పులకరింపచేశాయి. భార్య కౌగిలి వీడి వెళ్ళి యుద్ధరంగపు వీరత్వమును మొదటి సారిగా చవిచూచే యోధుని అనుభవంగాని, మరణించిన వ్యక్తి యొక్క జీవము పరలోకంలో యింకొక జీవాన్ని కలుసుకోవటంలో గాని పొందే అనుభవంగాని, మొదటి సారిగా వేటాడబడుతూవున్న తిమింగిలాల గుంపు చెంతకు వెళ్లే వాని అనుభవాలకు సాటిరావు.

తిమింగిలాల సంచారంవల్ల తెల్లబడ్డ నీళ్లు యిప్పుడు మరీ ప్రస్ఫుటంగా కనబడజొచ్చాయి. అవి గుంపు చెదరి, విడిపోతున్నాయికాబోలు, వాటి నోటినుండి వెడలే పొగలు రాశీభూతంగా లేవు.

పడవలు కూడా విడివిడిగా పోజొచ్చాయి. స్టార్‌బక్ ఎడమవైపుప మూడు తిమింగిలాలను తరుముట మొదలు పెట్టాడు. తెరచాప నెత్తించి గాలివాటున పడవ వేగాన్ని హెచ్చించాడు.

కొద్దిసేపటిలో పొగమంచు ఆవరించింది. వేరొక , ఓడ గాని, పడవగాని కనబడటంలేదు.

"లాగండి అబ్బాయిలూ వర్షం పడేలోగా, ఒక్కదానినయినా చంపడానికి వీలుంది. అవిగో తెల్లనీళ్ళు! దూకండి!" అన్నాడు స్టార్‌బక్.

ఇంతలోనే ఒకదానివెంట ఒకటి రెండు కేకలు వినబడ్డాయి. వీటివల్ల మిగిలిన పడవలలోని వాళ్ళుకూడా త్వరపడుతున్నట్టే తెలిసింది. ఈ కేకలు యింకా వినబడుతూండగానే శీఘ్రంగా స్టార్‌బక్ క్వీక్వెగ్‌ని లేమ్మంటూ హెచ్చరించాడు. చేతిలోని ఈటెతో అతను చటుక్కున నిలబడ్డాడు.

తెడ్డువేసేవాళ్ళెవరికీ ప్రాణసంకట విపత్తు అంతలో లేకపోయినా తమ నాయకుని ముఖలక్షణాలను బట్టి తుది గడియ ఆసన్నమైనట్లు వాళ్లు కూడా ఊహించారు. ఏబది ఏనుగులు గుంపుగా సడుకొని దొర్లుతూ చేసే ఘీంకారం వంటి పెనుమ్రోత వినబడింది. పడవ పొగమంచులో దూసుకొని పోతోంది. పగపట్టిన పాములు, పడగలు విప్పిమీద పడినట్లు సముద్రపు కెరటాలు పడవను చుట్టుముట్టాయి.

"అదిగో దాని వీపు: దానికి ఒకటి ఇచ్చుకో!" అన్నాడు స్టార్‌బక్.

పడవనుండి ఏదో దూసుకుపోతున్న చప్పుడైంది. క్వీక్వెగ్ ఈటె అది. మరుక్షణం అంతా అయోమయం! వెనకనుంచి పడవని ఎవరో తోసినట్టయింది. పడవముందు దేనికో కొట్టుకొన్నట్టు అనిపించి తెరచాప చిరిగిపోయింది. వేడిపొగ గొట్టంలాగ లేచింది. భూకంపంలోవలె మా పడవ క్రింద ఏదో దొర్లింది. వర్షంలో అటూ ఇటూ విసిరివేయ

బడ్డ నావికులకు ఊపిరి ఆడటం లేదు. వర్షం, తిమిగిలం, ఈటె అన్నీ ఏకమైనాయి. ఈటె తిమింగిలంకు తాకలేదు. దూసుకొని పోయింది. ఆ జంతువు తప్పించుకు పోయింది,

ఇంచుమించు పడవ మునిగిపోయినంత పని జరిగినా, ఏమీ ప్రమాదం సంభవించలేదు. ఈదుకొంటూ వెళ్ళి నీటిపై తేలిపోతున్న తెడ్లను తెచ్చుకొని మా స్థానాలలో మేము కూర్చున్నాము. సముద్రపునీరు పడవవంతా కప్పి వేసింది. మా కాళ్ళు మోకాళ్ళబంటిగా నీటిలో మునిగి ఉన్నాయి. క్రిందికిచూస్తే పడవ మాకోసం సాగరగర్భం నుంచి పైకిలేచివచ్చిన చిన్నలంకవలె ఉంది.

గాలిహోరు హెచ్చింది. కెరటాల వేగమూ హెచ్చింది. ఆ గాలివాన అంతకంతకు పెరిగి మమ్మల్ని ముంచి వేసింది. చుట్టూ కారు చిచ్చు రేగుతూవున్న మధ్య బయలు మీద మాడిపోకుండా వున్న ప్రాణులవలె మేమున్నాము. మృత్యుముఖంలోనే అమరత్వం పొందాము!

తక్కిన పడవలను పిలిచాము కాని వాటినుంచి మాకు పిలుపు వినరాలేదు. ఈలోగా గాఢాంధకారం క్రమ్మింది. పెద్దఓడ జాడ అసలు కానరాలేదు. సముద్రం పొంగుతూ ఉన్నందువల్ల పడవలో చేరిన నీటినితోడి వెయ్యబూనటం వ్యర్థమనిపించింది. పడవనడపటానికి ఏమాత్రమూ ఉపకరించక పోయినా తెడ్లు మాప్రాణాలని కాపాడుకోవటానికి పనికివస్తున్నాయి. ఎంతో ప్రయత్నంమీద చివరికి స్టార్‌బక్, దీపాన్ని వెలిగించగలిగాడు. దానిని ఒకకొయ్యకు తగిలించి, క్వీక్వెగ్

చేతికిచ్చి పట్టుకోమన్నాడు. జారిపోతున్న తన ఆశకు చిహ్నంగా కాబోలు! నిరాశాపూరితమైన వాతావరణంలో వ్యర్థమైన ఆ దీపాన్ని పట్టుకొని విశ్వాసరహితుడు, నైరాశ్యం నడుమ నిరర్థకంగా ఆశను పట్టుకు వ్రేలాడే మానవునకు చిహ్నంగా క్వీకెగ్ కూర్చున్నాడు.

తడిసి ముద్దయిపోయి చలిలో వణికిపోతూ, ఇటు పడవను గురించి, అటు ఓడను గురించి ఆశలు వదులుకుంటూ వున్న మేము కళ్లు తెరచేటప్పటికి తెల్లవారింది. సముద్రము పైన మంచు అలాగే ఉంది. ఉన్నట్టుండి క్వీకెగ్ నిలబడి చెవియొగ్గి ఏదో ఆలకిస్తున్నాడు. మాకుకూడా ఏదో చప్పుడు తాళ్ళూ, పలకలూ చేసే చప్పుడు-వినబడింది. ఆ శబ్దం అంత కంతకు చేరువ అవుతూ వుంది. మంచు ముసుగులోనుంచి ఏదో అస్పష్టమైన రూపమొకటి కంటబడింది. భయంతో మేమందరం నీళ్ళల్లోకి దూకాము. అది మా ఓడ; మా పడవ సమీపానికి వచ్చివేసింది. మేము దూకుతూ విడిచిపెట్టిన పడవ నీటిమీద తేలిపోతూ ఆ పెద్ద ఓడ క్రిందికు ఎలా వెళ్ళి పోయిందో కళ్ళారచూశాం. అది ఇంకొక ప్రక్క-మళ్ళీ పైకి వచ్చింది. మేము మళ్ళీ దానివైపు ఈదుకుంటూ వెళ్ళాము. అలలు మమ్మ నెట్టివేశాయి. కాని ఎలాగో ఓడమీదివాళ్లు మమ్మల్ని పైకి చేదుకొన్నారు. బ్రతికాము. వర్షం తిరిగి రాక పూర్వమే మొగతా పడవలు ఓడవైపుకి వచ్చాయి. అసలు ఓడవాళ్ళకు మేము బ్రతికి ఉంటామనే ఆశ లేకపోయినా, పడవలు మునిగిపోయిన సూచనగా ఏ తెడ్డో, ఏ పలకో కనబడక పోతుందా అని తలచారట.

36. సివంగి

జీవితమనే ఈ అవ్యవస్థతను చూస్తే, అసలు ఈ విశ్వమంతా ఒక తమాషాఏమోనని అనిపించే సమయాలూ, సందర్భాలు మానవునకు కొన్ని తటస్థపడుతూ వుంటాయి. ఈ తమాషా కంతటకూ వెనుక ఎవరో ఒక బుద్ధిశాలి ఉన్నాడని లీలగా తెలిసినా ఇదంతా తనమీద జరిగే హాస్య ప్రయోగమేమోనన్న అనుమానం అప్పుడప్పుడు అతనికి తట్టక పోదు. అయినా ఏమీ కుంగిపోడు. క్రుంగిపోవలసిన అవసరమూ కనబడదు. అన్ని సంఘటనలను, అన్నిమతాలను, అన్ని విశ్వాసాలను, అన్ని ఆచారాను నిప్పుకోడి తుపాకి గుండ్లను మింగి జీర్ణించుకొన్నట్టు, దిగమింగి వేస్తాడు. చిన్న చిన్న కష్టాలూ, అనుకోకుండా వచ్చే ప్రాణసంకటాలూ ఆ చమత్కారి తనమీద విసరే చిన్న చిన్న దెబ్బల వంటివి అనుకొంటాడు. అటువంటి మానసికావస్థను గురించి నేనిప్పుడు చెప్పుతూ వున్నాను. ఆ అవస్థ ఎంతో కష్టతరమైన సందర్భంలోనో, 'ఏదో మూడుతుంది' అనుకొన్నది సులువుగా తేలిపోయినప్పుడో కలుగుతుంది. ఇటువంటి నిర్లిప్తమైన మానసికావస్థ తిమింగిలపు వేటవలె మరి ఏ సంఘటనలోను తారాస్థాయికి రాదు. 'పెకోడ్' లో ప్రయాణమున తెల్లతిమింగిలపు వేటను నేను దృక్పథంతోనే చూస్తాను.

ఓడతట్టుమీదకు చేరుకోబడిన వాళ్ళలో నేను తుది వాడను. ఒంటిమీది నీటిని దులుపుకుంటూ క్వీకెగ్, ఇలాటి సందర్భాలు చాలా ఉండటం కలదా అని అడిగాను. అతను, "ఇట్టి సందర్భాలు తరుచూ ఉంట"వని సంక్షిప్తంగా జవాబిచ్చాడు.

ఈలోగా, స్టబ్ తడబట్టలు మార్చుకొని, పైప్‌ని కాల్చుకుంటూ కూర్చున్నాడు. అతనిని సమీపించి, "స్టబ్! వేటగాళ్ళందరిలో మన స్టార్‌బక్ చాలా తెలివిగలవాడనీ జాగరూకుడనీ మీరు అంటూవుండగా విన్నాను. అయితే ఎగిరిపోతున్న తిమింగిలంవెంట గాలివానలో తెరచాప ఎత్తుకొని పడవమీద వెళ్ళటం జాగ్రత్త అనిపించుకొంటుందా" అని అడిగాను.

"తప్పకుండా! ఇదేమి చూచావు. 'కేప్‌హార్న్' ప్రాంతాలలో పెద్దతుపానులోకూడా, తిమింగిలాలవెంట పరుగెత్తటం నే నెరుగుదును" అన్నాడు.

ప్రక్కనే నిలబడిఉన్న "ఫ్లాస్క్", మీకు ఈ వేటలో నాకంటె అనుభవం ఎక్కువ. ఒక్క విషయం అడుగుతాను చెప్పగలరా! ఈ వేటల్లో నడుం విరుచుకుంటూ మృత్యువు దగ్గరకి తోసుకుంటూ వెనుకగా వెళ్ళటం నావికులందరికీ తప్పనిసరే నంటారా!" అని ప్రశ్నించాను.

"తప్పని సరే. తిమింగిలముకు ఎదురుగా వెళ్ళేవాళ్ళెవరైనా ఉంటారేమో చూపించు, అది దెబ్బతీస్తుంది ఏమనుకొన్నావో!"

సరే, ఈ ముగ్గురివల్ల నాకు విషయమంతా తెలిసింది. పెద్ద పెద్ద గాలివానలు, పడవలు బోల్తాకొట్టడాలు, వీళ్ళ జీవితాలలో సర్వసాధారణమైన సంఘటనలనీ, తిమింగిలాన్ని ఆటకాయించే తుదిక్షణాలలో నా జీవితాన్ని చుక్కాను దగ్గర ఉన్న వాని చేతుల్లో పెట్టివెయ్యాలనీ, వాడు ఎంతో ఆవేశపూరితుడై తన తొందరలో పడవనే చెడగొట్టివెయ్య గల సాహసుడు కావచ్చుననీ, సమర్థుడైన స్టార్‌బక్ పడవలో ఉన్నా, అతని తొందరపాటు వల్లనే మేము చచ్చినంత పని జరిగిందనీ ఈ తెల్ల తిమింగిలపు వేట అంటే దయ్యపు వేటలో చిక్కుకోవటమనీ బోధపడింది. ఈ విషయాలన్నీ పురస్కరించుకొని, ఎందుకైనా మంచిది నా వీలునామాకి ఒత్తు వ్రాసి ఉంచుకొందా మనిపించింది. "క్వీక్వెగ్, నా వకీలువి, నా సాక్షివి నీవే! ఇటురా" అని అతనిని పిలిచాను.

నావికులకు వీలునామా వ్రాసుకొనే ఆసక్తి ఏమిటని మీకు ఆశ్చర్యం కలుగవచ్చు. కాని, ఆవిషయంలో వారి కున్నంత ఆస్థ ఇంకొకరికి ఉండదు. సముద్రయాన జీవితం మొదలుపెట్టిన తర్వాత నేను ఈ పనిచెయ్యడం ఇది నాలుగవసారి. ఆ పని ముగిసిన తర్వాత నా మనస్సు తేలికపడింది. ఏదో బరువు దింపినట్టయింది. ఇక నేను బ్రతికే రోజులన్నీ, చచ్చిన తరువాత పునర్జన్మ ఎత్తిన లాజరస్ జీవితపు రోజుల వంటివే. అవి, అసలు నా ఆయుర్దాయ పరిమితిని మించి లభించిన రోజులుగా లెక్కకట్టాలి. నా మనస్సులో మరణ శంకను దాచుకొని బ్రతికాను. పని

కాంతరాత్మగల ఒక మృతజీవుడు ఇరుకైన గోడలో శాంతంగా ఉన్నట్టుగా నేను నా పరిసరాల మధ్య శాంత చిత్తంతో ఉండటం నేర్చుకొన్నాను. అది నాకు మంచి తృప్తి నిచ్చింది. తుదకు ఏమైనాసరే ఈ వేట మృత్యు గుండంలోకి దూకడమే అని తలపోస్తూ అబుద్ధిపూర్వకంగా చాకున్న చేతిని పైకి మడుచుకొన్నాను.

37. అహాబ్ పడవ : ఫెడెల్లా

నేనే ఒంటికాలివాడనైతే, పడవమీద కనబడనే కనప్పడను. మన ముసలాడు బలే దొడ్డవా" అన్నాడుసు స్టబ్ ఫ్లాస్కుతో.

"అదేమీ గొప్పకాదనుకుంటా. కాలు మొదలంటా పోతే ఏమోగాని, అతనికి మోకాలు క్రిందనుంచే కదా కాలులేనిది! పైగా రెండో కాలు ఉన్నదామె" అని జవాబిచ్చాడు ఫ్లాస్కు.

"ఏమో ఆ సంగతి నాకు తెలియదు. అతను మోకాలి మీద వంగటం నేనెప్పుడూ చూడలేదు."

... ...

తమ నాయకునకు ప్రాణాపాయం రాకూడదనీ, అతడు సాహసించి వేట రంగంలోకి దూకరాదని తిమింగిలపు వేటగాళ్ళు తరుచుగా చర్చించుకొంటూ వుంటారు. వెనుక టామర్లేన్ అనుచరులుకూడా ఈలాగే అతనిని యుద్ధరంగంలోకి పోనివ్వడం, సబబుగాదని నిర్ణయించుకొని యుంటారు.

అహాబ్ విషయంలో ఈ సమస్య కొత్త పరిణామం దాల్చింది. ఆపత్సమయాలలో మానవుడు అటూ ఇటూ పరుగెత్తే స్వభావం కలవాడు. ఆ పరుగెత్తటంలో రెండు కాళ్ళూ ఉన్నాయా, ఒంటికాలేనా అన్న ప్రశ్న పుట్టదు.

అంతేకాక, అనుక్షణమూ విపత్కరమైనదీ, ఎంతో కష్టసాధ్యమైనదీ అయిన తిమింగిలపు వేటకి వికలాంగు డెవడైనా బయలుదేరవచ్చునా? "పెకోడ్" ఓడను కొన్నవాళ్లు వేరు విధంగా ఆలోచించి యుంటారు.

కెప్టెన్ అహాబ్ వేటలోకి మామూలు కార్యకలాపాలలో పాల్గొనటానికి, తన పర్యవేక్షణ క్రింద తతంగం నడిపించటానికి అతని స్నేహితునికి అభ్యంతరం లేకపోవచ్చు; కాని అతనికి ఒక చిన్నపడవను ప్రత్యేకించటం, అతనిక్రింద కొందరి నావికులను నియోగించటం "పెకోడ్" యజమానులు అంగీకరించే వారు కారు. అందుచేతనే, అతను తనకు ప్రత్యేకం నావికులు కావాలని వాళ్ళను కోరలేదు. తన ఆశయాన్ని వాళ్ళకి సూచించలేదు. తానే స్వతంత్రించి స్వయంగా కొన్ని చర్యలు తీసుకున్నాడు. ఓడ రేవు విడిచిన తర్వాత వేటకు వెళ్ళే పడవల ఏర్పాటు చేయుటంలో అహాబ్ చూపించిన ఆసక్తిని, శ్రద్ధనూ చూస్తే కొంత అనుమానమే కల్గింది. ముఖ్యంగా ఒక పడవను సిద్ధం చేస్తున్నంతసేపూ అతను దానిలో తరచూ నిలబడి ఏమేమి ఏర్పాట్లు చెయ్యాలో సూచిస్తూండేవాడు. కొన్ని పనులు స్వయంగా చేసేవాడు. "మాబీడిక్" ని హతమార్చాలి అన్న అతని ప్రతిజ్ఞ అందరికీ తెలిసినదే కాబట్టి తానే ఆ పని చెయ్యటానికి అనుగుణంగా ఆ పడవయొక్క సన్నాహంలో శ్రద్ధ చూపుతున్నాడేమోనని అనుకున్నారు. అందరూ ఇట్లా అనుకొన్నప్పటికీ ఆ పడవకు

ప్రత్యేకం వేరొక జట్టు నియుక్తమౌతుందని కలలోకూడా ఎవ్వరూ అనుకొని యుండరు.

తిమింగిలపు వేటకు వెళ్ళేవారికి ఆశ్చర్యం కొల్పేది ఏమీ ఉండదు. దీనికి కారణం లేకపోలేదు. సముద్రయానం చేసేప్పుడు వారికి ఊహించలేనన్ని చిత్రవిచిత్రమైన వస్తువులు తటస్థపడుతూ వుంటాయి. అందువల్ల 'వింత' ఏమీ ఉండదు. అలాగే, ఓడ అడుగుభాగం నుండి హఠాత్తుగా పైకివచ్చిన భూతాలను గురించి ఆశ్చర్యంకూడా క్రుటిలో అంతరించింది.

చివరకు ఆ నావికుల గుంపు వచ్చి మిగతావాళ్ళతో పాటు కూర్చున్నా, ఆ ఫెడెల్లా అన్న వాని ప్రకృతిమాత్రం చివరిగాకా అతిగహనంగానే ఉండిపోయింది. ఇంతగా నాగరికమైన మానవలోకంలోకి వాడు ఎలా ప్రవేశించాడో, అతనికి అహాబ్‌తో పరిచయము, చనువు ఏలా ఏర్పడ్డవో భగవంతునికే ఎరుక! పాశ్చాత్యదేశీయులు ఏదో కలలో తప్ప ఎక్కడా అటువంటి వ్యక్తిని కాంచరు.

మనకు తూర్పుదెస ఉన్న కొన్ని సముద్ర ద్వీపాలలో ఇప్పటికీ ఏ విధమైన మార్పులేని ప్రాక్తన మానవజాతి ఉంది. ఈ భూమిమీద ఆదిమ మానవుడు ఆవిర్భవించడం, తాము అతని సంతతి కావటం, మొదలగు చరిత్ర వాళ్ళు మరచిపోలేదు. వాళ్ళు భూతాలుగా వుండటమే కాకుండా ఇతరులనుకూడా భూతాలుగానే భావిస్తారు. ఆకాశం వైపు చూస్తూ, ఈ సూర్యుడూ, ఈ చంద్రుడూ ఎందుకు పుట్టారు! ఎప్పుడు పుట్టారు అని ప్రశ్నించుకొంటూ వుంటారు, అది

యుగంలో దేవతలు మానవ యువతులను ప్రేమించి, వారికి సంతానం ప్రసాదించారని బైబిలులో "సృష్ట్యాది" అనే అధ్యాయంలో చెప్పబడి యుంది. అట్లే, ఆ ఆదియుగంలో పిశాచాలవల్ల మానవ స్త్రీలకు ఇటువంటి జాతులు ఉత్పన్నమై యుంటాయి.

—:0:—

38. సీటిజల్లు

రోజులూ, వారాలూ గడిచిపోయినాయి. "పెకోడ్" అతి సునాయాసంగా ప్రయాణాన్ని సాగిస్తోంది. చాలా వేట స్థలాలని దాటుకుంటూ పోయింది. అజోర్ ద్వీప ప్రాంతంలో, కేప్ డి వెర్డ్ ప్రాంతంలో, ప్లేట్ ప్రాంతంలో, సెయింట్ హెలీనాకి దక్షిణాన వున్న కేరల్ గ్రాండ్ ప్రాంతంలో తిరిగింది ఓడ.

చివర పేర్కొన్న ప్రాంతాల, ఒకనాటి వెన్నెల రాత్రిలో 'పెకోడ్' చల్లగా మందగమనంతో సాగిపోతూ వుంది. సముద్రపు తరంగాలు వెండి తెరలవలె దొర్లిపోతూ వున్నాయి. ఆహ్లాదకరమైన ఆ నిశ్శబ్దపు వాతావరణంలో మెరిసిపోయే సీటిజల్లు కనబడింది. వెన్నెలలో అది అతి లోకమైనదై, సముద్రములోనుండి, ఏ సాగరకుమారుడో లేచి వస్తున్నట్టు అనిపించింది. ఫెడెల్లా ఈ జల్లుని అందరికంటె ముందు చూశాడు. వెన్నెల రాత్రులలో ఓడ స్తంభమెక్కి సముద్రంవైపు నిశితంగా పగటి వేళలో వలె చూడటం అతనికి అలవాటు. రాత్రుళ్ళు ఎన్ని తిమింగిలాల గుంపులు వెళ్ళుతూవుండటం కనబడినా, వాటినో సీటిలో చొరబడటానికి సాధారణంగా సిద్ధపడడు. ఈ తూర్పుదేశస్థుడు ఆ విధంగా రాత్రుళ్ళు స్తంభంపైన ఎక్కికూర్చుండటం, ఇతని తలపై తెల్లపాగా ఆకాశంలోని చంద్రునితో ఓరుసుః

కొంటూ వుండటం చూస్తే మిగతా నాయకులకు ఎంతో ఆశ్చర్యం కలిగేది! అతను అలా చాలా రాత్రులు నిశ్శబ్దంగా చూస్తూవుండేవాడు. ఆనాటి రాత్రి వున్నట్టుండి అతను ఒక పెద్ద పొలికేక వేశాడు. ఆ కేకతో ఒక్కసారిగా నావికులందరూ లేచారు ఏదో భూతం వచ్చి వాళ్లను లేపినట్టు.

"అదిగో అక్కడ నీటిని ఊదుతోంది" అని అతని మాటలు విన్నప్పుడు వాళ్ళకు నరకశిక్ష విధించేనాటి కాహళ వింటే కలిగే శరీరకంపం కలిగింది. కాని ఒక భేదముంది. ఈ కంపం భయజనితం కాదు; సంతోష జనితం. అతని కేక అంత ఆవేశపూరితమవటం వల్ల, అప్పుడు అర్ధరాత్రివేళ అయినా, అందరూ నీటిలోకి వెళ్ళటానికి ఉద్యుక్తులైనారు.

తట్టుమీద వడిగా నడుస్తూ అహాబ్ తెరచాపలన్నిటినీ ఎత్తమని ఆజ్ఞాపించాడు. ఓడలోని వారందరికంటె నేర్పరిని చుక్కానువద్ద ఉండమన్నాడు. ఆ గాలిలో అతివేగంగా ఓడ పోతోంది. తట్టుమీద ఉన్న వాళ్ళకు గాలిలో తేలిపోయినట్టయింది. ఓడ, ఆకాశాన్ని అంటుకొందామా, నీటిమీదనే ఏ గమ్యప్రదేశమైనా త్వరగా చేరుకొందామా అనే ద్వివిధ విభిన్నవాంఛలకు లోనై దూకిపోతూ వున్నదేమో అనిపించింది. అహాబ్‌ని చూస్తూవుంటే అతనిలోకూడా రెండు పరస్పర విరుద్ధాలైన భావాలు పెనుగులాడుతున్నాయని బాగున్న అతల కాలి పాదన్యాసం పటుత్వంగల ప్రతిధ్వానులను ఈనుతూవుండగా, కుటికాలి పాదన్యాసం శవపేటిక

మీద లేచినట్లు ఓటి చప్పుడు చేస్తోంది. ఆ ముసలివాడు చావుబ్రతుకుల మధ్య విహరిస్తున్నాడు. ఓడ అంతవేగంగా వెళ్ళుతూవున్నా ప్రతి నావికుని చూపులూ వాడి తూపుల వలె నిగిడియున్నా, ఆ తెలినీటి జల్లు ఆ రాత్రి మళ్ళీ కాన రాలేదు. ప్రతివాడూ ఆ జల్లు ఒకసారి చూశానని అనేవాడే కాని, రెండవసారి చూసినట్టు ఒక్కడూ అనలేదు.

ఆ జల్లును గురించి ఇంచుమించు అంతా మరచిపోయి నాము. కొన్నాళ్ళు గడచిన పిమ్మట మరల ఒకనాటి రాత్రి అదేవేళకు మళ్ళీ కనబడింది. మళ్ళీ అందరూ దానిని గమ నించారు. దాని వెంటపడేప్పటికి మళ్ళీ మాయమైపోయింది. ఇట్లాగే చాలా రాత్రిలు జరుగుతూ వచ్చింది. చివరికి దాని మీద లక్ష్యమే పోయి తలచుకొన్నప్పుడు మాత్రం ఆశ్చర్యం కలుగుతూ ఉండేది. అప్పుడప్పుడు వెన్నెలలోనో, చీకటి రాత్రిల నక్షత్రకాంతిలోనో ఆ నీటి జల్లు కనపడటం మరల ప్రత్యక్షమవటం తటస్థించేది. ప్రతిసారి మాకు కనబడుతూనే దూరమైపోతూ మమ్మల్ని వంచనచేస్తూ వుండేది.

సహజంగా వాళ్లకి ఉండే మూఢనమ్మకంవల్ల నైతే వేరు కారణంవల్ల నైతే నేమి 'పెకోడ్' మీద ఉన్న కొందరు నావికులు ఈ జల్లు ఎప్పుడు కనబడినా ఒకే ఒక తిమింగిలం ఊదే నీటి జల్లని ఆ తిమింగిలం "మాబీడిక్" అని అనేవారు. అంతే కాదు ఈ మాయాభూతం మమ్మల్ని అలాగే ఆకర్షిస్తూ, ఏ మారు

మహాసముద్రాలలోకి తీసుకొనిపోయి ఒక్కసారిగా మామీద విరగబడి చీల్చివేస్తుందన్న భయంకూడా కల్గుతూ వుండేది.

అస్పష్టములూ, అతిభయంకరములూ అయిన మా అనుమానాలు, అద్భుతావహమైన ఆ వాతావరణంలో మరింత శక్తిమంతములైనాయి. రోజులవెంట రోజులు మేము ప్రశాంత నీలసాగరాలపై ప్రయాణం చేస్తూవుండగా, హింసాపరాయణమైన మా ప్రతీకారదీక్షను చూచి, జలదేవత జుగుప్సతో ప్రాణత్యాగం చేస్తున్నదా అనిపించేటట్టు, ఓడవెళ్లే జలమార్గం విచ్ఛిన్నమైపోయేది.

ఓడ తూర్పుముఖంగా పోతూవుంది. కేప్‌నుండి వచ్చే వాయువులు మా చుట్టూ హోరుమంటూ వీస్తూ వున్నాయి. ఉల్లోలకల్లోలమైన తరంగాలను చీల్చుకొంటూ అతివేగంగా "పెకోడ్" పరుగెత్తుతూ వుంటే మంచుముక్కలవంటి తెల్లని నీటి తుంపర, ఓడ తిట్టను నింపివేస్తోంది. అంతకుపూర్వం, శూన్యహృదయాలతో ఉన్న మాకు మరింత హృదయ విదారకమైన దృశ్యాలు గోచరించాయి.

మా ఓడ సమీపానే వింత వింత ఆకారాలుగల జల జంతువులు నీటిలో అటూ ఇటూ పరుగెత్తేవి. మా వెనుక భాగాన ఎన్నో జలపక్షులు గుంపులుగా ఎగురుతూ వుండేవి. ప్రతి రోజూ ఉదయపువేళ అవివచ్చి ఓడమీద వాలేవి. మేమెంత కొట్టినా పోయేవికావు. ఉండటానికి గూడుకాని, వాలటానికి కొమ్మగాని లేని ఆ ప్రాణులకు మా ఓడ వాస యోగ్యమైన తావుగా కనబడ్డది కాబోలు. సంక్షుభితమైన

అంతరాత్మవలె సముద్ర తరంగపంక్తి ఉల్లోలకల్లోలమగుతూ వుండగా మానవజీవలోకము తాను చేసిన పాపమునకు పశ్చాత్తాప పడుతున్నదా అని తోచేది.

ఆ ప్రాంతాన్ని కేప్ ఆఫ్ గుడ్ హోప్ అంటారు. ఆశాజనకమైన ఆ పేరుకంటె, వేదనాసూచకమైన ఇంకొక పేరు దీనికి సార్థకమౌతుంది. చిరకాలంనుండి మమ్మల్ని అకర్షిస్తూ ఎలయింపుచుకొని వస్తూవున్న ఒక దుర్విధి మమ్మల్ని ఇక్కడ చేర్చింది. ఏ నెలవూ దొరకకుండా నిర్విరామంగా తిరుగుతూ వుండవలసిన గతికి పాల్పడ్డ జంతుజాలంతప్ప ఇక్కడ మరేమీ ఉండదు. ఏ పాపం చేసిన ప్రాణులో ఆ నీటికోళ్ళుగా, చేపలుగా పుట్టి వుంటారు. ఆ తెల్లనీటి జల్లు మమ్మల్ని అప్పుడప్పుడు ఆహ్వానిస్తూ వున్నట్లు దూరాన కాన వస్తూండేది.

అహాబ్ స్వయంగా ఓడ ప్రయాణానికి ఆజ్ఞలు జారీ చేస్తున్నాడేగాని నిరానందమైన ఆ వాతావరణం వలెనే అతనుకూడా ఎంతో మౌనగాంభీర్యముతో ఉండేవాడు. తుఫాను రేగే సూచనలు కనపడ్డాయి. తుఫాను వేళలలో సాధ్యమైనంతవరకు అన్నిటిని సర్దుకొని, తుఫాను రాకను ఎదురుచూస్తూండటం తప్ప మరేమీ యుండదు. అట్టి సమయాలలో ఓడ కెప్టెన్ అతని అనుచరులూ ఏమి కానున్నదో అది ఔతుందనుకుంటూ యుద్భవిష్యులవుతారు.

అహాబ్ మామూలు స్థానంలో నిలబడి గంటలకొద్దీ సముద్రంవైపు చూస్తూండేవాడు. ఒకోసారి అతని మీసాపదద్దీ

మంచుతునకలు అతని కళ్లు కప్పివేస్తూండేవి. మిగతా నావికులు కూడా, ఓడ ముందుభాగంనుండి వెనుక భాగాన అనువైన స్థావరాలలో భద్రంగా వరసగా నిలబడ్డారు. ఎవ్వరూ ఎక్కువ మాట్లాడటంలేదు. సుడులు తిరిగే కెరటాలు చీల్చుకుంటూ, మౌనంగా వెళ్ళిపోతున్న ఆ ఓడను లక్కబొమ్మలు నడుపుతూ వున్నాయా అనిపించింది. పగలే కాక రాత్రివేళకూడా అందరూ మౌనం వహించే వున్నారు. సముద్రఘోష మాత్రం రాత్రింబగళ్లూ రేగుతూ వుండేది. అహాబుకూడ మౌనమే తాల్చాడు.

అతడు ఒకనాటి రాత్రి తన గదిలోకి వెళ్ళి బల్లమీద కళ్ళు మూసుకొని కూర్చున్నాడు. ప్రక్కనే వేరొక బల్లమీద ఆటుపోట్లు, సముద్ర తరంగాలూ సూచించే కాగితాలున్నాయి. అతను తల వెనుకకువాల్చి, ఆ గదిలో ఉన్న దిక్సూచివైపు చూస్తూనే కళ్ళు మూసుకొన్నాడు. స్టార్‌బక్ ఈ దృశ్యాన్ని ఎప్పుడూ మరువలేనంటూండేవాడు. ఇటువంటి తుఫానులో అహాబ్ కి నిద్ర ఎట్లా పడుతూవుందో, కళ్లు మూసుకొన్నా తను పోవలసిన దిక్కువైపే ఎట్లా చూస్తున్నాడో అని ఆశ్చర్యపడేవాడు.

—:o—

39. "ఆల్‌బట్రాస్" ఓడ

కేప్‌కి ఆగ్నేయ దిశగా, 'క్రొసెట్' దీవులకు సమీపంగా ఒక ఓడ కనబడింది. తిమింగిలాల వేటకి ఇది చాలా అనువైన తావు. మా ఓడనుంచి దూరాన ఉన్న ఆ ఓడను (ఆ ఓడ పేరు "ఆల్‌బట్రోస్") చూసేప్పటికి నా మనస్సు లేచివచ్చింది. ఇంటిని విడిచిపెట్టిన చిర కాలానికి దూరసాగ్రాతాలలో అటువంటి దృశ్యం సుఖప్రదంగా ఉంటుంది.

సముద్రపు కెరటాలు కొట్టుకోవడం వల్ల కాబోలు ఆ ఓడ తెల్లబడింది. ఓడ ప్రక్క-భాగాలు తుప్పుపట్టి ఉన్నాయి. స్తంభాలు, వాటికివున్న తాళ్ళు, మంచుతో కప్పబడిన చెట్టుకొమ్మలవలె కనబడ్డాయి. దిగువ తెరచాపలనే ఎత్తారు. స్తంభాలమీద నిలబడి కాపలా కాస్తున్న వాళ్ళు వింతగా కనబడ్డారు. వాళ్ళు చినిగిపోయిన తోలు బట్టలని కట్టుకొన్నారు. గడ్డాలు పెరిగియున్నాయి. సముద్రము వైపు వంగి వంగి చూస్తున్నారు. మా ఓడను వాళ్ళ ఓడ సమీపించినా మా వాళ్ళని వాళ్ళు పలుకరించనే లేదు. క్రింది తట్టులమీదనుండి వాళ్ళే ఒకళ్ళ నొకళ్ళు తమలో పలుకరించుకోవడం మాత్రం వినబడుతోంది.

"మీకు తెల్లతిమింగిలం కనబడిందా?" అనే ప్రశ్న వేస్తూ ఆ మాటలు ఆ ఓడవాళ్ళకు బిగ్గరగా వినబడటానికి బాకాలో చెప్పాలని అహాబ్ దానిని చేతపుచ్చుకొన్నాడు.

పుచ్చుకోవడమే తడవుగా పెద్దగాలి వీచి బాకా క్రిందపడింది. ఈలోగా. ఆ ఓడ మాకు దూరమౌతూనే ఉంది. మా ఓడ లోని వాళ్ళందరూ, తెల్లతిమింగిలం పేరు చెప్పగానే ఆ బాకా క్రిందపడటం గమనించి, అది అశుభంగా భావించారు. ఆ కొత్త ఓడమీదకి వెళ్ళటానికి పడవ దింపాలని అహాబ్ ఒక్క క్షణం ఆలోచించాడు. కాని పెనుగాలి తీవటంతో ఆగాడు. గాలివాటున ఉండటంవల్లా, ఆ రెండో ఓడ కూడా నన్‌టుకెట్ దేననీ అది ఇంటివైపు వెల్తుందని గమనించడం వల్లా, అతను మళ్ళీ బాగా తీసుకొని అరిచాడు: “ఇది ‘పెకోడ్’ ఓడ, మేము ప్రపంచాన్నంతా చుట్ట పెట్టటానికి బయలుదేరాం. ఇకనుంచి మాకు పసిఫిక్ సముద్రానికే చేరేట్టు ఉత్తరాలు వ్రాయమనండి. మూడేళ్ల లోగా ఇంటికి రాకపోతే ఉత్తరాలని—”

అదే సమయానికి మమ్మ అంటిపెట్టుకొని వస్తూవున్న చిన్న చిన్న చేపల గుంపులు చెల్లాచెదరై ఓడకు దూరమై పోయాయి. ఇటువంటి ఆ దృశ్యము అతని కంటపడే ఉంటుంది. కాని, తదేకధ్యానములో ఉన్నవానికి ప్రతి చిన్న విషయమూ పెద్దదిగానే తోస్తుంది. అహాబ్ నీళ్ళలోకి తొంగి చూస్తూ “నన్ను విడచి వెళ్ళిపోతున్నారా” అని చేపలతో కాబోలు అన్నాడు. ఆ వాక్యోచ్చారణలో అతడిదివరకు ఎప్పుడూ వ్యక్తం చెయ్యని నిస్సహాయత, నిరుత్సాహము వ్యక్తమయినాయి. వెనువెంటనే చుక్కానువద్ద నున్న వాని వైపు తిరిగి అతను తన సహజ గంభీరమైన గొంతుతో

"తిప్పు! ప్రపంచం చుట్టూ ఓడను తిప్పు" అంటూ అరిచాడు.

ప్రపంచం చుట్టూ ప్రదక్షిణట! ఆ మాటలు ఎంత గర్వకారణాలైనా, ఈ ప్రదక్షిణం యొక్క ఫలితమేమిటి? ఎన్ని గండాలో గడచి, తిరిగి మొదటి చోటుకే రావటం!

ఈ ప్రపంచమే చదునుగా ఉంటే, తూర్పువైపుకి ప్రయాణ మారంభిస్తే ఎడతెగకుండా క్రొత్త క్రొత్త ప్రదేశాలు చూడవచ్చు. ఆ ప్రయాణానికి సార్థకత ఉంటుంది. కాని మనం ఊహాప్రపంచంలో ఏవో కలలు కంటూ, ఆ కలలలో కానవచ్చిన వాటికి వెదుకుకొంటూనో, ఒక పెను భూతాన్ని తరుముకొంటూనో ఈ భూగోళం చుట్టూ ప్రదక్షిణం చేస్తూవుంటే మనము ఏ పాడుబడ్డ ప్రదేశమైన చేరుతాము. నట్టేటనైనా మునిగిపోతాము.

—:o:—

40. ఒక లాంఛనము

అహబ్ ఓడ దిగి వెళ్లకపోవటానికి తుఫాను సూచక మైన గాలి కారణమని చెప్పాను. ఒకవేళ ఆ గాలి లేక పోయినా వెళ్లేవాడు కాడు. అతను వేసిన ప్రశ్నకు ప్రత్యుత్తరంగా వ్యతిరేకమైన జవాబు వస్తే అతను వెళ్లేవాడు కాడు. అతను ఏ ఇతర కెప్టెనుతోనూ సఖ్యము పెట్టుకోవటానికి ఉవ్విళ్ళూరేవాడు కాడు. ఎప్పుడైనా సఖ్యము చేయదలచు కొంటే అది తన ధ్యేయమైన తిమింగిలాన్ని గురించి ఆ వ్యక్తి ఏమైనా వివరాలు చెప్పగలడేమోనని ఆశతో మాత్రమే చేయబూనేవాడు. ఈ మాటల అర్థం పూర్తిగా అవగాహన కావాలంటే దేశదేశాలలో కలుసుకొనే తిమింగిలపు వేటల ఓడలు ఒండొంటిని కలిసికొన్నప్పుడు సాధారణంగా అవలంబించే ఆచారాలని తెలుసుకోవాలి.

న్యూయార్కు రాష్ట్రంలోని పైన్ బేరన్సులోగాని అట్లా నిర్మానుష్యమైన ఇంగ్లండునందలి సాలిస్‌బరీ ప్లెయిన్‌లో గాని ఇద్దరు అపరిచిత వ్యక్తులు కలుసుకొన్నప్పుడు వాళ్ళు ఒండొరులను పలుకరించుకోవటం, కొంతసేపు కలిసి విశ్రాంతి తీసికోవటం కద్దు. మరి మానవసంచారంలేని సముద్రాల మధ్య రెండు ఓడలు కలుసుకొన్నప్పుడు ఆ రెండూ దగ్గరకు రావటం, స్నేహ మేర్పర్చుకోవటం ఎంత సహజం! అందు

లోను, ఒకే ఊరికి చెందిన ఓడలూ, అందులోని మనుష్యులు ఒకరినొకరు స్వయంగా ఎరిగివుండటానికి అవకాశమున్నప్పుడు కలిసి కొంతిసేపైనా గడపకుండా ఎట్లా వుంటాయి?

చాలా కాలం క్రితం ఇల్లు విడిచివెళ్ళిన ఓడకు అచిర కాలంలో బయలుదేరి వచ్చిన ఓడ ఏమైనా వార్తలూ, వుత్తరాలూ, ఇతర కాగితాలూ తెచ్చియుండవచ్చు. దానికి ప్రతిగా ఈ కొత్త ఓడకు, పాతఓడ తిమింగిలాల గురించి తాజా వార్తలు ఏమైన చెప్పనూవచ్చు. అంతేకాక, ఒకే లక్ష్యము కలిగి, ఒకే అపాయములకు గురియైయున్న రెండు ఓడలలోని నావికులూ అనేక విషయాలు ముచ్చటించుకో వచ్చు.

ఆ ఓడలు విభిన్నదేశాలకు చెందినా, అమెరికా, ఇంగ్లండు దేశస్థులవలె వాళ్ళు ఒకే భాష మాట్లాడగలిగిన వాళ్ళయితే ఈ పద్ధతికి ఏమీ భంగంరాదు. అయితే ఒకటి, తిమింగిలాల వేటకు వెళ్ళే ఇంగ్లీషువాళ్ళ సంఖ్య చాలా తక్కువ. కావున వాళ్ళలో అటువంటి సమావేశాలు జర గటం అరుదు. ఒకవేళ జరిగినా, ఇంగ్లీషువానికి సహజముగా వుండే ముభావనవల్ల వాళ్లు ఎక్కువ మాట్లాడుకోలేరు. అమె రికావాడు అట్లా కాడు. తాను తప్ప ఇంకెవరూ ముభావ వగా ఉండరనుకొంటాడు. అంతేకాదు. ఇంగ్లీషు వేటగాళ్లు తాము అమెరికన్ వేటగాళ్ళకంటె అధికులమని అనుకొంటూ నన్‌టుకెట్ వేటగాళ్ళను నీటికాపులనీ, పామరులనీ చులకన చేస్తారు. వాళ్ళకు ఈ ఆధిక్యం ఎందుకో నాకు బోధపడదు.

అమెరికా వేటగాళ్ళు ఒక్కరోజులో చంపినన్ని తిమింగిలాలను ఇంగ్లీషువాళ్ళు పదిసంవత్సరాల్లో కూడా చంపలేరు సుమండీ! ఇంగ్లీషు వాళ్ళలో ఈ బడాయిని నన్‌టుకెట్ వాడు అంతగా కాతరుచేయడు. తనకు కూడా కొన్ని దౌర్బల్యాలు ఉన్నాయన్న జ్ఞానం ఆతనికి ఉంది.

ఇంతకూ చెప్పవచ్చిన దేమనగా, సముద్రయానం చేసే ఓడలన్నిటిలోను తిమింగిలాల వేటకి వెళ్ళేవి పరస్పరంఎంతో మైత్రితో ఉండవలసిన అవసరము ఉంది. సాధారణంగా అవి ఆలాగే ఉంటవి. వాణిజ్య నౌకలు అట్లాంటిక్ మహాసముద్రంలో ఒండొంటిని కలుసుకొన్నా అవి ఒక్కమాటైనా ముచ్చటించుకోకుండా ఏమీ ఎరుగనట్టు తమ దారిన తాము పోతాయి. రెండు యుద్ధనౌకలు కలుసుకొన్నాయనుకోండి; ఏవేవో సంజ్ఞలు చేసుకొంటూ, జెండాలు ఊపుకొంటూ కాలం గడుపుతవి. కాని మనసారా ఒక్కమాట కూడా మాట్లాడుకోవు. బానిసలను తీసికొనివెళ్ళే ఓడల తొందర సరే సరి; మాటలాడుకోవటానికి వాటికి తీరిక ఎక్కడ? సముద్రపు దొంగలున్న ఓడలంటారా? ఆ దొంగలు మాట్లాడుకొనే వాక్యం ఒక్కటే: "ఎన్ని తలలు పగులగొట్టారు?" అనేది. ఆ ప్రశ్న వేస్తూనే అంతలో ఎడమైపోతారు. ఆ ఓడలు పాపిజనభూయిష్టాలు. వాళ్ళు తమతమ పాపాలను పోల్చి చూచుకోవటానికి ఇష్టపడ రనుకొంటాను.

కాని, నిరాడంబరము, భక్తిమయము, స్నేహపాత్రము అయిన తిమింగిలపువేట ఓడను చూడండి, వాటా

వరణం సరిగా ఉన్నపుడు ఇట్టివి రెండు ఓడలు కలుసుకొన్నాయనుకోండి : ఏమి జరుగుతుంది? ఒక "గామ్" జరుగుతుంది. ఇది ఏ ఇతర ఓడలమధ్యా జరుగదు. అసలు యీ మాటనే ఇతర నావికులు వినియుండరు. వాళ్ళు ఈ మాట వింటే అర్థంకాక నవ్వుకొని ఏవేవో పిచ్చివ్యాఖ్యానాలు చేస్తారు. అసలు వర్తక నౌకలవాళ్లకు, యుద్ధనౌకలవాళ్లకు, ఓడదొంగలకు; తిమింగిలాల వేటగాడంటే అంత చిన్నచూపెందుకో తెలియదు. ముఖ్యంగా ఓడదొంగ యొక్క వృత్తి ఏ విధంగాను గొప్పది కాదు కదా! ఒక్కొక్కసారి, అసాధారణమయిన ఔన్నత్యంతో వాని జీవితం అంతమవుతుంది, నిజమే. కాని ఆ ఔన్నత్యం ఎక్కడ? ఉరికంబం వద్ద! పైగా ఆ విధంగా పైకి ప్రాకిన వాని ఔన్నత్యం పునాదిలేనిది. తిమింగిలపువేటగాని కంటె తాను పైకి పోగలను అని గొప్ప చెప్పుకొనే ఓడదొంగ తనకు పునాదిలేదని గ్రహించడు.

సరే, ఇంతకూ 'గామ్' అంటే ఏమిటి? నిఘంటువులలో ఎక్కడా ఈ మాట కనబడదు. ఈ మాటకు అర్థం చెప్పేందుకు డాక్టర్ జాన్‌సన్‌కి కూడా తగిన జ్ఞానం లేదు. వెబ్‌స్టర్‌కీ చేతకాదు. కాని, ఇప్పటికి వేలాది అమెరికన్లు ఈ మాటను వాడి ఉంటారు. నిఘంటువులో ఈ శబ్దాన్ని చేర్చవలసిందే. నిఘంటుకారులకు ఉపయోగించేటట్టుగా ఈ పదాన్ని నిర్వచించి నా పాండిత్యం ప్రదర్శిస్తాను.

గామ్ (నామవాచకము): సహవాసేచ్ఛగల రెండు లేదా అంతకంటె ఎక్కువ తిమింగిలపు వేటకు వెళ్ళిన ఓడల సమావేశం; ముఖ్యంగా, వేటస్థలంలో ఒకరి నొకరు పలుకరించుకొన్న తర్వాత ఓడల కెప్టెన్‌లు ఒక ఓడమీద, వాటి ఆఫీసర్లు రెండవ ఓడమీద కలుసుకోవడం.

ఈ "గామ్" లో ఇంకొక చిన్న విశేషముంది. ప్రతి వృత్తికీ ఏవో చిన్న చిన్న ప్రత్యేకతలు ఉంటూనే ఉంటాయి. తిమింగిలపు వేటకీ ఉన్నాయి. దొంగల ఓడకుగాని, యుద్ధ నౌకకుగాని, బానిసల ఓడకుగాని చెందిన కెప్టెన్ తన చిన్న పడవలో సముద్రం మీదికి వెళ్ళవలసి వచ్చినప్పుడు అతను సుఖంగా పడవలో చుక్కానివద్ద ఉండే చిన్న దిండుమీద కూర్చుని వెళ్తాడు. సరదాగా అతనే చుక్కాను చేత బూనుతాడు. "గామ్"కై వెళ్ళేటప్పుడు ఓడమీది వాళ్ళంతా బయల్దేరుతారు కాబట్టీ, మామూలుగా చుక్కానువద్ద ఉండే వాడుకూడా ఆ గుంపులో ఉంటాడు కాబట్టీ, కెప్టెన్‌కి చుక్కాను వద్ద కూర్చునే అవకాశముండదు. అతను పడవలో నిలబడే వెళ్ళవలసి వస్తుంది. తనని రెండు ఓడల జనమూ చూస్తున్నారన్న జ్ఞానంవల్ల కెప్టెన్ మరీ జాగ్రత్తగా నిలబడటానికి ప్రయత్నిస్తాడు. ఇదేమీ తేలికైన విషయం కాదు. వెనుకవుండే చుక్కాను అప్పుడప్పుడు అతని వెన్నుకు తగుల్తూ ఉంటుంది. ముందువైపు తెడ్డుకూడా ఒకోసారి తన దాకా వస్తుంది. ఈ రెంటి నడుమ అతను ఇరుక్కొని పోతాడు. అందువల్లనే కాళ్ళు బాగా నిల్రదొక్కుకొని

నిటారుగా నిలబడతాడు. ఇట్లా నిలబడటం వల్ల ఒకోసారి పడవ కుదుపుకి హఠాత్తుగా బోల్తాపడే ప్రమాదము వుంది. అంతేకాదు, అందరూ చూస్తూ వుండగా ఆసరాకోసం ఈ కెప్టెన్ దేనిని పట్టుకోబూననూ కూడదు. అందువల్లే, ఇటువంటి సమయాలలో అతను తన రెండు చేతులు పంట్లాము జేబుల్లో వుంచుకొని ధీమాగా నిలబడుతాడు. ఎంతయినా, కొన్ని సమయాలలో హఠాత్తుగా గాలి వీచినప్పుడు కెప్టెన్‌లు తమ ముందు కూర్చున్నవాని జుట్టు పట్టుకొని వ్రేలాడిన సందర్భాలు లేకపోలేదు.

41. స్టబ్ చే తిమింగిలపు వధ.

ఆ మరునాడు గాలి కదలకుండా, ఉక్కగా ఉంది. చేసేది ఏమీ లేక మా ఓడమీది వాళ్ళ మందరము, పడు కొందామని అనుకొన్నాము. హిందూమహాసముద్రములో మేము అప్పుడు ప్రయాణము చేస్తున్న భాగము జల జంతు జాల భరితంగా ప్రసిద్ధికెక్కినది కాదు. 'పెరు' ప్రాంతంలో వలె, 'రియోడి ప్లాటా' ప్రాంతంలోవలె, ఇక్కడ గండు మీనులుగాని, రెక్కల చేపలుగాని, మరే ఇతర జలజంతు జాలంగాని కానరాదు,

ఓడ స్తంభంవద్ద నిలబడే వంతు నాదైనది. ఆహ్లాద కరమైన గాలిలో, ఆ స్తంభంవద్ద నిలబడి అటూ ఇటూ ఊగిసలాడుతున్నాను. నా మనస్సు నా తనువుని విడిచి ఎక్కడికో ఎగిరిపోయింది. నా మేనుమాత్రం యాంత్రికంగా అటూ ఇటూ ఊగుతూనే ఉంది. మరి రెండు స్తంభాలవద్ద నిలబడ్డ వాళ్ళుకూడా నా వలెనే బద్ధకంగా ఉన్నట్లు కన బడ్డారు. మేము ముగ్గురమూ అట్లా యాంత్రికంగా ఊగుతూ వుండగా క్రింద చుక్కానువద్ద నున్నవాడు కూడా మా వైపు చూస్తూ జోగుతున్నాడు. సముద్రపు కెరటాలుకూడా డస్సి తలలు వంచాయి. సముద్రము నిదురపోతూ ఉండగా ప్రాగ్దిశ పశ్చిమ దిశను చూచి తల యూచింది. సూర్యుని కూడ పలుకరించింది,

ఉన్నట్టుండి, నా కళ్ళఎదుట నీటి బుడగలు విశేషంగా కనబడ్డాయి. బెదరి, రెండు చేతులతో ఓడ తాళ్లని గట్టిగా పట్టుకొన్నాను. అంతలో అదురుతూనే మళ్ళీ చైతన్యం పొందాను. మా ఓడకి ఎడమవైపుగా నలభై నిలువుల దూరంలో ఒక పెద్ద తిమింగిలం నీటిలో పొర్లుతూ కనబడింది. అది నీటిలో, దెబ్బతిన్న యుద్ధ నౌకవలె ఉన్నది. తీరు బాటుగా నీళ్ళల్లో పొర్లుతూ ఆ తిమింగిలం నోటివెంట నీటి బుడగల జల్లు చిమ్ముతూ ఉంది. ఆ నీటి చిమ్మును చూస్తే ఎవడో ఒక సంపన్నుడు పైపు పీలుస్తూ పొగను నెమ్మదిగా పైకి వదలుతూ ఉన్నట్టుంది. పాపం, ఆ తిమింగిలానికి అదే ఆఖరి ఉల్లాసం.

నిద్రాణంగా ఉన్న మా ఓడ, మంత్రించినట్లు ఒక్క సారిగా చైతన్య పూరితమైంది. అందరూ ఒక్కసారిగా లేచారు. ఓడ నాలుగు మూలలనుంచీ ఇరవై గొంతులు ఒక్కసారి కేకలు వేశాయి. తిమింగిలం నెమ్మదిగా నీటి బుడగలు విడపటం అందరూ చూశారన్నమాట.

"పడవల్ని దించండి!" అని అరుస్తూ అహాబ్ అందరి కంటె ముందు తనే ఆ పనికి పూనుకొన్నాడు.

ఇంతమంది కేకలు విన్నది కాబోలు తిమింగిలం; మెల్లగా కదలి ఈదుకు పోసాగింది. కాని, అది ఎంతో నెమ్మదిగా వెళ్తొండటంవల్ల ఆ కేకలు వినలేదేమోనని కూడా అనిపించి, అహాబ్, ఎవ్వరూ బిగ్గరగా మాట్లాడకూడ దనీ, పడవలను తెడ్లతో నడపకూడదనీ ఆజ్ఞాపించాడు

ముమట్లే పోసాగాము. అంతా నిశ్శబ్దంగా ఉండటంవల్ల తెర చాపలు ఎత్తటానికికూడా అవకాశం లేకపోయింది. మేమిట్లా పోతూండగా, ఆ రాక్షసి తన తోకను నిటారుగా నలభై అడుగుల ఎత్తువరకు నిలిపి, ఒక్కసారిగా మునిగి, కంటికి కానరాకుండా పోయింది.

'అదిగో పోయింది' అన్న కేక వినబడింది. స్టబ్ తన పైప్‌ని ముట్టించబోతూను. కొంత విశ్రాంతి అందరికీ లభించింది. మరికొంత సేపటికి తిమింగిలం మళ్ళీ కనబడింది. స్టబ్ ఉన్న పడవకి సమీపాన ఉండటంవల్ల దానిని పట్టే భాగ్యం తనకే దక్కుతుందని స్టబ్ అనుకొన్నాడు. తిమింగిలానికి కూడా తనని తరుముతున్నారని తెలిసిపోయింది. ఇక నిశ్శబ్దత అవసరమైంది. మేము చిన్న తెడ్లను మాని పెద్ద తెడ్లను ఉపయోగించసాగాము. స్టబ్, తన పైప్ కాలుస్తూనే "కొట్టండి" అని తన అనుచరులను హెచ్చరించాడు!

తిమింగిలంలో పెద్ద మార్పు కానవచ్చింది. తనకు వాటిల్లే ప్రమాదాన్ని గుర్తించింది. ఒకవైపుకి తల యెత్తింది. [1]

---

1 ఎంతో పెద్దదయినా, తిమింగిలపు తలకాయ చాలా తేలికగా ఉంటుంది. తిమింగిలపు శరీరంలో చాలా తేలికైన భాగం అదే: అందువల్లే అతి సునాయాసంగా, దాన్ని గాలిలోకి ఎత్తగలుగుతుంది. ఆ పనిని కూడా తాను అతిరయంగా వెళ్తున్నప్పుడే చేస్తుంది. పైగా, తలకాయ చివరి భాగం ఎంతో వెడల్పుగాను, మొన ప్రాంతంలో కొసుగాను ఉండటంవల్ల తలని ఎత్తినప్పుడు అది చాలా చురుకుగా పోయే రేవులలో వుండే పైలట్ ఓడని పోలి వుంటుంది.

"దాన్ని బెదరగొట్టండి! బెదరగొట్టండి! మీరు తొందర పడకండి! ఉరుములు పడుతున్నట్టు చప్పుడు చేసి బెదరగొట్టండి అంతే!" అని హెచ్చరించాడు. "గట్టిగా కొట్టు తెడ్డుని, టాష్ టెగో! బెదరగొట్టండి దాన్ని – మీరుమాత్రం ఏమీ కంగారుపడవద్దు. మృత్యువు తరుముతున్నట్టు దాన్ని బెదరగొట్టండి! అంతే!"

"ఊ– హూ– ఆ– హీ" అనుకొంటూ పెద్ద కేకలు వేశాడు టాష్ టెగో. ఈ కేకలకు ఆ పడవలోని వాళ్ళంతా ఉత్సాహపూరితులై, తెడ్లు మరీ గట్టిగా కొట్టసాగారు.

"కా– లా! కూ – లూ!" అని క్వీక్వెగ్! తెడ్ల చప్పుడుతో, నావికుల అరుపులతో - పడవలు దూకుతూ పోసాగాయి. స్టబ్ ముందు కూర్చొని తన వాళ్ళని ఇంకా హెచ్చరింపసాగాడు. అందరూ ఎంతో కష్టపడుతున్నారు. చివరికి వినబడింది కేక "టాష్ టెగో! దెబ్బకొట్టు!" అంటూ. ఈటెను విసిరాడు. "అందరూ వెనక్కి ఒదగండి!" మరు క్షణం తీగెను నీటిలోకి వదిలారు.

"తీగెను తడపండి– తడపండి!" అని అరిచాడు స్టబ్. వెంటనే ఒకడు టోపీతో నీళ్ళు తీయటం మొదలుపెట్టాడు. తీగెను గట్టిగా చుట్టి ఉంచారు. పడవ అతివేగంగా పోసాగింది. స్టబ్, టాష్ టెగో ఆ పడవలో స్థావరాలు మార్చుకొని ఒకరు ముందుకి రెండవవారు వెనుకకు వెళ్ళారు.

పడవ పైభాగం పొడవునా ఉన్న ఆ బిగువైన ఇనుప మోకును చూస్తే పడవకి నీటిలో ఒకటి, గాలిలో ఒకటి,

రెండు అడుగు భాగాలు ఉన్నవా అనిపించింది. పడవకు ఇరు ప్రక్కల ఎడతెగని నీటి ఒత్తిడి, సుడిగుండాలు, ఏమాత్రం కదలికైనా పడవ నీటిలోకి ఒరిగిపోయేటట్టుంది. ప్రతివాడూ నీళ్ళల్లోకి పడిపోకుండా ఉండేందుకు తన స్థావరం అంటిపట్టుకొని, వేరొకవంక పడవను నడుపుతూన్నాడు. టాష్టెగో చుక్కానువద్ద బాగా వంగి నిలబడ్డాడు.

"లాగండి, లాగండి" అని స్టబ్ అరిచాడు. తిమింగిలం వైపు మొగమై అందరూ పడవను ఆ వైపే లాగజొచ్చారు. తానున్న చోటునుండి, స్టబ్ ఒకదానివెంట ఒకటి చొప్పున ఈటెలు విసరటం మొదలుపెట్టాడు. పడవకూడా తిమింగిలపు త్రిప్పాలకి అనుగుణంగా తిరగటం ప్రారంభించింది.

ఆ రాక్షసి శరీరంనుండి ఎఱ్ఱని వరదలు కొండలమీద జాలువారే జేగురు సెలయేళ్ళవలె ప్రవహింప జొచ్చాయి. బాధాగ్రస్తమైన దాని శరీరము నెత్తురులో పొర్లుతోంది. ఆ నెత్తురు ఎన్నో ఫర్లాంగుల దూరం పారింది. సముద్ర మధ్యమున వెలసిన ఆ ఎఱ్ఱ సరస్సుమీద పడ్డ సూర్యకిరణాల అరుణకాంతులలో అందరి ముఖాలు ఎఱ్ఱగా జాజువారి కనబడ్డాయి. అంతసేపూ, ఒకదానివెంట ఒకటిగా నీటి బుడగల వరుసలు పైకి వస్తూనే వున్నాయి. స్టబ్ ఈటెలు వేస్తూ—

"దగ్గరగా లాగండి" అని హెచ్చరించాడు; తిమింగిలం యొక్క పరాక్రమం కొంత తగ్గినట్టు కనబడగానే—

పడవ తిమింగిలం ప్రక్కగా వచ్చింది. స్టబ్ తన ఈటెను తిమింగిలం శరీరంలోకి జొప్పించి, దాన్ని త్రిప్పు

తున్నాడు. ఆ తిప్పటం చూస్తే అతను ఆ తిమింగిలం మింగివేసిన ఏ బంగారపు గడియారం కోసమో వెతుకు తున్నట్టు అనిపించింది. కాని అతను వెదికే, ఆ బంగారు గడియారము ఆ తిమింగిలపు ప్రాణమే. అప్పుడు ఈ పోటు, దానికి ప్రాణము పట్టున తగిలింది కాబోలు: తిమింగిలం మత్తు నుండి మేల్కొని నెత్తురులో పొర్లుతూ వెఱ్ఱిగా నీటి జల్లుని విడువ మొదలుపెట్టి ఆ తుంపర తెరలో తన్ను తాను కప్పి వేసుకొంది. అభేద్యమైన ఆ వ్యూహంలో చిక్కుకొనిపోయిన పడవ తప్పించుకొని బయటపడటం దుర్ఘటమైంది.

మరి కొంతసేపటికి, తిమింగిలం మళ్ళీ కనబడింది. బాధతో రొప్పుకొంటూ, కరడుగట్టిన నెత్తురు ముద్దలుగా బయటకు ఎగురజొచ్చింది. ఎగిరి ఎగిరి వెల్లకిల పడిపోయి నిశ్చేష్టమైపోయింది.

డాగో, "అది చచ్చింది స్టబ్" అన్నాడు. "అవును, రెండు పైపులూ ఆరిపోయాయి" అంటూ తన నోటిలోని పైప్‌ను తీసి నుసిని నీటిలో విదిలిస్తూ తనచేత హతమైన ఆ కళేబరాన్ని తదేక దృష్టితో చూశాడు.

—:o:—

42. వ్రేటు

పూర్వాధ్యాయములో వర్ణింపబడ్డ వేటలో ఒక్క అంశాన్ని గురించి ఇక్కడ వివరిస్తాను.

తిమింగిలాల వేటయొక్క ఆచారం ప్రకారం వేటకై వెళ్లే పడవ, ఓడ దగ్గరనుంచి విడివడి పోతుంది. ప్రధాన నావికుడు చుక్కానువద్ద వుంటాడు ఈ పడవకు; ముందర తెడ్డువేస్తూ వేటగాడుంటాడు. తిమింగిలం మీదకి మొదటి ఈటెను విసరటానికి ఎంతో బలమున్నవాడు కావాలి. ఎందుకంటే, బరువైన ఆ ఆయుధాన్ని రమారమి ఇర్వది ముప్పది అడుగుల దూరానికి విసరాలి గనుక! తిమింగిలమును ఎంత దూరం తరుమవలసి వచ్చినా ఈ వేటగాడు తెడ్డు వేస్తూనే వుండాలి. అంతేకాదు, అతను అతిమానుషమైన శక్తితో ప్రవర్తించవలసి వస్తుంది. ఒకపంక తెడ్డు వేస్తూ తన శక్తినంతా ప్రదర్శించాలి. శరీరమందలి ప్రతి నరమూ విరిగి పోతూండగా, పెద్దపెట్టున కేకలు వేయటమంటే ఏమిటో ఆ అనుభవమున్న వారికిగాని తెలియదు. నా మట్టుకు నేను, ప్రాణానికి తెగించి పనిచేస్తూ, అదే సమయంలో పెద్ద కేక వేయలేను. వేటగాడు ఈ విధంగా నడుం విరగకొట్టుకొంటూ గొంతుక చించుకొంటూ ఉన్న సమయాన వింటాను "నిలబడు! దెబ్బ వెయ్యి" అన్న కేకను.' ఆ కేక వినబడగానే అతను తెడ్డు అవలపెట్టి, వెనుకకు తిరిగి, ఒక కొయ్య కుదు

టిలో పెట్టియున్న ఈటె తీసికొని శరీరంలో మిగిలియున్న సత్తువకొద్దీ ఆ ఈటెను తిమింగిలం మీదికి విసురుతాను. అందువల్లనే ఎందరు వేటగాళ్ళున్నా వాళ్ళు విసిరే ఈటెలలో కొన్ని మాత్రమే గురితప్పకుండా తాక గల్గుతవి. ఎందరో ఈటెగాళ్ళు గురి తప్పినందుకు చివాట్లు తింటూ వుంటారు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. వాళ్ళు నరాలు తెగించుకొని పాటుపడినా నాలుగేండ్లలో నాలుగు పీపాల నూనె మాత్రమే సంపాదించి కొందరు తిరిగిరావటంలో నూ ఆశ్చర్యం లేదు. ఓడ యజమానులకు, తిమింగిలపు వేట అంత లాభసాటి వర్తకం కాదంటే వింత మేముంటుంది ? అసలు, ఈటెగాడే ఈ వేటకు ప్రాణప్రదం. అతని ప్రాణాన్ని ముందే తోడేస్తే, అవసరమైనప్పుడు ఎక్కడనుండి వస్తుంది ?

పోనీ, వేటు సరిగానే పడిందనుకోండి, దెబ్బ తగులగానే తిమింగిలం పారిపోవటానికి ప్రయత్నిస్తుంది. ఆదే సమయానికి చుక్కానవద్ద నున్నవాడు, ఈటెగాడూ కూడా ముందు వెనుకలకు పరుగెత్త నారంభిస్తారు. ఆ విధంగా చెయ్యడంవల్ల వాళ్ళకి, ఇతరులకికూడా ముప్పు వస్తుంది. ప్రధాన నావికుడు పడవ ముందుకు చేరుకొంటాడు. ఇతరులేమన్నా సరే, నా ఉద్దేశంలో, ఈ తతంగమంతా అవివేకము, అనవసరమును. ప్రధాన నావికుడు ఎప్పుడూ పడవ ముందే ఉండాలి. అతను కూడా ఈటెలు విసరగలిగి వుండాలి. అత్యవసర సమయాలలో తప్ప ఇంకెప్పుడూ పడవను నడుపకూడదు. దీనివల్ల వేటకు కావలిసిన వేగం కొంత తగ్గవచ్చు.

అయినా, ఈ వేగం తగ్గినంత మాత్రాన వేట విఫలంకాదు. అది ఈటెగాళ్ళ అలసటవల్ల విఫలమౌతుంది. ఈటె విసరటంలో అత్యంత సమర్థత కావాలంటే, ఈటెగాళ్లు అలసి పోయి ఉండరాదు.

43 ఈటెల గూడు

వృక్షము మొదటినుండి శాఖలు, శాఖలనుండి ఉప శాఖలు, వానినుండి రెమ్మలు పెరుగుతూంటాయి. అల్లే కొన్ని సృజనాత్మక రచనలలో అధ్యాయాలు పెరుగుతూంటాయి.

క్రిందటి అధ్యాయంలో ఈటెను పెట్టుకొనే కర్రను గురించి ప్రస్తావన వచ్చింది. దాని వివరమిది: ఆ కర్ర రెండడుగులుంటుంది. పడవకు లోపలి భాగాన అడ్డంగా అమర్చబడి ఉంటుంది. ఈటె యొక్క పిడిని ఈ కొయ్యమీద పెడతారు. ఈటె యొక్క మొన రెండవవైపున ఉంటుంది. దీనివల్ల ఈటెగాడు క్షణాలలో ఈటెను తీసికోవటానికి వీలవుతుంది. ఈ చెక్కలమీద రెండు ఈటెలను జంటగాపెట్టి ఉంచటం మామూలు. ఈ రెండు ఈటెలకూ ఉండే తాళ్ళను పడవ ప్రక్కగా వుండే ఇనుపమేకుకి విడివిడిగా కట్టుతారు. దీనివల్ల రెంటిని ఒకదాని వెంట ఒకటి విసురుటకు వీలవుతుంది. ఒకటి తిమింగిలాన్ని తప్పిపోయినా రెండవదానిని వెంటనే ప్రయోగించవచ్చు. కాని సాధారణంగా, మొదటి ఈటె తగులగానే తిమింగిలం చెందే ఆకస్మిక భయ సంక్షోభంవల్ల ఈటెగాడు ఎంత నేర్పరి అయినా రెండవ ఈటెను విసరటం దుష్కరం! ఏమైనా సరే, ఆ రెండో ఈటెను ఏలాగో ఒక

లాగ విసరి తీరాలి. లేకపోతే చాలా ప్రమాదం. అందువల్లనే ఒక్కొక్కసారి ప్రాణాపాయం కల్గటం కద్దు.

అంతేకాదు, ఈటె వాడియైన ఆయుధం కావటంవల్ల రెండవ ఈటెను విసరగానే పడవకు ఉండే ఇనుపమోకును తెంచివేసే అవకాశం ఉంది. ఆ ఈటె, పడవకీ తిమింగిలానికీ మధ్య వేలాడుతూ వుంటుంది. సాధారణంగా, తిమింగిల శరీరం సజీవంగానో, నిర్జీవంగానో వశమైతే తప్ప రెండవ ఈటె మరల చేతికిరాదు. నాలుగు పడవలు అత్యంత బలము గల ఒక తిమింగిలము, వెంటపడి తరుముతూ వెళ్ళటంలో తటస్థించే అనిర్వచనీయములైన అనేక సంఘటనలను, ఎనిమిదో పదో వేలాడుతున్న ఈటెలను మనస్సులో చిత్రించుకోండి. ముందు ముందు వర్ణింపబోయే విషయాలు మీకు సులభ గ్రాహ్యాలు అవుతవి.

44. స్టబ్ భోజనం

ఓడకు కొంత దూరంగా స్టబ్ చే వధింపబడిన ఆ తిమింగిలాన్ని మూడు పడవలు జతచేసి "పెకోడ్" వద్దకు తీసుకొని రాసాగాము; ఈ మూడు పడవలలో వున్న పద్దెనిమిది మంది తమ ముప్పది ఆరు చేతులూ వేసి గంటల తరబడి లాగుతూంటే పర్యవసానంగా దాని శరీరం కొద్ది కొద్దిగా కదలటం మొదలుపెట్టింది. చైనాలో హోంగ్-హో కాలువమీద వెళ్లే పడవలను ఒడ్డుమీద నుండి నలుగురైదుగురు గంటకు ఒక మైలు చొప్పున లాగుతారట! కాని మేము లాగే ఆ కళేబరం సీసంతో నింపబడ్డ పాణాగయంత బరువు వుండటంచేత తేలికగా కదలిరాదు.

చీకటి పడింది. 'పెకోడ్' నుండి వెలువడే మూడు దీపపు కాంతులవల్ల మాకు దారి కనబడింది. ఓడను సమీపించగానే అహాబ్ కనబడ్డాడు. అతను ఇంకొక దీపాన్ని అందిచ్చాడు. ఆ తిమింగిలాన్ని నిర్లిప్తంగా చూసి, దానిని భద్రపరచటానికి ఆజ్ఞలు జారీచేసి తనదారిన తాను గదిలోకి వెళ్ళిపోయాడు. మరునాటి ఉదయం వరకూ అతను బయటకు రాలేదు.

ఆ తిమింగిలాన్ని వేటాడుతున్నప్పుడు అతను పర్యవేక్షణ జరిపినమాట నిజమే, కాని, చివరికి ఆ తిమింగిలం చచ్చి పడిపోయిన తరువాత అతనిలో ఏదో అసంతృప్తి నిరాశ, అసహనము గోచరించాయి. ఒకవేళ ఈ కళేబరాన్ని చూడగానే, అతనికి, "మోబీడిక్" సజీవంగా ఉన్నదన్న

మాట స్ఫురణకి వచ్చిందో, లేక, ఎన్నివేల తిమింగిలాలని ఈ విధంగా చంపి తెచ్చినా తాను ఆశించిన ప్రయోజన మేమీ నెరవేరదని అనిపించిందో! ఆ తరువాత కొంత సేపటికి అందరూ లంగరు వేసే ప్రయత్నంలో ఉన్నట్టు కనబడ్డారు. ఆ గొలుసుల చప్పుడు వింటే, ఓడకే లంగరు వేద్దామను కుంటున్నారేమో అనిపించింది. కాని ఆ గొలుసులను తిమింగిలాన్ని బంధించటానికై దించారు. దాని తలను ఓడ ముందు భాగానికి, తోకను ఉపరిభాగానికి వేసి బిగించారు. ఓడ ప్రక్కగానే తిమింగిలం ఉండటంవల్ల రాత్రి చీకటిలో ఆ రెండూ (ఓడా, తిమింగిలమూను) కాడికి కట్టిన రెండు పెద్ద ఎద్దులలో ఒకటి నిలబడి యున్నట్టు, రెండవది ప్రక్కకు ఒరిగి ఉన్నట్టు కనబడ్డాయి. ♦ 1 మాకు తెలిసినంతవరకు అహాబ్ చాలా ప్రశాంతంగా ఉన్నాడు. స్టబ్ మాత్రం

---

1. ఇక్కడో చిన్న విషయం చెప్పాలి. తన ప్రక్కనే ఉన్న తిమింగిలాన్ని బాగా పట్టుకోవటానికి ఓడకు అనువైన స్థలము, ఆ తిమింగిలపు తోక. ఆ తోక చాలా బరువుగా ఉంటుంది. తిమింగిలంలో ఏ ఇతర భాగముకంటె కూడా బరువుగా ఉంటుంది. పైగా తిమింగిలం చని పోయిన తర్వాత కూడా అది బిగుసుకు పోదు. కనుక అది నీటిలో జారి పోయే అవకాశమూ ఉంది. అట్టి తోకచుట్టూ గొలుసు త్రిప్పి కట్టవలె నంటే మానవుని చేయి చాలదు. ఈసమస్యని తమాషాగా పరిష్కరిస్తారు. ఒక చిన్న తీగెను తయారుచేసి దాని చివర కొయ్యముక్కను ఉంచుతారు. మధ్యలో ఏదో ఒక బరువు పెడ్తారు. రెండవ చివరని ఓడకు తగిలిస్తారు అతి చతురతతో కొయ్య ముక్కను రెండవ వైపుకి వచ్చేట్టు చేస్తారు. ఈ విధంగా ఒకసారి చుట్టు తిరగటం వల్ల వెనుకనే గొలుసును కూడ వేస్తారు. ఈ గొలుసును తోక అతి సన్నగా ఉండే భాగంలో బిగిస్తారు.

విజయ గర్వంతో ఎంతో హడావుడి చేశాడు. సహజ గంభీరుడైన స్టార్‌బక్ అతనిపై అధికారి. అతడు స్టబ్ సంగతి చూచి, ఓడ పెత్తనమంతా స్టబ్‌కే విడిచివేశాడు. స్టబ్ యొక్క సంబరపాటుకు ఒక కారణ మేమిటో తర్వలోనే బయట పడింది. అతను భోజనప్రియుడు. అతని జిహ్వాకు తిమింగిలపు మాంసం ఎంతో రుచిస్తుంది. "నేను పండుకొనేలోగా కొద్దిగా పులుసు కావాలి. డాగో! నీవు క్రిందికి వెళ్ళి చిన్న ముక్కను కోసి పట్టుకరా" అన్నాడు. ఈ వేటగాళ్లు, వేట ముగిసే వరకూ యీ విధంగా భక్షించక పోయినా, అప్పుడప్పుడు స్టబ్ కోరినట్లు, తిమింగిలపు చివరిభాగాన్ని కొందరు అభిలషిస్తూ ఉంటారు. ఆ వంటకం తయారయ్యేప్పటికి అర్ధరాత్రి అయింది. తిమింగిలపు నూనెతో వెలిగింపబడిన దీపపు కాంతిలో కూర్చొని స్టబ్ తన భోజనం మొదలుపెట్టాడు. అతనే కాక ఆ తిమింగిలంమీద పడుకొనియున్న వందలకొలది సొరచేపలుకూడ విందుకు ఉపక్రమించాయి. ఓడ దిగువ భాగాన పడుకొన్న నావికులకు ఈ సొరచేపలు చేసే చప్పుడు ఆశ్చర్యం కలిగించింది. వాటిని చూచి వాళ్ళు మరీ ఆశ్చర్యపడ్డారు. ఆ తిమింగిలపు కొవ్వును ఒకొక్క సొరచేప, మనిషి తలకాయంతేసి ముద్దలు దేవుకొంటున్నాయి. అవి తిమింగిలములో నుంచి అటువంటి గుండ్రని ముద్దలు ఎట్లా తీసికొంటారో మాకు తోచలేదు. అదీగాక, వాటివల్ల తిమింగిలం మీదపడే గాట్లు చూడగా, వడ్రంగి ఉలితో కొయ్యను తొలిచే మాదిరిగా ఉన్నాయి.

సముద్రాల మీద జరిగే పోరాటాల వెంట సొర చేపలు గుంపులు గుంపులుగా చేరి ఒకొక్క మనిషి చచ్చి నీటిలో పడుతూవుంటే ఆ శవాన్ని కబళించేందుకు తయారవుతాయి. మానవులు ఒకరి నొకరు విచ్చు కత్తులతో సంహరించు కొంటూ వుంటే ఆ కళేబరాల కోసం సొరచేపలుకూడా తమ వాడియైన పళ్ళతో పోట్లాడుకొంటూంటాయి. పైనా, క్రిందాకూడా ఒకే రకమైన వేట సాగుతూవుంటుందన్నమాట; అట్లాంటిక్ మహాసముద్రముమీద ప్రయాణం చేసే బానిసల ఓడ వెంటే ఈ సొరచేపలు వెళ్ళుతూవుంటాయి. ఆ బానిస లలో ఎవడైనా చచ్చిపోతే, అవే ఆ శవానికి సంస్కారం చేస్తాయి. మరి ఏ యే ఇతర సందర్భాలలో, సొరచేపలు గుంపులు గుంపులుగా తారసిల్లుతవో చెప్పవచ్చు కాని అవి తిమింగిలపు కళేబరంచుట్టూ చేరినట్టు, అసంఖ్యాకంగా, ఆనంద పూర్వకంగా ఇంకెక్కడా చేరవు. అటువంటి దృశ్యం మీ రెప్పుడూ చూచి యుండకపోతే, భూత శాంతులను గురించి భూతారాధనను గురించి తొందరపడి ఏ విధమైన సిద్ధాంతా లను చేయకండి.

అంతవరకూ స్టబ్ కు క్రింద జరుగుతూన్న గందరగోళం తెలియనేలేదు. అతను కాళ్ళుపారచాచి, ఇంకా బాగా తిన టానికి వీలయేట్టుగా కూర్చుని, ఆ వంటకంలోకి తన ఫోర్కుని గుచ్చి, వంటవానికోసం కేకలు వేశాడు. "ఎవ డయ్యా వంటవాడు! ఫ్లీస్! ఇలా దయచెయ్యి ఒక్కసారి!"

అర్ధరాత్రివేళ, నిద్రలేపి తనచేత ఆ వంటకం చేయించి నందుకు అసలే చిరాకుగా ఉన్న ఆ నీగ్రో వంటవాడు కుంటు కుంటూ వచ్చి, స్టబ్ సమీపాన చేతులు జోడించుకొని, చెవియొగ్గి నిలబడ్డాడు.

"ఏమయ్యా! ఈ మాంసపు ముక్కను మరీ మాడ్చి వేశావు! ఇంతగా మాడ్చకూడదని ఎన్నిసార్లు చెప్పాను! క్రింద ఆ సొరచేపలు చూడు: అవి ఎంత గట్టిముక్కలను తింటున్నాయో! అవి ఎంత గోలచేస్తున్నాయో చూడు! వాటి దగ్గరకు వెళ్ళి- "తింటే తిన్నారుగాని గోల చెయ్య వద్ద"ని చెప్పు! అవి చేసే గోలకి నా మాటలు నాకే వినబడటంలేదు. వెళ్లు- నామాట వాటికి చెప్పి బోధపరచు" అంటూ, ప్రక్కన ఉన్న ఒక దీపాన్ని వంటవాని చేతికి ఇచ్చాడు.

ఆ దీపాన్ని కోపంతో అందిపుచ్చుకొని ఫ్లీస్, ఓడ అంచులవైపు కుంటాడు. ఒక చేతితో దీపాన్ని నీళ్ళవైపుకి దింపి, రెండవ చేతితో తన పటకారుని అటూ ఇటూ ఆడిస్తూ ఆ సొరచేపల సమూహాన్ని ఉద్దేశించి-

"ఇదిగో చూడండి! మీరా చప్పుడు మానేయాలి అని ఆజ్ఞ! మీ కెంతకావాలో అంతా తిని చావండి. కాని ఆ విధవగోల చెయ్యకండి! ఆఁ ఇది స్టబ్ గారి ఆజ్ఞ!" అన్నాడు.

స్టబ్ ఆ మాటలకు అడ్డువచ్చి, "నిన్ను- వాటికి బోధ పరచమన్నాను- వాటిని అలా అలా తిట్టితే ఎలా! పాపులను సంస్కరించే విధం అది కాదయ్యా!" అన్నాడు.

"మరేమిటి! అయితే నీకే బోధపరచుకో" అని వంట వాడు తిరిగి వెళ్ళిపోసాగాడు.

"పోనీలే- ఏదో కానీ-" అని సర్దుకొన్నాడు స్టబ్.

సొరచేపల వైపు తిరిగి మళ్ళీ మెల్లగా మొదలు పెట్టాడు వంటవాడు.

"సొరచేపలూ! మీరంతా తిండిపోతులే - తిండిపోతులైతే ఫరవాలేదు_ కాని_ కాని- ఆ విధమగోల ఏమిటి? అంత గోలచేస్తుంటే మాట ఎలా విందామనుకొంటున్నారు!" అని అంటూ ఉంటే, మళ్ళీ స్టబ్ అడ్డుతగిలి, "అలా తిడుతూ మాట్లాడకయ్యా- మర్యాదగా చెప్పు వాటికి" అన్నాడు.

మళ్ళీ పాఠం మొదలైంది.

"మీరు తిండిపోతులైనందుకు నేనేమీ అనను- అందులో తప్పేమీ లేదని ఒప్పుకొంటా- కాని ఆ గుణాన్ని అదుపులో పెట్టుకోవాలి. పెటుకొన్నారో- మీరు దేవతలైపోతారు. కొద్దిదిగా మర్యాదగా వుండటానికి ప్రయత్నించండి- అంతే నేననేది. ఆ తిమింగిలం మీదపడి తినేటప్పుడు పక్కవాని జేబు కొట్టివెయ్యకండి- అసలు ఆ తిమింగిల మీ సొత్తు కాదామె! మీకు పెద్ద పెద్ద నోళ్ళున్నాయి. సరే కాని మీ పొట్టలు చిన్నవే కదా! ఆ కొవ్వును మీరు కొంచెం కొంచెం చొప్పున తీసుకోండి" అంటూ ఉండగా స్టబ్- "భేష్! బాగుంది- నీ చెప్పేతీరు" అన్నాడు.

"మొత్తుకున్నట్టే ఉంది వాటికి చెప్పడం - అవేమీ ఆ గోల మానవు, ఒక్కమాట వినవు. ఆ పొట్టలకు అడుగు

అంటూ ఏమీలేదు. పొట్టలు నిండారా, అవి అడుగుకు వెళ్ళి పడుకొంటాయి. ఎవరు ఏమన్నా సరే అవేమీ పట్టించుకోవు" అన్నాడు.

"నాకూ అలాగే అనిపిస్తోంది. సరే, వాటిని ఆశీర్వదించు- నేను భోజనముకు వెళ్ళుతాను"

తన రెండు చేతులు ఆ చేపలమూక పైకి ఎత్తి "మీ ఇష్టం వచ్చినట్టు తినండి. పొట్టలు పగిలి చచ్చేట్టు తినండి" అన్నాడు.

స్టబ్, "ఆయిందా, ఇలావచ్చి నిలబడు" అన్నాడు. ఫ్లీస్ మునుపటివలె వచ్చి నిలబడ్డాడు.

భోజనాన్ని కానిస్తూ, "పులుసు సంగతి అడుగుదామనుకొంటున్నాను— అసలు నీ వయస్సెంత?— ముందు అది చెప్పు" అన్నాడు.

"ఈ పులుసుకీ నా వయస్సుకీ ఏమిటి సంబంధం?"అని గట్టిగా అడిగాడు వంటవాడు-

"నోరు మూసుకో- నీ వయస్సెంత ?"

"తొంభై కాబోలు" అంటూ వంటవాడు గొణిగాడు. "అయితే- దాదాపు వందేళ్లు గడిపావన్నమాట గాని తిమింగిలం పులుసు కాచటం చేతకాలేదన్నమాట" అంటూ మరోముద్ద నోట వేసుకొని, "ఎక్కడ పుట్టావు?" అని అడిగాడు.

"రోనూక్‌లో, రేవు పడవలో పుట్టానంటారు."

"పడవమీదా? బాగుంది - కాని నే నడిగింది ఏ దేశంలో పుట్టావని"

"రోనూక్ లో అని చెప్పలేదా?"

"చెప్పలేదులే _ దానికేమిలే! నీవు మళ్ళీ వెళ్ళి ఇంకోసారి పుట్టాలి ఫ్లీన్- నీకు తిమింగిలాల పులుసు కాచట మెలాగో ఇంకా చాతకాలేదు-"

"ఇంకోటి వండటం నా వల్లకాదు" అనుకొంటూ కదలబోయాడు వంటవాడు.

"ఇలా తిరిగి రావయ్యా- ఆ పట్కారు ఇలా అందియ్యి- ఈ ముక్కని తీసికొని చూడు! వండేవిధం ఇదేనా చెప్పు తర్వాత?" అని ఒకముక్క ఇచ్చాడు.

ఆ ముసలివాడు రుచిచూచి, "దీనికేం-ఇంత చక్కగా ఉన్నదాన్ని నే నెప్పుడూ తినలేదు - చక్కగా మెత్తగా ఉంది" అన్నాడు.

స్టబ్ మళ్ళీ లేచి, "నీవు చర్చికి వెడుతూవుంటావా?" అని అడిగాడు.

"ఒకసారి కేప్టవున్ లో చర్చి పక్కనుంచి వెళ్లాను" అని గొణిగాడు ముసలివాడు.

"అలా వెళ్ళేప్పుడు లోపల ఫాదరీ చెప్పేమాటలు వినే ఉంటావు కదా- అవి విన్నాకకూడా ఇక్కడికి వచ్చి ఈ పచ్చి ఆబద్ధమాడుతున్నావన్నమాట- ఎక్కడికి వెడదామను కొంటున్నావ్?" అని అడిగాడు.

"పక్క మీదికి"

"ఇప్పుడు కాదు. చచ్చాక ఎక్కడికి వెడదామను కొంటున్నావు? అదీ నే నడిగేది"

"ఈముసలివాడు ఎక్కడికీ వెళ్ళడు. వీణ్ణి తీసికొని వెళ్ళటానికి ఒక దేవదూతే వస్తాడు"

"తీసికొని వెళ్ళటానికే! నిన్నే! బండీ, గుఱ్ఱాలూ వస్తాయన్నమాట– ఎక్కడికి తీసుకవెడతారు?"

"పైకి అక్కడికి" అంటూ పట్టుకారుతోనే చేతులు తలపైకి ఎత్తి చూపించాడు.

"అయితే, చచ్చిపోయి, మన ఓడయొక్క పైతుది భాగం చేరుకొంటావన్నమాట! కాని పైకి ఎక్కిన కొద్దీ చలిగా ఉంటుందని తెలుసునా?"

విసుగ్గా అన్నాడు ఫ్లీన్; "నేనా మాటలేమీ అన లేదు" అని. "నువ్వేగా పైకి వెళ్తానన్నావ్? నీ పట్కారు ఎటువైపు చూపిస్తుందో చూడు. ఓడ స్తంభంలోనుంచి స్వర్గానికి వెళ్ళిపోతా మనుకుంటున్నావేమో - అది అంత తేలిక కాదోయ్! మనవంటి వాడెవ్వడూ ఇంతదాకా స్వర్గానికి వెళ్ళలేదు- తెలుసా? దానికేమిలే ఆ పట్కారుని దించేసి నేను చెప్పేది విను- నేను మాట్లాడేటప్పుడు ఒక చేతితో టోపీని పట్టుకొని, రెండో చేతిని నీ గుండెలమీద ఉంచుకొని మరీ విను. ఆ కేమిటి అక్కడ పెట్టావు చెయ్యి? అక్కడేముంది? నీ గుండెలు కావే– అది నీ పొట్ట. పైకి పోనీ చేతిని– అదిగో, అది–సరే నే చెప్పేది శ్రద్ధగా విను."

"వింటాను" అంటూ రెండు చేతులు స్టబ్ చెప్పిన విధంగా పెట్టుకొని తల అటూ ఇటూ ఊపాడు.

"నీవు కాచిన యీ పులుసును చూడగానే అవతల పెట్టివేశాను. అంత అసహ్యంగా ఉంది మరి— ఇంకోసారి ఎప్పుడైనా నాకోసం ప్రత్యేకంగా ఈ పులుసు చేసేటప్పుడు దాన్ని మాడ్చివేయకుండా ఉండాలంటే ఏమి చేయాలో చెప్పుతాను— సరే, రేపు ప్రొద్దున మేము తిమింగిలంను కోసేప్పుడు నీవుకూడా ఇక్కడే ఉండు. దాని రెక్కల అంచులు తీసి ఊరవేయి. సరే—ఇంక వెళ్ళు—"

ఫ్లీస్ మూడడుగులు వేశాడో లేదో అతనిని మళ్లీ పిలిచి, "రేపు రాత్రి నాకు కట్‌లెట్‌లు కావాలి— సరే వెళ్ళు— ఆగు! వెళ్లేటప్పుడు సలాము పెట్టి మరీ వెళ్ళు—ఇదిగో ఇంకొకమాట— ప్రొద్దున్నే తిమింగిలం మాంసంతో చేసిన కూర కావాలి— మరచిపోకు"

"నేను తిమింగిలాన్ని తినేకంటె తిమింగిలం వీడిని తిని వేసి ఉంటే బాగుండిపోను! వీడే పెద్ద సొరచేపలాగ ఉన్నాడు" అని సణుగుకొంటూ తన పక్కవైపు నడిచాడు.

45. తిమింగిలపు వంటకం

తన దీపాలకి కావలసిన నూనెను ఇచ్చే ప్రాణికే మాంసమును భక్షించటం విడ్డూరమే. ఈ అలవాటును గురించి కొంత ప్రస్తావించాలి.

మూడు శతాబ్దాల క్రితం తిమింగిలపు నాలుక ఎంతో రుచికరమైన పదార్థంగా ఫ్రాన్సులో పరిగణింపబడినట్టు, దాని ఖరీదు ఎంతో అధికంగా ఉండినట్టు, చెప్పటానికి ఆధారాలున్నాయి. ఎనిమిదవ హెన్రీ కాలంలో ఒక వంటవానికి, అతను తిమింగిలపు జాతి జంతువుయొక్క మాంసంతో తయారుచేసిన వంటకానికై, గొప్ప పారితోషికము లభించిందట! ఈ జంతువులు ఈ నాటికీ రుచికరమైన భోజ్యాలుగా పరిగణింపబడతాయి. వీటి మాంసమును బంతులవలె చేస్తారు. బాగా పక్వమొందనిచ్చి మంచి సుగంధ ద్రవ్యాలను కలుపుతారు. అవి తాబేలు మాంసపు ఉండలవలె ఉంటాయి. డన్ ఫెర్మ్‌లైన్ లోని మతగురువులకు వీటిమీద ఎంతో మక్కువయట! వాళ్లకు ప్రభుత్వమువద్దనుండి ఈ జంతువులు ఖరీదు లేకుండ లభించేవట.

తిమింగిలపు వేటగాళ్ళందరూ దాని మాంసం మంచి రుచికరమైన పదార్థంగానే ఒప్పుకొంటారు. కాకపోతే, అంత భారీగా, వంద అడుగుల పొడవుండే ఆ మాంసపు పర్వతాన్ని చూస్తే ఆకలి చచ్చిపోతుంది. ఇటువంటి ఏ అభ్యంత

రమూ లేని స్టబ్ వంటివాళ్ళు తప్ప ఇంకెవ్వరూ తిమింగిలపు మాంసం కొరకు ఆశపడరు. ఎస్కిమోలకు మాత్రం అటు వంటి అభ్యంతరాలు వుండవు. వాళ్లంతా తిమింగిలాలమీదే ఆధారపడుతా రన్నది అందరికీ తెలిసిన విషయమే. పైగా వాళ్లు తిమింగిలాల నూనెను, బాగా పాతపడినదానిని, దాచు కొంటారు కూడాను. వాళ్ళలో అత్యంత ప్రసిద్ధికెక్కిన వైద్యుడు, జోగ్రాండా పసిపిల్లల బలానికై, తిమింగిలపు క్రొవ్వు ఎంతో మంచిదని అంటూ వుంటాడు. ఈ సంద ర్భంలో వెనుక గ్రీసులాండులో ప్రమాదవశాత్తూ నిలిచిపో వలసి వచ్చిన ఇంగ్లీషువాళ్ల సంగతి ఒకటి గుర్తు వస్తోంది. వాళ్ళు ఎన్నో నెలలపాటు తిమింగిలాల క్రొవ్వు పూర్తయి పోగా వాటి డొక్కలనే తిని బ్రతికారట. ఈ డొక్కలకు హాలెండు దేశపు తిమింగిలాల వేటగాళ్ళు ఒక ప్రత్యేకమైన పేరు పెట్టుకొన్నారు కూడాను. వాటిని చూస్తే ఎటువంటి వారికైనా నోరూరుతుంది.

నాగరికులు ఆహారపదార్థంగా తిమింగిలాన్ని స్వీకరిం పరు. దానికి కారణం, దాని విలువ! సముద్ర జంతువులలో కెల్ల అది పెద్దది కావటం, ఎంతో క్రొవ్వు కలది కావటం వల్ల మోటు జంతు వనిపించుకొంది. దాని వెన్నుమీది మూపురం చూడండి. ఎనుబోతు మూపురమంత వుంటుంది కాని, ఎనుబోతు మూపురం ఎంత రుచ్యంగా భావింపబడు తుందో, తిమింగిలపు మూపురం అంత ఏవగింపు కలిగిస్తుంది. దీనికి కారణం అది క్రొవ్వుతో నిండిన చిన్న పర్వతంలాగ

వుండటం, కాని, తిమింగిలపు చర్మం క్రింద చక్కగా,
తెల్లగా వుండే ఆ క్రొవ్వును చూడండి: లేత కొబ్బరివలె
వుంటుంది. చాలామంది తిమింగిలపు వేటగాళ్ళు ఈ క్రొవ్వును
ఏదో విధంగా తింటూవుంటారు రాత్రిళ్లు కాపలా కాస్తూం
డేప్పుడు, వీళ్ళు తమ బిస్కట్లను తిమింగిలాల నూనెలో
వేయించుకొని తింటూంటారు. అటువంటి భోజనం నేనూ
చాలాసార్లు చేశాను.

చిన్న తిమింగిలానికి ఉండే మెదడు చాలా రుచిగా
ఉంటుంది. పుర్రెను బయటకు తీసి గొడ్డలితో పగుల గొడ్త
తారు. దానితో రెండు తెల్లని ముద్దలు బయట పడుతాయి.
వీటిని పిండితో కలిపి వండుతారు. ఈ వంటకము ఆవుదూడల
తలతో వండే వంటకాన్ని పోలివుంటుంది. ఆవుదూడ తల
కాయ కొందరి భోజనప్రియులకు అత్యంత ప్రీతి... వారిలో
కొందరు ఆ తలకాయలు తిని తినీ ఆ దూడల బుద్ధులనే అల
వర్చుకొంటారు. వారు తమ తలకాయలను బట్టే, దూడ
తలలను గుర్తుపట్టే శక్తిని సంపాదించుతారు. ఎదుట దూడ
తలకాయ ఉంటే ఈ భోజన ప్రియుడు ఏదో విచారంగా
ఉన్నట్టుంటాడు. దీనికి కారణమిది. ఆ దూడ తలకాయ
"నీవు కూడానా" అని అతనితో అంటుంది కాబోలు!

నేలమీద ఉండేవారికి తిమింగిలమంటే అంత అస
హ్యానికి కారణం, కేవలం, అది తైలమయమవటమే కాదు,
పైని చెప్పబడ్డ రెండు కారణాల వల్ల కలుగు తుందేమో!
ఒకటి సముద్రంలో అప్పుడే వధింపబడిన జంతువును తినటం

రెండు — ఆ జంతువుయొక్క నూనెతో పెట్టుకొన్న దీపపు వెలుగులోనే తినడం. ఆమాటకువస్తే, ఎద్దును ఈభూమిమీద మొట్టమొదటి సారిగా వధించిన వానిని కూడా హంత అనే చెప్పాలి. అతనికి ఉరిశిక్ష విధించారేమో అని నా సందేహం ఎక్కడైకే న్యాయవిచారణాధికారముంటే, అవి అతనికి మరణ శిక్ష విధించేవి. పైగా, వధ చేసినవానికి మరణశిక్షే దండన యైతే, ఎద్దును చంపినవాడు కూడ ఆ శిక్షకే అర్హుడు కాడా?

ఒక శనివారం సాయంకాలం ఒక మాంసపు దుకాణానికి వెళ్ళి చూడండి. సజీవ ద్విపాజ్జంతువుల గుంపులు వధింపబడ్డ చతుష్పాజ్జంతువుల శ్రేణులను సస్పృహంగా తేరిపార చూస్తూ ఉండటం గోచరిస్తుంది. ఆ దృశ్యం ఎటువంటి క్రవ్యాదునైనా జేలు పరుస్తుంది. క్రవ్యాదులు! నరమాంస భక్షకులు! కాని వారెవరు?

"ఫిజీ" ద్వీపవాసి తనకు మతిబోధ చేయుటకు వచ్చిన మత గురువును తీసుకుపోయి ఏ కరవు కాలంలోనైనా పనికి వస్తాడని ఊర వెయ్యట — నాగరిక మానవుడు జంతువులను పట్టి, వాటి పొట్ట చీల్చి విందారగించటం కంటె, దైవానికి కూడా సబబుగానే కనబడుతుందేమో!

పోతే, స్టబ్ తిమింగిలపు నూనెతో వెలిగింపబడిన దీపపు కాంతిలో తింటున్నాడంటూరా? కొట్టడమే కాకుండా పైపెచ్చు తిట్టడం కూడా నంటూరా? అసలు, మీరు మాంసం కోసే కత్తి పిడిని దేనితో చేశారు? ఏఎద్దు మాంసాన్ని మీరు విందారగిస్తున్నారో ఆ ఎద్దు యొక్క సోదరప్రాణి

ఎముకతోనేగదా! బాతుమాంసపు విందారగించిన తర్వాత మీ పళ్లు దేనితో కుట్టుకొంటారు! ఆ పక్షియొక్క ఎముకతోనే కదా!పక్షులను పట్టుకోవటం క్రూరకార్యమని ప్రచారం చేసే జీవకారుణ్యసంస్థ కార్యదర్శి,తమ ఉత్తరాలను ఏ కలంతో వ్రాస్తున్నారు! (ఆ సంస్థ రెండు మూడు నెలల క్రితమే, ఉక్కుతో చేయబడ్డ కలాలే వాడాలని నిర్ణయించింది లెండి)

—:o:—

46. సొరచేపల వధ

ఎంతో శ్రమపడి తిమింగిలాన్ని పట్టి రాత్రి వేళ తెచ్చి ఓడ పక్కగా దానిని కట్టిన మరుక్షణమే దానిని కోయడానికి ఎవ్వరూ పూనుకోరు. ఆరంభిస్తే, ఆపనిని పూర్తి చేయటానికి చాలా సేపు పట్టుతుంది. పైగా, అందరి చేతులు కలిపి పని చేయవలసి వస్తుంది. అందువల్ల తిమింగిలాన్ని భద్రంగా ఓడకు బిగించి కట్టి, కాపలాకు కావలసిన వాళ్ళను తప్ప మిగిలిన వాళ్ళను తెల్లవారేదాకా పడుకోవటానికి పంపించి వేస్తారు. కాపలాకి మాత్రం గంటకు ఇద్దరు చొప్పున ఒక జత మారుతూ ఉండాలి.

ఒక్కొక్కసారి ఈ పద్ధతి పనికిరాదు. అందులోను- పసిఫిక్ మహాసముద్రంలో అది ప్రయోజనకారి కాదు. ఏమంటే, ఆరుగంటలసేపు ఆవిధంగా తిమింగిలాన్ని విడిచి పెట్టితే అసంఖ్యాకమైన సొరచేపలు వచ్చి ఆకళేబరాన్ని తినివేసి, తెల్లవారేసరికి ఒక్క అస్థిపంజరం మాత్రం మిగిలేటట్టు చేస్తాయి. మహాసముద్రంలో ఈ చేపలు అధికంగా లేని చోట్ల, ఉన్నకొద్దిపాటి వాటి వల్ల ఎక్కువ నష్టం రాకుండా ఉండటానికి పొడవైన పారలతో నీటిని కదుపుతూ వుంటారు. ఆ పారలు వాడి గలిగి యుంటవి. వాటికే తిమింగిలపు పారలని వాడుక. అయితే, ఒకోసారి ఈ పనివల్ల ఆ చేపలకు మరింత ఉత్సాహం కలుగడమూ కద్దు. ఆ రాత్రి "పెకోడ్" వద్ద ఉన్న సొర

చేపలను క్రొత్త వాడెవడైనా చూస్తే ఆ సముద్రమంతా పెద్ద జున్ను ముక్కగాను, ఆ సొరచేపలెల్లా అందలి క్రిములుగాను భావించేవాడు.

లంగరు వేయించి, స్టబ్ పహారా ఏర్పాటు చేశాడు. క్వీక్వెగ్ మరోనావికుడూ ఓడతట్టు మీదకి రాగానే సొర చేపల గుంపులలో పెద్దకలవర మేర్పడింది. తట్టుమీదికి రాగానే వాళ్ళిద్దరు లాంతర్లు నీళ్ళవైపు దింపి తిమింగిలపు పారలతో సొరచేపల వధని ప్రారంభించారు. తమ వాడియైన పారలతో సొరచేపలక పాలాలను ఛేదించ మొదలిడారు.[1] ఆకల్లోలంలో వీళ్ళవేట్లు సరిగా ఆ సొరచేపలకు తగలకపోతే అవి ఉగ్ర రూపం తాల్చి బయటపడిన ఇతర చేపల అంతరవయవ భాగాలను కబళిస్తూ ఉండేవి. ఇంతే కాదు. ఆ చేపలు చచ్చిన తర్వాత కూడా వాటి జోక్యం కల్పించు కోవటం ప్రమాద భరితంగా ఉండేది. ఒక్కొక్క చేపనుండి ప్రాణం లేచి పోయినా ఆ చేపలన్నింటి కీళ్ళల్లోను, ఎముకలలోను విశ్వ చేతనశక్తి వ్యాప్తమై ఉన్నదేమో ననిపించింది. చేపలను చంపి వాటి చర్మానికై ఓడతట్టుమీదికి తీసికొని వస్తారు.

---

1. తిమింగిలపు పార అన్నది అతివాడిగా ఉండే ఉక్కుతో చేయబడుతుంది. మనిషి అరచేతి వెడల్పున వుంటుంది. మామూలుగడ్డ పారను పోలి ఉంటుంది. ఈ పనిముట్టును ఎప్పుడూ వాడిగా ఉంచుతారు, మంగలికత్తివలె సానపడుతూ వుంటారు. ఈ పార ఇరవై ముప్పయి అడుగుల కఱ్ఱకి తగిలించబడి ఉంటుంది.

వాటిలో ఒకదాని నోటిని మూయబోతే అది క్వీక్వెగ్ చేయిని కరచినంత పని చేసింది" తన చేతిని బాధతో పైకి, క్రిందకి విదిలిస్తూ క్వీక్వెగ్ "ఏ దేవుడు సొరచేపలను సృష్టించారో! ఫిజి దేవుడో నన్టుకెట్ దేవుడో — కాని వీటిని సృష్టించిన వాడు రాక్షసుడై ఉండాలి" అన్నాడు.

47. "కేసు"

తిమింగిలం యొక్క "కేస్"ను తోడేపని యొకటి ఉంది. దీన్ని గురించి తెలుసుకోవాలంటే ఆ "కేస్" అంటే ఏమిటో వివరించాలి.

తిమింగిలం యొక్క తలని పెద్ద దీర్ఘచతురస్రంగా పరిగణించి, ఏటవాలుగా ఉంటే ఒకబల్లమీద పెట్టి అడ్డముగా విభజిస్తే కొయ్య చెక్కలవంటి రెండుభాగాలు తయారవుతాయి. ఆ రెంటిలో అడుగుభాగం ఎముకతో నిండి ఉంటుంది. పై భాగం ఎముక లేని మెత్తని ముద్దగా ఉంటుంది. వెడల్పుగా ఉండే ముందరిభాగం తిమింగిలముయొక్క నుదురు అయివుంటుంది. ఈ నుదిటిని మధ్య మళ్ళీ అడ్డంగా చీలిస్తే రెండు సహజమైన సమభాగాలు వస్తాయి. వీటిలో అడుగు భాగం నూనెతో నిండి తేనెపట్టు వలె ఉంటుంది. అందులో తెల్లని పీచుతో అల్లబడినట్టుగా కన్పడే పదివేల గూళ్ళు, అల్లిబిల్లిగా అల్లుకొని యుంటాయి. ఆ పైభాగాన్ని 'కేస్' అంటారు. ఇది పెద్ద పీపావలె వుంటుంది. ముందుభాగం చిత్రంగా చెక్కి మలచినట్లుండటంవల్ల తిమింగిలంయొక్క నుదురు అందంగా అలంకరించబడినట్టు కనబడుతుంది. క్రొత్త ద్రాక్ష రసంతో నింపబడ్డ పీపావలె ఈ 'కేస్' నూనెతో నిండియుంటుంది. ఈ నూనె చాలా స్వచ్ఛంగా, చిక్కగా, సువాసగలదిగా ఉంటుంది. ఇంత స్వచ్ఛమైన నూనె తిమిం

గిలం యొక్క ఏ ఇతర భాగంలోనూ వుండదు. తిమింగిలం సజీవంగా ఉన్నప్పుడే నూనె ద్రవరూపంలో వుంటాను, దానిని చంపి బయటకి తోడిన తర్వాత గాలి సోకినంతనే గడ్డకట్టు తుంది. పెద్ద తిమింగిలం యొక్క 'కేస్' నుండి ఇంచుమించు అయిదువందల గాలన్ల నూనె వస్తుంది. అదిగాక, తోడే టప్పుడు క్రింద కొంత పార్లిపోతుంది.

ద్రాక్షరసాలని పోసే పీపాల లోపలి భాగాలని దేనితో చేస్తారో నాకు తెలియదు. కాని తిమింగిలము యొక్క 'కేస్' లోపలి భాగాన వుండే పలుచని పొర- ముత్తెపు లావణ్యంతో మెరిసే సన్నని పట్టుపొరవలె వుంటుంది.

ఇప్పుడు నేను సారాపీపాతో పోల్చిన భాగం తిమింగిల శిరమున లోపలి పై భాగమన్నమాట. మొత్తం తిమింగిలపు పొడవులో దాని తలకాయ మూడోవంతు ఉంటుంది. అంటే కాస్త భారీగా వుండే తిమింగిలం పొడవు ఎనభై అడుగు లైతే, ఈ భాగం రమారమి ఇరవై అడుగులు వుంటుంది. దీనినే ఓడ ప్రక్కగా నిలబెడతారు.

తిమింగిలం యొక్క తలను అతిజాగ్రత్తగా ఛేదించాలి. ఏమాత్రం పొరపాటు జరిగినా, ఆ తలలోని నూనె అంతా వృధా అయిపోతుంది. ఛేదించిన తలను పెద్ద గట్టితాళ్ళతో వ్రేలాడ గడతారు. ఇక, ఆ తలనుండి నూనెతోడే విధం గమనించండి.

48. నూనె తొట్టెలు

అతివేగంగా టాష్‌టెగో చేత ఒక పనిముట్టు పట్టుకొని పైకి ఎక్కి నిటారుగా నిలబడి, ఓడ అంచుమీదుగా వెళ్ళి సరిగా తిమింగిలం యొక్క తల వ్రేలాడగట్ట బడిన భాగం దగ్గర చేరి నిలబడ్డాడు. అతను పిల్లివలె అతిలాఘవంగా పైకి ప్రాకగలడు. ఆ పనిముట్టు క్రిందికి వ్రేలాడేట్టు పట్టుకొని, ఒక త్రాడుని తట్టుమీదకు విసరాడు. ఈ త్రాటిని ఇంకొకడు గట్టిగా పట్టుకోగా, అతను మెల్లగా దిగి, ఆ తిమింగిలపు తల మీదకి చేరుకొన్నాడు. అప్పుడుకూడా అతను మిగిలిన వాళ్ల కంటె చాల ఎత్తైన ప్రదేశంలోనే వున్నట్టు కనబడ్డాడు. అతనికి ఒక చిన్న, వాడియైన పారని అందించారు. దానిని అందుకొని తిమింగిలం యొక్క తలను ఏ భాగంలో వ్రేటు వెయ్యవలెనా అని పరీక్షించడం మొదలు పెట్టాడు. పాత బడిన ఇంటి గోడలలో గుప్తమైన బంగారం కోసం వెతికే వాని వలె అతను అతిజాగ్రత్తగా ఈ పని సాగించాడు. ఆ పరీక్ష పూర్తి కాగానే అతనికి ఒక ఇనుప బొక్కెన అందజేశారు. ఇంకొకడు ఒక పొడవుపాటి కఱ్ఱను అందించాడు. ఈ బొక్కెనలో ఆ కఱ్ఱను ఉంచి అతను మెల్లగా దాన్ని "కేస్" లోకి దింపి పైకి చేదుకొన్నాడు. పైకి వచ్చేప్పుడు ఆ బొక్కెన పాలతో నిండిన కుండవలె కనబడింది. దీనిని ఒక తొట్టెలోకి వంచుకొన్నాడు. 'కేస్' లో ఉండే నూనె అంతా చేదుకొనే

డాగూ ఆ బొక్కెనను ఈ విధంగా లోపలికి దింపి పైకి లాగుతూనే ఉన్నాడు. ఈ రీతిగా నూనె తోడటంలో కత్తి ఇరవై అడుగుల లోతుకి వెళ్ళి వుంటుంది.

'పెకోడ్' మీది వాళ్ళు ఎన్నో తొట్టెలను ఆ తెల్లని నూనెతో నింపారు. ఇంతలో ఒక విచిత్రం జరిగింది. టాష్‌టెగో అశ్రద్ధగా తాను పట్టుకొన్న తాళ్ళను జారవిడిచాడో, అతను నిలబడివున్న ప్రదేశం జిడ్డుగా వుండి బాగా జారిపోయిందో, మరే కారణంవల్లనో తెలియదు గాని పద్దెనిమిదో పందొమ్మిదో సారి బొక్కెన చేదుకొనేటప్పుడు, అతను నూతిలో పడినట్టుగా, తిమింగిలం 'కేస్' లో పడ్డాడు. ఆ పడటంలో తలముందు పడింది. నూనెలో కొట్టుకొంటున్న చప్పుడు వినవచ్చింది; అతను మాయమైనాడు!

అందరూ తెల్లపోతూ వుండగా, అందరికంటె ముందు తెప్పరిల్లి "మనిషి పడిపోయాడు" అని డాగో కేకవేసి, "ఆ బొక్కెనను ఇటు పంపండి" అని మళ్ళీ అరిచాడు. ఆ బొక్కెనలో ఒక కాలుపెట్టి తానుకూడా తిమింగిలం తల మీదకు వచ్చాడు. ఈ లోగా పెద్ద కలకలం లేచింది. అప్పటి దాకా నిర్జీవంగా పడివున్న తలకాయ ఒక్కసారిగా నీటిమట్టం కింద చేతనపూరితమైనట్టు కనబడింది. ఆ కదలిక 'టాష్‌టెగో' దే. దానివల్ల అతను ఎంత కిందకి వెళ్ళిపోయాడో తెలిసి వచ్చింది.

ఇదే సమయానికి, డాగో తిమింగిలం తలమీద కట్టియున్న తాళ్ళ చిక్కు విడదీస్తూండగా ఫెళ ఫెళ మంటూ

శబ్దం వినబడింది. తిమింగిలంను పట్టివున్న గాలాములలో ఒకటి విడిపోయింది. దానితో ఆ తలకాయ అటూ ఇటూ ఊగుతూ ఓడకు తగులుతూ వుంటే ఏదో పెద్ద మంచుగుట్ట తగిలినట్లు ఓడకూడా ఊగులాడటం మొదలుపెట్టింది. మిగిలిన ఒక్క గాలంమీదే బరువంతా ఆధారపడి వుండటంవల్ల అది కూడా ఎప్పుడు తెగిపోతుందో అనిపించింది. దీనికి తోడు తిమింగిలం యొక్క తల కదలికలు కూడాను. "దిగు, దిగు" అని డాగోని మిగిలిన నావికులు పిలిచారు. అతనుమాత్రం, ఒకవేళ తిమింగిలపు తల ఊడి క్రిందపడినా, తాను వ్రేలాడవచ్చునని ఒక చేతితో తాళ్ళు గట్టిగా పట్టుకొని, బొక్కెనను తిమింగిలం లోకి త్రొయ్యడం మొదలుపెట్టాడు. అతని ఉద్దేశమేమంటే, లోపల పడివున్న ఈటెగాడు బొక్కెనను పట్టుకొంటే అతనిని పైకి లాగవచ్చునని.

ఇది చూచి స్టబ్, "ఆ బొక్కెనను అలా కుక్కటంలో నీ ఉద్దేశ మేమిటి? అతని నెత్తిమీద ఏమాత్రమూ పందులేకుండా చేసేస్తావేమిటి?" అని కేకలు వేశాడు.

"జాగ్రత్త- ప్రక్కకి కదులు" అని ఎవరో కేక వేశారు. అదే సమయాన, ఆ పెనుభూతం ఊడి పెద్ద చప్పుడుతో నీళ్ళలో పడింది. ఒక్కసారిగా బరువు వీడిన ఓడ, కొద్దిగా కదిలింది. డాగో తాళ్ళని పట్టుకొని వ్రేలాడుతున్నాడేమో, అక్కడ లేచిన పెద్ద నీటితుంపరపై అతను అటూ ఇటూ - ఒకసారి నావికుల తలలమీదా, ఇంకొకసారి నీటిమీదా, ఊగటం మొదలుపెట్టాడు. టాష్టెగో సజీవంగా నీటి అడు

గున సమాధి కాబోతున్నాడు. అందరూ ఈ దృశ్యాలు చూచి భయపడ్డారు.

నీటితుంపర చెదిరిపోయిన మరుక్షణాన, చేతిలో ఒక కత్తిని పుచ్చుకొని ఒక నగ్నశరీరం ఓడ పక్క కదలటం కనబడింది. వెనువెంటనే నీటిలోకి దూకినవాడు, క్వీకెగ్ అని తెలిసింది. అందరూ, ఓడ ప్రక్కలకి పరుగెత్తారు. అందరి కళ్లూ నీటి అలలవైపు మళ్ళుతున్నాయి. ఒకదాని వెంట ఒకటి నిమిషాలు పరుగెత్తి పోతున్నాయి. కాని నీటిలో మునిగిపోతున్న వానియొక్కగాని వానిని రక్షించటానికి దూకినవానియొక్కగాని, జాడ లేదు. కొందరు, ఓడపక్కనే ఉన్న పడవలోకి దూకి, కొంతదూరం వెళ్ళారు.

“భలే! భలే! 'అని డాగ్ అనగానే అందరను అతని దృష్టి ఎటు ఉందో, అటువైపు తలలు తిప్పారు. నీటి కెరటాలమీద నుంచి ఒక చేయి పైకి చొచ్చుకొని కనబడింది. అది శ్మశానంలోని గడ్డిలోనుంచి పైకి తొచ్చుకొనే చేయి వలె ఉంది. ఎంతో ఆశ్చర్యకరమైన దృశ్యమది.

అతి ఉల్లాసంగా, “డాగో, ఇద్దరూను” అంటూ అరిచాడు. క్వీకెగ్ ఒక చేతితో నీటిని చరుచుతూ, వేరొక చేతితో టాష్‌టెగోని పట్టుకొని రావటం కనబడింది. అటు వైపు వెళ్ళిన పడవలోకి వాళ్ళని ఎక్కించి, ఓడ తట్టుమీదకు త్వరగా తీసుకొని వచ్చారు. టాష్‌టెగో తేరుకోవటానికి చాలాసేపు పట్టింది. క్వీకెగ్ కూడా బాగా చురుకుగా కనబడ లేదు.

మహాద్భుతమైన ఈ ప్రాణరక్షణ ఎట్లు జరిగింది! తిమింగిలం తల క్రిందికి మునిగిపోతూ వుంటే దాని ప్రక్కగానే తానుకూడా నీటిలో జొచ్చి, దాని అడుగు భాగాన తన కత్తితో ఒక పెద్ద రంధ్రం కోసి, అందులో చెయ్యి పెట్టి టాష్టెగోని బయటకు లాగాడు. అతని చేతికి మునుముందు టాష్టెగో కాలు అందింది. క్వీక్వెగ్, ఆ కాలిని వెనుకకు త్రోసి మిక్కిలి నేర్పుతో టాష్టెగోని ఒక పల్టీ కొట్టించాడు. ఇంకొక ప్రయత్నంతో అతని శిరస్సు ముందుగా శరీరం బయటపడింది. ఆ శిరస్సు ఎలా ఉందో మీరు ఊహించుకొనండి.

ఈ మంత్రసాని పనిలో క్వీక్వెగ్ చూపిన ధైర్యము, నిపుణతవల్ల టాష్టెగో ఆపదలన్నీ గడచి మరల భూమిమీద పడగలిగినాడు. కత్తిసాము, ముష్టియుద్ధము, గుఱ్ఱపుస్వారీ, పడవ నడుపుట — వీటివలెనే మంత్రసాని వృత్తిని గురించి శిక్షణ ఉండాలి. టాష్టెగో అనుభవించిన యీ సంకటం కొందరికి వింతగానే తోచవచ్చునుగాని ఇటువంటివి తరచు సంభవిస్తాయి. ఒకొక్కసారి మనుష్యులు నీటి పీపాలలో పడిపోవటం, మీరు చూచియుంటారు లేదా విని యుంటారు. అటువంటిదే ఈ తిమింగిల గర్భకూపమున పడటం. అయితే, ఈ జంతువు యొక్క నోటిలో ఉపరిభాగం బాగా జారుడు కలది అవటంచేత ఈ పతనం మరీ ప్రాణాంతకం. ఇంకొక వింతయేమంటే — తిమింగిలం యొక్క తలకాయ తేలికగా బెండువలె ఉంటుందని చెప్పాను. అటు

వంటిది నీటిలో మునుగుట యెట్లు అన్న ప్రశ్న రావచ్చు. ఆ రహస్యమిది. టాష్టెగో పడిన సమయానికి ఆ తలకాయ లోని తేలిక పదార్థమంతా ఖాళీ అయిపోయింది. బిరుసుగా ఉండే గోడమాత్రం మిగిలింది. ఇది నీటికంటె చాలా బరువు కావటంవల్ల సీసపు ముద్దవలె నీటిలో పడుతుంది. కాని ఇప్పట్లు అది వెంటనే నీటిలో మునిగి పోకపోవటానికి కారణం తలకాయలోని ఇతర భాగాలు ఇంకా దానిని అంటిపెట్టుకొని ఉండటమే. దీనివల్ల, క్వీకెగ్ కి తన నైపుణి ప్రయోగించే అవకాశం లభించింది. టాష్టెగో బయటపడడం, పురుగులో ప్రసవంకావడం వంటిది.

టాష్టెగోయే తిమింగిలపు తలలో పరమపదించాడు అనుకోండి: అంతకంటె ఏం కావాలి! అది సువాసనగల తెల్లని నూనె నడుమ, తిమింగిలపు 'గర్భగుడి' లో సమాధి అయేవాడన్నమాట. ఇంతకంటె, సుఖప్రదమైన మృత్యువు ఇంకొక్కటే వుంటుంది. వెనుక ఓహియోలో ఒకడు చెట్టు తొఱ్ఱలో వున్న తేనెతుట్టెను చూసి అందులోని ఎంతో తేనె వుండడం గమనించి బాగా ముందుకు వంగాడట. ఆ తేనె అతన్ని లోపలికి పీల్చేసిందట! అతను అలాగే సమాధియై పోయాడట. ఇట్లు హాయిగొల్పే అవసానం ఎందరికి దక్కుతుంది!

—:o:—

49. "యంగ్ ఫ్రీ" ఓడ.

రావలసిన రోజు వచ్చినది. "యంగ్ ఫ్రీ" అన్న ఓడని దాని, కెప్టెన్ డెరిక్ డి డీర్ అనే అతనిని కలుసుకొన్నాము. అతను బ్రెమెన్‌కి చెందినవాడు.

ఒకప్పుడు తిమింగిలాల వేటలో ఎంతో ప్రఖ్యాతులైనా, ఇప్పుడు డచ్ వాళ్ళు, జర్మనులు అంతగా ఈ వృత్తిలో లేరు. పసిఫిక్ మహాసముద్రం మీద ఎక్కడోగాని వాళ్ల దేశాల ఓడలు కనబడవు.

ఎందుచేతనోగాని 'యంగ్ ఫ్రీ' ఓడ మమ్మల్ని కలుసుకొందామనుకొన్నదట. ఇంకా 'పెకోడ్'కి అల్లంతదూరంలో వుండగానే ఒక చిన్న పడవని వేసుకొని ఆ ఓడయొక్క కెప్టెన్ మా వైపు రాసాగాడు. ఆ జర్మను చేతిలో దేన్నో చూచి, స్టార్‌బక్, "అతని చేతిలో వున్నదేమిటి? దీపాలకు నూనె పోసుకొనే డబ్బాలాగ వుందే" అన్నాడు. స్టబ్ అందుకొని, "కాదు, కాదు, అతను కాఫీ కూజాని తెస్తున్నాడు. మనకు కాఫీ కాచి పెడతాడు. అతని దగ్గర ఆ పెద్ద డబ్బా వుంది చూడు, అది వేడినీళ్ళు పోసుకొనే డబ్బాయేమో' అన్నాడు.

"నీ మొగం! అతను నూనెడబ్బా పట్టుకొని వస్తున్నాడు. వాళ్ళదగ్గర నూనె అయిపోయిందేమో" అన్నాడు స్టార్‌బక్.

పీపాలకొద్దీ తిమింగిలాల నూనె వుండే ఓడలలో, అందలోని తిమింగిలాలని వేటాడే ప్రదేశంలో, నూనెకు కొంతేమిటి లభించవచ్చు. ఒక్కొక్కసారి అట్లా జరుగుతూ వుంటుంది. అప్పుడు నిజంగా కెప్టెన్ డిరిక్ డి డీర్ నూనె పోసుకునే డబ్బాతోనే మా ఓడవైపు వచ్చాడు.

అతను ఓడ తట్టు ఎక్కడమే తడవుగా, అతను ఎందుకు వచ్చాడో అని గమనింపనైనా గమనింపక, అహబ్ అతన్ని వచ్చీరాని జర్మను భాషలోఏదో అడిగాడు. దానికి సమాధానంగా తనకు తెల్లతిమింగిలపు సంగతి ఏమీ తెలియదని ఆ అతిథి చెప్పాడు. వెనువెంటనే అతను తన పరిస్థితి వివరించాడు. వాళ్ళదగ్గర ఏమీ నూనె లేదట! తమ వెంట తెచ్చుకొన్న నూనె అంతా అయిపోవటంవల్ల అతను చీకటిలో పండుకో వలసిన పరిస్థితి ఏర్పడిందట, వాళ్ళు ఏ జంతువును పట్టక పోవటంవల్ల ఓడ ఖాళీగా వుండిట! ఆ ఓడపేరు యుంగ్ ఫ్రౌ (అంటే, కన్య) అన్నది సార్థకమైనదిట.

అతని అవసరం తీరగానే డిరిక్ తిరిగి వెళ్ళాడు. అతను కొంతదూరం వెళ్ళాడో లేదో, చుట్టూ అనేక తిమింగిలాలు తలఎత్తి చూశాయి. అతను నూనె డబ్బాను భద్రపరచుకోకుండానే వాటి వెంటపడ్డాడు. అతనిని అనుసరిస్తూ మరో రెండు పడవలు వచ్చాయి. మొత్తం ఎనిమిది తిమింగిలాలు కనబడ్డాయి. వాటికి వాటిల్లిన విపత్తుని గుర్తించి అవి ఎనిమిదీ ఒకదానిని అంటిపెట్టుకొని ఒకటి– రథానికి కట్టబడిన గుర్రాల లాగున విడిగా పోసాగాయి.

వీటికి చాలా వెనకగా ఇంకొక తిమింగిలం మెల్లగా వెళ్ళటం కనబడింది. దానికి పెద్ద గూను, ఒంటిమీద పచ్చని బొబ్బలు వుండటంవల్ల దానికేదో జబ్బు చేసి యుంటుందని గ్రహించాము. ముందు వెళ్ళిన తిమింగిలాల కుటుంబానికి చెందినదా, కాదా అని అనుమానం కలిగింది. అయినా అది వాటివెంటే వెళ్ళింది. ఆ తిమింగిలం కొద్దిగొద్దిగా నీటి జల్లు విడుస్తూ, ఒక్కొక్క జల్లు వెంట తిమింగిల మంతా ఒకసారి కనిపించేది. దీనివల్ల నీటి బుడగలు లేచేవి.

"ఎవని దగ్గరనైనా అజీర్ణానికి మందుందా?" అని స్టబ్ కేక వేశాడు: "దానికి కడుపునొప్పి వచ్చింది కాబోలు- దాని కడుపులో పెద్ద తుఫాను లేస్తోంది!

తట్టునిండా గుడ్డాలను, మరికొంత ఇతర సామగ్రిని వేసుకొని పూటీగా సముద్రపు ఒంచనే వెళ్ళే ఓడవలె ఆ ముసలి తిమింగిలం కూడా బరువుగా తన పెద్ద మేనుని అటూ ఇటూ కదుపుకొంటూ ఒక ప్రక్కకు ఒదిగింది. ఆ తిరగ టంలో దానికి చివర ఉండే మొండి రెక్కని చూపించింది. ఆ రెక్క ఏ పోట్లాటలో అలా అయిందో తెలియదు; లేక పోతే పుట్టుకతోనే మొండిగా ఉన్నదేమో!

ఆ తిమింగిలాన్ని ఉద్దేశించి, ఫ్లాస్క్, "ఒక్క నిమిషం ఆగు! ఆ మొండి రెక్కకి ఒక కట్టుకడ్తాను" అంటూ తిమింగిలాలను పట్టటానికి వాడే ఉచ్చుతాడు చూపించాడు. స్టార్ బక్ దీన్ని చూసి, "జాగ్రత్త! ఆ ఉచ్చు నీ వెంటకు

పడగలడు_త్వరగా కానీ! లేకపోతే ఆ జర్మనువాడు నీ కంటె ముందు అందుకొంటాడు" అన్నాడు!

ఒక్క ఉమ్మడిగా అన్ని పడవలూ ఆ జంతువు వైపు తిరిగాయి. అది ఒక్కటే అందుబాటులో ఉండటంవల్లా, అది చాలా పెద్దది కావటంవల్ల, మిగిలినవన్నీ అతివేగంగా తప్పించుకుపోతున్నా అదిమాత్రం నెమ్మదిగా వెళ్లుతూ వుండటం వల్ల, అందరి దృష్టి దీనిపైనే పడింది.

'పెకోడ్' నుంచి దింపబడిన పడవలు, ఈ జర్మను పడవను దాటిపోయినాయి. కాని డిక్ మాత్రం అందరి కంటె ముందే ఉన్నాడు. ఈ పడవనుకూడ మా వాళ్ళు అప్పుడప్పుడు సమీపిస్తూనే వున్నారు. అతను ఎంత ముందుగా వుండటంవల్ల అతనే మొదటి ఈటెని విసురుతాడేమో నన్న భయం వీళ్ళకున్నది. డిరిక్‌కి కూడ తానే ముందు ఈటెని వేస్తానన్న ధీమా వుంది. అప్పుడప్పుడు వీళ్ళవైపు నూనె డబ్బాను ఆడిస్తూ వెటకారం చేస్తూండేవాడు కూడాను.

"కృతఘ్నుడు– నేను నింపి ఇచ్చిన నూనెడబ్బాతో నే నన్ను వెక్కిరిస్తున్నాడు" అని స్టార్‌బక్ తనవాళ్ళని వడిగా పొమ్మని హెచ్చరించాడు.

స్టబ్ అందుకొని, తన అనుచరుల నుద్దేశించి, 'నాకు ఎన్నడూ ఎవడిమీదా పగలేదు. కాని ఈ జర్మను వాడిని చంపి తినివెయ్యాలనిపిస్తోంది. వీని చేతులలో నన్ను ఓడి పోనిస్తారా మీరు? మీకు బ్రాందీ అక్కరలేదా? మీలో మేటికి ఒక సీసా బ్రాందీ! కానివ్వండి- ఒళ్లు వంచండి! ఎంత

నెమ్మదిగా వెళ్ళుతున్నారో- పడవ అడుగున గడ్డి మొలుస్తోంది- పడవ స్తంభం చిగురిస్తోంది! ఇది లాభంలేదు అబ్బాయిలూ- చూడండి వానివంక”

“ఫ్లాస్క్, “మీరు ఉరకలెత్తించాలి- చూడండి- ఆ తిమింగిలం ఎంత పెద్దదో- మీకు మంచి భోజనం పెట్టిస్తా. కానివ్వండి- త్వరగా లాగండి–దానినుంచి వందపీపాల నూనె వస్తుంది- జారిపోనీయకండి. దానివల్ల మూడువేల డాలర్లు దక్కుతాయి. కానివ్వండి- ఆ జర్మనువాడు ఏం చెయ్యబోతున్నాడు చెప్మా” అని అన్నాడు.

అదే సమయానికి డిరిక్ తన నూనెకబ్బాని వెనుకకు విసిరివేస్తున్నాడు. దీనివల్ల రెండు ప్రయోజనాలని సాధించదలచుకున్నాడు కాబోలు; దానివల్ల తన వెనుక వస్తున్న పడవల వేగం తగ్గిద్దామనీ తన పడవవేగం ఎక్కువ చేద్దామని అతని ఉద్దేశం.

స్టబ్ దీనిని చూచి, “మర్యాద తెలియని వెధవ! లాగండర్రా- యుద్ధ నౌకల్లో వుండేవాళ్ళలాగ లాగండి- ఏమంటావ్ టాష్టెగో! మన పరువు నిల్పుకోవటంకోసం నీవు దేనికైనా సిద్ధంగా ఉన్నావా లేవా? ఏమంటావు!”

“నేననేది ఏమీ లేదు- లాగండి- చచ్చేట్టు లాగండి” అని టాష్టెగో సమాధానం!

జర్మను వానివల్ల రెచ్చగొట్టబడిన మా మూడు పడవలు అతివేగంగా ఒక దాని ప్రక్క మరొకటి వెళ్ళి ఆ జర్మనువాని పడవను సమీపించాయి. దగ్గర పడ గానే ఉల్లాస

వంతులై ఆ మూడు పడవలవాళ్లూ, "అదిగో తిమింగిలం! జర్మనువాణ్ణి ఓడించి వేశాం!" అనుకొంటూ కేకలు వేశారు.

వీళ్ల దర్పం ఎలా ఉన్నా జర్మనువాడు ముందుకు పోయేవాడే! కాని విధివశాన అతని పడవలో తెడ్డు వేసే వాళ్లలో ఒకనిని పీత ఒకటి పట్టుకొంది. వాడు దానిని విడిపించుకోవటంలో పడవ వేగం తగ్గింది. డెరిక్ కోపావేశంతో తన వాళ్ళని తిట్టుకున్నాడు. ఈ అదను మించిపోగూడదని స్టార్‌బక్, స్టబ్, ఫ్లాస్క్ ఒక్కసారిగా వేగం హెచ్చించారు. తిమింగిలం దరిదాపులకు నాలుగు పడవలూ ఒక వరుసగా వచ్చి ఉన్నాయి. తిమింగిలం వల్ల ఏర్పడిన నురగలు ఈ పడవల చుట్టూ కమ్ముకొన్నాయి.

అది అతిభయంకరము, విచారకరము అయిన దృశ్యము. తిమింగిలం బాధగా నీటిజల్లుని విడుస్తోంది. దానికివున్న ఒక్క రెక్కా గిల గిలా కొట్టుకొంటోంది. తడబడుతూ పారిపోబోతూ వున్న ఆ తిమింగిలం ఒకసారి ఇటూ, మరొకసారి అటూ దొర్లిపోతూ తనకు వున్న ఒక్క రెక్కతో కెరటాలను బాదుతోంది. పూర్వం మొకప్పుడు రెక్క-విరిగిన పక్షిని చూశాను: శోచనీయంగా గాలిలో కొట్టుకొంటూ ఎలాగైనా సరే తన మీదకు వచ్చే డేగను తప్పించుకోందామని ప్రయత్నిస్తోంది. పక్షికి నోరు వుండటంవల్ల తన అరుపుతో తన విపత్తుని చాటింలిగింది. కాని ఈ మూగ జంతువుకు కలిగిన భయమంతా లోపలే దిగమ్రింగి వేస్తూవుంది. దీనికి నోరు లేదు. ఊపిరి తిరగకుండా అది విడిచే నిశ్వాసం తప్ప ఇంకేమీ రాలేదు.

ఈ దృశ్యమే హృదయ విదారకమైనది. అయితే ఒకటి, ఆశ్చర్యజనకమైన దాని కాయము, కోట దర్వాజావంటి దాని దౌడ, శక్తిభరితమైన దాని తోక- వీటిని చూస్తే ఆ తిమింగిలము పట్ల జాలి కలుగుతుంది, ఎంత గట్టి గుండె కలవానికైనా, భయంకూడా కలుగుతుంది.

మా పడవలకు ఆ లాభం దక్కిపోతూ వుందనీ, తన ప్రయత్నం విఫలమౌతోందనీ గ్రహించి, డిరిక్ తన దగ్గర ఉండే ఈటెలలో కెల్లా నిడుపైన దానిని విసరటానికి తల పెట్టాడు.

అతను ఆ పనికి పూనుకొన్నాడో లేదో క్వికెగ్, టాష్‌టెగో, డాగో - ఒక్క క్షణంలో నిలబడి తమ ఈటెలు ఆ జర్మనువాని మీదుగా విసిరారు. అవి వెళ్ళి తిమింగిలానికి తగిలాయి. కళ్ళు కప్పివేసే తెల్లనిపొగ లేచింది! తిమింగిలం శరవేగంతో వెళ్ళటం చూచి ఈ మూడు పడవలూ వేగంగా పోసాగాయి- పోతూ, ఆ జర్మనువాని పడవను ఢీకొనడంతో డిరిక్, అతని ఈటెగాడు- ఇద్దరూ నీళ్ళల్లో పడ్డారు. వాళ్ల ప్రక్కగా మా పడవలు పోయాయి. అట్లా వాళ్ల ప్రక్కగా వెళ్లుతూ స్టబ్, "పడవకండి! ముట్టిముద్దల్లారా - మిమ్మల్ని ఇప్పుడే లేవనెత్తుతారు లెండి- ఇక్కడెక్కడో కొన్ని సొర చేపలు చూశాను. ఈ అవస్థలో వున్న మీ సంగతి అవి చూచుకొంటవి-ఏయ్! ఇటువైపు తిప్పండి పడవ "ఇదేమిటి! ఈ తిమింగిలం ఆ ఈటెలని మోసుకుపోతోందే ఇంకా" అన్నాడు.

కాని ఆ భూతం అట్టేదూరం వెళ్లలేదు. ఒక్కసారి ఎగ ఊపిరి తీసింది. అదేదో పెద్ద కలకలమైనట్టు వినిపించింది. కొంతసేపైన తరువాత తిమింగిలం ఏమీ శబ్దం చేయలేదు. ముగ్గురు ఈటెగాళ్ళు కొంతసేపు అట్లాగే కూర్చున్నారు. ఈటెలు తిమింగిల శరీరంలో నాటి, అవి కదలిపోకుండా తాళ్ళితో పట్టుకొంటే ఆ బాధకు తాళలేక తిమింగిలం నీటి పైకి వస్తుంది. రాగానే మళ్ళీ దెబ్బతింటుంది. అసలు అది నీటిలో అంతసేపు ఉండటమే మేలా అనే ప్రశ్న వేస్తే సమాధాన మిది! నీటిలో వున్నకొద్దీ దెబ్బతిన్న తిమింగిలం డస్సిపోతుంది. దాని శరీరం దగ్గర దగ్గర రెండువేల చదరపు అడుగులుండటంవల్ల నీటి ఒత్తిడి ఆ విశాలతలము మీద చాలా అధికంగా ఉంటుంది. భూమిమీద ఉన్న మనకు తెలుసుకదా, ఎంత వాయుభారం క్రింద మనము ఉన్నామో! అటువంటప్పుడు, ఎన్నో నిలువుల సముద్రపు నీటిక్రింద ఉండే తిమింగిలంపై భారమెంత ఉంటుందో ఊహించండి! ఒక శాస్త్రవేత్త అంచనా ప్రకారం ఆ భారం, ఇరవై యుద్ధ నౌకల బరువుతో సమానం!

మూడు పడవలూ సముద్ర తలము మీద మెల్లగా ఊగుతున్నాయి. ఎక్కడా ఒక్క మూలుగుగాని, అరుపుగాని లేదు. సముద్రపు అగాధాల నుండి ఒక్క బుడగగాని, ఒక్క అలగాని లేవలేదు. అంతటి నిశ్శబ్దక క్రిందనూ సముద్ర జంతువులలో కెల్లా పెద్దదైన తిమింగిల మొకటి, బాధతో కొట్టుకొని పోతోందని ఎవరికి తెలుసు! ఒకొక్క పడవ

దగ్గర ఎనిమిదంగుళాలకంటె పొడవుగల మోకులు వ్రేలాడటం లేదు. ఇటువంటి మోకులతోనే తిమింగిలాన్ని వ్రేలాడతీశారా అని అనుమానం కలుగుతుంది. ఒకప్పుడు తిమింగిలంను గురించి ఇలా సగర్వంగా అనేవారు. "దాని చర్మాన్ని ముళ్ళున్న ఈటెలతో నింపేస్తావా! దానికి ఈ ఇనుప నారసాలు గడ్డిపోచల వంటివి! బాణానికి బెదరి అది పారిపోదు! నీ బల్లెమును చూచి నవ్వుకొంటుంది. అటువంటి దేనా తిమింగిలం! ఏమిటి! ప్రవక్తల మాటలు నిజం కాకపోవటం! ఈ తిమింగిలం తోక పైకిఎత్తి ఉంచినా తలనుమాత్రం ఈటెలు తగులకుండా సముద్రం అడుగున పెట్టుకొంది.

ఆ మధ్యాహ్నం పొద్దువాలిన తరువాత, మూడు పడవల నీడలూ నీటిమీద ఎంతో నిడివిగా, వెడల్పుగా ప్రసరించి యున్నాయి. తన తలమీద ఉన్న ఆ భూతాలను తలచి తిమింగిలం ఎంత భయపడిందో ఎవరు చెప్పగలరు!

మూడు మోకులూ ఒక్కసారి కంపించ నారంభించాయి. ఆ కంపం చావుబ్రతుకుల మధ్యనున్న తిమింగిలం యొక్క దడ దడల వలె ఉంది. తెడ్డు పుచ్చుకొన్న ప్రతి వానికీ ఆ కదలిక తగిలింది. అది చూచి. స్టార్ బక్, "హుపార్ అది కదులుతోంది!" అని కేక వేశాడు. "లాగండి, లాగండి అది లేస్తోంది-" అని మళ్ళీ హెచ్చరించాడు.

అప్పటిదాకా ఈటెలకు అమర్చబడియున్న ఇనుప మోకులు జానెడు అయినా కనబడ లేదు- తిమింగిలం పైకి రాబోతూ ఉంటే ఆ మోకులన్నీ బయటకు వచ్చి చుట్టలు

చుట్టలుగా పడవలలో పడియున్నాయి. తిమింగిలం వేటగాళ్ళకు కొద్ది దూరంలోనే నీటిలో ఉన్నదన్నమాట.

దాని కదలికల పోకడవల్ల తిమింగిలం పూర్తిగా డస్సిపోయిందని తెలియవచ్చింది. నేలమీద ఉండే జంతువులకు రక్తనాళాలలో చిన్న చిన్న అడ్డతలుపులు వుంటాయి. వీటివల్ల జంతువు గాయపడినప్పుడు నెత్తురంతా బయటకుపోక, కొన్ని దిశలందు కొంత దాకా అయినా అరికట్టబడుతుంది. తిమింగిలానికి అట్లాకాదు. దీని రక్తనాళాలకు అడ్డతలుపులుండక పోవటంవల్ల రక్తనాళాలకి ఏమాత్రం దెబ్బ తగిలినా రక్తస్రావం ప్రారంభిస్తుంది. దీనికితోడు బ్రహ్మాండమైన నీటి ఒత్తిడి క్రింద తిమింగిలము వున్నప్పుడు కొండబుగ్గలో పుట్టిన నదివలె దాని ప్రాణమే వెల్లువలై ప్రవహిస్తుందనే చెప్పవచ్చు. తిమింగిల శరీరంలో విశేషంగా నెత్తురు వుండటం వల్లనూ, ఆ నెత్తురు ఊటలు దూరంగా వుండటంవల్లనూ, రక్తస్రావం చాలాసేపు జరుగుతుంది.

పడవలు అన్నీ తిమింగిలం దగ్గరకు వచ్చాయి. ఒక దాని తరువాత ఒకటిగా ఈటెలు తిమింగిలము మీద పడుతున్నాయి. ఇవి గుచ్చుకున్నప్పుడెల్లా నెత్తురు పైకి చిమ్ముతూ వుంది. సహజంగా ముక్కుద్వారా వచ్చే నిశ్వాసాలు మాత్రం అతికష్టంమీద వస్తున్నట్లు, దీర్ఘంగా వున్నట్లు అగుపడింది. ముక్కు ప్రాంతంలో ఏమీ గాయం పడకపోవడంవల్ల కాబోలు ముక్కువెంట నెత్తురు వస్తూన్నట్లు లేదు. దాని ప్రాణానికి ఇంకా దెబ్బ తగులలేదన్నమాట.

పడవలు దాని దగ్గర చేరటంతో, మామూలుగా నీటిలో ఉండే దాని పై భాగమంతా కనబడింది. దాని కళ్లు కూడ కానవచ్చాయి. పడిపోయిన ఓకు మ్రానుమీద అక్కడక్కడ వింత బుడపులు మొలుస్తవి. అలాగే ఒకప్పుడు తిమింగిలం యొక్క కళ్ళున్నచోట రెండు గుండ్రని పెద్ద బుడుపులు మాత్రం మిగిలాయి. వాటిని చూస్తే ఎంతో ఘోరంగా వుంది. కాని ఎవరికి జాలి వుంది! అది ముసలిదైనా, దానికి ఒక్కటే రెక్క వున్నా, దాని కళ్ళు గుడ్డివైపోయినా అది వధింపబడ వలసినదే! ఎందుకు! మానవులు విలాసరాత్రులు గడపటానికి కావలసిన దీపాలు వెలిగించటానికి! భూతదయను అహింసను బోధించే చర్చిలలోని జ్యోతులను వెలిగించటానికి! తన నెత్తురులో తానే పొర్లుతూన్న ఆ తిమింగిలానికి ఒక ప్రక్కన కుంచ మంతటి పుండు వున్నట్టు కానవచ్చింది.

"భలే చోటు! ఇక్కడ ఒకసారి పొడిస్తే బాగుండును" అని ఫ్లాస్క్ అన్నాడు.

"అలా ఏమీ పొడవనక్కర లేదులే" అన్నాడు స్టార్‌బక్. కాని, దయాళువైన స్టార్‌బక్ జోక్యం కలిపించుకొనే లోగానే ఆ పుండుమీద ఈటె నాటింది. ఆ పోటుతో ఆ గాయంనుండి మురుగు నెత్తురు జల్లు బయటకు చిమ్మింది. చుట్టు ప్రక్కలంతా నెత్తురు వరదలై పోతూండగా, వెర్రి కోపంతో, దుర్భర బాధతో, ఆ తిమింగిలం ఒక్కసారి పడవ మీదికి వురికింది. సగర్వంగా నిలబడివున్న నావికులమీద

నెత్తురు చిమ్మింది. ఫ్లాస్కు పడవను తల్లక్రిందులుగా పడగొట్టి ధ్వంస మొనర్చింది. అది దాని కడపటి దెబ్బ. విశేషంగా నెత్తురు పారటంవల్ల ఆ ప్రాణి అలిసిపోయింది. ఇక చేయునది లేక ఆ భీభత్సకార్యం నుండి విరమించింది. తన ఒంటిరెక్కని కొట్టుకొంటూ ఒక ప్రక్కగా పడిపోయింది. క్రుంగిపోతూ వున్న విశ్వంవలె గిరగిరా తిరుగుతూ, తన పొట్టను చూపిస్తూ ఒక పెద్ద మొద్దువలె పడి అసువులు విడిచింది. చచ్చిపోతూ అది విడిచిన నిశ్వాసము ఎంత హృదయవిదారకమో చెప్ప లేను. చక్కని నీటిబుగ్గనుండి ఉద్గమించే నీటి జాలును అగోచరమాలైన ఏ క్రూరహస్తములో నిరోధించినప్పుడు ఆ జాలు క్షీణించి, క్షీణించి నిలచి పోయినట్లు, చనిపోయే తిమింగిలపు నిశ్వాసం వినవచ్చింది.

ఓడ వచ్చేవరకు పడవలలోని నావికులు వేచి యున్నారు. తిమింగిలం తనలో దాచిపెట్టుకొన్న సంపదను ఎవ్వరూ ముట్టుకొనక ముందే, అది నెమ్మదిగా నీటిలోకి మునిగిపోయేటట్టు కనిపించింది. స్టార్‌బక్ ఆనతిచొప్పున పెద్ద ఇనుప మోకులు వేసి కట్టి, దానిని పడవలకు వ్రేలాడతీశారు ఓడ రాగానే, ఉపాయంగా ఓడప్రక్కకి ఈడ్చి, గట్టి గొలుసులతో జారిపోకుండా బిగించి కట్టారు.

దానిని కొయ్యడం మొదలు పెట్టగానే, వెనుక చెప్పిన కుంచంవంటి పుండు క్రిందుగా ఒక ఈటె శరీరంలో దాగి ఉన్నట్టు కనబడింది. ఈటె ముక్కలు తిమింగిలాల శరీరాలలో ఉండటం, వాటి చుట్టూ కండ పెరగటం మామూలే. ఈ

తిమింగిలానికి ఆ పుండు పుట్టటానికి వేరే కారణముండాలి. ఇంతకంటె చిత్రమింకొకటి ఈ కుదిగబడిపోయిన కావుకి కొద్ది దూరంలో ఒక రాతి బల్లెం యొక్క మొన కనబడింది. దాని చుట్టూ కండ బాగా పెరిగివుంది. ఆ రాతి బల్లెమును ఎవరు విసిరినట్టు! ఎప్పుడు విసిరినట్టు! పాశ్చాత్యులు అమెరికాను కనుగొనక పూర్వం ఎవడో ఎఱ్ఱఇండియను వేసివుంటాడు.

ఆ మహాకాయమునుండి ఇంకా ఏమేమి వింత వస్తువులు బయటపడేవో భగవంతునకు ఎరుక. ఆ తిమింగిలం క్రుంగటం మొదలుపెట్టాక, ఓడ అటూ ఇటూ కదిలిపోసాగింది. దానితో ఈ వెదకటం ఆగిపోయింది. స్టార్ బక్ మాత్రం అన్వేషణ విడువలేదు. చివరిదాకా అతను ఏవో వెతుకుతూనే ఉన్నాడు. ఈలోగా 'పెకోడ్' మీది వస్తువులన్నీ ఒక ప్రక్కకి ఒరిగి పోయాయి. కట్టుమీద ఒకవైపు నుండి ఆవలి వైపుకి వెళ్ళటమంటే బాగా ఏటవాలుగా ఉండే ఇంటి చూరు ఎక్కడంవంటి పనియైనది. ఓడ గదులకు, అంచులకు పొదిగివున్న దంతపు ముక్కలు ఆ కుదుపుకి బయటకు వచ్చేశాయి. తిమింగిలం నీటిలో మెల్లగా క్రుంగిపోతూ వుంది. ప్రతి క్షణమూ కొన్ని టన్నుల బరువుతో ఓడ దిగజారటం మొదలు పెట్టింది.

స్టబ్ ఆ తిమింగిలాన్ని చూస్తూ, "ఉండవే—నీళ్ళల్లో మునిగిపోదామనే తొందరేమిటి! ఒరేయ్ అబ్బాయిలూ—మనం ఇలా చూస్తూ కూర్చోవటమేనా! వెళ్ళి ఆ గొలుసు అని తెగగొట్టి వేయండి—" అని కేకపెట్టాడు.

క్వీక్వెగ్ గొడ్డలివంటి ఒక పనిముట్టు తీసుకొని, తిమింగిలాన్ని ఓడకి బంధించిన గొలుసులని కొట్టడం మొదలు పెట్టాడు. ఒక్క సారిగా ఆ గొలుసులు తెగాయి. ఓడ ఒక ప్రక్కకి వెళ్ళిపోయింది. తిమింగిలం మునిగిపోయింది.

అప్పుడే వధింపబడిన తిమింగిలం, నీటిలో మునగటం విచిత్రమైన సంఘటన. దీని అర్థమేమిటో అందరికీ తెలియదు. సాధారణంగా, చనిపోయిన తిమింగిలం నీటిమీద తేలుతుంది. ఇలా మునిగిపోయే తిమింగిలాలు బాగా ముసలివి. వాటిలోని క్రొవ్వు కరగిపోయి, ఎముకలు బరువెక్కిపోయినాయి. ఐతే, ఆ మునకకు కారణం క్రొవ్వు లేకపోవటమే అనుకోవచ్చు. కాని, మంచి యుక్త వయస్సులో ఉండి, బాగా క్రొవ్వుతో నిండియున్న తిమింగిలాలు వధింపబడ్డా అవికూడ మునిగిపోవడం కద్దు.

ఇంకో సంగతి! అన్ని జాతుల తిమింగిలాలు ఒకే విధంగా మునిగిపోవు. కొన్ని జాతులు ఎక్కువగా మునిగిపోతాయి. దీనికి కారణం వాటిలో అధికంగా ఉండే ఎముకలే అయివుంటుంది.

ఒకసారి మునిగిపోయిన తిమింగిలం కొన్ని గంటలో, కొన్ని రోజులలో గడచిన పిమ్మట పైకి తేలటంకూడా కద్దు. దీనికి కారణం ప్రస్ఫుటమే. దానిలో అనేక వాయువులు రేగుతాయి. దాని కాయం చాలా ఉబ్బి పెద్ద రబ్బరుబంతి వలె అయిపోతుంది. అటువంటప్పుడు పెద్ద యుద్ధనౌకకూడా ఆ తిమింగిలంను అణచి ఉంచజాలకపోతుంది. న్యూజిలెండు

ప్రాంతంలో తిమింగిలం మునిగిపోతున్న సూచనలు కనబడ గానే దానికి నీళ్ళల్లో తేలే పెద్ద పెద్ద పీపాలవంటి వాటిని వేసి కడదారు. ఒకవేళ తిమింగిలం మునిగిపోయి తిరిగి కొద్దిగా తేలిన తరువాత అది ఎక్కడుందో కనుక్కోవటానికి పీటివల్ల వీలవుతుంది.

ఇక్కడ తిమింగిలం మునిగిపోగానే ఓక స్తంభాలమీద నున్నవాళ్ళు ఒక కేక వేశారు. "యంగ్ ఫ్రీ నుంచి చిన్న పడవలని దించుతున్నారు" అని. చుట్టు ప్రక్కల ఒకే ఒక తిమింగిలం కనబడుతోంది. అది అతివేగంగా ఈదుకుపోయే తిమింగిలాల జాతికి చెందినది. అందువల్ల దానిని పట్టుకోవటం అసాధ్యం. కాని దీన్నే మరొక జాతి తిమింగిలం అనుకొని కొందరు పొరబడుతుంటారు. డిరిక్, అతని బృందము దుర్లభ మైన ఆ తిమింగిలం వెంటబడ్డారు. ఆ పడవల వెంటనే 'యంగ్ ఫ్రీ' కూడా వరుగెత్తింది. అతనితో అవన్నీ దూరంగా అదృశ్యమైనాయి. లోకంలో ఎన్నో పోకడలు!

50. తిమింగిలపు మందలు

బర్మానుండి ఆగ్నేయ దిక్కుగా విస్తరించియున్న మలాకా ద్వీపకల్పం ఆసియా ఖండమంతటికీ దక్షిణపుకొస : ఆ ద్వీపకల్పం ప్రక్కనే సుమత్రా, జావా, బాలి, టిమోర్ వంటి అనేక ద్వీపాలు చుట్టూ అగడ్తగల కోట బురుజులవలె ఉంటాయి. అవే ఆస్ట్రేలియాను ఆసియాతో కలుపుతాయి. ఈ ద్వీపాలలో అక్కడక్కడ చిన్నచిన్న రేవులు ఉన్నాయి. వీటివల్ల ఇవి ఓడలకూ, తిమింగిలాలకూ విశ్రాంతిస్థానాలు. వీటిలో ముఖ్యమైనవి సుండా, మలాకా జలసంధులు. మలాకా జలసంధి ద్వారానే చైనాకు వెళ్ళే ఓడలు పోతూవుంటాయి.

సుండా జలసంధి, సుమత్రా, జావాల మధ్య ఆ ద్వీప ప్రాకారానికి నడుమ ఉంది, ప్రాకారావృతమైన ఒక మహా నగరానికి సింహద్వారం వలె ఉంటుంది ఆ జలసంధి. ఆ ద్వీపాలలో అపరిమితంగా ఉన్న సుగంధద్రవ్యాలు, పట్టులు, రత్నాలు, బంగారము, దంతము మొదలైన సంపదలను సర్వభక్షకులైన పాశ్చాత్యుల బారినుండి కాపాడటానికా అన్నట్టు ప్రకృతి సిద్ధమైన ఈ ద్వారబంధం ఉండటం ఎంతో సముచితమైన దనిపిస్తుంది. కాని అది దుర్బలం, మధ్యధరా, బాల్టిక్ సముద్రాల ప్రాంతాలలో ఉన్నట్టుగా, సుండా జలసంధి తీరాలలో పెద్ద కోటలేమీ లేవు. [illegible], ఈ ప్రాగ్దేశస్థులు అటువైపువెళ్ళే పడవలు తమ తెరచాపలను దించి

జోహారులు చేయవలెనని అర్థించరు. ఆ పడవలు అట్టి అవమానం పొందకుండానే శతాబ్దాల తరబడి జావా సుమత్రాల మధ్య ఎంతో ఖరీదైన సరకులని వేసుకొనిపోతూ నేవున్నాయి. ఆ దేశస్థులు ఈ రిత్తలాంఛనం వదలుకొన్నా తమకు రావలసిన దానిని ఘనంగానే రాబట్టుకొంటారు.

మలయా దేశపు ఓడ దొంగలు, ఆ జలసంధి అంచున ఉండే గుబురుల మధ్య దాగి, అటువెళ్లే ఓడలమీదకి ఉరికి, చంపివేస్తామని బెదరిస్తూ కావలసిన దేదో తీసికొని పోయేవారు. కాలక్రమంగా యూరోపియన్లు వాళ్ళకు నేర్పిన గుణపాఠంవల్ల ఈ దోపిడీ తగ్గింది. కాని ఇప్పుడుకూడా, అప్పుడప్పుడు ఏ అమెరికను పడవనో, ఆంగ్లేయుని పడవనో ఆ దొంగలు నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టినట్టు వార్తలు చెవిని పడుతూనే ఉంటాయి.

గాలిచక్కగా వుంది. ఈజలసంధిని "పెకోడ్" చేరుతోంది దీనిద్వారా ఉత్తరదిశగా, తిమింగిలాలుండే కావులకి పోదామని అహాబ్ ఉద్దేశం. అక్కడనుండి ఫిలిప్పీను దీవుల మీదుగా, జపాన్ వరకూ వెళ్ళి అక్కడ తిమింగిలాల వేటకి సకాలంలో చేరాలని కూడా అతను అనుకొన్నాడు. ఈ త్రిప్పటవల్ల పసిఫిక్ మినహా తిమింగిలాలు విహరించే ప్రదేశాలన్నీ చుట్టబెట్టినట్లు అవుతుంది. మిగిలిన స్థలాలో దొరకకపోయినా, 'మాబీడిక్' పసిఫిక్‌లో దొరికి తీరుతుందని, అక్కడ దానితో పోరాడవచ్చునని అతని నమ్మకం.

కాని ఇప్పటి మాటేమిటి! ఈ త్రిప్పటలో భూమి మీద కాలుపెట్టడమంటూ లేదా! అతని అనుచరులు గాలినే తాగుతారా! నీటికోసమైనా ఎక్కడనన్నా ఆగాలి. యుగ యుగాలుగా సూర్యుడు మండిపోయే తన వలయంలో ఇతర పదార్థ నిరపేక్షుడై తిరుగుతూనే ఉన్నాడు. అహాబ్ కూడ అటువంటి వాడే. ఇది తిమింగిలాల వేటగాళ్ళకి ఒక ప్రత్యేకత. మిగిలిన ఓడలలో కావలసినన్ని సరుకులు ఉంటూంటాయి. వాటిని పరదేశాల రేవులలో దింపుకోవచ్చు. కొత్త సరకులు వేసుకోవచ్చు. తిమింగిలాల వేటకు బయలుదేరిన ఓడలో ఆ ఓడని నడిపే వారికి అవసరమైన సామగ్రి తప్ప ఇవేమీ ఉండదు. కొన్ని సంవత్సరాలకు సరిపడే నీటిని నిల్వ చేసికొని పోతారు. నన్‌టుకెట్‌లో పట్టిన నీటినే ఆ యూరి వాడు, ఈ ఓడలో మూడేళ్ళ తరువాత కూడా తాగుతాడు. అందువల్లే మిగిలిన ఓడలు న్యూయార్క్‌నుండి చైనాకు వెళ్ళి తిరిగివస్తూ అసంఖ్యాకములైన రేవులలో ఆగుతూ వెళ్ళినా తిమింగిలపు వేట ఓడ ఒక్క అంగుళంమేర భూమినైనా చూడజాలదు. ఆ ఓడలోనివాళ్ళు అన్ని యేండ్లలోను తమ వలెనే సముద్రయానం చేసేవాళ్ళను తప్ప ఇతర మానవులను చూడరు. భూప్రపంచంలో ఇంకొక జలప్రళయం వచ్చిందనేవార్తను వాళ్ళకు నీవు తెలియజేస్తే "ఇదిగో మా నావ" అని సమాధానం ఇస్తారు.

జావా ద్వీపానికి పశ్చిమాన అనేక తిమింగిలాలని పట్టుతూ వుంటారు. సుండా జలసంధి సమీపిస్తున్న కొద్దీ నా

ఓడలో అందరూ అప్రమత్తులై ఉండాలని హెచ్చరిక వచ్చింది. దూరాన కొబ్బరికొట్లతో నిండిన గుట్టలు కన బడ్డాయి. కర్పూరాగపు వాసనతో గాలి వీచింది. కాని, తిమింగిలాలు విడిచే నీటిజల్లు ఒక్కటీ పొడచూపలేదు ఇక-లాభంలేదనుకొంటూ ఓక జలసంధిని ప్రవేశించిరాది. ఇంతలో ఓడ పైనుండి ఒక సంతోషవార్త అందినది. ఒక దివ్యమైన దృశ్యం మా కంటబడినది.

ఇక్కడొక మాట చెప్పాలి. నిర్విరామంగా వాటిని మానవులు సప్తసముద్రాలలోనూ వెంటాడి వేటాడు తూండటం వల్ల తిమింగిలాలు మునుపటివలె చిన్న చిన్న గుంపులుగా కాక, పెద్ద పెద్ద మందలుగా సంచరించడం మొదలుపెట్టాయి. ఈ మందలను చూస్తే పరస్పర సహాయార్థం ఒడంబడిక చేసుకొని ఆత్మరక్షణకోసం గుమికూడిన దేశాలవలె తోస్తవి. అందువల్లనే, ఒకొక్కసారి, ఎన్నాళ్ళకూ ఒక్క తిమింగిలమైనా కంటబడకపోయినా, ఒక్క-సారిగా కొన్ని వేల తిమింగిలాలు అగుపిస్తాయి.

రెండు మూడు మైళ్ళ దూరంలో ఒక పెద్ద అర్ధచంద్రాకారంలో ఎడతెగని ధారలవలె తిమింగిలాల నుండి నీటిజల్లులు ఆ మధ్యాహ్నపు ఎండలోకి విరజిమ్మబడుతూ వున్నాయి. ఒక జాతి తిమింగిలం విడిచే జల్లు రెండు పాయలుగా చీలి క్రిందపడుతూవుంటుంది, మరొక జాతి తిమింగిలం విడిచే జల్లు ఒకే ఎగసి, క్రిందపడుతూ వుంటుంది.

'పెకోడ్' ఒక పెద్ద అలమీదకి వచ్చింది. దాని తట్టు మీద నుంచి ఈ తిమింగిలాల నీటిజల్లులు దూరానవున్న ఏదో పెద్ద నగరంలోని పొగగొట్టాలనుండి పైకి వచ్చే పొగల వలె కనబడ్డాయి.

యుద్ధరంగానికి తరలిపోయే పటాలాలు ఏదైనా అపాయకరమైన ఒక కొండలోయ దాటవలసి వచ్చినప్పుడు త్వరగా దాటి బయట పడవలెనని గమనవేగం హెచ్చించే రీతిగా ఈ తిమింగిలాల మందలు కూడా ఆ జలసంధిని దాటి పోవాలని త్వరపడుతున్నాయి. అవి ఒండొంటిని కదియ చేరి, ఎడములేకుండా కలిసిపోతున్నాయి.

తెరచాప లన్నిటినీ విప్పి 'పెకోడ్' వాటి మీదకి దాడి వెడలింది. ఈటెగాళ్ళందరూ తమ తమ ఈటెలతో సిద్ధంగా ఉండి, ఉల్లాసంగా కేకలు వేస్తున్నారు. గాలి అనుకూలంగా వుంటే ఈ తిమింగిలాల సుండా జలసంధి ద్వారా తరిమి, అవి అవ్వతలి ప్రక్కనున్న సముద్రంలోకి వెళ్ళగానే కొన్నిటినైనా పట్టుకోలేకపోతామా అని వీళ్ల విశ్వాసం. ఆ మందలో "మాబీడిక్" మాత్ర మెందుకు ఉండకూడదు! మేము ఆ తిమింగిలాలనిని అతివేగంగా తరుముతూండగా, టాష్టెగో మా దృష్టిని వెనుకప్రక్కకు మరల్చే ఒక పెద్ద కేక వేశాడు.

మా ముందు వెళ్ళుతున్న అర్ధచంద్రాకారపు సమూహం వలెనే వెనుక కూడా ఒకటి కనబడింది. అక్కడ కనబడే పొగలు మాత్రం తిమింగిలాల ముక్కుల వలె ఉన్నా అవి పూర్తిగా అదృశ్యంకాక కాసేపు తచ్చాడుతున్నాయి.

అహాబ్, దూరదర్శినిని అటువైపు తిప్పి, "వాళ్ళు మలయా వాళ్ళు మనమీదకి వస్తున్నారు" అని కేకవేశాడు.

"పికోడ్" జలసంధిని పూర్తిగా ప్రవేశించాక దీని సంగతి చూడవచ్చులే అన్నట్టు ఊరుకున్న ఈ ఆసియా వాసులు తమ జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికా అన్నట్టు మా వెంట అతివేగంగా రానారంభించారు. కాని దీనివల్ల తిమింగిలంను వేటాడవచ్చిన మా ఓడ, తానే వేటాడబడే అవస్థలోపడి, వేగాన్ని ఎక్కువ చేసింది. అహాబ్ తటుమీద అటూ ఇటూ పచార్లు చేస్తూ, తాను వెంటాడుతున్న మూకను ముందువైపూ, తనను వెంటాడుతున్న దొంగలను వెనుక వైపు చూస్తున్నాడు. జలసంధిలోనుండి వెళ్ళుతూ ఉండగా తన పగను సాధించటానికి అదే ద్వారమనీ, ఆ ద్వారము గుండానే తాను తిమింగిలాలని వెంటాడుతున్నా, తననికూడా అదే కారణంతో అనేకమంది దొంగలు, నాస్తికులు వెంటాడుతూ, తూలనాడు తున్నారని గ్రహించాడు. ఈ విభిన్నాలోచనలు అతని మెదడులో మసలినప్పుడు అతని నుదురు ముడుతలు పడి, ముడుచుకుపోయింది. దాన్ని చూస్తే, నీటి పోటు తీసిన తరువాత కనబడే ఇసుక జ్ఞాపకం వచ్చింది.

మిగిలిన వాళ్ళకెవ్వరికీ ఇటువంటి ఆలోచనలు పొడమి నట్టులేదు. ఓడ దొంగలను వెనుక పడవేసి వాళ్ళకు అందక 'పికోడ్' ఆ జలసంధిలో నుంచి బయటపడి విశాలమైన సముద్రము మీదకి వచ్చింది. ఈటెగాళ్ళకు తిమింగిలాలు తమకంటె చాలా ముందుకు పోయాయన్న చింతేగాని

తమ మలయనాలపై విజయము సాధించి బయట పడ్డామన్న
సంతోషమే లేదు! అయినా, వేగం హెచ్చించి, తిమింగి
లాలని సమీపించారు. గాలి తగ్గడంతో పడవలను నీటిమీదికి
దింపారు. మైలు దూరాన ఉన్నా, ఈ పడవలు తమవెంట
రానున్నాయని ఎట్లా పసిగట్టాయోగాని, తిమింగిలాలన్నీ
మళ్ళీ దగ్గరగా ఒండొంటిని కదియచేరి మరింత వేగంగా
పోవసాగినాయి.

కొన్ని గంటలసేపు పడవలను నడిపి, ఇంక ఆ వేట
లాభంలేదని మేము అనుకొంటూ ఉండగా, తిమింగిలాలుకూడా
మనఃస్థైర్యము చెడియున్నట్టు కనబడ్డాయి. యుద్ధవీరుల వలె
బారులు తీర్చి వెడుతూవున్న ఆ జంతువులు పంక్తి విడిపోయి
ఒకటొకటే పిచ్చిఎత్తినట్లు దిక్కు తెలియకుండా అటూ
ఇటూ పోతూవుంటే వాటి మనస్సులో కలిగిన భయం
వ్యక్తమయింది. వాటిలో కొన్ని శక్తిహీనతతో నీటిపైన
తేలడం మొదలుపెట్టాయి. పచ్చికబైళ్ళల్లో తోడేళ్ళు వెంట
బడి తరిమినప్పుడు గొఱ్ఱెల మంద కూడా ఇంత భయపడి
యుండదు. మందలు మందలుగా వెళ్ళే జంతువులలో అప్పు
డప్పుడు ఇటువంటి భీతి కలగటం చాలా సహజం. వేలకొద్దీ
కలిసి గుంపులు గుంపులుగా వెళ్లే అడవి దున్నలు ఒక్క
కాతుని చూస్తే హడలిపోతాయి! నాటకశాలలలో ఇరికి
కూర్చున్న మనుష్యులను చూడండి: అగ్నిప్రమాదం వాటి
ల్లుతూ వుందని తెలియరాగానే, అందరూ ఒక్కసారిగా బయ
టకు పరుగెత్తి, ఒకళ్ల నొకళ్ళు తోసుకుంటూ తొక్కిడిలో,

ఒకళ్ల నొకళ్ళు చంపుకొన్నంత పనిచేస్తారు! ఇప్పుడు ఈ తిమింగిలాలు భయాన్ని గురించి కూడా ఆశ్చర్యపడవలసిన విశేషమేమీ లేదు. మనవంటి జంతువులే అవికూడ.

విడివిడిగా ఒకొక్క తిమింగిలమూ ఎంతో తీవ్రంగా చలిస్తూవున్నా గుంపుమాత్రం ముందుకుగాని వెనుకకుగాని వెళ్ళిన జాడలేదు. పడవలు మూడున్నూ, ఆ గుంపుకు మూడు వైపులకు వెళ్ళిపోయినాయి, కొన్ని నిముషాలు దృష్టిని నిలిపి చూచి, క్వీకెగ్ అన్నిటికంటె చివర ఉన్న తిమింగిలం మీద తన ఈటెను విసిరివేశాడు. ఆ తిమింగిలం మా మీద పెద్ద నీటిజల్లు విడచి, మంద మధ్యలోకి చొచ్చి జాడ కానరాకుండ పోయింది. ఈ వేటలలో జరిగే సాధారణ వ్యవహారమదే. నీవు గురిచూచి కొట్టిన జంతువు దెబ్బ తప్పించుకొని మందలో చొచ్చినప్పుడు, నీకు వివేచన నశించిపోతుంది. గుండె దడ పుట్టుతుంది.

అది తనకు జలగవలె పట్టుకొన్న ఆ ఈటెను విదిలించుకోవటానికి, గుడ్డిగా ఆ మందలోకి దూకింది. దానితో బాటు మా పడవలుకూడా ఆ మందలో పడిపోతున్నాయి. వెఱ్ఱి ఆవేశంతో పారిపోతున్న తిమింగిలాల వల్ల మా పడవ చుట్టూ చిన్నచిన్న మంచు లంకలు తేలినట్లు అనిపించింది. అల్లిబిల్లిగా చుట్టువారియున్న కాలువల, జలసంధుల మధ్యనుంచి తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ, ఎప్పుడు మిన్ను విరిగి మీద పడుతుందో తెలియక, కొట్టుకొని పోయినట్లనిపించింది.

ఏ మాత్రమూ బెదరిపోకుండా, క్వీక్వెగ్ మా పడవను ఆ తిమింగిలాల మధ్యకు పోనిచ్చాడు. నేర్పుతో అడ్డువచ్చిన తిమింగిలాలని తప్పించుకొంటూ పడవను నడుపుతూంటే స్టార్‌బక్ ప్రక్కన నిలబడి తన ఈటెతో అందినన్ని తిమింగిలాలని పొడిచి దారిచేశాడు. తెడ్లు వేసేవాళ్ళు కూడ కేకలు వేస్తున్నారు. ఎదురుగావచ్చిన ఒక పెద్ద తిమింగిలాన్ని చూసి ఒకడు "దారియ్యి" అంటూ కేకపెట్టాడు. ఇంకొక తిమింగిలం మా పడవకు తన తోకని ఆనించబోతూంటే, "తోకని తీశేయ్" అంటూ అరిచాడు!

తిమింగిలాల వేటకి వెళ్లే పడవలలో "డ్రగ్"లు అన బడే సాధనా లుంటాయి. వీటిని మొట్టమొదట నన్‌టుకెట్ నందలి ఎఱ్ఱ ఇండియన్లు తయారు చేశారు. రెండు చెక్క దిమ్మలని గట్టిగా బిగించి కడతారు. దీనికి ఒక పొడవుపాటి ఇనుప తీగె కట్టి, ఈ తీగెకు రెండో చివర ఒక ముడి వేసివుంచి, దానిని అవసరమైనప్పుడు ఈటెకు తగిలిస్తారు.

గుంపులు గుంపులుగా తిమింగిలాలు వచ్చినప్పుడు ప్రతిదాన్ని తరమటం కష్టం కాబట్టి ఈ అలసిపోయిన తిమింగిలాల మీద "డ్రగ్" లని ఉపయోగిస్తూ ఉంటారు. పైగా, అన్ని తిమింగిలాలు ప్రతిరోజూ కనబడవు. సాధ్యమైనన్నిటిని చంపాలి. ఒకవేళ చంపటానికి వెంటనే వీలుకాకపోయినా, చిక్కినన్ని తిమింగిలాలని గొలుసుతోనైనా బంధించుకోవాలి; సావకాశంగా చంపటానికి ఇటువంటి సమయాల్లో "డ్రగ్"లు ఉపయోగిస్తాయి. మా పడవలో మూడు "డ్రగ్"

లున్నాయి. మొదటి రెంటిని విసిరారు. ఆ పని ఫలించింది. తిమింగిలాలు పారిపోవ జూచాయి కాని ఈ "డ్రగ్" ల బరువువల్ల వాటి వేగం తగ్గిపోయింది. ఇనుపగుండు బిగించిన గొలుసుతో బంధించబడ్డ నేరస్థులవలె అవి ముందుకు సాగలేక పోయినాయి. మూడవదానిని విసరటంలో కొంత పొరపాటు జరిగింది. అది వెళ్ళి పడవలోనే వున్న ఒక బల్లకి తగిలి తనతోపాటు ఆ బల్లనికూడా లేవదీసుకుపోయింది. దానితో ఆ బల్లమీాద కూర్చున్నవాడు క్రిందపడ్డాడు. పడవకి దెబ్బ తగిలినచోట బట్టలు కుక్కి లోపలికి నీరు రాకుండా ఆప గలిగాము.

తిమింగిలాల సమీాపంలో ఉన్నాముగనుక. ఈ "డ్రగ్"లతో ఉన్న ఈటెలని ప్రయోగించటం సాధ్యమైనది. లేకపోతే, అది సులభమైన పనికాదు. ఈటె తగలగానే తిమింగిలం ప్రక్కకు వెళ్ళిపోయేది. ఆ ఊపుకు మేము ఒక కొండవాగునుండి, కొలనులోకి జారినట్టు మిగిలిన తిమింగిలాల మధ్యకు చొచ్చిపోవటం తటస్థించేది.

ఆ తిమింగిలాల నడుమఉన్న సముద్రభాగం అతి ప్రశాంతంగా, హాయిగొల్పేదిగా ఉంది. ఎనిమిదేసి, ఏడేసి తిమింగిలాలు గుంపులు గుంపులుగా, గిరగిరా తిరిగి పోవటం కనబడింది. అవి సర్కసులో గుండ్రంగా పరుగెత్తే గుర్రాల వలె ఉన్నాయి. ఆ మందలనుండి మేము బయటపడే మార్గం కనబడలేదు. మమ్మల్ని లోపలికి రానిచ్చి, అక్కడ బంధించి చేసిన ఆ జంతువులు చుట్టిన వ్యూహంలోంచి ఎలా బయట

పడటమనేది మా సమస్య. అలాగా ఆడతిమింగిలాలు తమ పిల్లలతో మాపడవ ప్రక్కకు వస్తూ పోతూ వుండేవి.

వలయాలుగా తిరుగుతూవున్న తిమింగిలాల మధ్యనున్న ప్రదేశాన్ని, చిన్న చిన్న గుంపులుగా తిరుగుతూవున్న తిమింగిలాల మధ్యప్రదేశాన్ని కలిపితే ఈ జంతుజాలం దాదాపు రెండుమూడు చదరపుమైళ్ళ విస్తీర్ణాన్ని ఆక్రమించుకొన్నట్టు తేలుతుంది. కనుచూపుమేర తిమింగిలాలు వెదజల్లే నీటిజల్లులే కానవచ్చాయి. ఇంత విస్తీర్ణంలోనూ పిల్లతిమింగిలాలను, ఆడతిమింగిలాలను గుంపునడిమిభాగాన మందవేసి మగవి, చుట్టూ పొలముకు కంచెవలె నిలబడ్డట్టు తోచింది. అవి ఎందుకు నిల్చిపోయినవో తెలియదు. ఆపిల్లలు నిర్భయంగా, అమాయకంగా వశీకరణ మంత్రముగ్ధములైనట్లు, పెంపుడు కుక్కలవలె, మా దగ్గరకు వస్తూవుండేవి. క్వీకెగ్ వాటినుదుటిమీద చేతితో తట్టేవాడు. స్టార్‌బక్ ఈటెతో వాటి వీపుమీద గీరేవాడు.

ఈ అద్భుత దృశ్యానికి అవతలిప్రక్క మరొక వింత ప్రపంచం కనబడింది. ఈ పిల్ల తిమింగిలాల తల్లులు నీటిమీద తేలుతూ కనబడ్డాయి. వాటిలో కొన్ని ఈనమోపియున్నట్లు వాటి కటి భాగాన్నిబట్టి తెలియవచ్చింది. కొన్ని పిల్లలకు పాలుకుడుపుతూ ఉన్నాయి. ఆ పిల్లలు పాలుత్రాగుతూనే మావైపు కన్నుపెట్టి చూస్తున్నట్టు పొడకట్టింది. వాటి దృష్టికి మేమెల్లా కనబడ్డామో! వాటి ప్రక్కనే ఉన్న తల్లులు

కూడా మావైపే చూస్తూ ఉన్నాయి. ఆ పసిపిల్లల్లో ఒకటి, బహుశః ఆ క్రిందటి రోజునే పుట్టి ఉంటుంది. అది పదు నాలుగు అడుగుల పొడవు, అరడుగుల వెడల్పు ఉంది. తల్లి గర్భంలో ఒదిగి పండుకొని కాలము పుచ్చిన అవస్థనుంచి అది ఇంకా పూర్తిగా తేరుకొన్నట్లులేదు. మృదువైన దాని రెక్కలు, తోకా ఇంకా ముడుతలు పడియే ఉన్నాయి.

అంతలో, "తాడు! తాడు!" అంటూ అరిచాడు క్వీకెగ్ ప్రక్కకుచూస్తూ. "ఎవరు వేశారు! రెండు తిమింగిలాలు ఒకటి పెద్దది, ఒకటి చిన్నది." అంటూ కేకలు పెట్టాడు:

"నీకేమి రోగం వచ్చింది? అలా అరుస్తున్నావ్" అన్నాడు స్టార్ బక్.

"అటు చూడండి—" అంటూ క్రిందివైపు చేయి చాచాడు క్వీకెగ్.

ఎంతో నిడివిగా ఒక తిమింగిలపు బొడ్డు కానవచ్చింది ఆ శిశువుకు ఇంకా బొడ్డు ఊడలేదన్నమాట. మాపడవమీది నుండి క్రిందికి జారవిడువబడిన తాడు దానిబొడ్డుకు చుట్టుకొని ఆ పిల్లను బంధించింది. ఇది అపురూపమైన సంఘటన. ఈవేటలో, ఆ కొలనులో సముద్రపు రహస్యాలు చాలా బయటపడ్డాయి. చిన్నచిన్న తిమింగిలాల సగలు ఆ

ప్రాంతంలో మందలు మందలుగా చాలా కనబడ్డాయినూకు 1. ఒకదాని తరువాత ఒకటిగా భయావహములైన వలయాలు తమచుట్టూ ఏర్పడుతూ ఉన్నప్పటికీ మధ్యలోనున్న తిమింగిలాలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమపరసాలను తీర్చుకొంటూనే ఉన్నాయి. ఎటువంటి సంక్షోభస్థితిలోనైనా నేనుకూడ అతిప్రశాంతంగా ఉంటూంటాను. దుష్టగ్రహాలు నన్ను పీడిస్తూనాన్నా హృదయాంతరాళమును అనంతమైన ఆనందంలో నింపుకొంటాను.

మేమిలా ముగ్ధులమై ఉండగా, దూరంగా ఉన్న ఇతర పడవల వేగానికి ఫలితంగా తిమింగిలాలలో కలవరపాటు రేగటం కనబడింది. వెలుపలి పరసలో ఉన్న తిమింగిలాలతో పడవల పోరాటం సాగుతోంది కాబోలు "డ్రగ్"లు తగులుకొన్న తిమింగిలాలు వెర్రికోపంలో, అతివేగంగా అటూ ఇటూ పారిపోవటం మాట అటుంచి, కట్టకడకు మా కంటబడిన ఒక ఘోరసంఘటనను గురించి చెప్తాను.

---

1. ఆడుతిమిగిలం సంవత్సరం పొడుగునా, నిర్ణీతకాలమంటూ లేక, ఈనుతూనే ఉంటుంది, గర్భధారణము సాధారణంగా తొమ్మిది నెలలు ఉంటుంది. ఒక్కసారి ఒక బిడ్డనే కంటుంది. అరుదుగా రెంటిని కంటుంది. తల్లికి రెండు రొమ్ములుండటంవల్ల ఇది సహజమనిపిస్తుంది. ప్రమాదవశాత్తు ఈ రొమ్ములకు దెబ్బతగిలితే తల్లియొక్క పాలూ, నెత్తురూ రెండూ నీటిని వివర్ణం చేసేస్తాయి. ఆ పాలు చాలా రుచిగా ఉంటాయి, చాలా బలమైన ఆహారం కూడాను. కొన్ని పళ్ళతో కలిపి తింటే మరీ బాగుంటాయి.

మంచిశక్తి, చురుకుదనముకల తిమింగిలంను వశపరచుకోవటానికి, దానితోక నరమును కోసివేయుటం ఒక ఉపాయం. ఒకచిన్న పారమూతి పనిముట్టుతో ఈ పని చేస్తారు. తిమింగిలాన్ని లాగటానికి వీలుగా ఆ పనిముట్టుకు ఒక త్రాడుకట్టి ఉంటుంది. ఒక తిమింగిలానికి తోకనరంమీద గాయంపెట్టగా అది విపరీతమైన బాధతో అక్కడ గిరి తిరుగుతూవున్న మిగిలిన తిమింగిలాల మధ్యపడి కొట్టుకోవడం మొదలుపెట్టింది, త్రాటినికూడా లాగుకొని పోతూవుంది. దాని బాధకంటె, ఇతర తిమింగిలాలకు కల్గినభీతి ఎక్కువగా కనపడింది. ఆ తిమింగిలం ఆ పారతోనే పరుగులు తీయుటం మొదలుపెట్టింది. అది పిచ్చి ఎత్తినట్టు అటూ ఇటూ తోకను ఆడిస్తూ పరుగులు తీస్తూవుంటే ఆ పారతగిలి మరికొన్ని జంతువులకుకూడా గాయాలు ఏర్పడ్డాయి. ఆ బృందమంతా సంక్షుబ్ధమయింది.

మేమున్న కొలని యంచుల వద్దనున్న తిమింగిలాలు దగ్గర దగ్గరగా వచ్చి ఒకదానిపై ఒకటి పడుతున్నాయి. పిల్లలు మొదలైనవి మాయమైనాయి. మా తావున మునుపటి ప్రశాంతత పోయింది. పెద్దపెద్ద మంచు గుట్టలు కదలివచ్చినట్లు ఆవన్నీ మధ్యభాగానికి చేరి ఒకదానిమీద ఒకటిపడి, చిన్నదిబ్బవలె తయారయాయి. స్టార్‌బక్, క్వీకెగ్‌లు తమ తమ స్థానాలను మార్చుకొన్నారు. స్టార్‌బక్ చుక్కాను వద్దకు చేరారు.

"తెడ్లని పట్టుకోండి. మీ గుండెల్ని కూడా పట్టుకోండి! క్వీకెగ్, ఆ తిమింగిలాన్ని ఒక్కపోటుపొడిచి తోసి

వేయి! లాగండి త్వరగా" అంటూ స్టార్‌బక్ కేకలు వేశాడు.

ఈ తిమింగిలాల గుంపునుంచి అతికష్టముమీద మేము బయటపడ్డాము. అంతవరకూ దారీతెన్నూ తెలియక విచ్చల విడిగా చెదరిపోతూవున్న ఆ జంతువులు మధ్యభాగానికి చేరు కొన్న పిమ్మట, కలిసివేగంగా పారిపోవటం ప్రారంభించాయి. ఇక వాటివెంటబడటం వృథా అనిపించింది. గాయపడిన తిమింగిలాలైనా దక్కుతాయేమో అన్న ఆశతో కొన్ని పడవలు వెనుకనే ఉండిపోయినాయి.

చివరికి ఒక్క తిమింగిలం దక్కింది. మిగిలినవి తప్పించుకొని పోయాయి. అనేక తిమింగిలాలున్న చోట పట్టుబడేవి బహుస్వల్పం అన్నమాట మా విషయంలో సార్థకమైంది.

51. బడులు - పంతుళ్ళు

వెనుకటి అధ్యాయంలో మందలు మందలుగా వెళ్ళే తిమింగిలాలనుగురించి, అవి మందకట్టుకొని తిరగటానికి సంబంధించిన విషయాలన్నీ వివరించాను.

ఇప్పుడుకూడా అటువంటి పెద్దమందలు అక్కడక్కడ కనబడుతవి. కానిసాధారణంగా, పది పదిహేను కలిసిపోయే చిన్నగుంపులు కానవస్తవి. ఈగుంపులు రెండు రకాలు. కేవలం ఆడతిమింగిలాలే ఉండేవి కొన్ని. చిన్న మగతిమింగిలాలే ఉండేవి కొన్ని. ఈ మగవాటిని 'గిత్తలు' అంటారు.

ఆడగుంపు వెంట యుక్తవయస్సులోవుండే ఒక మగది కూడా వెడుతూ వుంటుంది. ఏదైనా ప్రమాదం వాటిల్లినప్పుడు అది ఆడతిమింగిలాలని కాపాడుతుంది. అసలు నిజానికి, ఈ మగతిమింగిలం ఫాదుషావంటిది. తనజనానాతో సముద్రాలవెంట విహారం చేస్తూ ఉంటుంది. ఈ పాదుషాకు, అతని భార్యలకు చాలా తేడా ఉంటుంది. మగతిమింగిలం దీర్ఘకాయం గలదియైతే, ఆడది ఎంతవయస్సు గలదైనా చాల చిన్నవిగానే కనబడుతాయి. నడుముదగ్గర అరుగజాల వెడల్పున్నా, అవి సుకుమార శరీరం కలవనే చెప్పాలి.

వాటి విహారాలు చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటాయి. అవి నవనాగరికులలాగ ఎప్పుడూ సంచారం చేస్తూనే ఉంటాయి. ఉత్తర సముద్రాలలో కొంతకాలం

గడిచి, వేసవిగడిచిన తరువాత భూమధ్యరేఖ ప్రాంతానికి చేరుకొంటాయి. అక్కడ సమృద్ధిగా ఆహారందొరికే సమయమది. ఆ తరువాత చలికాలం వచ్చేప్పటికి తూర్పు సముద్రాలు చేరుకొంటాయి. ఆ విహారాలలో, అనుమానాస్పదమైనది ఏదైనా కానవస్తే ఆ మగధీరుడు, తన అంతఃపుర జనమును వేయికళ్ళతో కనిపెట్టి యుంటాడు. కౌమారదశలో ఉన్న వేరొక మగతిమింగిల మేదైనా ఈ ఆడమూకలో దేని ప్రేమనైనా సంపాదిద్దామనే ఆశతో దరియవస్తే మనపాదుషా కార్యోద్వేగంతో తరిమివేస్తాడు. నీతినియమాలు లేక కుల మర్యాదలు అతిక్రమించి కుటుంబ శాంతినిధ్వసంచేసే యువకులను అదుపులో పెట్టి శిక్షించడం అవసరమని షాహుషా ఉద్దేశపడతాడు. కాని ఎంతసేపు అదుపులో పెట్టగలడు! ఏకశయ్య మీద పరుండే తిమింగిల జాతిలో నియమాలు సాగుతాయా! మానవజాతిలో స్త్రీ నిమిత్తములైన యుద్ధాలు ఎన్నో జరిగాయి. అల్లే తిమింగిల జాతికి కూడ భీకరమైన యుద్ధాలు జరుగుతుండటం కద్దు. అవి తమ నిడుపాటి దవడతో కొట్టుకొంటాయి. ఈ కలహాలలో తలలు పగిలిపోయో, పళ్ళు విరిగిపోయో, రెక్కలు తునుకలయ్యో, మూతులు వంకరపోయో, అనేకం మానవుల చేతిలో పట్టుబడుతూ ఉంటాయి.

గృహ మర్యాదలు అతిక్రమింప పూనుకొన్న యువకుడు రాజుగారి కోపానికి భయపడి పారిపోయి అల్లంత దూరాన నిలిచి రాజు తన రాణులతో కలసి మెలగటం

ఈసుగా చూస్తూవుంటే దృశ్యం ఎంతో తమాషాగా ఉంటుంది.

ఇతర తిమింగిలాలు లభించే అవకాశముంటే ఇటువంటి పాదుషా జోలికి వేటగాళ్ళు పోరు. ఆ పాదుషాకి విపరీతమైన బలముండటం ఇందుకొక కారణం, పోతే, ఈ రాణులకు పుట్టిన పిల్లల సంగతి యేమిటి! ఆ సంతానాన్ని, కొంత కాలం తల్లులే సాకుతాయి. ఆ పైని, ఆ మగపిల్లలు, ఆడ పిల్లలు తమదారి తాము చూసుకోవలసిందే! పాదుషాకు లతాగృహం మీద ఉండే మోజు ఉద్యోగాలమీద ఉండదు. ప్రపంచమంతటా ఇట్టి స్వేచ్ఛావిహారులైన సరసుల పిల్లలే కనబడుతూ ఉంటారు. కాలక్రమేణ, పరువము జారిపోయి, వార్ధకము పైకొనిరాగా, పాదుషాకు కన్నెపడుచుల మీద ఉండే ప్రీతి, ధార్మిక వర్తనం మీదికి తిరుగుతుంది. అతడు ఆ వయస్సులో, దుర్బలుడు, పశ్చాత్తప్తుడూ అయి అంతః పురాన్ని విచ్ఛిన్నంచేసి. ప్రమాణపూర్వకంగా విషయవాంఛా పరిత్యాగము చేసి, సద్వర్తనుడై, ప్రపంచములో నాలుగు దిక్కులలా పోయి, ధర్మోపదేశం చేస్తూ ఏకాంతంగా దైవ ప్రార్థనలు చేసుకొంటాడు. చెడ్డమార్గాల పోవద్దని యుక్త వయస్కులైన తోడి ప్రాణులను వారిస్తూ, కాలం గడుపుతాడు!

ఈ ఆడ తిమింగిలాల మందకు జాలరులు "బడి" అని పేరు పెట్టారు. ఆ మగ దానిని "బడి పంతులు" అంటారు. అతడే మన పాదుషా! అయితే అతడు ప్రపంచమంతటా తిరు

కూడా చేసే ధర్మోపదేశం మాత్రం పంతులు పాత్రకు అనుగుణమైనది కాదు. అతని ఉపదేశం, ఆ బడిలో తాను చేసిన ఉపదేశానికి కేవలం విరుద్ధమైనది. బడిలో తాను చేసిన ఉపాధ్యాయత్వం పాపభూయిష్టమని నలుమూలల ఉపన్యసిస్తాడు.

వయస్సు పైబడ్డ కొద్దీ ఫాదుషా ఒంటరితనాన్ని అలవర్చుకొన్నట్లే, మిగిలిన ఆడు తిమింగిలాలుకూడా అలవర్చుకొంటాయి. ఒంటరిగా కనబడే ఏ తిమింగిలమైనా, ముదుసలే అయి ఉంటుంది. ప్రకృతికాంత తప్ప అతని ప్రక్క మరెవ్వరూ ఉండరాదు. ఆ కాంతనే భార్యగా భావించి స్వీకరిస్తాడు. ఆమె తన గుట్టు అతనికి తెలియనీయక పోయినా ఆమెయే అతని పాలిటికి ఉత్తమ గృహిణి.

ఈ జనానా గుంపులు కాక, మంచి వయస్సులోవున్న మగతిమింగిలాల గుంపులు కొన్ని యుంటాయి. ఆడ తిమింగిలాలు పిరికివి. ఇవి కాలరుద్రుల వంటివి. వీటితో కారసిల్లటం చాలా ప్రమాదం. ఈ తిమింగిలాలని "నలభై పీపాల గిత్తలు" అంటారు. (అంటే, ఒక్కొక్క దానినుండి నలభై పీపాల నూనె వస్తుందన్నమాట) ఈ మగతిమింగిలాల గుంపులు ఆడతిమింగిలాల గుంపులుకంటె పెద్దవిగా ఉంటాయి. కాలేజీలకి వెళ్ళే కుర్రవాళ్ళ గుంపులాగ, ఈ తిమింగిలాలు నిర్విచారంగా, కయ్యానికి కాలుదువ్వుతూ, అతివేగంగా ప్రపంచాన్ని చుట్టుముట్టేస్తూ ఉంటాయి. ఈ పొంగుకూడ

త్వరలోనే చల్లారుతుంది. మరికొంత ఎదిగాక దేని దారిన అదిపోయి, 'ఆడుబకుల'ను వెతుక్కొంటుంది.

ఈ రెండు రకాల గుంపులకూ ఇంకొక తేడా ఉంది. మగవాటిలో ఒక దానికి దెబ్బ తగిలితే, మిగిలినవి చూస్తూ తప్పుకొని పోతాయి. ఆడవాటిలో ఒక్క దానికి దెబ్బతగిలితే మిగిలినవన్నీ తమ ప్రాణాలర్పించియైనా, దానిని కాపాడ టానికి సిద్ధమౌతవి.

52. తోలుగౌను

'పెకోడ్' డెక్కుమీద అడుగుపెట్టి, బరువులను ఎత్తే యంత్రమున్నవైపు వెళ్తే ఎడమ ప్రక్కగా పడివున్న ఒక వింత ఆకృతి నీకు కనబడుతుంది. తిమింగిలపు తలయందలి తొట్టిగాని, దాని క్రింది దవడయొక్క ఆకారంగాని, దాని తోకయొక్క ప్రతికృతిగాని, కలిగింపనంతటి ఆశ్చర్యాన్ని ఆ ఆకారము కలిగిస్తుంది. ఉండవలసిన పొడవు, అడుగు భాగాన ఒక అడుగు వలయం కలిగి, నల్లగా, క్వీక్వెగ్ పూజించే ప్రతిమ యోజో వలె ఉంటుంది అది. అదియొక విగ్రహం. అటువంటి దానినే పూర్వము జూడియా రాణి, 'మాకా' చాటుగా పూజించుకొంటూ వుంటే, ఆమె కొడుకు 'ఆసా' సహించలేక, తల్లిని పదభ్రష్టురాలిని చేసి, విగ్రహం తగుల బెట్టినట్లు "రాజులు" అనే బైబిలు అధ్యాయంలో వర్ణింపబడియుంది.

ఆటుపైపు వస్తున్న నావికుణ్ణి చూడండి. అతనిని "ముక్కలవాడు" అంటారు. అతను మరి ఇద్దరి సహాయంతో ఒక బరువుని మోసుకొని వస్తున్నాడు. దానిని ఓడ తట్టుమీద వుంచి, చర్మాన్ని కోసి, ఆ చర్మాన్ని ఆరవేస్తున్నాడు. తరువాత దాని చివరభాగాన చేతులు దూర్చేటందుకు వీలుగా రెండు రంధ్రాలు చేసి, తన పనికి వుపయోగించేటట్లు ఆ చర్మాన్ని తొడుగుకొంటాడు. అతని పని ఇది: తిమింగిలపు

క్రొవ్వును ముక్కలుగా కోసి, ఒక తొట్టెలో పడవేయడం. తరువాత దాన్ని కరగించి చమురు చేస్తారు. ఆ ముక్కలను ఎంత చిన్నవిగా కోస్తే అంత ఎక్కువ చమురు తయారవుతుంది.

53. 'ట్రైవర్క్స్'

తిమింగిలాల వేటకై ఉపయోగించే అమెరికను నావలకు ఒక గుర్తు, వాటిపైకి కట్టబడిన చిన్న పడవలు. ఇవికాక ఇంకొక గుర్తుకూడా వున్నది. అది, కలపతోను, నారతోను కలిపి కట్టిన ఇటుకపని. ఆ ఇటుక కట్టడం జరిగితేనేగాని ఓడ పూర్తికాదు. బయలులోని ఇటుక ఆవమును తెచ్చి ఓడమీద పెట్టారా అనిపిస్తుంది దాన్ని చూస్తే. ఆ ఆవములకు "ట్రైవర్క్సు" అని పేరు.

వాటిని ఓడముందు భాగాన ఉంచుతారు. పది అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పూ, అయిదడుగుల ఎత్తూ ఉండే రాతి కట్టడాన్ని మోయగలిగినంత బలమయిన కలపను ముందు పరుస్తారు. దానిమీద ఇటుక ఆవము కట్టుతారు. ఇనుప ఊచలతో ఈ రాతిపనినంతా ఓడ తట్టుకి బిగిస్తారు. అన్నిప్రక్కలా చెక్కతో కప్పేస్తారు. పైన మాత్రం ఏటవాలుగా వుండే తలుపును వేస్తారు. ఈ తలుపును తీస్తే రెండు పెద్దబానలు కనబడతాయి. ఒక్కొక్క బానలో ఎన్నోపీపాల నూనె పడుతుంది. నూనె నింపనప్పుడు బానలను అతిశుభ్రముగా ఉంచుతారు. ఒక్కొక్కసారి వాటిని చాలా చక్కగా, వెండిలాగ మెరిసేటట్లు మెరుగుపెడతారు. రాత్రుల కాపలా కాయవలసిన వాళ్ళు ఒకోసారి వీటిలోకి దూరి, నిద్రతీస్తూంటారు. వాటికి

మెరుగుపెట్టేప్పుడు లోపలికి వెళ్ళి ఇద్దరూ ఏవేవో రహస్యాలు చెప్పుకుంటూరు.

గణితశాస్త్రానికి సంబంధించిన దీర్ఘమైన ఆలోచనలు అక్కడ చేసికోవచ్చు. ఒకసారి అక్కడ ఉండగానే నాకొక ఊహ తట్టింది. ఒక వలయంలో నుండి ఏ ప్రాంతంనుంచి అయినా క్రిందకి జారటానికి అన్ని వస్తువులకీ కాలప్రమాణం ఒకటేను అని.

ఈ 'ట్రైవర్క్స్' అనే వాటికి ముందుభాగాన ఉండే చెక్కని తొలిగిస్తే రాతికట్టడం కనబడుతుంది. ఈ కట్టడానికి రెండు ఇనుపద్వారాలు వుంటాయి. ఈ ద్వారాలు రెండు కొలిములకు సంబంధించినవి. ఈ ద్వారాలకు పెద్ద ఇనుప తలుపులుంటాయి. కొలిమిలోని వేడి ఓడలెట్టుకు తగలకుండా చేయడానికి ఒక చిన్న కొలనువంటిది ఏర్పాటు చేయబడి వుంటుంది. ఈకొలనికి ఒక గొట్టమును తగిలించి, అందులోని నీరు ఇగిరిపోతున్న కొద్దీ మళ్ళీ పోస్తూంటారు. బయటకు కనబడే పొగగూడు లేమీ వుండవు.

రాత్రి తొమ్మిది గంటలైంది. 'పెకోడ్' యొక్క 'ట్రైవర్క్స్'ని ప్రారంభించారు. పర్యవేక్షణ చేయటం స్టబ్ వంతు వచ్చింది.

“అంతా సిద్ధమైనట్టేనా! ఓయి వంటాయనా! నిప్పు చెయ్యి” అన్నాడు. నిప్పు చెయ్యటం సులభమే. ఎందుకంటే ఆ రోజంతా వడ్రంగి కొలిమిలోకి చిత్రికపొట్టు క్రుక్కుతూనే వున్నాడు. మొట్టమొదటగా నిప్పుచేసేప్పుడు యిరా

చెక్కముక్కలూ, చిత్రికపట్టూ అవసరమే. మంట అంటు కొన్న తరువాత వాటి అవసరమంతగా ఉండదు. సెగ తగిలిన తరువాతకూడ తిమింగిలానికి వుండే కొవ్వు భాగం జిడ్డుగానేవుంటుంది. దీనితోనే నిప్పుకి కావలసిన చమురు ఏర్పడుతుంది. ఆత్మబలిదానం చేసుకొనే వానిలాగ ఒకసారి నిప్పు అంటిస్తే తిమింగిలం, తాను పూర్తిగా కాలిపోవటానికి కావలసిన వంటచెఱకును అదే సరఫరా చేసుకొంటుంది. అప్పుడు వెడలే పొగ పీల్చటం యెంత దుర్భరమైన, అపరిహార్యం. ఆ పొగ శవదహనవేళ చితిలోనుండి వచ్చే దుర్గంధంతో నిండి వుంటుంది. ఆ దుర్గంధం అనుభవిస్తే శవదహనం కంటె, శవాలను భూస్థాపితం చేయుటమే మంచిదనిపిస్తుంది.

అర్ధరాత్రమయ్యేప్పటికి పని చురుకుగా సాగుతోంది. తిమింగిలపు కళేబరం దగ్గమైంది. తెరచాపలను ఎత్తారు. గాలి హాయిగా వీస్తోంది. సముద్రపు చీకటి గాఢంగా వుంది. కాని, ఆ చీకటి చీల్చుతూ అగ్నిజ్వాలలూ లేచాయి. ఆ జ్వాలల కాంతిలో ప్రతి తాడూ కనబడుతోంది. యిలా మండిపోతున్న ఓడ ఎడతెరపి లేకుండా ఏదో విధినిహితమైన పగ సాధించటానికి వెళ్ళవలసినట్టు పోతుంది. వెనుక యీ విధంగానే గంధకాన్ని తీసికొని వెళ్ళుతున్న ఓడలు అర్ధరాత్రివేళ నిప్పులు గక్కుతూ బయటకు వచ్చి, వేరే దేశపు ఓడలమీద పడి వాటిని ధ్వంసం చేశాయట.

ట్రైవర్క్స్"మీని తలుపుకి ముందువైపున ఒక పెద్ద పొయ్యి వంటిది. కానవచ్చింది. అక్కడ నిలబడి; కొందరు

ఈటెగాళ్ళు తిమింగిలపు క్రొవ్వును బానలలోనికి వేస్తున్నారు. ఒకోసారి బానల క్రిందనున్న నిప్పు ఎగసన తోస్తున్నారు. పొగ దట్టంగా బయటకు పోతోంది. ఈ "వర్క్సు"కి ఎదురుగా వస్తువులను ఎత్తే యంత్రముంది. పనిలేనప్పుడు పహారావాళ్ళు అక్కడ కూర్చుని ఈ మంటలను చూస్తూ కాలక్షేపం చేస్తారు వాళ్ళ ముఖవైఖరులు, మాసిన గడ్డాలు, మెరిసిపోయే పళ్ళు— ఆ మంటల వెలుగులో వింతగా ప్రకాశించాయి. తమ అపవిత్రమైన చేష్టలను సరదాగా ఒండొరులకు చెప్పుకొంటున్నారు. వాళ్ళు అసభ్యపు నవ్వులు జ్వాలలవలె పైకి ఎగసిపోతున్నాయి. వాళ్ళ యెదుట ఈటెగాళ్ళు అటూ ఇటూ కదలుతూ ఏదో వివరిస్తున్నారు. గాలి హోరుమంటోంది. సముద్రము ఉవ్వెత్తున లేస్తోంది. ఓడ కష్టము మీద అరుణజ్వాలలతో సముద్రపు టంధకారంలోకి తోసికొని పోతోంది. "పెకోడ్" అనాగరకపు మనుష్యులతోను, మంటలతోను, తగులబడుతున్న కళేబరముతోను ఆ అంధకారంలోకి చొచ్చుకొని పోతూ, తన యజమాని యొక్క చిత్తవృత్తి పరాకాష్ఠను ప్రతిరూపమనిపించింది.

చుక్కాని వద్ద నిలబడి, ఓడను నడిపిస్తున్నంత సేపు నాకు ఇల్లే అనిపించింది. చీకటిలో ఉన్న నాకు మిగిలిన వాళ్ళ ఎట్టితనం, వెర్రితనం, బీభత్సం మరీ ప్రస్ఫుటంగా కనబడ్డాయి. మంటల్లోను, పొగల్లోను, కలిసి పోతూవున్న ఆ రాక్షసాకారాలను చాలాసేపు చూచేసరికి నా మనస్సులో కూడా ఏవో

వింత వింత చిత్రాలు రేగాయి. అర్ధరాత్రయింది. మామూలు వలెనే నాకు మగత కలిగింది.

నిలబడి కునుకు తీస్తూ ఉండగా ఏదో తప్పు జరిగి పోయిందని మనసులో స్ఫురించింది. తెరచాపల రెప రెపలు ఝుంకారం నా చెవులలో పడుతూవున్నాయి. కళ్ళు తెరిచియే యున్నట్లు భ్రమ పడ్డాను. కాని వేళ్ళతో బలవంతంగా కను రెప్పలని తెరవవలసి వచ్చింది. నా యెదుట అప్పటి వరకూ అక్కడే ఉన్న దిక్సూచి కానరాలేదు. నా ఎదుట భీకరమైన అంధకారము, దాన్ని చీల్చుకునిపోయే ఎఱ్ఱని జ్వాలలు తప్ప ఇంకేమీ కానరాలేదు. ఒక్కటే ఆలోచన కలిగింది. నేను ప్రయాణం చేస్తూ ఉన్న ఓడ ఏదో ఒక గమ్యమును లక్ష్యంగా పెట్టుకొని వెళ్లేది కాదని, అదేదో ఆకాశంనుండి దిగజారుతున్న మృత్యు స్వరూపమని, భీతి కొల్పే భావము నాలో కలిగింది. చుక్కాను పట్టుకోవటానికి వుండే కొయ్యను గట్టిగా పట్టుకొన్నాను. కాని అది తిరుగబడి వుంది. ఏమైందో తెలియలేదు. ఆ కునుకులోనే అటునుండి ఇటు తిరిగిపోయాను. ఓడ వెనుకభాగం వైపు మొగమై వున్నాను! ఒక్క క్షణంలో వెనుకకు తిరిగాను. ఇంకొంతసేపు ఆలస్యమై వుంటే ఓడకు ప్రమాదం కలిగేది. ఆ పీడకలనుండి బయటపడిన తర్వాత ఎంతో మనశ్శాంతికలిగింది.

నిప్పును ఎక్కువసేపు చూడకూడదు. చుక్కాను వద్ద వున్నప్పుడు ఎన్నడూ కలలు కనరాదు. దిక్సూచి నుండి ఎప్పుడూ మొగము వెనక్కి త్రిప్పరాదు!

మంటల ఎఱ్ఱదనంలో అన్నీ భీకరంగా కనబడుతాయి. తెల్లవారిన తరువాత సూర్యకాంతిలో ఆకాశం మెరిసిపోతుంది. మంటల వెలుగులో భూతాలవలె కనబడిన వాళ్లు మామూలుగా, సాధువులుగా కనబడుతారు. దివ్యమైన తేజము, నిజమైన కాంతి సూర్యునికే - మిగిలినవన్నీ మిథ్యలు!

అయినా, వర్జీనియాలోని చిత్తడినేలనుగాని, రోమ్ యొక్క పాపిష్టి "కాంపగ్నా"ను గాని, సహారా యెడారిగాని మైళ్ళతరబడి విస్తరించి యున్న ఇతర యెడారులను గాని, మనోవ్యథలను గాని— సూర్యుడు మరుగు పరచడు. భూమికి అంధకారం వంటిది, భూమిలో మూడింట రెండు భాగాలు ఆక్రమించుకొనేదే అయిన సాగరాన్ని సూర్యుడు మరుగు పరచడు. అట్లే, ఏ మానవునిలోనైనా, దుఃఖము కంటె ఎక్కువ పాలు సంతోషమే ఉన్నట్టయితే వాడు పరిపూర్ణుడు గాని, సత్యవంతుడు గాని కానేరడు. గ్రంథాల మాటా ఇంతే. మానవులందరిలో దుఃఖితుడే నిజాయితీ పరుడు. 'సాలమన్' యొక్క గ్రంథమే అన్ని గ్రంథాలలోకి నిజమైనది, "అంతా అహంకారమే!!! అంతాను! ఈ మాట సాలమన్‌కే తెలియునిది. కాని, ఆస్పత్రులను, కారాగారాలను, స్మశానాలను తప్పించుకొంటూ పరలోకాన్ని గురించి కాక నాటకాల గురించి ముచ్చటిస్తారంటూ, కూపర్, యంగ్, పాస్కల్, రూసోల గురించి, తెలిలా ఒక్కడే విజ్ఞుడంటూ, కాలం సంతోషంగా గడుపుతున్నా ననేవానికి

కాపుబ్రతుకుల గురించి, సాలమన్ వలె ఆలోచించే, అర్హత ఎక్కడనుంచి వస్తుంది!

సాలమన్ కూడా ఒకచోట అన్నాడు, "జ్ఞానపథము నుండి తొలగి నడిచేవాడు బ్రతికియుండియు మృతుల సంఖ్య లోనే పరిగణింపబడతాడు" అని. మానవుడా! అగ్నికి ఆహుతి కావము. అది విన్నా తల్లకిందులు చేస్తుంది. మనస్సును బండవరుస్తుంది. ప్రస్తుతము నాకు అట్లే జరిగింది. దుఃఖ మాపాదించుకొనే జ్ఞానమొకటి ఉంది. వెర్రి యాపాదించుకొనే దుఃఖ మొకటి ఉంది. కొందరి అంతరాత్మలలో అంధకారబంధుర పర్వత కుహరాలలోకి దిగి, మళ్ళీ పైకి లేచి అంతరిక్ష మార్గాన సూర్యమండలం దాకా ఎగిరిపోయే వేగయుంది. ఒకవేళ పర్వతకుహరము నుండి పైకి లేవలేక పోయినా, ఆ వేగ నేలమట్టముననే ఎగిరే పిట్టలకంటె గొప్పదే!

54. కాలు - చేయి

ఇంగ్లండు దేశానికి చెందిన ఒక ఓడ కనబడగానే "మీరు తెల్లతిమింగిలం ఎక్కడైనా కనబడిందా" అని అహాబ్ కేక వేశాడు. నోటిదగ్గర బూరా పెట్టుకొని, తన దంతపుకాలు అవతలి ఓడ యొక్క కెప్టెన్‌కి కనబడేటట్టు పెట్టుకొని నిలుచున్నాడు. ఆ కెప్టెన్‌కి ముప్పయి ఏండ్ల వయస్సుంటుంది. చూడటానికి బాగానే ఉన్నాడు. ఒక పెద్ద బట్ట కప్పుకొన్నాడు. "తెల్లతిమింగిలాన్ని చూశారా! అని అడుగుతారా! సరే, మీరు దీన్ని చూశారా!" అని తన బట్ట ముడుతలలో నుండి ఒక తెల్లతిమింగిలపు ఎముకను బయటకు తీసి చూపిస్తూ అతడు ప్రశ్న వేశాడు.

అహాబ్ మరుక్షణమే తన పడవని దింపమని ఆనతిచ్చి దానిలో ఎక్కి ఆ కొత్త ఓడ దగ్గరకు వెళ్ళాడు తొందరలో అతను తన కాలు పోయినప్పటినుంచీ, తన ఓడతప్ప వేరొక ఓడని ఎక్కలేదన్న సంగతి మరచిపోయాడు. "పెకోడ్" మీదికి ఎక్కడానికి ఒక ప్రత్యేకమైన ఏర్పాటు చేసుకొన్నా డతను. ప్రతి ఓడమీద అటువంటి ఏర్పాటు అప్పటికప్పుడు చేయుటానికి సాధ్యము కాదు.

అలలవల్ల ఓడ పైకి క్రిందకి ఊగుతూ వుంటుంది. కాబట్టి సముద్ర మధ్యంలో పడవలమీదనుండి; ఓడ మీదికి ఎక్కడం అంత తేలికకాదు. ఒక కాలు లేకపోవడంవల్ల ఈ

కొత్త ఓడలో తనకు కావలసిన సాధనం లేకపోవటంవల్ల అహాబ్ ఎక్కుతూ, పడుతూ ఉన్న ఆ ఓడవైపు నిస్సహాయుడై చూస్తూ ఉండిపోయాడు. తన కుంటితనపు దురదృష్టానికి సంబంధించిన ఏ చిన్న సంఘటన కలిగినా అహాబ్ చాలా కోపమూ, చిరాకూ చెందుతూంటాడు. ఇప్పుడు అది మరీ ఎక్కువయింది. అతను ఓడ నెక్కడానికై రెండు తాళ్ళను ఓడమీదినుండి వాళ్ళు క్రిందికి విసిరారు. వాళ్లకు ఇతను ఎంతటి అశక్తుడో తెలియదు. ఆ ఓడ కెప్టెన్ ఇతని పరిస్థితిని గ్రహించి, తిమింగిలాలను లాగటానికి ఉపయోగించే సాధనాన్ని దింపమని ఆజ్ఞాపించాడు. దాని సహాయంతో అహాబ్ పైకి ఎక్కగలిగాడు. ఆ కెప్టెన్ తన దంతపు చెయ్యిని చాచి, ఇతనిని ఆహ్వానించాడు. అహాబ్, తన దంతపు కాలిని చూపిస్తూ "ఈ ఎముకలతో చాలనం చేద్దాం! ఒక చెయ్యి, ఒక కాలు! సరే- తెల్లతిమింగిలాన్ని ఎక్కడ చూశారు? ఎంతసేపైంది చూచి!" అని అడిగాడు.

తన దంతపు చేతిని తూర్పు దిశగా చూపుతూ, "తెల్లతిమింగిలాన్ని, అటువైపు భూమధ్యరేఖ దగ్గర చూశాను. క్రిందటి వేట సమయంలో" అని జవాబు ఇచ్చాడు ఆ కెప్టెన్.

అహాబ్ క్రిందికి జారి, ఇంగ్లీషువాని బుజంమీద చెయ్యివేసి, "చేతిని తినేసిందా తిమింగిలం" అని అడిగాడు.

"అవును, నా కాలుకూడా దానివల్లే పోయిందా!"

"కథ అంతా చెప్పండి, ఏమి జరిగింది" అని అడిగాడు అహాబ్.

"భూమధ్యరేఖ ప్రాంతానికి వెళ్ళటం అదే నాకు మొదటిసారి. తెల్లతిమింగిలాన్ని గురించి నా కప్పటికి ఏమీ తెలియదు. నాలుగైదు తిమింగిలాలున్న గుంపును తరుముదా మని పడవలను దింపాము. ఒక తిమింగిలాన్ని అంటిపెట్టుకొని మా పడవ వెళుతూవున్నది. ఆ తిమింగిలం సర్కసులో గుర్రం లాగున గిర గిరా తిరగటం మొదలుపెట్టింది. ఇలా ఉండగా, సముద్రం అడుగునుంచి హఠాత్తుగా ముడుతలుపడ్డ ఒక పెద్ద తిమింగిలం పైకి గెంతింది. దాని తల తెల్లగా ఉంది-"

"అదే, అదే" అని అప్పటిదాకా ఊపిరి బిగబట్టుకొని ఆలకిస్తూవున్న అహాబ్ అరిచాడు.

"దాని వెనుక రెక్కలో ఈటెలుకూడా గుచ్చుకొని ఉన్నాయి."

"అవును- అవి నావి - నేను వేసిన ఈటెలే అవి" అని గర్వంగా అంటూ "కానివ్వండి కథ" అంటూ హెచ్చరించాడు.

"నన్ను మాటాడనియ్యండి మరి" అని నవ్వుతూ, "ఆ ముసలిది ఆ గుంపులోకి చొచ్చి మేము వేసిన తాడు కొరకటం ప్రారంభించింది."

"ఓహో అలాగా! ఆ తాడును కొరికివేస్తే తిమింగిలం పారిపోవచ్చుకదా అని. అది మామూలు ఎత్తే"

"ఎలాగైందో చెప్పలేను కాని, ఆ తాడును కొరకటంలో అది వెళ్ళి ఈ తిమింగిలం పళ్ళల్లో చిక్కుకొంది కాబోలు. మేము తాడు లాగినప్పుడు ఈ తిమింగిలం దగ్గర పడింది. మేము మొదట అనుకొన్నది పారిపోయింది! నేనిదివరకు అంత పెద్ద తిమింగిలాన్ని ఎప్పుడూ చూడలేదు. దీన్ని చూడగానే, అది ఎంత కోపంతో ఉన్నా పట్టివేయాలని అనే అనిపించింది. అది తాడు విడచి పారిపోతుందేమోనను కొని, ఇంకొక పడవలోకి—మిస్టర్ మౌన్ట్‌టోప్ పడవలోకి గెంతాను. ఆ పడవలో ఉన్న ఒక ఈటెను తీసి దానిమీద విసిరాను. ఇక చూచుకోండి— ఉత్తరక్షణం నాకు కళ్ళు చీకట్లు కమ్మాయి- అంతా అంధకారం- చలువరాతి కొండ శిఖరంలాగ తిమింగిలం యొక్క తోక ఒక్కటే కనిపించింది. రెండో ఈటె కోసం తడుముకొంటున్నాను - ఇంతలో ఆ తోక ఒక దెబ్బతో మా పడవను రెండు ముక్కలు చేసి వేసి, ఆ ముక్కలలోకి దూకింది. తిమింగిలంలో గుచ్చుకొని వున్న ఈటెను పట్టుకొని వ్రేలాడాను. ఒక పెద్ద కెరటం వచ్చి నన్ను అవతలికి కొట్టివేసింది. అదే సమయాన తిమింగిలం కూడా ఒక్క దూకు దూకింది. ఈ అలజడిలో ఈటె నా చేతినుంచి దూసుకుపోయి, నా చేతని చీల్చివేసింది. మిగిలిన కథ ఆయన చెప్తాడు. బంగర్, నీ కథ కానీ—" అంటూ ఓడ డాక్టరైన బంగర్ వంక చూశాడు.

ఈ కథను కెప్టెన్ చెప్పుతున్నంతసేపు డాక్టర్ అక్కడే ఉన్నాడు. అతనిది గుండ్రని, గంభీరమైన ముఖము. నీలి

దుస్తులు ధరించి యున్నాడు. చేతిలో ఒక మాత్రల డబ్బా పుచ్చుకొన్నాడు. ఆ డాక్టరు ఇద్దరు కెప్టెన్ల వైఖరిని గమనిస్తూనే ఉన్నాడు. తన కెప్టెన్, తనకు అహాబ్‌కు పరిచయం చేయగా కథ మొదలుపెట్టాడు.

"చాల ఘోరమైన గాయం. నా మాటమీదే కెప్టెన్ బూమర్ మా "సామీ" ని ఇక్కడ నిలిపాడు"

"అంటే మా ఓడ అన్నమాట. దీని పేరు "సామ్యుయల్ ఎన్ డర్ బీ"" అని వ్యాఖ్యానించాడు. "కానీ–"

"భూమధ్యరేఖ దగ్గర ఉండే వేడి బాధను తప్పించుకోవడానికి ఉత్తర దిశగా పిలిపాం 'సామీ'ని. ఏమి చేసినా లాభం లేకపోయింది. రాత్రిలు అతనితో పాటు కూర్చున్నాను. ఆహార నియమాలు చాలా పెట్టాను–"

"ఆ మాట నిజమే– చాలా నియమాలు పెట్టాడు. అర్ధరాత్రివేళ 'రమ్' తాగుతూ గాయానికి కట్టుకూడా కట్టలేని పరిస్థితి ఏర్పడేదాకా తాగుతూండేవాడు. నన్ను తెల్లవారుజామున మూడు గంటలకు నిద్రపుచ్చేవాడు, నాతో పాటే మేల్కొనేవాడు– కానీ– ఇంకొకని చేతిలోకంటె నీ చేతిలో చావడమే నయం కదూ"

అహాబ్ వంకతిరిగి, డాక్టర్ చెక్కుచెదరకుండా, "మీరు గమనించే ఉంటారు, మా కెప్టెన్ లేనిపోని అభూతకల్పనలు చేస్తూంటారని. నే నెన్నడూ తాగను–" "నీళ్ళు! అవికూడ తాగవు కాబోలు– సరే, చెయ్యి సంగతి చెప్పు" అన్నాడు కెప్టెన్.

"సరే కానిస్తాను. నేనెంత ప్రయత్నించినా ఆగాయం ఇంకా చెడిపోవటం ప్రారంభించింది. రెండడుగుల పొడవునా విచ్చిపోయింది, ఉడిసిపోయింది. అంతలో చెయ్యి ఊడి పడిపోయింది. కాని, ఆ దంతపు చెయ్యి పెట్టటంలో నా ప్రమేయమేమీ లేదు. అది శాస్త్ర విరుద్ధం కూడాను. వడ్రంగి చేత ఆ చెయ్యి చేయించుకొన్నాడు. దాని చివర సుత్తి వంటి దానిని ఒకటి తగిలించాడు- నా తలమీద కొట్టినట్టే మిగిలిన వాళ్ళనీ కొట్టడానికి కాబోలు. మా కెప్టెన్‌కు ఒకొక్కసారి విపరీతమైన కోపం వస్తూంటుంది. ఈ దెబ్బ చూడండి" అంటూ తన టోపీని తీసి తలమీద లోతుగా పడిన గాయపు గుంటను చూపుతూ "ఆ గాయ మెట్లా తగిలిందో మా కెప్టెన్ చెప్తారు" అన్నాడు.

"అది నా వల్ల జరిగినది కాదు. పుట్టుకతోనే అలా ఉంది అతనికి. బంగర్, నీవు బలే దొంగవు- నీవంటివాడు ఎవడూ సముద్రాల మీదికి రాలేదు- నీవు చస్తే ఊరవేసి ఉంచాలి; భావి తరాలవాళ్ళు నిన్ను చూడటానికి వీలుగా ఉంటుంది.

ఈ ఇంగ్లీషు వాళ్ళిద్దరు ఆడుకొనే పరాచికాలను వింటూ అంతవరకూ ఓర్పుతో వున్న అహాబ్, "తెల్లతిమింగిలం మాటేమిటి" అని అడిగాడు. "ఓ! ఆ తరువాత చాలా కాలానికి మేము దాన్ని చూడలేదు. నాకు గాయం కలిగించిన తిమింగిల మేదో నాకు అంతకుపూర్వం తెలియు

లేదు, తిరిగి భూమధ్యరేఖ దగ్గరకి వచ్చాక దాన్ని "మాబీ డిక్" అని కొందరంటారని తెలిసింది" అన్నాను కెప్టెన్.

"అయితే మీకు మళ్ళీ అది కనబడలేదా?"

"రెండుసార్లు కనబడింది."

"దాన్ని పట్టలేకపోయారా"

"మేము ప్రయత్నమే చేయలేదు. ఒక చెయ్యిపోయింది చాలదూ! ఈ రెండో చెయ్యికూడా లేకపోతే ఏమి చెయ్యను? 'మాబీడిక్' నములకుండా మింగేస్తుంది అనుకొంటాను."

బంగర్ అడ్డువచ్చి, అటువంటప్పుడు ఎడమచెయ్యిని ఎరచూపించి కుడిచెయ్యిని తీసుకొంటేసరి మీకు తెలుసో లేదోగాని, తిమింగిలంయొక్క జీర్ణకోశము పటిష్టమైంది కాదు. ఒక్క చెయ్యినికూడా పూర్తిగా జీర్ణించుకోలేదు. తిమింగలానికి ఈ సంగతి తెలుసు. తెల్లతిమింగిలంలో "ద్వేషం" అని మీరు అనుకొనేది, కేవలం దాని చేతకానితనమే. ఏ అవయవాన్ని మింగివెయ్యాలని అది అనుకోదు. తన చేష్టలతో భయపెడుతుంది. అంతే! పూర్వమొకప్పుడు సింహళంలో గారడివాడు చిన్న చిన్న కత్తులని మింగేస్తానంటూ ఉండేవాడు. ఒక కత్తిని నోటవేస్తే మ్రింగి ఏడాదికైనా దాన్ని అరగించుకోలేక అవస్థపడ్డాడు. అప్పుడు భేదికి మందిస్తే చిన్న చిన్న ముక్కలుగా అది పడిపోయింది. ఆ కత్తిని అరగించుకొని, ఒంటబట్టించుకొనే అవకాశమేదీ వానికి? ఒకోసారి తిమింగిలంకూడా ఈ గారడీవాడిలాగానే ప్రవర్తించవచ్చు. నీకు ఆ మాత్రం సాహసముంటే ఒకచేతిని ఎర

చూపి రెండోదానిని కాపాడుకోవచ్చు. తిమింగిలానికి ఇంకో అవకాశం ఇయ్యి" అన్నాడు.

"లాభం లేదు. ఒక చెయ్యి తీసికొంది చాలు. ఇంక తెల్ల తిమింగిలం జోలికి పోదల్చుకోలేదు. దాన్ని చంపితే ఘనతే. దానినిండా బోలెడంత కొవ్వు ఉన్నమాట నిజమే. అయినా దాని దారిని దాన్ని పోనిస్తే నయం. మీరేమంటారు" అంటూ అహాబ్ యొక్క దంతపు కాలిని చూస్తూ అడిగాడు.

"నిజమే. కాని దాన్ని వేటాడటం జరిగి తీరుతుంది. అది అయస్కాంతం వంటిది. దాన్ని మీరు చూచి ఎంతకాలమైంది? అది ఎటువైపు వెళ్ళుతోంది?"

బంగర్ అహాబ్ చుట్టూ తిరిగి, "ఓరి భగవంతుడా, ఈయన ఎంత ఉద్రిక్తుడై పోయినాడో! నెత్తురు ఎంత వేడెక్కి పోయిందో! అతని నాడి ఎంతవడిగా కొట్టుకొంటోందో" అంటూ ధర్మామీటరు తీసి అహాబ్‌ను సమీపించాడు.

అహాబ్ ఓడ చివరకు పరుగెత్తి "పడవని దగ్గరకి తీసుకురండి! ఎటువెళుతోంది తిమింగిలం!" అని మళ్ళీ ప్రశ్నించాడు.

ఇంగ్లీష్ కెప్టెన్ ఆశ్చర్యపోతూ - "ఏమి జరిగింది! అది తూర్పు దిక్కుగా పోతోంది" అని, ఫెడెల్లాతో, రహస్యంగా "మీ కెప్టెన్‌కు పిచ్చి ఎత్తిందా" అన్నాడు.

పెదవులమీద వేలినుంచుకొని, ఫెడెల్లా జారుకొన్నాడు. మరుక్షణం, అహాబ్ తనపడవలో ఉన్నాడు. మనిలానుండి వచ్చినవాళ్లు తెడ్లని పుచ్చుకొన్నారు. ఇంగ్లీషు కెప్టెన్ అతనికి వీడుకోలు కేక వేశాడు. కాని అహాబ్ అటు వైపు చూడలేదు.

పాషాణంవంటి మొగంపెట్టి ఓడదరికి వచ్చివేశాడు.

55. అహబ్ కాలు

'సామ్యూయల్ ఎన్‌డర్బీ'ని హఠాత్తుగా విడవటంవల్ల ఆహాబ్‌కి ఒక నష్టం కలిగింది. తన పడవమీదికి అతివేగంతో దూకి పడటంవలన అతని దంతపు కాలు రెండు చెక్కలయ్యేటంత అదురు కల్గింది. తన ఓడ తెట్టుమీదికి ఎక్కగానే ఎంతో తొందరతో అటూ ఇటూ తిరగటం ప్రారంభించాడు. ఆ కాలికి మరింతకుదుపు ఎక్కువైంది. చూడటానికి బాగానే ఉన్నా ఆ కాలు అంత భారం భరించలేదని అతనికి తోచింది.

అన్ని వ్యవహారాలలోను ఎంతో నిర్లక్ష్యంగా ప్రవర్తించే అహాబ్, దంతపుకాలి విషయంలో కొంత జాగ్రత్త చూపటం ఆశ్చర్యకరమే. నన్‌టుకెట్‌నుండి ఇక కొద్దిరోజులలో బయలుదేరనుండగా ఒకనాటిరాత్రి అతను ఒళ్ళు తెలియకుండా నేలమీదపడి ఉన్నాడు. ఏమి కారణమోగాని అతని దంతపుకాలు ఊడిపోయి లోతొడకు దెబ్బతగిలింది. ఎంతోకష్టము మీదగాని ఆ గాయము మానలేదు. అప్పుడతడుపడ్డ వ్యథకు పూర్వానుభూతమైన ఆపదయే నిమిత్తమనీ దానినుండియే ఇది ఉత్పన్నమైనదనీ అతను గ్రహించియే యుంటాడు. ఉద్యానవనంలో దివ్యగానము చేసే కోకిల వలెనే, చిత్తడి నేలలో తిరిగే విషసర్పముకూడా సంతానం కంటుంది. సంపదలనుండి సంపదలు పుట్టినట్లు ఆపదలనుండి ఆపదలు పుట్టుతాయి. అతని ఆ గాయం మునుపటి దెబ్బకి

ప్రతిఫలమేనని బాధాకరమైన సంఘటనలు అటువంటి సంఘటనలకే దారితీస్తాయని అతను అనుకొని యుంటాడు. ఒక దుఃఖానికి ఇంకొక దుఃఖానికి కార్యకారణ సంబంధం ఉంటుంది. కార్యాలు కారణాలకంటె తీవ్రంగా ఉంటాయి. ప్రపంచంలో సుఖాలకంటె దుఃఖాలే ముందు పుట్టినాయి. తుదకు అవే సుఖాలకంటె ఎక్కువ కాలము వర్ధిల్లుతవి. సుఖానుభవం పరలోకానికి పనికివచ్చే ఫలితాలం ఇవ్వదు. దుఃఖానుభవ ఫలితాలు పరలోకంలో కూడ పీడిస్తవి.

మహోదారమైన ఐహిక విషయానందంలో ఏదో ఒక శూన్యత్వం, అల్పత్వం ఏ మూలనో మొరమొరలాడుతూ ఉంటుంది. హృదయవిదారకమైన దుఃఖానుభూతిలో, అనిర్వచనీయమైన, గుహ్యమైన ఒక మహత్తు ఉంటుంది. వివేకంతో పరిశీలనచేస్తే ఈ తత్వం గ్రాహ్యమవుతుంది. ఈ పరిశీలన తుదముట్టసాగిస్తే దేవతలుకూడా నిత్యానందులు కారనే సిద్ధాంతం తేలుతుంది. మానవుని నుదుటిమీద, పుట్టుకతోనే ఒక గుర్తు ఉంటుంది. అది దుఃఖముద్ర. దానిని ఎన్నడూ ఎవ్వడూ తుడిచివెయ్యలేడు.

అహాబ్ విషయంలో, తలవని తలంపుగా ఇంకొక రహస్యం బయటపడింది. నేనాసంగతి ఇంతకు ముందే చెప్పి ఉండవలసింది. అహాబ్‌ను గురించిన అనేకములైన ఇతర విషయాలవలెనే అతను 'పెకోడ్' ప్రయాణానికి ముందూ, వెనుకా, ఎక్కడో ఒంటరిగా ఉండటానికి కారణం నిగూఢమై

పోయింది. కెప్టెన్ పెలెగ్ ఏదో కారణం చెప్పాడు కాని అది సంతృప్తికరంగా లేదు. అహాబ్‌ను గురించి ఎవరేమి చెప్పినా అనూహ్యమైన అతని అంతరంగంవలెనే ఉంటుంది గాని, క్రొత్తవెలుగు నిచ్చేదిగా ఉండదు. మూలము ఎంత అస్పష్టమో, వ్యాఖ్యానమూ అంతే అస్పష్టమన్నమాట. కాని, తుదకు ఈ విషయం బయటపడింది. అతని ఏకాంతానికి కారణం అతనికి వాటిల్లిన విపత్తే. నానాటికీ సంఖ్య తగ్గిపోతున్న అతని ఆత్మీయులకు కూడా ఆ విపత్తు భయానకంగా తోచింది. ఎవరికివారే, గ్రహించిన రహస్యాన్ని లోలో దిగమ్రింగుకొన్నారుగాని, ఒక్కరున్నూ బయటపెట్టలేదు.

అగోచరములు, అస్పష్టములు, క్రూరములు అయిన వాయుమండల భూతాలకు, అగ్నిగోళ భూతాలకు అహాబ్‌తో ఏదైనా పొత్తు ఉన్నదో లేదో మనము ఎరగము. ఆ సంగతి అటు ఉండనివ్వండి.

ప్రస్తుతం తనకాలి విషయంలో మాత్రం అతను మంచి పనే చేశాడు - వడ్రంగిని పిలిపించాడు !

వడ్రంగి రాగానే, వెంటనే ఒక కాలు రాత్రికే తయారు చేయమని, నావికులను ఆ తయారీకి కావలసిన సామగ్రిని ఇవ్వమని ఆజ్ఞాపించాడు. తిమింగిలంయొక్క క్రిందిదవడకు ఉండే ఎముక ముక్కలు, మందివి, పటిష్ఠమైనవి, ప్రయాణాలలో అక్కడా అక్కడా ఏరి ఉంచినవి తీసి ఇవ్వమన్నాడు. ఓడలోని కొలిమిని ఇవతలికితీసి, కమ్మరిని సిద్ధంగా వుండమని కూడా ఆజ్ఞాపించాడు.

శనిగ్రహం చుట్టూ తిరిగే వుపగ్రహాలలో ఒకదాని మీదదర్జాగా, మహారాజువలె కూర్చో. నీవెంట ఒకే ఒక మానవుని తీసికొని వెళ్ళు. అక్కడ అతని వంక చూడు. అతను ఒక వింత శోభతో వెలుగొందే శోకమూర్తిగా కానవస్తాడు. అదే చోటునుంచి మానవాళినంతా చూస్తే ఈమూక అంతా ఒకళ్ళకొకళ్ళు, అనవసరంగా తయారైన ప్రతిరూపాలు అని పిస్తారు. మానవుని ఔన్నత్యానికంతా చిహ్నం కాకపోయినా, 'పెకోడ్' యొక్క వడ్రంగి ఇంకొకళ్ళకి ప్రతిరూపం కాడు. అందువల్ల ఒంటరిగానే ఇప్పుడు రంగంమీద ప్రవేశిస్తాడు.

సముద్రయానం చేస్తూ జీవితం గడిపే వడ్రంగులందరి వలెనే అతనుకూడా తనవృత్తికి అనుబంధాలయిన అనేక కళలు నేర్చి ఉన్నాడు. కలపతో సంబంధమున్న పెక్కు చేతిపనులలో ప్రసిద్ధమైనది వడ్రంగి వృత్తియే కదా! అవిగాక ఈ వడ్రంగి, నాలుగైదు ఏండ్లు నిర్విరామంగా సముద్రం మీదనే సంచరిస్తూ ఉండవలసి, ఈ తిమింగిలపువేట ఓడలో ఎప్పుడెప్పుడు ఏయే మరలు మరమ్మతు చేయవలసివచ్చినా లోపంలేకుండ నికరంగా చేయగలడు. ఏళ్ళతరబడి దూర ప్రయాణాలు చేసే ఓడల్లో ఆ మరమ్మతులు అనేకం వస్తూంటాయి అని చెప్పనక్కరలేదు. మామూలుగా అతని వృత్తికి సంబంధించిన పనులనేకాక ఇతరములను కూడా చేస్తూండే వాడు. అతని పనులన్నిటినీ ఒక పొడవుపాటి బల్లదగ్గర చేసుకొంటూండేవాడు. ఈ బల్ల "ట్రైవర్క్స్" దగ్గరగా ఓడ వేసి

బిగించి ఉంచారు. ఆ బల్లమీద అనేకరకాలైన పనిముట్లు ఉండేవి.

ఏదైనా ఒక సూది, రంధ్రంలోకి దూరకపోతే వెంటనే దానిని తన పనిముట్టుతో సన్నంగా చేస్తాడు. పొరపాటున ఏపక్షి అయినా వచ్చి ఓడమీద వ్రాలగా, దాన్ని పట్టుకొంటే దానికోసం అనువైన ఒక పంజరాన్ని తిమింగిలపు ఎముక ముక్కలతో కొద్దిసేపులో తయారుచేస్తాడు. ఎవరికైనా చెయ్యిబెణికితే అందుకు మంచి తైలాన్ని తయారుచేసి ఇస్తాడు. స్టబ్ తన తెడ్లమీద ఎట్టి నక్షత్రాల బొమ్మలు కావాలని మోజుపడితే, ఆ నక్షత్రమండలాన్ని చిత్రించి ఇస్తాడు. నావికుడెవడైనా, చెవులకు ఎముకతో చేసిన లోలాకులు పెట్టుకోవాలనుకొంటే, వాడి చెవులుకుట్టి ఆ లోలకులు తగిలిస్తాడు. ఎవరికైనా పంటినొప్పి కలిగితే ఆ పల్లు ఇట్టే తీసివేస్తాడు.

ఇన్ని పనులు చేయగలిగినా, దేనియందూ అతనికి సక్తతలేదు, అంతా ఉదాసీనభావమే. దృశ్యమానమైనయీ ప్రకృతిది కూడా ఉదాసీనభావమేగదా! నిత్యజాగృతంగా, నిరంతర కార్యవ్యగ్రంగా కనబడే ఈ ప్రకృతి అంతంలో నిశ్చల శాంతమునే అనుభవిస్తూ ఉంటుంది. మానవుడు తనను ఎంత బాధిస్తూ ఉన్నా, అతనిని గమనింపనే గమనింపదు. అసలు అతనిని లెక్కచేయదు. మా వడ్రంగి కూడా అట్టివాడే. అతనిది రాతి హృదయమా! లేదా సముద్రాలమీద చిరసంచారం వల్ల అతనిలో ఆర్ద్రభావము అస్తమించి

పోయిందా! అతని భావనలో, మన నోటిలో పళ్ళు చిన్న దంతపు ముక్కలు! తలకాయలు చిన్నదిమ్మలు!! మనుష్యులు కూడా ఓడల్లో బరువులు ఎత్తుతూ దింపుతూ, లాగుతూ ఉండే యంత్రాలు. ఒండొంటికి పొత్తులేని ఇన్ని విభిన్న వృత్తులలో అతనికి ప్రవేశం ఉందంటే ఎంతో తెలివితేటలు గలవాడని అనుకోవాలిగదా! కాని అదీ పొసగదు.

ఇతనిలో ఒక విధమైన జడత్వమున్నదేమో, తన పరిసర జడ పదార్థాలలో లీనమైపోతాడేమో! అప్పుడప్పుడు పాతకాలపు ఛలోక్తులను విసురుతూ నవ్విస్తాడు. ఈ ముసలి వడ్రంగి ప్రపంచం నాలుగు మూలలా తిరగటంవల్ల ఎక్కడా కుదురుబాటులేక, ఉన్న అనుబంధాలు తెగతెంపులు చేసుకొన్నాడా? ఈ వింతమనిషి అప్పుడే పుట్టిన శిశువువలె ప్రపంచంతో ఇంకా సమాధానపడలేదు. ప్రపంచాన్ని లెక్క చేయకుండానే బ్రతుకుతున్నాడు. ప్రపంచంతో సమాధానం పడకపోవటానికి కొంతవరకు అతని మందబుద్ధియే కారణమేమో! ఈ పనులన్నీ ఆలోచనతోగాని, సహజస్ఫురణతోగాని చేయడు. ఊరక యాంత్రికంగా చేస్తాడు, అతనిలో ఏదైనా కొంచెం మేధ ఉంటే అదిఅతని చేతివేళ్ళలో ప్రవేశించి యుంటుంది కావుననే చేతిపనివాడన్న విశేషణం అతని పట్ల సార్థకమవుతుంది.

షెఫీల్డులో తయారయ్యే కొన్ని పొదులు, పైకి చూడటానికి జేబు కత్తులలాగ ఉంటవి. లోపల చూస్తే ఆ పొదులలో మరమేకులు, బ్లేడులు, ఆరెలు, కలాలు, రూళ్లకఱ్ఱలు,

ఒకటేమిటి, నానారకాల ఉత్కృష్టనిముట్లూ ఉంటవి. ఈ వడ్రంగి కూడా అటువంటి వాడే. నానావిధోపకారి. అతనిని ఏవిధంగా కావాలంటే ఆవిధంగా అతని యజమానులు ఉపయోగించుకోవచ్చు.

మరి అతడు నిర్జీవయంత్రము కాదు. అతనికి ఆత్మ లేక పోవచ్చుకాని అతనిచేత స్వధర్మనిర్వహణ చేయించే శక్తి, అనిర్దేశ్యమైనది ఉన్నదని ఒప్పుకోవాలి. అరవై సంవత్సరాలనుండి, అతనిని అదే నడుపుతూ ఉంది. ఆ శక్తియే, అతని నోటివెంట ఏవో మాటలు పలికిస్తూ వుంటుంది. ఎప్పుడూ తనలో తాను ఏదో మాట్లాడుకొంటూనేవుంటాడు. నిద్రపోవలసి వస్తుందని భయమో, ఏమో!

57. వడ్రంగితో అహబ్

(తట్టుమీద - మొదటి రాత్రి పహరా)

(వడ్రంగి, తన పనిముట్లు ఉన్న బల్లదగ్గర నిలబడి వుంటాడు. రెండుదీపాల వెలుగులో కాలు తయారుచేయడం కోసం, దంతపు ముక్కని చెక్కుతూ ఉంటాడు. ఇంకా, దంతపు దిమ్మలు, తోలుపట్టీలు, మరమేకులు ఏవేవో పని ముట్లు ఆ బల్లమీద పడి యుంటాయి. అతని ముందు కొలిమినుండి అగ్నిజ్వాలలు లేస్తూ వుంటాయి.)

ఈ ఆకురాయీ సరే, ఈ ఎముకా సరే, మెత్తగా వుండవలసింది గట్టిగా, గట్టిగా ఉండవలసింది మెత్తగా ఏడిశాయి. పాతదవడలు కాలిపిక్క ఎముకలు సాన పట్టవలసిన వాళ్ళ గతియింతే. ఇంకోదాన్ని తీసిచూద్దాం. ఇది బాగానే వుంది (తుమ్ముతాడు) ఓ ఈ ఎముకనుంచి వచ్చే ధూళి (తుమ్ముతాడు) ఎంత ధూళి (తుమ్ముతాడు) నన్ను (తుమ్ముతాడు) మాట్లాడనిచ్చేటట్టే లేదు. (తుమ్ముతాడు) ఎందుకూ పనికిరాని దమ్మలమీద పడి పనిచేస్తే ఇంతే శాస్తి ఈ ముసలివానికి! బ్రతికియున్న చెట్టుకొమ్మలు కోస్తే యీ ధూళే రాదు. ప్రాణమున్న ఎముకని కోసినా రాదు (తుమ్ముతాడు) ఒరేయ్ - ముసలిమొద్దూ - ఒక చెయ్యి అదియ్యి - ఆ మరమేకులు సిద్ధంగా ఉంచు, అవి కావలసివస్తాయి. కొంత వరకు అదృష్టవంతుణ్ణే! మోకాలి కీలు తయారుచేయు నక్కర

లేదు. కాలిక్కన మాత్రం చెయ్యాలి. అదెంతపని. దాన్ని కాస్త అందంగా చేయగలిగితే బాగుండును. కాని వ్యవధి లేదు. టైమే ఉంటేనా, అతనికి కావలసినంత అందమైన కాలు చేసిపెట్టగలను (తుమ్ముతాడు. బజారులలో నేను చూసిన కాళ్ళకి ఏమీ తీసిపోనట్టుగా చేసిపెట్టగలను. ఆ బజారుల్లో దొరికే కాళ్లు (తుమ్ముతాడు) నీటికి తడిసి ముద్దయిపోతాయి. వాటికీ వాతరోగం వస్తుంది. డాక్టర్లు, మందులు, ఉపచారాలు కావాలి! సరే దీన్ని కోసే ముందర నవాబు గారిని పిలిచి. పొడవు సరిపోయిందేమో చూసుకోవాలి. కొద్దిగా పొట్టి అవుతుందేమో! అదిగో అతని కాలిచప్పుడు-భలే! అతనే వస్తున్నాడిటు!

(అహబ్ వస్తూంటాడు.)

(ఈ రంగంలో వడ్రంగి అప్పుడప్పుడు తుమ్ముతూనే ఉంటాడు,

"ఏమిటోయ్ సంగతి!"

"సరిగ్గా సమయానికి వచ్చారు సార్. మీకు అభ్యంతరం లేకపోతే, కాలి కొలత తీసుకొంటాను!"

"సరేకానీ అయినా యిది మొదటిసారి కాదు. నీ దగ్గర మంచి పటకారే ఉందే! ఏదీ ఒకసారి పట్టుకుచూడనీ-ఓహో చాలా గట్టిగా వుందే"

"జాగ్రత్త- జాగ్రత్త- ఎముకలను పొడిచేసేస్తుంది"

"ఫరవాలేదు లేవయ్యా! నేను బాగానే పట్టుకోగలను! అంతా జారిపోతూ వుంటుంది ఈ ప్రపంచంలో!

ఈ ఒక్కటైనా నిలకడగా వుంటే బాగుండును. ఆ కమ్మరి ఏం చేస్తున్నాడక్కడ"

"అతను ఒక మరమేకను తయారు చేస్తున్నాడు"

"బాగానే ఉంది మీరు వంతులు పంచుకోవటం - ఆతను కండని ఇస్తున్నాడన్నమాట - అంత పెద్ద నిప్పు చేశాడేమిటి?"

"ఈ సున్నితమైన పనికి ఆ మాత్రం నిప్పు వుండాలి."

"ఓహో, ఉండాలి కాబోలు! గ్రీకువాళ్ళు, ప్రొమిథియస్ మనుష్యులని చేశాడంటారు. అతను కమ్మరి అయి ఉండాలి. మనుష్యులకి నిప్పుతో జీవంపోశాడేమో! నిప్పుతో తయారైంది నిప్పుకే చెంది యుండాలి. అంటే, నరకానికి అన్నమాట. ఓ! ఎంతపొగ వస్తోందో! ఈ శేషభాగంలో ఆ గ్రీకువాడు ఆఫ్రికన్లని తయారు చేశాడనుకుంటా. ఇదిగో! అతను ఆ మరమేకలని తయారు చేయటం అయినాక ఉక్కుతో రెండు రెక్క ఎముకలను చేసిపెట్టమను. ఓడ మీద ఒకనికి భుజాలు ఒంగిపోయాయి."

"ఏమిటి?"

"ఆగు! మన ప్రొమిథియస్ యిక్కడ వుండగానే, నచ్చిన విధంగా ఒక మనిషిని తయారు చేయటానికి పూర్తిగా సూచన లిస్తాను. ఏభై అడుగులు పొడవు వుండాలి, ఛాతీ థేమ్సుమీద ఉండే సొరంగంలాగ వుండాలి. కాళ్ళకి వేళ్ళుండాలి ఎక్కడికీ కదిలిపోకుండా ఉండేట్లు ముంజేతి నుంచి మూడు అడుగులు పొడవు వుండే చేతులు. హృదయం ఉండ

కూడదు. ఆ తడితో నుదురు, పావు ఎకరంమేర మెదడు; కళ్ల మాళె మీటి! గో మీద ఒక దీపం. లోపలికి వెలుగు చూపించేటట్టు పెడితేసరి. అయిందా ఆ ప్రకారం చెయ్యాలి. వెళ్ళు."

"ఇతను మాట్లాడే దేమిటి! ఎవరితో! నేనుండాలా, వెళ్ళాలా" (స్వగతం)

"శిఖరంమీద దీపం లేకపోవటం చాలా పొరపాటు. ఒక లాంతరు వుండవలసిందే" అలాగా యిక్కడ రెండు న్నాయి. ఒకటి... చాలు. ఏయ్! ఆ లాంతరు నా మీదికి ఎందుకు తోస్తున్నావ్! ఈ వెలుగు నా ముఖంమీదికి తోయటం పిస్తోలును గురిపెట్టి చూపటంకంటె ఘోరం."

"మీరు వడ్రంగితో మాట్లాడుతున్నా రనుకొన్నా నండీ."

"వడ్రింగా! ఏమిటి! కాదు, కాదు_ నీవు చాలా చక్కని స్తృతి చేసుకొంటున్నావు- ఏమంటావ్! కనీ మట్టితో పని చెయ్యాలని కోరిక లేదుగదా"

"అయ్యా మట్టి నా కెందుకండీ! అది కావలసిన వాళ్ళు వేరే వున్నారు."

"ఏ దెవడో అసభ్యుడిలాగ వున్నాడు. ఎందుకలా తుమ్ముతావ్!"

"ఈ ఎముకనుంచి ఒకే ధూళి వస్తోందండి"

"మూశావా మరి. చచ్చిన మీదట పూడిస్తే అంతే అవుతుంది. బ్రతికి వున్నవాళ్ళు చుట్టు ఉండగా పూడ్చిపెడితే అంతే అవుతుంది."

"సరేనండి. ఓరి భగవంతుడా!"

"ఓయ్ వడ్రంగి! నీవు చాలా మంచిపనికాడవని చెప్పుకుంటావు కదా! నే నొకటి అడుగుతా చెప్పు: నీవు తయారు చేసి కాలు తొడుక్కుంటే నాకు పుట్టుకతో ఉండే కాలు వున్నట్టే అనిపిస్తుందటావా? ఆ పాత వాసనని పూర్తిగా పోగొట్ట గలవంటావా?"

"అదా అయ్యా—యిప్పుడే కొద్దిగా బోధపడుతోంది. ఒకసారి కాలుపోయిన వాళ్ళు ఆ పాత కాలిని గురించి పూర్తిగా మరచిపోరట, నిజమేనాండి?"

"అవునయ్యా! నా కాలు ఇదివరకు ఉండే చోట నీ కాలును ఉంచు. కంటికి ఒకే కాలు కనిపిస్తుంది. కాని నిజానికి అవి రెండు నీకు జీవం వున్నట్టు ఎక్కడ అనిపిస్తుందో నాకూ అక్కడే జీవ మున్నట్టు అనిపిస్తుంది; అది విచిత్రం కాదూ! నా కది ఒక సమస్యగా తోస్తుంది."

"అది గడ్డు ప్రశ్న అనుకొంటానండి."

"అయితే విను. నీ విప్పుడు నిలిచి ఉన్నచోట నీకు బదులు ఎవడో ఒక అదృశ్యప్రాణి నిలబడి పొంచి వుండి మన మాటలు వింటూ ఉన్నాడనుకోవటంలో తప్పేముంది? కాబట్టి మాటలాడకు. ఏనాడో హరించి పోయిన నా కాలి కదలిక నాకు మనోగోచర మవుతుంది. అలాగే ఆ కొలిమి

దగ్గర ప్రొద్దుపుచ్చే నీవు, నీ శరీరం హరించి పోయినట్లూ నీవు నరకాగ్నిలో దహించుకొని పోతూ ఉన్నట్లూ భావన కలుగదా నీకు ?"

"అయ్యో ! ఈశ్వరా ! అయ్యో దానిని గురించి నేను ఆలోచించవలసి వుంది."

"సరే – కాలు ఇంకెంత సేపటికి తయారవుతుంది?"

"ఒక గంటలోనండి."

"త్వరగా తెమిల్చి తీసుకురా" (వెళ్ళబోతూ) "కర్మ! గ్రీకు దేవతలాగ ఎంతో గర్వించి నేను. ఆఖరికి కాలిమీద నిలబడటానికి ఈ మొద్దుకి ఋణపడిపోయాను. ఒకరిమీద ఒకరు ఆధారపడటం యెందుకు తటస్థపడుతుందో ! ఆ ఋణం ఏ కాతా పుస్తకాలూ తేల్చలేనిది ! నేను యెవరిమీదను ఆధారపడకూడదు. గాలివలె స్వేచ్ఛగా జీవించాలి. నేను యెంత భాగ్యవంతుడను : రోమను సామ్రాజ్యం వేలముకు వస్తే కొనగల యంతవాడను. అట్టి నేను ఈ కాలుకోసం ఈ నోటితో వాగటానికి నాలుక అనే మాంసపు ముద్దకు ఋణపడి యుండవలసి వచ్చింది. ఛీ ఛీ, నేను ఇలా వుండకూడదు. ఒక మూసను సంపాదించి అందులో కూర్చుండి కరిగిపోయిన చిన్న వెన్నుపూస ఎముక అంత సూక్ష్మరూపం కాలుస్తాను."

వడ్రంగి (తనపనిని తిరిగి ప్రారంభిస్తూ) ఏమైతేనేం ! ఇతని గురించి స్టబ్ కు తెలిసినట్టు ఇంకెవడికి తెలుసు ? ఇతను పిచ్చివాడు అంటూంటాడు స్టబ్. యిదిగో ఇతని కాలు !

అతను తిమింగిలపు ఎముకనే పక్కలో పెట్టుకొని పండుకొంటాడు! దీనిమీదనే అతను నిలబడుతాడు! ఒకే కాలు మూడుచోట్ల నిలబడటం ఏమిటి - ఆ మూడూ నరకంలో ఫుడటం - ఈ మాటలకేమిటి అర్థం? నా వైపు యెంత కోపంగా చూశాడో! నాకు ఏవేవో వింత ఆలోచనలున్నాయనుకొంటాను. కాని అది నిజంకాదు. నా వంటి పొట్టివాడు భారీగా ఉండే కెప్టెన్‌తో పాటు లోతునీటిలోకి వెళ్ళకూడదు. ఆ నీళ్ళు నన్ను ముంచేస్తాయి. అమ్మయ్య! ఇదిగో కాలు - పొడవుగా, సన్నగా ఉంది. అందరికీ ఒక జత కాళ్ళు జీవితం పొడవునా సరిపోతాయి కాళ్ళని జాగ్రత్తగా వాడుకొంటారు కాబట్టి. అహాబ్ అటువంటివాడు కాడే. చాలా మోటుమనిషి. ఒక కాలిని చంపుకొన్నాడు. రెండో కాలిని గాయపరచుకొన్నాడు. ఎముకలతో చేసిన కాళ్ళని తగిలించుకొంటూను యున్నాడు. ఓయ్ స్మిత్! ఆ మేకులు ఇలా ఇయ్యి. అతను మళ్ళీ వచ్చి అన్ని కాళ్ళూ కావాలని వేధించే లోగా తయారుగా పెట్టుకోవాలి. యిదా కాలు చూడు! నిజమైన కాలులాగానే ఉంది. అంతా సాన పట్టేశాను. రేపు దీనిమీద నిలబడతాడు.

58. అహాబ్‌తో స్టార్‌బక్

మామూలు ఆచారం మరునాడు ప్రొద్దున ఓడలోని నీటిని తోడుతున్నారు. కావలసినంత నూనెకూడా రావటంతో క్రింది బానలకి చిల్లిపడిందేమోనని భయపడ్డారు. స్టార్‌బక్ ఈ సంగతి చెప్పటానికి కెప్టెన్ యొక్క గదిలోకి వెళ్ళాడు.

నైరృతిమూల నుండి "పెకోడ్" ఫార్మోజాని, బాషీ ద్వీపాలని సమీపిస్తుంది. ఆ రెంటికీ నడుమనే చైనా సముద్రమునుండి పసిఫిక్ మహాసముద్రానికి ఒక దారి వుంది. స్టార్‌బక్ గదిలోకి ప్రవేశించునప్పటికి అహాబ్ రెండు పటాలను ముందు వేసుకొని వున్నాడు. అందులో ఒకటి ప్రాగిశ యందలి ద్వీపాల పంక్తులను • స్థూలంగా సూచించేది. రెండోది, జపాన్‌కి తూర్పు దిక్కున ఉన్న నిఫన్, మత్సుమయి, సికోక్ ద్వీపాలని సూచించేది. తన దంతపు కాలిని మేజామీద ఊంచుకొని చేతిలో చిన్న

• ఓడమీద బాగా తిమింగిలపు నూనె ఉన్నప్పుడు వారానికి రెండుసార్లు ఆ నూనె ఉండే బానల్లో సముద్రపు నీరు పోస్తారు. ఆతరువాత దానిని పంపులతో తోడేస్తారు దీనివల్ల బానలు చాలా తడిసి బిగువుగా ఉంటాయి. తిరిగి తోడేసిన నీటివల్ల నావికులకు తమ సరుకు ఏమైనా కారిపోతుందేమోనని తెలుసుకోటానికి వీలవుతుంది.

చాకుతో ఆ పటాలవైపు చూస్తూ తన ప్రయాణపు దారులను గుర్తించుకొంటున్నాడు.

తలుపుదగ్గర అడుగుల చప్పుడు విని, "ఎవరక్కడ! తట్టుమీద– అవతలికి పో" అని తలుపువైపు వెనుకకు తిరుగకుండానే అన్నాడు.

"నేను– బానలలోని నూనె కారిపోతోంది– 'బర్టన్ల'ని ఎత్తాలి.

"బర్టన్లని ఎత్తాలంటావా! జపాన్ దగ్గర పడుతూ వుంటే ఇక్కడ ఒక వారం కూర్చుని మరమ్మతు చేద్దామంటావా!"

"ఆ పనినైనా చేయాలి. లేకపోతే, ఒక సంవత్సరం అంతా కష్టపడితేగాని దొరకనంత నూనెని ఒక్క రోజులో పోగొట్టుకోనైనా పోగొట్టుకోవాలి. మనము ఇరవై వేల మైళ్ళ ప్రయాణం చేసి సాధించిన దానిని కాపాడుకోవాలి కదా"

"అవును నిజమే. మనము సాధించటమంటూ ఉంటే"

"నేను బానలోని నూనెను గురించి చెప్తున్నానండి"

"నేనుదానిని గురించి మాట్లాడటం లేదు.ఆలోచించటం లేదు.అంతే; పో, జారిపోతే పోనీ, నేనే జారిపోతున్నాను నూనె ఉన్న బానలలో రంధ్రాలు, బానలున్న ఓడలో రంధ్రాలు, వీటిని మూయుట యెట్లు! ఆ కారే కన్నము ఎక్కడో లోతుగా ఉంటే ఎట్లా ఆపటం? ఒక వేళ అది కనబడినా, జీవితపు పెనుతుఫానులో దానిని పూడ్చటం ఎట్లా! స్టార్

బక్. బర్ట్లని ఎత్తటానికి వీలులేదు”

“ఈ ఓడ యజమానులేమంటారు!”

“వాళ్లు నన్‌టుకెట్ రేవులో కలబడి గొంతు చించుకుని ఏడవనీ, అహాబ్‌కి ఏమి లెక్క! యజమానులు! స్టార్‌బక్ ఆ పీనాసి యజమానులను గురించి ఎప్పుడూ నా దగ్గర వాగుతూనే ఉంటావు- వాళ్లు నా ‘ఆత్మ’ అనుకుంటున్నావా! దేనికైనా నిజమైన యజమాని అంటూ ఒకడే ఉంటాడు- వాడే దాని అధికారి. ఈ ఓడకు నేనే అధికారిని. ఈ ఓడలోనే ఉంది నా ఆత్మ.”

స్టార్‌బక్ ముఖం ఎర్రబడింది. ఒక అడుగు ముందుకు వేసి జాగ్రత్తగా, నమ్రతతో బయటకి ఏమాత్రమూ కోపం కనపర్చకుండా అన్నాడు. “కెప్టెన్ అహాబ్! నాకంటె ఓస్సు ఉన్నవాడెవడైనా ఈ మాటలే మీకంటె చిన్నవాడెవడైనా అంటే, అవమానకరంగా భావిస్తాడు. మీరు అంటున్నారు కాబట్టి వాటిని అంతగా పట్టించుకోకపోయేవాడు”

“రాక్షసులు! నన్ను గురించి మీరంతా ఇట్లా విమర్శిస్తూ ఉంటారన్నమాట”

“కాదు, ఇంకా అందాకా రాలేదు. మిమ్మ ఓర్పుతో గమనిస్తూ ఉండటమే నేను చేసిన సాహసం. మనం ఒకళ్ళనొకళ్ళం బాగా అర్థం చేసుకోవాలి గదా, కెప్టెన్ అహాబ్!”

గదిలోవున్న తుపాకిని తీసి, స్టార్‌బక్ వైపు పెట్టి, అహాబ్ అన్నాడు: “భగవంతుడొక్కడే ఈ ప్రపంచమంత

టికి ప్రభువు. 'పెకోడ్' మీద అధికారి ఒక్కడే. వాడు కెప్టెన్."

స్టార్ బక్ ఎర్రబారిన కళ్ళల్లో, కెంపులవంటి చెక్కిళ్ళలో, ఆ తుపాకి దెబ్బతిన్నట్లుగానే గోచరమైంది. ఎంతో నేర్పుతో అతను, శాంతంగా లేచి, గది బయటకు వస్తూ అన్నాడు; "మీరు నన్ను అవమాన పరచలేదు, కాని నాపై దౌర్జన్యం చేశారు. "స్టార్ బక్ అంటే మీరు భయపడాలి" అని నేనంటే మీరు నవ్వుతారు. నేను ఆ మాట అనను. కాని, అహాబ్బే భయపడాలి; మీ వల్లనే మీకు భయం"

స్టార్ బక్ బయటకు వెళ్ళిన తరువాత, "ప్రగల్భాలు బాగానే పలికాడు, కాని చెప్పినట్టు వింటాడు! ఏమన్నాడూ అహాబ్ అంటే అహాబ్బే భయపడాలా! అందులో ఏదో సత్యమున్నట్టుందే" అనుకొన్నాడు. ఆ తుపాకిని, చేతికర్రగా ఎంచి, ముఖం పాషాణం కాగా ఆ గదిలో అటూ ఇటూ పచార్లు చేశాడు. కొద్దిసేపట్లో అతని నుదుటిమీద దట్టమైన ముడతలు మాయమైనాయి. తుపాకీని బీరువామీద పెట్టి, తట్టుమీదకి వెళ్లాడు.

స్టార్ బక్ దగ్గరకి వెళ్ళి మెల్లిగా "నీవు చాలా మంచి వాడవు స్టార్ బక్" అని బిగ్గరగా "తెరచాపల్ని ఎత్తండి; బర్టన్లని ఎత్తండి" అని ఆజ్ఞాపించాడు.

"స్టార్ బక్ పట్ల అహాబ్ ఆ విధంగా ఎందుకు ప్రవర్తించాడో ఊహింపబూనటం వ్యర్థం. ఒక వేళ అది నిజా

యితీ కావచ్చు. లేకపోతే, ఆ సమయంలో ఏమాత్రమూ కోపము కనబర్చటం మంచిది కాదన్న ఊహ కావచ్చు. అతని ఆజ్ఞప్రకారం, బర్టన్ని ఎత్తారు.

59. శవపేటికలో క్వీకెగ్

కన్నాలు వెదకటం ప్రారంభించారు. పైనున్న ఖానల్లో ఏమీ లోపంలేదని తెలిసింది. అలా అడుగుకిపోతూ ఓడ లోపలి సామానంతా బయట తట్టుమీదికి పడవేస్తున్నారు. తట్టుమీద ఆ సామానంతా చేరటంవల్ల అడుగు పెట్టే వీలు లేకపోయింది. ఓడలోపలి భాగమంతా డొల్ల అయిపోయి నట్టనిపించింది. కడుపులో ఏమీ లేనివాడి మెదడులో బోలెడంత విద్యని దాచుకొన్నట్టు, పైభాగం బరువెక్కి పోయింది.

ఆ సమయంలోనే, నా ఆప్తమిత్రుడు క్వీకెగ్ జ్వర పడి; అకాల మరణానికి ఆసన్నమైనాడు.

తిమింగిలాల వేట వృత్తిగాగల వాళ్ళ ఉద్యోగంలో దర్జా ఏమీలేదు. అంతా అపాయమే. కెప్టెన్ అయ్యేవరకూ గౌరవమూ లేదు. పైకి పోయినకొద్దీ కష్ట మెక్కువ.

ఓడను మెల్లగా ఖాళీ చేస్తూండగా, క్వీకెగ్, అడుగు భాగానికి పోయి ఆ తడిలో పని చేయవలసి వచ్చింది. పైనుంచి చూస్తే, నూతిలో అడుగున ఎక్కడో ఉన్న జంతువులాగ కనబడ్డాడు. అతను అక్కడ పని చేస్తూ చెమటతో తడిసిపోతూ ఉన్నా అతనికి హఠాత్తుగా చలి పుట్టుకొని వచ్చింది. అది జ్వరంగా పరిణమించింది. ఆ జ్వరంలో, ఆ అడుగుభాగంలోనే కొన్నాళ్ళు గడిపాడు.

మృత్యువాసన్నమైనది. ఆ రోజుల్లో ఎలా క్షీణించిపోయాడో అతని ఒంటిమీద మచ్చలు, అస్థిపంజరమూ తప్ప ఇంకేమీ మిగులలేదు అతను చిక్కిపోతున్నా, అతని ఎముకలు బయటపడుతున్నా, అతని కళ్ళు మాత్రం పెద్దవౌతున్నట్లని పించింది— వాటికొక మృదుకాంతి కల్గింది. అతని కళ్ళ లోతులలోనికి చూస్తూవుంటే అద్భుతమైన అమరమైన అతని ఆరోగ్య లక్షణం గోచరిస్తూండేది. నీటిమీద, సుడివలయాలు సన్నగిల్లినకొద్దీ విస్తరిస్తూ ఉంటాయి. అలాగే అతని కళ్ళ వెలుగుకూడా సన్నగా విస్తృతంగా వలయాలు కట్టి కనబడ జొచ్చింది. కృశించిపోతున్న ఆ అనాగరకుని ప్రక్కన కూర్చుంటే వర్ణింపజాలని భయం ఆవహించేది. అసలు మానవునిలో నిజంగా అద్భుతమైనది, భీకావహమైనదేదో దాన్ని ఎవ్వరూ వర్ణించనేలేదు. అందరిని సమముచేసి అందరికి ఒక మాదిరిగానే, అంత్యకాలంలో సాక్షాత్కరించే మృత్యువుయొక్క ఆగమనమును గురించి, మృతుడైన రచయిత తప్ప బ్రతికియున్నవాడు సంతృప్తికరంగా వివరింపలేడు.

క్వీక్వెగ్, ఊగుడుబల్లమీద పడుకొన్నాడు. అతని అంతిమ విశ్రాంతికై సముద్రతరంగాలు జోకొట్టుతున్నాయి. ఒక్కొక్క కెరటం పైకిలేస్తూ అతనిని పరలోకానికి అందిస్తూ వుంది. ఆ సమయంలో అతని ముఖంమీద కానవచ్చిన ఛాయలు ఎంతటి పవిత్రము మహత్తరము అయిన ఆలోచనల యొక్క నీడలో

ఓడలో ఎవ్వరూ అతను పోతాడనుకోలేదు. క్వీకెగ్ ఏమనుకొంటున్నాడో అతను కావాలన్న ఒక వింత కోరికవల్ల బయటపడింది. తెల్లవారుతూండగా ఓడనావికుని పిలిచి అతని చేతిలో తన చెయ్యివేసి, నన్‌టుకెట్‌లో నల్లని చెక్కతో చేయబడిన చిన్నచిన్న పడవలని చూశానని, ఆ చెక్క తమ స్వస్థలంలో దొరికే కలపని గుర్తుచేసిందనీ చెపుతూ, ఆ పడవలేమిటో అని వాకబు చేయగా నన్‌టుకెట్‌లో చనిపోయిన వేటగాళ్ళను ఆ పడవల్లో పడవేస్తారని తెలిసిందనీ చెప్పాడు. వాళ్ళదేశంలోకూడా అట్టి ఆచారమే ఉన్నదట. వాళ్ళదేశంలో చనిపోయిన వాళ్ళ కళేబరానికి తైలంరాసి, పడవలో పెట్టుతారట అలా పెట్టటంవల్ల ఆ ప్రాణి నక్షత్రమండలానికి పోతుందట. నక్షత్రాలన్నీ దీపాలట. తమ దేశపు సముద్రాలే స్వర్గలోకమునందలి సముద్రాల నీలినీటిలో కలిసిపోయి పాలపుంతయొక్క తరంగాలుగా మారిపోతాయట. తననుకూడా అటువంటి చిన్నపడవలో పడవేసి పరలోకానికి సాగనంపమని కోరుకొన్నాడు. మామూలుగా సముద్రము మీద చనిపోయిన వాళ్ళను ఉయ్యాలలో పెట్టి నీటిలో వదలివేస్తారు.

క్వీకెగ్ కోరిన విధంగా చేయమని వడ్రింగిని పురమాయించారు. ఓడలో ఏమూలో నల్లనిరంగుగల కలప ఉన్నది. ఆ కలపని వెనుక ఎప్పుడో లక్కదీవులలో సంపాదించారు. వడ్రంగికి వార్త అందగానే అతడు అతి [illegible] కొలత

బద్దని తీసికొనివెళ్ళి క్వీకెగ్ యొక్క ఒడలి కొలతలను తీసికొన్నాడు.

"పాపం! వీడు చస్తాడు. ఇంక" అని ఒక నావికుడు వాపోయాడు.

వడ్రంగి తనబల్లదగ్గరకు వెళ్ళి ఆ కొలతల ప్రకారం ఒక శవపేటికను తయారుచేసి, దానిని బుజానపెట్టుకొని అంతా సిద్ధమైనట్టేనా అని అడుగుతూ ముందుకు నడిచాడు.

తట్టుమీాది వాళ్ళు ఆ శవపేటికను గురించి వేసే ఛలోక్తులు చెవిని పడగానే క్వీకెగ్ కోపంగా, ఆ శవపేటి ను తన దగ్గరకు తీసుకురమ్మని అరిచాడు. అతనిని వారించటము కష్టమే. చనిపోయేముందు మనుష్యులు చాలా నిరంకుశంగా ఉంటారు. 'ఇంక ఏలాగూ చనిపోతాడు. మనకు వీని బాధ యిక ఉండదు. పోనీలే, వీనికోరిక తీర్చుదామనుకొన్నారు.'

క్వీకెగ్ ఆ శవపేకన పరీక్షగా చూసి తన ఈటెని తెమ్మన్నాడు. దానికి ఉండే కొయ్యపిడిని తీయించివేసి ఇనుప భాగాన్ని తన తెడ్డను పేటికలో ఉంచమన్నాడు. అతని కోరికమీాదే, ఆ పేటిక ప్రక్క వరుసలలో కొన్ని బిస్కట్లను ఒక ఫ్లాస్కుతో మంచినీళ్ళను తల దగ్గర పెట్టారు. కాలు పెట్టుకోవటానికి చిన్న సంచిలో కొంత మట్టిని, తలకి దిండుగా ఒక తెరచాప బట్టని పెట్టారు. తనను తీసికొని వెళ్ళి ఆ అంతిమ శయ్యమీాద పడుకోపెట్టమనీ, దాని సౌకర్యము తెలుసుకోవాలనీ కోరుకొన్నాడు. అలాగే చేశారు. అందులో కదల కుండా కొన్ని [illegible]షాలు పడుకొని ఒకనిని పిలిచి తన సంచిలో

ఉండే ఆ చిన్న విగ్రహం, రూజోని తెచ్చిపెట్టమన్నాడు. రూజో పట్టుకొని గుండెలమీద రెండు చేతులు వేసుకొని శవపేటిక యొక్క మూతని వేయమన్నాడు. తలమాత్రం కనబడుతూండగా అతను ఆ పేటికలో పడుకొన్నాడు. "బాగానే వుంది" అని తిరిగి ఉయ్యేల మీదకు చేర్చమని సంజ్ఞ చేశాడు.

ఇది జరిగేలోగా, అక్కడే తచ్చాడుతున్న పిప్ అతనిని సమీపించి, ఒక చేతిని తన చేతిలోకి తీసుకొని వేరొక చేతితో చిన్న తంబురా పుచ్చుకొని, వెక్కి వెక్కి ఏడుస్తూ "బాటసారీ! ఈ త్రిప్పటకి అంతులేదేమిటి! ఇప్పు డెక్కడికి వెళ్లుతున్నావు! ఈ కెరటాలు నిన్ను ఆంటిలీస్‌కి తీసికొని వెళ్ళితే నాకొక చిన్న పని చేసిపెట్టుతావా! అక్కడ పిప్ అని ఒక డుంటాడు. వాడు చాలా కాలంనుంచి కనబడటం లేదు. అతనిని వెదకు. అతను ఆంటిలీస్‌లోనే ఉండి తీరాలి. అతను కనబడితే అతనికి కొంత ఊరట కల్పించు. పాపం. ఎంతో దుఃఖపడుతూ వుంటాడు. చూడు - అతను ఈ తంబురా మరచిపోయి వెళ్ళాడు. అది నాకు దొరికింది. లా-ల_లల లా_ క్వీకెగ్ కన్ను మూసివేయి. నేను నీకు కావలసిన లాంఛనాలు ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

ఇదంతా చూస్తూ స్టార్‌బక్, "తీవ్రమైన జ్వరం తగిలినప్పుడు మనుష్యులు తమకి తెలియకుండానే చాలా పెద్ద మాటలు అంటూ ఉంటారు- ఆ మాటల ఆరాతీస్తే ఎప్పుడో ఏ గొప్ప పండితుడో వాళ్ళ సమక్షాన అన్నవే అయివుంటాయిట. పాపం ఈ పిప్ తన ఉన్మాదంలో [illegible] అతిలోకమైన

మాటలూ అనుభవాలూ చెప్తూనున్నాడు. ఈ విషయాలన్నీ ఎక్కడ నేర్చుకొన్నాడో - ఆలకించు. మళ్ళీ మొదలు పెట్టాడు!"

"ఇద్దరేసి వరుసగా నిలబడండి. అతనిని ఒక మహా యోధునిగా చేద్దాం. అతని ఈటె ఏదీ? ఇక్కడ పెట్టాడి-లలా లలలా - అతని తల దగ్గరే ఒక పందెపుకోడి నిలబడి అరిస్తే బాగుండును! క్వీక్వెగ్ పందెంలో చచ్చినవాడవుతాడు! వినండి- క్వీక్వెగ్ పందెములో చచ్చినవాడు! "పందెం"లో అనే నేవనేది. పిప్, ఒక పిరికివాడిలా, వణుకుతూ చచ్చాడు. ఇదిగో విను- పిప్ నీకు కనబడితే, ఆంటిలీస్‌లో అందరికీ అతను పిరిగిపంద అనీ, పారిపోయి వచ్చాడనీ చెప్పు. పిరికి పంద! తిమింగిలాల వేటకు వెళ్ళే ఓడనుంచి గెంతేశాడని చెప్పు! అతనికోసం నేనేమీ చేతులు మోడ్చను. అతను అక్కడికి వచ్చి మళ్ళీ చచ్చినాసరే అతనిని మహాసేనా నాయకుడని పొగడకు! పిరికిపంద లంతా సిగ్గుమాలినవాళ్ళు! వాళ్ళంతా కూడా పిప్ లాగానే ఓడ మీదనుంచి క్రిందికి గెంతిపోనీ! సిగ్గు! సిగ్గు!"

ఇదంతా జరుగుతున్నంతసేపూ ఏదో కలకంటూ ఉన్న వాడిలాగ క్వీక్వెగ్ కళ్ళు మూసుకునే ఉన్నాడు. 'పిప్'ని అవతలకి తీసుకుపోయారు. రోగిని తిరిగి ఉయ్యాలలో పరుండ బెట్టారు.

మరణ కర్మకాండ అంతా పూర్తి అయింది. అంతలో క్వీక్వెగ్ అనుకోకుండా తేరుకొన్నాడు. వడ్రంగి తయారుచేసిన

పెట్టె యొక్క అవసరం లేకుండా పోయిం దనిపించింది. కొందరు ఆశ్చర్యపూర్వకమైన ఆనందాన్ని వెలిబుచ్చారు. తాను తేరుకోవటానికి కారణాన్ని క్వీకెగ్ ఇలా వివరించాడు. అతను రేవులో పూర్తి చేయక విడిచిపెట్టిన పని ఒకటి ఆ దెప్పరపు గడియలలో జ్ఞాపకం వచ్చిందట. అందువల్ల చావటమును గురించి మనస్సు మార్చుకొన్నాడట. అప్పుడే చావ కూడ దనుకొన్నాడట. చావటం, బ్రతికి వుండటం నీ చేతుల్లోని విషయాలేనా అని అడిగారు. 'తప్పక, అవి నా వశములోనే వున్న' వన్నాడు. క్వీకెగ్ అహంభావమది. మనిషి బ్రతికదల్చుకుంటే, మామూలు రోగం అతన్ని చంపలేదు. ఏతిమింగిలమో, తుఫానో ఏదో మన చేతుల్లో లేని శక్తి మనలను నాశనం చేయదల్చుకుంటే, మాత్రం తప్పలేదట!

నాగరికునికి, అనాగరికునికి ఇంకొక తేడా వుంది. జబ్బునుండి కోలుకోవటానికి నాగరికునికి ఆరు నెలలు పడితే, అనాగరకునికి ఆరు రోజులు పడుతుంది. కొద్ది రోజులు మాత్రం విశ్రాంతి తీసుకొని, బాగా భోజనం చేస్తూ ఒకనాడు తాను మళ్ళీ యుద్ధానికి సిద్ధమంటూ ముందుకి దూకాడు, క్వీకెగ్.

ఒక వెర్రికోరిక మీద, తన శవపేటికని, తన పెట్టెగా తీసుకొని తన సామానంతా అందులో సర్దుకొన్నాడు. ఎన్నో గంటలు కూర్చొని, ఆ పేటిక యొక్క మూతమీద తన ఒంటిమీద వున్న పచ్చలు వంటివే, అనేక రూపాలను చెక్కవాడు. అతని ఒంటిమీద మచ్చలని [illegible] దేశంలో ఒక

ఈతగంటవు వేశాడట. ఆ బొమ్మల భాషలో ఆయన సృష్టి రహస్యాలని, నిర్వాణము పొందే మార్గాన్ని బోధించాడట. క్వీకెగ్గే ఒక అతిగహనమైన సమస్య అయి పోయినాడు. అత నెవరో అతనికే తెలియదు! అతనితో పాటే సమసిపోయే ఆ రహస్యాలని ఎవ్వరూ తెలుసుకోలేరు. ఇది చూచే కాబోలు అహాబ్ ఒకనాడు, "కూ్రరదేవతలు ఎంతెంత ఆశలు కల్పిస్తారో!" అని ఒక కేక వేశాడు.

60. పసిఫిక్ మహాసముద్రం.

టాహీ ద్వీపాలనుంచి మెల్లగా పసిఫిక్ మహాసముద్రం లోకి ప్రవేశించాం. నా చిరకాల వాంఛితం తీరింది. తూర్పు దిక్కుగా కొన్ని వేలమైళ్లు విస్తరించి వున్న ఆ మహాసముద్రానికి జోహారు లర్పించాను.

ఆ మహాసాగరముకు ఏ మహత్తు వుందో తెలియదు. దాని మెత్తని కలయికలు మన అంతరాత్మలో ఏదో సంభాషణం సల్పుతున్నట్టు అనిపిస్తాయి. నాలుగు ఖండాలకి చెందిన ఈ సముద్రపు ఉపరితల కెరటాలు నిర్విరామంగా లేస్తూ పడుతూండటం ఎంతో సహజం. ఎందుకంటే, ఇక్కడే కొన్ని లక్షల నీడలు, మిథ్యలు, కరిగిపోయిన కలలు, మనః ప్రతిభ్రమాలు, జీవితము ఆత్మ. అని మనం అనుకొనేవి — అన్నీ కలిసిపోతాయి. ఇవే లోపలి వుండి కలలుగంటూ, దొర్లుతూంటే బయట నిర్విరామంగా పొర్లే కెరటాలు ఏర్పడ్డాయి.

సముద్రయానం చేసే ఎవరికైనా పసిఫిక్ ని చూడగానే, అది తన మనస్సుకి నచ్చిన సముద్రం అవుతుంది. అది ప్రపంచ మధ్యభాగాన వుంది. హిందూమహాసముద్రమూ, అట్లాంటిక్ మహాసముద్రమూ దాని రెండు భుజాలు. అత్యంత అధునాతనమైన మానవాళి నిర్మించే కాలిఫోర్నియాయొక్క నగరాలని ఈ మహాసముద్రపు కెరటాలు తాకుతాయి. ఇంకొకవంక అతి పురాతనమయ్యు[illegible] జీవంతో [illegible]ట్టిపడే

ఆసియా భూభాగాలనీ తాకుతాయి. ఈ రెంటి మధ్యా ఉన్నాయి ఆకాశగంగవలె అశేషాలైన పగడపు దీవులు, ద్వీపాల సమూహాలు, దుష్ప్రవేశములైన జపాను దీవులు. దివ్యమైన పసిఫిక్ మహాసముద్రము ఈ విధంగా ప్రపంచంలో చాలా భాగాన్ని తనచెంత చేర్చుకొంటుంది.

భూమికి ఆ జలరాశి హృదయము, ఆ తరంగాలు చూస్తే హృదయ ముప్పొంగి అప్రయత్నముగా దేవునకు నమస్కరిస్తాము.

కాని అహబ్‌కు ఆ సాగరరాజును గురించిన ఆలోచనే లేదు. లోహప్రతిమలాగు నిలబడి బాషిదీవుల నుండి వచ్చే కమ్మని తెమ్మెరలని గ్రోలుచూ, తాను క్రొత్తగా ప్రవేశించిన ఆ మహాసముద్రపు వాయువులను పీలుస్తూ ఉన్నాడు. ఈ మహాసముద్రములోనే కదా! తెల్లతిమింగిలం ఈదుతూ వుంటుంది! వేటకి ఇంచుమించు తుది తావు ఇదే. జపాను వైపు ఓడ వెళ్ళుతూ వుంటే అతని సంకల్పము మరీ ధృఢమయింది. అతను పెదవులు జోడించి బిగబట్టి నిలబడి యున్నాడు. అతని నుదుటిమీాది రక్తనాళాలు వరదలలో సెలయేళ్ళవలె ఉబ్బి యున్నాయి. అంతలో నిద్రలో కేక పెట్టినట్టు "జాగ్రత్త" తెల్ల తిమింగిలం నెత్తురు కక్కుతుంది" అని అరిచాడు; ఆ ధ్వని మా చెవులలో గింగురు మని మ్రోగింది.

61. కమ్మరి

ఆహాబ్ యొక్క దంతపు కాలి కోసం తాను చేయవలసిన పని చేసినతరువాత, కమ్మరి పెర్త్, తన కొలిమిని తట్టు మీదనుండి తీసివేయలేదు. వెచ్చవెచ్చని ఆ రెండలో కూర్చుని ముందు ముందు చాలా పని వుంటుందని ఎదురు చూస్తూ, ఈ లోగా వాళ్ళకీ వీళ్ళకీ కావలసిన చిన్న చిన్న పనులను చేసిపెడుతూ అక్కడే వుండిపోయినాడు. తరచు అతని చుట్టూ ఒక గుంపు చేరేది. పారలను ఈటెలను బాగు చేసి పెట్టమని అడిగేవాళ్ళూ, ఊరక అతని పనిని పరీక్షిస్తూ చూచేవాళ్ళు చేరేవారు. అతను ఎంతో ఓర్మితో తన పని చేసికొని పోతూండేవాడు. ఒక్క సణుగుడు గాని, విసుగు గాని కోపంగాని లేక నిశ్శబ్దంగా, నెమ్మదిగా, గంభీరంగా, కాన వచ్చేవాడు. అసలే వయస్సుతో వంగిపోయిన వెన్నును యింకా బాగా వంచివేసి, శ్రమపడటమే జీవితంగా, సుత్తి పోటులే తన హృదయస్పందనాలుగా కాలం పుచ్చేవాడు. దుర్భరమైన జీవితం !

ఆతని నడకలో కొంచెం కుంటువనముంది. అది కొందరికి వింతగా గోచరించేది. వాళ్ళ ప్రశ్నలకు తాళలేక ఒకనాడు తన కథను చెప్పాడు. దానితో అతని దుర్దశకు కారణం అందరికీ తెలిసింది. ఆ కథ యిది: మంచి శీతాకాలం అర్ధరాత్రివేళ ఆతను రెండు [illegible]

ఒక తోటలో వెళ్ళుచుండగా తన పాదాలు కొంకర్లు పోయి నట్టు అనిపించింది. వెంటనే ఒక శిథిలమైన ధాన్యపుకొట్టులో తలదాచుకొన్నాడు, తరువాత చూస్తే అతని పాదాల అంచులు హరించిపోయినాయి. ఆ కథలో, అతని జీవిత నాటకంలోని సంతోషకరమైన నాలుగు అంకాల ప్రథమ భాగమున్న, యింకా ముగింపుకు దాని విషాదకర పంచ మాంకమును వ్యక్తపయినాయి.

అతనికి అరవయ్యోపడి వచ్చినతరువాత జీవితంలో పతనం వాటిల్లింది. ఒకప్పుడు అతను మంచి నేర్పరి అయిన పనివాడు. బాగా వున్నవాడు కూడాను. ఇల్లూ, తోటా, ఉండేవి. మంచి ఇల్లాలూ, అందమైన పిల్లలూ ఉండేవారు. ప్రతి ఆదివారమూ చర్చికి వెళ్లుతూ ఉండేవాడు. ఒక రాత్రి చీకటిలో, మారువేషంతో ఒక దొంగ వారి యింట ప్రవే శించి, అంతా దోచుకొని పోయినాడు. ఆ దొంగను మన కమ్మరి అమాయకంగా తన దారపుత్రుల మధ్యకు తీసుకొని పోయినాడు. ఎవ్వడా దొంగ ! బుడ్డి – బుడ్డి గారడీగాడు– బుడ్డి బిరడా తీయుగానే దయ్యం బయటకు వచ్చి, ఇంటిని గుల్ల చేసింది. అసలు కమ్మరి తన కొట్టుని ఇంటి అడుగు భాగాన పెట్టుకొన్నాడు. అతను క్రింద సుత్తితో కొడు తూంటే పైన ఉన్న అతని భార్యకి ఏదో మధురంగా విన బడేది. ఆ ఇనుప జోలపాట అతని పిల్లలను నిద్రపుచ్చేది. కష్టాలు ఒంటరిగా రావు, ఒకదాని వెంట ఇంకొకటి. మృత్యువు సమయాన్ని కనిపెట్టి ఎందుకు రాదు ! ఆ కమ్మరి

పూర్తిగా నాశనం కాకముందు మృత్యువు అతనిని తన ఒడి లోకి తీసికొని ఉంటే ఆ వితంతువుకి ఒక మధురమైన గాథా ఉండేది, ఆ పిల్లలకి గౌరవంగల తండ్రి జ్ఞాపక ముండేవాడు ! కాని, మృత్యువు అతన్ని అప్పుడు విడిచి పెట్టింది. జీవితం లోని విషమంతా అతన్ని నాశనం చేసిన పిమ్మట, అతనిని పెకలించివేసే తన పని సుకరము అవుతుందనీ కాబోలు.

కథ అంతా ఎందు కిప్పుడు ? సమ్మెట పోట్ల సత్తువ తగ్గింది. రోజులు గడిచినకొద్దీ అవి మెత్తగా పడుతున్నాయి. పైన కిటికీ దగ్గర స్తబ్ధురాలై కంట నీరులేక, కంట తడిపెట్టే పిల్లలవైపు చూస్తూ కూర్చుంది ఆ ఇల్లాలు. కొలిమి తిత్తులు మూసుకు పోయాయి. కొలిమి బూడిదతో కప్పబడిపోయింది. ఇంటిని అమ్మేశారు. ఆ ఇల్లాలు మట్టిలో కలిసిపోయింది. ఆమె పిల్లలూ ఆమె చెంతకు వెళ్లారు. ఇల్లు, వాకిలి పెండ్లాం బిడ్డలు లేని ఆ యేకాకి— ఆ ముసలివాడు దేశదిమ్మరి అయినాడు.

ఇటువంటి నిర్భాగ్య జీవితానికి మృత్యువు ఒక్కటే వాంఛనీయము. కాని మృత్యువు అంటే మనకు తెలియని లోకానికి తీసుకుపోయే సాధనమే కదా ! బహుదూరము, నిర్మానుష్యము, జలపూరితము, అపారము అయిన వాటికి ప్రథమ సోపానము మృత్యువు. చావును కోరినా ఆత్మహత్య ఇష్టములేని వాళ్ళను సత్వగ్రాహమైన సముద్రము తన రమణీయ భయానక దృశ్యాలను ప్రదర్శిస్తూ ఆహ్వానిస్తుంది. మహాసముద్రాల గర్భకుహారాలనుండి ఆ శేషమైన సముద్ర

కన్యలు పిలుస్తారు. "నీ విక్కడికి రా దుఃఖితుడా! ఇక్కడ సద్యోమరణం కల్గదు ఇక్కడ అపూర్వమైన వేరొక జీవితమున్నది. అలౌకికములైన అద్భుతా లున్నాయి. అవి సులభగ్రాహ్యములు. వాటికోసం ప్రాణా లర్పింప నక్కరలేదు. ఇటు వచ్చి ఈ ఈజీవితంలో మగ్నుడవవు కమ్ము. అసహ్యకరమైన ఆ భూమి మీది నీ జీవితము మృత్యుతుల్యమే. రా! లేచిరా! మేము నిన్ను ప్రీతితో స్వీకరించే యోగ్యతతో లేచిరా!"

తూర్పు పడమరల నుండి వచ్చే ఈ గొంతులను విని, అతని మనస్సు స్పందించింది. పర్త్, తిమింగిలాల వెంట బడ్డాడు.

62. కొలిమి

మాసిన గడ్డంతో, సొరచేపతోలుని కప్పుకొని, పెర్త్ తనకొలిమికి, పట్టెడకి మధ్యనిలబడ్డాడు. పట్టెడని ఒక దిమ్మమీద ఉంచాడు. ఒక చేతితో ఇనుప ఊచను నిప్పులో పెట్టి పట్టుకొన్నాడు. రెండో చేతిని కొలిమి తిత్తిమీద ఉంచాడు. చిన్నతోలుసంచిని చేతబుచ్చుకొని, అహాబ్ అటువైపు వచ్చాడు. ఇంకా కొంత దూరం ఉండగానే అహాబ్ ఆగిపోయాడు. పెర్త్ ఇనుముని నిప్పులోనుంచి తీసి పట్టెడమీద పెట్టి సమ్మెటతో కొట్టడం మొదలుపెట్టాడు. నిప్పురవ్వలు ఎగురుతున్నాయి. వీటిలో కొన్ని అహాబ్ దాకా వెళ్ళాయి. "నీ చిన్నారి పిచ్చుకలా ఇవి, పెర్త్! లేవగానే ఎగురుతున్నాయి. మంచి శకునమే కాని, ఒంటికి చురక వేస్తాయి. నీవు వాటిమధ్య ఉన్నా నిన్నే మాత్రం కాల్చవే" అన్నాడు అహాబ్.

"నేనెలాగూ తగలబడిపోయిన వాడనే ఇంకా నన్ను ఇవి కాల్చేదేమిటి! అప్పుడు నన్ను కాల్చటం కష్టం కాదా కెప్టెన్ అహాబ్!" అన్నాడు.

"సరే, సరే ఇక అపు. కుంగిపోయిన నీ గొంతు వింటే నీ హృదయంలోని విచారం ప్రస్ఫుటంగా తెలుస్తోంది. నేనిలా స్వర్గంలో లేను. పిచ్చితప్ప ఇతరులలో ఏ బాధనూ చూచే ఓపిక నాకు లేదు. ఇదిగో కమ్మరీ! నీకు ఏల పిచ్చి ఎక్కదు!

ఒకసారి ఎక్కకూడదా! నీవంటే దేవతలకి ఇష్టంలేదా!–నిన్ను పిచ్చివానిగా ఎందుకు చెయ్యలేదింకా! నీ వేమిటి చేస్తున్నా విప్పుడు!"

"ఒకపాత ఇనుప కమ్మిని అతుకుతున్నాను. దాని నిండా గుంటలు ఉన్నాయి."

"అది సమ్మెట పెట్లుతిని, ఎంతో వాడబడియుంది. ఇంకా దానిని సాఫు చెయ్యగలవా!

"చేయగలననే అనుకొంటున్నాను."

"ఎలాటి లోహమైనా అందులో అతుకులు, గతుకులు సాఫు చేయగలననుకొంటావా!"

"అనుకొంటాను. ఒక్కదానిని తప్ప అన్నిటినీ చేయగలను"

"అయితే ఇటుచూడు" అంటూ ఆవేశంతో ముందుకు వెళ్ళి అహాబ్ పెర్త్ బుజాలమీద చేతులుపెట్టి "ఈ అతుకుని సాఫుచేయగలవా కమ్మరీ" అంటూ ముడుతలుపడిన తననుదుటి మీద చేయిపోనిచ్చాడు, "నీవు ఈ పని చేయగలిగితే, నీ పట్టెడమీద శిరస్సు పెడతాను. నా భ్రూమధ్యమున నీ సమ్మెటపోటు నొకటి దానినైనా భరిస్తాను. బదులు పలుకు! ఈ అతుకుని సరిచేయగలవా!"

"ఒక్కదానిని తప్ప అన్నిటినీ సాఫీగా చేయగలనని చెప్పాను కదండీ ముందే. ఇదే, ఆ ఒక్కటీ"

"అవును. అదే ఇది. దీనిని బాగుచేయలేము. పైకి కానవచ్చే ఈ ముడతలు లోపల నా కపాలపు పెంకువరకు

పాకియున్నాయి. ఆ ఎముక అంతా ముడతలు పడిపోయింది. సర్లే, ఆటకట్టి పెట్టు. ఆకమ్మిన్నని తీసివేయి. ఇటు చూడు" తనతోలు సంచిలో బంగారు నాణెములు ఉన్నట్టు కదిలిస్తూ "నాకు ఒక చిన్న ఈటెను చేసిపెట్టు. వెయ్యిమంది రాక్షసులు లాగినా బయటికి రాకుండా తిమింగిలంలో గుచ్చి దాని ఎముకలాగ ఉండిపోవాలి."

ఆ సంచిని పట్టెడమీదకి విసురుతూ, "ఇదిగో సరకు. కానిమ్ము. పందెపు గుఱ్ఱాలకి ఉండే నాళాలముక్కలున్నాయి దానిలో"

"గుఱ్ఱపు నాళాల ముక్కలా! అంతకంటె మంచిసరకు ఎక్కడ ఉంది, కెప్టెన్ అహాబ్!"

"నాకు తెలుసులేవోయ్. ఈ ముక్కలన్నిటినీ అతికించవచ్చు. హంతల ఎముకలలోని, మూలగలాగున అతుక్కుంటాయి అవి. ముందు ఒక ఈటెను చేసిపెట్టు. దానికై కావలసిన ఊచలు పన్నెండు తయారుచేయి. వాటినివంచి, మెలికపెట్టి నూలు పేనినట్టు పేను. త్వరగా పనికానీ, కొలిమి తిత్తిని నేను చూస్తాను." అన్నాడు.

పన్నెండు ఊచలూ తయారయినాక, ఒక్కొక్కదానిని అహాబ్ మెలిక పెట్ట నారంభించాడు. ఆఖరి దానిని క్రింద పడవేస్తూ 'అది సరిగాలేదు, మళ్ళీ పనిచేయి' అన్నాడు.

అది అయినాక, పెర్త్ ఆ పన్నెండింటినీ అతుకుదామని అనుకొన్నాడు. అహాబ్ అతనిని వారించి, ఆపని తానే చేసుకొంటా నన్నాడు. ఒక్కొక్క ఇను[illegible]పని [illegible]నుంచి

తీసి పెర్త్ ఇస్తూండగా, అహాబ్ సమ్మెటతో వాటిని కొట్టుతూవుండేవాడు. కొలిమినుండి నిప్పుబాగా లేచింది. ఫెడెల్లా (పార్శీవాడు) అటువెళ్లుతూ, నిప్పునిదూరాది తలదించుకొన్నాడు. వాళ్ళనడే శ్రిపుకు తిట్టాడో, ఆశీర్వదించాడో తెలియాలేదు! అహాబ్ కన్నెత్తి చూచేసరికి జారిపోయాడు.

పైనుంచి చూస్తూ స్టబ్ "ఆ మూక ఏమి చేస్తోంది అక్కడ! ఆ పార్శీవాడు నిప్పును ఇట్టే పసిగట్టేస్తాడు. మందుగుండు పాత్రలాగున వాడు నిప్పువాసన కొట్టుతూవుంటాడు"

చివరికి ఒక ఊచ తయారైంది. పెర్త్ ఆ వేడి ఊచను నీళ్ళలోకి దింపాడు. ఆ ఆవిరి అహాబ్ ముఖంమీదకి పోయింది.

"నాకు వాతపెడదామను కొంటున్నావేమిటి! నేను ఇప్పటిదాకా, వాతపెట్టించుకొనే యినుప ఊచను చేస్తూ కూర్చున్నానంటావా!"

"క్షమించండి. నేను అలా అనుకోలేదు. ఈ ఈటె ల్ల తిమింగిలం కోసమే కాదూ!"

"తెల్లభూతం కోసం! దానికి పెట్టవలసిన ముళ్ళను నీవే చేయాలి. ఇదిగో గడ్డం చేసుకొనే కత్తులు. వాటిని బాగా వాడిగా చెయ్యి"

కమ్మరి ఆ కత్తులను పరీక్షింపసాగాడు.

"తీసుకోవయ్యా, నాకు వాటి అవసరంలేదు. నేను ఇప్పుడు పని పూర్తి అయ్యేదాకా గడ్డంకాని, భోజనంకాని ప్రార్థనలుకాని చెయ్యను. కానీ" అని హెచ్చరించాడు అహాబ్.

బాణంవలె తయారైంది ఈటె. కత్తులని ఊచకి అది కించి నీటిలో ముంచుదామని, పెర్త్ నీటికూజాను తనవైపు త్రొయ్యమని ఆహాబ్‌ని అడిగాడు. అతను "నీళ్లు అక్కర్లేదు వాటికి. అలాగే ఉండనీ! ఎవరక్కడ-టాష్టెగో! డాగో! క్వీక్వెగ్! ఏమట్టా - ఈ కత్తులని తడిపేటంతటి నెత్తురెవరైనా ఇస్తారా!"

మూడు నల్లని తలకాయలు ఇస్తామంటూ ఊగాయి. మూడుచోట్ల గుచ్చారు, వాళ్ళ నెత్తురుతో కత్తులు తడిసాయి. తెల్లతిమింగిలం కోసం ఈటె తయారైంది. ఆ ఇనుప ఊచకి నెత్తురు తాకగానే కొత్తకేక పెట్టాడు ఆహాబ్.

ఓడలో ఉన్న కొయ్యలలో ఒకదానిని ఏరి తెచ్చి ఆహాబ్ ఇనుప ఊచను దానికి తగిలించాడు. ఆ తరువాత కొత్తగా పేనబడిన త్రాడు తీసికొని, కొన్ని గజాలత్రాడుని, బరువులుమొత్తే యంత్రం చుట్టూ చుట్టారు. దానిని పరీక్షగా చూచి, బాగానే ఉన్నదనుకొన్నాడు.

త్రాడు చివర రెండుపాయలుగా చీల్చి ఆ దారాలని ఈటెకి చుట్టాడు. కొయ్యని గట్టిగా నేలకివేసికొట్టి, త్రాడుని ఒక చివరినుంచి ఇంకొక చివరికి, కొయ్యచుట్టూ మెలికలు పెట్టారు. ఇది అయినాక, కొయ్య ఇనుము త్రాడు, విడివడని భాగాలుగా తయారయినాయి. ఏదో ఆలోచించుకుంటూ తన ఆయుధాన్ని తీసికొని వెళ్ళిపోయాడు ఆహాబ్. అతని దంతపుకాలు, ఈ కొయ్య డొల్లపోయిన చప్పుడు చేశాయి. అతను తన గదిలో అడుగుపెట్టే ముందు ఏదో [illegible], అప్ప

ష్టమూ, దయనీయమూ అయిన ధ్వని వినబడింది, ఓరి షిప్ ! నీనవ్వు, అందరిని పరీక్షించే నీదృష్టి, నీఆటలు ఈఓడయొక్క విషాదాలలో మిళితమైపోయినాయి. ఈ ఓడనే పరిహసిస్తూ ఉంటాయి.

63. పచ్చిక బయలు

జపాను దేశపు ఓడలు విహరించు ప్రాంతాలలో ఉన్న తిమింగిలాలను వేటాడే చోటుకు చొచ్చుకొని పోతూ, "పెకోడ్" మళ్ళీ తిమింగిలాల నడుమ పడింది. వాతావరణం చక్కగా ఉన్నప్పుడు పన్నెండు, పదిహేను, పదునెనిమిది— ఒకోసారి ఇరవై గంటలసేపు కూడా తిమింగిలాలని తరుముతూ పడవలను నడపటం జరిగేది. ఒకొక్కసారి మాత్రం, తిమింగిలాలు పైకి రావటంకోసం, ఒక గంటసేపు ఎదురు చూస్తూ ఉండేవాళ్ళం,

సూర్యుడు శాంతంగా ఉన్నప్పుడు, నిద్దపు నీలి కెరటాలమీద తేలుతూ వాటితో చెలిమి చేసుకొంటూ ఉండే గడియలు కలలు గన్నట్టుగా గడచిపోతాయి. మహాసముద్రపు టుపరితలము యొక్క అందము, ప్రకాశము చూచినప్పుడు, దాని క్రిందవున్న దౌష్ట్యాన్ని మరచిపోతాం. ఆ మృదు హస్తములో కరాళదంష్ట్ర దాగియున్న సంగతి జ్ఞప్తికిరాదు. పైని ముఖమల్ వన్నె, లోన వ్యాఘ్ర హృదయము.

పడవమీద ఉన్న ఇటువంటి సమయాలలోనే నావికులకు సముద్రముతో, నేలతో వలెనే సన్నిహిత పరిచయ మేర్పడుతుంది. సముద్రమంతా పుష్పమయంగా తోస్తుంది. దూరాన వున్న ఓడ యొక్క స్తంభాలు మాత్రమే కనబడు

తాయి. ఆ శీతల నీటి కెరటాలమీద వస్తున్నట్లు గాక, ఎత్తుగా పెరిగిన గడ్డిలో వెదుకుతూ ఉన్నట్లు భావించబడుతుంది.

హాయినిగొల్పే అటువంటి దృశ్యాలను అనేక కూడా, తాత్కాలికంగా చలించేవాడు. ఈ మధురమైన దృశ్యాలు అతనిలోని మాధుర్యాన్ని రేపినా, అతను వాటివైపు చూడ గానే అవి కలుషిత మయ్యేవి.

పచ్చికల్లారా! ఎన్నడూ ఆర్ద్ర వాడిపోని పచ్చిక బయళ్లలారా! జీవితమనే వడగాల్పులవల్ల మీరు ఎండి పోయినా, మీలో పడి మనుష్యులు హాయిగా దొర్లవచ్చు గదా! కొన్ని క్షణాల పాటైనా చల్లని తుషారకణాలను స్పృశించవచ్చు గదా! ఈ ప్రశాంతత శాశ్వతంగా ఉండ కూడదా! కాని, జీవితం పదునుపేర్లు గలది. ప్రశాంతతను చీల్చే తుఫానులు, ప్రతి ప్రశాంతతకీ ఒక తుఫాను! వెనుకకు తిరిగి చూడకుండా పురోగమించట మంటూ ఉండదు. జీవి తంలో, సంకీర్ణ పథములో ముందుకుపోయి ఆఖరి నెలవులో ఆగిపోలేము. బాల్యదశయందలి అమాయకత్వము, కౌమార దశలోని అకుంఠిత విశ్వాసము, యౌవనము నందలి సందే హము. గతానుగత అవిశ్వాసము, వీటిద్వారా వచ్చి వయః పరిపాకంలో నిశ్చలమైన సిద్ధాంతము, "అయితే" అనుకొంటూ ఇదంతా అయిన తర్వాత మళ్ళీ పునశ్చరణ చేసుకొంటాం. పసిపాపలము, బాలురము. పెద్దలము. అంతులేని "అయితే" లము అవుతాము. ఇంక మన చరమ గమ్యస్థాన మెక్కడ! ఈ ప్రవాహం ఎందులో పడి కొట్టుకుపోతుంది! పుత్రవత్సలు

దైన ఆ తండ్రి ఎక్కడ దాగియున్నాడు! అవివాహితలైన తల్లులు ప్రసవించి. భారము మోయలేక చనిపోగా భూమి మీద పొర్లాడే అనాథ శిశువుల వంటివి మన ఆత్మలు. మన జననీజనక వృత్తాంతాలు శ్మశానంలో ఉన్నాయి. అక్కడికి వెళ్ళి కనుక్కోవాలి.

ఆ రోజున తన పడవ ప్రక్కగా, పసిడి వన్నెతో ఉన్న సముద్రాన్ని చూస్తూ స్టార్‌బక్ ఇలా అనుకొన్నాడు. "తన భార్య కళ్ళలో ప్రేమికునికి కనబడే అందంలాగ అంతు లేనిదీ అందం! క్రూరమైన నీ సొరచేపలను గురించి, మనుష్యులని మింగివేసే నీ అలవాట్లను గురించీ నాతో చెప్పకు. విశ్వాసం యథార్థమును అపహస్తము చేయుగాక! భావన స్మృతిని అపహస్తము చేయుగాక! నేను లోతులు చూస్తాను, నమ్ముతాను."

స్టబ్ కూడా మంచి చలాకీగా ఆ బంగారు కాంతిలో గెంతుతూ, "నేనూ స్టబ్ అంటే! అతని కథ అతనికి ఉంది! కాని ఇప్పుడు ఒక ప్రమాణం చేసి చెప్పుతున్నాడు స్టబ్. అతను ఎప్పుడూ సరదాగానే ఉంటాడని!" అన్నాడు.

—:o:—

64. 'బ్యాచులర్' ఓడ

అహబ్ యొక్క ఈటె తయారయినాక కొన్ని వారాలపాటు అంతా సరదాగానే ఉంది. నన్‌టుకెట్‌కి చెందిన మరొక ఓడ ('బాచ్యులర్' దాని పేరు) పీపాలన్నింటిలోను నూనె నింపుకొని, ఆ పీపాలు పెట్టిన గది తలుపులు మూసి బిగించి, ఇంకా ఇంటి మొగము పట్టకముందు కులాసాగా అటూ ఇటూ సముద్రం మీద పచార్లు చేస్తూవుంది. దాని ముఖ్య స్తంభం దగ్గర ఉన్న ముగ్గురూ తమ టోపీలకు ఎర్రనివి, పచ్చనివి గుడ్డలు చుట్టుకొన్నారు. ఓడ వెనుక భాగాన ఒక చిన్న పడవ వేలాడుతోంది. అడుగున వాళ్ళు వధించిన తుది తిమింగిలపు క్రింది దవడ కట్టుబడియుంది. జెండాలు, అడియాలములు, పలురకాల బట్టలూ ఎగురుతున్నాయి. ఆ ఓడపైనకూడా రెండు నూనె పీపాలని కట్టారు. మూడవదాంట్లో కూడా ఏదో విలువగల ద్రావకమే ఉంది. ఓడ యొక్క ముఖ్య స్తంభానికి ఒక లాంతరు వేలాడుతోంది.

ఈ సముద్రాలలోనే నెలల తరబడి తిరిగిన చాలా ఓడలకు ఒక్క తిమింగిలమైనా దొరకలేదట. కాని బ్యాచులర్‌కి అసాధారణమైన అదృష్టం పట్టిందట. వాళ్ళు తెచ్చుకొన్న పీపాలన్నీ నూనెతో నిండిపోయాయి. అంతేగాక, రొట్టెలూ

మాంసమూ పెట్టుకొనే పీపాలు కూడా నూనెతో నిండి పోయాయట. వాళ్ళకు తారసిల్లిన ఓడవద్ద ఇంకా కొన్ని పీపాలు కొనుక్కున్నారట. వీటన్నిటినీ నూనెతో నింపి భద్రపరచుకొన్నారట ఖాళీగావున్న ప్రతి దానినీ నూనెతోనే నింపివేశారట. నావికుల పెట్టెలలో కూడా నూనే. వంటవాడు బాయిలరు నిండా నూనె పోశాడనీ, వడ్డించేవాడు తన దగ్గర ఉండే కాఫీ పాత్రలనిండా నూనె పోశాడనీ, ఈటెగాళ్ళు తమ ఈటెలు నూనెలోనే నానవేసుకొన్నారనీ, ఒకటేమిటి- కెప్టెన్ యొక్క పంట్లాము జేబులలో తప్ప అన్నిటా నూనేనని- హాస్యంగా అనుకొనేవారట !

సంతోషం వెల్లివిరిసే ఆ ఓడ, నిరాటంకంగా వున్న 'పెకోడ్' వైపు వస్తూంటే, ఆ ఓడలోని నావికులంతా ఓడ ముందు భాగానికి వచ్చి చప్పట్లు చరుస్తూ నిలబడ్డారు. వాళ్ళకి వెనుకగా ఈటెగాళ్ళు, మేస్త్రీలు- వాళ్ళతోపాటు లేచి వచ్చిన పాలినీసియన్ దీవుల ఆడపిల్లలు! ఓడ యొక్క రెండు స్తంభాలకీ ఎదురు ఒక చిన్నపడవని వ్రేలాడగట్టారు. అందులో ముగ్గురు నీగ్రోలు నిలబడి, క్రింద జరిగే వేడుకలకి అధ్యక్షత వహించారు. కొందరు ఆ ఓడ యొక్క "ట్రైవర్క్స్" ని ఊడ తీస్తున్నారు; అవి ఇంక అనవసరం !

ఆ ఓడకి అధినేత కెప్టెన్ ఎత్తైన ఒక ప్రదేశంలో దర్జాగా నిలబడ్డాడు. ఆ సరదాలన్నీ తన కోసమే వాళ్లు చేస్తున్నట్టు, వాటిని గమనిస్తున్నాడు.

ఆహాబ్ కూడా ఎత్తైన చోటనే నిలబడ్డాడు. విడువని బాధతో నల్లబడి చింకిరి జుట్టుతో నిల్చియున్నాడు. రెండు ఓడలు దగ్గరపడ్డాయి. ఒకటి గతించిన దానిని గురించి ఆనంద పడుతూ, రెండవది రానున్న దానిని గురించి ఆందోళన చెందుతూ ఆ ఓడల కెప్టెన్ లే ఆ రెంటిలోను ఉన్న పరిస్థితులను తమ మూర్తులలో కనబరిచారు.

ఒక సీసాని, గ్లాసుని పైకి ఎత్తి చూపుతూ "రండి, రండి మా ఓడ మీదకి రండి" అంటూ ఉల్లాసంగా ఆహ్వానించాడు. 'బ్యాచులర్' యొక్క కెప్టెన్.

"తెల్లతిమింగిలాన్ని చూశారా!" అని పళ్ళు పట పట కొరుకుతూ ప్రశ్న వేశాడు ఆహాబ్.

"లేదు- అసలు అలాంటిది ఒక టుందని నాకు నమ్మకమే లేదు" అని సరదాగా అంటూ, "రండి, మా ఓడ మీదకి" అని మళ్ళీ అన్నాడు ఆ కెప్టెన్.

"మీరు చాలా కులాసాగా ఉన్నారు. వెళ్ళుతూ ఉండండి. మీలో ఏమైనా ప్రాణనష్టం కల్గిందా!"

"పెద్ద నష్టమేమీ కలగలేదు. ఇద్దరే పోయారు. దానికేంగాని, మా ఓడ మీదకి రావయ్యా, ముసలయ్యా! నీ చింతని పోగొట్టివేస్తాను. రా, రా. ఈ ఓడ నిండిపోయింది. ఇంటికి వెళుతోంది."

"ఎంత తేలిక చనువుతో మాట్లాడుతున్నాడో విధవ" అని మెల్లగా అని, ఆహాబ్ బిగ్గరగా, "మీ ఓడ నిండి, మీరు ఇంటికి వెళ్తున్నారని కదా అన్నావు! ఐతే, మా ఓడ

ఖాళీగా ఉన్నదనీ, బయటికి వెళ్ళుతూ వుందనీ అనుకో, నీ దారి నీది, నా దారినాది- తెరచాపలు ఎత్తండి పోదాం ముందుకి" అన్నాడు.

ఒక ఓడ ఉల్లాసంతో గాలివాటున పోతే రెండవది మొండిగా గాలి కెదురు వెళ్ళింది. రెంటి దారులూ వేరైనాయి. 'పెకోడ్'ని నడిపేవాళ్ళు దీనంగా, దీర్ఘంగా దూరమవుతూన్న 'బ్యాచులర్' వైపు చూశారు. కాని 'బ్యాచులర్' మీద ఉన్నవాళ్ళు, వీళ్ళని లెక్కచెయ్యకుండా, తమ సరదాలలో తేలిపోయారు. అహాబ్ ఇంటివైపు వెళ్ళిపోతున్న ఓడని వంగి, చూస్తూ తన జేబులోనుండి ఇసుకతో నింపిన ఒక చిన్న సీసాని తీశాడు. ఒకసారి సీసావైపు, మరొకసారి ఓడవైపు చూస్తూ దూరంగా ఉన్న ఆ రెంటికీ బంధుత్వం కలపజూశాడు. ఆ సీసాలోని ఇసుక నన్‌టుకెట్‌కి చెందినది.

—:0:—

65. తిమింగిల మరణం

ఈ జీవితంలో ఒకొక్కసారి అదృష్టవంతుల గాలి సోకినంతనే అంతకు పూర్వము నిరాశామయులైనా, మనకూ ఆ గాలిసోకి క్రొత్త ఉత్తేజం కలుగుతుంది. 'పెకోడ్'కీ అల్లే జరిగింది. సరదాగా పోతున్న 'బ్యాచులర్' తారసిల్లిన మరునాడే తిమింగిలాలు కంటబడినాయి. వాటిలో నాలుగు వధింపబడ్డాయి. వీటిలో ఒక దానిని అహబ్ స్వయంగా చంపాడు.

పొద్దు క్రుంకుతూ వుంది. వేట ముగిసింది. రమణీయ సంధ్యారాగంతో సూర్యుడున్నూ, ఎర్రబారిన సముద్రపు నీటిలో తేలిపోతూ తిమింగిలమున్నూ ఒక్కసారిగానే ప్రశాంతంగా అస్తమించారు. ఎక్కడ నుండియో అమాయిక దీన ప్రార్థనాలాపాలు గాలిలో విసవచ్చాయి. స్పెయిన్ దేశపు మెట్టపొలాల గాలి సముద్రయానము చేయగోరి, సాయం ప్రార్థనా పదార్థాలను ఓడలో నింపుకొని ఆ దారిని వచ్చినట్లనిపించింది.

తిమింగిలమును చంపిన ఉత్సాహము కొంచెంసేపే అనుభవించి, అహబ్ మరల విచారంలో మునిగిపోయినాడు. అతను చనిపోతూ ఉన్న తిమింగిలాన్ని చూస్తూ కూర్చున్నాడు. సూర్యుని దిక్కు మొగమై, అసువులు

విహుస్తూ ఉన్న ఆ జంతువును చూస్తే అతనికి అపూర్వమైన ఒక అద్భుతము విశదమైనది.

"అది మెల్లగా తిరుగుతోంది. అవసానదశలో తన మొక్కులను చెల్లించుకొంటూ ఉంది. అదికూడా అగ్నినే ఆరాధిస్తుంది. ఇది సూర్యుని మీద భక్తి విశ్వాసాలుకల సామంతప్రభువు. ఓహో! ఈ రెండు కండ్లతో ఈ రెండు ప్రసన్న దృశ్యాలను చూచితీరాలి. ఈ ప్రదేశము జలావృతము ఇక్కడ మానవుల శోకఘోషలుగాని, ఆనందార్భటాలుగాని లేవు. చచ్చినవాళ్ళ స్మారక చిహ్నాలకు పనికి వచ్చే శిలలు లేవు. ఆకాశాన నక్షత్రాలవలె ఈ సముద్రము మీద ఈ తరంగాలు కూడ యుగయుగాలుగా దొర్లుతూ ఉన్నాయి. ఇక్కడ కూడా ప్రాణముపోయేటప్పుడు జంతువు సూర్యునివైపు మొగము తిప్పిందే! ఎంత వింత! అయినా, ప్రాణము పోగానే మృత్యువు, దానిని, వేరొక వైపుకు లాగుకొని పోతుంది.

6౮. నిరీక్షణం

ఆనాడు వధింపబడ్డ నాలుగు తిమింగిలాలూ ఒకదానికొకటి దూరదూరంగా పడిచచ్చాయి. వాటిలో మూడింటిని చీకటిపడేవేళకు ఓడదగ్గరకు చేర్చారు. నాల్గవ దానిని మార్నాడు ఉదయంగాని తీసికొని రాలేకపోయారు. దానిని వధించిన పడవ అహాబ్‌ది. అది ఆ రాత్రియంతా తిమింగిలం దగ్గరే ఉంది.

చచ్చిపోయిన ఆ తిమింగిలం ముక్కులో ఒక కొయ్యను దూర్చి ఆ కొయ్యకి ఒక లాంతరు తగిలించారు. అర్ధరాత్రి వేళ నల్లని కెరటాలు ఆ తిమింగిలాన్ని మెల్లగా తాకుతూంటే ఆ దీపం మిణుకు మిణుకు మంటూ తన అల్పమైన కాంతిని కెరటాలపై ప్రసరిస్తూ ఉంది.

అహాబ్, మరి ఇతరులూ పడుకొన్నారుగాని పార్శీవాడు తిమింగిలం చెంతకూ, తమ పడవ యొద్దకూ వస్తూన్న సొరచేపలను చూస్తూ కూర్చున్నాడు. అంతలో ఒక భయంకరమైన ధ్వని గాలిని చీల్చివేసింది.

అహాబ్ మేల్కొని పార్శీవానిని చూశాడు, దట్టంగా కమ్ముకొన్న చీకటిలో చిక్కుకున్నవాళ్లు ప్రళయకాలంలో చివరికి మిగిలిన మనుష్యులు లాగున తోచారు. "నేను మళ్ళీ కలగన్నాను" అన్నాడు అతను.

"పీనుగులను తీసికొనివెళ్ళే బండిని చూచావా కలలో! ఇదివరకు చెప్పలేదా! ఆ బండిగాని శవపేటికగాని నీది కాదని"

"సముద్రంలో చస్తే మరింకెవరికి వస్తుంది బండి!"

"నీవు చస్తే రెండు బళ్ళు రావాలి! వాటిలో ఒకటి మానవమాత్రులు చేసింది కానేరదు. రెండవదానికి కావలసిన కలపకోసం అమెరికాలో చెట్లువేసి పెంచాలి."

"ఏమి దృశ్యమది పార్శీ! ఒక బండి, దాని రెక్కలు సముద్రము మీద ఎగిరిపోతున్నాయి. కెరటాలు శవాన్ని మోసేవిగా కనబడ్డాయి! అలాటి దృశ్యాన్ని ఇంతలో చూడలేము."

"నీవు నమ్మి నమ్మకపో, అటువంటి దృశ్యం కనబడందే నీవు చనిపోవులే"

"నిన్ను గురించి ఏమి అంటున్నావ్!"

"ఎప్పటికైనా సరే నేనే నీకంటె ముందు వెళ్లుతాను"

"నీవు ముందు వెళ్లుతానంటావా! నీవనే మాటలన్నీ నమ్ముతున్నాననుకొంటున్నావేమిటి! నాకు రెండు ప్రతిజ్ఞలున్నాయి. నేను 'మాబీడిక్‌ని' చంపాలి. ఆ తరువాత కూడా బ్రతకాలి."

పార్శీవాని కళ్ళు నిప్పులాగ ఎఱ్ఱబడ్డాయి. "ఇంకో ప్రతిజ్ఞకూడా పట్టు. నిన్ను తాడు తప్ప ఇంకేదీ చంపలేదని"

"అంటే ఉరితాడు అనేనా నీ అర్థం. అయితే నేను అమరుడనవుతాను! భూమిమీద, సముద్రముమీద" వికట

అట్టహాసం చేస్తూ అహాబ్ మళ్ళీ "అమరుడను భూమి మీద, సముద్రము మీదా" అన్నాడు.

ఇద్దరూ ఇక మాట్లాడలేదు. తెల్లవారింది. మిగిలిన వాళ్లూ లేచారు. మధ్యాహ్నమయేసరికి తిమింగిలాన్ని ఓడ దగ్గరకు చేరాారు.

67. 'క్వాడ్రెంటు'

భూమధ్యరేఖ ప్రాంతంలో వేటాడే కాలం సమీపించింది. ప్రతిరోజూ అహాబ్ తన గదినుంచి బయటకి వచ్చినప్పుడెల్లా చుక్కానువద్ద నున్నవాడు ఏదో పని చేస్తూ ఉంటేవాడు. మిగిలిన నావికులు కూడా ఆ రేఖవైపు వెళ్ళటానికి ఆజ్ఞ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉండేవారు. చివరకు ఆజ్ఞ అయింది. మిట్టమధ్యాహ్న మయింది. అహాబ్ తన పడవలో కూర్చుండి తాము ఏ అక్షాంశలో ఉన్నామో తెలుసుకొనుటకు సూర్యునిమీద దృష్టి నిలిపి చూస్తున్నాడు.

జపాను సముద్రాలలో వేసవి రోజులు దేదీప్యమానంగా ఉంటాయి. కొలది పెట్టరాని ఆ సాగరాలోకము నకు, నిర్నిమేష విస్పష్టమైన ఆ సూర్యబింబమే పరమ లక్ష్యమూ అనిపిస్తుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మేఘాలు కానరావు. ఎవలేని ఆ ప్రకాశమంతా భగవంతుని సింహాసనము వలె దుర్భర తేజోరాశివలె ఉంటుంది. అహాబ్ దగ్గర ఉన్న 'క్వాడ్రెంట్' అనే పరికరానికి రంగు అద్దాలు ఉండటంవల్ల అతను సూర్యునివైపు దానితో చూడగలుగుతున్నాడు. తాను కూర్చున్న చోటునుండి దిగివచ్చి, కంటి దగ్గర ఆ దిగ్ యంత్రమును పెట్టుకొని సూర్యుడు సరిగ్గా మింటికి ఎప్పుడు చేరుకొంటాడా అని నిరీక్షిస్తూ, నిలబడ్డాడు. పార్సీవాడు కూడా అతని ప్రక్కనే మోకరిల్లి సూర్యునివంకే

అర్ధనిమీలిత నేత్రుడై చూస్తున్నాడు. అతని ముఖంలో ఎంతో శాంతి తాండవిస్తోంది. సూర్యపరీక్ష పూర్తి చేసి అహాబ్ ఒక పెన్సిలుతో తన దంతపు కాలిమీద ఏదో లెక్క వేసి, అప్పుడు ఏ అక్షాంశ మీద ఉన్నామో గుర్తించాడు. ఒక నిమిషం మౌనం తాల్చి మరల సూర్యుని చూస్తూ, "నీవు మార్గదర్శివి, నే నెక్కడ వున్నానో నీవు సరిగా చెప్ప గలవు కాని నే నెక్కడ వుంటానో చిన్న సూచనయైన చేయ కూడదా! పోనీ నేను కాక మరొక జీవి ఇప్పుడు ఎక్కడ వుందో అదయినా చెప్పగలవా? 'మాబీడిక్' ఎక్కడ వుంది? ఈ క్షణమునే నీవు నన్నువలె దానినికూడా చూస్తున్నావే! దానిని చూచే నీ కళ్ళనే నా కళ్ళు చూస్తున్నాయి. అంతే కాదు. నీ కళ్ళు ఇంకా ఎన్నో నాకు తెలియని వాటినికూడా చూస్తున్నాయి కదా, సూర్యుడా!" అని గొణిగాడు.

తన చేతిలో నున్న క్వాడ్రెంటుని చూస్తూ, దాని లోని భాగాలను తడుముతూ ఇలా అన్నాడు. "పిచ్చి ఆట వస్తువు! నౌకాధికారులకు ఆటవస్తువు వంటి దానవే నీవు! ప్రపంచమంతా నీ తెలివి తేటలను గురించే చెప్పుకొంటుంది. ఇంతకూ నీవు చెయ్యగలది ఏమిటి? ఏ క్షణాన నీవూ, నిన్ను పట్టుకొన్న చేతులూ భూమిమీద ఎక్కడ వున్నదీ చెప్ప గలవు. అంతేనా? అంతకంటె ఒక్క పీసమెత్తు ఏమైనా వున్నదా? రేపు మిట్టమధ్యాహ్నపు వేళ ఒక్క ఇసుక రేణువు గాని, నీటి బిందువుగాని ఎక్కడుంటుందో చెప్పలేవుగదా! శాంత శక్తిహీనమైన నీవుకూడా సూర్యుని ధిక్కరిస్తావంటావు!

నీవు నాశనమైపోవాలి! నీవే కాదు, నీలాగానే మనుష్యుని చూపును. దుర్నిరీక్ష్యమైన ఆకాశంవైపు తిప్పే ప్రతి వస్తువు నాశనమైపోవాలి. ప్రకృతి శాస్త్రము! హతమైన శాస్త్రము! నిర్వ్యామోజనమైన ఆటబొమ్మ! మానవుని కళ్ళు క్షితిజ రేఖను చూడటానికి తగిన ఎత్తులో వున్నాయి. అంతేగాని తనవైపు చూడుమని భగవంతుని ఉద్దేశమైనట్టు నెత్తిమీద లేవు గదా! నీకు నాశనము తప్పదు" అని ఆ పరికరాన్ని విసిరికొట్టి-

"ఈ భూమిమీద ఇక నే నుండబోయే చోటును నీ సహాయంతో ఇంక వెతకను. సముద్రము మీద నీ స్థానమును తెలుపటానికి దిక్సూచి మొదలైన పరికరాలు చాలును" పైనుండి దిగివచ్చి, "నిన్ను తొక్కివేస్తున్నాను. ఆకాశం వైపు చూపిస్తావుగా! నిన్ను నాశనం చేసివేశాను" ఆ ముసలి వాడు అట్లా ప్రలాపించి, క్వాడ్రెంటుని సజీవపాదంతోనూ, చచ్చుపాదంతోనూ మట్టగించడం అహాబు మనసుకి విజయ సూచకంగాను, పార్శీవానికి దుర్విధి సూచకంగాను తోచింది. ఆ లక్షణం వాని మొగమున కానిపించింది. వాడు లేచి మెల్లగా జారిపోయాడు. తమ కెప్టెన్ యొక్క చేష్టలని చూస్తూ విస్తుపోయారు నావికులంతా. అహాబు కాసేపు అక్కడనే ఉండి వాళ్ళని పనిలోకి పొమ్మని కేకలు వేశాడు.

స్టార్‌బక్ ఓరగా నిలబడి, "సంక్షుభితమైన ఓడ గమనమును, తట్టుమీద అంగలువేస్తూ నడిచే అహాబును గమనించాడు. "కణ కణ మండే [illegible]ల ముందు [illegible]

నాలుకలు గ్రోలే జ్వాలలను చూచాను. ఆ నిప్పు మండి మండి, ఆరి, గుప్పెడు నుసియైపోయి మట్టిలో కలిసింది. ఓయి ముసలివాడా! నీ జీవితాగ్నికూడా అలాగే మండిమండి ఆరి, గుప్పెడు నసియై పోతుంది" అని మెల్లగా అన్నాడు.

స్టబ్ ఆ వాక్యమును అందుకొని "మామూలు బొగ్గు నుసి కాదయ్యా! సముద్రపు బొగ్గునుసి" అని పూర్తిచేశాడు. అదీగాక "ఎవరో ఒక అజ్ఞాత వ్యక్తి, నా చేతికి ఈ పేక ముక్కలు అందిచ్చాడు "నేను వీటితోనే ఆడితీరాలని పట్టు పెట్టాడు" అనికూడా అహాబ్ అంటూ వుంటాడు" అని ఇంకొక వాక్యం కలిపాడు." అహాబ్! నీవు ఈ ఆట్లే ఆడాలి. ఇందు లోనే చావాలి" అనికూడా శపించాను.

—:0:—

68. క్రొవ్వు వత్తులు

కమ్మని నులివెచ్చని శీతోష్ణస్థితి గల దేశాలు, తల్లులు బిడ్డలను వలె, క్రూర జంతువులను లాలించి పోషిస్తవి. వంగ దేశపు విశాల వనప్రదేశములు, పెద్దపులిని అక్కున చేర్చుకొని పెంచుతాయి. దివ్యంగా ప్రకాశించే ఆకాశంలో లోక ధ్వంసకములైన పిడుగులు దాగి యుంటాయి. చిత్రవర్ణ శోభితమైన క్యూబా దీవిమీద, తీవ్రమైన తుఫానులు పుట్టుతూ వుంటాయి. అలాగే తేజోమయములైన ఆ జపాను సముద్రంలోనే ఎక్కడా కనీవినీ ఎరుగని తుఫానులు రేగుతూ ఉంటాయి. నిద్రపోతున్న పట్టణం మీద జనవిభ్రమ జనకంగా బాంబులు పడినట్లు, జపానులో పెద్దపెద్ద గాలివానలు ఉన్నట్టే ఉండి ఉద్భవిస్తూ ఉంటవి.

ఒకనాడు, సాయంకాల మయ్యేప్పటికి "పెకోడ్" ఒక పెద్ద తుఫానులో చిక్కింది. తెరచాపలు చిరిగి చీలికలై పోయాయి. తెరచాప స్తంభం మాత్రం మ్రోడుగా నిలిచి ఉంది. చీకటి పడిన తరువాత ఆకాశమూ, సముద్రమూ కలిసి ఏక ఘోష చేశాయి! ఆ ఘోషను చీల్చుకొంటూ ఉరుములు ఫెళఫెళ గర్జించాయి. ఆ వాతావరణ మంతా మెరుపులతో వెలిగిపోతూవుంది. చీలికలైపోయిన తెరచాప పీలికలు రెపరెప లాడుతూ, స్తంభమును చుట్టుకొని తిరుగుతూ ఉన్న దృశ్యము ఆ వెలుగులో చూడగలిగాము.

స్తంభాన్ని అంటిపెట్టుకొని ఉన్న ఒక గుడ్డను చేత బట్టుకొని స్టార్‌బక్ ఆ మెరుపులతో బాటు ఇంకేమి ఉపద్రవం తటస్థించునో అని చూస్తూ నిలబడ్డాడు.

స్టబ్, ఫ్లాస్క్ – ఇద్దరూ చిన్న పడవలను గట్టిగా కట్టవలసిందని పనివాళ్ళను హెచ్చరిస్తున్నారు. వాళ్ళ శ్రమ వ్యర్థమయింది. ఒక పెద్ద కెరటం వచ్చి అహాబ్ వాడుకొనే పడవని ధ్వంసం చేసింది. దీనిని చూచి స్టబ్, "చెడిపోయింది, మిస్టర్ స్టార్‌బక్! వృథా అయింది. ఏమైనా, అంతిమ విజయం ఎప్పుడూ సముద్రానిదే! సముద్రపు కెరటం ఎక్కడో ఎన్నడో బయలుదేరి, ప్రపంచమంతా చుట్టి వస్తేనే గాని దూకటానికి పూనుకోదు! దానిని తట్టుకోటానికి మనకు వున్న సమయం చాలా స్వల్పం. ప్రదేశమూ, ఈ తట్టు మాత్రం. పోనీలే, ఇది ఒక తమాషా. ఆ తమాషా మీద ఒక పాత పాటకూడా ఉంది. సముద్రము కొంటెపిల్లవాడు. తుంటరి. చిలిపి.

తుఫాను నృత్యం చేస్తూవుంటే,
తిమి, తన తోకనుఆడిస్తుంటే,
పిడుగులు పడవను చీలుస్తుంటే,
కొంటె సాగరముకుత్తుకనిండా,
తాగుచు నురుగులు క్రక్కేస్తుంది!"

స్టబ్! ఊరకుండు. మన స్తంభాన్ని వీణగాను, తాళ్ళను తీగెలుగాని చేసుకొని, తుఫానే ఒక పాట పాడుతుంది పాడనీ. నీకు ధైర్యమంటే కంగారుపడక మౌనముతో వుండు చాలు"

"నేను ధైర్యవంతుడను కానే! నేను ధైర్యవంతుడనని ఎప్పుడూ చెప్పుకోలేదే! నేను పిరికివాడను నాకు నేనే బరవసా చెప్పుకోటానికే ఈ పాట పాడుతున్నాను, ఇంకోటి కూడా చెప్పుతాను. నేను ఈ పాటలను ఆపివేయటానికి, నా గొంతుక కోసివెయ్యటమే మార్గం. గొంతుక కోసివేసిన తర్వాతకూడా ఒక్కసారి ఈశ్వర స్తుతి చేసి చస్తాను"

"పిచ్చివాడా! నీకు కళ్ళు లేకపోతే, నా కళ్ళతో చూడు"

"నేను ఎంత వెఱ్ఱివాడనయినా నాకంటె నీవుమాత్రం ఇంత చీకటిలో ఏలా బాగా చూడగలవు!" స్టబ్ భుజము మీద చేయివేసి, పట్టుకొని స్టార్‌బక్ "యిటు చూడు, తూర్పు వైపునుంచి వస్తోంది తుఫాను. అటే 'మాబీడిక్' కోసం వెళ్లాలంటున్నాడు అహాబ్. అతని పడవ వెనుక వున్నట్టుంది. అక్కడే నిలబడతాను. కావాలంటే ఓడమీద నుంచి క్రిందికి దూకి నీ చిత్తము వచ్చినట్లు పాటలు పాడుకో"

"నీవు చెప్పినదానిలో కొంచెమయినా నాకు బోధపడలేదు. గాలిలో ఏముంది!"

స్టబ్ అడిగిన ప్రశ్నని పట్టించుకోకుండా, తనలో తాను ఇలా అనుకొన్నాడు; "గుడ్ హోప్ అగ్రము మీదుగా వెళ్ళటమే నన్‌టుకెట్‌కి దగ్గరదారి. మనుష్మ చావకొట్టుతూవున్న గాలివాటు నేపోతే ఇంటికి పోవచ్చు. గాలివాటున వెళ్ళితే-అంటే వెలుగే. మెరుపులులేని వెలుగు"

ఒక మెరుపు మెరిసిన తరువాత చీకటి దట్టమయింది. ఆ చీకటిలో అతని పక్కనే ఒక గొంతు వినబడింది. అదే క్షణంలో పెద్ద వురుమొకటి నెత్తిమీదుగా పరుగెత్తింది.

"ఎవరక్కడ!"

"మామూలు ఉరుము" అని. తన దారిని తడుము కొంటూ వెళ్ళుతూ ఉంటే మెరుగుపెట్టిన అగ్ని శూలాల వల్ల అతని దారి చక్కగా కనబడ్డది. అగ్ని శూలాలంటే, విద్యుత్ గ్రాహకములైన ఉక్కు చువ్వలు. నేలమీద పెద్ద పెద్ద భవనాలకు విద్యుద్గ్రాహక శూలాలు పెడతారు. వాటి వల్ల పిడుగులలోని విద్యుత్తు భూమిలోకి వెళ్ళిపోయినట్టు, ఓడలకు ఉండే విద్యుద్గ్రాహక శూలాలవల్ల విద్యుత్తు నీటిలోకి పోతుంది. ఈ ఉపాయంవల్ల నేలమీద భవనాలవలెనే, నీటి మీద ఓడలు పిడుగుపడి విచ్ఛిన్నంకాకుండా వుంటాయి. ఆ చువ్వను నీటిలో చాలా లోతుకు దింపాలి. అందువల్ల దానిని ఎప్పుడూ నిల్పి అట్టిపెట్టరు. చిన్న చిన్న ముక్కలుగా చేసివుంచి, అవసరమైనప్పుడు గొలుసులతో నీటిలో విసిరి వేస్తారు.

ఒక మెరుపుతో స్టార్‌బక్ దద్దరిల్లి ఆ ఊచలకోసం కేకపెట్టాడు. "వాటిని త్వరగా నీటిలో పడవెయ్యండి" అని అరిచాడు.

ఆహాబ్ ఇది విని, "మంళము శత్రుకిహీనులమైనా పోరాటంలో తీసిపోరాదు. ఆత్మరక్షణార్థము ఆ చువ్వలను నీటిలో విడపటం నా కిష్టంలేదు. ఆపని చెయ్యకండి. సమస్త ప్రపంచ

రక్షణార్థం వాటిని హిమాలయ పర్వతశిఖరాలమీదనో, ఆండీస్ పర్వత శిఖరాలమీదనో నిల్పటం మేలు" అన్నాడు.

స్టార్‌బక్, "అదిగో అదిగో పైకి చూడండి! పైకి చూడండి! పైకి!" అన్నాడు. ఓడ స్తంభాలకు నిప్పు అంటుకొన్నది. మూడుభాగాలు క్రొవ్వువత్తులవలె వెలుగుతున్నాయి.

స్టబ్, తన పడవను ఓడకు అంటగట్టుతూ ఉండగా, ఒక పెద్ద కెరటంవచ్చి కొట్టివేసింది. "విధవపడవ! పోనీ!" అనుకొంటూ ఈవలకు వచ్చి పైనరేగిన మంటను చూస్తూ నిలబడ్డాడు.

నావికులు సాధారణంగా దుర్భాషలాడుతూనే ఉంటారు. వాళ్ళకు తిట్టుకోవటం, శపించటం, ఒట్టుపెట్టుకోవటం సర్వసాధారణ కృత్యం. ఆనాడు విధిచాచిన ఆగ్నేయ హస్తం ఓడకు తగిలినప్పుడు వాళ్లు తిట్టిన తిట్లు ఇన్నీ అన్నీ కావు.

పైన మంటరేగుతుంటే, నావికులంతా మంత్రబద్ధులైనట్లు నిశ్చేష్టులై చూస్తున్నారు. ఆ కాంతిలో వాళ్ళ కళ్లు మెరిసి దూరంగా ఉన్న నక్షత్రాల గుంపులాగ కనబడ్డాయి. ఆ కాంతి ముందు, నల్లటి నీగ్రో డాగో మరీపెద్ద ఆకారంతో కానవచ్చాడు. మెరుపుతో ఊడిపడిన ఒక కారుమేఘంవలె కనబడ్డాడు. టాష్‌టెగో నోరు తెరువగా అతని తెల్లటి పళ్ళు వింతగా మెరిశాయి. క్వీక్వెగ్ ఒంటిమీది పచ్చలు, పైశాచిక నీలిమగా కనబడ్డాయి. ఆ దృశ్యమంతా ఒక వింత [illegible]

రూటగా ఉంది. అది ఆ మంటలతో పాటే సమసిపోయింది. ఓడ, ఓడలోని జనం చీకటిలో కలిసిపోయారు. స్టార్‌బక్ ముందుకు వెళ్ళుతూ, ఎవరినో ఢీకొన్నారు. అతను స్టబ్ "ఇప్పుడేమంటావోయ్ - నీవైపునుండి ఏదో ఏడుపు విన వచ్చింది. ఏమిటది? పాటలు పాడుతున్నావా, ఏమి!" అని అడిగాడు. "పాటకాదు. మనకు దేవతానుగ్రహం కలగాలని అంటున్నాను. దేవతలకు మనమీద దయ ఎందుకు ఉంటుంది? ఇటుచూడు, స్టార్‌బక్! అయినా చీకటిలో ఏం చూడ గలవులే. పోనీ ఇదివిను. ఇందాకమనం స్తంభంమీద చూచిన మంట శుభసూచకమనుకొంటాను. ఆ స్తంభం పడవలో పలిదాకా దాగియుందికదా! అక్కడనే కదా నూనె వుంది? ఆ నూనె మెల్లగా పైకి ఎగబ్రాకుతుంది. చెట్టునుండి చిగురులాగున - స్తంభాలన్నీ క్రొవ్వువత్తులలాగున వెలుగు తాయి, అదీ మనకు కనబడే శుభం."

ఆ క్షణాన స్టార్‌బక్, స్టబ్ మొగమువంక తేరిపార చూచి, మళ్ళీ పై చూపుపెట్టి "అటుచూడు!" అన్నాడు. పైకి ఎగసిపోయే మంటలు ద్విగుణీకృతమైన వెలుగుతో కన బడింది. స్టబ్ మళ్ళీ ప్రార్థనలు చేశాడు.

ప్రధాన స్తంభం దగ్గర ఆ మంటల క్రిందనే పార్శీవాడు మోకరిల్లాడు. అతను అహాబ్‌కి ఎదురుగా ఉన్నా, అతనిని చూడటంలేదు. కొందరు తెరచాపలను తీయుటంవంటి పను లలో నిమగ్నులై వున్నారు. మంటల కాంతిలో వాళ్ళు కీటకసమూహంలాగున కనబడ్డారు. అహాబ్ ఇలా అరిచాడు.

"అందరూ ఆ తెల్లని మంటను చూడండి. అదే తెల్లతిమింగిలానికి దారిని చూపుతుంది. ఆ స్తంభం ఎక్కే గొలుసులు ఇలాగివ్వండి. ఆ మంటని ముట్టుకొని చూస్తాను."

పైకి ఎక్కి ఆ మంటలు ఎదురుగా నిలబడి, "ఓ అగ్ని దేవుడా! ఈ సముద్రాలమీదనే, నిన్ను విధిపూర్వకంగా, పార్శీవానిలాగ, పూజించాను. నాకు అప్పుడు మంట తగిలి కాలి మచ్చకూడ పడింది. ఇప్పుడు నీ సంగతి నాకు తెలిసింది. నిన్ను లెక్కచేయకుండా ఉండటమే నిన్ను పూజించుట. భక్తికిగాని, ప్రేమకిగాని నీవు లొంగవు. ద్వేషాన్ని మాత్రం ఏమిచేయగలవు! చంపగలవు అంతేనా! ఇప్పుడు నీకు ముఖాముఖి నిలిచియున్నవాడు వీరికి విధవకాడు. అవ్యక్తంగా సర్వవ్యాపివైన నీకు ఉన్నశక్తి నాకును ఉంది. నాతుది ఊపిరి విడిచేవరకు ఆ శక్తి నిర్నిబంధంగా పోరాడుతూనే ఉంటుంది. నేను ఎక్కడనుంచి వచ్చినా, ఎక్కడికి వెళ్ళినా, నేను బ్రతికి ఉన్నంత కాలమూ నాలో ఒక మూర్తిమత్వ ముంటుంది. అతి ప్రస్ఫుటమయ్యే ఉంటుంది. కాని యుద్ధం ఒక బాధ, ద్వేషం ఒక వ్యథ. ప్రేమస్వరూపుడవై కనబడు నీ పాదాలకి మొక్కుతాను. ముద్దాడుతాను. కాని అహంకార పూరితుడవై వచ్చి లోకాలన్నిటిని గుప్పిటబట్టి, నాపైని విసరినా నీకు భయపడను! ఓ దేవుడా! నీజ్వాలతోనే నన్ను సృష్టించావు. నేను అగ్నిపుత్రుడను. ఆ యగ్నినే తిరిగి నీమీద ఊదుతాను."

(హఠాత్తుగా మెరుపులు. పెద్దమంటలు రేగుతాయి. మిగిలిన వాళ్ళవలెనే అహబ్ కూడ కళ్ళుమూసుకొంటాడు. తన చేతులతో కళ్ళు కప్పివేసుకొంటాడు)

"నీ శక్తి అంతా నాకు ఉందన్నాను కాదూ! ఆ మాటలు నాచే ఎవరో అనిపించినవి కావు. బుద్ధిపూర్వకంగా అన్నవే. ఇక్కడనుండి నేను దిగిపోవటంలేదు. నన్ను అంధుణ్ణి చెయ్యగలవు నే నెరుగుదును. అయినా, నా దారి వెదకుకో గలను. నన్ను దగ్ధంచేసి వెయ్యగలవు. కాని అప్పుడుకూడా బూడిదగా వ్యక్తిత్వంతోనే ఉంటాను. నా కళ్ళను చేతులను వారించివెయ్యి. మెరుపు నా మెదడులో మెరుస్తోంది. నా కళ్ళు పీకుతున్నాయి, పీకుతున్నాయి. దెబ్బతిన్న నా మెదడంతా తలతీసివేయబడిన జంతువులాగ నేలమీద దొర్లుతోంది. ఓ! ఓ! కళ్లుమూసుకుపోయినా, నీతో మాట్లాడుతూనే ఉంటాను! నీవు వెలుగులేకాని అంధకారంనుంచి పైకి ఎగసివస్తావు నేనో. వెలుగులోనుంచి లేచే అంధకారాన్ని నీలోనుంచి ఎగసి వచ్చేవాడను. అవిగో మంటలు! నీవు ఉదారుడవు. నా పుట్టుక ఇప్పుడు నాకు పరమసంతోష మిస్తోంది. నీవే రౌద్రమూర్తివైన నా తండ్రివి. మాధురభాషిణి అయిన తల్లి! ఏమో అవునో కాదో! నిర్దయుడా - ఆమెను ఏం చేశావు? అక్కడే ఉంది నా సమస్య. కాని నీ సమస్య అంతకంటె క్లిష్టమైనది. నీవు ఎట్లా వచ్చావో నీకు తెలియదు. అందువల్లనే స్వయంభువునని అనుకొంటావు. నీకు మొదలు ఎక్కడో తెలియదు కనుక ఆదిరహితుడ నను

కొంటావు. నన్ను గురించిన ఈ వివరాలు నాకు తెలుసు. నీకు తెలియదు! సర్వశక్తిమంతుడవు కూడాను! నీ వెనుక నీకు తెలియని సర్వవ్యాప్తమయిన దేవో ఉన్నది. దాని దృష్టిలో నీ శాశ్వతత్వము కేవలము కాలస్వరూపమే. నీ సృజనశక్తి యాంత్రికమే. నీ మంటలోనుంచే కాలిపోయే నా కళ్ళు దానిని చూడగలుగుతున్నాయి. అనాది సమాధి నిష్ఠుడా! నీకూ తెలియని సమస్యలున్నాయి. నాకూ ఒరులు పంచుకోలేని బాధలున్నాయి! ఇక్కడ కూడా నీ సంగతినే అంతుచూస్తాను! ఎగసిపో! ఆకాశాన్ని తాకు! నేను నీతో ఎగసిపోతాను! నీతోనే మండిపోతాను. నీలో కలసిపోతా. ధిక్కరిస్తూనే నిన్ను పూజిస్తాను."

స్టార్‌బక్, "పడవ! నీ పడవను చూచుకోవయ్యా" అంటూ కేక వేశాడు.

పెక్ తయారు చేసిపెట్టిన అహాబ్ ఈటె పడవలో పెట్టిన చోటనే ఉండి, కొంతభాగం, పడవకు అవల పొడుచుకొని కనబడుతూ వుంది. అలలు ఆ పడవ అడుగు భాగాన్ని ధ్వంసం చేశాయి. ఈటెకు ఉండే తోలుసంచి ఊడిపోయింది. ఈక్కుముళ్లన్నీ నిప్పంటుకొన్నాయి. ఈటె విషసర్పపు కోరవలె కాలుతోంది. అహాబ్‌ను స్టార్‌బక్ ఇవతలికి లాగాడు, "రోజులు మంచివి కావు! కాస్త ఓర్చుకో! ఈ స్థితిలో ఇటు పోవటం మంచిదికాదు. పీకైనంత చక్కపెట్టుకొని గాలి వాటువస్తే ఇంటికి పోదాం పద! ఆ ప్రయాణం ఇంతకంటె బాగుంటుంది" అన్నాడు.

ఆ మాటలు విని, నావికులంతా అటూ ఇటూ పరుగెత్తారు. తమ మనస్సులలోని మాటలనే అతను అన్నట్లు భావించారు ఒక్క గొంతుతో పెద్దగా అరచారు. కాలుతూ ఉన్న ఈటెను చేతబూని, దానిని అట్టహాసంగా ఆడిస్తూ అహాబు, ముందుకు 'ఏ నావికుడైనా తిరుగు ప్రయాణానికి ప్రయత్నం చేస్తే దీనితో వాని పొడతాన" ని కేక వేశాడు. అతని ఆవేశాన్ని చూచి స్తబ్ధులై, కాగే ఆ ఈటెను చూచి భయపడి, అందరూ వెనుకకు ఒక అడుగు వేశారు. అహాబు మళ్ళీ ప్రారంభించాడు: "తెల్లతిమింగిలాన్ని వధిస్తామంటూ మీరు చేసిన శపథాలకు, నా వలెనే మీరుకూడా, కట్టుపడి ఉండాలి. నేను మనసా, వాచా ఆ శపథానికి బద్ధుడను. నా గుండె ఎల్లా కొట్టుకొంటూ ఉందో మీకు తెలియవలెనంటే చూడండి, మీ సంశయాన్ని విచ్ఛేదము చేస్తున్నాను" అంటూ ఆ మాటను ఊదివేశాడు.

గాలివాన వచ్చినప్పుడు బాగా పెరిగిన వృక్షము చెంత నిల్చుట అపాయకరము. అది పిడుగులకు ముఖ్యమైన గురి అని భయపడి దాని పరిసరాలనుంచి మనుష్యులు పారిపోయినట్లు, అహాబు అనిన ఆ ఆఖరి మాటలకు భయపడి, దిగులుతో చాలామంది నావికులు పారిపోయినారు.

—:o:—

69. ఓడ తట్టు - మొదటి రాత్రి పహరా

(అహాబు చుక్కాను వద్ద నిలబడి యుంటాడు. స్టార్ బక్ ఆతనిని సమీపిస్తూ)

"పెద్ద తెరచాపను దింపాలి. తాడు బిగువు తప్పింది. ఏమి చెయ్యమంటారు!"

"ఏమీ చెయ్యవద్దు"

"ఏమీ వద్దా! దేవునితోడు!"

"నీ వనే దేమిటి!"

"లంగరు వెయ్యమంటారా!"

"వద్దు. అన్నిటిని గట్టిగా బిగించు. గాలి ఎక్కువౌతోంది నిజమే. నేనేదో పిరికివాడ ననుకొంటున్నావేమో! పెద్ద తెరచాప దింపాలట! ఎంత హోరుగాలినైనా ఎదుర్కొనటానికే గదా ఇంతింత పెద్ద ఓడలు తయారు చేసేద! ఈ మాత్రం గాలికేనా పడలిపోవటం! తుఫాను రేగినప్పుడు పిరికిపందలు తప్ప మరెవ్వరూ పడవని నిలిపివేయరు. ఎంత చప్పుడవుతూ వుందో! నాకది ఆనందం. శూలవ్యాధి ఎక్కువ గడబిడ చేస్తుంది. మందు పుచ్చుకో."

—:o:—

70. నడిరేయి : ఓడ ముందు భాగం

(అర్ధరాత్రి వేళ,

(స్టబ్, ఫ్లాస్క్ లంగరు గొలుసు బిగిస్తూ ఉంటారు)

"స్టబ్ ! నీవు ఏమైనా చేసినా సరే. నీవు ఇప్పుడు చెప్పిన మాట నా తలకెక్కదు. ఇంతకుముందే కదా ఈ మాటకు భిన్నంగా మాట్లాడావు. అహాబ్ ప్రయాణం చేసే ఏ ఓడైనా సరే ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. అగ్గిపుల్లల పెట్టెలతో పాటు మందుగుండు సామాను వేసుకొని వెళ్ళే ఓడలాగ మామూలుకంటె ఎక్కువ భీమా సొమ్ము చెల్లించాలి అని అన్నావు గదా"

"అంటే అన్నానేమో ! ఏమంటే ? ఆ మాట అన్న తర్వాత నా శరీరంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆ మార్పులుమనస్సులో రాకూడదా! మాటవరసకు మందుగుండు సామానూ, నిప్పుపెట్టెలూ కలిసి ఉన్నాయనే అనుకొందాం. ఇట్లా తడిసి ముద్దయిపోతూ వుంటే ఆ అగ్గిపెట్టెలు ఎట్లా మండుతాయి! నీ జుట్టు చాలా ఎఱ్ఱగా ఉంది. కాని మండటం లేదేమి! నీవుకుంభ రాశివి:అంటే నీవని నీటి మోత అన్నమాట. నీ కోటు మెడపటి దగ్గర నిల్వనింపిన కూజాలు పెట్టవచ్చు. చూచావా, ఓడ భీమా కంపెనీలవాళ్ళు, ఎక్కువ నష్టం వచ్చే వ్యాపారంలో హామీలు ఎక్కువ పుచ్చుకొంటారు ఫ్లాస్క్! ఇవిగో ఇక్కడ నీటి కుళాయి లున్నాయి. విను

నీ ప్రశ్నకు తర్వాత సమాధానం చెప్తాను. ముందు లంగరు మీదనుంచి కాలు తీసివేయి. లేకపోతే గొలుసు చుట్టలేను. ఇప్పుడు విను. విద్యుద్గ్రాహకశూలం చేతపట్టుకొని గాలి వానలో నిలబడటానికి, ఆ ఊచలేని స్తంభం దగ్గర గాలి వానలో నిలబడటానికి ఏమిటి తేడా? స్తంభానికి దెబ్బతగ ల దే ఆ మనిషికి ఏమీ అపాయం రాదని స్పష్టమేగదా! ఆ ఊచ వేయింట ఒక్క ఓడకు ఉంటుంది. ఇప్పుడు వేలకొద్దీ సముద్రం తిరుగుతున్న ఓడలలోని మనుష్యులకంటె నీకు, నాకు, అహాబ్‌కు వచ్చిన ఎక్కువ ప్రమాదమేమీ లేదు! నీ వాలకం చూస్తే ప్రతిమనిషి తనటోపీమీద ఒక విద్యుద్గ్రాహకంను పెట్టుకోవాలసేటట్టున్నావే! కాస్త ఆలోచించు ఫ్లాస్క్! ఆలోచించటం చాలా తేలిక. సరిగా కంటి చూపు లేని వాడైనా ఆలోచన చేయగలడు."

"అదేమో నాకు తెలియదు. ఆలోచన అంత తేలిక పని అని నాకు అనిపించదు."

"బాగా తడిసి ముద్దయిపోయాక ఆలోచించటం కష్టమేమరి. ఈ నీటి జల్లువల్ల నేను బాగా తడిసిపోయినాను. పోనీలే దాన్ని ఒకసారి త్రిప్పి ఇట్లా పంపించు. ఈ రెండు లంగరులనూ కట్టడం ఒక మనిషి చేతులను వెనుకకు పెట్టి కట్టటంలాగ ఉంది. అవునుగానీ, ఈ భూమి దేనికైనా లంగరు వేయబడే ఉందేమో! అలాగే ఉంటే, చాలా పొడవుపాటి తాడుకు కట్టబడి వ్రేలాడుతూ వుందన్నమాట. ఆ ముడివేయి. మనపని పూర్తవుతుంది. [illegible]

పెట్టడం, లంగరు భూమిని తగలటమంత తృప్తికరంగా ఉంటుంది. నా తడిచొక్కా కిందు తొవ్వా! పొడవుపాటికోట్లను చూచి నవ్వుతారుగాని, వర్షం పడేటప్పుడు వాటినే తొడుక్కోవాలి. నీళ్ళు చక్కగా జారిపోవటానికి వీలు. అలాగే, శాస్త్ర పైకి వంగియున్న టోపీలుకూడా ఉపయోగమే. అవి ఉంటే ఇంకేమీ అవసరముండదు. ఓహో! గాలికి ఎగిరి పోతూవుందే నేను కప్పుకొనే జముఖానా! అబ్బ! స్వర్గం నుంచి వీచే గాలులుకూడా ఇంత అనాగరకంగా ప్రవర్తిస్తే ఏమిగతి! బాబూ—ఇది అతి ఘోరమైన రాత్రి!"

---

71. నడిరేయి - ఉరుములు, మెరుపులు

(అర్ధరాత్రి మెరుపులు ఉరుములు)

(పెద్ద స్తంభం దగ్గర టాష్టెగో, క్రొత్త తాళ్లు చుట్టుతూ)

"ఊం ఊం ఊం ఆపు ఆ ఉరుములని. మరీ ఎక్కువై పోయినాయి. ఎవనికి కావాలి ఆ ఉరుములు. శాస్త్ర క్రిందీ కావాలి. ఊం ఊం "

---

72. తుపాకి

గాలిదెబ్బ బలంగా తాకినప్పుడెల్లా మా ఓడ చుక్కాని వద్దనున్న వాడు, తూలి తట్టుమీద పడిపోతూ వుండేవాడు. తుపాను ఉధృతంగా రేగుతున్నప్పుడు. దిక్సూచిలోని ముల్లు గిరగిరా తిరుగుతూ ఉండటం సర్వసాధారణం. చుక్కానువద్ద నున్నవాడు తన దిక్సూచిలోని ముల్లు గిరగిరా తిరగటం గమనిస్తూనే ఉన్నాడు. ఆదృశ్యం అతనికి పరిపాటి అవటంచేత ఏమీ వింతగొల్పలేదు. అర్ధరాత్రి గడచిన కొంతసేపటికి తుఫాను తగ్గింది.

స్టబ్, స్టార్‌బక్, శ్రమపడి తునాతునకలై మిగిలి యున్న తెరచాపలనుకూడా పూర్తిగా ఊడదీసి ఓడతట్టు మీద పడవేయగా అవి నీటిపక్షుల రెక్కల యీకలవలె రెపరెప కొట్టుకోవటం మొదలుపెట్టినాయి.

క్రొత్త తెరచాపలు కట్టారు. ఓడ జాగ్రత్తగా నడుస్తూ ఉంది. దానిని ఏ దెసగా నడపాలో చుక్కానువానికి చెప్పారు. తుపాను రేగినప్పుడు ప్రమాదాలను తప్పించుకోవటానికి అతను డను ఆటూ ఇటూ త్రిప్పవలసి వచ్చింది. ఇక నిప్పుడు దిక్సూచి చూస్తూ వెళ్ళవలసిన మార్గాన సరిగా వెడుతూ ఉన్నాడు. అంతలో గాలికూడా అనుకూలంగా మారింది. నావికులంతా ఉత్సాహంతో పాటలు మొదలు పెట్టారు. అంత ప్రమాదకరమైన ఆ తుపానుతగ్గి గాలి శుభ

సూచకంగా మారిపోవటం వాళ్ళకు ఎంతో సంతోషం కలిగించింది.

తట్టుమీద ఏమి మార్పు జరిగినా, తనకు వెంటనే తెలియజేయ వలసిందన్న కెప్టెన్ ఉత్తర్వు ప్రకారం, ఇష్టం లేకపోయినా, స్టార్‌బక్ అహాబ్ చెంతకు బయలుదేరాడు. గది సమీపించి, తలుపు తట్టబోతూ, ఎందుకో అప్రతిక్కతంగా ఒక్క క్షణం ఊరక నిల్చిపోయాడు. అహాబ్ గదిలోని లాంతరు ఉయ్యాలవలె అటూ ఇటూ ఊగుతూ వెలుగుతూ వుంది. గది తలుపుమీద పడే నీడలు కూడా అటూ ఇటూ ఆడుతూ వున్నాయి. గది ఓడలో క్రింది భాగాన వుండటం వల్ల, చుట్టూ జరిగే ఘోష అక్కడికి వినరావటం లేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. గదిలో బీరువామీద పెట్టియున్న తుపాకులు మెరిసిపోతూ అతని కంటబడినాయి. స్టార్‌బక్ నీతిపరుడు. ఐనా, తుపాకులు కంటబడగానే అతనికొక దురుద్ధి పుట్టింది. కాని, దానితోపాటే ఇంకేవో జతగూడటంవల్ల ఆ పుట్టిన దుర్బుద్ధి అతని మనస్సుకు పట్టలేదు. అతను ఇలా గొణుక్కున్నాడు. "ఇతను నన్నొకసారి ఆ తుపాకితోనే పేల్చివేస్తానని తలకు గురిపెట్టాడు. ఇదిగో! ఇదే ఆ తుపాకీ. ఏదీ ఒకసారి పట్టుకొని చూస్తాను ఒక్కసారి ఎత్తి చూస్తాను. ఇదేమిటి! ప్రాణాంతకములైన ఎన్నో ఈటెలను ఈ చేతితో ప్రయోగించాను ఆ చేయి ఇప్పుడు ఇలా వణికిపోతూవుందే! తుపాకిలో గుండ్లు వున్నట్టున్నాయే! ఓహో! క్రింద పడవేస్తా. ముందు వణుకు తగ్గాలి. ఆగుతా. గాలి అనుకూలంగా

వుందని చెప్పటానికి వచ్చాను. కాని, ఏమి అనుకూలంగా వున్నట్టు? చావుకి అనుకూలంగావుంది. అంటే 'మాబీరిక్'కి అన్నమాట. ఇదిగో ఈ తుపాకీనే నా వైపు గురిపెట్టాడు. దీనితోనే అప్పుడు నన్ను చంపేశాడు! నన్నేమిటి అందరినీ చంపేస్తాడు! తుపానంటే భయం లేదని ఇతను అన్నాడుగా? తన క్వాడ్రెంటుని చితుక కొట్టివేయలేదా? ప్రమాదభరితములైన ఈ సముద్రాలమీద దారికొరకు పిచ్చివెత్తినట్లు వెతుకుకొంటున్నాడుగా! ఈ ముసలివాడు తనతోపాటు మా అందరకు ముప్పుకలిగిస్తూవుంటే ఊరకుండ వలసిందేనా? ఇతని యిష్టం ప్రకారమే అన్నీ జరిగితే ప్రమాదం తప్పదు. చేతులారా మా ముప్పదిమందిని కావాలని మృత్యువునోట వేస్తాడు. ఈ ఒక్కక్షణంలో అతనిని తొలగించివేస్తే, ఆ పాపం తొలగించినవాడనవుతాను. నిద్రలో ఏదో కలవరిస్తున్నాడు. నిజంగా నిద్రపోతున్నాడా? లేదు, చూస్తూఉండగానే ఇంతలో మేల్కొంటాడు. ముసలివాడా! నిన్ను క్షమించలేను. వాదించినా, ఆక్షేపించినా, వేడుకొన్నా నీవు లెక్కచేయవు. నీకు కావలసిందల్లా నీ వెట్టి ఆజ్ఞలకు వెట్టి విధేయత. పైగా అందరూ శపథం చేశారంటావు! మేమంతా అహాబ్బులమే నంటావు! పాపం శమించుగాక! ఇంకే మార్గమూ- న్యాయమైనది-లేదా? ఇతనిని బందీగా చేసి ఇంటికి తీసుకొనిపోతే! ఏమీ! ఇతను బ్రతికి ఉండగా, అతని చేతిలోనుంచి అధికారం లాగుకోవటమా? ఎవడో వెఱ్ఱివాడు తప్ప ఎవ్వడూ అందుకు ప్రయ

కిన్నించడు. ఇతనిని ఆణచిపెట్టి త్రాళ్ళతోను గొలుసులతోను బంధించివేసి పారవేసినాసరే బోనులో ఉన్న పెద్దపులికంటె కూడా భయంకరుడౌతాడు. ఇతని మొగమే నాకు దుర్నిరీక్ష్యమౌతుంది. ఇతని గర్జింపులు వినలేకపోయాను. అన్నపానములూ, నిద్రాసౌఖ్యము, బుద్ధివివేకమూ అన్నీపోయి ప్రయాణము భరింపరానిదౌతుంది. అయితే ఏమిటి దారి! నేల కొన్ని వేలమైళ్ళ దూరంలో ఉంది. ఇక్కడి జపాన్ ఒక్కటే దగ్గిర దేశం. ఈ సముద్రము మీద నేను ఒంటరిని. నాకూ న్యాయచట్టానికీ మధ్య రెండు మహాసముద్రాలూ ఒక ఖండమూ అడ్డున్నాయి. అవును, నిజమే ఈ మాట! హత్యకి ఒడిగట్టినవాడు నిద్రలో ఉండగా వానిమీద పిడుగుపడి, చంపివేస్తే, ఆకాశం హంత అవుతాడా? నేనూ అంతే” మెల్లగా, దొంగచాటుగా, ప్రక్కలకి చూస్తూ అతను తుపాకీని తలుపుమీద పెట్టాడు.

“ఈ ప్రాంతంలోనే అహాబ్ యొక్క ఉయ్యాల ఉంటుంది. అతని తల ఇటే ఉంటుంది! ఒక్క స్పర్శ! స్టార్బక్ బ్రతికిపోయి భార్యను పిల్లలను కలుసుకో గలుగుతాడు! ఓ మేరీ! ఒరేయ్ అబ్బాయ్! ముసలివాడా! నిన్ను ఇప్పుడు చంపకపోతే, వచ్చేవారం ఈ రోజుకి ఈ స్టార్బక్, మిగిలిన నావికులు ఏ అగాధంలో ఉంటారో ఎవరు చెప్పగలరు! భగవంతుడా! ఎక్కడున్నావు? చెయ్యనా? చెయ్యనా?— గాలి తగ్గిందండి. తెరచాపలు ఎత్తాం— ఓడ సరియైన దారిన పోతోందండి” “కానీ! ఓ మాబీడిక్! నీ గుండెను చీలుస్తా

ఆఖరికి!" ఆ ముసలివాని కలత నిద్దురనుండి బయటకు వచ్చిన పలుకులివి. అతని మూగకలయే స్టార్‌బక్ మాటలు విని జవాబిచ్చిందేమో!

గురిపెట్టే ఉన్న తుపాకి, తాగుబోతు చెయ్యివలె, తలుపుదగ్గర వణికింది. స్టార్‌బక్ ఏ దేవతతోనో కలహిస్తున్నట్టుంది. అతను వెనుకకు తిరిగిపోయి, బీరువామీద తుపాకి నుంచి బయటకు పోయాడు.

"అతను మంచి నిద్రలో ఉన్నాడు, స్టబ్! నీవు వెళ్ళి లేపి చెప్పవలసిందేదో చెప్పు. ఇక్కడ నాకు వేరేపని యుంది"

—:o:—

73. అయస్కాంత సూచి

మరునాటి ఉదయం పూర్తిగా శాంతింపని సముద్ర తరంగాలమీద, అసురకరములతో త్రోయబడినట్టుగా, మా ఓడ దొర్లిపోతూ వుంది. మరల ఒక పెనుగాలి రేగి నిర్విరామంగా వీస్తోంది. ఆకాశము, గాలి కలిసి బాగా విచ్చుకున్న తెరచాపలేమో వనిపించాయి. ఇంకా సూర్యుడు స్పష్టంగా కనబడటంలేదు. అరుణకిరణ ప్రసార దిశ మాత్రం తెలుస్తోంది. ప్రకృతి యంతా ధగధగ మెరిసిపోతూవుంది. ఆ వేడి వెలుగులో, సముద్రం బుడగలు లేచే కరిగిన బంగారం గల మూసవలె ఉంది.

కొంతదూరాన ఆహబ్ నిశ్శబ్దంగా నిలబడ్డాడు. నీటిమీద ఓడ నడకను, ఆకాశంమీద సూర్యుని నడకను గమనిస్తున్నాడు. "ఓ! నా ఓడ! సూర్యునకు సముద్రపు రథంలాగ ఉన్నావు నీవు! నా ఓడకు పురోభాగంలో ఉన్న దేశ దేశాలకూ సూర్యుని తీసికొని వెడుతున్నాను. ముందు పోయే ఆ కెరటాలనుకూడా రథానికి గుఱ్ఱాల వరుసలవలె కట్టండి! నేను సముద్రమునకు సారథిని."

హఠాత్తుగా ఏదో ఆలోచన తగిలి, గబగబ చుక్కాని వద్దకు 'వెళ్ళి మనం ఎటు వెళ్ళుతున్నా' మని అడిగాడు.

"తూర్పుగా - ఆగ్నేయంగా" అన్నాడు - భయపడుతూ, చుక్కాని వాడు,

"అబద్ధ మాడుతున్నావు" అని వాని ముఖంమీద బలంగా గుద్ది, "ప్రొద్దున్న ఈ వేళ తూర్పుగా వెళ్ళుతున్నామా! ఇది ఉదయవేళ. సూర్యుడు మన వెనకప్రక్క ఉన్నాడు, చూడు"

అందరూ కలవరపడ్డారు. ఈ గమనింపు వారిలో ఎవ్వరికీ లేదు. దిక్సూచి యంత్రాలుండే పెట్టెలోనికి సగం తల దూర్చి, ఒక క్షణం చూచాడు. ఎత్తిన అతని చేయి క్రిందికి జారింది. తుళ్ళిపడి వెనుకకు ఒరగపోయినాడు. ఓడ తూర్పు దెసగా వెళ్ళుతూ వున్నట్లే చూపించింది యంత్రం. కాని యథార్థంగా పశ్చిమ దిశకే వెళ్ళుతూ వుంది. అహాబ్ వెనుక స్టార్‌బక్ నిలబడి యున్నాడు. అందరు దిగ్భ్రమ చెందారు.

ఆ ముసలివాడు నవ్వి "అర్థమైంది, స్టార్‌బక్! రాత్రి మెరుపువల్ల మన దిక్సూచి ముళ్ళు తారుమారైనాయి. అంతే. ఇటువంటిది జరగటం ఇదివరకు నీవూ విని యుండవు"

"ఈ అనుభవం నా కెన్నడూ కలుగలేదండి" అని మెల్లిగా చెప్పాడతను.

పెద్ద తుపానులో, ఓడలకి ఇటువంటి ప్రమాదం చాలా సార్లు జరుగుతూ వుంటుంది. దిక్సూచిలోని అయస్కాంత శక్తి ఆకాశంలోని విద్యుచ్ఛక్తి నుండి సంభవించినదే. అందువల్లే ఇటువంటి విపరీతాలు అప్పుడప్పుడు కలుగుతూవుంటాయి. ఓడలమీద పిడుగులు పడినప్పుడు దిక్సూచియొక్క ముల్లు మీద వాటి ప్రభావం ఎక్కువగా వుంటుంది. అంతవరకు అయస్కాంత శక్తిగల ఆ ముల్లు ఎందుకూ పనికిరాకుండా

మామూలు సూది అయిపోతుంది. అట్లా దెబ్బతిన్న ముల్లు మళ్ళీ తనంతటతాను బాగుపడదు. పైనవున్న దిక్సూచులు ఈ విధంగా మారితే, ఓడలో ఇతర భాగాలలో వున్న ఏ దిక్సూచియైనా అట్లాగే మారిపోతుంది. అహాబ్, దిక్సూచు లున్న పెట్టెదగ్గర నిలబడి, తారుమారైన దిక్సూచులను చూస్తూ, చేయిచాచి సూర్యోదయ దిక్కును చూపుతూ "ఓడను మరలించండి," అని ఉత్తరువు చేశాడు.

మళ్ళీ "పెకోడ్" దుష్కర ప్రయాణం మొదలు పెట్టింది. గాలికి ఎదురుపోవలసి వచ్చింది. అనుకూలమైన దనుకొన్నగాలి, ప్రతికూలమైనది.

స్టార్ బక్, మనస్సు ' ఏమనుకొన్నా, ఏమీ మారు పలుకక అహాబ్ ఇచ్చిన ఉత్తరువును అందరికి జారీచేశాడు. స్టబ్, ఫ్లాస్కులుకూడా అవిధంగానే చేశారు. మనస్సులలో ఏమనుకొన్నా నావికులలో చాలామందికి, మొత్తముమీద, విధేయంకూడా అహాబ్ అంటే భయమెక్కువ. అనాగరికు లైన ఈమొగాళ్ళు మాత్రం ఏమీ చలించలేదు. వాళ్ళకు ఎటువంటి అభిప్రాయాలున్నాయో కూడా ఎవ్వరికీ తెలి యదు.

ముసలివాడు తట్టుమీద పరధ్యానంగా పచార్లుచేస్తూ, కాలుజారి పడ్డాడు. క్రితంరోజు అతను విసిరికొట్టిన క్వాడ్రెంటు కనబడింది అతనికి "పిచ్చిదానా! నిన్న నినుధ్వంసం చేసివేశాను. ఈ పూట దిక్సూచులు నన్ను ధ్వంసం చేసివేసేవే. కాని, సూదంటుగాయిమీద కూడా అహాబ్కి

అధికారం ఉంది! స్టార్‌బక్—ఒక చిన్న ఈటెను, సూదినీ తెచ్చిపెట్టు—త్వరగా!" అన్నాడు.

తన అనుచరులలో ఉత్సాహం తిరిగి మొలకెత్తుటకై అతను నిపుణంగా చేయబోతున్న పనికి, ఇవి సాధనాలు కాబోలు! అంతేకాదు, తారుమారైన దిక్సూచులను ఓడ మీద పెట్టుకొని ప్రయాణం చేయుటం అసాధ్యం కాక పోయినా, నావికుల మూఢనమ్మకాలు తేలికగా పోయేవి కావని కూడా అతనికి తెలుసు.

స్టార్‌బక్ అతను కోరిన వాటిని తెచ్చి ఇచ్చిన తరువాత నావికులవైపు తిరిగి అహాబ్ "మెరుపులవల్ల నా దిక్సూచులు తారుమారయినాయి. కాని ఈ చిన్న ఉక్కు-ముక్కతో నా దిక్సూచిని నేనే చేసుకొంటాను. ఇది నిజం తెల్పుతుంది." ఈ మాటలువిని నావికులు లజ్జావిస్మయ భరితములైన చూపులతో ఒండొరులను చూచుకొన్నారు. తాము చూచేది ఇంద్రజాలమేమో అనుకొన్నారు. స్టార్‌బక్ మాత్రం మొగము అటు తిప్పుకొన్నాడు.

అహాబ్ ఒక్క-దెబ్బతో ఈటెయొక్క మొనకొట్టి పారవేసి మిగిలిన ఇనుపముక్కని మేస్త్రీ చేతికిచ్చి, తట్టుకి అది తగులకుండా నిటారుగా పట్టుకోమని చెప్పాడు. తన సుత్తితో ఈ ఇనుపముక్కని అలమీద పదేపదే బాది, సూదిని దానిపై ఉంచాడు. దానిని కూడా మళ్ళీ బాదాడు. తరువాత ఏవేవో తంటాలుపడి ఒక దారం కావాలని అడిగి, దిక్సూచులుంచే పెట్టివద్దకు వెళ్ళి, అందులోని తారుమారైన ముళ్ళను

వెలికితీసి దిక్సూచి అట్టమీద ఈ సూదిని మధ్యగా వేలాడ గట్టాడు. మొదట్లో ఆ సూది గిరగిరా తిరిగినా చివరికి ఒక చోట నిలిచింది. అహాబ్, ఫలితమేమవుతుందోనని పరీక్షిస్తూ, చివరికి వెనుకకివచ్చి దానివైపు చేయి చాచి, అరిచాడు, "చూడండి మీరే చూడండి. అహాబ్ కి సూదంటురాయిమీద ప్రభావం ఉందో లేదో! సూర్యుడు తూర్పున ఉన్నాడు, ఈ దిక్సూచి అందుకు సాక్ష్యం ఉంది." ఒకళ్ళ తరువాత ఒకళ్ళు లోపలకు వెళ్ళి చూచి, మెల్లమెల్లగా ఎవరికి వారు జారి పోయారు.

తిరస్కార విజయోత్సాహములతో నిండిపోయిన అతని కళ్ళలో దుర్విధిసూచకమైన గర్వము మూర్తీభవించి కానవచ్చింది.

74. లాగ్

ఇన్నాళ్ళబట్టీ 'పెకోడ్' ప్రయాణం చేస్తూ ఉన్నా, నడచిన దూరమునూ, గమనవేగమునూ సూచించే యంత్రమును ఇప్పటివరకూ వుపయోగించనేలేదు. (ఆ యంత్రమును 'లాగ్' అంటారు) ఓడ ఎక్కడ వుందో తెలుసుకొనేటందుకు వుపాయాంతరములు వుండటంవల్ల వాణిజ్యపుటోడలలోగాని, వేటకై వెళ్ళే ఓడలలోగాని, ఈ 'లాగ్'ని వుపయోగించటం సాధారణంగా జరుగదు. కాని లాంఛనప్రాయంగా, ఓడ ఎంతదూరం వెళ్ళినదీ, ఎంత వేగంగా వెళ్ళేదీ ఒకచోట, ఒక పలకమీద వ్రాస్తూ వుంటారు. 'పెకోడ్'లో కూడా ఇట్లాగే జరిగింది. చెక్క చక్రము, "లాగ్" వాడబడకుండా అట్లాగే పడియున్నాయి. వానకుతడిసి, ఎండకు ఎండి వుపయోగంలేక ఊరక వ్రేలాడే అది చివికిపోయింది. అయస్కాంతసూచీ నిర్మాణమైన తర్వాత ఆహాబ్‌ను చివికిపోయిన ఆ లాగ్ పైదృష్టి పోయింది.

"ఆ లాగ్‌ని తీసి విసరండి" అంటూ కేకవేశాడు ఆహాబ్.

ఆ ఇద్దరు నావికులలో (ఒకడు టాహాటీ వాడు, ఇంకొకడు మాన్స్‌మాన్) ఒకడు, "ఆ చక్రాన్ని పట్టుకొంటే నేను లాగ్‌ను తీస్తాను" అన్నాడు, వాళ్లు ఓడ వెనుక భాగానికి వెళ్లారు. గాలి వల్ల ఓడ బాగా ఒరిగి వుంది, అటువైపు సముద్రము ఘూర్ణ

మించు చేతికి అందుతూవుంది. మాన్స్మాన్ చక్రాన్ని పైకి లేవనెత్తాను. దాని ఇరుసుకొక త్రాడు చుట్టబడి వుంది. దాని చివర 'లాగ్' వుంది.

ఇంతలో ఆహాబ్ వచ్చి, బయటకు విసరటానికి మున్నెపు నలభై చుట్టలతాడు తీశాడు. మాన్స్మాన్ అది చూస్తూ చివరికి ధైర్యంచేసి ఇలా అన్నాడు. ఈ త్రాడు తడిసి పోవటంవల్లా, ఎండిపోవటంవల్లా పాడిపోయినట్టుంది. ఇది వుపయోగపడదనుకొంటాను."

"పనికి వస్తుంది లేవయ్యా? తడికీ వేడికీ నీవు పనికి రాకుండా పోయావేమిటి? ఎండకు ఎండి వానకు తడిసి చివికి పోయినావని నీ ప్రాణం నిన్ను విడిచిపోయిందా"

"నేను పట్టుకోవలసింది ఈ చక్రమేగదా! మీరన్నట్టే కానీయండి. వయస్సు మళ్ళిన తరువాత ఇప్పుడు నేను వాదన లోకి దిగటం మంచిది కాదు. అందులోనూ ఏదీ నమ్మని నాపై అధికారితో"

"అదేమిటి! వీడెవడో సహజ పండితుడులాగ ఉన్నాడే! నీ జన్మస్థానం ఏది?"

"ఐల్ ఆఫ్ మాన్ లో పుట్టానండి."

"బాగుంది అయితే గొప్పవాడివై పోయావన్నమాట"

"అదేమో నాకు తెలియదండి. కాని, నేను పుట్టిం దక్కడ"

"ఐల్ ఆఫ్ మాన్‌లోనా! బాగుంది. మానవద్వీపం నుంచి ఒక మానవుడు వచ్చాడు." అంటూ ఆ పేరును

చమత్కరించి, చక్రమును బాగా ఎత్తమని వానిని హెచ్చరించాడు.

లాగ్‌ని విసిరారు. వదులుగావున్న తాడు గబగబా చుట్ట విడింది. ఆ చక్రం కూడా తిరగటం ఆరంభించింది. అంతలో, ఆ తాడు తెగింది.

"నేనేమో నా క్వాడ్రెంటుని చితుకగొట్టేశాను. మెరుపు దిక్సూచిని తారుమారు చేసింది. ఈ లాగ్‌ని సముద్రం తెంపేసింది. అయితే మాత్రమేం! అహాబ్ అన్నిటినీ బాగుచేసుకోగలడు. "ఇదిగో, ఆ మిగిలిన తాడు పైకి లాగు, నీవు దాన్ని చుట్టు. వడ్రంగిని ఇంకొక 'లాగ్' తయారు చేయమనండి. నీవు ఈ తాడు బాగు చెయ్యి."

"పోతున్నాడు తనదారిన అతనికేమీ పట్టనట్టు. నాకు భూచక్రమే జారిపోతున్నట్టుంది లాగవయ్యా, లాగు. వెళ్ళేప్పుడు ఒక్క క్షణంలో పోతుంది ఈ తాడు. తిరిగి లాగేప్పుడు చిన్న చిన్న ముక్కలుగా మెల్లిగా వస్తుంది. ఏయ్ పిప్! ఇలారా! ఒక చెయ్యివెయ్యి, పిప్!"

"పిప్పా! ఎవరిని నీవు పిప్ అని పిలవటం! పిప్? పడవమీదనుంచి ఎప్పుడో గెంతేశాడు. ఎంకెక్కడికి పిప్! ఏదీ చూడని ఇంకా దొరికాడో లేదో! అబ్బ. ఎంత కష్టపడాలి దీన్ని లాగటానికి! దీనికే పట్టుకొని వేళ్ళాడుతున్నాడు కాబోలు! అదిగో అతని చెయ్యి, నీటిని కొడ్తోంది! ఏదీ ఒక గొడ్డలి! దాన్ని నరకేయాలి. వాడిని తోసి వేయకండి-పిరికి

వాళ్ళను పైకి లాగనక్కరలేదు. కెప్టెన్ అహాబ్! ఇదిగో
నండి పిప్ మళ్ళీ పడవమీదకి రావటానికి చూస్తున్నాడు"
మాన్స్‌మాన్ అతనిని పట్టుకొని, "నోరుమూసుకో,
వెఱ్ఱివాడా! అవతలికిపో" అన్నాడు.
పెద్దవాంత చిన్నవాళ్ళను ఎప్పుడూ తిడుతూనే
ఉంటాడు" అంటూ ముందుకువచ్చి, అహాబ్, "అతనిమీద
చేతులు తీసివేయి-పిప్ ఎక్కడున్నాడ బాబు?"
"అక్కడండి- వెనుకభాగంలో-చూడండి!"
"నీవెవ్వడివి కుఱ్ఱాడా! నీమూగ కనుపాపల్లో నా ప్రతి
బింబం కనబడటం లేదే! నీవెవడవు?"
"నేను ఓడమీద గంటలు కొట్టేవాడిని. డింగ్-డింగ్
డింగ్-పిప్! పిప్! పిప్, అయిదువందల పౌనుల బహుమానం
మరిగా ఇస్తాము- అయిదడుగులుంటాడు- బెదిరిపోయినట్టు
కనబడుతాడు. దీనిబట్టే అతనిని పోల్చుకోవచ్చు-పిప్! డింగ్
డాంగ్-పిరికిపంద పిప్‌ని ఎవరు చూశారు?"

"భూమికి ఆవతల దయామయులు లేరు! కతిహాత్ములైన
దేవతలారా! సృజనశక్తిగల మూర్తితిపాలారా! ఈ దురదృష్ట
వంతుని సృష్టించి, విసర్జించివేశారు మీరు! ఇదిగో
అబ్బాయి-ఇకనుంచి అహాబ్ గదే పిప్ ఇల్లు. అహాబ్ బ్రతికి
ఉన్నంతకాలము అంతే. నాకు జాలిగొల్పుతున్నావు నీవు.
నాకు ఆత్మీయుడవయినావు, పదపోదాం."
"ఇదేమిటి, ఇంతమెత్తగా ఉంది" అని అహాబ్ చేతి
వంక రెప్పవాల్చకుండా చూస్తూ, "ఇంత దయగలవానిని

ఏమైనా అనుభవించి ఉంటే పిప్ సూయమై పోయేవాడు కాదు! పేదమనస్సు కలవాళ్ళకి అటుపట్టులాగ ఉండదండీ అది! పెర్త్ని పిలిచి మన రెండు చేతులనీ అతికించివేయమనండి! నేను ఈ చేతిని విడువలేను."

'ఇంతకంటె ఘోరప్రమాదాలకి నిన్ను తీసికుని వెళ్ళ వలసివస్తే తప్ప, నీ చేతిని నేను విడువను. నా గదిలోకి రా. దేవతలే దయాళువులూ, మానవుడే క్రూరుడూ అనుకొనే వాళ్ళంతా ఒక్కసారి ఇటు చూడండి! సర్వజ్ఞులైన దేవతలు మానవుని బాధకు ఎంత పరాఙ్ముఖులో చూడండి! తాను ఏమిచేసున్నాడో తెలియకపోయినా మానవుడు ఎంత దయాప్రేమభరిత మధురస్వభావుడో చూడండి! రా! నీ నల్లటిచేతిని పట్టుకొని నిన్ను తీసుకొని వెడుతూవుంటె నాకు చక్రవర్తితో కైదండగూర్చి నడుస్తూ వున్నంత గర్వంగా ఉంది"

మాన్సమూర్ ఇది చూచి, "ఇద్దరు వెళ్ళుతున్నారు. ఒకడు బలవంతుడు, రెండవవాడు బలహీనుడు! అయ్యయ్యో! రాత్రిడు అంతా వచ్చింది. గడిసి ముద్దయింది. ఇంకా దీన్ని బాగుచేయుటమేమిటి! కొత్తని తెచ్చుకోవాలి. ప్టబ్ని అడుగుతాను దీని సంగతి" అన్నాడు.

75. లైఫ్‌బాయ్.

ఆహాబ్ తయారు చేసిన దిక్సూచి సహాయంతో అతను చేసిన 'లాగ్' తనవేగాన్ని తెల్పుతూ ఉండగా, 'పెకోడ్' ఆగ్నేయదిశగా, భూమధ్యరేఖవైపు వెళ్తూవుంది. ఎక్కువ సంచారములేని సముద్రముమీద దీర్ఘ ప్రయాణం చేస్తున్నాం. ఎక్కడా ఒక్క ఓడ కూడా కనబడ లేదు. ఋతు పవనాలు కెరటాలపై మెల్లగా వీస్తున్నాయి. అంతా చాలా ప్రశాంతంగా ఉంది. కాని, ముమ్ముందు ఏమి మూడ నున్నదో!

చిన్న చిన్న రాళ్ళ గుట్టలతో ఏర్పడిన ద్వీపాల మధ్యగా, భూమధ్యరేఖ ప్రాంతాన ఉండే వేటస్థలాన్ని సమీపిస్తున్నాం. ఇంకా తెల్లవారలేదు. చీకటిదట్టంగా ఉంది. ఫ్లాస్క్ పర్యవేక్షణక్రింద పహరా సాగుతోంది. హఠాత్తుగా అతిభయానకరమైన ఆర్తనాదమొకటి వినవచ్చింది. అందరూ నిద్రలేచారు విస్మయంతో. కదలలేక ఎక్కడివాళ్ళు అక్కడే ఉండిపోయారు. నౌకలోని క్రిస్టియన్లు ఆ కేక సముద్రకన్యదై యుంటుందని వణికి పోయినారు. కాని, ఈటెగాళ్ళు ఏమీ చలించలేదు. అందరికంటె వృద్ధుడు, మాన్క్స్‌మాన్, ఆ కేకలు నీటిలో మునిగిపోతున్న మనుష్యులవి అన్నాడు.

తన గదిలో పడుకొన్న అహాబ్‌కు తెల్లవారే వరకూ ఈ సంగతి తెలియలేదు. అతను తట్టుమీదకి వచ్చినప్పుడు

ఫ్లాస్క్ — ఆ ఉదంతాన్ని వివరిస్తూ మధ్య మధ్య ఆ యాగోళ్రికంలో గల నిగూఢార్థాన్ని సూచించాడు. ఆహాబ్ ఒక పెడనవ్వు నవ్వి, ఆ వింతను ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

ఓడ అప్పుడే దాటిన, ఆ రాతిపొట్టు లంకలు, 'సీల్' అనబడే సముద్ర జంతువులకు నెలవులట. తల్లిని కోల్పోయిన పిల్లలో, పిల్లలు కలబడి తల్లులో, ఓడ దగ్గరకు వచ్చి మనుష్యుల లాగానే ఏడవటం మొదలుపెట్టి యుంటాయట! ఈ మాట విన్న తరువాత కొంతమంది నావికులకు కలవరపాటు ఎక్కువైంది. చాలామందికి సీళ్ళంటే మూఢ నమ్మకా లుంటాయి. దీనికి కారణం, అవి మనుష్యుల వలెనే బాధలు పడటం, మనుష్యులనే పోలివుండటం, కావచ్చు. సముద్రంలో అవి మునిగి ఉన్నప్పుడు, వాటిని చూచి, మనుష్యు లనుకొని పొరబడటం కూడా కద్దు.

'నావికుల శంకలు సముచితమైనవే' అని నిర్ధారణ చేయటానికా అన్నట్టు ఆ నాటి ఉదయం వాళ్ళలో ఒకనికి ప్రమాదం వాటిల్లింది. సూర్యోదయవేళ అతను తన పక్క నుంచి, ఓడ స్తంభం దగ్గరకు వెళ్ళాడు: అతను పూర్తిగా నిద్ర మేల్కొనలేదో, ఏమో ఇప్పుడు చెప్పలేముగాని, అతనక్కడ కాసేపు ఉన్నాడో లేదో, ఒక పెద్దకేక వినబడింది. అది విని అంతా పరుగెత్తి పైకి చూడగా గాలిలోనుండి పడుతున్న ఒక వ్యక్తి, క్రిందికి చూడగా నీటిమీద తెల్లని బుడగల గుంపూ కనబడ్డాయి! అతను పట్టుకొని లేవటానికి ఒక "లైఫ్ బాయ్" ని విసిరారు. అది సన్నగా, పీపాలాగ

ఉంటుంది. కాని దానిని పట్టుకోవటానికి నీటినుండి చేయి లేవలేదు. చాలాకాలం ఎండలో ఎండి ఉన్నదేమో, ఆ పీపా త్వరగా నీటిని పీల్చుకొని బరువెక్కి నీట మునిగి పోయింది. నీటిలో పడిపోయిన వానికి తలక్రిందుగా పడిపోవటమే తెలుస్తుంది, అంతే.

తెల్లతిమింగిలం తిరిగే ఆ ప్రదేశంలో దాని జాడ చూడటానికి స్తంభంమీదికి ఎక్కినవాడు ఆ విధంగా గతించాడు. కాని, ఈ సంగతి అప్పుడు ఎందుకో తట్టలేదు. అసలు ఈ సంఘటన చాలామందికి విచారము కల్గించలేదు. ఇది భావి సూచకంగా కాక, గడచిన ప్రమాదానికి పర్యవసానంగా భావించారు. రాత్రి వినవచ్చిన కేకలకు అర్థమేమిటో ఇప్పుడు తెలిసిందన్నారు. మాన్క్సమాన్ మాత్రం కాదన్నాడు.

పోయిన లైఫ్‌బాయ్‌కి బదులు ఇంకొకటి తయారు చేయించవలసిన పనిని స్టార్‌బక్‌కు అప్పగించారు. కాని దానికి తగిన తేలికపాటి పీపా ఏదీ కనబడలేదు. ప్రయాణం యొక్క అంతిమ దశ దగ్గరపడుతోంది. అది ఎలా పరిణమిస్తుందో ఎవ్వరికీ తెలియదు. ఆ అంతిమదశకు సంబంధించిన పనితప్ప వేరే ఏదీ చేయటానికి ఎవ్వరికీ మనస్సు ఒప్పటంలేదు. చివరకు క్వీక్వెగ్ తన శవపేటికను సూచన చేశాడు.

"లైఫ్‌బాయ్, శవపేటికా!" అన్నాడు స్టార్‌బక్.

"తమాషాగా ఉంటుంది కాదూ" అన్నాడు స్టబ్.

"బాగానే ఉంటుంది – మన వడ్రంగి దానికి కావలసిన ఏర్పాట్లు చేయగలడు" అన్నాడు ఫ్లాస్క్.

విచారంగా శాస్త్ర ఆలోచించి, "సరే, పట్టుకోని రా" అని స్టార్‌బక్, "వడ్రంగీ! దానికి చేయవలసిన పనేదో త్వరగా కానిమ్మని" అన్నాడు.

"మూతను బిగించివెయ్య మంటారా!" అని చేతిని సుత్తిలాగ కదిపాడు.

"ఆc"

"అతుకులను మూసివేయు మంటారా!"

"ఆc"

"వాటిమీద తారు పూయుమంటారా"

"ఆc! ఆc! నీకు దయ్యం పట్టిందా? శవపేటికను లైఫ్ బాయ్ గా తయారు చేయ్. స్టబ్, ఫ్లాస్క్ — నాతో రండి"

"విసురుగా పోతున్నాడు. నాకేమీ నచ్చలేదు. నేను కెప్టెన్ ఆహాబ్ కు కాలు చేసిపెట్టాను. అతను పెద్దమనిషి. దానిని తగిలించుకొన్నాడు. క్వీక్వెగ్ కి మెచ్చుకున పెట్టె చేసి పెట్టాను. దానిలో అతను శిరస్సు పెట్టలేడు. ఆ శవపేటిక చేయడంలో నేను పడ్డ శ్రమ అంతా దండగేనా! ఇప్పుడు దానితో లైఫ్ బాయ్ చెయ్యాలట! పాతకోటు తిరగవేసి కట్టమన్నట్టుంది. ఈ పని, చెప్పులు కుట్టటం వంటిది. నాకేమీ నచ్చలేదు! అది నా పనికాదు! ఈ మరమ్మత్తు పనులు చెయ్యటం నా వల్లకాదు. నాకు వచ్చేవి పరిశుద్ధ పనులు, అంటే సవ్యంగా ఒక మొదలూ, నడుమ, తుదీ ఉన్న పనులు ఉన్నమాట. నాది చెప్పులుకుట్టే పనిలాగు మధ్యలో తుదీ, తుదిలో మొదలు ఉండే పని కాదు. ఇలాటి

పిచ్చిపనులు బరాయించటం ముసలివాళ్లు చేసే చమత్కారం! సరే చూద్దాం! మూడతని మేకులతో బిగించివేయాలట-అతుకులు మూసివేయాలట. తారు పూయాలట. చివరికి ఓడ వెనుక వ్రేలాడ గట్టాలట! శవపేటికతో ఇటువంటి పనులు ఎప్పుడైనా చేశారా? ఇటువంటి పనులు చెప్తే కొందరు వడ్రంగులు బెంబేలు అయిపోతారు! నేను అలా అయిపోను. కాని, ఏమయితేనేం-పని చేయవలసిందే. పెళ్ళికుమార్తెలకు కావలసిన మంచాలు చెయ్యాలి, శవపేటికలూ చెయ్యాలి. నెలవారీగానో, రోజువారీగానో, మకతాగానో చెయ్యవలసిందే. అది చెప్పులు కుట్టడంవంటి పని కాకపోతేసరి. పనిచేసి అవతల పడేస్తాను! ఈ ఓడమీద ఎందరున్నారో! జ్ఞాపకం లేదు! ముప్పైమందైనా ఉండక పోతారా? ఈ ఓడ మునిగిపోతే, ఆ ముప్పదిమందీ ఒక్క శవపేటికకోసం తగువులాడుకొంటారు. అలాటి దృశ్యం ఎక్కడోగాని సాధారణంగా కనబడదు. సరే, పని మొదలుపెడతాను" అనుకొన్నాడు వడ్రంగి.

76. ఓడ తట్టు

(శవపేటికను తన బల్లదగ్గర పెట్టుకొని వడ్రంగి పని చేస్తూ వుంటాడు. అహాబ్ వస్తూ తన వెనుకనే పిప్ వస్తున్నట్లు కనిపెడతాడు.)

"వెనుకకు వెళ్ళిపో నాయనా, నీ వద్దకు ఇప్పుడే వస్తాను. వెళ్ళిపోయాడు! అతనివలె నా చెయ్యికూడా నా మాటను అంత మన్నించదు. ఏమిటి ఇక్కడ?"

"లైఫ్ బాయ్ సార్! స్టార్‌బక్ ఉత్తర్వు!- అక్కడ తలుపుంది జాగ్రత్తా"

"సరే, ఈ శవపేటిక పని! వస్తుంగదే"

"అవునండి-"

"నీవేగా కాళ్ళు తయారు చేసే వడ్రంగివి - ఈ కాలు నీవేగా చేసి ఇచ్చావు?"

"అవునండి- బాగా పని చేస్తూ వుందా! అయ్యా"

"పనికి వస్తోందిలే. నీవు శవపేటికలను కూడా చేస్తావు కాదూ! శవాలుకూడా మోస్తావా!"

"అవునండి - క్వీకెగ్‌కి కావాలంటే, దీన్ని తయారు చేశాను. ఇప్పుడు ఇంకొకటి చెయ్యాలట దీనితో"

"నా కొక సంగతి చెప్పు. అన్నింటిలో కల్పించుకొనే దుష్టుడవు కావా నీవు! ఒకరోజున కాళ్ళు చేస్తావు. ఆ మర్నాడు శవపేటికలు చేస్తావ్! ఆ శవపేటికలతోనే లైఫ్

కాయ్ లని చేస్తానంటావ్! దేవతల్లాగానే నీవు కూడా నీతి నియమాలు లేనివాడవు, వాళ్ళలాగానే అన్నిటిలో వేలు పెడ్తానంటావ్?"

"నా దేముందండీ? ఏది చేయమంటే అది చేస్తాను"

"సరిగ్గా దేవతల మాటలే ఇవి. శవపేటిక దగ్గర పని చేసేటప్పుడు నీవు పాటలు పాడుతూంటావా? స్మశానంలో కాటికాపరి శవాలను పాతిపెట్టటానికి గోతులు త్రవ్వుతూ పాటలు పాడుతాడట!"

"అయ్యో, పాటలా! నేనే! సంగీతమంటే నాకు మోజు లేదులెండి! కాటికాపరి పాడటానికి కారణం అతని పాత నుండి శాశ్వతమైన ధ్వనులు రాకపోవటం, నా పనిముట్లు అటువంటివి కావండి. ఇదిగో వినండి"

"దాని కేదో శబ్దపేటిక ఉంది కాబట్టి ఆ ధ్వని వస్తోంది. కాని, వస్త్రంగీ- లోపల కళేబరం ఉంటే శవపేటిక కూడా ఇటువంటి ధ్వనులే చేస్తుంది కాదూ? నీ కెప్పుడైనా శవపేటికను మోసుకొని వెళ్ళి, స్మశానపు దొడ్డి ద్వారమును శవపేటిక కొట్టడం విన్నావా?"

"అయ్యో-"

"అయ్యో ఏమిటి?"

"ఏమీ లేదండి"

"సరే కానీ-"

"నేనండీ"

"అప్పుడుగాని నీవు స్వయంపూర్ణుడవు గునా ఏమిటి? దానిలాగ నీవుకూడా నీ పొట్టలోనుంచి గూటికి కావలసిన దారం నీవే

వదలుతూ ఉంటావా ఏమిటి! నీ ఎదురొమ్ము చూసుకో-ఆ దారపు పరాలు నా కంట పడనీయకు-పో-పని తెముల్చు!"

"ఇదీ వరుస- హఠాత్తుగా వస్తాను, పోతాను. ఈ ప్రాంతాలలో గాలివానలు కూడా అలాగే వస్తూవుంటాయి. "ఐల్ ఆఫ్ ఆల్బర్‌మార్లె" ను భూమధ్యరేఖ రెండుగా విభజిస్తుంది. ఈ ముసలి వానిని కూడా అలాంటి రేఖే ఏదో రెండుగా చేస్తుంది కాబోలు. ఎప్పుడు భగభగ మండుతూనే ఉంటాడు. ఇటే చూస్తున్నాడు! త్వరగా పని కానివ్వాలి!"

(అహాబ్, స్వగతం)

ఏమి దృశ్యం! ఏమి ధ్వని! ముసలి వడ్రంగిపిట్ట డొల్ల పోయిన చెట్టు తొలుస్తోంది. ఆ వడ్రంగి బల్లమీద ఉన్నది చూడండి! వీడు చాలా దుష్టుడు. (టక్-టక్!) అలాగే జీవితపు గడియలు కొట్టుకొంటూ ఉంటాయి. అంతులేని ఆలోచనలు తప్ప ఈ భౌతిక ప్రపంచములో మరేమీ లేదు. ఆదిగో మృత్యు చిహ్నమైన, ఆ పేటిక కొద్ది మార్పుతో ప్రమాదంలో ఉన్న జీవికి పెన్నిధి అవుతుంది. శవపేటిక నుండి లైఫ్ బాయ్! అ తకంబె విచిత్రమేమిటి! శవపేటిక అమరత్వం ప్రసాదించేది ఎల కాకూడదు? దీని గురించి ఆలోచించాలి, సరే. ఇప్పటికే చాలా దూరం వెళ్ళాను! ఏయ్, వడ్రంగి! ఆ పిచ్చిగొడవ ఆపుతావా లేదా? నేను మళ్ళీ ఇటు వైపు వచ్చేప్పటికి ఇదేమీ ఇక్కడ వుండకూడదు-. ఏప్! దీన్ని గురించి మాట్లాడుకోవాలి, రా! నీ వద్ద వేదాంతార్థాలన్నీ నేర్చుకొంటున్నాను. అజ్ఞాత లోకాలయింది, నాకేదో జ్ఞానం లభిస్తున్నట్టుగా తోస్తుంది"

77. "రెషెల్" ఓడ

ఆ మర్నాడు 'రెషెల్' అనే ఒక పెద్ద ఓడ మాకైపు వచ్చింది. దాని నిండా మనుష్యులే. 'పెకోడ్' మంచి వేగంగానే పోతూవుంది గాని, ఈ గాలివాటున వెళ్ళుతున్న పెద్ద ఓడ సమీపిస్తూవుంటే, మా తెరచాప లన్నీ గాలిపోయిన తిత్తుల లాగ అయిపోయాయి.

మాన్స్‌మాన్, "ఇదేదో చెడ్డ కబురు తెస్తూవుంది" అన్నాడు. ఆ ఓడ కెప్టెన్ నిలబడి, నోట బాకాను పెట్టుకొని, మమ్మల్ని పిలిచే లోగానే, అహాబ్, "తెల్లతిమింగిలాన్ని చూశారా" అంటూ అరిచాడు.

"చూశాం నిన్న. ఏదైనా పడవ కొట్టుకు పోవడం మీరు చూశారా !"

తన సంతోషాన్ని అణిచిపెట్టుకొంటూ, ఆ కెప్టెన్ అడిగిన ప్రశ్నకు 'లేద'ని సమాధానం చెప్పాడు అహాబ్. తనే ఆ ఓడ మీదకి వెళ్ళేవాడు, కాని ఇంతలోనే ఆ కొత్త కెప్టెన్ తన పడవమీద మా ఓడ దగ్గరకు వచ్చాడు. అతను మా ఓడను ఎక్కగానే, అతను కూడా నన్‌టుకెట్‌కి చెందిన వాడే నని అహాబు గుర్తించాడు. కాని, కుశలప్రశ్న లేమీ వేయక, ఆతురతతో—

"ఎక్కడుంది ! ఇంకా ఎవ్వరూ చంపలేదూ ! ఎలా వుంది!" అంటూ అతనికి దగ్గరగా వెళ్ళాడు.

జరిగిన వృత్తాంత మిది. ఆ క్రిందటి రోజు మధ్యాహ్నం ఒక తిమింగిలాల గుంపును తరుముతూ ఆ ఓడకు చెందిన మూడు పడవలు నాలుగైదు మైళ్ళ దూరం వెళ్ళాయి. వాళ్లు అట్లా వెళ్ళగానే, వెనుక ప్రక్కగా 'మాబీడిక్' తల కాయ కనబడింది. దాన్ని చూడగానే నాలుగవ పడవను కూడా దింపారు. అతివేగంగా వెళ్ళి ఆ తిమింగిలంను చేరుకొంది ఆ పడవ. అంతకంతకు దూరమయిపోయి, ఓడవద్ద నుంచి చూచేవాళ్ళకు చిన్న చుక్కంత కనబడింది. అంతలో పెద్ద కొండంత ఎత్తున నీరు లేచింది. ఆ తరువాత ఏమీ లేదు. ఆ తిమింగిలం త్రాటితో కూడా పడవను లాగుకొని పోయింది. ఏదో కొంత అనుమానం కలిగింది కాని, ఎవ్వరూ భయం శంకించలేదు. పడవలను తిరిగి రమ్మని జెండాలెత్తారు. గాలివాటున ఉన్న మూడు పడవలను చేరుకోవటానికి ఓడ వెళ్ళింది. అర్ధరాత్రిదాకా దాని సంగతి విడిచిపెట్టారు. మిగిలిన పడవలు చేరుకొన్నాయి. ఆ పైని, దూరానికి దీపం వలె కనబడేలాగున, ఓడలో పెద్ద నిప్పు రగిలించి, ఆ పడవను వెతుకుకొంటూ చాలా దూరం వెళ్ళారు. ఆ వెదకటం తెల్లవారేదాకా జరుగుతూనే ఉంది, కాని దాని జాడ లేదు.

కథ చెప్పటం ముగియగానే ఆ కెప్టెన్ తాను 'పెకోడ్' మీదకి ఎందుకు వచ్చిందీ చెప్పాడు. తన అన్వేషణలో 'పెకోడ్' కూడా సహాయపడాలని, తన ఓడతోపాటు నాలుగైదు మైళ్ళ ఎడములో ప్రక్కగా 'పెకోడ్' రావాలని కోరాడు.

ఇది విని స్టబ్, ఫ్లాస్క్‌తో గుసగుస లాడాడు: "పందెం వేసి చెప్తున్నాను విను. ఆ పోయిన పడవలో ఎవడో ఈ కెప్టెన్ కోటును, గడియారాన్ని తీసికొని పోయి ఉంటాడు. వాటిని తిరిగి తెచ్చుకోవాలని ఇతని ఆతురత. మంచి వేట సమయంలో రెండు ఓడలు, కనిపించకుండా పోయిన ఒక చిన్న పడవ కోసం వెదకటం చోద్యం కాదూ! ఫ్లాస్క్! చూడు ఎంత వెలవెల బోయి ఉన్నాడో అతను — కోటు కాదేమో పోయింది"

"నా కుమారుడు ఆ పడవలో ఉన్నాడు. మీ పుణ్యం ఉంటుంది- వేడుకొంటున్నాను-" మౌనంగా, నిశ్చలంగా అతని మాటలు వింటూ ఉన్న అహాబ్‌తో ఇంకా ఇలా అన్నాడు, "నలభై ఎనిమిది గంటలసేపు మీ ఓడను నాకు అద్దె కిచ్చెయ్యండి- దానికి మీకు కావలసిన డబ్బు ఇస్తాను- ఒక్క నలభై ఎనిమిది గంటలే- ఇవ్వాలి"

'అతని కొడుకట!" అన్నాడు స్టబ్. "అతని కొడుకట పోయింది. కోటు, గడియారమన్న నా మాటలు ఉపసంహరించుకొంటున్నాను. అహాబ్ ఏమంటున్నాడు? మనం ఆ కుర్రవానిని రక్షించాలి కదూ!"

మాన్స్‌మాన్ వాళ్ళ వెనుక నిలబడి, "ఆ కుర్రవాడు మిగిలిన వాళ్ళతోపాటు రాత్రి మునిగిపోయాడు! అతని కేకలు నేను విన్నాను. వాళ్ళ ఆత్మఘోషలు మీ రందరూ కూడా విన్నారు" అన్నాడు.

ఆ తరువాత ఇంకొకటి తెలిసింది. 'రేచెల్' యొక్క గాథ శోచనీయత పెరగటానికి కారణ మేమంటే, తప్పిపోయిన పడవలో ఉన్న కొడుకే కాక, ఇంకొక కుమారుడు మిగిలిన మూడింటిలో ఒక దానిలో ఉండటం. ఈ మూడు పడవలు కూడా వేటకై దూరంగా వెళ్ళిపోయాయి. తండ్రి సందిగ్ధావస్థలో పడ్డాడు. అతని ఆందోళనకు అంతులేదు. అటువంటి విపత్కర పరిస్థితులలో సాధారణంగా, ఓడ శక్యమైనంతవరకు ఎక్కువ పడవలను, మనుష్యులను రక్షించటానికే పూనుకొంటుంది. ఈ రెండవ కొడుకు సంగతి ఆ కెప్టెన్ మొదట బయటపెట్టలేదు. అహాబ్ మనస్సు కరుగుతుందేమో అనే ఆశతో ఆ సంగతికూడా బయటపెట్టవలసి వచ్చింది. తప్పిపోయిన తన కొడుకు పన్నెండేళ్ళ ప్రాయంవాడేనట. వాళ్ళ జాతివారందరికు వంశానుగతమైన ఆ వృత్తియొక్క అపాయాలనూ, అద్భుతాలనూ చూపిద్దామని ఆ కుఱ్ఱవానిని వెంట తీసుకొని వచ్చాడట. నన్‌టుకెట్ వాసులలో ఇదొకటికూడా తరుచూ జరుగుతూ వుంటుంది. కొందరు కెప్టెన్‌లు, తమ కుమారులను లేతవయస్సులోనే, మూడు నాలుగేళ్ళ పాటు ఇతర ఓడలలో తిరగటానికి పంపిస్తూ వుంటారు. దీనివల్ల తిమింగిలాల వేటలో వాళ్ళు ప్రత్యక్షంగా సముపార్జించుకొనే జ్ఞానంకు, తండ్రుల అతి వాత్సల్యం భంగకరం కాకుండా ఉంటుందట.

పాపం! ఆ కెప్టెన్ ఈ వరం ప్రసాదించమని అహాబ్‌ని ప్రాధేయపడుతున్నాడు. కాని సమ్మెటపోట్లు పడుతూవున్నా ఏమీ చలించని పట్టెడలాగ నిలబడ్డాడు, అహాబ్.

"మీరు ఒప్పుకోనేదాకా నేను కదలను. ఇటువంటి విపత్తే మీకూ సంభవిస్తే ఏమి చేసేవారో, నాకూ అట్లాగే చేసిపెట్టండి. మీకు కూడా ఒక కొడుకు ఉన్నాడు కెప్టెన్ అహాబ్! మీ వార్ధక్యంలో పుట్టిన కుర్రవాడు, ఇప్పుడు క్షేమంగా ఇంటిదగ్గర ఉన్నాడు అంతే. ఇదుగో మీ మనస్సు కరుగుతోంది—ఒరేయ్ కుర్రవాళ్ళూ— పరుగెత్తండి, ఓడ తిప్పండి"

అహాబ్, "ఆగండి! ఒక తాడును ముట్టుకోవటానికి వీల్లేదు" తరువాత ఒక్కొక్క మాటే ఉచ్చరిస్తూ "కెప్టెన్ గార్డినర్, నేను ఒప్పుకోను. ఇప్పటికే నాకు సమయం చాలా వృధాపోయింది. మీరు వెళ్ళండి. భగవంతుడు మిమ్మల్ని కాపాడుగాక! నన్ను నేనే క్షమించుకోలేను— కాని నేను వెళ్ళాలి, స్టార్‌బక్! ఇంకొక మూడు నిమిషాల తరువాత, మన ప్రాంతానికి ఏ ఓడ రాకూడదంటూ జెండా ఎగుర వేయించి ఓడని పోనీ—" గిఱ్ఱున ముఖం తిప్పివేసుకొని తన గదిలోకి వెళ్ళిపోయినాడు, ఆ కొత్త కెప్టెన్ తన ప్రార్థన అంత నిర్దయగా, మొగమాటమైనా లేకుండా తిరస్కరింప బడినందుకు నిశ్చేష్టుడై పోయినాడు. కొంతలో తేరుకొని, గబగబా తన పడవలోకి వెళ్ళి, తిరిగి తన ఓడని చేరుకొన్నాడు.

రెండు ఓడలకూ మార్గాలు వేరైనాయి. ఆ రెండో ఓడ కనుచూపు మేర వెళ్ళేవరకు, అది ఏ చిన్నగుట్ట కనబడినా అక్కడ ఆగి వెతకులాడుకొంటూ ఉండటం కానవచ్చింది.

అది ఇటూ, అటూ వెళ్ళుతూవుంది. నిర్దయుడైన సముద్రుడు తన తలను వేసి కొట్టుకుంటూవుంది. దాని స్తంభాల నిండా నావికులు ఎక్కి అన్నిదెసల పరీక్షగా చూస్తున్నారు.

పడవ తడబడుతూ అటేడ వెళ్ళటంచూస్తే, దాని దైన్యమంతా వ్యక్తమవుతూవుంది. కానరాని తన బిడ్డలు గతించి పోయినారని విలపిస్తూవుంది.

78. కెప్టెన్‌గది

(పైన తట్టుమీదికి వెళ్ళటానికి అహాబ్ లేస్తాడు. అతని చేతిని పట్టుకొంటాడు పిప్, వెంట వెళ్ళటానికి.)

"నాయనా, ఇప్పుడు నీవు అహాబ్ వెంట రాకూడదు. నన్ను చూచి నీవు భయపడవలసిన గడియలు ఇంకా రాక పోయినా, నాకు దూరంగా ఉండవలసిన గడియ వచ్చింది. నా రోగాన్ని ఉపశమింప చేసేదేదో నీలో ఉందోయ్. నీవు ఇక్కడే ఉండు. కెప్టెన్‌కు మాదిరిగా వీళ్ళు నీకు పరిచర్యలు చేస్తారు. నా కుర్చీలో కూర్చో. దానిలో ఒక భాగమైపో"

"కాదండీ కాదు. మీది అసంపూర్ణ శరీరం. మీకు కాలు లేదు. ఈ దీనుని ఆ కాలుగా ఉపయోగించుకోనండి. నామీదనడవండి, అంతే నేను కోరేది. మీకు అలా చేస్తే నేను మీలో ఒక అవయవమైపోతాను."

"ఈ ప్రపంచంలో ఎందరు దుర్మార్గులున్నా, విశ్వాస పాత్రులైన సుజనులుకూడా లేకపోలేదనే నమ్మకం కలిగిస్తూ వున్నాడు ఈ కుర్రవాడు. నల్లతోలువాడు! పిచ్చివాడు. వీడికి పిచ్చి కుదురుతూ వుందను కొంటాను"

"స్టబ్ ఒకసారి పిప్‌ని విడిచిపెట్టేశాడండీ! అందువల్లే అతని ఎముకలు నీళ్ళల్లోనాని తెల్లబడిపోయాయి. స్టబ్ అతన్ని విడిచిపెట్టినట్లు నేను మిమ్మల్ని విడువను. మీతోపాటు నేనూ వస్తాను"

“నాతో ఎక్కువ మాట్లాడకు. వీళ్ళ రాకపోకలకి వీల్లేదు”

“అయ్యో! అయ్యో!”

“ఇంకా అట్లాగే ఏడిచావంటే నిన్ను చంపివేస్తాను. నాకూ కోపం పుట్టుకొస్తోంది. జాగ్రత్త! నా కాలిచప్పుడు కట్టుమీద వినబడ్డప్పుడల్లా నేను ఇక్కడే ఉన్నానని తెలుసుకొంటూ ఉండవచ్చు. నేనిక వెళ్లాలి. నీవు మంచివాడవు నాయనా! దేవుడు నిన్నెప్పుడూ రక్షించుగాక!”

(అహాబ్ వెళ్లిపోతాడు. పిప్ ఒక్క అడుగు ముందుకి వేస్తాడు).

ఒక్క నిమిషం క్రితం అతను ఉన్నాడిక్కడ. ఇప్పుడు నేను ఒంటరివాడనైనాను. పోనీ, పిప్ ఉన్నా ఈ ఒంటరితనాన్ని భరించగలిగేవాడనే. వాడూ కనబడకుండా పోయాడు! పిప్! డింగ్-డాంగ్-డింగ్! పిప్‌ని ఎవరైనా చూశారా! ఇక్కడే ఎక్కడో ఉండాలి వాడు-ఈ తలుపు తీసి చూద్దాం. ఇదేమిటి! దీనికి తాళంలేదు, గొళ్ళెంలేదు. అయినా తెరవడం వీలుపడటంలేదే. ఆయన మంత్రం పెట్టి ఉండాలి. నన్ను ఇక్కడే ఉండమన్నాడే. ఈ కుర్చీకూడా నాదే అన్నాడు. నేను కూర్చుంటాను. ఓడకి మధ్యస్థంగా ఉంది. ఇక్కడే నావికాదళాధిపతులు కూర్చుని, కెప్టెన్ల మీద, ఇంకా ఇతర ఆఫీసర్ల మీద అధికారం చెలాయించేవారట! హా! ఇదేమిటి! వీళ్లందరి భుజాలకి చాలా అలంకారాలు ఉన్నాయే! అలంకారాలు! అందరికీ బ్రాంది ఇవ్వండి.

మీరంతా తాగుతూ—వుంటే నా కళ్ళకి పండుగలాగ ఉంది. చాలా పెద్ద హోదాలలో ఉన్న తెల్లవాళ్ళకి ఈ నీగ్రో ఆతిథ్యం ఇవ్వటం విచిత్రంగా ఉంది కదూ? మీరు పిప్‌ని చూశారా! చిన్న నీగ్రో కుఱ్ఱవాడు. అయిదడుగులు పొడవుంటాడు—దీనంగా బెదురుతూ చూస్తాడు! వాడు తిమింగిలాలవేటకి వెళ్ళి పడవమీదనుంచి గెంతేశాడు. చూశారా వానిని? కానీండి-తాగండి. పిరికివాళ్ళందరికీ సిగ్గు కలగాలి! బల్లమీద ఒక కాలుపెట్టి నిలబడండి! ఉష్! పైన దంతపు కాలిచప్పుడు వినబడుతోంది. ఓ! ఆయనపైన నడుస్తూవుంటే మనస్సు కృంగిపోతోంది. మీరన్నట్టు, ఇక్కడే నిలబడతా. ఓడ రాతిగుట్టలకు కొట్టుకుని, పగిలి నీరుపోసుకొని మునిగిపోయినా సరే! ఇక్కడే ఉంటా!

79. టోపి

ప్రపంచం నాలుగు మూలలూ చుట్టి, తనవైరిని హతమార్చటానికి వీలుగా మహాసముద్రంలో ఒకమూలకు తరమటంవల్లనూ, తనకు దుర్భరమైన గాయం తగిలినప్రాంత మదే కావటంవల్లను ఆ క్రితం రోజే 'మాబీడిక్' వేరొక ఓడకి ఆ ప్రాంతంలోనే కనబడటంవల్లను అంతవరకూ అతనికి అందిన వార్తలబట్టి 'మాబీడిక్' తన వెంబడబడేవాళ్ళను రాక్షసంగా తృణీకరిస్తూ తరిమికొట్టుతూ వుందని తెలియటంవల్లనూ- అహాబ్ కళ్ళల్లో లఘువిత్తులు చూచి భరింపలేని, భావరేఖ ఏదో మెరిసింది.

ఉత్తరధ్రువ ప్రాంతాన్ని ఆవరించే ఆరునెలల కటిక చీకటిలోనూ, ధ్రువతార ఎప్పుడూ తన కాంతిని ప్రసరించునట్టే, ఓడయందలి నావికుల చింతాంధకార పూరిత హృదయాలలో అహాబ్ యొక్క పరమలక్ష్యం అరనిజ్యోతిలాగ వెలిగింది. అదే వాళ్ళందరిమీదా నిరంకుశత్వమును చెలాయించింది. వాళ్ళ అనుమానాలు, భయాలు, ఆశలు. మనస్సులలో దాగక ముఖాకారములలో వ్యక్తమాతున్నాయి.

సమయం దగ్గర పడుతున్నకొద్దీ, సహజమైనా, కృత్రిమమైనా, మందహాసాలు, హాస్యవచనాలు, మాయమైపోయినాయి. నవ్వించటానికి స్టబ్ ప్రయత్నం చేయలేదు.

సహృదయాపహరోపటానికి స్కార్బర్ కూడా అవకాశం దొరకలేదు. సంతోషము, దుఃఖము, ఆశ, భీతి అన్నీకలిసి అహాబ్ యొక్క శిలామయాంత్రాల్లో పడి నలిగి చూర్ణమై పోయినాయి. యంత్రాలవలె వాళ్ళంతా మూగగా డెక్కుమీద మెదులు తున్నారు. ఎప్పుడూ వాళ్ళమీద అహాబ్ యొక్క నిర్దయ క్రూర వీక్షణము పడుతూనే ఉన్నదన్న భావశంకతో నిర్జీవులై పోయినారు.

జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక్కొక్క సమయంలో అహాబ్ కళ్ళలోకూడా ఏదో భీతి కనబడుతూ ఉండేది. ఆ సమయాలలో తనమీద కూడా ఏదో దృష్టి పడుతూవుందని అతను భావిస్తాడు కాబోలు! అతిగూఢమైన పార్శీవాని దృక్కులకు అతను బెదిరిపోతూవున్నట్లు గ్రహించవచ్చు. ఫెడెల్లా (పార్శీవాడు) వింతగ కనబడుతున్నాడు. అతనికి తెర చాటుగా ఏదో గుబులు పుట్టుతూ ఉండేది. అతని వాలకం ఎవరికీ అర్థమయ్యేది కాదు. అతను నిజంగా మనిషేనా లేక ఏదో అగోచరశక్తి వశమున చలించే ఛాయయా అని భ్రమపడే వారు. పైగా, ఆ నీడ ఎప్పుడూ డెక్కుమీద తచ్చాడుతూనే ఉండేది. రాత్రివేళకూడ ఫెడెల్లా నిద్రపోతున్నట్టుగాని, క్రిందికి వెళ్ళినట్టుగాని అనిపించేది కాదు. అతను గంటల తరబడి నిల్చియుండేవాడు. కూర్చునేవాడు కాదు. దేనికీ ఆనుకునేవాడు కూడా కాదు. అద్భుతావహమైన అతని రెండు కళ్ళూ విశ్రాంతియెరుగని ఇద్దరు పహరావాళ్లు.

రాత్రిగాని, పగలుగాని నావికులు ఓడతట్టుమీదకి ఎప్పుడు వచ్చినా వాళ్ళకి అహాబ్ దర్శన మవుతూనే ఉండేది. అతను తట్టుమీద పచారునైనా చేస్తూ ఉండేవాడు, లేదా తనగదినుండి తట్టుమీదకి వేసియున్న మెట్లమీదనైనా నిల్చి యుండేవాడు కళ్ళమీదికి వాలియుండేటట్టుగా టోపీ పెట్టుకొనేవాడు. అతను కదలకుండా నిలబడియున్నా పక్కమీద ఊరకపడుకొనియున్నా అతని కళ్ళు మూసుకొని ఉన్నాయో, తనవంకే పరీక్షగా చూస్తున్నాయో ఎవ్వరూ చెప్పలేక పోయేవారు. ఒకొక్కసారి అతను మెట్లమీద గంటల తరబడి నిలబడితే అతని బట్టలు గాలిలోని తేమకి తడిసినా, ఆ సంగతి ఎవ్వరూ అతనికి జ్ఞప్తి చేయలేక పోయేవారు. రాత్రిపూట తడిసిన బట్టలు, పగటిపూట అతని ఒంటిమీదనే ఎండిపోయేవి. ఇట్లా రాత్రింబవళ్ళు అతను క్రిందికి వెళ్ళకుండా గడిపేవాడు. ఏది కావలసినా తనగదినుండి తెప్పించుకొనేవాడు.

అచ్చట బయట నిలబడే రెండుసార్లు భోజనం చేసేవాడు. (ప్రొద్దున్న మధ్యాహ్నం) రాత్రిపూట ఏమీ తినేవాడు కాదు; గడ్డము గొరిగించుకోవటం మానివేశాడు. అది బాగా మాసి పెరిగి నల్లబడిపోయింది. గాలివానలకు కూలబడి నేలమీదనే పాకుతూ పెరిగిన చెట్టు వేళ్ళవలె కానవచ్చేది. సర్వదా మౌనంగా అతను తట్టుమీద కాలం గడుపుతూ వుండగా అతనితో బాటే పార్శీవాడు ఎప్పుడూ తట్టుమీదనే ఉండేవాడు. ఇద్దరూ ఒకచోటనే ఎల్లవేళల కలిసియున్నా, ఒకరి

నొకరు పలుకరించి ఎరుగరు. వాళ్ళయిద్దర అనుబంధము అత్యంత దృఢమైనది. అయినా చూచేవాళ్ళకు మాత్రం ఉత్తర దక్షిణ ధ్రువాలలాగ తోచేవాళ్ళు. పగలు ఎప్పుడైనా ఒకసారి, మాటకలిపినా రాత్రిల ఇద్దరూ మౌనవ్రతం పట్టే వారు, అహబ్ మెట్లమీదా. పార్శీవాడు ఓడ స్తంభందగ్గరా నిలబడి ఒకళ్లనొకళ్లు తదేకధ్యానంతో చూసుకొనేవారు. పార్శీవానిని చూచి అహబ్ తన భావిసూచకమైన విప చ్ఛాయయనీ, అహబ్‌ని చూచి పార్శీవాడు తాను విసర్జించిన పిప్పియని అనుకొనేవాళ్లు కాబోలు.

ఏమయినా, అహబ్ ప్రతిక్షణమూ, ప్రతిఘడియా, ప్రతిరోజూ తన తాబేదారులకు తన ఆధిక్యం వ్యక్తం చేసి నట్లే, అక్కడకూడా తానే అధికారినని పార్శీవాడు తనబానిస మాత్రమేనని వ్యక్తపరుస్తూండేవాడు. అప్పటికి వాళ్ళిద్దరినీ అజ్ఞాతరాక్షసుడెవడో, తోడించి తరుము తున్నట్లు అనిపించేది.

తెలతెలవారుతూ వుండగా "ఓడ స్తంభాలను ఎక్కండి!" అంటూ అతని కేక వినబడేది. రోజులో ప్రతి గంటకీ ఒకసారి, "మీకు కనబడుతూవుందా! సరిగా చూడండి" అంటూ అతని గొంతు వినబడేది.

పోయిన బిడ్డలను వెతుకుకొంటూ వున్న 'రాచెల్' ఓడను కలుసుకొన్న తరువాత మూడునాలుగు రోజులు గతించాయి. అప్పటికీ తిమింగిలపు జాడతెలకపోయేప్పటికి, తన అనుచరులు విశ్వాసపాత్రులు కారేమో అని అహబ్

శంకించాడు. తన ఈటెగాళ్లు తప్ప అందరూ, తుదకు స్టబ్ ఫ్లాస్కులు కూడా, ఆ తిమింగిలం కనబడినా, చెప్పడం లేదేమో అని అనుమానపడ్డాడు. ఎన్నిశంకలున్నా వాటిని మాటలలో బయట పెట్టేవాడు కాడు. అది ఒక నేర్పు.

"తిమింగిలాన్ని మొట్టమొదటగా నేనే చూడాలి" అంటూ ఓడ స్తంభంమీద ఒకచిన్న బుట్టవంటి తొట్టిని ఏర్పాటు చేయించుకొన్నాడు. అందులో కూర్చొని ఒక్క క్షణంసేపు తన వాళ్ళందరి వైపూ చూశాడు. డాగో, క్వీక్వెగ్, టాష్టెగోలమీద చూపునిలిపాడు, ఫెడల్లా వంక చూడలేదు. చివరికి తనని పైకి తోయటానికి ఏర్పాటైన తాడు స్టార్‌బక్ దగ్గరకు విసరి, "తాడు నీ కిస్తున్నాను" అన్నాడు. బుట్టనిపైకి లేవనెత్తారు. పైకి వెళ్ళినవిమ్మట ఒక చేతిలో స్తంభాన్ని పట్టుకొని మైళ్ళతరబడి విస్తరించి యున్న సముద్రంవైపు అన్నిదిశల పారజూశాడు.

అంత ఎత్తున పైకిపోయిన నావికున కెవ్వరికైనా తాను నిలబడియున్న తాడు ఒక్కటే ఆధారం. ఈ తాడు తట్టుకి బిగిస్తారు. దానిని అప్రమత్తతతో గమనిస్తూ వుండాలి. ఓడ స్తంభాల కదలికవల్ల క్రిందనుండి పైన ఏమి జరుగుతుందో సరిగా గమనించటం కష్టం కాబట్టి, ఏ పొరపాటు జరిగినా ఆ పైకి ఎక్కిన వాడు సముద్రంలో పడిపోవటం సంభవించవచ్చు. పైకివెడుతూ అహాబ్, ఆ "తాటిని జాగ్రత్తగా చూడండి" అనటం సహజమే కాని అతను ఆ తాడు స్టార్‌బక్‌కి ఇవ్వటం ఆశ్చర్యకరం. అక్కడ ఉన్న వాళ్ళందరిలోనూ,

అహాబ్‌ని కాదన్నవాడు స్టార్‌బక్ ఒక్కడే. అసలు ఈ ప్రయత్నం ప్రయోజనకరమేనా అని అనుమానించినవాడూ, అతనే. అటువంటివాని చేతుల్లో అహాబ్ తన ప్రాణాలను ఎట్లా ఉంచాడో ఎవరికీ అర్థంకాలేదు!

అహాబ్ పైకి వెళ్ళిన పదినిమిషాలలో ఒక సముద్రపక్షి వచ్చి, అతనిచుట్టూ తిరగటం ప్రారంభించింది. ఒక్కసారిగా పైకి ఎగిరి మళ్ళీవచ్చి అతనిచుట్టూ తిరగటం మొదలుపెట్టింది. సముద్రంమీదనే దృష్టి పెట్టియున్న అహాబ్ ఈ పక్షిని గమనింపలేదు. అసలు ఆ విధంగా పక్షులు చుట్టూ తిరగటం, ఆ ఎత్తులో, సామాన్యమైన విషయమే మైనా, ఇందులో ఏదో గూఢార్థముందని మాత్రం అనుకొన్నారు అందరూ.

అహాబ్ వెనుకనే, గుండో స్తంభంమీద కొంత క్రిందగా నిలబడియున్న సిసిలీ – నావికుడు "మీ టోపీ జాగ్రత్త" అని అహాబ్‌ని ఉద్దేశించి కేకవేశాడు. కాని అంతకు ముందే, ఆ పక్షి తన రెక్కలతో ముసలివాని కళ్ళని కప్పివేసి. టోపీని తన్నుకొని పోయింది.

పూర్వం టార్క్విన్ తలచుట్టూ ఒక డేగ ప్రదక్షిణం తిరిగి అతని టోపీని తీసి మళ్ళీ పెట్టింది. దానితో అతని భార్య టనక్విల్, తన భర్త రోమ్‌నగర్ చక్రవర్తి అవుతాడని ప్రకటించింది. తీసిన టోపీని తిరిగిపెట్టటంవల్లే అది శుభసూచకమైన సంఘటన అయింది కాని, అహాబ్ టోపీని ఎవరు తిరిగి పెడతారు? ఆ పక్షి దూరంగా ఎగిరిపోయి అదృశ్యమైంది. ఆచోట ఎంతో ఎత్తునుంచి ఒక నల్లని చుక్క సముద్రంలో పడింది.

80. 'డిలైట్' ఓడ.

దీనితో 'పెకోడ్' పోతోంది. సముద్ర కెరటాలతో పాటు గడియలు, రోజులుకూడా దొర్లిపోతున్నాయి. లైఫ్ బాయ్‌గా మారిన శవపేటిక వెనుకప్రక్క వ్రేలాడుతోంది. ఇంకొక ఓడ "డిలైట్" అన్న పేరుగలది కనబడింది. అది దగ్గర పడుతున్నకొద్దీ అందరి చూపులు దానిపైనే పడినాయి. ఆ ఓడకు ముందుభాగాన, ఎనిమిది, తొమ్మిది అడుగుల ఎత్తున కొన్ని అడ్డదూలాలున్నాయి. ఆ దూలాలమీద శిథిలమైన ఒక పడవపలకలు కనబడ్డాయి. "తెల్లతిమింగిలాన్ని చూశారా!"

"చూడండి" అంటూ ధ్వంసమైన ఆ పడవవైపు చూపుతూ అన్నాడు ఆ ఓడ కెప్టెన్.

"దానిని చంపివేశారేమిటి!"

"దానిని చంపే ఈటె ఇంతవరకు ఎక్కడా నిర్మింపబడలేదు" అని విచారంగా, పక్కనే ఉయ్యేల అంచులను మౌనంగా కట్టుతూవున్న నావికులను చూస్తూ అన్నాడు.

"ఇంకా నిర్మింపబడలేదా!" అంటూ పెర్త్ తన కోసం తయారుపెట్టిన ఈటెను తీసి చూపిస్తూ అహబ్,

"ఇదిగో చూడవయ్యా! దాని చావు నా చేతిలో ఉంది! ఈ ముళ్ళకు మనిషి నెత్తురుతో, ఆకాశపు మెరుపులతో

పదును పెట్టాను. అయఃస్థానమైనదాని వెనుక రెక్కతో వాటిని ఇంకా పదునుపెట్టి తీసుతాను"

"భగవంతుడు నిన్ను రక్షించుగాక! దానిని చూశావా-" ఆ ఉయ్యాలవైపు చూపిస్తూ, "నిన్నటిదాకా బ్రతికి ఉండి తెల్లవారేలోపున చనిపోయిన అయిదుగురిలో ఒకనిని సమాధిచేస్తున్నాను. అతని కొక్కనికే నేను సమాధి చేయ గలుగుతున్నాను. మిగిలిన నలుగురూ చావకముందే సమాధి అయిపోయినారు. వాళ్ళ సమాధిపైనే నీవు ప్రయాణం చేస్తావు" అని, తన నావికుల వంక తిరిగి, "అంతా సిద్ధమైనట్లేనా!- అయితే ఆ బల్లమీద శరీరాన్ని పెట్టండి" అని ఆ ఉయ్యాలను సమీపించి, చేతులు ఎత్తి ఓరి భగవంతుడా! చావు పుట్టుకలు-"

"ముందుకు పోనీయ్యండి" అంటూ అహాబు ఉరుము లాగ అరిచాడు.

'పెకోడ్' ఎంత త్వరగా బయలుదేరినా, ఆ రెండవ ఓడనుండి శవము నీటిలో పడిన చప్పుడు వినకుండా దాటి పోలేదు. కళేబరం పడటంవల్ల ఎగసిన నీటిబుడగలు మృత్యువు చేసిన అభిషేకంవలె దాని వెనుక భాగం మీద పడియుండవచ్చు.

విచారగ్రస్తమైన 'డిలైట్' నుండి అహాబు మెల్లగా జారిపోతూ ఉండగా 'పెకోడ్' వెనుక భాగాన వ్రేలాడుతూ ఉన్న లైఫ్ బాయ్ ప్రస్ఫుటంగా కనబడింది!

"మానవులారా! ఇటువైపు చూడండి, ఇటువైపు చూడండి. మా సమాధుల మీదుగా మీరు ఎగిరి పోతున్నారు. వృథాగా మీ ఓడ వెనుక భాగంను మావైపు తిప్పుతూ, మీ శవపేటికను మాకు చూపుతున్నారు" అని, 'డిలైట్' వెళ్ళిన దారినుండి విపత్సూచకమైన మాటలు వినవచ్చాయి.

౪౧. స్వరసమ్మేళనం

ప్రశాంతమానమైన రోజు అది. సర్వవ్యాప్త మయిన ఆ నీలిమలో సముద్రమూ, గాలీ ఒకటియై పోయినాయి. గాలి స్వచ్ఛంగా, మృదువుగా కన్యపడుచు బెదరు చూపు వలె ఉంది. సముద్రం బలశాలియైన పురుషుని వక్షంవలె, ఉబుకుతూ దిగుతూ ఉంది.

అక్కడా, ఇక్కడా చిన్న చిన్న పక్షుల తెల్లని రెక్కలు గాలిలో తేలిపోతున్నాయి. అవి స్త్రీత్వము గల గాలియొక్క కమ్మని భావములు. క్రింద అగాధ సముద్రంలో పెద్దపెద్ద తిమింగిలాలు, సొర చేపలు, జొంత చేపలు పరుగెత్తుతున్నాయి. అవి పురుష ప్రకృతిగల సముద్రము యొక్క హింసాత్మకమైన ఆలోచనలు! అంతర్యాలలో ఈ తేడా లున్నా పైకి కానవచ్చే భేదం ఛాయలలో మాత్రమే. ఆ భేదం తప్ప, రెండూ ఏకంగానే కనబడ్డాయి. స్త్రీత్వ, పురుషత్వములే ఆ ఛాయా భేదం కల్గించాయేమో!

పైన చక్రవర్తివలె ఉన్న సూర్యుడు, కోమలమైన ఆ గాలిని, సాహసుడైన సముద్రునకు కన్యాదానము చేస్తున్నట్టు కనబడ్డాడు. దూరంగా, దిక్చక్రమందు ఒక కంపనము కానవచ్చింది! అది గుండె దడదడ కొట్టుకొంటూ వా తొణకగా, ప్రేమయుత విశ్వాసంతో, సంకోచంతో, ప్రియుని కౌగిట చేరే నూతన వధువును తలపింప చేసింది.

మనోహరమైన ఆ యౌవనవేళ, అహాబ్, తన కార్యాయువంటి తన మొగము ఎత్తి, ఆనందమయమైన గగన లక్ష్మీ ముఖమండలము వైపు చూచాడు. అతని మొగము ముడతల ముళ్ళతో నిండి ఉంది. కళ్ళు చింతనిప్పుల వలె కణకణ మండుతున్నాయి. శరీరం కృశించిపోయినా మనస్సు దృఢముగానే ఉన్నట్లు తోచింది. నాశము సమీపించినా పట్టుదల సడలలేదు.

ఓహో! నిత్యశైశవము, నిష్కళంక - అమాయకత్వము కలిగి, మానవలోకం చుట్టూ క్రీడించే అనుకవృలారా! ఓ మారుతమా! ఓ గగనమా! ఓ నీలవర్ణమా! హృదయ విదారకమైన ఆ ముసలి అహాబ్ యొక్క శోకభారం మీకు తెలియదు గదా!

మెల్లగా ఓడ తట్టు దాటి అంచుకి వచ్చి వంగి, అహాబ్, నీటిలో తన చూపులు అందకుండా సన్న సన్నగా జారిపోయే, తన నీడను దిగమింగుతున్న సముద్ర గాంభీర్యమును తిలకిస్తూ ఉన్నాడు. గాలిలో తేలే, సువాసనలు, తాత్కాలికంగా అయినా, అతని అంతరంగంలోని బాధను ఉపశమింప చేశాయి.

ఆహ్లాదకరమైన ఆ వాయువు, మనోహరమైన ఆ సాగరము అతని శరీరానికి మృదుస్పర్శసుఖము కలిగించి లాలించాయి. అంతవరకు సవతితల్లి వలె చెంత చేరనీయని ప్రకృతి, ఇప్పుడు తనంతటతానే చేతులు చాచి వాత్సల్యంతో అతని మెడను కౌగిలించుకొంది. అతను శిరమున ఆనంద

శాపాలు కురుస్తూ, ఎన్ని తప్పులు చేసినా క్షమించి, ఆశీర్వదించగలనని చెప్తున్నదా అని అనిపించింది. అహాబ్ ఒక్క కన్నీటి చుక్కను సముద్రంలోకి రాల్చాడు. ఆ ఒక్క బిందువులోని సిరులు పసిఫిక్ మొత్తము మీద ఎక్కడా లేవు!

అప్పుడతనిని స్టార్ బక్ చూచాడు. అతని అంతరంగంలోని ఘోష స్టార్ బక్ చెవిని పడియుండవచ్చు. అతనిని తాకకుండా, అతనికి కనబడకుండా, అతని దగ్గరకు చేరి నిలబడ్డాడు. అహాబ్ వెనుకకు తిరిగాడు.

"స్టార్ బక్!"

"అయ్యా!"

"స్టార్ బక్! ఎంత శాంతంగా ఉన్నదీ గాలి! ఎంత శాంతంగా ఉంది ఆకాశం! ఇంత మనోహరంగా ఉన్న ఒక రోజునే, నేను నా మొట్టమొదటి తిమింగిలాన్ని కొట్టాను. అప్పుడు నాకు పద్ధెనిమిది ఏళ్లు! నలభై సంవత్సరాల క్రితం! నలభై ఏళ్ళు ఎడతెరపి లేకుండా తిమింగిలాల వేట– నలభై ఏళ్ళు ప్రమాదాలు, కష్టాలు, తుఫానులు! దయలేని సముద్రం మీద నలభై ఏళ్ళు! నలభై సంవత్సరాలపాటు నేలమీద ఉండే శాంతి సౌఖ్యాలని పోగొట్టుకొన్నాడు, అహాబ్– ఎందుకూ! నలభై ఏళ్ళపాటు సముద్రాలలోని దుష్టప్రాణులతో యుద్ధం చెయ్యడానికి! స్టార్ బక్, ఈ నలభై సంవత్సరాలలో, మూడు సంవత్సరాలైనా ఇంటిదగ్గర గడపలేదు నేను! ఈ నలభై సంవత్సరాలలో నా ఒంటరితనము

బయట ప్రపంచంతో ఏమీ సంబంధం లేకుండా కెప్టెన్‌గా నా చుట్టూ నిర్మింపబడ్డ ప్రహరీలు — తలుపులుంటే! అబ్బ! ఎంత అలసట, ఎంత భారం! ఈ నలభై సంవత్సరాలు ఎండి పోయిన చేపలే తిని బ్రతికాను. నేలమీద ఏ పేదవాడికైనా రోజూ క్రొత్త పళ్ళు, రొట్టె దొరుకుతాయి. నాకో — ఎండి పోయిన రొట్టె! నా చిన్నారి భార్యను, ఏభయ్యోయేట పడి వచ్చి నాక కట్టుకున్న దానిని విడిచి, పెళ్ళయిన మర్నాడే విడిచి సముద్రాలు, మహాసముద్రాలు దాటి వచ్చివేశాను. ఒక్క నాడే ఆ ముద్దరాలితో కలిసి ఉన్నాను. ప్రియురాలా! భర్త బ్రతికి ఉండగా, వితంతువు ఆమె! నేను పెళ్ళి చేసుకొని ఆ అమ్మాయిని వితంతువును చేసివేశాను!

"స్టార్‌బక్, పైగా, ఎంత క్రౌర్యంతో, వెర్రితో, కోపంతో, సలసల క్రాగే నెత్తురుతో, పిశాచివలె ఈ అహాబు తన వేటలు సాగించాడు! నలభై సంవత్సరాలు శుద్ధ విధవ-విధవ అయినాడు ఈ అహాబు. ఈ వేటలాడే బాధ ఎందుకు! ఈ నా చేయి ఎప్పుడూ తెడ్డుమీదా, ఈటె మీదా పెట్టియుంచి దానిని చచ్చుపడచేశాను. ఇంతకూ ఈ అహాబు ఏమి సంపాదించాడు! ఏమి బాగుపడ్డాడు. ఈ దుర్భరమైన భారంతో కృంగిపోయే నాకు ఈ కాలుకూడా పోవటం అన్యాయం కాదూ! ఈ నెరసిన జుట్టును ప్రక్కకు తోసి చూడు, ఇంత నెరిసిపోయిన వెంట్రుకలు బూడిదలో నుంచి తప్ప ఇంకెక్కడైనా పుట్టుతాయా! కాని, స్టార్‌బక్! నేను చాలా ముసలివాడిలాగ కనబడుతానా! నా కెట్లా ఉంటుందో తెలుసునా! చచ్చిపోయేటంత బలహీనత, వంగిపోయి నాను

వచ్చినట్లు నేనే, ఆదిమానవుడైన ఆదామునై, స్వర్గంనుండి భూమి మీదకి వచ్చినప్పటినుంచీ గడచిన యుగాల బరువుతో కృంగిపోతున్నట్లు ఉంటుంది. భగవంతుడా! భగవంతుడా! నా గుండెను చీల్చివేయి! నా తలని పగులగొట్టేయి! ఈ నెరసిన వెంట్రుకలు నన్ను వెక్కిరిస్తున్నాయి! జీవితంలో అనుభవించ వలసిన సుఖం అంతా అనుభవించానా వీటిని ధరించటానికి? అప్పుడే దుస్సహవార్ధక్యం వచ్చి పైనిపడిందే! స్టార్‌బక్! దగ్గరగా రా. మానవుని కళ్ళల్లోకి నన్ను ఒక్కసారి చూడనీ— ఆకాశము మీదా, సముద్రముమీదా, భగవంతుని మీదా చూపు నిలపటంకంటె మానవుని కళ్ళలోకి చూడటం మంచిది. ఆశ్చర్యం! నీ కళ్లలో నా భార్య బిడ్డా కనబడుతున్నారు!

'మోబీడిక్'ను తరిమి చంపటానికి నేను పడవమీదికి వెళ్ళినప్పుడు ఇక్కడే ఉండిపో! ఆ ప్రమాదం నీకు వద్దు! నీ కళ్ళలో నా యిల్లు కనబడుతూ ఉండగా ఆ ప్రమాదంలోకి నిన్ను రానివ్వను."

"ఓ కెప్టెన్! నా కెప్టెన్! ఎంత ఉదాత్తుడవు! ఆ దౌర్భాగ్యపు తిమింగిలాన్ని మనం తరమటమెందుకు? మనను హతమార్చే ఈ నీటిని తప్పుకొని పారిపోదాం! ఇంటికి పోదాం! ఈ స్టార్‌బక్‌కి కూడా పెండ్లాము పిల్లలున్నారు. వారు నాకు వయస్సులోనే ప్రసాదింపబడ్డారు. పెద్దవయస్సులో ఉన్న మీకు మీ భార్యాపుత్రులవలె మావారు కూడా, నా ప్రాణానికి ప్రాణాలు! పోదాం! ఈ క్షణం ఓడను తిప్పించి వేస్తాను. సంతోషంతో, సరదాగా పోదాం! మన

నన్‌టుకెట్‌ వైపు పోదాం! నన్‌టుకెటులో కూడా ఇటువంటి హాయిగొల్పే రోజులుంటాయి."

"అవును అక్కడకూడా ఉంటాయి - వేసవికాలంలో పొద్దుటివేళ. ఇప్పుడే పిల్లవాడు లేస్తాడు—తల్లి రాక్షసుడనైన నన్ను గురించి వానికి కథలు చెప్తుంది—నేను ఓడ మీద ఉన్నాననీ, ఇంటికివచ్చి అతనితో ఆడుకొంటాననీ చెప్తూ వుంటుంది"

"నా మేరీ అంతే! మా అబ్బాయిని రోజూ కొండ మీదకి తీసుకొనివెళ్ళి, వాళ్ళనాన్న వచ్చే ఓడయొక్క తెర చాపలను చూచి గుర్తించటం నేర్పుతానన్నది. చాలు, ఇక చాలు! నన్‌టుకెటు వైపే వెళ్దాం! రా, నా కెప్టెన్, దారి చెప్పు! పోదాం! ఆ కిటికీలోంచి కనబడే కుఱ్ఱవాని ముఖం చూడు. కొండమీద తల్లి చంకలో ఎక్కి, ఇటువైపు చాచే ఆ చిన్నారి చేతులు చూడు!"

అహాబ్ ముఖం తిప్పివేసుకొన్నాడు. పిడుగుపడ్డ ఫల వృక్షంలాగ నిలువున వణికిపోయినాడు. మాసిపోయిన తుది పండును నేలమీద రాల్చివేశాడు.

"ఏమిటిది? అతిలౌకికము, అనామకము, అతిగూఢము, ఏమిటిది? నాకు కనిపించకుండా ఏ క్రూరచక్రవర్తి నన్ను ఇట్లా ఆజ్ఞాపిస్తున్నాడు? వెఱ్ఱివానివలె సహజమైన కోర్కెలను అన్నిటికీ విరుద్ధంగా ఎందుకిట్లా దొర్లుకొంటూ పోతాను! ఎందుకీ ఆలోచనలేని పరుగు! అహాబ్ అహాబేనా! ఈ చేతిని పైకి ఎత్తేది నేనా, భగవంతుడా, మరెవరైనానా! ఆ సూర్యుడు తనంతట తాను కదలగలడా! ఏ శక్తి తోనా,

కదలిస్తుంది. ఆ శక్తికి సూర్యుడే దాసుడు. ఒక్క నక్షత్రం కూడా తనంతట తాను తిరగలేదు. ఏ శక్తియో దానిని పరిభ్రమింపజేస్తుంది. ఆ శక్తివల్లనే నాలోని ఈ చిన్న గుండెకాయ కొట్టుకొంటుంది. ఆ శక్తివల్లనే కాకపోతే ఈ శిరస్సులోని అల్పమేధస్సు ఎట్లా ఆలోచనలు చేయగలదు? నా జీవితాన్ని ఆ భగవంతుడే బ్రతుకుతున్నాడు. ఆ భగవంతుడే మనలను త్రిప్పుతున్నాడు. ఆ చక్రానికి విధి ఇరుసు, నవ్వే ఆకాశాన్ని అగాధమైన సముద్రాన్ని చూడు! ఆ పక్షితో ఎగిరిపోయే చేపను పట్టుకోమని ఎవరు చెప్పారు? వాంత ఎక్కడికి పోతాడు? న్యాయాధిపతినే బోనులో ఎక్కిస్తే ఇంక న్యాయం చెప్పేవాడెవడు? కాని చూడు గాలి ఎంత శాంతంగా ఉందో! ఆకాశం ఎంత నిర్మలంగా ఉందో! చక్కని పచ్చిక బయలుమీద నుంచి వస్తున్నట్టుగా గాలి ఎంత సువాసనగా ఉందో! వండీన్ పర్వతంలోయలలో ఎవరో గడ్డిని ఎండబెట్టుతున్నారు - స్టార్‌బక్ అప్పుడే కోసిన గడ్డిలో కోతగాళ్ళు పండుకొంటారు గదా! మన మెంత కష్టపడినా అందరమూ చివరకి గడ్డిలో పడుకోవలసిన వాళ్ళమే! గడ్డిలో పడుకొని ఆ పచ్చిక మధ్య మట్టి అయిపోతాం స్టార్‌బక్."

శవమువలె వివర్ణుడై మేస్త్రీ తొలగి వెళ్ళిపోయాడు.

అహాబ్ తట్టును దాటి అవలివైపు చూడటానికి వెళ్ళాడు. కాని తదేకదీక్షతో చూస్తున్న రెండు నేత్రాల ప్రతిబింబాలను నీళ్ళలో చూచి విస్మయుడైనాడు. ఆ ప్రక్కనే నిలబడి ఫెడల్లా నీళ్ళలోకి చూస్తున్నాడు!

82. మొదటి రోజు వేట

ఆ రాత్రి ముసలివాడు తట్టుమీదికి వచ్చాడు. ఉన్నట్టుండి మెడ ముందుకు వంచి గాలివాసన పీల్చటం మొదలు పెట్టాడు. ఏదైనా లంక సమీపిస్తూ ఉన్నప్పుడు ఓడమీది కుక్క ఆలాగే పసిపడుతుంది. ఆ ప్రాంతాలలో తిమింగిలం వుండితీరుతుందని అతడు పసిగట్టాడు. అతనిమాట మీద అందరూ ఆ గాలివాసన గుర్తించారు. అహాబ్ ఓడను త్రిప్పి తెరచాపలను సగానికి దింపమన్నాడు.

తెల్లవారినది. మా ముందు సముద్రంను ఏదో చీల్చుకొని పోయినట్టు తెలియవచ్చింది.

అందరిని పిలు! స్తంభాలమీద ఎక్కమను! డాగో పడుకొన్నవాళ్ళందరిని లేపాడు, వాళ్ళు ఎలా వున్న వాళ్ళు అలా పడుగెత్తుకొని వచ్చి స్తంభాలపైకి ప్రాకిపోయినారు.

"మీకేమిటి కనబడుతోంది" అని అహాబ్ కేక వేసి అడిగాడు.

"ఏమీ లేదండి"

కాసేపు ఉండి, అతనే పైకి వెళ్ళాడు. అటూ ఇటూ చూచి, వెర్రికేక వేశాడు; "అదిగో! మంచుకొండవంటి దాని వీపు! అదిగో మాబీడిక్!"

ఆ కేక వినేటప్పటికి అందరూ ఓడ ప్రక్కకు పరుగెత్తి ఇన్నాళ్ళుగా తాము వెతుకుతూవున్న ఆ తిమింగిలంను చూడబోయారు. అహాబ్ స్తంభంమీద మంచి స్థావరం

ఏర్పరచుకొన్నాడు. ఆతని కొంత క్రిందుగా టాష్టెగో నిలబడ్డాడు. ఆ ఎత్తునుండి ఒక మైలు దూరంలో ఆ తిమింగిలం ఒక్కొక్క కెరటముతో పైకి లేస్తూ తన వీపు ప్రదర్శిస్తూ నోటి జల్లుని విడుస్తూ కానవచ్చింది. ఎరుకలేని నావికులు కొందరు ఆ జల్లు తాము ఒక్కొక్క వెన్నెల రాత్రిలో హిందూమహాసముద్రంమీద చూచిన జల్లుల మాదిరిదే అనుకొన్నారు.

"మీా రెవ్వరూ దీనిని ఇంతకుముందు చూడలేదా" అని తనతోపాటే పైకి ఎక్కివున్న వాళ్ళని అహాబ్ అడిగాడు. "మీరు చూచిన క్షణంలోనే నేనూ కేకవేశాను" అన్నాడు టాష్టెగో.

"ఆ క్షణాన అయి ఉండదు. నేనే ముందు చూశాను. ఆ ఘనత నాది! మీా రెవ్వరూ తెల్లతిమింగిలంను నా కంటె ముందు చూడలేదు. అదిగో నీటిని చిమ్ముతూవుంది" అని మెల్లగా దీర్ఘంగా తిమింగిలం విడిచే నీటిజల్లులలె రెండు మూడు సార్లు ఆ మాటలు విడిచాడు. మూడు పడవలను సిద్ధపరచండి! స్టార్బక్! నీవు ఓడమీాదే ఉండాలి. అదిగో తోక! అంతా సిద్ధమైనట్లేనా! పన్న దింపు స్టార్బక్" అంటూ క్రిందికి వచ్చాడు.

"అది ఎడమవైపు పోతోందండి, ఓడను ఇంకా చూచి పట్టులేదు" అన్నాడు స్టబ్.

"మాట్లాడకుండా వుండవయ్యా. పడవలు ఏవీ? పడవలు."

స్టార్‌బక్ పడవను తప్ప తక్కినవాటిని దించారు. అన్నిటికీ తెరచాప లెత్తారు. తెడ్లువేస్తున్నారు. ఎడమ వైపుగా అన్ని పడవలు వేగంగా పోయాయి. అహాబ్ యొక్క పడవ అన్నిటికంటె ముందుపోతోంది.

గుంటలు పడిపోయిన ఫెడల్లా కళ్ళలో మెలమెల జారుతూ ఒక చావుచూపు మెరసింది. అతని మూతి భయంకరంగా అదిరింది.

నిశ్శబ్దంగా ఆ పడవలు సముద్రాన్ని చీల్చుకొంటూ పోయాయి. కాని ఆ జంతువును సమీపించటం కొంత ఆలస్యమైనది. వాళ్ళు దానిని సమీపిస్తున్నకొద్దీ సముద్రం పచ్చి బయలు వలె, తివాసి పరచినట్లు నునుపుదేరటం మొదలు పెట్టింది. తన వెనుక వేటగాడు సమీపిస్తున్నట్టు ఆ తిమింగిలానికి తెలియదు. దాని వీపు స్పష్టంగా కనబడుతోంది. అది మెల్లగా జారుతూ పోతోంది. వేటగాడు, ముడుతలు పడ్డ దాని తలను చూశాడు. దాని తెల్లని విశాలమయిన నుదుటి నీడ మెరసిపోతూ ఉంది. ఆ నీడలో నీటి కలకలం కూడా కలసింది. వెనుక భాగాన తిమి గిలం వెళ్ళగా ఏర్పడిన పల్లం లోనికి అటునుండీ, ఇటునుండీ నీరు పొర్లుతూ వచ్చిపడుతోంది. అటూ ఇటూ గాలిబుడగలు రేగి ఆడుతున్నాయి. ఈ బుడగలను జలపక్షుల రెక్కలు చెల్లాచెదరు చేస్తున్నాయి. తిమింగిలం వీపున ఏదో లోనికి దిగబడిన ఈటె యొక్క కొయ్యపిడి, పడవమీది తెరచాప కొయ్యవలె కనబడింది. పైన మేలుకట్టువలె పిందుకట్టి ఎగురుతున్న పక్షుల గుంపులో ఒకటొకటి వచ్చి ఆ కొయ్యపిడిమీద కూర్చుని

రెక్కలు ఆడిస్తూంటే అది పతాక రెక్కలువలె ఉంది. ఆ తిమింగిలం వేగంలోకూడా విశ్రాంతిని, ఆనందమును అనుభవిస్తోంది.

అది నెమ్మదిగా నిర్లక్ష్యంగా వెళ్ళిపోతూ వుండటం చూచి వేటగాళ్ళు దానిని వధింపవచ్చునని ఆశపడినా దాని మందగమనం తుపానుకు పూర్వం కానవచ్చే ప్రశాంతత వంటిదే అని గ్రహించారు. తిమింగిలమూ! నీవు ఎంత మందిని అంతకుపూర్వం ధ్వంసంచేసినా, నిన్ను క్రొత్తగా మొదటిసారి చూచేవానిని ఎంతో శాంతంగా ఆకర్షిస్తావు."

సముద్రంకూడా ప్రశాంతంగా ఉన్నది. కెరటాలు కూడా కేరింతలు పెట్టటంలేదు. అట్టి సముద్రంలో 'మోబీ డిక్' వెళ్ళిపోతోంది! నీటిలో మునిగివున్న తన భయంకర స్వరూపమునుగాని, తన దవడ యొక్క వికృతత్వమునుగాని చూపించకుండా వెళ్ళిపోతోంది కాని, అంతలోనే దాని ముందుభాగం నీటిపై నుండి తేలింది. ఒక క్షణంపాటు పాల రాతితో చేయబడ్డ తోరణద్వారమువలె దాని శరీరం నీటి పైకి వచ్చి ఒకసారి రెక్కవిదిల్చి, అదృశ్యమైంది. అది తేలి మునిగిన తావులో తెల్లని జలపక్షులు వ్రాలి రెక్కలు తడుపుకొంటూ విహరించాయి. మరల యెప్పుడు కనబడుతుందా అనే చూపుతో మూడు పక్షులూ నీటిపైని తేలుతూ ఉండిపోయాయి.

అహాబ్, తన పడవ వెనుక భాగాన నిలబడి తిమింగిలం ఎటు వెళ్ళి ఉంటుందో అని ఆలోచిస్తూ; దానికి ఎగువ దూరాన నీలంగా మసకమసకగా కానవచ్చే జలభాగాలమీద

చూపు నిలిపి "ఒక గంట" అన్నాడు. ఒక్క క్షణం తరువాత మళ్ళీ అంతా కలియజూచాడు. కొత్తగాలి వచ్చింది. సముద్రం లేచింది. టాష్టెగో "పక్షులు, పక్షులు" అంటూ అరిచాడు. బారులుతీరి తెల్లని పక్షులు అహాబ్ పడవవైపు వచ్చి, ఆ పడవకి కొద్ది గజాల దూరంలో ఆగి, నీటిమీద వలయాకారంగా తిరుగుతూ, అతి సంతోషంతో ఏదో తమకు లభించనున్నట్టు కేరింతలు పెట్టాయి. అతనికి వేరే మరేమీ కానరాలేదు. పక్షి దృష్టి మనిషి చూపుకంటె నిశితమైనది. వెంటనే అతను మళ్ళీ కడలి లోతుల్లోకి పరీక్షగా చూచాడు. ఒక తెల్లని ఆకారం కనబడింది. అది అతి వేగంగా పైకి వస్తూవుంది. తెల్లగా మెరిసిపోయే దాని రెండు వరుసల పళ్ళు, ఏ అగాధ ప్రదేశమునుంచో పైకి తేలుతూ వున్నట్టు కనబడినాయి. ఆ అగాధప్రదేశం "మోబీడిక్" తెరచిన నోరే!

దాని శరీరమంతా నీటి నీలిరంగులో లీనమైపోయింది. బిలమునుండి తన నోటిని పడవ క్రిందికి పోనిచ్చి, తెరచింది. అహాబ్ వెంటనే మెలకువతో పడవను ఆ పెను బారినుండి తప్పించివేశాడు.

[illegible]

పడవ. అది జిత్తులమారి అని ప్రసిద్ధికెక్కిన 'మాబీడిక్' పడవ స్థానంలోని మార్పును గుర్తించి, వెంటనే పడవ క్రిందికి తన తలను దూర్చి ఒక ప్రక్కగా ఒదిగి పడుకొంది.

పడవలోని ప్రతి కలపముక్కా అదిరింది. తిమింగిలం ఒదిగి పడుకొని నోటితో పడవను పట్టుకొన్నట్టుంది. దాని క్రిందిదవడ గాలిలోకి ఎగిరింది. ఆ దవడయొక్క అంతర్భాగం అహాబ్ తలకు ఆరు అంగుళాల మేరలోకి వచ్చింది, కాని అతని తలకంటె చాలా పైకి లేచివుంది. ఈ స్థితిలో ఉన్న తిమింగిలం పిల్లి, ఎలుకను పట్టి కుదిపినట్టు ఒకసారి పడవను కుదిపింది.

ఫెడెల్లా ఏమీ ఆశ్చర్యపడక ఊరక చూస్తున్నాడు. కాని మిగిలినవాళ్ళు ఒకరిమీద ఒకరు పడి కాళ్ళు విరగ దొక్కుకుంటూ పడవ వెనుక భాగానికి పోజూచారు.

తిమింగిలం పడవతో చెరలాటలాడుతూ వుండటంవల్ల పడవ క్రిందికీ, మీదికీ ఊగుతూవుంది. పడవమీద నిలబడి
గిలంమీద ప్రక్కవాటుగా ఈటెలు విసరటానికి వీలు
ది. అసలు పడవ ప్రక్కభాగాలు ఇంచుమించు
యి. ఆ విషమ పరిస్థితికి తట్టుకో లేక

అతని చేతినుండి ఆ దవడ జారిపోయింది. దాని రెండు దవడల నడుమ చిక్కి, కత్తెరలోవలె పడవ రెండు భాగాలుగా విచ్ఛిన్నమైనది. ధ్వంసమైపోయి నీటిమీద తేలిపోతూవున్న ఆ పడవ ముక్కలను విడిచి, తిమింగిలం, నోరు మూసివేసుకొన్నది. ఒక భాగంలో ఉండిపోయిన నావికులు ఎట్లాగైనా బయటపడుదామని తాపత్రయ పడుతున్నారు.

పడవని రెండుగా చేసే క్షణానికి ముందు తిమింగిలం మెల్లగా తన తల ఎత్తడంతో అహాబ్ కి దాని దవడమీద తన పట్టు సడలింది. వెంటనే జరుగనున్నదేదో గ్రహించాడు. ఆఖరిసారిగా పడవని బయటకు తోసివెయ్యటానికి ప్రయత్నించాడు. కాని దానివల్ల పడవ జారిపోయి ఇంకా లోపలికి వెళ్ళటమే జరిగింది. దానితో అతనికి తిమింగిలం యొక్క దవడమీదవున్న పట్టు పూర్తిగా తప్పింది. అతను బయట సముద్రంమీద బోర్లపడ్డాడు.

నోటికి అందిన ఎరను విడిచిపెట్టి మాబీడిక్ కొంత దూరం వెళ్ళి తలను నీటిపైకి ఎత్తుతూ మెల్లగా శరీరమంతా వెనుకకు తిప్పుతూ పోతోంది. దాని శిరోభాగం నీటిమీద రమారమి ఇరువది అడుగుల ఎత్తున లేచినప్పుడెల్లా కెరటాలు దాని నుదిటిని కొట్టుకొని తుంపర జల్లును మరింతపైకి చిమ్ముతూ వుండేవి.

మాబీడిక్ తానువెంటనే తన పూర్వస్థానంలోకి వచ్చి ముక్కలైపోయిన ఆ పడవ నావికులచుట్టూ అతివేగంగా ఈదుతూ, కసితో నీటినంతా చిలికి వేసింది. దానికి ఇంకొక దెబ్బకొట్టి సర్వనాశనము చేసే ఉద్దేశం కలిగింది కాబోలు.

తునకలైన పడవను చూడగా దానికి పిచ్చి ఎత్తినట్లుంది. ఇంకొకవంక అహాబ్, తిమింగిలంతోక ఆడిస్తుంటే లేచిన నురుగులో సగమువరకు మునిగిపోయి, కుంటివాడవటం వల్ల ఈదలేక తేలుతున్నాడు. నిస్సహాయుడైన అతని తల చిన్న నీటి బుడగవలె పైకి కనబడుతోంది. పడవలో వెనకభాగాన ఉన్న ఫెడెల్లా అశఃనీ, పడవ రెండవ భాగంను పట్టుకొని వ్రేలాడుతున్న నావికులను ఉదాసీనంగా చూస్తున్నాడు. ఆ నావికులుకూడా, తమ ప్రాణాలను కాపాడుకొనే ఉపాయ మాలోచిస్తూ అహాబ్‌కు సహాయపడటానికి కూడా రాజాలని స్థితిలో ఉన్నారు. ఫెడెల్లా అదికూడ గ్రహించాడు. తిమింగిలం చేస్తున్న చక్రభ్రమణతాండవం భయంకరంగా ఉంది. దాని పరిభ్రమణాలు ఆకాశంలోని గ్రహాల పరిభ్రమణాలవలె అతి వేగంగాను రాను రాను సమీపంగాను జరుగుతూవుంటే, అది సరాసరి వచ్చి తమ మీదనే పడబోతూ వున్నట్లు అనుకొని యుంటారు.

మిగిలిన పడవలు అంతవరకు దూరాన దెబ్బతినకుండా ఉన్నాయి. అవి కూడా ఆ సుడిగుండంలో ప్రవేశిస్తే తిమింగిలం మరీ రెచ్చిపోయి ప్రమాదంలో నిరాశ్రయులుగా వున్న అహబ్ మొదలయిన వాళ్ళను నాశనం చేయవచ్చు. వీళ్ళుకూడ తప్పించుకు పోలేక పోవచ్చు. అందుచేత తక్కిన పడవలలోని వాళ్ళు ఆ ప్రమాదమును దూరాన నుండియే ఊరక కళ్ళు పెట్టుకొని చూస్తున్నారు. అహబ్ తల ఆ మృత్యురంగానికి పడిబొడ్డుగా కానవస్తుంది.

ఈ విషమ దృశ్యమంతా ఓడమీది వాళ్ళకు కాన వస్తోంది. ఓడ రంగంలో దూకటానికి వేగంగా వచ్చింది. అది చేరునకు వస్తూవుండగా "ఆటు" అంటూ అహాబ్ ఒక కేక వేశాడు. ఇంతలో మాబీడిక్ మీదుగా ఒక పెద్ద కెరటం వచ్చి అతనిని ముంచివేసింది. తెప్పరిల్లి పైకివచ్చి, అతను - "తిమింగిలం మీదికిపోండి! దానిని తరిమివేయండి" అని మరల కేక పెట్టాడు.

'పెకోడ్' ఆ వ్యూహాన్ని ఛేదించి, తిమింగిలపు నోటి కింద జారిపడ్డట్టుగా, ఆహాబ్ మొదలయిన వాళ్లు గండం గడచి బయటపడ్డారు. అది చిరచిరలాడుతూ వెళ్ళిపోయింది. దూరాన ఉన్న పడవలు ఓడను చేరినాయి,

అహాబ్‌ను, స్టబ్ పడవలోకి లాగి ఎక్కించారు. అతని కళ్ళు జేవురించి పోయాయి. నుదుటిమీది ముడుగలలో ఉప్పునీరు చారికలు గట్టింది. శరీరంలోని బిగువు సడలింది. అంతా నాశనమై పోయిందనుకొంటూ తన విచ్ఛితికి అగ్గమైనాడు. కొన్ని వందల ఏనుగులు పాదాలతో తొక్కి వేసినట్లు నలిగిపోయి పడవ అడుగుభాగాన పడిపోయినాడు. అడవులలో వినవచ్చే ఆక్రోశాలవలె, అతని నోట మూలు ఆర్తనాదాలు వెలువడినవి. అతని శరీరం ముక్కలి డస్సిపోవటం వల్ల ఆ యార్తనాదం కొద్దిసేపే చేశాడు. దుర్బల హృదయులు జీవితమంతా మూల్గుతూ పడే బాధలను గొప్పవాడు ఒక్కసారే ఒక దీర్ఘనిశ్వాసంతో అనుభవిస్తాడు. ప్రతి కష్టానికీ వాళ్ళు పడేబాధ అంత క్షణికమె అయినా విధి

వశాన ఒకొక్కసారి ఒక జీవితకాలంలో, ఒక యుగానికి సరి పోయినంత వ్యధను అనుభవిస్తారు.

మెల్లగా లేచి, ఒక చేతిమీద ఒరిగి అహాబ్ "ఈటె భద్రంగా ఉందా?" అని అడిగాడు.

"ఉన్నదండి, ఇదిగో" నంటూ స్టబ్ చూపించాడు.

"ఇక్కడ పెట్టుదానిని. ఎవరయినా తప్పిపోయారా?"

"ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు – అయిదు తెడ్లు ఉండేవి: ఇదిగో అంగుగురు మనుష్యులు."

"బాగుంది – చెయ్యి అందియ్యి. నేను నిలబడాలి – అదిగో ఎడమవైపున పోతోంది! ఏమి అదిరిపాటు దానికి! నామీద చేతులు తీసివేయండి! నాలో జీవం చావలేదు. ఇంకా తెరచాప ఎత్తండి! తెడ్లను తియ్యండి!" అన్నాడు.

మామూలుగా వేటలలో ఒక పడవ పాడయిపోయి దాని నావికులు బ్రతికియుంటే వీళ్ళు కూడా ఇంకొక పడవ లోకి వెళ్ళి పడవను నడుపుతూ వుంటారు. ఇప్పుడూ అంతే జరిగింది. పడవకి ద్విగుణీకృతమైన వేగం వచ్చింది. కాని, ఈ వేగం తిమింగిలం యొక్క వేగానికి చాలలేదు. దాని వేగం మూడింతలు అయినట్టుంది. ఇక అప్పుడు దాని వెంట బడితే వేట చాలాసేపు సాగేటట్టుంది. అంతసేపు నావికులు పడవని నడపగలరా అని అనిపించింది. అందుకంటె ఓడమీద వెళ్ళటమే మంచిదని యోచించి, పడవలు ఓడ దగ్గరకు చేరు కొన్నాయి. పడవలను ఓడమీదికి ఎక్కించారు. ఆ చితికి పోయిన పడవను కూడా తీసుకొన్నారు.

తెరచాపలు విప్పుకొని, ఒక పెద్ద పక్షిలాగ 'పెకోడ్' మాబీడిక్ వెంటబడింది. ఓడ స్తంభంమీద వున్నవారు తిమింగిలం యొక్క గమనాన్ని గురించి తరచు వివరిస్తూనే వున్నారు. "తిమింగిలం నీటిలోకి వెళ్ళింది" అని వాళ్ళు చెప్పగా అహాబ్ చేతిలో గడియారం వంక చూస్తూ కొన్ని నిమిషాల తరువాత "కనబడుతోందా" అని ప్రశ్న వేస్తాడు. "లేదు" అని సమాధానం వస్తే తనకే పైకి చేర్చుమని కోరే వాడు. ఇటువంటి ప్రశ్నలతో, జవాబులతో రోజంతా గడిచింది. అహాబ్ ఒకసారి స్తంభాలపైన కదలకుండా ఉంటూ మరొకసారి నిర్విరామంగా ఓడ తట్టుమీద పచార్లు చేస్తూ గడిపాడు!

మధ్యమధ్యలో ఓడ స్తంభాల మీద వున్నవాళ్ళని హెచ్చరించటం తప్ప యింకేమీ మాట్లాడలేదు. ముఖం కనబడకుండా టోపీని పెట్టుకొని బిగిసిపోయి రెండు ముక్కలుగా పడివున్న తన పడవను చూస్తూ పచార్లు చేస్తూ వున్నాడు. ఆఖరికి దానిముందు ఆగాడు. మేఘావృతమైన ఆకాశంలోకి యింకా కొత్త మేఘాలు వచ్చినట్టు, ఆ పడవని చూస్తున్న ఆ ముసలివాని ముఖంలో మరికొన్ని విషాదరేఖలు ఉదయించాయి.

ఇదంతా గమనించిన స్టబ్, అతనికి ధైర్యం గొల్పుదామని కాబోలు, ఆ పడవను చూస్తూ "తిమింగిలం నోటికి బలేగాయం పడి వుంటుందండీ" అని నవ్వాడు.

"నీవేమి మనిషివి! ఏకోశంలోను జాలి అంటూ ఉన్నట్టు లేదే నీకు! ధ్వంసమైపోయిన పడవదగ్గర నవ్వుతావా

నీవు ధైర్యవంతుడవని ఎరుగుదును కనుక సరిపోయింది. లేక పోతే పట్టి పిరికిపందవని అనుకొని యుందును. ధ్వంసమైన ఇటువంటి పడవ దగ్గర ఒక్క మూలుగు గాని, ఒక్క నవ్వు గాని వినబడకూడదు."

"అవునండి - యిది గంభీరమైన దృశ్యమే. యిది దుశ్శకునం కూడాను!"

"శకునమట! శకునం! దేవతలకు మనతో మాట్లాడ వలెనని యుంటే సాక్షాత్తుగా మాట్లాడ గలరు. ముసలమ్మల వలె కల పంకిస్తూ, మొగము చిట్లిస్తూ కనుసన్నల సూచనలు చేసి పారిపోరు. నీవూ, స్టార్‌బక్. ఒకే జాతివాళ్ళు. మీది మానవజాతి. ఆ జాతి యంతా మీ వంటిదే. ఈ అహాబ్ ఒక్కడే కోటానుకోట్లకొలది ఉన్న ఈ జాతిలో విలక్షణుడు. అతనికి దేవతలుగాని, మనుష్యులుగాని స్నేహితులు కారు! ఏయ్, పైన ఉన్నవాళ్లూ! మీకు కనబడుతోందా! ప్రతి బల్లుకీ ఒక కేక వేస్తూఉండండి!" అన్నాడు.

రోజు గడచింది. సూర్యుని బంగారు చేలాంచలం మాత్రం మిగిలింది. అంతలోనే చీకటి పడింది. కాని ఓడ స్తంభంమీద ఉన్నవాళ్లు అక్కడే ఉండిపోయారు.

"ఇప్పుడేమీ కనబడంలేదు, అంతా చీకటండి" అన్నాడు ఒకడు.

"ఎటు వెడుతోంది!"

"ఇదివరకు లాగానే - ఎడమవైపు"

"సరే! చీకటి పడింది కామా! కొంచెం మెల్లగా నడుస్తుంది. స్టార్ బర్; తెల్లవారేదాక దానిని కాలిసిల్ల కూడదు - మీరు క్రిందకి దిగండి. స్టెప్. రాత్రి కావలా ఉండటానికి ఇంకొకని పైకి పొమ్మనండి." ఓడ స్తంభంలో తాను మొదట ఉంచిన బంగారునాణెమును సమీపించి "ఈ బంగారం నాది, నేనే దీనిని సంపాదించుకొన్నాను. కాని తెల్ల తిమింగిలం చచ్చేవరకు దీనిని ఇక్కడే ఉంచుతాను. అది చచ్చిననాడు దానికళేబరమును మీలో ఎవరు పైకిలాగుతారో వానిది ఈ బంగారం. కాని, ఆ రోజున కూడా నేనే లాగితే, ఈ నాణెమునకు పదిరెట్లుసొమ్ము మీకు పంచిపెడతాను. ఇక పదండి!"

వాళ్ళను పంపించి, తాను వెళ్ళి మెట్లమీద నిలబడ్డాడు. ముఖముమీదికి టోపీని వేసుకొని, తెల్లవారేవరకూ అక్కడే నిలబడ్డాను. మధ్యమధ్య బయటకువచ్చి, రాత్రి ఎల్లా గడుస్తోందో గమనిస్తూ ఉండేవాడు!

83 రెండవరోజు వేట

తెల్లవారగనే ఓడ స్తంభాల మీదకి ఇంకొక జట్టును పంపించారు. కాస్త వెలుగు వచ్చిన తరువాత అహాబ్ కేక వేశాడు. "మీకు కనబడుతూవుందా" అని.

"ఏమీ కనబడటం లేదండి"

"సరే- తెరచాపలన్నిటినీ విప్పండి — నేననుకున్నదాని కంటె వేగంగా పోతోందన్నమాట. రాత్రికూడా ఆ చాపలను దింపకుండా ఉంచవలసింది. అయినా ఫరవాలేదులే-"

విడువకుండా, రేయనక పగలనక ఒక్కటే తిమింగిలను ఈ విధంగా తరుముకొని వెళుతూ వుండటం తిమింగిలాల వేటలో అబ్బురమేమీ కాదు. కొందరు నన్‌టుకెట్ నౌకాదళాధిపతులు ఒక్కసారి ఏదైనా ఒక తిమింగిలం చూస్తే చాలు ఇక ఆపైని అది ఏ దిక్కున ఎంత వేగంతో వెళ్తూవుందో చెప్పగలరు. వారికి ఆ అద్భుతశక్తి ఉంది. దానితో పాటు అనుభవమువల్ల కలిగే భవిష్యద్జ్ఞానము, తమ సామర్థ్యమునెడ దృఢమైన విశ్వాసము కూడా వారికి కలుగుతాయి. తాను చేరవలసిన తీరాన్ని ఓడని నడిపేవాడు గుర్తుపెట్టుకొన్నట్లు, వేటగాడు తాను పగలు చూచిన తిమింగిలం ఆ రాత్రి ఎక్కడ వుంటుందో, మరునాటి ఉదయం ఏ తావున ఉన్నది చెప్పగలడు. అతను ఆ తావులు గుర్తులో పెట్టుకొని అటుపోతాడు. ఈ అద్భుతశక్తివల్ల, నీటిమీద ప్రాతవలె

చూడ కావరాదనుకో. తిమింగిలపు పోకడ, అచ్చుగుద్దిన ప్రాత వలె నిర్ధారితమై యుంటుంది. ఆధునిక యుగంలో రైళ్లు వెళ్లే వేగాన్నిబట్టి ఫలానా వేళకి ఫలానాచోట రైలు ఉంటుంది అని చెప్పబడుతూ వున్నట్లు, ఈ నన్టుకెట్ వేటగాళ్లు తిమింగిలం వెళ్ళే వేగాన్నిబట్టి ఇన్ని గంటల తరువాత ఈ తిమి గిలం రెండు వందలమైళ్ళు వెళ్లుతుంది, ఫలానా చోటుకు చేరుతుంది, అని చెప్పగలుగుతారు. నిశితమైన ఈ అంచనాలన్నిటికీ గాలి, సముద్రముకూడా వేటగానికి సహాయ పడాలి.

ఒక సముద్రాన్ని చీల్చుకొంటూ వెళ్ళి పోతూవుంటే, ఫిరంగినుంచి వెడలే గుండు పొరపాటుగా నేలమీదపడి, నాగలిలాగ భూమిని దున్నినట్టుంది.

స్టబ్ అన్నాడు. "ఏమివేగం! ఏమివేగం! నా ఒళ్లు పులకరిస్తోంది. ఈ ఓడా, నేనూ భలే ధైర్యవంతులం! హో! హో! నన్నుకూడా సముద్రముమీద వెల్లకిలా పడవేయండి. నా వెన్నుకూడా ఓడ అడుగుభాగం వంటిదే."

"అదిగో! నీటిని చిమ్ముతోంది" అంటూ పైనుంచి కేకలు వినబడ్డాయి.

స్టబ్ అందుకొన్నాడు. నాకు తెలుసు—నీవు తప్పించుకోలేవు-తిమింగిలమా! నీవెనుక పిచ్చి ఎత్తిన దయ్యం ఒకటి వస్తోంది! నీవు అహాబ్ చేతులలో పడతావు"

అందరూ అనుకుంటూ ఉన్న మాటలనే స్టబ్ పైకి అన్నాడు. ఆ వేట వెఱ్ఱి అందరి తలలలోకి ప్రాకింది. కొందర

రికి అంతకుముందు ఏమాత్రమైనా భయసంకోచాలుంటే అవన్నీ అహాబ్ సముత్సాన మాసిపోయినాయి. వాళ్ళు విధికి కైవశ్యులైనారు. క్రితంరోజున అలజడి కలిగించిన ప్రమాదాలు, గడచినరాత్రి మనోవ్యథకు సంధిగ్ధావస్థ తదే దీక్షతో నిర్భయంగా పారిపోతూవున్న తనగురికొంట వేగంగా పోతూ ఉన్న ఓడ—ఇవన్నీ కలిసి వాళ్ళని వివశులను చేశాయి. తెరచాపలను నిండుగా పూరించి కంటికి కానరాని తన చేతులతో వాయువు ఓడను తోసివేస్తున్నట్లుంది. వారికి గోచరం కాక, వారిని తనవశం చేసికొని ఈ వేటకు పంపిన ఆ మహాశక్తికి, అది కావ్యాచిహ్న మనిపించింది.

ఆ ముప్పదిమంది ఒక్క వ్యక్తిగా అయిపోయినారు. పడవతయారు చేయుటంలో ఉపయోగింపబడిన పలురకాల కలపముక్కలు అన్నీ కలిసి ఒక ఏకస్వరూపంను దాల్చి, వెన్నుదూలంమీద ఆధారపడినట్లు ఆ నావికుల వ్యక్తిత్వాలన్నీ — ఒకని భయము, ఒకని ధైర్యము, ఒకని పుణ్యచింత, ఒకని పాపచింత, — అన్ని స్వభావాలూ కలిసిపోయి వారికి ఏకైక ప్రభువు అయిన అహాబ్ మీద ఆధారపడి అతని గమ్యం వైపే మరలి ఉన్నాయి.

ఓడ స్తంభాలు సజీవమయినాయి. వాటిమీద మనుష్యులు నిలబడ్డారు. చేతుల నాడించేవారు కొందరు, కళ్ళలోకి ఎండ పడకుండా చేతులుని అడ్డంపెట్టుకొనేవారు కొందరు, ఆ స్తంభాలనిండా మనుష్యులే! వాళ్ల అందరి కర్మ వశ్యమైనా అనుభవించటానికి సిద్ధంగా ఉంది. పర్యాప్త

మైన ఆ నీలిమలో వాళ్ళు తమ మృత్యువును వెతుక్కొంటూ ఎల్లాపోతున్నారో !

ఒక కేక వినబడి, మళ్ళీ చాలాసేపటి వరకు పలుకు లేకపోయేసరికి, అహాబ్ "కేకపెట్టరేం! మీకు కనబడితే! నన్ను పైకి ఎక్కించండి! ఒకసారి కనబడి మాయమై పోయిందే మాబీడిక్ ! మీరు మోసపోయినారేమో!"

అతను అన్నట్లే జరిగింది. స్తంభంమీద ఉన్నవాళ్లు దేనో చూచి తిమింగిల మనుకొన్నారు. అహాబ్ పైకి చేరాడో లేదో అతను వేసిన ఒక్క కేక ఒక పెద్ద సంగీత మేళానికి నాందియై, దిక్కులు దద్దరిల్లేట్టు చేసింది. ఒక మైలు దూరంలో మాబీడిక్ కనబడింది. ముప్పై కంఠాలు ఒక్కసారి విజయోత్సాహంతో కేక వేశాయి. చిన్న నీటి జల్లులతో తన ముక్కును మాత్రం చూపించి గాని 'మాబీడిక్' తన ఉనికిని తెలియజేయలేదు. అది అతివేగంగా గాలిలోకి ఎగిరింది. పర్వతమంత నీటి నురగను లేవదీసి, చుట్టూ ఏడు మైళ్ళ వరకూ కనబడేటట్టు లేచింది. ఆ సమయంలో అది త్రోసివేసే కెరటాలు దాని ఒంటిమీద జూలువలె కనబడ్డాయి. అది దాని తిరస్కార భావానికి సూచన.

"అదిగో పైకి వచ్చింది!" అని అందరు ఒక కేక వేశారు. ఆ నీలి కెరటాల మధ్య ఆ నీలాకాశం క్రింద అంత హఠాత్తుగా ఆ తిమింగిలం లేపిన నీటితుంపర మంచుగడ్డవలె మెరిసింది. క్రమక్రమంగా, మెల్లమెల్లగా ఆ తుంపరయొక్క

ప్రకాశంపోయి దూరాన పడుతున్న వానజల్లులతో మసక మసకగా మారిపోయింది.

“తుదిసారి ఒళ్ళు బాగా కడుగుకో, మాబీడిక్! నీ గడియ దగ్గరపడింది” అని అరుస్తూ అహబ్ “దిగండి, ఒక్కడు తప్ప అంతా దిగండి! పడవలను సిద్ధం చేయండి” అన్నాడు.

వాళ్ళు దిగటానికి ఉపయోగించుకొనే తాళ్ళనుగాని, కప్పీలనుగాని ఉపయోగించకుండానే ఒక్కసారిగా అందరూ రాలిపోతున్న పండ్లలాగ జారిపోయారు. ఒక్కొక్కళ్ళే ఓడలోట్టు మీదకి వచ్చిపడ్డారు. వాళ్ళంత వేగంగా తోశపోయినా, అహబ్ కూడా వడిగా క్రిందికి వచ్చేశాడు.

“దింపండి పడవలు!”

మళ్ళీ అతనికి యింకొక పడవను అమర్చారు.

“స్టార్‌బక్ ఓడ నీది. దానిని పడవలకు కొంత అందుబాటులో ఉంచు. దింపండి!” అన్నాడు అహబ్.

నావికులను అదలుకొట్టటానికా అన్నట్టుగా ‘మాబీడిక్’ వాళ్ళవైపుకు రాసాగింది. అహబ్ పడవ మధ్యలో ఉంది. తక్కినవాళ్ళను ఉత్సాహము చేస్తూ తిమింగిలాన్ని దాని నుదటిమీద ఢీకొట్టాలని అన్నాడు. తిమింగిలం చేరువకు వచ్చినప్పుడు అల్లా చేయటం మామూలే. కాని అది చేరువకు రాకముందే ఆ తిమింగిలం తన వేగాన్ని ఒక్కక్షణంలో విపరీతంగా హెచ్చించుకొని, నోరు తెరచుకొని ఆ పడవల మధ్యపడి తోక విసిరికొడుతూ అతి భీతావహంగా అన్ని

పై ఫలా పోరాట సాగింది. ప్రతిపడవ నుండి తన మీదకి ఈటెలు పడుతూ వున్నా లెక్క పెట్టక, అన్ని పడవలనుతునా తునకలు చేసివెయ్యాలనే తృష్ణతో వున్నట్టుంది. మొండి నేర్పుతో నడుపబడి ఆ పడవలు దాని దెబ్బ తప్పించుకొన్నాయి. ఒక్కొక్క సారి వెంట్రుక వాసిలో తప్పించుకోవటం కూడా జరిగింది. అహాబ్ వేసిన అతిలోకమైన కేక మిగిలిన శబ్దాలన్నిటిని అణచి పైకి ఎగసింది.

తెల్ల తిమింగిలం గిరగిరా తిరుగుతూవుంటే పడవల నుండి విడువబడిన అనుప్రతాళ్ళు దాని చుట్టూ మెలికేస్తుకొన్నాయి. ఆ తాళ్ళు గుంజటంతో పడవలు ముందుకు వచ్చాయి: అసలు ఆ సమయానికి కొత్త పత్తున పుంజుకొని మరల మీదికి దూకటానికి తిమింగిలం ఒక వక్కగా ఆగింది. ఆ అదను చూచుకొని, అహాబ్ మరికొంత తాళ్ళని విడిచాడు.

ఈ త్రాళ్ళలో ఈటెలూ బల్లెములూ చిక్కుకొని మెరస్తూ అహాబ్ పడవమీదికి వచ్చివేశాయి. వీటినుండి తప్పించుకోటానికి అతను ప్రయత్నిస్తూ వుండగా తిమింగిలం మిగిలిన తాళ్ళ సమూహంలోకి గెంతి, స్టబ్ ఫ్లాస్కుల పడవలను తన రెక్కల క్రిందకి లాగి వాటిని చితుకగొట్టి మళ్ళీ నీళ్ళలోకి మునిగిపోయింది. అది మునిగిపోతూ వుండగా ఏర్పడ్డ సుడిగుండంలో చిక్కిపోయిన పశువముక్కలూ గిరగిర తాంగ రాలవలె తిరిగాయి.

ఆ పడవలలోని మనుష్యులు కూడా గుండ్రంగా తిరుగుతూ నీళ్ళలో పడిపోయిన తమ తెడ్లను (వాళ్ళు అందుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. ఫ్లాస్క్ ఒక ఖాళీ పీపాలాగ మాటిమాటికీ పైకి లేస్తూ తన కాళ్లు సొరచేపల బారినుండి తప్పించుకోవటానికి పైకి ఎగరవేస్తున్నాడు. తనను పైకి తీయమంటూ స్టబ్ పెద్దగా కేకలు వేస్తున్నాడు. ఒక్కుమ్మడిగా వాళ్ళు బహు ప్రమాదాల మధ్య చిక్కుకొన్నారు. అంతలో సాగరగర్భంనుండి శరవేగంతో పైకి వచ్చి తన నుదుటితో తిమింగిలం అహాబ్ పడవను ఢీకొంది. దానితో అంతవరకూ భద్రంగా ఉన్న ఆ పడవ ఒక్కసారిగా పైకి ఎగిరింది! అహాబ్, అతనితోపాటు అందులో వున్నవాళ్ళు నీళ్ళలో పడ్డారు. ఎగిరి, పడవను ఎత్తి పారవేసిన ఊపులోనే ఆ తిమింగిలం, ఆ స్థానం వదిలిపెట్టి వేరొక చోట అటు మొగము పెట్టి పడుకొని, అటూ ఇటూ ఏమైనా వస్తోందేమోనని తన రెక్కలను ఆడిస్తూ గమనిస్తూనే ఉంది. నీటిమీద తేలి తెడ్డుముక్కగానీ, చిన్న చెక్కగాని ఏదైనా దాని ఒంటికి తగిలితేచాలు, వెనుకకుపోయి, నీటిని తోకతో బాదేది. ఆనాక తాను చేసిన పనికి సంతృప్తి చెందినట్టుగా అక్కడనుంచి ఎడమవైపుకి పయనం సాగించింది. దానితోపాటు, దానిని చుట్టుకొన్న తాళ్ళు వెళ్ళిపోయినాయి.

మునుపటి వలెనే, ఓడ పడవలకు సహాయపడటానికి వచ్చింది. నావికులను, తెడ్లను, ఇంకా దొరికిన వాటినల్లా

అంటుకొని తన తట్టుమీదకి తోసికొన్నది. కొందరికి బాహువులలో, కొందరికి ముంజేతులలో, కొందరికి పాదములలో బెణుకులు పట్టాయి. చేరవేసిన సామానులలో ఈ బెంచీ, బల్లెములు చుట్టలు చుట్టలుగా పడవేసుకొన్న తాళ్ళు, విరిగి పోయిన తెడ్లు, చెక్కలు - ఇవి అన్నీ ఉన్నాయి. కాని ఎవ్వరికీ పెద్ద ప్రమాదమేమీ వాటిల్లలేదు.

క్రితంరోజు ఫెడెల్లావలె, ఆనాడు అహాబ్ తన పడవలో సగభాగాన్ని పట్టుకొని వ్రేలాడుతూ, నీటిపై తేలుతున్నాడు. కాని ఈనాడు అతను తప్పిపోలేదు.

అతనిని తట్టుమీదకి తీసికొని వచ్చారు. అక్కడ కూడా అతను స్టార్‌బక్ బుజముమీదే ఆనుకొని ఉన్నాడు. అందరి చూపులు అతనిపై వ్రాలాయి. అతని దంతపు కాలు పోయింది. చిన్న ముక్క మాత్రం మిగిలింది.

"స్టార్‌బక్! ఎవడు ఏమనుకొంటేనేమి! ఇట్లా ఆనుకోవటం బాగానే ఉండేట్టున్నది. ఈ ముసలి అహాబ్‌కు ఇంకా తరచుగా ఇటువంటి ఆధారం దొరికితే బాగుండును"

వడ్రంగి ముందుకు వచ్చి "నే నెంతో కష్టపడి చేసినా, కాలు నిలువలేదండి" అన్నాడు.

స్టబ్ ఆందోళనగా, "ఎముకలు మాత్రం విరగలేదనుకుంటాను" అన్నాడు.

"ఆఁ! చిన్న చిన్న ముక్కలై పోయాయి, స్టబ్! చూడు, ఎముక విరిగినా అహాబు లెక్కచెయ్యడు. పోయిన ఈ ఎముకకంటె, నాకు ఉన్న ఏ ఎముకకీ నేను ఎక్కువ

ప్రాధాన్య విధ్వను! ఆహాబు యొక్క నిజరూపం చూస్తే ఈ తెల్ల తిమింగిలం గాని, ఏమూకపిగాన్నా, ఏ దయ్యంగాని సమీపించలేవు! ఓయ్! పైన ఉన్నవాళ్ళూ! ఎటు వెళుతూవుంది!"

"ఎడమవైపుకే నండి"

"మళ్ళీ తెరచాప లెత్తండి మిగిలిన పడవలను దింపి సిద్ధం చేయండి. స్టార్‌బక్! వెళ్ళి మనుష్యులను, పడవలను సిద్ధం చేయి."

"ముందు నన్ను అటు తీసుకొని వెళ్ళనీయండి"

"ఓ- ఈ ముక్క నన్ను తినివేస్తూవుంది. అజేయమైన ఆత్మబలం గల నాయకునకు ఇంత పిరికి కాబేదారు ఉండటం ఎంత దురదృష్టం!"

"ఏమిటండీ_"

"ఏమీ లేదయ్యా, నా శరీరం నూట చెప్పాతున్నాను- నిన్ను గురించికాదు. ఊతకోలగా దేనైనా చేతి కందించు- ఈ కొయ్యముక్క చాలులే. మనుష్యులను ఆయత్తపరచు! అసలు ఇప్పటిదాకా నేను మళ్ళీ వానిని చూడలేదు! తప్పించుకొని పోలేదు గదా! అందరిని ఒకసారి పిలు."

ముసలివాని సందేహం యథార్థమై పోయింది. అందరిని పిలిచారు పార్శీవాడు కానరాలేదు, స్టబ్ అన్నాడు!

"పార్శీవాడు ఏడీ!"

"అందరూ పరుగెత్తండి — ఓడంతా గాలించండి వానిని వెతకండి- ఎక్కడికీ పోయి ఉండడు"

వెతికి వెతికి వాడు కనబడలేదంటూ అందరూ త్వరగా తిరిగి వచ్చారు.

స్టబ్, "అప్పుడండి! మీరా పడవను వంచి వేసిన తాళ్లలో చిక్కుకొన్నాడు— అతను క్రిందికి లాగబడటం చూసినట్టున్నాను" "నా తాడా! పోయిందా! ఆ మాటకి అర్థం ఏమిటి? ఆ మాట వింటే నా గుండెకు ఈ కంపం ఘడుతో ఉద్దు! ఈటె ఏదీ - అక్కడ వున్న చెత్తలో ఉండేమో చూడండి! బాగా పదునుగా ఉంటుంది. తెల్ల తిమి గిలానికి — లేదూ! లేదూ! ఈ చేయితో దానిని విసిరివేసిందీ- ఏయ్— పైన ఉన్నవాళ్ళు - దానిమీద ఒక కన్ను వేసి ఉంచండి- త్వరగా అందరూ వెళ్ళి పడవలు సిద్ధం చేయండి- తెడ్లను, ఈటెలన్నీ బల్లేలను తీసుకోండి. తెరచాపల్ని ఎత్తండి! హేయ్ పరంగా జాగ్రత్త. కావలసివస్తే ఈ భూమి చుట్టూ పదిసార్లు ప్రదక్షిణం చేస్తాను. సముద్రపు పట్టానికి దూకిపోతాను. కాని ఈ తిమింగిలాన్ని చంపితీరాలి!"

ఇలా అన్నాడు స్టార్‌బక్: "భగవంతుడా! ఒక్కసారి దర్శన మిమ్మా ముసలివాడా! నీవు ఈ తిమింగిలాన్ని ఎప్పటికీ పట్టుకోలేవు. నీకు పుణ్యం ఉంటుంది ఇక మానివేయి. దయ్యానికి పిచ్చి ఎత్తినంతకంటె ఘోరంగా ఉంది. రెండు రోజుల వేట అయింది. పడవలు రెండుసార్లు ముక్కలైనాయి. నీవు చూస్తూ వుండగానే నీ కాలు పోయింది. సమస్త దేవతలు నిన్ను వారిస్తున్నారు. ఇంతకంటె ఇంకేమి కావాలి? ఈ భయంకర జంతువు, తుదకు మనలో ఒక్కడైనా లేకుండా

చేశావా, దీని తగుపుతూనే ఉందామా! ఇది మనని సముద్రం అడుగుకి ఈడ్చి వేయవలసిందేనా! దానితోకను పట్టుకొని ఏ నరకలోక కూపారాలలో పోదామా! ఇంకా దానిని వేటాడటం మహాపచారం, ఘోరపాపం!"

"స్టార్‌బక్, ఆనాడు నీ కళ్లలోకి చూచినప్పటి నుంచి నీమీద నాకు చాలా అభిమానం కలిగింది. కాని ఈ తిమింగిలం విషయంలో నీవేమీ ఎదురు మాటాడకు. అహాబు ఎప్పటికైనా అహాబే! ఈ కార్యమంతా అచల చలంగా నిర్ణయమైనది. ఈ సముద్రంకూడా పుట్టని కొన్ని యుగాల క్రితమే నీవు, నేను ఈ కార్యాన్ని మననం చేసి అభ్యాసం చేశాము. పిచ్చివాడా! విధికి నేను సామంత రాజును. విధి ఆజ్ఞ కింకరుడను. ఎంత కాదన్నా నీవుకూడ నా ఆజ్ఞను శిరసావహిస్తావు, చూడు. నా చుట్టూ రండి. అంతా మీ ఎదురుగా ఉన్నవాడు ఒంటికాలిమీద నిలబడి, ఒక కొయ్యను ఊతగొన్న ముసలివాడు! అది అహాబు యొక్క భౌతిక రూపం. కాని, ఈ ముసలివాని ఆత్మ దశ-శత సహస్ర పాదాలమీద నడుస్తుంది! నేను అలసిపోయినాను. పురి విచ్చిపోయిన పడవతాళ్ళవలె ఉన్నాను. మీకు కూడా అలాగే కనబడుతున్నానేమో! కాని, నేను పతనమయ్యేముందు ఫెళ ఫెళా రవాలు పుట్టుతవి. అవి వినబడే వరకు నా లక్ష్యం మారదని తెలుసుకోండి. మీకు శకునాల మీద నమ్మకమున్నదా! ఉంటే వినండి—నీటిలో పడినవాడు రెండుసార్లు తేలిమునిగి, మూడవసారి కూడా తేలి, అంతిక్షో

కానరానంత మునిగిపోతాను. మాబీడిక్ కూడా అంతే; రెండు రోజులపాటు పైకి తేలింది- రేపు మూడవరోజు! ఇంకొక్క సారే తేలుతుంది_అది ఆఖరిసారి! నాకు ధైర్యం కలిగించాలి ధైర్యం!"

"నిప్పువంటి ధైర్యం వచ్చింది" అన్నాడు స్టబ్.

"అవునవును - నా ధైర్యం యాంత్రికం కూడాను" అన్నాడు అహాబ్. నావికులు ముందుకు పోయినారు. "శకునాలు! విరిగిన నా పడవను గురించి స్టార్బక్ తో నిన్ననే మాట్లాడాను. నా మనస్సు వంటిపెట్టుకొని వినువని భావాలు యితరుల మనస్సులనుండి తుడిచి వేయాలని ఎంతప్రయత్నిస్తున్నాను! పార్సీవాడు పోయాడు! అతను నా కంటె ముందు వెళ్ళాడు. కాని, నేను చనిపోయేలోగా ఇంకొక సారి వాడు కనబడాలి. ఇదే సమస్య? దీనినే పూర్తిచేయాలి!" అని అహాబ్ ఒంటిగా అనుకొన్నాడు.

పొద్దుక్రుంకింది. కనుచీకటి పడేదాకా తిమింగిలం ఎడమవైపున కానవస్తూనే వుంది.

మళ్లీ తెరచాపలు దించారు. గతరాత్రివలెనే ఆ రాత్రికూడా జరిగింది. కాని, మర్నాటి ప్రయాణానికి ఓడను, ఈటెలను సిద్ధంచేసుకోవటానికి దీపపు కాంతులలో పనిచేసుకొనే వాళ్ళ సమ్మెటల చప్పుడు, సానపెట్టే రాతి చప్పుళ్ళు వినిపించాయి. అహాబ్ పడవ ధ్వంసమైపోగా మిగిలిన అడుగు భాగంతో మరొక కాలు తయారుచేసి పెట్టారు, వడ్రంగి. అహాబ్ యథాప్రకారం పొట్టమీద నిల

ఖర్చాడు. ఎవ్వరికీ కానరాకుండ పరలుప్పుకొన్న అతని చూపు పూర్వ్యాని కోసం వేచియున్నది. సూర్యోదయాంను ఆతురతతో ఎదురుచూస్తూ తూర్పుదిక్కు మొగమై కూర్చున్నాడు.

84. మూడవ రోజు వేట

మళ్ళీ ఒక క్రొత్త రోజు వచ్చింది. ఒంటిగా రాత్రి యంతా కావలి ఉన్నవానికి బదులు ఒక పెద్ద మూక అక్కే వణకి స్తంభాలమీద ఎక్కింది. ప్రతి స్తంభం మీదనూ మనుష్యులే!

"మీకు కనబడుతూవుందా!" అని అహాబ్ అడిగాడు. కాని, ఇంకా తిమింగిలం కానరాలేదు

"అది ఎప్పుడూ దారి తప్పదు. ఆ దానిని గమనించండి పరంగా! నీవు ఎప్పటివలెనే జాగ్రత్తగా ఓడ నడుపు."

ఎంత మనోహరమైన రోజో! యిదే ఒక నూతన ప్రపంచమై, దేవతలకు ఒక పూవరిల్లయి ఆ పూవింటిలో దేవతలు ఈ నాడే అనుభవిస్తూ వుంటే ఆ ప్రపంచంలో యింతకంటె మనోహరమైనరోజు మరొకటి ఉండదు! ఇది ఆలోచనకు విషయం. కాని అహాబ్‌కి ఆలోచించటానికి వ్యవధి లేదు. అతను అనుభవించటం తప్ప వేరేమీ చేయ లేడు. మర్త్యునికి అనుభవించటమే చాలు. ఆలోచించటం అహంకారమే కదా! ఆ హక్కు, ఆ అధికారం భగవంతునికే ఉంది. ఆలోచన అన్నది అవ్యాకుల ప్రశాంతిలో జరగవలసినది. అందుకు భిన్నంగా మన పేద హృదయాలు దడదడలాడుతున్నాయి. మన పేద మనస్సులు అతివేగంగా పోతూవుంటాయి. కాని అప్పుడప్పుడు నా మనస్సు కూడా

ప్రశాంతంగా ఉన్నట్టు అనిపిస్తుంది. మంచుగడ్డవలె ప్రశాంతంగా అయిపోతుంది. లోని పదార్థాలు మంచువలె గడ్డకట్టి పోగా, పాత్ర పగిలిపోయినట్లు, మారిపోతుంది నా కపాలం! అయితేనేమి! ఈ జుట్టు పెరుగుతూనే ఉంది. ఈ గోళ్ళు కూడా! అవి పెరగటానికి వేడిమి కావాలిగదా. గాలి నా జుట్టును ఎలా లేపేస్తూవుందో! గాలివానలో కొట్టుకుపోతున్న ఓడను అంటిపెట్టుకొనే తెరచాపల తునకలవలె నా చుట్టూ రేగుతుంది. ఈ పాడుగాలి కారాగారాల వసారాలలో గదులలో అన్ని ప్రతులలో వీచి వాటినుండే బయటకు వచ్చేయుంటుంది. అది కలుషితం: నేనే గాలినైతేనా ఆ క్రూరప్రదేశాలమీద, ఆ దురదృష్టప్రదేశాలమీద వీచనే వీచను. ఏ గుహాలోనో దాగియుంటాను. ఏమయితేనేమి, అసలు గాలి చాలా మహోన్నతమైనది. యుద్ధవీరుని వంటిది. గాలిని జయించినవాడెవడు? ప్రతిసమయంలోనూ అంతిమ ప్రతీకార ప్రహారము గాలిదే. గాలిలో ఒక ఈటె ఝుళిపించి, అది గాలిని దూసుకు పోతుంది. గాలి పిరికిది! అయినాలువేసి మనుష్యులను నిరోధిస్తుందిగాని తాను ఒక్క దెబ్బ తినటానికి సిద్ధపడదు. ఆఖరికి అహాబ్ కూడా అంతకంటె ధైర్యశాలి - అంతకంటె ఉదారుడే. ఈ గాలికే శరీరమనేది ఉంటేనా! - మానవునికి విసుగూ కోపము కలిగించే వాటికి వేటికీ శరీరాలుండవు. పదార్థాలుగా అవి మూర్తులు కాకపోవచ్చుగాని, కార్యకర్తలుగా మూర్తిమంతములే. ఈ రెంటికి అతి చిత్రమైన వ్యత్యాసమున్నది. ఏమయినా వాయువు

కృప, మహిమ కలదనే అంటాను. స్వర్గంనుండి నేరుగా వచ్చే యీ వెచ్చని ఋతుపవనాలు తమ మార్గం తప్పించవలెనని సముద్రములోంచి లేచే తరంగాలు నేలమీది మహానదులు, ఎంతగా ప్రయత్నించినా తమ దారి తొలగకుండా పోతూనే వుంటాయి. ఇప్పుడు నా ఓడను నడిపే ఈ పవనాలలో యిటువంటి మరి దే వాయువులో నా మనస్సును ఉల్లాస పరుస్తాయి. సరే! ఏయ్ - మీ కేమయినా కనబడుతోందా!"

"ఏమీ లేదు"

"మిట్టమధ్యాహ్నము సమీపిస్తూ వుంటే యింతవరకు ఏమీ లేదా! నా బంగారు నాణెం అట్లా ఉండిపోవలసిందేనా! తిమింగిలంను దాటివచ్చాను, నేను దానిని తరుముటకు బదులు - అదే నన్ను తరుముతోంది. ఎంతపని జరిగింది! నేను పట్టి బండను. ఆ మాత్రము తెలుసుకోలేక పోయాను - త్రాళ్ళనూ ఈటెలనూ అది ఈడ్చుకొని పోతూ వుంటే రాత్రి దానినే కాబోలు చూశాను. త్రిప్పండి! ఓడను త్రిప్పండి - దిగండి - కాపలావాళ్ళు తప్ప అంతా దిగండి."

'పెకోడ్'కి అంతవరకు గాలి అనుకూలంగా వుంది. యిప్పుడు త్రిప్పేప్పటికి ఎదురుగాలికి కష్టము మీద పోసాగింది.

స్టార్‌బక్ అనుకొన్నాడు: "గాలికి ఎదురుగా తెరచి వున్న మృత్యుముఖంలోకి పోతున్నాడు. భగవంతుడే మమ్మల్ని రక్షించాలి! నా ఎముకలు అప్పుడే తడిసి ముద్దయి పోయినాయి. నా ఒళ్ళంతా లోపలినుంచే చల్లబడిపోతూ వుంది. వీని ఆజ్ఞను పాలిస్తూ, ప్రభువు ఆనతిని మీరుతున్నానేమో!"

అహాబ్, "ఇక్కడ నిలబడు. నన్ను పైకి పంపించు మనకు ఇప్పుడే కనబడుతుంది." అన్నాడు.

"సరేనండి" అంటూ అహాబ్ చెప్పినట్టు చేశాడు స్టార్‌బక్. అహాబ్ పైకి ఎగసిపోయాడు.

ఒకగంట, ఒక యుగంగా గడిచింది. కాలగమనమే మందగించిపోయిందా అనిపించింది. ఇంతలోనే అహాబ్‌కి ఆ తిమింగిలం కనబడింది. ఒక్క పెట్టున మూడు స్తంభాలనుండీ మూడు కేకలు లేచాయి. ఆ కేకలు అగ్నిజిహ్వాలు వేసినట్లున్నాయి.

"మాబీడిక్ - మూడోసారిగా నీ నుదుటిని నా నుదుటితో ఢీకొంటున్నాను. ఓడను త్వరగా పోనివ్వండి. ఇంకా దూరంగానే ఉంది.! స్టార్‌బక్, పరంగు దగ్గర నిలబడు ఒక సుత్తితో! చాలా వేగంగా పోతోందే! నేను క్రిందకిదిగాలి! ఈలోగా ఇంకొకసారి ఇక్కడనుంచే సముద్రాన్ని బాగా చూడాలి. పాతదృశ్యమే ఇది. కాని ఎంతో క్రొత్తదివలె

ఉంటుంది ! నా చిన్నతనంలో నన్‌టుకేట్ ఇసుక తిన్నెల నుండి చూచినప్పుడూ ఇట్లాగే ఉంది. ఏమాత్రమూ మార లేదు ! ఆటువైపు చిన్నబిల్లు పడుతోంది ! ఈ సముద్రం నేలకంటే ఘనోదారమైన దానికి దేనితో దారితీయకూడదూ! ఎడమవైపు! అదీ తెల్లతిమింగిలం పోతోంది. ఈ ఓడ స్తంభంలో పచ్చగా ఉన్నదేమిటి! ఓ! ఆ పగుళ్ళలో నాచు పట్టిందన్నమాట ! ఈ అహాబ్ తలకి అట్లా నాచుపట్టదు! మనిషి ముసలితనానికీ జడపదార్థాల ముసలితనానికి అదే తేడా ! ఈ స[illegible]భము నేనూ కలిసే ముసలివాళ్ళ మౌతు[illegible]న్నాం. అడుకున్న మాత్రం బాగానే ఉన్నాం! అయితే, నాకు ఒక కాలుకూడా లేదుగా! చచ్చిన ఈ కలపే సజీవుడనైయున్న నాకంటె మేలుగా ఉంది: అసలు నాకు దానితో పోలికే లేదు. చచ్చిన చెట్లతో తయారైనా [illegible] ఓడలు మనుష్యులకంటె ఎక్కువకాలం మన్నిక కల్గి యు[illegible]వ్వనూ— దన్నమాట ఏమిటి! నాకంటె మ[illegible]కు దాటిపోతూ వెడతాననే కాదూ! మళ్ళీ కనబడుతాడా ! కాని ఎక్కడ! అగాధమైన సముద్రపు మట్టానికి అంతులేని మెట్లమీదనుంచి నేను దిగివెళ్ళినా, చూడటానికి నాకు కళ్ళేవి! వాడెక్కడ మునిగిపోయాడో తెలియదు. వానిని వెనుక దిగవిడిచి మీరిపోతూనే ఉన్నాను. పార్శీ వాడా ! నాకు సంబంధించినంతవరకూ ఘోరమైన సత్యాన్ని వచించావు. నీ వన్నట్టే చాలామంది అన్నారు. కాని అహాబ్! నీగురి తప్పింది. అక్కడకే వస్తాను. స్తంభమా!

నేను లేనంతసేపు ఆ తిమింగిలంమీద ఒక కన్నువేసి ఉంచు మనం రేపు—కాదు ఈరాత్రే—మళ్ళీ మాటలాడుకొందాం అప్పటికి ఆ తిమింగిలం తలా, తోకా కలిపి ఓడకు బంధిం బడి, పడి ఉంటుంది."

అతని కోరిక ప్రకారం అతనిని క్రిందకి దింపారు, మరికొంతసేపటికి పడవలను నీటిపైకి దింపారు. ఓడ వెనుక భాగాన నిలబడి అహాబ్ స్టార్‌బక్‌ను పిలిచాడు.

"స్టార్‌బక్"

"అయ్యా"

"నా ఆత్మనౌక మూడవసారి తన ప్రయాణానికి బయలుదేరుతోంది, స్టార్‌బక్!"

"మీరు ఇట్లాగే జరగాలని కోరుకున్నారు."

"కొన్ని ఓడలు బయలుదేరిపోయి ఎన్నడూ తిరిగి రావు, స్టార్‌బక్"

"నిజమేనండి. అది దుర్భరసత్యం"

"కొందరు సముద్రపు పోటులో చచ్చిపోతారు. మరి కొందరు వరదలో పోతారు. నా మనస్సు ఉవ్వెత్తున ఎగిరి ఉన్న కెరటంవలె ఉంది. నేను ముసలివాడనయిపోయాను.—కరచాలనం చెయ్యి నాతో"

ఇద్దరూ చేతులు కలుపుకొన్నారు. స్టార్ బక్ రాల్చిన కన్నీటితో ఆ యిద్దరి కళ్లు అతుకుకొనిపోయినట్టున్నాయి.

"నా కెప్టెన్-కెప్టెన్-ఉదారచిత్తుడా! వెళ్ళవద్దు, దయ చేసి వెళ్ళవద్దు. నావంటి ధైర్యవంతుడే కంటతడి పెట్టుతూ ఉంటే ఈలా వేడుకోవటం ఎంత బాధాకరమో ఆలోచించు!"

అతని చేతిని విదిలించివేసి అహబ్, "దింపండి - వాహికలు - సిద్ధంకండి" అని కేక వేశాడు. మరుక్షణం పడవ ఓడవెనుకభాగాన్ని సమీపించింది. క్రింది గదిలోని కిటికీలో నుండి, ఒక గొంతు వినబడింది.

"అయ్యా, అయ్యా - సొరచేపలు. వెనుకకు మరలండి."

అహబ్‌కి ఆ కేక వినబడలేదు. అతని స్వరమే అంత కంటే ఉచ్చస్థాయిలో వుంది. పడవ ముందుకు పోయింది.

ఆ హెచ్చరిక నిజమే అయింది. పడవ ఓడను దాటిందో లేదో అనేకమైన సొరచేపలు నీటి అడుగునుంచి పైకివచ్చి పడవ తెడ్లను కొరకడం ప్రారంభించాయి. అల్లా కొరుకుతూ అవి పడవతోపాటు వెళ్ళాయి. అనేక జీవరాసులతో నిండియుండే ఆ సముద్రంలో తిమింగిలాల వేటకి వెళ్లే పడవల వెంట సొరచేపలు కూడా వెళ్తూంటాయి! యిది తూర్పుదేశాలలో సైనికులు యుద్ధానికి పోతూ వుంటే

ఏదో భావికాల జ్ఞానంతో రాబందులు వాళ్ళపైన ఎగురుతూ వెళ్ళటం వంటిది ! 'మోబీడిక్' కంటబడిన తరువాత 'పెకోడ్'కి కనబడిన సొరచేపలలో యివే మొదటివి. అహాబ్ పడవలోని నావికులు పచ్చని ఒళ్ళు కలవారవటం వల్లనో వాళ్ళ ఒళ్ళు కస్తూరి గంధాన్ని వెదజల్లుతూండటం వల్లనోగాని ఆ సొరచేపలు ఆ ఒక్క పడవనే వెంబడించాయి. మిగిలిన పడవల జోలికి అవి పోనే పోలేదు;

అంతకంతకూ దూరమవుతున్న ఆ పడవవంకే చూస్తూ స్టార్ బక్ " శివచిత్తుడా! ఆ దృశ్యాన్ని చూస్తే ఆశ్చర్యం కలగటం లేదూ నీ పడవను రాక్షసుల వంటి సొరచేపల మధ్యకు పంపి చూస్తూ వాటిచే తరుమగొట్టబడుతూ ఈ విషయమైన మూడవనాటి వేటకు వెళ్ళుతున్నావే! మూడు రోజులు ఎడతెగని తీవ్రమైన అన్వేషణ! మొదటి దినం ఉదయము, రెండవది మధ్యాహ్నము. మూడవది సాయంకాలం అవుతాయని గుర్తించుకో! ఆ సాయంకాలమే అంతంకూడా! ఆ అంత మెటువంటిదైనా సరే! ఓరి భగవంతుడా! ఏమిటో నాలో ప్రసరిస్తూన్నట్లుగా నన్ను చచ్చినవానివలె స్తబ్ధుని చేసివేస్తోంది. కాని దేనినో ఎదురు చూసేటట్టుగూడా చేస్తుందే! రానున్న వేవో నా కళ్ళ ముందు మెదులుతున్నాయి; పైపై ఆకారాలుగా అస్థిపంజరాలుగా! గతం అంతా మసకగా అయిపోయింది! మేరీ! నీ మూర్తి నా వెనుక భాగాన వివర్ణమై కరగిపోతూ వుంది! అబ్బాయి, నీవు కనబడుతున్నావు కాని నీ కళ్ళు నీలంగా

కలిగిపోతున్నారేమో! జీవితపు రహస్యాలు ఛేదింపబడుతున్న ట్టుంది - మధ్యలో మేఘాలు వస్తున్నాయి! జీవయాత్ర యొక్క అంతం సమీపిస్తోందా! రోజంతా నడచినవాని లాగ నా కాళ్ళు పీక్కొని పోతున్నాయి. నా గుండె ఇంకా కొట్టుకుంటోందా! స్టార్‌బక్ - ఒకసారి స్థిమితపడు. ఈ ఈ భావమును పారద్రోలు! బిగ్గరగా మాట్లాడు. ఏయ్ స్తంభంమీద ఉన్నవాడా! దూరంగా కొండమీద మా అబ్బాయి చెయ్యి కనబడుతోందా! ఇదేమిటి నా వెర్రి! ఏయ్, ఆ పడవను జాగ్రత్తగా కనిపెట్టండి — తిమింగిలం మీద ఒక కన్ను వేసి ఉంచండి. ఆ జెండాను తిరిమివేయండి. అదిగో జెండాను పీకుతోంది. అరే, జెండాను తీసుకొని ఎగిరి పోయిందే! అహబ్ ఎక్కడ? అహబ్ ఆ దృశ్యాన్ని చూశావా! చూస్తే శరీరకంపము కలగటంలేదూ!"

పడవలు అట్టే దూరం వెళ్ళలేదు. ఓడ స్తంభము మీద నుంచి తిమింగిలం నీటిలోకి మునిగిందంటూ సంజ్ఞ చేశారు. తిమింగిలం నీటిలో మునిగినట్టు అహబ్‌కి కూడా తెలుసు. అది మళ్ళీ తల ఎత్తేటప్పటికి దాని సమీపాన ఉండాలని అతని సంకల్పం. తన పడవని ఓడకు ప్రక్కగా పోనిస్తున్నాడు. మంత్రముగ్ధులయిన నావికులు అతి గంభీర మయిన మౌనం దాల్చారు. కెరటాలు పడవను బాదుతున్నాయి.

"ఓ తరంగములారా! మేకులు యింకా లోతుగా దిగగొట్టండి, ఖాళీ మూర్ఖలేని దానికి మేకులు కొట్టుడు

న్నారు. నాకు శవపేటికగాని, శవశకటం వుండవు! జనపనార ఒక్కటే నన్ను చంపగలదు! హా హా!"

ఉన్నట్టుండి వాళ్ళచుట్టూ వున్న నీరు పెద్ద పెద్ద వలయాలుగా పొంగి పైకి లేచింది. నీటిలో ఏదో వురుము వలె చప్పుడయింది. అందరూ ఊపిరి బిగబట్టుకొని వుండగా, త్రాళ్ళతో, ఈటెలతో, బల్లెములతోను కప్పబడిన ఒక పెద్ద ఆకారం నీటిలోనుంచి పైకి లేచింది. సన్నని నీటితుంపర వెనుకగా ఇంద్రధనుస్సుగల గాలిలో ఒక్క క్షణంపాటు అల్లాడుతూ మళ్ళీ నీటిలోకి పడిపోయింది. దానితో అక్కడి నీళ్ళు ముప్పై అడుగుల ఎత్తులేచి పెద్ద జలపాతం వలె తిరిగి క్రిందపడి పాలరాయివంటి ఆ తిమింగిలం శరీరంచుట్టూ ఏర్పరచి, అప్పుడే పితికిన పాలను నురుగువలె కానవచ్చాయి.

"కానివ్వండి" అని అహాబు పెట్టిన కేకతో పడవలన్నీ ముందుకు దూసుకుపోయాయి. క్రితంరోజున తన శరీరంలోకి దిగిన ఇనుప నారసాల కోతవలన కాబోలు మాబీడిక్‌కి మరీ పిచ్చెత్తినట్టుంది. దేవతలు దాని పక్షమే ఉన్నట్టున్నారు. దాని నుదుటిమీద ఎడపెడముగా సూదులవలె నాటియున్న ఆ యినుప నారసాలు, దాని పల్చని చర్మంక్రింద ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉన్నట్టు కనబడ్డాయి. అది తన తోకతో నీటిని కవ్వంతో చిలికినట్టు చిలికివేస్తూ వుంది. మళ్ళీ రెండు పడవలను విరగగొట్టి వాటిలోని సామగ్రిని బయటకు చిందగొట్టేసింది.

అహాబు పడవను మాత్రం ముట్టలేదు. ఊడిపోతున్న పడవ చెక్కలను బంధించడానికి డాగో, టాష్‌టెగోలు ప్రయత్ని స్తున్నారు. తిమింగిలం తన శరీరంలో ఒక పార్శ్వాన్ని చూపిస్తూ వాళ్ళ ప్రక్కగా ఈదుకొంటూ పోయింది. దానిని చూడగానే వాళ్ళు ఒక పెద్ద కేకని వేశారు. తిమింగిలం వీపున తాళ్ళతో బంధింపబడి, సగం చితికిపోయిన పార్శీవాని శరీరం వాళ్ళకు కనబడింది. ఉబ్బివున్న కళ్ళతో వాడు అహాబువంక చూశాడు. అంతవరకు వాని చేతిలోనే ఉండిన ఈటె క్రిందపడింది.

దీర్ఘంగా నిట్టూర్చి, "మోసపోయాను! మోస పోయాను! పార్శీవాడా! నిన్ను మళ్ళీ చూశాను. నాకంటె ముందే వెళ్ళుతున్నావు- నీవు చెప్పిన శకునం ఇదన్న మాట! కాని రెండవ బండి ఏది? ఒక దగ్గరకు పడండి మీరు! ఆ పడవలు ఇంకెందుకూ పనికిరావు చేతనయితే వాటిని బాగుచేసి నాకు ఇవ్వండి. లేకపోయినా ఫరవాలేదు-అహాబు ఒక్కడే చావటానికి ఇది చాలు. ఇక్కడనుంచి ఎందులోకి దూకవలసి వస్తే దానిలోకే దూకుతాను. దానినే ఈటెగా వాడుతాను, తిమింగిలం ఎక్కడ? మళ్ళీ మునిగిపోయిందా ఏమిటి?"

ఈ లోగా మాబీడిక్ బాగా ముందుకు పోయింది తన శరీరం మీదనున్న కళేబరంను పట్టుకొని పారిపోదా మన్నట్టుగా. తన ప్రయాణంలో ఒక మజిలీ అయిపోయినట్లుగా

పోతోంది. అది ఓడనుకూడా దాటిపోయింది. సముద్రము మీద తన దారిన తాను వేగంగా పోదామని దాని ప్రయత్నము కాబోలు.

స్టార్‌బక్ కేకవేశాడు, "ఓ అహాబు! ఇప్పటికీ మించిపోయిన దేదీ లేదు. ఈ మూడోరోజునైనా ఆపు! చూడు! మా బీడిక్కి నీవు అక్కర లేదు. కాని నీవే దాని కోసం వెఱ్ఱిగా ప్రాకులాడుతున్నావు"

తెరచాప నెత్తుకొని ఆ ఒంటరి పడవ తెడ్లవల్ల, గాలి వల్ల అతివేగంగా ఎడమవైపుకి పోయింది. అహాబు ఓడ సమీపానికి వచ్చినప్పుడు అహాబు స్టార్‌బక్‌ని పిలిచి, ఓడను తిప్పి తన పడవకు కొంత వెనుకగా రమ్మన్నాడు. తల పైకి ఎత్తగానే అతనికి ఓడ స్తంభం మీదికి ఎక్కుతున్న టాష్‌టెగో, క్వీక్వెగ్, డాగోలు కనబడ్డారు. తెడ్డు వేసేవాళ్ళు అప్పుడే పైకి తీసికొని రాబడిన పడవలను బాగుచేయటానికి ప్రయత్నిస్తున్నారు. ఓడ ప్రక్కగా వెళ్లే అహాబును ఒకరి తరువాత ఒకరు చూశారు. వాళ్ళను అతనూ చూశాడు. ఫ్లాస్కు, స్టబు ఈటెల కట్టలమధ్య కూర్చుండి, ఏదో చేస్తున్నారు. మరమ్మత్తుకై పడవమీద సమ్మెటలతో కొట్టడం వింటే అతని హృదయంలోకి ఏదో సుత్తితో ఒక మేకును దిగగొట్టుతూ ఉన్నట్టు భావించాడు. కాని వెంటనే తేరుకొని ఓడ స్తంభం మీది జెండా లేకపోవడం గమనించి, టాష్‌టెగోని క్రిందకి దిగి ఇంకొక జెండాను సుత్తిని, మేకులను తీసికొని పైకి వెళ్ళ

మని కేకవేసి చెప్పాడు. "మూడు రోజులబట్టి వేట సాగుతూండటం వల్లనో, తన గమనానికి అడ్డుతగిలే ఆ తాళ్ళ వల్లనో, తనలో నిబిడీకృతమై ఉన్న మోసమూ, దౌష్ట్యమూ వల్లనో మరేందువల్లనోగాని, తిమింగిలం తన వేగంను తగ్గించినట్టు పడవ దానిని సమీపిస్తూంటే అనిపించింది. అహాబు, కెరటాల మీద తేలిపోతున్నంత సేపు నిర్దయగా సొర చేపలు వెంటాడుతూనే ఉన్నాయి. అవి విడవకుండా పడవని పట్టుకొన్నాయి. అవి తెడ్లను విడువకుండా కొరకటంవల్ల తెడ్ల పలకలు సన్నబడి చిన్నవై పోతున్నాయి.

"వాటిని లెక్క చెయ్యకండి - లాగండి" అన్నాడు.

"అవి కొరుకుతూవుంటే ఈ తెడ్ల పలకలు సన్నబడి చిన్నవై పోతున్నాయండీ"

"మనకు అవసరమైనంత కాలం అవి పని చేస్తాయిలే! కాని ఆ సొరచేపలు తిమింగిలాన్నే విందారగిస్తాయో, అహాబునే ఆరగిస్తాయో! లాగండి- మనము దగ్గరపడ్డాం- ఇదిగో చుక్కాను పుచ్చుకో- నన్ను లేవనీ" అని అతను అనగా, ఇద్దరు సాయపడి పడవ ముందుభాగానికి పంపారు.

చివరికి పడవ, తిమింగిలం ప్రక్కగా వచ్చింది. కాని, తిమింగిలానికి ఇది తెలిసినట్లులేదు. తిమింగిలం వెదజల్లే నీటి జల్లు పరిసరంలోనే ఉన్నాడు అహాబు. అంతదగ్గరకు వచ్చిన తరువాత అతను వెనుకకు వంగి, రెండు చేతులను పైకెత్తి, భయంకరమైన తన ఈటెను, దానితో పాటు శాపాక్షరమ్ము

లను తిమింగిలం మీదికి విసిరాడు. ఆ ఈటె, ఆ శాపం, దానికి తగలగానే 'మాబీడిక్' కంపించి పోయింది. ఒక పార్శ్వంతో పడవను తోసివేసింది. అహాబు కిందపడకుండా నిలదొక్కుకొన్నాడు. ఏమి జరుగుతున్నదో తెలియక కర్తవ్యతామూఢులై యున్న ముగ్గురు తెడ్లవాళ్ళు కిందపడ్డారు; కాని వెంటనే ఇద్దరు పడవయొక్క పై అంచును పట్టుకొని ఎగబ్రాకి లోపలికి చేరారు. మూడవవాడు వెనుకభాగాన పడి ఈదుతున్నాడు.

ఆ సమయాన, క్షణం ఆలసింపక తిమింగిలం శర వేగంతో నీటిలోకి దూసుకొనిపోయింది. అహాబు త్రాటిని వెనుకకు లాగి పట్టుకోమని సరంగుతో అన్నాడు.

"ఆ త్రాటిని మీరు కూర్చున్న దిమ్మలకు చుట్టి పట్టుకొని పడవను నడపండి" అని నావికులకు ఆనతిచ్చాడు. ఇంతలో ఆ త్రాడు తెగిపోయింది.

"ఏమిటీ! నాలో ఏదో తెగిపోతున్నట్టుందే! రక్తనాళాలు పగిలిపోతున్నాయా! అమ్మయ్యా! మళ్ళీ పటిష్టమైనదా! తెడ్లు ఎక్కడ! తెడ్లు! దానిమీద పడాలి పదండి" అంటూ కేకలు వేశాడు, అహాబు.

తనవైపు అతివేగంగా వస్తున్న పడవను చూచి దానిని తన నుదుటితో అడ్డగించవలెనని తిమింగిలం తిరిగింది.

ఆ తిరగటంలో ఓడ యొక్క నల్లని స్థూల భాగాన్ని
చూసింది. తన బాధ లన్నిటికీ అదే మూలకారణ మను
కొన్నదో లేక ఆ యోడ తనకు తగిన గొప్ప వైరి అను
కొన్నదో మరి, తనవైపే వస్తున్న ఓడ వైపుకి పరుగెత్తటం
మొదలు పెట్టింది.

అహాబ్ నెత్తి బాదుకొన్నాడు. "నాకు కళ్ళు
పోతున్నాయ్. నాకు దారి చూపండి! చీకటి పడిందా!" అని
అడిగాడు. తెడ్లవాళ్లు నివ్వెరపోతూ, "తిమింగిలం! ఓడ!"
అని మాత్రం అనగలిగారు.

"తెడ్లతో కొట్టండి! సముద్రమా! ఒకసారి అణిగిపో.
ఇంకా ఆలస్యం చేయకు. అహాబుకి ఇదే ఆఖరి అదను. ఆఖ
రిది! ఓ! ఓడ- పదండి - నా ఓడను రక్షించరూ!"

కెరటాల సమ్మెటపోట్లు పెడుతున్న సముద్రాన్ని
చీల్చుకొంటూ పడవ వస్తోంది. ఈలోగా తిమింగిలం ఓడ
ముందు భాగాన్ని కొట్టగా చెక్కలు ఊడిపడి నీరు లోనికి
వెళ్ళింది. ఓడ సమరానికి ఏమీ చేయలేక కెరటాల పల్లా
నికి వచ్చిపడ్డది. నావికులు నీటిని తోడివెయ్యటానికి, చెక్కలు
బిగించటానికి, శక్తినంతా ధారపోసి ప్రయత్నిస్తున్నారు.
ఒక్క క్షణంపాటు టాష్టెగో చేతిలోని సుత్తి అట్లాగే ఆగి
పోయింది. ఎఱ్ఱజెండా కాసేపు అతని చేతిచుట్టూ చుట్టుకొని,
తరువాత అతని హృదయంలాగానే విప్పారింది. స్టబ్,
స్టార్బక్ లు ముందుకు వచ్చి, తమపైకి ఉరుకుతున్న
ఆ భూతాన్ని చూశారు.

"తిమింగిలం! తిమింగిలం! ఓడని ఎత్తండి! ఓ పంచభూతములారా! నన్ను కాపాడండి! స్టార్‌బక్‌ని ఈ విధంగా చంపకండి! అతని భార్య వింటే మూర్ఛిల్లుతుంది! విధవల్లారా! ఓడని ఎత్తండి- అదుగో, తిమింగిలపు దాడ! తిమింగిలపు దాడ! గొంతు చించుకొని ప్రార్థించాను, ఇదేనా ఫలం! జీవితమంతా ధర్మంగా నడిపాను, దానికిదేనా ప్రతిఫలం! అహబ్! చూడు- నీ ఘనకార్యమే ఇది, చూడు. ఓ- మనకోసమే ఇటు తిరిగింది- ఆ భూతం మన వైపే తోసుకొని వస్తోంది. ఇక్కడనుండి తాను వెళ్లటం ధర్మం కాదనుకొంటోంది! ఓరి భగవంతుడా! నన్ను ఆదుకో! నా పక్కనే ఉండు!"

"నా పక్కగా ఉండనక్కరలేదు! నా క్రింద ఉంటే చాలు. అదే ఈ స్టబ్‌కి పదివేలు. తిమింగిలమా! నీవు ఇకిలిస్తున్నావు- నిన్ను చూచి నేనూ ఇకిలిస్తున్నాను! అసలు స్టబ్‌కి ఎవ్వరైనా సహాయపడ్డారా! అతను జాగ్రత్త పడటానికి ఎవరేమి చేశారు! కునుకు ఎరగని అతని కన్నుతప్ప ఎవరేమి చేశారు! పాపం స్టబ్ ఇప్పుడు ఎంతో మెత్తని పరుపుమీద పడుకోవాలి: అదే చిత్రకపట్టుతో చేసిన పరుపైనా, ఇంతకంటె ఎంతో బాగుంటుంది! నన్ను చూచి నవ్వకే తిమింగిలమా! నేనూ నవ్వుతాను! సూర్యచంద్రులారా! తారకలారా! వినండి. మీరంతా ఒక బుద్ధిమంతుని హత్య చేస్తున్నారు- ఓ! ఓ! ఓ! నవ్వుతావేమి తిమింగిలమా!

కొంతసేపటిలోనే జోలెడంత బెంగవలసి వస్తుందిలే! అహాబు! నీవు ఎందుకు ఎగిరిపోవటంలేదు! నాకు కాలిజోడు లేదు. చొక్కా లేదు. ఈ స్టబు డ్రాయరుతోనే ప్రాణాలు విడవాలి! ఏమి చావు లేద్దూ! చాలా మలినపు చావు! ఉప్పులో ఊరవేయబడ్డ చావు! చెర్రీపళ్లు, చెర్రీలు! ఫ్లాస్కు- చచ్చే లోగా ఒక్క ఎర్రని చెర్రీ దొరికితేనా!"

"చెర్రీలా! అవి పెరిగేచోట మనం ఉండగలిగితే అంతేచాలు నాకు. ఓ స్టబ్! ఈ నెలలో ఈ రోజు వరకు నాకు రావలసిన జీతం మా అమ్మ తెచ్చుకొంటుందను కొంటాను. ప్రయాణం పూర్తయింది కాబట్టి, ఇంక ఆమెకి ముట్టేది ఏమీ ఉండదు!"

ఓడ అంచులనుండి నావికులంతా నిశ్చేష్టులై వ్రేలాడు తున్నారు. వాళ్ళ చేతులలో సమ్మెటలు, చెక్కముక్కలు, ఈటెలు, బల్లెములు ఊరక ఉండిపోయాయి. వాళ్లంతా ఆ తిమింగిలాన్ని చూడటానికి ఎలా ఉన్నవాళ్ళు అలా వచ్చారు. తిమింగిలం విధిరూపమైన తన తలను త్రిప్పుతూ పెద్ద కెరటం లాగ నురుగులు విరజిమ్మింది. శాస్తి చేయాలన్న కోరిక, పగతీర్చుకోవాలన్న కసి, దుర్దాంతక్రౌర్యం - ఇవన్నీ దాని వైఖరిలో రాశీభూతమై యున్నాయి. దాని తెల్లని నుదురు ఓడయొక్క కుడివైపున ఢీకొంది. సామానులు, మనుష్యులు దొర్లిపోయారు, కొందరు బోరగిల పడ్డారు.

"ఓడ ద్వితీయ శవశకటమయింది! దాని కలప అమెరికా దేశపుది" అంటూ అహబ్ తన పడవనుండి నినదించాడు.

మునిగిపోతున్న ఓడ క్రిందుగా దూరి, ఆ తిమింగిలం రెండవవైపున పైకి తేలింది. అహాబు పడవకి కొన్నిగజాల దూరంలో కదలకుండా ఉండిపోయింది.

"సూర్యుని ఇక చూడలేను! టాష్టెగ్! నీదీ నీ సమ్మెట- ఒక దెబ్బ వినిపించు. అదిగో ఓడ స్తంభాలు అజయ్యంగా నిలబడ్డాయి. ఓడ దూలం పగిలిపోకుండా నిలిచింది. ఓడకట్టు అట్లాగేవుంది. ఓ నా యోధా! నీవు నాశనమై పోతావా! నన్ను విడచి నీవు నాశనమైపోవలసిందేనా! ఎంతటి నికృష్టుడైన కెప్టెనుకైనా, తన ఓడతో పాటు నశించిపోవటం గర్వకారణం. నాకు ఆ భాగ్యమైనా లేదా! ఒంటరి జీవితానికి తగినట్టు ఒంటరి చావుకూడా నా! అన్నిటికంటె నా ఔన్నత్యమే నా బాధకి కారణమని ఇప్పుడనిపిస్తోంది. గతించిపోయిన నా జీవిత సాగరతరంగములారా! మీ రెక్కడెక్కడ వున్నారో! ఓ సారి, యిటురండి. వచ్చి ఈ యంతిమ తరంగముమీద పడండి! నీవైపు నేను వస్తాను తిమింగిలమా! నీవు అన్నిటినీ ధ్వంసం చేస్తావు కాని, దేనిని జయించలేవు. నీతో తుదివరకు పోరాడుతా. నరక మధ్యంలో నుండియైనా సరే నిన్ను పొడుస్తా. నీమీద, ద్వేషంకొద్దీ నా తుది యూర్పును నీ మీదనే విడుస్తా. అన్ని శవపేటికలను,

శవశకటములను నీటిలో మునిగిపోనీ, అవేవీ నాకు అక్కర్లేదు. ముక్కలైపోయినా సరే, నిన్ను తరుముతూనే ఉంటాను. నిన్నుమాత్రం విడువను. నీచురాలా, ఇదిగో–" అని ఈటెను విసిరాడు. గాయపడ్డ తిమింగిలం ముందుకు దూకింది. ఈటెకు వుండే తాడు, వాయువేగంతో, అగ్ని జ్వాలవలె ఈటెతోనే వెళ్ళింది. కాని, గురి తప్పింది. దానిని సరిచేద్దామని అహాబు వంగాడు – అల్లా చేయటంలో అతని మెడకు తాడు చుట్టుకొంది. పడవలోని వాళ్ళకి ఏమి జరుగుతుందో తెలిసేలోగా అతను పడవమీదనుంచి క్రింద పడ్డాడు మరుక్షణం ఆ తాడు యొక్క అంతిమ భాగం కూడా పడవలోనుంచి పైకి వస్తూ అక్కడే కూర్చున్న ఒక నిని కొట్టి, నీటిలో పడి మాయమైపోయింది.

విభ్రాంతులైన నావికులు ఒక నిమిషంసేపు నిశ్చేష్టులై వెనుకకు చూచి, "ఓడ! ఓడ! మన యోడ ఏదీ" అని ఒకరి నొకరు అడిగారు. మసక మసక తెరల వెనుక మాయమౌతున్న దాని ఆకారం వాళ్ళకి కనబడింది. పై స్తంభాలు మాత్రమే కనబడుతున్నాయి. మోహం వల్లనో, కార్యదీక్ష వల్లనో, విధి ప్రేరణ వల్లనోగాని ఆదిమజాతి ఈటెగాళ్ళు ముగ్గురూ, ఓడ స్తంభాలమీద కూర్చుండే సముద్రంమీద చూపు నిలిపి అన్వేషణ సాగిస్తున్నారు. ఇంతలోనే పడవ సుడిగుండంలో చిక్కుకొంది. మనుష్యులు, తెప్పలు, ఈటెలు– ఒకటేమిటి– ఓడలోగల చరాచర పదార్థా

లన్నీ ఆ సుడిలో గిరగిరా తిరిగిపోతున్నాయి. ఓడ అదృశ్యమయింది.

కెరటాలు ఆఖరిసారిగా, టాష్‌టెగ్ తలమీద పొర్లి పోతున్నప్పుడు, పైకి యింకా ఓడ స్తంభం కొద్దిగా కనబడుతూనే ఉంది. ఆ స్తంభానికి తగిలించబడి కొన్ని గజాలమేర ఎఱ్ఱని జెండా కనబడుతోంది. ఆ జెండా అలలవలె కదులుతోంది. ఆ కదలిక, సర్వనాశన మొనర్చు కెరటాల కదలికను పోలివున్నది. ఆ తుదిక్షణాన సమ్మెట పట్టుకొన్న ఒక ఎఱ్ఱని చెయ్యి, గాలిలోకి ఎగసి, మునిగిపోతూన్న స్తంభానికి ఆ జెండాను గట్టిగా కొట్టే ప్రయత్నంలో వుంది. మొదట నుంచీ ఈ ఓడను విడవకుండా వెంటనంటి ఆకాశంలో ఎగురుతూ వస్తూవున్న ఒక డేగ, ఆ జెండాను ముక్కుతో పీకుతూ టాష్‌టెగ్‌కి చిరాకు పుట్టిస్తోంది. ఆ పక్షి ప్రమాద వశాన తన రెక్కను ఆ ఓడ స్తంభానికి, టాష్‌టెగ్ సుత్తికి నడుమ జొప్పించింది. అది చూచి అతను నిశ్చేష్టుడైనాడు. ఆకాశంలో విహరించే పక్షి, ఆకాశంకూడా దద్దరిల్లేటట్టు ఏడుస్తూ, ముక్కును ఆకాశంవైపు త్రిప్పుతూ, రెక్కలు చాచి జెండాను కప్పివేసి ఓడతోపాటు తానుకూడా వెళ్ళిపోయింది. కలిపురుషుడు స్వర్గంనుండి నరకానికి వెళ్లేటప్పుడు స్వర్గంలో కొంత భాగమైనా తనతోపాటు తీసికొని వెళ్ళక మానడు. ఆ దృశ్యం ఆ రీతిగా ఉంది.

ఓడను దిగమ్రింగి, ఇంకా నోరు తెరుచుకొనేయున్న ఆ సముద్రాఘాతంమీద చిన్నచిన్న పిట్టల గుంపులు విల

చీస్తూ తిరిగాయి. ఆ అఘాతపు టంచులకు భయంకరమైన నురుగు దొబ్బలు కొట్టుకొంటున్నాయి. అంతలో అన్నీ సమసిపోయాయి. అన్నిటినీ తనలో పూడ్చిపెట్టి, ఎప్పటి వలెనే, సముద్రము పొర్లిపోసాగింది.

—:♦:—

మిగిలిన మాట

నాటకమంతా ముగిసింది. కాని ఇంకా ముందుకు వస్తున్నారు. ఎవరు? ఎందుకు? సర్వనాశనంనుండి ఒక్కడు తప్పించుకొని బయటపడ్డాడు కాబట్టి.

పార్సీవాడు మాయమయిన వెనుక, అహాబు పడవకు సరంగుగా విధి నన్ను నియమించింది. తుదిరోజున పడవ విసిరి వేయబడినప్పుడు, వెనుకగా పడినవాడు వీడే. ఆ రంగస్థలానికి కొద్దిగా ఆవల పడి జరుగుతూవున్న సంగతు లన్నిటినీ చూస్తూ నీటిమీద తేలుతున్నాను. మునిగిపోతున్న ఓడ, నీరు పోసుకొంటూవుంది. ఆ యీరవడి నన్నుకూడా సుడిగుండం మధ్యకు ఈడ్చుకొని పోయింది. నేను అక్కడికి చేరేప్పటికి అది ఒక కొలనువలె అయిపోయింది ఆ వలయంలో నేను కూడా పరిభ్రమిస్తూనే ఉన్నాను. అదే సమయానికి, ఓడ వెనుకభాగాన వున్న శవపేటికతో చేయబడ్డ లైఫ్ బాయ్ కట్టుతెగి, ఊడిపోయి పైకి ఎగిరిపడి, నా పక్కనే వచ్చి

తేలింది. ఆ శవపేటిక సహాయంతో ఒక రోజంతా మెల్లగా నీటిమీద తేలాను.

సొర చేపలు నన్నేమీ చేయకుండా, నా ప్రక్కనే నా పడవకు తెడ్లవలె సాగిపోయాయి. సముద్రపు డేగలు వాటి గోళ్ళను ముడుచుకొని, ఎగిరిపోయాయి.

రెండవనాడు, ఒక ఓడవచ్చి నన్ను కాపాడింది. అది, దిక్కులేక తిరుగుతున్న "రాచెల్". పోయిన తన పిల్లలను వెతుక్కొంటూ వస్తోంది; దానికి ఈ దిక్కులేనివాడు దొరికాడు.

స మా ప్త ము.

Blank Page